నా కథ

చార్లీ చాప్లిన్



వల్లభనేని అశ్వినీకుమార్

నా కథ

బార్లీ బాన్లన్

తెలుగు:

వల్లభనేని అశ్వినీకుమార్

చార్లీ చాప్లిన్ (నా కథ)

Charlie Chaplin

© వల్లభనేని అశ్వినీకుమార్

శ్రీ నందన విజయదశమి
అక్టోబరు, 2012

ముఖచిత్ర పరికల్పన
ఎ.కె. ; జి.షాన్

వెల : ₹ 300/-

కాపీలు:
1000

ప్రతుల కొరకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ బుక్‌హౌస్, ప్రజాశక్తి, దిశ,
నవయుగ, తెలుగు బుక్‌హౌస్ మరియు 'మిసిమి' మాసపత్రిక కార్యాలయం

ప్రచురణ:
పికాక్ క్లాసిక్స్
జి-14, ప్రగతి ఎన్‌క్లేవ్,
భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి,
హైదరాబాద్ - 500 072
ఫోన్ : 040-23063729

Affectionately
Charlie Chaplin

అయ్యోచార్లీ..... అమ్మో!! చాప్లీన్....

చార్లీచాప్లిన్ ఒక చరిత్రాత్మక అద్భుతం!

చార్లీచాప్లిన్ మానవేతి హాసపు మార్దవం!!

చార్లీచాప్లిన్ కన్నీట జడివానలో తడిసి ముద్దైన గడ్డిపువ్వు.

చార్లీచాప్లిన్ మన వెర్రిమాలోకానికి పంపిన అనంతమైన చిరునవ్వు!!

ఒక్కముక్కలో చెప్పాలంటే.... చాప్లీన్ పుట్టినప్పుడు మనం పుట్టకపోయినా.... ఆయన పుట్టిన భూగోళం మీదే మనమూ పుట్టాం.... అదిచాలు జన్మకి...

నాకు జీవిత చరిత్రలంటే ఇష్టం. ఎంచేతనంటే అందులో కొంతలో కొంత నిజం ఉండే ఆస్కారం ఉంది... ఆ కొంత మన జీవితాల్ని ప్రభావితం చేస్తుంది!

చాప్లిన్ జీవితాన్ని చదవటం అంటే ఆయన్తో ప్రయాణించడం.... అలా వెళ్ళగావెళ్ళగా... మనం ఆయన కోటైపోతాం టెర్రలుబూటైపోతాం.... టోపీ అయిపోతం... చేతికర్రలా గిరగిర తిరగుతాం... అంత మమేకం చేసేస్తాడు. ఆయనతో ఉంటుంటే... ఒక్కోసారి భయమేస్తుంది!

మరోసారి బాధేస్తుంది!

అతన్తోపాటే ఆకలేస్తుంది!!

చాప్లిన్ తల్లి... ఆ మహాతల్లి... ఆ పిచ్చితల్లి... పిల్లల్ని పెంచడమనే పెద్దకష్టం తట్టుకుంటే... ఏ దేశపు తల్లైనా కాళ్ళుకడిగే నెత్తిన పెట్టుకోవాలనిపిస్తుంది!

చాప్లిన్ కడుపునిండ తిండి తిన్నరోజే పండగ!

ఎప్పుడోటప్పుడు అలాటి పండుగలొచ్చేవికాదు!!

చాలసార్లు నేను ఏడుపుని ఆపుకోలేకపోయాను.. ఆపుకోలేదు. ఏడ్చా!.. కరువుతీరా ఏడ్చా!

...ఒకసారి పుస్తకం మూసేశాకే... మనసుకి తడొస్తుంది మెదడుకి చెమటపడ్తుంది! విషాద ప్రపంచంలో ఉక్కిరిబిక్కిరైపోతాం...

ఒక్కసారి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టాక అన్నీ విజయగానాలే... అక్కణ్ణించీ... ప్రపంచంలోని ప్రతీ కుటుంబంలోను సభ్యుడైపోయాడుగమరి!!

కానీ పుస్తకం చదివేసాక మనకేడుపొస్తుంది!

నిజంగా ఇదంతా చార్లీచాప్లీనే రాశారు... లేక ఇందులో కొంత అశ్వినీకుమార్ కల్పనుంద అని... నిజానికి అశ్వినీకుమార్‌గూడా చాప్లిన్ అంత వెర్రిబాగులవాడే... కళ కనిపిస్తే కరిగిపోవడం... ఆత్మీయుడు కనిపిస్తే కౌగిలించుకుని... కన్నీరెట్టెటం... అంచేతే.. చాప్లిన్‌తో తనని పోల్చుకోగలిగాడు..

ఆ పోలికనుంచి... అక్షరంఅక్షరం... చెక్కి మనచేతికందించాడు.

తెలుగువాడున్న ఎక్కడైనా ఈ పుస్తకం చదవాలి!

గబగబా కాదు. మెల్లిగా చదవాలి!

మధ్యమధ్య ఆగాలి... ఏడవాలి... కళ్లు తుడుచుకునీ పేపర్లు తడవకుండ... మళ్ళీ చదవటం మొదలెట్టాలి...

సామాన్యుల దగ్గర్నించి... మహాత్మాగాంధీ... హిట్లర్ల వంటి వాళ్లను గూడ నవ్వించి... ఏడ్పించగల... లేద ఏడ్చేది నవ్వించగల పరిపూర్ణ కళాకారుడు చాప్లిన్...

ఇప్పుడంటున్నా... నిజానికి అమెరికాలో లిబర్టీ స్టాచ్యూ అంత్తెత్తు చార్లీ... చాప్లిన్ బొమ్మకూడ పెట్టాలి!!

ఏ ఖండంలో ఉన్నా ఏ జాతి మనిషైనా

చాప్లిన్‌కి శల్యూట్ కొట్టాలి...!!

1.1.2012 దట్సాల్

హైదరాబాద్ తనికెళ్ళ భరణి

చాప్లిన్ అంతరంగం

అతనే కథకుడు, అతనే దర్శకుడు, స్వరకర్త, నటుడు కూడా! ఒకే పాత్ర (వ్యక్తి!) బాగీపాంటు, టైటుకోటు, హిట్లరు మీసాలు, పెద్ద బూట్లు, వంకీ చేతి కర్ర – నిరుపేద బ్రతుకు – నవ్వుల జల్లులు. అడపాదడపా ఓ కన్నీటి బొట్టు!

అతను ఎలిమెంటరీ స్కూలు దాటి చదవలేదు – ఎటువంటి శిక్షణ పొందేందుకయినా పేదరికం – పొట్టగడవని పరిస్థితి. అమ్మతో పదేళ్ళ పిల్లవాడిగా స్టేజి చుట్టూ తిరిగినా వేషాలు ఎవరూ ఇవ్వలేదు. యాక్షన్‌కూ – ఆడిషన్‌కూ అవకాశమే లేదు – అయినా...

ఒక ఫినామినన్‌గా, మేధావిగా విదూషకునిగా, గొప్ప దర్శకునిగా, తర్వాత కథ, స్క్రిప్టు రచయితగా, మూకీ నుంచి టాకీ వరకు రెండు ప్రపంచయుద్ధాల చరిత్ర కాలంలో మారణ హోమపు కమురు కంపులోని విషాద ఛాయల నేపథ్యంలో –

కొన్ని భగ్న ప్రేమలు, మూడు పెళ్ళిళ్లు, రెండు విడాకులు – ఒక స్కాండల్ – బ్లాక్ మెయిల్, క్రిమినల్ కేసులు, ఇలా 40 సంవత్సరాల పాటు సాగిన జైత్ర యాత్రలో చిన్నా, పెద్దా 80 చిత్రాలలో 90 శాతం విజయాలతో 'మిలియనీర్ ట్రాంప్' గా ఎదిగి, అమెరికా అధ్యక్షుని కోసం ప్రచార ప్రసంగాలు చేసి, 'The Great Dictator' తీసి యాంటీ నాజీగా, సోషలిస్టుగా, కమ్యూనిస్టుగా ముద్ర వేయించుకొని, అదే "అంకుల్ శ్యామ్"తో మిస్టర్ వోర్డె సినిమాతో యాంటీ కాథలిక్‌గా క్రాస్ వేయించుకొని, అప్పటి మత ఛాందసుల ఒత్తిడితో అమెరికా దేశపు చట్టాల చట్రంలో, ఇరుక్కొని, దాదాపు ఇరవై సంవత్సరాల శిక్షకు కారాగారపు గుమ్మంలో నిలబడి – అదృష్టవశాత్తు బైటపడి అమెరికా దేశం నుంచి దాదాపు తరిమి వేయబడిన బ్రిటిష్ పౌరునిగా, ప్రపంచంలోని మహామహుల సాన్నిధ్యంలో విందులు, వినోదాలు పంచుకుని, మేధావులతో భుజాలు రాసుకుని, దేశాధినేతలతో – రాణులతో, యువరాజులతో ఓపేరాలు చూసి, అహంకారం పొడసూపని ఆత్మవిశ్వాసంతో, సంపదను పరాయిదానిగానే చూసి, అపారమైన కీర్తిని తలకెత్తుకొని, అసంగతమైన అపఖ్యాతిని మూటగట్టుకొని, చివరికి స్విజ్జర్లాండ్ పర్వతసానువుల్లో తన చిన్నారి భార్య ఒడిలో, అయిదుగురు పిల్లలతో ఒదిగి, మనకు అందించిన ఈ అద్భుతమైన గ్రంథం, చార్లీ స్వీయ కథ నుంచి కాల పరీక్షకు నిలబడే, ఆయన అభిప్రాయాలూ – అనుభవాలూ కొన్ని మీ ముందుంచుతున్నాను–!!

ఈ పేదరికపు లేమిలో నుంచి 'నేను' జనించాను. ఈ నైరాశ్యపుటాకాశపు నీడలోనే నిలబడి పోరాడాను.

"అమ్మ"! ఎలాంటి అమ్మ! ఈ ప్రపంచంలో ఎవరికైనా, ఎప్పటికైనా ఇలాంటి అమ్మ వుంటుందా? ఈ కరుణామయి వెలిగించిన వెచ్చటి దీపం కాదా నా ఉనికి – ఆమె ప్రేమ, లేమి – ఇవే నా దిన చర్య!

అమ్మ అనేది – నాయనా, ఎంత ఒంగినా, ఎంత లొంగినా ఈ ప్రపంచంలో ఒకోసారి ఏమీ దొరకదు – అని.

అన్నయ్య ఆఫ్రికా వెళ్తూ – ఈ ప్రపంచంలో నాకు – నువ్వు, నీకు – నేను ఉన్నామని మరచిపోకు – ఉత్తరం రాస్తుండు, అని. ఇంతటి పేదరికంలో, ప్రకృతే మాపై సానుభూతి చూపుతోంది. ఈ వేసవి ఒక శూన్యంలో ఆవరించింది – ఎండమావులే నింపింది. పేదరికం నిర్లక్ష్యాన్నీ, నైరాశ్యాన్నీ నింపి బ్రతుకంటే చేదుగా పరుస్తుంది.

జీవితం చాలా చిన్నది – ఎందుకు దీని కోసం కొట్లాట? హృదయం ఎంతో విలువైనది – ఎందుకు దానిని పగలకొట్టుకోవటం?

చరిత్ర అంటే ఏమిటి? నరమేధపు సిరాతో రాసిన రికార్డు కాదా? హింస, మారణ హోమపు చర్మం కాలిన వాసన కాదా? దేశాలు – సరిహద్దులు కేవలం రంగు రంగుల మ్యాపులకే పరిమితమా?

కవిత్వమంటే జ్ఞాపకాలే, ప్రపంచానికి ఒక ప్రేమలేఖ!

If poetry is love letter to the world,

You are my world, wonderful small world !

మీకు తెలుసా, చాలా పేరు గడించిన హాస్యనటులు – చివరికి ఆత్మహత్య చేసుకున్నారు? నటన ఒకరు నేర్పేదా? సాంకేతిక విషయాలే నేర్వగలరు – సృజన స్వయంకృషే !

ఏ కోరికా లక్ష్యం పవిత్రంగా వుండవు.

కర్కశమైన ప్రపంచపు వైఖరిని తట్టుకునేందుకే సామాన్యులకు లౌకిక జ్ఞానం కావాలి!

సంపద వలన కలిగే సౌఖ్యం చాలా నమ్మకం కలిగిస్తుంది. అందులోనే ఎంతో ఖరీదైన విషాదమూ వుంటుంది!

ఒక్కోసారి నా జీవితంలోని బాధలూ భయాలూ కలగలిసి ఒక్కసారే కళ్ళ ముందు కదులుతాయి!

ఆనందం కరువయిన విషయాలన్నిటికీ అంతం వుంటుంది.

మళ్ళీ పదేళ్ల తర్వాత లండన్ తిరిగి వచ్చాను. నా బాల్యపు గురుతులన్నీ చెరిగిపోతున్నాయి. అభివృద్ధి పేరుతో చక్కని అందమైన చారిత్రక కట్టడాలను కూల్చి – అగ్గి పెట్టెల్లాంటి ఆకాశ హర్మ్యాలను కడుతున్నారు.

ఇక ముందు నా గతాన్ని వెతుక్కుంటూ ఇక్కడకు రావలసిన అవసరం లేదేమో!?

ఆ వీధిలో 834వ ఇంటి ముందు ఆ మధ్యాహ్నం చాలా సేపు నిలబడ్డాను – ఆమె బైటకు వస్తుందేమో, లేక బైట నుంచి లోపలకు వెళ్తుందేమోనని ఆశతో – చివరికి నిరాశతో – దూరంగా వున్న రెస్టారెంటులో కూర్చున్నాను. అక్కడ సర్వ్ చేసే అమ్మాయి నన్ను గుర్తుపట్టి – మెల్లగా అందరికీ చెప్పింది. త్వరలోనే గుంపుగా జనం పోగయినారు (చార్లీ–చార్లీ అంటూ) అతి కష్టం మీద – తప్పించుకొని బైట పడ్డాను.

చూశారా, మనకు వున్నది వేరు మనకు కావలసింది వేరు!

ఆ రోజు టైమ్స్ స్క్వేర్‌లో నిలబడ్డాను. వెలిగే దీపాలతో "చార్లీ చాప్లిన్, సినిమా కంపెనీతో ఏడున్నర లక్షల డాలర్ల ఒప్పందం" అని కదలిపోతుంది. ఇదేదో నాకు సంబంధించినది కాదనుకుంటూ కదిలిపోయాను – పేదరికం లాగానే, సంపద కూడా భయపెడుతుంది. నా భావావేశం అంతా ఆవిరై పోయింది!

ఈ ప్లాస్టిక్ ప్రపంచంలో – పేదరికం ఎంత జుగుప్సాకరమైన కఠోర సత్యమో, సంపద కూడా అంత వికారమైన నగ్నసత్యం!

మనిషిలోని సహజగుణంతో – రెంటి నుంచీ పారిపోవాలనే ప్రయత్నిస్తాడు!

ఒంటరితనం – విచారం లాంటిది, వికారం లాంటిది, ఒక రకంగా సిగ్గుపడవలసింది – కాని ఇది అందరికీ తప్పని పరిస్థితి!

సంపద మరచిపోవటానికి, గుర్తుంచుకోవటానికి, అది కనపడదు. అంకెలు, సామానులు – అవసరానికి మించిన సామానుల్లోనే తప్ప!

ఆమె ప్రవేశించగానే తెల్లని గులాబిరేక లాగా, వెలసిన వెలుతురు గీతలాగా అన్పించింది! ఆమె నాట్యం చేస్తుంటే, ఆమె చుట్టూ గురుత్వాకర్షణ వున్నట్లు, కదిలే విషాద శిల్పంలా తోచింది.

ఉషోదయాన ఒంటరిగా కంటే, నెచ్చెలి దగ్గరగా వుంటే ఆ వెచ్చదనం వేరు!

ఎన్ని సార్లో అనుకున్నా – ఈ జీవితానికి ఏ అర్థమూ లేదని!

హవాయి దీవిలో లిల్లీపూవులో బందీనైనట్లు భయపడ్డాను!

ఫ్రాయిడ్‌తో నాకు పేచీ ఏమిటంటే – మన నడవడికకు, మానసిక పరిపక్వతకు సెక్స్ కారణం కాదనుకుంటా – ఇంకా ఎక్కువ ప్రభావం చూపేవి, ఆకలి, అవమానకరమైన పేదరికం, భరించలేని చలికాలం!!

లైంగిక క్రియకంటే, అందుకు ప్రేరణ కలిగించే శృంగార ప్రక్రియ, వాతావరణం ఎక్కువగా ఆనందం కలిగిస్తుంది!

ప్రియురాలిని కలవాలని ఆతృతగా లండన్ వస్తుంటే ఎవరో చెప్పారు, 'హెట్టి' చనిపోయిందని. "అయ్యో, నా అనుభవాన్ని ఎవరో దొంగిలించారు, నా అనుభూతినెవరో దోచుకుపోయారు" అని విలపించాను!

నా ఏకాంతాన్నీ, నా విచారాన్నీ చాలామంది ఎగతాళి చేశారు. సోమర్స్‌సెట్ మామ్ కూడా ఈ విషయంలో నన్ను సరిగా తెలుసుకోలేదు–

బహుశా స్నేహాన్ని గూర్చి నా అభిప్రాయం తెలీకనే – పేరు ప్రఖ్యాతులతో అదక్కుండానే మిత్రులు వస్తుంటారు. పరిచయాలు పెరుగుతుంటాయి. కాని ఒక వ్యక్తికి ఎంతమంది స్నేహితులు కావాలి?

స్నేహం సంగీతం లాంటిది – మనకు చక్కని 'మూడ్' వుంటే అది సాగుతుంది. దాని అవసరం కూడా!

అవసరంలో ఉన్న స్నేహితునికి సహాయం చేయవచ్చు. అదే మన సమయాన్ని వెచ్చించాలంటే అవకాశం వుండకపోవచ్చు కదా!

నా హృదయానికి దగ్గరైన వ్యక్తులు, నాకెంతో సంతోషాన్ని కలిగిస్తారు – నా సాయంత్రాలను వెలిగిస్తారు!

పేదరికాన్ని ఆకర్షణీయంగా చేయగలమా? పేదరికంలో వున్నవానికి అది తప్పని సరి పరిస్థితే గానీ, ఇష్టపడి వుండేది కాదుకదా!

సంపదా, కీర్తి నాకు వ్యక్తుల్నీ, ముఖ్యంగా ప్రముఖుల్నీ దగ్గరగా చూసే అవకాశం కలిగించింది.

వారు కూడా సామాన్యులకు భిన్నం కాదు అని తెలుసుకోగలిగాను!

'మెకాలె' లాగా, నేను మత విశ్వాసాలను మూఢంగా నమ్మను – ఏ మత సిద్ధాంతమూ కాల పరీక్షకు నిలబడవు. వేయి సంవత్సరాలనాటి మత విశ్వాసం, తర్వాత శాస్త్రీయ పరిజ్ఞానంతో 'పాత'బడి పోతుంది.

అలాగే – నేను ఏ సిద్ధాంతానికి కట్టుబడిలేను. అమెరికన్ ఇమిగ్రేషన్‌లో "నలభై సంవత్సరాలుగా అమెరికాలో వుంటూ పౌరసత్వాన్ని ఎందుకు తీసుకోలేదు?" అని "నీ పౌరసత్వం ఏది?" అన్నాడు–

"నేను ప్రపంచ పౌరుణ్ణి" అని చెప్పాను – "సాంకేతికంగా అది సాధ్యం కాదు" అన్నాడు – తర్వాత నేను అమెరికా వెళ్ళ లేదు!

స్త్రీ వాద ప్రాతిపదిక నాటకంలో –

"ఇందులో వాదానికే ముంది, ఆడవాళ్ళే కదా, తమకు కావాల్సిన వాడిని ఎంచుకుంటారు."

"అలా ఎందుకు, మనమే కదా ఇష్టపడి ఎంచుకుంటాం?"

"అక్కడే వుంది కిటుకు, వాళ్లు ఎంత తెలివిగా వ్యవహరిస్తారంటే, అంతా మనకు, మన ఇచ్ఛ ప్రకారమే జరుగుతుందనే భ్రమలో ఉండిపోతాం!"

తర్వాత ఆడవాళ్ళు నన్ను నమ్మటం మానేశారు!

లండన్‌లో గాంధీ మహాత్ముని కలిసినపుడు – ఆయన ఒక దార్శనికుడు – చురుకైన, తెలివైన మేధావి, మొక్కవోని ధైర్యంతో భారత ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చే వ్యక్తి – ఆ నూలుపంచెలో ముడుచుకుని, "హింస, చివరికి తననే నాశనం చేసుకుంటుంది" అన్న ఆయన సందేశం, సదా ఈ ప్రపంచానికి వర్తిస్తుంది.

స్విస్‌లో వున్నపుడు, నెహ్రూ నన్ను కలవాలని "లేడీ మౌంట్‌బాటన్" పరిచయ లేఖ పంపారు –

ఆయన కూడా నాలాగా పొట్టివాడు – కాని ఎంతో చలాకీగా ప్రపంచ రాజకీయాలంటే ఆసక్తిగా వున్నవాడు. ఆయనతోపాటు ఇందిర కూడా వచ్చింది – ఎంతో ఛార్మింగా ఉంది.

"మీ దేశాన్ని ఏ ప్రాతిపదిక మీద అభివృద్ధి పరుస్తారు" అని అడిగాను (ఆయన సోషలిస్టు భావాలు తెలిసే). "అభివృద్ధే ప్రాతిపదిక, అప్పుడే పంచవర్ష ప్రణాళిక మొదలు పెట్టాం" అని ఉత్సాహంగా అన్నారు.

రాజకీయాలు అంటే చరిత్ర కాదు – ఆర్థికపరమైన ప్రణాళికలు – ప్రయోగాలే!

ఈ అభిప్రాయాలే కృశ్చేవ్, చౌ–ఎన్–లై, చర్చిల్, ఫ్రెంచ్ ప్రెసిడెంటు, జపాన్ ప్రధాని కొడుకుని కలిసినపుడు వ్యక్తమైనాయి.

ఆస్కార్ వైల్డ్ – చాలా మార్మికంగా, "చివరికి ప్రతివాడు, తాను ప్రేమించినదాన్ని నాశనం చేస్తాడు" అనేవాడు!

పునరుత్పత్తి ప్రకృతి నైజం కాబట్టి ప్రతి మగవానికీ, వయసుతో నిమిత్తం లేకుండా, స్త్రీని కలిసినపుడు, లైంగిక వాంఛ కలగటం అతి సహజం! ఇందుకు ఎవరు మినహాయింపు?

ప్రొద్దున్నుంచీ ఎంతో ప్రాశాను మధ్యాహ్నం ఉత్తరాలకు సమాధానాలు పంపాను – సాయంత్రం బీచ్‌లో నడక కూడా అయింది – ఈ చలిమంట దగ్గర ఓ గ్లాసు వైను తీసుకున్నాను. మరి ఇప్పుడేకదా – శృంగారానికి సమయం?" అని హెచ్.జి. వెల్స్ అంటుండేవాడు.

"నాకు మతపరమైన నమ్మకాలూ, భ్రమలూ ఏమీ లేవు.

"మతం లేని సాహిత్యం, శిల్పం, కళాకృతులుగాని ఎలా వుంటాయి?"

"నా వుద్దేశ్యంలో మతమంటే మూఢనమ్మకం"

కళా సృష్టి విశ్వాసాన్ని మించిన సంవేదన, అనుభూతి.

హిట్లర్ చివరి ఉపన్యాసం తర్వాత –

"ఈ జీవితంలో ఏదీ శాశ్వతం కానట్లే,

ఈ ఉపన్యాసం కూడా ముగిసింది!"

సాత్రే ఎంతో మార్మికపు గుండ్రని ముఖంతో తెలివైన కళ్ళతో నిశ్శబ్దంగా సంభాషిస్తాడు!

పికాసో ఒక పిచ్చివాడిలా అన్పిస్తాడు. ఆయన పాత మురికి స్టూడియోకి తీసుకువెళ్ళాడు. ఒక చెత్తకుండీ క్రింద బంగారు గని ఉందని కనిపెట్టాను! అద్భుతమైన కాన్వాసులు చెల్లా చెదురుగా పడవేసి వున్నాయి!

మేధావులకు ప్రపంచమంటే ఎంత ప్రేమ వుంటుందో, తమ మీద తమకు అంతకంటే ఎక్కువ ద్వేషం పెంచుకుంటారేమో!

విజయం సాధించిన వ్యక్తులు – ఒక ప్రత్యేక పరిధిలో జీవిస్తారు.

నా జీవితంలో, నేను అనుభవించిన పేదరికం కంటే సంపాదించిన సంపదలకన్నా, నెత్తికెత్తుకున్న కీర్తి కంటే, మూటగట్టుకున్న అపఖ్యాతికి మించి, నాకు ఫ్రెంచ్ మేధావులు, రచయితలు, కళాకారులు ఇచ్చిన పురస్కారం ఎంతో ఘనమైనది! విలువైనది. ఉన్నతమైనది!

నీవు ప్రపంచానికి పంచిన ఉన్నతమైన భావావేశాలూ, మానవాళి సంబంధ బాంధవ్యాలూ హాయిగా నవ్వుకుంటూ, మనసారా కన్నీరు పెడుతూ అనుభవించాం! నవ్వటం ఎంత విలువైనదో, కన్నీరు – అంతకంటే విలువైనదని చూపావు. నీ కథల్లో, సంగీతంలో, నీ జీవితంలోని పేదరికాన్ని, బాధల్ని, బాంధవ్యాల్ని, ఆశల్ని, నిరాశల్ని ఎంతో నిజాయితీగా మాకు అందజేసి – అంతర్ముఖుల్ని చేసావు. నీ హాస్యంతో అరక్షణం ఈ బాధల్ని మరచిపోయినా, అంతర్లీనంగా వున్న వేదనే మమ్మల్ని నిజంగా ఓదార్చింది!

"నీ బాల్యం, నీ యౌవనం, నీ బీదరికం, నీ సంపద గాని, ఇవేవీ నిన్ను మించి పోలేదు! చివరకు నీ కీర్తి కూడా!"

అన్నిటికీ దూరంగా, ఎత్తుగా నిలబడి, ఈ జీవితాన్నీ, ప్రపంచాన్నీ చూడగలిగావు!

"నీవు కథకుడవు, సంగీత దర్శకుడవు, నటుడవు కూడా – అద్భుతమైన నటుడవు సుమా!"

"కేవలం నీ ప్రతిభతోనే ప్రశ్నలకు సమాధానం చెప్పావు – విమర్శకుల నోళ్ళు మూయించావు. ఎవరినీ అనుకరించకుండా, నిన్నెవరూ అనుకరించ నీయకుండా వుండగలిగావు!

'ఇదిగో ఇక్కడ వున్న ఫ్రెంచ్ రచయితలు, నాటిక, చలనచిత్ర దర్శకులు, నిర్మాతలు, స్వరకర్తలూ, అందరూ నిన్ను ప్రేమిస్తున్నారు – వారి వారి స్వీయ వృత్తుల వలెనే!

ఈ పురస్కారం, మేము సగర్వంగానే కాదు – ప్రపంచ ప్రజలకు త్యాగపూరితమైన నివాళులతో..."

గత ఇరవై సంవత్సరాలుగా సంతోషమంటే, ఆనందమంటే ఏమిటో తెలుసుకోగలిగాను.

నా అదృష్టం – నన్ను ప్రేమించే నా భార్య "ఊనా."ఆమెతో రోజులు గడుస్తున్న కొలదీ ఆమె అంత:సౌందర్యం, నా నిరాశల్ని పటాపంచలు చేసింది. ఎంతో లోతైన ఆమె హృదయం, ఆ మోములోని నైర్మల్యం నన్ను ఉత్తేజితుని చేసేవి.

నా ముందు – చెట్లకిందుగా ఆమె మందగమనం చేస్తుంటే, పొడవైన ఆ కురులు ఆమె నడకకు లయగా సోయగాలు పోయేవి.

ఓ నెరిసిన వెంట్రుక నీరెండలో తళుక్కుమనేది! నాలో ఆత్మవిశ్వాసం – దూరాలలో ఉన్న ఆల్ప్ పర్వతంలా ఉన్నతంగా అద్భుతంగా అన్పించేది!

వల్లభనేని అశ్వినీకుమార్

36 రీళ్లు

1. అమ్మ 1
2. పేదరికం 15
3. రంగప్రవేశం 28
4. నాన్న మరణం 36
5. నటునిగా 53
6. తొలిప్రేమ 65
7. పారిస్! 75
8. అమెరికా! అమెరికా! 83
9. రెండవసారి అమెరికా 93
10. సినిమా ప్రపంచం 100
11. చికాగో పయనం 118
12. సినిమాలూ-సంపదా 134
13. ప్రముఖులతో పరిచయాలు 142
14. సొంత స్టూడియో 152
15. మొదటి ప్రపంచ యుద్ధం 161
16. పెళ్లీ-పెటాకులూ 171
17. ఇంగ్లాండు ప్రవేశం! 199
18. అమెరికా రాక 216
19. ఒప్పందం పూర్తి 225

20. విందులూ-వినోదాలూ 234
21. టాకీలు 255
22. పదేళ్ళ తర్వాత లండన్‌కు 265
23. తూర్పుదేశాల యాత్ర (బాలి-జపాన్) 304
24. హాలీవుడ్ బెవర్లీ హిల్స్ 316
25. మళ్లీ యుద్ధమా? 334
26. మళ్లీ విడాకులు 350
27. ఊనా 362
28. సెన్సార్ సమస్య 380
29. యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీ 396
30. స్వదేశానికి పయనం? 415
31. ఇంపుగా ముగింపు 430
32. మై ఫేవరెట్ బుక్ 447
33. సినీ ప్రపంచానికి చార్లీ చేసిన నిశ్శబ్దసేవ 449
34. మంచిగా మరికొంచెం 452
35. అంకితం 453
36. చాప్లిన్ చిత్రాలు 454

★ ★ ★

మొదటి అధ్యాయం

అమ్మ

వెస్ట్ మినిష్టర్ వంతెన వేయకముందు, కెన్నింగ్‌టన్ బాట, కంకరతో ఉండేది. 1750 తర్వాత వంతెన పూర్తవగానే బ్రైటన్‌తో కలుపుతూ క్రొత్త దారివేశారు. ఆ విధంగా ఎక్కువగా నా బాల్యం గడిచిన కెన్నింగ్‌టన్ రోడ్‌లో మంచి బాల్కనీలతో చక్కని ఇనప గ్రిల్‌తో అలంకరించి ఉండేవి. అయిదవ జార్జి రాజు ఆ దారిలో బగ్గీమీద వెళ్ళడం అక్కడివాసులు చూస్తుండేవారు.

19వ శతాబ్దం మధ్యలో ఆ అందమైన ఇళ్ళన్నీ పాతబడిపోయాయి. వాటిని చిన్నిచిన్ని గదులతో పిచ్చికగూళ్లుగా మార్చి అద్దెకివ్వటం మొదలుపెట్టారు. కాని కొన్ని ఇళ్లు అయితే తమ పూర్వ వైభవాన్ని నిలబెట్టుకున్నాయి. వాటిలో వైద్యులూ, వ్యాపారస్తులూ, రంగస్థల తారలూ నివసిస్తుండేవారు.

ఆదివారం ఉదయం వాడర్‌ల్లీన్[1] నటులను తీసుకువెళ్ళటానికి ఒక గుర్రపు బండి ఆ ఇండ్ల ముందు సిద్ధంగా ఉండేది. తర్వాత వెల్లింగ్‌టన్ రోడ్‌లో వెళ్తూ పదిమైళ్ళ ప్రదేశంలో, (వారపుడ్–మెర్టన్ వరకూ) తిరుగు ప్రయాణంలో లైట్‌హౌస్, హారన్స్ పబ్‌ల దగ్గర ఆగుతూ తిరిగి కెన్నింగ్‌టన్ రోడ్‌లో టన్‌కార్డ్ వరకు ప్రయాణం సాగేది.

పన్నెండేళ్ల వయసులో నేను టన్‌కార్డ్ దగ్గర నిలబడి ఈ రంగస్థల తారలను గుర్రాలమీదనుంచి, బగ్గీలనుంచి స్వారీ దుస్తులలో దిగటం చూస్తుండేవాడిని. వారు ఇక్కడి బార్‌లోకి వెళ్ళటం వాడర్‌విల్లి వాసులలో గొప్పవారు అక్కడ కలిసి మద్యం సేవిస్తూ కబుర్లాడడం, మధ్యాహ్నం ఇంటికి చేరడం, అన్నీ చూస్తుండేవాడిని. వారెంతగానో మెరిసిపోతూ చక్కని సూటులలో వజ్రాలవుంగరాలతో బంగారు టై పిన్‌లతో

1. వాడర్‌విల్లన్: హాస్యసంగీత నాటికలు

ఎంతో విశేషంగా కనిపించేవారు. మధ్యాహ్నం రెండుగంటలకు పబ్ తలుపులు మూతబడేవి. అప్పటివరకూ లోపల నవ్వుతూ కబుర్లలో కాలక్షేపం చేసినవారంతా బైటకు వచ్చేసేవారు. వీడ్కోలు చెప్పుకుంటూ ఎవరి దారిన వారు వెళ్లేవారు. ఒకరిద్దరు కాస్త తూలుతూ నడుస్తూండేవారు కూడా.

చివరి వ్యక్తి వెళ్లిపోయిన తర్వాత అంతా చీకటిగా అన్పించేది. మబ్బుగా ఉండేది. నేను కెన్నింగ్‌టన్ రోడ్‌కి వెనకగా నీడల్లో వున్న పోనాల్ టర్రేస్ మూడవ నంబరు ఇంటి చెక్క మెట్లు ఎక్కి మా గూడు చేరేవాణ్ణి. మా యింట్లో దుర్వాసన వస్తుండేది. అంట్లు, మాసిన పాత గుడ్డలతో... ఈ ఆదివారం మా అమ్మ కిటికీలోనుంచి బైటకు పరధ్యానంగా చూస్తోంది. నా రాకను గమనించి నావైపు తిరిగి పేలవంగా నవ్వింది. ఆ గదిలో ఏమీ లేదు. సుమారు 120 చదరపు అడుగులు ఉంటుందేమో – మరీ చిన్నదిగా అన్పిస్తోంది. పై కప్పు, మీదకు వంగినట్లుంది. గోడ ప్రక్కనున్న బల్లమీద కడగని పళ్లాలూ, గరిటలూ పడి ఉన్నాయి. టీ కప్పులు కూడా. ఆ మూలకు ఒక ఇనుప మంచం. దీనికే అమ్మ తెల్లరంగు వేసింది! కిటికీకీ మంచానికీ మధ్యలోనే గదిని వేడిచేసేందుకు 'చలిమంట గూడు' వుంది. ఆ మంచం కాళ్ళవైపు ఒక మడత కుర్చీ వుంది. దానిలోనే మా అన్న సిడ్ని నిద్రపోయేవాడు. సిడ్ని ఇప్పుడు ఏదో ఓడలో పనికి సముద్రంలోకి వెళ్ళాడు.

మా గది ఈ ఆదివారం మరీ స్తబ్దుంగా వుంది. అమ్మ గది సర్దనేలేదు. మామూలుగా ఎంతో తీర్చిదిద్దినట్లు ఉంచుతుంది. ఆమెలాగానే వెలుగుతో నింపేది. చాలా ఉత్సాహంగా వుండేది. ఆమె వయసు, అంతా ముప్పైలోపే కదా! ఆమె వెచ్చదనంతో మా గూడు ఎంతో హాయిగా ఉండేది. ఏ కారణంతోనో ఇవ్వాళ గదితోపాటు ఆమె కూడా దిగులుగా ఉంది! ముఖ్యంగా ఆదివారం! చలికాలపు ఆదివారం! నాకు మెలకువ వచ్చేసరికి అమ్మ నాకు ఫలహారం సిద్ధంగా ఉంచేది. గదిలో సన్నని చలిమంట వెలుగుతూ ఉండేది. టీ కెటిల్‌లో నుంచి వేడినీళ్ళ శబ్దం వినసొంపుగా ఉండేది. వీటన్నిటి మించి అమ్మ నవ్వు మాత్రం గదిని మరింతగా వెలిగించేది. ఇన్ని సుఖాల మధ్య నేను ఆదివారాలు కామిక్స్ చదువుతూ అల్పాహారం తినేవాడిని.

కాని ఈ ఆదివారం ఏమయింది? అమ్మ నిర్లిప్తంగా కిటికీలోంచి చూస్తోంది. గత మూడురోజుల నుంచి ఇదీవరస! చాలా మౌనంగా, ఏదో ఆలోచిస్తున్నట్లు అలాగే

చూస్తున్నది. అమ్మ దేనిగురించో బాధపడుతున్నట్లు తెలుసు. అన్న సిడ్నీ రెండునెలలైంది, ఓడలో పనికెళ్ళి. ఇంతవరకు ఏ కబురూ లేదు. అమ్మ అద్దెకు తెచ్చిన కుట్టుమిషన్ – ఈ పనితోనే మాకు తిండికింత సంపాదనతో రోజులు నడుస్తున్నాయి – డబ్బు కట్టనందుకు తీసుకుపోయారు. నేను డాన్సు క్లాసులు చెప్పి సంపాదించే అయిదు షిల్లింగుల ఆదాయంకూడా ఆగిపోయింది.

నాకు ఈ కష్టాలగురించి అంతగా అవగాహన వుండేది కాదు. ఎప్పుడూ ఏదో కష్టంతోనే నడిచేదికాబట్టి. నా వయస్సు ఆ కష్టాల పర్యవసానం గుర్తించేదికాదు. మామూలుగా బడి అయిపోగానే ఇంటికి పరుగెత్తి అమ్మకు చిన్నచిన్న పనులు చేసేవాడిని. క్రిందనుంచి నీళ్ళు తెచ్చి, తర్వాత మెకెర్తీ వాళ్లింటికి వెళ్లేవాడిని. సాయంత్రం వరకూ అక్కడే వుండేవాడిని. ఇంటినుంచి దూరంగా వుండటానికి ఇది వుపయోగపడేది. మెకెర్తీలు, అమ్మకు ఎప్పటినుంచో తెలిసినవాళ్లు. కెన్నింగ్‌టన్ రోడ్‌లోనే వాళ్లు మంచి యింట్లో వుంటున్నారు. మాతో పోలిస్తే వాళ్లు చాలా మంచి స్థితిలో వున్నట్లే. వాల్లీ, వాళ్లబ్బాయ్. అతన్తోనే సాయంత్రం చీకటిపడేవరకూ ఆడేవాణ్ణి. అప్పుడే నన్ను టీ తాగి వెళ్లమనేవారు. ఈ విధంగా వాల్లీతో ఆడుకుంటూ వాళ్లింట్లోనే ఎన్నోసార్లు తిన్నాను. వాల్లీ వాళ్ల అమ్మ అప్పుడప్పుడూ నన్ను "అమ్మేదీ? ఈ మధ్యన కనపడటంలేదు?" అని అడిగేది. ఏదోచెప్పి నేను తప్పించుకేవాడిని. అమ్మకి ఏదయిన కష్టమొచ్చినపుడు ఎవరినీ కలిసేది కాదు. ముఖ్యంగా తోటి రంగస్థల స్నేహితులను. నేను ఇంటిదగ్గరే వున్నప్పుడు అమ్మ టీతోపాటు రొట్టి కాల్చి ఇచ్చేది. అది నాకెంతో రుచిగా ఉండేది. అప్పుడే అమ్మ పుస్తకం చదివి వినిపించేది. ఎంత చక్కగా చదివేది! అందుకని నేను వాల్లీతో ఆటలకంటే అమ్మతో వుండటానికే ఇష్టపడేవాడిని!

ఇప్పుడు అమ్మ పేలవంగా నవ్వడంచూసి అవాక్కయ్యాను. ఆమె అవతారం మరీ బాధలో వున్నట్లు అనిపించింది. నాకేమిచేయాలో పాలుపోలేదు. అమ్మతోనే వుండిపోనా – ఈ విచారాన్ని తప్పించుకునేందుకు ఆమె నుంచి పారిపోనా? అప్పుడు అమ్మ గట్టిగా "ఇక్కడెందుకు? మెకర్తీ వాళ్లింటికెళ్లు – అక్కడే ఏదయినా తినటానికి దొరుకుతుంది! ఇక్కడేమీలేదు." అంది. "అమ్మా నువ్వు వెళ్లమంటే అలాగే వెళ్తాను" అంటూ నడిచాను.

అమ్మ కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. 'పో వెళ్లు...' అంది. నాకెంతో అమ్మతో వుండాలని వున్నా ఆమెను వదిలి వెళ్లటం ఏమాత్రం ఇష్టంలేకపోయినా అమ్మను ఆ

బాధలో వదిలి, ఆ చీకటి గూట్లో ఒంటరిగా వదిలి బయటకు వెళ్లాను. ఆ తర్వాత కొన్నిరోజులకే జరగకూడనిది జరిగింది.

★ ★ ★

ఏప్రిల్ నెలలో 16వ తేదీన పుట్టాను. 1889 సంవత్సరంలో వాకవర్త్, తూర్పుసందులో రాత్రి ఎనిమిది గంటలకు అక్కడనుంచి లాంబెత్‌లో St. జార్జి రోడ్‌లోని వెస్ట్‌స్వేర్‌కి మారాము. నేను పుట్టినప్పుడు, అమ్మ చెప్పింది మా పరిస్థితి బాగానే ఉంది. మూడు గదుల ఇంట్లో అన్నిరకాల సామానులతో వుండేవాళ్లమని చెప్పింది. నాకు బాగా గుర్తుంది. ప్రతిరాత్రి నన్నూ, సిడ్నినీ పడుకోబెట్టి అమ్మ నాటకశాలకు వెళ్తుండేది. మాకు ఆయా కాపలావుండేది. ఆ మూడున్నరేళ్ళ వయస్సులో నాకు అన్నీ సంభవమే అనిపించేది. నాకంటే నాలుగేళ్ల పెద్దవాడయిన సిడ్ని నోట్లో నాణాన్ని పెట్టుకుని తల వెనకనుంచి తీశాడు! తర్వాత నేను నాణాన్ని మింగాను. అది గొంతులోనే వుండిపోయింది! అమ్మ వైద్యున్ని పిలిపించి నన్ను రక్షించింది.

అమ్మ, రాత్రి నాటకశాల నుంచి వచ్చిన తర్వాత సిడ్నికోసం కేక్‌గాని తీపి బిళ్లలుగాని తెచ్చి బల్లమీద పెట్టేది. ప్రొద్దున్నే మేము లేవగానే మాకు కనపడేవి. అమ్మ ఆలస్యంగా నిద్రపోయేది (నాటక శాలనుంచి వచ్చి).

నాకూ, అన్న సిడ్నికీ అమ్మ అంటే ఒక ఆరాధన. ఆమె నాటకం వేషంలో ఎంతో అందంగా, హుందాగా వుండేది. ఆమె వంటిరంగు బాగా తెల్లగా, వుండేది. నీలికళ్లు, ముదురు రంగు జుత్తులో ఆమె దేవతలాగా అన్పించేది. తెలిసినవాళ్లు ఆమె ఆకర్షణ గురించి చెప్పేవాళ్లు.

ఆదివారాలు మా యిద్దర్నీ షికారు తీసుకెళ్లేది. సిడ్నీని ఏటన్ సూటులో నన్ను వెల్వెట్ దుస్తుల్లో తయారుచేసి, మురిపెంగా, ఆదివారాలు తిప్పేది. పరిసరాలన్నీ మాకు పరిచయం చేసేది.

ఆ రోజుల్లో లండన్ ప్రశాంతంగా ఉండేది. బ్రతుకు తాపీగా సాగేది. గుర్రాలు లాగే ట్రామ్‌బళ్లు, వెస్ట్‌మినిష్టర్ వంతెన వీధిలో మందగమనంతో నడుస్తుండేవి. వంతెన దగ్గర మెల్లగా తిరిగేవి. అమ్మ సంపాదన బాగున్నపుడు మేముకూడా వెస్ట్‌మినిష్టర్ బ్రిడ్జ్ వీధిలో నివాసం వున్నాము. అక్కడ వాతావరణం ఉత్సాహంగా ఉండేది. ఎంతో

చాప్లిన్ తల్లి (హన్నా చాప్లిన్)

స్నేహపూర్వకంగా, ఆకర్షణీయంగా దుకాణాలు, హోటళ్లు, సంగీత శాలలు అన్నీ సందడిగా వుండేవి. బ్రిడ్జి మూలనున్న పండ్ల దుకాణం ఎన్నో పళ్లతో పేర్చబడి ఆపిల్, బత్తాయి, పేర్, అరటిపళ్ల రకాలతో రంగులీనుతుండేది. ముఖ్యంగా, అవతలివైపున ఊదారంగు పార్లమెంటు భవనంతో పోల్చి చూసినప్పుడు!

ఇది నా చిన్నప్పటి లండన్ నగరం! నా ఆటలు, నేను మెల్లమెల్లగా నేర్చుకున్న ఎన్నో విషయాలతో చిన్న చిన్న విషయాల జ్ఞాపకాలతో నిండిన నగరం. అమ్మతో గుర్రపు బగ్గీలో తిరగడం, పైకెక్కి చెట్లను పట్టుకోవటానికి చేతులు చాపడం, రంగు రంగుల బస్ టికెట్లు పోగుచేయడం, రకరకాల పూలు అమ్మే పిల్లలను చూడడం, గులాబీల రంగులు, గుత్తులుగా కట్టే ఆ మృదువైన వేళ్లను చూడటం (నాకెంతో బాధ అనిపించేది!). దిగులుగా జరిగే ఆదివారాలు తమ పిల్లలను తప్పనిసరిగా తిప్పుతున్న తలిదండ్రుల పాలిపోయిన ముఖాలు. చిన్నిచిన్ని రంగులరాట్నాలు, గాలిబూరలు, వెస్ట్ మినిష్టర్ వంతెనపై ఎగరటం, క్రింద స్టీమర్ల సోమరి నడక – ఇదిగో వీటన్నిటిలోనుంచే ఈ 'నేను' తయారయ్యాననుకుంటాను.

అంతేనా, మా యింటిలో సామాను వాసన, గోడకున్న నెల్‌గ్విన్ వేసిన అమ్మ నిలువెత్తు చిత్రం (ఇది నాకేమాత్రం నచ్చలేదు), పొడవాటి మెడతో వున్న, వైన్ బుడ్లు ఇవి మరీ దిగులు పుట్టించేవి. ప్రక్కనే వున్న గ్రామఫోను, దానిమీద వున్న రెక్కల దేవతల బొమ్మలు. ఇవీ ఆశ్చర్యంగా వుండేవి. నాకోసం జిప్సీవాళ్ల దగ్గర కొన్న చిన్న కుర్చీ – ఇది నాకు చాలా నమ్మకాన్ని కలిగించేది. ఎందుకంటే అది 'నాది' కదా! ఇవన్నీ చిన్నిచిన్ని విషయాలు.

గొప్ప సంగతులూ ఉన్నాయి!

రాయల్ ఆక్వేరియంకి వెళ్లటం. ఇక్కడే చాలా గొప్ప ప్రదర్శనలు. ప్రక్కనే చిన్ని ప్రదర్శనలు జరుగుతూండేవి. ఇది విక్టోరియా వీధిలో వెస్ట్‌మినిష్టర్ ఎబ్బెకి ఎదురుగా వుండేది.

అమ్మతో 'ఆమె'లో మంటల్లో నవ్వుతూ కాలిపోతున్న 'ఆమె'ను చూడటం గొప్ప అనుభూతి. అక్కడే వున్న లక్కీ డిప్‌లోనుంచి తీపి బూర తీయటం, అది మోగేదికాదు! అక్కడనుంచి కాంటర్‌బెర్రా సంగీతశాలకు వెళ్ళి అక్కడ మెత్తని ఎర్రని వెల్వెట్ కుర్చీలో కూర్చొని మా నాన్న నాటకాన్ని చూడటం!

అప్పటికే రాత్రి మించిపోయింది. నన్ను చిన్న రగ్గులో చుట్టి నలుగురు కూర్చొనే బగ్గీ ఎక్కించి అమ్మ రంగస్థల స్నేహితులతో నవ్వుతూ తుళ్ళుతూ, (అన్నిరకాల వాయిద్యాలూ మ్రోగుతూండేవి.) ఇంటికి చేరేవాళ్లం. బగ్గీ గుర్రాల గిట్టెల చప్పుడు జీనుల రాపిడి చిన్న మువ్వల సవ్వడి!

అప్పుడే హఠాత్తుగా ఏదో జరిగింది. ఒక నెలరోజులకు అటూఇటూగా అనుకుంటా అమ్మకు అంతా సవ్యంగా లేదని ఏదో కష్టంలో వుందని తెలుస్తోంది. ఒకరోజంతా ఎవరితోనో స్నేహితురాలితో బైటకువెళ్ళి ఆలస్యంగా ఇంటికి తిరిగివచ్చింది. నేను ఇంటి మధ్యలో ఆడుకుంటున్నాను. నా చుట్టూ ఏదో జరుగుతోంది. అమ్మ కళ్ళల్లో నీళ్ళు చూశాను. ఆమె మాటల్లో ఆందోళన విన్నాను. ఆర్మ్‌స్ట్రాంగ్ అనేమాట ఒకటికి రెండుసార్లు వినపడుతోంది. ఆర్మ్‌స్ట్రాంగ్‌ని తిడుతోంది కూడా! అమ్మ ఆందోళన చూసి నేను ఏడ్చానుకూడా. అంత కష్టంలోనూ నన్ను ఎత్తుకొని ఓదార్చినట్లు గుర్తు. కొన్నేళ్ల తర్వాతగానీ నాకు తెలియలేదు. ఏమి జరిగిందో – అమ్మ–నాన్న మీద కోర్టులో సంతానాన్ని పోషించటం లేదని వేసిన కేసు విషయం. ఇది అమ్మకు అనుకూలంగా జరగలేదని. ఆర్మ్‌స్ట్రాంగ్, నాన్న లాయరు పేరు!

నాన్న నాకు అస్సలు తెలీదు. మాతో ఏనాడూ వున్నట్లు గుర్తులేదు. నాన్నకూడా నాటకాల రంగస్థల నటుడే. నల్లని కళ్లు. ప్రశాంతంగా వుండేవాడని విన్నాను. నెపోలియన్ లాగా వుండేవాడని అమ్మచెప్పేది. ఆయనకు మంచి గొంతు వుండేదనీ, మంచి నటుడనీ కూడా విన్నాను. ఆ రోజుల్లోనే వారానికి 40 పౌండ్లు సంపాదించేవాడని ప్రసిద్ధి. అసలు సమస్య ఆయన తాగుడుతోనే! అదే కారణం అమ్మా–నాన్నా విడిపోవటానికి.

రంగస్థల నటులు (తారలందాము) తాగకుండా వుండలేరు. అన్ని నాటక శాలల్లోనూ మద్యం అమ్మేవారు. పేరున్న నటులంతా వారి ప్రదర్శన తర్వాత అక్కడే వున్న బార్‌కి వెళ్ళి అభిమానులతో స్నేహితులతో త్రాగటం అనేది ఒక కార్యక్రమం. కొన్ని నాటక శాలలు, నాటకాలకంటే ఈ మద్యం అమ్మకాలలో ఎక్కువ సొమ్ము చేసుకునేవి! ఈ పేరున్న తారలకు ఎక్కువ సొమ్ము ఇచ్చేది కూడా వారు దాన్ని మద్యం కొనుగోళ్ళకూ, తాగుడుకూ ఖర్చు పెడతారనే. ఇదే కారణంతో చాలామంది నటులు ఈ తాగుడుకు బానిసలయి పతనమయి పోయారు కూడా. నాన్నకూడా అందులో

ఒకడయి నాశనమైపోవటం మా దురదృష్టం. ముప్పయి ఏడేళ్ళకే ఆయన అసువులు ఆ మధ్యం ఆవిర్లలో కలిసిపోయాయి!

తర్వాత అమ్మ-నాన్న గురించిన కథలు నవ్వుతూనూ – విచారంగానూ చెప్తుండేది. ఆయన తాగుడు భరించలేక ఒకసారి బ్రైటన్ పారిపోయింది! నాన్న తంతి పంపాడు. "ఏమి చేస్తున్నావు... వెంటనే సమాధానం పంపు" అని. అమ్మ "ఇప్పుడు పార్టీలు, పిక్నిక్కిలూ, డాన్సులూ" అని సమాధానం పంపింది!

మా అమ్మనాన్న ఐరిష్! ఐర్లెండ్‌లోని కార్క్‌నుంచి లండన్ వచ్చాడు. ఐర్లాండ్‌లో వున్నప్పుడు చెప్పులు కుట్టేవాడు. అమ్మ ఆయన పెద్దకూతురు. అమ్మ-నాన్న గులాబిరంగుల బుగ్గలతో తెల్లని జుట్టుతో హుందాగా వుండేవాడు. విజ్లర్ వేసిన బొమ్మలా! ఐర్లండ్ జాతి జరిపిన జాతీయ పోరాటంలో పాల్గొన్నాడు. అప్పుడు పోలీసులకు దొరకకుండా వుండేందుకు పొలాల్లో బావిలో దాక్కునేవాడు. అప్పుడే ఆయనకు కీళ్లవాతం వచ్చింది. చివరికి లండన్ చేరి వాక్‌వర్త్‌లో 'తూర్పు సందులో' బూటులు బాగుచేసే వ్యాపారంతో కుదురుకున్నాడు.

అమ్మమ్మ- ఒక జిప్సీ కుటుంబంనుంచి వచ్చింది. ఈ రహస్యం మా కుటుంబం దాచి పెట్టిందనే చెప్పాలి. కాని అమ్మమ్మ ఎప్పుడూ అంటుండేది. 'అరే, మేము నెల అద్దె చెల్లిస్తూండేవారం!' అని.

పెళ్లికాకముందు ఆమె పుట్టింటి పేరు 'స్మిత్'. ఎప్పుడూ నవ్వుతూ వున్నట్లు నాకు గుర్తు. నాకు ఆరేళ్లప్పటికే ఆమె కాలంచేసింది. తాతనుంచి వేరయినట్లు మా పిన్ని (కేట్) చెప్పింది. కారణం మా తాత మరో అమ్మాయిని తీసుకువచ్చి అమ్మమ్మ ముందు నిలబెట్టడమే.

మా కుటుంబాన్ని మామూలు నైతిక విలువలతో చూడటం ఆవిరవుతున్న నీళ్లలో ధర్మామీటర్ పెట్టినట్లే! ఒక చెప్పులుకుట్టే వాని (అదీ భార్య దూరమయిన తర్వాత), ఇద్దరు ఆకర్షణీయంగా వుండే కూతుళ్లు ఇల్లు వదిలి వెళ్లిపోవటం, నాటకాల వేషాలకోసం ప్రయత్నించటం చాలా సామాన్య విషయంగానే పరిగణించాలి. కేట్‌కూడా ఇదే దారిలో చిన్న నటి అయింది. ఆమె అప్పుడప్పుడూ మధ్యలో అమ్మ దగ్గరకు వస్తూండేది. అంత అర్థాంతరంగానే వెళ్లిపోతుండేది.

పద్దెనిమిదేళ్లకు అమ్మ ఒక మధ్యవయస్కునితో ఆఫ్రికా వెళ్లిపోయింది. అక్కడి సంపన్న జీవితం గురించి ఎప్పుడన్నా చెప్పేది. మా అన్న సిడ్ని అక్కడే పుట్టాడు. అతను రాజకుటుంబానికి వారసుడనీ, సిడ్నీకి పద్దెనిమిదేళ్లు వచ్చేసరికి రెండువేల పౌండ్లు వారసత్వంగా వస్తాయని చెప్తుండేది.

అమ్మ ఆఫ్రికాలో ఎక్కువకాలం లేదు. ఇంగ్లండు తిరిగి వచ్చేసింది. అప్పుడే మా నాన్నను పెళ్లి చేసుకుంది. ఆఫ్రికాలో ఏమి జరిగిందో నాకిప్పటికీ తెలియదు. కాని ఆ సంపదను వదలి వచ్చినందుకు తర్వాత పేదరికం అనుభవించేటప్పుడు నాకు చాలా బాధ అన్పించేది! అమ్మ "నాకా వయస్సులో తెలియలేదు" అని నవ్వేసేది! అమ్మకు నాన్న అంటే ఎలాంటి భావం ఉండేదో నాకెప్పుడూ అర్థం కాలేదు. ఆమె ఎప్పుడూ ఆయన్ను గురించి పరుషమైన పదాలతోగానీ చెడ్డమాటలతోగానీ చెప్పేది కాదు. ఆయన్ను ఎంతో ప్రేమించిందనే అనుకోవాలి. చాలా సానుభూతితోనే ఆయన గురించి మాట్లాడేది. కాని ఆయన త్రాగుడు వ్యసనం భరించలేకపోతోందని అర్థం అయ్యేది. తర్వాత ఎప్పుడైనా నా మీద కోపం వస్తే "నీవు కూడా మీ నాన్నలాగా మురికి కాలువలో తేలతావురా" అని కోప్పడేది!

అమ్మకు ఆఫ్రికా వెళ్లకముందే నాన్న తెలుసు! ఇద్దరూ ప్రేమించుకున్నారు కూడా. ప్రేమికులుగా ఐరిష్ నాటకం షాము ఓబ్రయిన్ (Shamus O. Brien)లో ప్రేమికులుగా నటించే వారు కూడా. అప్పటికి అమ్మకు 16 ఏళ్ళు. ఈ నాటకం కంపెనీతో తిరిగేటప్పుడు మధ్యవయస్కుడైన రాజబంధువుతో ఆఫ్రికా వెళ్లిపోయింది! మళ్లీ తిరిగి వచ్చిన తర్వాత నాన్న వారి పూర్వ ప్రేమకథను కొనసాగించి పెళ్లి చేసుకున్న తర్వాత మూడు సంవత్సరాలకు నేను పుట్టాను!

కేవలం తాగుడు కారణంగానే అమ్మా-నాన్నా విడిపోయారో లేక వేరే కారణాలున్నాయో నాకు తెలియదు. నేను పుట్టిన తర్వాత సంవత్సరానికి వారిద్దరూ విడిపోయారు. అమ్మ భరణం కోసం ప్రాకులాడలేదు. అప్పటికే అమ్మకి వారానికి ఇరవయి పౌండ్లు వస్తుండేవి నాటకాల ఆదాయం! ఆమె, ఇద్దరు పిల్లల్తో సుఖంగా కాలక్షేపం చేస్తుండేది. తప్పనిసరి పరిస్థితిలో ఆమెకు ఆదాయం లేనప్పుడే భరణంకోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఆమె ఎప్పుడూ పేచీకోరు కాదు!

అమ్మకు వచ్చిన కష్టం ఆమె గొంతు చాలా బలహీనంగా ఉండేది. ఏమాత్రం చలిగాలి వున్నా లారింగైటెస్‌తో గొంతు పీలగా మారేది! వారాల తరబడి. పాడుతున్నప్పుడు గొంతులోనుంచి మాటలే వచ్చేవి కావు. కేవలం బలహీనమైన శబ్దాలే వస్తుండేవి. అలాగే ప్రదర్శనలు ఇస్తుండేది. చివరికి ఆ గొంతు వినపడకుండా పోయింది! ప్రదర్శనలో చూసేవారు నవ్వుతుండేవారు. అరుస్తుండేవారు కూడా. ఈ దిగులుతోనే అమ్మ ఆరోగ్యం దెబ్బతింది. అమ్మ గొంతు పోతోందనే నేను అయిదు సంవత్సరాలకే రంగస్థలం ఎక్కాను. అప్పటికే అమ్మకు వేషాలు రావడం ఆగిపోయాయి. అమ్మతోపాటు నేను రంగస్థలానికి రోజూ వచ్చేవాడిని. అమ్మ నన్ను ఒంటరిగా ఇంటి దగ్గర వదిలిపెట్టి రావటం ఇష్టంలేక తనతోపాటు తీసుకువచ్చేది. ఆ విధంగా నాటకశాల నాకు పరిచితమైన ప్రదేశము.

ఆ రోజుల్లో 'ఆల్డ'ర్ షాట్ కాంటీను' అనేచోట, ఎక్కువగా సైనికులు వచ్చే చోట ప్రదర్శనలు జరిగేవి. అమ్మకు అక్కడే పని! 'ఆల్డర్ షాట్'లో ప్రదర్శన అంటే నటీనటులందరికీ భయమే. ఎందుకంటే అదంతా రౌడీలూ, సైనికులూ తిరిగేచోటు!

ఇప్పటికీ నాకు గుర్తుంది. ఒకరాత్రి అమ్మ పాడుతున్నప్పుడు ఆమె గొంతు మూగబోయింది. నేను 'సైడు వింగ్స్'లోనే వున్నాను. అప్పటికే ప్రేక్షకులు పిల్లికూతలు ఎగతాళిగా పాడటం మొదలుపెట్టారు! గోలగా వుంది – అమ్మ స్టేజ్ వదలిపెట్టి నేనున్న చోటకు వచ్చింది. అక్కడున్న మేనేజరుతో ఏదో వాదిస్తోంది. మేనేజరు ఆమె స్థానంలో నన్ను పంపమంటున్నాడు. అంతకుముందు ఒకటిరెండుసార్లు నేను నటించడం చూశాడు! ఈ గందరగోళంలో మేనేజర్ నన్ను తీసుకొని స్టేజ్‌మధ్యలోకి వచ్చాడు! ప్రేక్షకులకు ఏదో చెప్పి నన్ను అక్కడ వదలి వెళ్ళిపోయాడు. వెల్తురు ముఖంమీద పడుతుండగా ప్రేక్షకుల ముఖాలు పొగలో మునిగి ఉండగా నేను పాడటం మొదలుపెట్టాను. ఆర్కెస్ట్రా చివరికి నా శృతికి వీలుగా సంగీతం అందించారు. నేను పాడిన పాట 'జోర్ జోన్స్' అప్పటికి చాలా బాగా ప్రచారంలో ఉన్న పాట!

నేను సగం పాడే సమయానికి స్టేజి మీదకు డబ్బుల వర్షం కురవటం మొదలు పెట్టింది. అప్పుడు మధ్యలో ఆపి "ముందు డబ్బులు ఏరుకుని మళ్లీ పాడతాను" అన్నాను. ఇది ప్రేక్షకులను బాగా నవ్వించింది. ఈ సమయంలో మేనేజర్ వచ్చి డబ్బులు పోగు చేయటంలో నాకు సహాయం చేశాడు. అప్పుడు "ఈ డబ్బంతా మేనేజరు తీసుకుపోతాడేమో" అన్నాను. ఇది ఇంకా నవ్వించింది. అలా వెనకాలే పరిగెత్తాను.

ఇది వాళ్లను ఇంకా నవ్వించింది. మేనేజర్ డబ్బంతా అమ్మకు ఇచ్చింతర్వాత నేను స్టేజీమీదకు మళ్ళీ వచ్చాను. పాడటం మొదలు పెట్టాను. నాకేమీ భయం వేయలేదు. మధ్యలో ప్రేక్షకులతో మాట్లాడాను కూడా. తర్వాత కొన్ని మిమిక్రీలు కూడా చేశాను. ఒకటి అమ్మలాగా 'ఐరిష్ మార్ట్' పాట పాడాను. నాతోపాటు ప్రేక్షకులుకూడా పాడటం మొదలుపెట్టారు. ఇంకా డబ్బులు విసిరారు. చివరికి పాట అయిపోయింది. అమ్మ నన్ను తీసుకు వెళ్లటానికి వచ్చినప్పుడు ప్రేక్షకులు చప్పట్లుకొట్టి తమ ఆనందాన్ని తెలియజేశారు.

అదే అమ్మ ఆఖరు ప్రదర్శన. అదే నా మొదటి ప్రదర్శన!

మన జీవితాలతో విధి ఆడుకోదలిస్తే ఇక దయాదాక్షిణ్యం ఉంటుందా? అమ్మకు ఇదే జరిగింది. అమ్మ గొంతుపోవటం ప్రదర్శనలకు పనికి రాకుండా పోయింది. ఆకురాలు కాలంలో ప్రవేశించినపుడు మా పరిస్థితి మరీ దిగజారింది. అమ్మ ఎంతో కొంత సొమ్ము జాగ్రత్త చేయబట్టి కొన్నాళ్లు గడిచింది. అలాగే ఆమె నగలూ, ఇంట్లో చిన్నచిన్న వస్తువులూ కూడా అదృశ్యమైపోయాయి రోజులు గడవటంలో!

మూడు గదుల ఇంట్లో నుంచి రెండుగదుల ఇంట్లోకి మారాము. ఆ తర్వాత ఒక గది గూట్లో చేరాము. ఉండే పరిసరాలు కూడా మార్చుకున్నాం. పేదరికంలో ఉండాలంటే పేదలుండే చోటులోనే ఉండాలికదా! ఈ పరిస్థితుల్లో అమ్మ చర్చిలో నమ్మకం పెట్టుకుంది! నిరాశానిస్పృహల్లో మత విశ్వాసం ఊరట అనుకుంది. ఆ విధంగా తన కంఠ స్వరం మళ్లీ వస్తుందని ఆశపెట్టుకుంది. అందుకే తప్పనిసరిగా క్రైస్ట్ చర్చికి వెళ్తుండేది, ప్రతి ఆదివారం. ఆమెతోపాటు నేనూ కూర్చునే వాడిని. ఆర్గాన్ సంగీతంతోపాటు రెవరెండ్ మేయర్ గంభీరమైన కంఠం మార్మోగుతుండేది. అమ్మ కంట నీరు తుడుచుకుంటుండేది.

ఒక మధ్యాహ్నం పవిత్రవాచకం అయిపోయిన తర్వాత, అప్పుడు వేసవి మండిపోతోంది. చల్లని ద్రాక్షరసం గిన్ని నా దగ్గరకు వచ్చినపుడు నేను ఎక్కువ తాగుతుంటే అమ్మ వారించింది కూడా. ఫాదర్ బైబిల్ మూసినపుడు ఇక ఈ మధ్యాహ్నం ఈ తంతు అయిపోయిందని సంతోషించాను.

అమ్మ దేవుడిమీద చర్చిలో నమ్మకం పెట్టుకున్నప్పటినుంచి తనతోటి నటుల్ని కలవటం మానివేసింది. అలా ఇప్పుడు మాకు గతం ఆవిరయిపోయిన ప్రపంచం!

కేవలం ఒక జ్ఞాపకమే! మేము ఎప్పుడూ ఈ పేదరికంలోనే ఉన్నామా అనిపించేది. ఇలా ఒక సంవత్సరం ఒక జీవిత కాలంలా గడిచింది. కష్టం కారు మబ్బులాగా కమ్ముకుంది. అప్పుడు పని దొరికేది కాదు. అమ్మకు నాటకాలు తప్ప ఇంకే పనీ తెలియదు. అందుకని మాకు రోజులు గడవటం మరీ కష్టమయిపోయింది. అప్పటి విక్టోరియాకాలంలో ఎంత సంపద వుందో అంత పేదరికం ఉండేది. పేద ఆడవాళ్లకి చిల్లర పనులే దొరికేవి. అమ్మకు ఎప్పుడైనా ఆసుపత్రిలో నర్సు పని దొరికేది. కాని అదీ కొద్దిగంటలే! అమ్మ రంగస్థల నటిగా వున్నప్పుడు తన నాటకాల దుస్తులు తనే తయారుచేసి కుట్టుకునేది. ఆ అనుభవంతోనే చేతి కుట్టుపని చేసి ఏదో కొంత సంపాదించేది. కాని ఆ సంపాదన మా ముగ్గురికీ సరిపోయేది కాదు. తాగుడు మూలంగా నాన్న సంపాదనా తగ్గిపోవటంతో మాకిచ్చే వారానికి పది షిల్లింగులూ ఆగిపోయినాయి. అమ్మటానికి ఇంట్లో సామాన్లుకూడా లేవు. చివరికి తన వేషాల తాలూకు దుస్తులు ఇన్నాళ్లూ తన గొంతు మళ్లీ వస్తుందనే ఆశతో వుంచుకున్నవి, మిగిలాయి. అప్పుడప్పుడు ఆ దుస్తులూ, విగ్గులూ పెట్టుకుని మా ముందు తన నటన, నృత్యం ప్రదర్శించేది. అమ్మ ఎంత మంచి నటో చూసే అవకాశం అప్పుడే కలిగేది.

ఒక సాయంత్రం నాకు జ్వరంగా వుంది. అన్నయ్య రాత్రి తరగతులకు వెళ్ళాడు. ఆ చీకటి వేళలో అమ్మ నా దగ్గర కూర్చుంది. బైబిల్ తీసి (న్యూ టెస్టమెంట్) ఏసుక్రీస్తు ప్రేమ, కరుణ గురించి – పేదలన్నా, చిన్నపిల్లలన్నా క్రీస్తుకు ఎంత దయా, ప్రేమా వుండేవో నాకు వివరించింది. ఎంతో కరుణ రసాత్మకంగా చెప్పింది క్రీస్తుగురించి. అలాంటి ఉద్వేగభరితమైన మాటలు తర్వాత ఎప్పుడూ వినలేదు. పాపం చేసిందని ఒకామెను రాళ్లతో కొట్టబోతున్న గుంపుతో "మీలో పాపం చేయనివారే ముందు రాయి వేయండి" అన్న క్రీస్తు మాటలు వినిపించింది. అలా బాగా చీకటి పడేవరకూ. దీపం వెలిగించేందుకు ఆపింది మధ్యలో. తర్వాత క్రీస్తుని శిలువ వేయటం, ముళ్ల కిరీటం పెట్టటం హృదయవిదారకంగా వినిపించింది. క్రీస్తు చచ్చిపోయే ముందు "దేవుడా ఎందుకు నన్ను అనాధను చేసి వదిలావు" అని గట్టిగా అరిచినట్లు చెప్పి 'చూశావా క్రీస్తుకూడా మనలాంటివాడే, ఆయనకూ సందేహాలున్నాయి మనలానే' అని అంది. నాకయితే అప్పుడే చనిపోయి క్రీస్తును కలవాలని అనిపించింది.

అంత దయార్ద్రంగా చెప్పింది. కాని అమ్మ అంది "దేవుడు నిన్ను బ్రతకమని, ఇక్కడ నీ కర్తవ్యం నెరవేర్చమని కోరాడు" అంటూ ఆ చీకటి గదిలో ఆ కరుణరస

వాక్యాలు విన్న నాకు తర్వాత మానవ ప్రపంచంలో సాహిత్యం, నాటకాలు ఎందుకు ఇంత కరుణతోను ప్రేమతోను, దయతోను నిండివుంటాయో కారణం తెలిసింది!

అప్పుడు మేమున్న పేదల పేటలో భాష చాలా మొరటుగా వుండేది. కాని అమ్మ ఎప్పుడూ చెప్తుండేది. ఎట్లా మాట్లాడాలో – వ్యాకరణం ఎలా తెలుసుకోవాలో, చదువుకున్నవాళ్లు ఏ విధంగా వుండాలో తప్పనిసరిగా రోజు చెప్తుండేది. అప్పుడప్పుడూ అమ్మను మళ్లీ నటించటానికి (వేషాలకు) వెళ్లమని గొడవ చేస్తూండేవాడిని. కేవలం ఆకలి భరించలేకనే. అమ్మ చెప్పేది అది అంతా కృత్రిమ ప్రపంచం. అక్కడ దేవుణ్ణి మర్చిపోతాం అని నన్ను సముదాయించేది. నాకూ, అన్నయ్యకు బట్టలు చిరిగిపోతే తన నాటకాల దుస్తులు చించి బట్టలు కుట్టి చలికాలం గడిపేది. రంగురంగుల వాటితో అన్నయ్య బడికి వెళ్లుతూంటే అందరూ ఎగతాళి చేసేవారు.

ఈ కష్టకాలంలోనే అమ్మకు విపరీతమైన తలనొప్పి వచ్చేది. ఆ నొప్పితో కుట్టలేక అలాగే చీకటిలో పడివుండేది. అప్పుడు మాకు పేదవాళ్లకిచ్చే చద్ది దానాలతోనూ మా పేటలో ఇచ్చే ఆహార పొట్లాలతో గడిపేవాళ్లం. అన్నయ్య సిడ్నీ, పేపర్లూ వేసి ఏదో కొంచెం సంపాదించేవాడు. కాని అది ఏ మూలకు? మా అవసరాలు రవ్వంత కూడా తీరేవి కాదు. కాని మాకు మంచికాలం ముందువస్తుందని ఎలా తెలుస్తుంది? అమ్మ తలనొప్పితో కళ్లమీద టీ ఆకులు కట్టుకుని పడివుండేది. ఒకరోజు అన్న పరుగుపెడుతూ వచ్చాడు. పేపర్లన్నీ మంచంమీద పడేసి చేతిలో 'పర్సు' చూపించాడు. అమ్మ కళ్లు తెరిచి చూసింది. పర్సులో వెండి నాణాలు వున్నాయి. తర్వాత చెప్పాడు బస్సులో పేపరు అమ్ముతుంటే ఖాళీ సీటులో పర్సు పడి వుందని. దానిమీద పేపరువేసి ఎవరూ చూడకుండా తెచ్చానని చెప్పాడు.

అమ్మ అందులో ఏదైనా చిరునామా ఉందేమో చూసింది. ఏమీ కనపడలేదు. ఆమె నమ్మకం ఇది దేవుడు చేసిన పని అని. మెల్లగా కళ్లు తెరిచి ఆ తోలు పర్సు తెరిచి చూసింది. అందులో మాకు చిన్న నిధి దొరికింది. బంగారు నాణాలు, వెండి నాణాలు, రాగి నాణాలు! అమ్మ తలనొప్పి మెల్లగా తగ్గింది. మాకు మంచి బట్టలువేసి దక్షిణ తీరానికి తీసుకు వెళ్ళింది. విహారానికి. అదే నేను సముద్రం చూడటం! నేను ఆ కదులుతున్న భూతంలాంటి సముద్రాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఎక్కడ నా మీద

పడుతుందోనని ఆందోళన పడ్డాను. మేము ముగ్గురం నీళ్లలో దిగాము. అలలు నా కాళ్లు తడుపుతుంటే నాకు ఏదో మాయలాగా అనిపించింది!

అక్కడ తీరమంతా రంగు రంగుల గొడుగులతో, పడవలతో జనంతో నిండిపోయింది. తీరంలో నిద్రపోతున్న పడవలు, గాలికి కదలుతున్న గొడుగులు. సముద్రపు వాసన అన్ని నన్ను ఉక్కిరిబిక్కిరి చేసినవి. ఇప్పటికీ ఆ జ్ఞాపకాలు నన్ను వదల్లేదు.

(1957లో నేను మళ్ళీ అదే బీచ్‌కి వెళ్ళాను. ఆ వీధికోసం వెదికాను. కాని ఎక్కడా ఆ గుర్తులు కూడా లేవు) ఈ డబ్బు అయిపోవటానికి ఎంతకాలం కావాలి? అమ్మ వేరే పనికోసం ప్రయత్నించింది. కుట్టుమిషన్ కూడా వెళ్ళిపోయింది. నాన్న పంపే డబ్బు ఆగిపోయింది. గతిలేక మళ్లీ న్యాయం కోసం వెళ్లింది. ఒక న్యాయవాది సలహా 'లాంబెత్ బరో' అధికారులపై వత్తిడి తెమ్మని! చివరికి మేము ముగ్గురం 'లాంబెత్' అనాథ ఆశ్రమంలో చేరాం!

రెండవ అధ్యాయం

పేదరికం

అనాధ ఆశ్రమంలో చేరటం అవమానమే అని మాకు తెలిసినా, అమ్మ నాకూ సిడ్నీకీ చెప్పినప్పుడు అదొక సాహసం అనుకుని ఇప్పుడున్న స్థితిలో నుంచి మార్పుగానే అనుకున్నాము. కాని ఆ ప్రభుత్వ ఆశ్రమంలో అడుగుపెట్టిన తర్వాతే అక్కడ పరిస్థితి తెలిసింది. అమ్మను ఆడవాళ్లుండే వైపుకూ, నన్నూ అన్ననూ చిన్నపిల్లల విభాగానికీ పంపారు. ఇదే నాకు చాలా బాధ కలిగిస్తే తర్వాత మొట్టమొదట అమ్మతో మేము కలిసినపుడు ఆ ఆశ్రమం దుస్తుల్లో అమ్మను చూడాలంటే ఇంకా దిగులుతో దిక్కులేని వాళ్లుగా చూస్తుండిపోయాము. ఒక్క వారంరోజుల్లో అమ్మ వయసు మీదపడినట్లు, బక్కచిక్కినట్లు అనిపించింది. మా యిద్దరికీ ఏడుపు ఆగలేదు అమ్మను చూసిన తర్వాత. మొదట్లో అమ్మ కళ్లు కాస్త మెరిసినాయి మమ్మల్ని చూసి. కాని అంతలోనే ఆమె కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. చివరికి ముగ్గురం ఒక బల్లమీద కూర్చొని ఓదార్చుకున్నాము. మా యిద్దరి గుళ్లమీద చెయ్యిపెట్టి సముదాయించి "మనం తర్వలోనే కలిసి వుంటాము" అని ఆమె తెచ్చిన కొబ్బరిలౌజు మా యిద్దరికీ పెట్టింది. అమ్మ వెళ్లిపోయన తర్వాత మేమిద్దరం "ఏమిటి అమ్మకి ఒక్కసారిగా ముసలితనం వచ్చింది" అనుకున్నాం.

నేనూ, సిడ్నీ త్వరలోనే ఈ ఆశ్రమం వాతావరణానికి దిగులుగానే, అలవాటుపడ్డాము. ఇక్కడ ప్రత్యేకంగా జరగటానికి ఏమీలేదు. మధ్యాహ్నం భోజనం సమయంలో అందరం కలిసి కూర్చుంటాం. 75 ఏళ్ల పెద్దాయన మా అందరికీ ఈ భోజన వ్యవహారం చూసేవాడు. మొదట్లో నన్ను ఆయన ప్రక్కనే కూర్చోబెట్టుకొని కబుర్లు చెబుతూ భోజనం పెట్టేవాడు. అందరిలో నేను చిన్నవాణ్ణి. అదే కారణం. తర్వాత నాకంటే చిన్నవాడు వస్తే అతన్ని దగ్గర కూర్చోబెట్టుకొని ఇదే గౌరవం ఇచ్చేవాడు. ఇలా మూడు వారాలు గడిచిన తర్వాత మమ్మల్ని లాంబెత్ ఆశ్రమం నుంచి హాన్‌వెల్

స్కూలు, అనే అనాథ పిల్లల బడికి పంపారు. హాన్‌వెల్ స్కూలు పరిసరాలు ఆరోగ్యకరంగా, చుట్టూ పంటపొలాలూ, పండ్ల చెట్లతో ఎంతో మంచి పరిమళాలతో హాయిగొల్పేవి. తర్వాత జీవితంలో అలాంటి ప్రదేశాలు చూసినపుడు నాకు హాన్‌వెల్ వాతావరణం గుర్తుకొచ్చేది.

ఈ హాన్‌వెల్ బడికి రాగానే మా అందర్నీ మానసికంగా ఆరోగ్యవంతంగా బాగున్నారా లేదా పరీక్షలు జరిపి చేర్చుకున్నారు. అయితే నాకు అమ్మ దగ్గర్లో లేదనే దిగులు ఉండేది. రాత్రి పడుకునే ముందు అందరం ప్రార్థన చేసేవాళ్లం. ఈ ప్రార్థన నాకు ఇంకా దిగులు పుట్టించేది.

అలా రెండు నెలలు గడిచాయి. ఆశ్చర్యం! అమ్మ మమ్మల్ని ఆశ్రమానికి వచ్చే ఏర్పాటు చేసింది. మేము చేరేసరికి అమ్మ ఆశ్రమం ద్వారం దగ్గరే వేచి వుంది. మామూలు దుస్తుల్లో. కేవలం మాతో ఆ రోజు గడపటానికి ఈ ఏర్పాటుకు దరఖాస్తు పెట్టుకుంది! అమ్మ ఆశ్రమం వదలి రాకూడదు. అందుకనే మమ్మల్ని ఇక్కడకు తీసుకువచ్చే ఏర్పాటు చేసింది. ఆమె ముఖంలో ఆనందం చూడాలి! ముగ్గరం కలిసి ఆ రోజు కెన్నింగ్‌టన్ పార్క్‌కు వెళ్లాం. అక్కడకు ఒక మైలు దూరంలోనే. అన్న దగ్గర తొమ్మిది పెన్నిలున్నాయి! నేరేడు పండ్లు కొన్నాము. పార్కు బల్లమీద కూర్చొని తిన్నాము. అన్న ఇంత కాగితం వుండ తయారు చేశాడు. కొంచెంసేపు బంతిలా ఆడుకున్నాము. మధ్యాహ్నం టీ, కేకూ కొన్నాము. ముగ్గురం కొద్దిగా టీ తాగాము. మళ్లీ సాయంత్రం నేనూ, అన్న బంతి ఆడాము. అమ్మ మమ్మల్ని చూస్తూ కూర్చుండిపోయింది. చీకటి పడకముందే ఆశ్రమానికి చేరాము. తర్వాత హాన్‌వెల్ బడికి వెళ్లిపోయాము. ఈసారి సంవత్సరంపాటు అమ్మను చూసే అవకాశం కలగలేదు. మేము తరగతులకు వెళ్లటం, చదవటం, రాయటం నేర్చుకున్నాం. మొదటిసారిగా "చాప్లిన్" అని వ్రాశాను. ఆ పదమే నాకు ఎంతో హుషారు ఇచ్చింది. ఆ అక్షరాలను చూస్తుంటే నన్ను నేను చూస్తున్నట్లే ఉంది.

అప్పటికే నాకు ఏడేళ్లు వచ్చాయి. హాన్‌వెల్ బడిలో రెండు భాగాలున్నాయి. ఒకటి మొగ పిల్లలకు. ఒకటి ఆడపిల్లలకు. శనివారం సాయంత్రం పదేళ్లలోపు పిల్లలకు స్నానాలు చేయించేవారు. ఇదంతా ఏడేళ్లు రాకముందు. నాకంటే కొద్దిగా పెద్దమ్మాయికి నా శరీరం అప్పగించి సబ్బుతో రుద్దుతుంటే నాకు మొదటిగా సిగ్గుతో ఇబ్బంది పడ్డాను. పదేళ్ల తర్వాత నన్ను మొగపిల్లల విభాగానికి మార్చారు. ఇప్పుడు అందరూ పెద్ద

వాళ్లులాగా పనులు చేసుకోవచ్చు. అన్నిరకాల డ్రిల్లు వ్యాయామాలు ఆటలు అన్నీ. ఎంత బాగా చూసినా హాన్‌వెల్ బడి – బడే కదా. ఏదో దిగులు మాత్రం మమ్మల్ని అనాధలగా వెన్నంటి వుండేది. వందమంది బడిపిల్లల్ని ఊరిదారిలో నడిపిస్తుండేవారు. ఊళ్లోవాళ్లు మమ్మల్నే చూస్తుండేవారు. మేము అనాధలమని వాళ్లకు తెలుసని మాకు తెలుసు! మా బడి ఆటస్థలం ఎకరం పైగా వుంటుంది. డ్రిల్లు ఆడటం, అన్నీ అక్కడే, బడి పిల్లలన్న తర్వాత తప్పు చెయ్యకుండా వుండరు. తప్పు చేస్తే దండనా తప్పదు.అదే విషయం మీకు క్లుప్తంగా చెప్తాను.

ప్రతి శుక్రవారం ఈ దండన కార్యక్రమం వ్యాయామ శాలలో వుంటుంది. చిన్న తప్పులకు మూడు బెత్తం దెబ్బలు. పిర్రలమీద వాతలు తేలేవి. బల్లమీద పడుకోబెట్టి కదలకుండా పట్టుకునేవారు. పాంటు క్రిందకు లాగి పిర్రలు మీద కాప్టెన్ హిండ్రమ్? (ఈయన నౌకాదళం నుంచి రిటైర్ అయి ప్రస్తుతం దండన కార్యక్రమానికి సారధ్యం వహిస్తున్నారు).

పెద్ద తప్పుకు ఆరు దెబ్బలు. మూడు దెబ్బలకే నొప్పి భరించలేక మూర్ఛపోయే వాళ్లు. ఆరు దెబ్బలంటే ప్రక్కగదిలో డాక్టరు సిద్ధంగా వుండేవారు. మందులు వేసి కట్టు కట్టడానికి.

ఈ శిక్షలు అందరూ చూడవలసిందే. సామాన్యంగా, చేసిన తప్పులు చదువుతారు. చేశావా లేదా అని అడుగుతారు. చేయలేదు అని ఎవరూ అనరు. ఎందుకంటే దెబ్బలు పెరుగుతాయి.

గురువారం సాయంత్రం మైకులో చదువుతారు. శుక్రవారం శిక్షలు ఎవరికో వాళ్లు మర్నాడు సిద్ధంగా వుండాలన్నమాట! అలాంటి గురువారం ఆడుకుంటుండగా నా పేరు మైకులో వినపడింది! నాకేమీ అర్థం కాలేదు. ఏ తప్పు చేశానో కూడా గుర్తుకు రావటంలేదు. శుక్రవారం రానే వచ్చింది. లోపల దిగులుగా వున్నా నేను హీరోలాగా ఫీలయ్యాను! అంతకుముందు చూసిన బెత్తం దెబ్బలు గుండెల్లో గుబులు పుట్టించాయి. అయినా ధైర్యంగానే ముఖంపెట్టాను. “నువ్వు మూత్రశాలలో నిప్పు పెట్టావా?” అప్పుడు గుర్తుకు వచ్చింది. ఎవరో అక్కడ కాగితాలు మండించి వెళ్ళారు. అప్పుడు నేను మూత్రానికి వెళ్ళాను. అదీ విషయం. అయినా ఇప్పుడు ‘ఒప్పుకుంటున్నాను’ అని అన్నాను, వణుకుతూనే. తర్వాత నా పిర్రల మీద మూడు

వాతలు పడ్డాయి. తర్వాత అన్న సిడ్నీ చెప్పాడు, నన్ను కొడుతున్నప్పుడు చూసి 'ఏడుపు ఆపుకోలేకపోయానని.' అన్న నాకు పెద్ద అండ. సిడ్నీ వంటశాలలో పనిచేసేవాడు. నాకు రొట్టే, వెన్నా ఇస్తుండేవాడు. నేను నా స్నేహితునితో పంచుకుని తినేవాణ్ణి. రొట్టెకంటే వెన్న రుచి కదా!

తర్వాత పదకొండేళ్లు రాగానే విద్యార్థులు నౌకదళంలోకి కానీ, సైన్యంలోకి కానీ శిక్షణకు వెళ్లవచ్చు! 'సిడ్నీ నౌకలో శిక్షణకు వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు. అది తప్పనిసరి కాకపోయినా, అన్న నౌకల్లో పనిని తన వృత్తిగా ఎన్నుకోవాలని నిశ్చయించుకుని ఇప్పటి నుంచే ఎక్స్‌మౌత్ శిక్షణకు వెళ్లాడు. అలా నేను ఒంటరిగా వుండిపోయాను, హాన్‌వెల్ బడిలో!

పిల్లలకు జుత్తు అంటే ప్రేమ. అది రింగులు తిరిగినా, తిన్నగా వున్నా. హాన్‌వెల్ బడిలో 'తలగజ్జి' అంటురోగం ఉండేది. అది కనపడగానే వెంటనే గుండు గీయించి అయొడిన్ రాసి మొదట అంతస్తులో వుంచేవారు. పాపం వాళ్లంతా, మేమంతా ఆటలకు వెళ్తుంటే కిటికీల్లోంచి దీనంగా గుండులమీద అయొడిన్ పూతతో చూస్తుండేవారు. ఆటలకు వెళ్లేవాళ్లు, వాళ్లను చూసి జాలిగా ఎగతాళిగా నవ్వుకునేవారు.

ఒకరోజు నేను భోజనం చేస్తుండగా మధ్యాహ్నం నా వెనుకగా వచ్చిన నర్సు "గజ్జి" అని నా వెనకాలే అరవటం. నన్ను తీసుకువెళ్ళి గుండు గీయించి అయొడిన్ రాసి మొదటి అంతస్తుకు పంపారు. నేను మాత్రం కిటికీలకు దూరంగానే వుండిపోయాను.

ఈ రోజుల్లోనే అమ్మ నన్ను చూడటానికి వచ్చింది. ఎలాగో ఆశ్రమంలోనుంచి బైటపడి మాకు మళ్లీ ఒక గూడు ఏర్పాటు చేసే ప్రయత్నంలో వుంది. అమ్మ వస్తుంటే నాకు పూలగుత్తి వచ్చినట్లే అనిపించింది. చాలా క్రొత్తగా అందంగా వుంది. ఆమెను చూసి నా అయొడిన్ రంగు గుండుతో, సిగ్గుతో దిగులుపడి పోయాను. 'అమ్మా... మీ అబ్బాయిని ఈ రకంగా చూపిస్తున్నందుకు క్షమించాలి' అంది నర్సు. అమ్మ నన్ను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని "నా బంగారం ఎలా వున్నా నా ప్రేమ తగ్గుతుందా?" అంటూ నవ్వింది.

ఆ తర్వాత నేను హాన్‌వెల్ బడి వదిలాను. సిడ్నీ 'ఎక్స్‌మౌత్' నౌకా శిక్షణలోనుంచి బైటకు వచ్చాడు. ముగ్గురం కలిసి అమ్మ తీసుకున్న గదిలో, అదీ కెన్నింగ్‌టన్ పార్క్

వెనుకనే వున్నాము. ఇప్పుడు అమ్మ ఎలాగో మమ్మల్ని పోషించటానికి ఏర్పాటు చేసుకుంది. ఈ ముచ్చట ఎక్కువ రోజులు గడవలేదు. అమ్మకు ఎక్కడా పని దొరకలేదు. నాన్న ఇచ్చే భరణం పూర్తిగా ఆగిపోయింది. చివరికి రోజులు గడపటం కష్టమైపోయింది.

గతిలేక మళ్ళీ ఆశ్రమాన్నే ఆశ్రయించాము. అది వేరేచోటు. ఈసారి నార్‌వుడ్ స్కూలుకు పంపారు. ఇది హాన్‌వెల్ కంటే మెరుగు. పరిసరాలు, చుట్టూవున్న పొలాలు చాలా బాగుండేవి. అయినా మా గుండెల్లో సంతోషం మాత్రం లేదు.

ఒక సాయంత్రం సిడ్నీ ఫుట్‌బాల్ ఆడుతుండగా ఇద్దరు నర్సులు వచ్చి అన్నను పిలిచారు. ఆట ఆపి వారితో వెళ్లిన సిడ్నీకి వారు ఒక పిడుగులాంటి కబురు చెప్పారు. అమ్మకు మతి భ్రమించింది! 'కేన్‌హిల్' మానసిక రోగ వైద్యశాలకు పంపారు అని కూడా అన్నారు. ఈ కబురు విన్నప్పుడు సిడ్నీ పెద్దగా స్పందించలేదు. ఆటలలోనే ఉండిపోయాడు. ఆట అయిన తర్వాత ఒంటరిగా కూర్చుని ఏడ్చాడు. అన్న నాకీ విషయం చెప్పినపుడు నాకు ఏడుపు రాలేదు. కాని ఏదో నిర్వేదం నన్ను ఆవరించింది. అమ్మ ఎందుకిలా చేసింది? ఎప్పుడూ ఎంతో సంతోషంగా తేలికగా వుండేది! ఎలా మతిభ్రమిస్తుంది? ఆమె పేదరికాన్ని భరించలేక ఇలా అయిపోయిందని అనుకున్నాను! బాధాకరంగా, ఒక శూన్యంలోకి వెళ్లిపోయిందని అనుకున్నాను.

తర్వాత వారంరోజులకు మాకు ఉత్తరం వచ్చింది. అంతే కాదు న్యాయస్థానం మా బాధ్యత నాన్నకు అప్పగించినట్లు కూడా వర్తమానం వచ్చింది. నాన్నతో కలిసి వుంటాము అన్న ఆలోచనే నాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. ఇంతవరకు నాన్నను రెండుసార్లు చూశాను. కెన్నింగ్‌టన్ రోడ్‌లో ఒక ఇంటిముందు నుంచి వెళ్తూ ఆయన్ను చూశాను. ఆయన మా నాన్న అన్న సహజమైన స్పందన కల్గింది. నేను అక్కడ వుండగానే, ఆయన ఒకామెతో కలిసి ఆ దారిలోకి వచ్చాడు. నన్ను చూసి దగ్గరగా పిలిచాడు. నీ పేరేమిటి అనికూడా అన్నాడు. 'చార్లీ చాప్లిన్' అని అన్నానపుడు. ఆమెవైపు చూసి, చేతిలో చెయ్యిపెట్టి నాకు కొంత డబ్బు తీసి యిచ్చాడు. అంతే ఇంటికి పరిగెత్తి నాన్నను కలిసినట్టు అమ్మతో చెప్పాను! ఏమయినా ఇప్పుడు నాన్నతో కలిసి వుంటాము. అంతేకాదు కెన్నింగ్‌టన్ రోడ్ బాగా తెలిసినచోటు నార్‌వుడ్‌లాగా అపరిచితంగా కొత్తది కాదు కదా.

చాప్లిన్ తండ్రి

అధికారులు మమ్మల్ని కెన్నింగ్‌టన్ రోడ్‌లోని 287 నంబరు ఇంటికి తీసుకువెళ్లారు. అదేచోట నేను నాన్నను అంతకు పూర్వం కలిసింది కూడా. ఇప్పుడు తలుపు తీసింది అప్పుడు నాన్నతో వున్న ఆమెనే! పొడవుగా ఆకర్షణీయంగా వున్నా ఏదో దిగులుతో ఉన్నట్లు అన్పించింది. ముప్పయి లోపే వుంటుంది ఆమె వయసు. చక్కని కళ్లు, చిక్కని పెదవులు! ఆమె పేరే లూసీ! అప్పుడు నాన్న ఇంట్లో లేనట్లుంది. కాగితాల మీద సంతకం పెట్టించుకుని మమ్మల్ని లూసీకి అప్పగించి అధికారులు వెళ్లిపోయారు. లూసీ మమ్మల్ని మెట్లెక్కించి అక్కడ చిన్న హాలులోకి తీసుకువెళ్లింది.

అక్కడే చిన్నిబాబు ఆడుకుంటున్నాడు. ఉంగరాల జుట్టు, ఎంతో ముద్దుగా బొద్దుగా వున్నాడు. మూడు నాలుగేళ్లుంటాయి. వీడే నాకు దాయాది అన్నమాట!

ఆ యింటికి రెండుగదులే వున్నాయి. వెల్తురుకూడా మాసిపోయినట్లు, లూసీలాగా దిగులుగానే వుంది. గోడలకున్న పూల కాగితాలూ, మిగతా సామాన్లూ అన్ని విచారంగానే వున్నట్లున్నాయి.

వెనక గదిలో సిడ్నీకోసం మరొక మంచం వేసింది. నన్నుకూడా అక్కడే పడుకోమంది. అదీ మరీ చిన్నగా వుందని సిడ్నీ సోఫాలో పడుకుంటానని అన్నాడు. "నేను ఎక్కడ చెప్పానో అక్కడే పడుకో" అని లూసీ గట్టిగానే అంది. అంతే అంతా నిశ్శబ్దం అయిపోయింది. మా రాక ఆమెకేమీ ఆనందం కాదని మాకు తెలుసు. మేము భౌతికంగానో ఆర్థికంగానో ఆమెపై భారమే కదా! తినటానికి ఏదో తయారు చేస్తోంది. సిడ్నీతో బొగ్గు బుట్ట తెమ్మంది. నావైపు తిరిగి 'ఆ మూల కొట్టుకువెళ్ళి మాంసం కొని తీసుకురా' అని పురమాయించింది. నాకు మళ్లీ నార్‌వుడ్ బడిరోజులు గుర్తుకు వస్తున్నాయి. నాన్న చాలా ఆలస్యంగా ఇంటికి చేరి రాగానే మమ్మల్ని పలకరించాడు. భోజనాల దగ్గర ఆయన ప్రతి కదలికా గమనించాను. ఏ పనిచేసినా చాలా కళాత్మకంగా చేస్తున్నట్లుంది. కత్తితో మాంసం ముక్కను కోస్తుంటే పెన్నుతో వ్రాస్తున్నట్లు అనిపించేది. నేను చాలాకాలం ఆ విధంగానే చేయటానికి ప్రయత్నించాను.

లూసీ, సిడ్నీ సంగతి చెప్పింది. మంచం ఇద్దరికి ఇరుకుగా వుంటుంది, అన్న సంగతి. నాన్న సిడ్నీని సోఫాలో పడుకోమన్నాడు. ఇది సిడ్ని విజయంగా భావించి లూసీ (మా మారుటమ్మ) మామీద లోపల కోపం పెట్టుకుంది. సిడ్నీని ఎప్పటికీ క్షమించలేదు సరికదా నాన్నతో పితూరులు చెప్పేది. కాని నన్ను ఎప్పుడు బెదిరించటం కాని, కొట్టటం కాని చేయలేదు. నాకు మాత్రం భయం పోలేదు. దానికి తోడు లూసీ ఎక్కువగా తాగేది కూడా. నా భయాన్ని ఇది మరీ ఎక్కువ చేసింది. సిడ్నీ చదువుకుంటునే పనికి వెళ్తుండేవాడు. మారుటమ్మ మమ్మల్ని కెన్నింగ్‌టన్ రోడ్ స్కూలుకి పంపింది. మిగతా పిల్లల మధ్య నాకు కొంత స్వాంతన దొరికేది.

శనివారం ఒకపూట శెలవు. ఇంటికి వచ్చి గరిటలు, కత్తులు కడుగుతున్నాను. లూసీ తన స్నేహితురాలితో కూర్చొని తాగుతూ అన్న గురించి ఏదో వాగుతోంది. అప్పుడు నన్ను గురించి "వాడితో బాధలేదు. ఇంకొకడున్నాడు చూశావూ, వాణ్ణి పంపించివేయాలి. వాడు చార్లీ కొడుకు కూడా కాదు!" అంది.

ఇది మరింతగా నన్ను కుంగదీసింది. ఆ రాత్రి నిద్రపోలేదు. నా జీవితంలో అదే సుదీర్ఘమైన విషాదమైన చీకటి రాత్రి!

శనివారం రాత్రులే, నేను దిగులుగా వున్నప్పుడే బజారులోనుంచి ఏదో పాట వినపడేది. అల్లరి కుర్రాళ్లూ చిల్లరి ఆడాళ్లూ, పాడుకుంటూ వెళ్లేవాళ్లు. ఆ గోల నా దిగులును లెక్కచేయనట్లే వున్నా, అది దూరమవుతూంటే ఇంకా దిగులుగా వుండేది. ఒక్కోసారి ఆయిస్టర్లు అమ్మేవాడు ఏదో పాడుతుండేవాడు. నిజానికి ఆ పాట అప్పట్లో బాగా వాడుకలో వుంది.

ఎందుకు మనకు ఈ శత్రుత్వం – పాతరోజులు గుర్తులేవా?

నన్ను క్షమించి – నా తప్పులు మర్చిపోలేవా?

అరె జీవితం చిన్నది – ఎందుకు పోట్లాడుకోవటం?

హృదయం విలువైనది – ఎందుకు పగలగొట్టుకోవటం?

మనం మిత్రులంగానే వుందాము – పాతరోజుల్లోలాగానే!

ఇలా సాగేది పాట. దాని భావం ఎంత మంచిదయినా, నేనున్న పరిస్థితులకు అంతగా పట్టేదికాదు. నా నిద్రకు ఉపకరించేదీ కాదు!

సిడ్నీ రోజూ రాత్రిళ్లు ఆలస్యంగానే వచ్చేవాడు.

లూసీ తాగుతూనే వుండేది. ఒకరాత్రి సిడ్నీ మీదకు వచ్చి దుప్పట్లు లాగివేసి ఇంట్లోనుంచి పొమ్మంది. సిడ్నీ దీనికి సిద్ధంగానే వున్నాడు. దిండు కిందనుంచి ఒక కర్ర తీసి చివర సూదిగా చెక్కివుంది.

"దగ్గరకొస్తే పొడిచేస్తా" అని బెదిరించాడు.

"ఏమిటి చంపుతావా?" అని రెట్టించింది. "ఆఁ. సందేహం లేదు" అని నమ్మకంగా అన్నాడు.

"మీ నాన్నను రానీ నీపని చెప్తా" అని మళ్ళీ తాగటం మొదలు పెట్టింది. కాని, నాన్న చాలారాత్రులు ఇంటికి వచ్చేవాడు కాదు.

తర్వాత, ఇక శనివారం రాత్రి, నాన్నా మారుటమ్మ లూసీ తాగుతూ కూర్చున్నారు. నేనూ, సిడ్నీ ఆ యింటి సొంత దారుతో ముందు గదిలో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాము. ఆ చాలీ చాలని వెలుతురులో నాన్నని చూస్తుంటే నాకు చాలా దిగులువేసింది. ఆయన ముఖాన కళే లేదు. ఆయనలో ఆయనే గొణుక్కుంటున్నాడు. ఏమయిందో ఏమిటో గట్టిగా అరుస్తూ జేబులో నుంచి డబ్బులు తీసి నేలకేసి కొట్టాడు. దాంట్లో బంగారు నాణాలు కూడా ఉన్నాయి. ఒకటి దొర్లుకుంటూ గది మూలకు పోయింది. నేను దానినే చూస్తున్నాను. నాతోపాటు ఇంటిదారు కూడా ఆ నాణాన్నే చూస్తోంది. అదేదో అవాస్తవమైన సంఘనటలా అన్పించింది. ఎందుకైనా మంచిదని నేను తొందరగా లేచి బంగారు నాణాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాను. ఎవరికి దొరికింది వాళ్ళు పట్టుకున్నారు. నాన్న తీక్షణంగా చూస్తూనే వున్నాడు!

మరో శనివారం మధ్యాహ్నం బడిలోంచి నేను తొందరగా వచ్చేశాను. ఇంట్లో ఎవ్వరూ లేరు. సిడ్నీ రోజంతా ఫుట్‌బాల్ ఆడుతుంటాడు. కొంతసేపు ఇంట్లో ఎవ్వరూ లేకపోవటంతో నాకు చాలా బాగున్నట్లు అనిపించింది. కాని సమయం గడిచినకొద్దీ నాకు ఆందోళన ఎక్కువైంది. ఏమిటి నన్ను వదిలి అందరూ వెళ్ళిపోయారా? అని అనుమానం వచ్చింది. తర్వాత ఆకలికూడా వేసింది. అంతా వెతికాను. కాని ఇంట్లో తినేందుకు ఏమీ లేదు. ఖాళీ ఇంటిలో వుండలేక బయటకు వెళ్లి ప్రక్కన దుకాణులున్నచోటుకు వెళ్లి తిరిగాను. లాంబెత్‌వాక్, కట్ అన్ని తిరిగాను. ఆకలితో

తినుబండారాలను చూస్తూండిపోయాను. అక్కడ అమ్మే చిల్లర సామాను చూస్తూ – ఆకలిని మరచిపోయాను. చివరికి ఇంటికి వచ్చి తలుపు కొట్టాను. ఎవ్వరూ లేరు. మళ్లీ కెన్నింగ్ టన్ క్రాస్‌కి వచ్చి చిన్న అరుగుమీద కూర్చుండిపోయాను. కొట్లు అన్నీ మూసేస్తున్నారు. దీపాలన్నీ చీకటైపోతున్నాయి. ఒక్క మందుల దుకాణం మాత్రం తెరిచి వుంది. అంతలో ప్రక్కనున్న పబ్‌లోనుంచి సంగీతం వినపడింది. ఆ ఖాళీ ప్రదేశంలో అది మార్మోగింది. నిజానికి 'హనీ సకిల్ –బీ' హార్మొనియం మీద వాయించేవాళ్లు పబ్ బైటే వున్నారు. నేను దగ్గరగా వెళ్లాను. ఇంత మధురమైన పాట హార్మోనియం, క్లారినెట్‌మీద నేను ఎప్పుడూ వినలేదు. నేనున్న స్థితిలో ఆ పాట నాకు ఎంతో ఆనందాన్నీ, హాయినీ కలిగించింది. దగ్గరగా వెళ్లి చూశాను. హార్మోనీ వాయించే పెద్దమనిషికి కళ్లు లేవు. కళ్ల స్థానంలో రెండు గుంటలే వున్నాయి. అంతలోనే అంతా అయిపోయింది. వాళ్లుకూడా మెల్లగా వెళ్లిపోయారు. మళ్లీ నీరసంగా, అలసిపోయి ఇంటిదారి పట్టాను. ఇంటికెళ్లి మంచంమీద పడి నిద్రపోవాలని తపించిపోయాను.

నేను చూస్తుండగానే మారుటమ్మ కుంటుతూ ఇంటివైపు వెళ్తోంది. ఆమెకంటే ముందు మా తమ్ముడు పరుగెత్తుతున్నాడు. ఆమె నడక చూసి కాలికి దెబ్బ తగిలిందని అనుకున్నాను. కాదు ఆమె బాగా తాగి తూలుతోంది. ఎందుకైనా మంచిదని నేను కనపడకుండా ఆమె ఇంట్లోకి వెళ్లేవరకూ ఆగాను. మరికాసేపటికి ఇంటి సొంత దారు వచ్చింది. నేను ఆమెతో ఇంట్లోకి వెళ్లాను. మెల్లగా మెట్లెక్కి నా గదిలోకి వెళ్తున్నాను. అంతలోనే లూసీ చూసినట్లుంది. 'ఏయ్ ఎక్కడికి వెళ్తున్నావు? ఇది నీ యిల్లు కాదు. ఇక్కడుండటానికి కుదరదు. బయటకు పో' అని అరుస్తోంది.

ఆమెతో ఘర్షణ ఇష్టంలేక వెనక్కు తిరిగి వీధిలోకి వచ్చేశాను. ఇప్పుడు నాకు అలసట తెలీలేదు. నాన్న 'క్వీన్స్‌హెడ్ పబ్'లో వుంటాడని తెలుసు. ఆయన్ను కలవటానికి బయలుదేరాను. ఇంతలో ఆయనే నాకు ఎదురైనాడు. 'నన్ను ఇంట్లోకి రానివ్వలేదు, బాగా తాగి వుంది...' అని గొణిగాను. నాన్నకూడా పూర్తి స్పృహలో లేడు. 'అరే, నేను కూడా తాగి వున్నాను' అంటున్నాడు. మెల్లగా ఇంటికి చేరాము. తలుపు తీసి హాలులో కూర్చొనేచోట లూసీ కోసం చూశాడు. చలిమంట దగ్గర తూగుతూ వుంది. "వాడినెందుకు ఇంట్లోకి రానివ్వలేదు?" అని అడిగాడు. "కావాలంటే నువ్వుకూడా పో" అని అరుస్తోంది. ఒక్కసారిగా నాన్న ఆ ప్రక్కనున్న బూజు కర్ర తీసి ఆమెను కొట్టాడు. అది ముఖానికి

తగిలి ఆమె కిందపడి స్పృహతప్పింది. తర్వాత ఏమి జరిగిందో ఇప్పుడు గుర్తుకు రావటం లేదు. తర్వాత సిడ్నీ చెప్పాడు ప్రొద్దున్నే నాన్న లూసీతో పోట్లాడి వెళ్లిపోయాడనీ, ఆ రోజంతా నాన్న – తమ్ముడు ఇంట్లోనే వున్నాడనీ (స్పెన్సర్ చాప్లిన్) లూసీకి అది ఇష్టం లేదనీ.

మారుటమ్మకు నాన్నంటే చాలా ఇష్టం. నాన్నకూడా ఆమెనెంతో ప్రేమించేవాడు, మామూలుగా వున్నపుడు. ప్రొద్దున్న ఫలహారం చేసేటప్పుడు మాకు ఎన్నో కబుర్లు చెప్పేవాడు. రాత్రిళ్లు ఆయన ధియేటరుకి వెళ్లేముందు లూసీని ముద్దు పెట్టుకొని వీడ్కోలు చెప్పేవాడు. మా తమ్ముణ్ణి నవ్వుతూ ఆడించేవాడు. రోజూ రాత్రిపూట రెండు మూడు ధియేటర్లలో వేషాలు వేసేవాడు. రైసుతో ఆరు గుడ్లు తినేవాడు. అదీ ఆహారం. నాటకం అయిన తర్వాత తాగుతూ గడిపేవాడు. అలాగే తెల్లారిపోయేది.

ఒకసారి నన్నూ, సిడ్నీనీ బైటబెట్టి తలుపువేసింది. అప్పుడు మేము ఎక్కడో రోడ్డు ప్రక్క చలిమంట ప్రక్క నిద్రపోతుంటే పోలీసులు వచ్చి ఇంటికి చేర్చారు. తర్వాత లూసీకి తాఖీదు వచ్చింది, పిల్లలను దయగా చూడకుండా హింసించినందుకు.

తర్వాత నాన్న ఎక్కడో వేరే వూళ్లో నాటకాలకు వెళ్ళినపుడు లూసీకి ఒక ఉత్తరం వచ్చింది, అమ్మకు తగ్గింది, బైటకు వస్తోంది ఆసుపత్రి నుంచి అని.

ఆ తర్వాత రెండు రోజులకు ఇంటి ముందు ఒకామె నిలబడి వుంది. లూసీ 'అదిగో మీ అమ్మ' అన్నప్పుడు మేము నమ్మలేదు. కాని సిడ్నీ వెళ్లి ఆమెను కౌగిలించుకున్నాడు. వెనకా నేనుకూడా పరుగెత్తాను! అవును మా అమ్మే – మా ప్రియమైన అమ్మే వచ్చింది!

అమ్మకు లూసీని కలవటం చిరాకుగా వుందనుకుంటాను. బైటనే వుండిపోయింది. మేము మా సామాను తీసుకుని అమ్మ దగ్గరకు వచ్చాము. మాకు దగ్గరుండి వీడ్కోలు చెప్పింది లూసీ మంచిగా!

అమ్మ అప్పటికే కిన్నింగ్‌టన్ క్రాస్ వెనకాల ఒక గది తీసుకుంది. చివరికి ముగ్గురం కలిసి వుంటున్నాము. ప్రక్కనే పచ్చళ్ల ఫ్యాక్టరీ వుండేది. మధ్యహ్నానానికి ఘాటయిన వాసన వస్తుండేది. ఆ గది ఎలా వున్నా మా ముగ్గుర్నీ కలిపి వుంచింది కదా! అమ్మ ఆరోగ్యం అద్భుతంగా వుంది. ఆమె జబ్బు పడిందని నమ్మలేకపోయాం.

సిడ్నీ చాప్లిన్

అప్పుడు రోజులెలా గడిచాయి? ఇప్పుడేమీ చెప్పలేను. రోజులు సాఫీగానే గడిచిపోతున్నాయి. నాన్న వారం వారం పది షిల్లింగులు పంపుతున్నాడు. మళ్లీ అమ్మ బట్టలు కుట్టడం మొదలు పెట్టింది. చర్చికి కూడా వెళ్తోంది.

ఒక్క విషయం మాత్రం గుర్తుంది. మా వీధి చివర ఒక కసాయి కొట్టు వుంది. రోజూ ప్రొద్దున్న గొర్రెలు మా ఇంటి ముందునుంచే వెళ్తుండేవి. నాకు ఒకటి తప్పించుకుని పారిపోవటం గుర్తుంది. చూస్తున్నవాడు దాన్ని పట్టుకుందామని ప్రయత్నం చేశారు. అది అటూ ఇటూ పరిగిడుతూ వాళ్లను పడగొట్టింది. ఇదంతా నాకు తమాషాగా అన్పించింది. చివరికి దాన్ని పట్టుకొని కసాయి దగ్గరకు తీసుకుపోయారు. అప్పుడు తర్వాత జరగబోయేది గుర్తు వచ్చి, ఏడుపు ఆపుకోలేక అమ్మను పట్టుకుని "అమ్మా దాన్ని చంపేస్తున్నారు– చంపేస్తున్నారు" అని అరిచాను. అది పారిపోయినప్పుడు నాకు ఎంత నవ్వొచ్చిందో. ఆ తర్వాత విషాదం నన్ను చాలాకాలం వెన్నాడింది. ఈ సంఘటన తర్వాత నా సినిమాల్లో ఈ కామెడీ–ట్రాజెడీ కలగలసిన స్థితి ఉపయోగపడింది.

మళ్లీ స్కూలుకెళ్తున్నాము. చరిత్ర, కవిత్వం, విజ్ఞాన శాస్త్రం అన్నీ నాకు క్రొత్త విషయాలు నేర్పుతున్నారు. నాకు లెక్కలు అంత ఉత్సాహాన్నిచ్చేవి కావు. ఇంక చరిత్ర అంతా ఏముంది? రాజులు సింహాసనాల కోసం యుద్ధాలుచేసి చంపటం – అన్నదమ్ముల్నీ, భార్యా బిడ్డలూ అన్న దయ లేకుండా మారణకాండకు పాల్పడటం. జాగ్రఫీ అంటే అంతా మాపులు. ఇంక కవిత్వం. కంఠతా పట్టడమే! నాకు చదువు చెప్పినవాళ్లు వీటిలో దేనిమీదనైనా నాకు ఇష్టం కలిగేటట్లు చేసుంటే, నేను పండితుణ్ణే అయ్యేవాడిని.

కానీ అమ్మ తిరిగి రావటంతో నాకు మళ్లీ రంగస్థలం మీద ఉత్సాహం కలిగింది. అమ్మకూడా నాలో ఆ మెళకువలున్నాయి (టాలెంట్) అనే ప్రోత్సాహమిచ్చింది. కాని క్రిస్‌మస్ వచ్చేవరకూ బడిలో 'సిండరిల్లా' నాటకంలో నా ప్రతిభ అంతా చూపాలనే ప్రయత్నించాను. కాని బడిలో నాకు ఆ అవకాశం రాలేదు. 'సిండరిల్లా'కు ఎన్నుకోబడిననాళ్లు వేషం వేయాలి. నాకు చాలా నిరుత్సాహం కలిగింది. వేసిన వాళ్లుకూడా చాలా చెత్తగా వేయడంతో నా బాధ మరీ ఎక్కువైంది. కాని 'సిండరిల్ల' వేసిన అమ్మాయి చాలా అందంగా వుంది. ఆమె అక్కలుగా వేసిన వాళ్లు మాత్రం ఘోరంగా వున్నారు.

'సిండరిల్ల'ను నేను ప్రేమించాను కూడా. కాని ఆమె నాకంటే చాలా పెద్దది.

తర్వాత రెండునెలల తర్వాత నన్ను అన్ని తరగతులకూ తీసుకువెళ్లి "మిస్ ప్రిసిల్లా-పిల్లి" పాడించారు. అది చాలా హాస్యంగా వుంటుంది. ఇది నాకు అమ్మ నేర్పింది. నేను నేర్చుకుని బడిలో ఒకసారి పాడాను. మా టీచరు చూసి, దానిలో వున్న హాస్యానికి నవ్వుకుని, బడిపిల్లల్ని అందర్ని చేర్చి నన్ను పాడమన్నాడు. అంతే, ఇక నవ్వులే నవ్వులు. దానితో నేను చాలా పేరు సంపాదించాను. మొగపిల్లలూ, ఆడపిల్లలూ నా చుట్టు చేరేవాళ్లు.

ఒకసారి అమ్మబదులు నేను స్టేజీమీదకు వెళ్లాను. అదే మొదటిసారి అయినా అసలు నేను నిజంగా ప్రదర్శన ఇచ్చింది ఈ పాటతోనే. పదిమందీ బాగుందని మెచ్చుకుంటే దానిలోవచ్చే మజాకూడా ఇప్పుడే తెలిసింది.

బడిపిల్లల మధ్య కాదు, ఉపాధ్యాయులుకూడా నన్ను ప్రత్యేకంగా చూసేవారు. దానితో నా చదువుకూడా బాగా సాగింది.

తర్వాత 'క్లాగ్ డాన్సర్' ట్రూపులో చేరటానికి స్కూలు మానవలసి వచ్చింది. క్లాగ్ డాన్సర్లే అంటే "ఎనిమిదిమంది లాంక్‌షైర్ లాడ్స్" అన్నమాట.

మూడవ అధ్యాయం

రంగప్రవేశం

నాన్నకు జాక్సన్ తెలుసు. ఆయనే ఈ ట్రూప్ నడుపుతున్నారు. అమ్మను నాన్న ఒప్పించాడు. "ఇది చార్లీకి మంచి జీవనోపాధిగా వుంటుంది. మంచి వృత్తిగా అభివృద్ధి చేసుకోవచ్చు. అతనికి ఉండటానికీ, తినటానికీ వాళ్లు చూస్తారు. అంతేగాక వారానికింతని నీకు వస్తుంది." ఇలా ఎన్నో చెప్పిన తర్వాత అమ్మ జాక్సన్‌ని కలిసిన తర్వాత అంగీకరించింది!

జాక్సన్‌కి యాభైఏళ్లు దాటివుంటాయి. అంతకుముందు బడిపంతులుగా చేసాడు. లాంక్‌షైర్‌లో ముగ్గురబ్బాయిలూ, ఒక అమ్మాయీ ఆయన పిల్లలు. చాలా దైవభక్తి కలవాడు. మొదటి భార్య చనిపోయిన తర్వాత తన సంతానం అంగీకారంతో మళ్లీ పెళ్లి చేసుకుందామని, దిన పత్రికలో ప్రకటన ఇచ్చాడు. మూడు వందలపైగా దరఖాస్తులు వచ్చాయి. దేవుణ్ణి తలచుకుని ఒక దరఖాస్తు తీసాడు! ఆమే ఇప్పటి భార్య. ఆమెకూడా బడిపంతులే. ఆమెకూడా దైవభక్తి కలదే.

వీళ్లిద్దరికీ (ఈమె జాక్సన్‌కంటే వయసులో పెద్దది!) మళ్లీ ఒక కొడుకు! ఆమె ఈ ట్రూప్‌నంతటినీ బాగా నిర్వహించేది. జాక్సన్‌కి చాలా నమ్మకంగా చేదోడువాదోడుగా వుండేది. కానీ, ఆమె, ట్రూపు విషయం వచ్చేసరికి "పెళ్లి కాగానే ఎనిమిది మంది పిల్లలతో కాపురం చేయాలని అనుకోలేదు" అంటుండేది.

ప్రతి ఆదివారం వాళ్లందరూ కాథలిక్ చర్చికి వెళ్లేవాళ్లు. నేను ప్రొటెస్టెంటు కదా (అమ్మ మూలంగా), నేను ఇంటిదగ్గరే వుండిపోయేవాడిని. అప్పుడప్పుడూ నేనూ వాళ్లతో చర్చికి వెళ్లేవాడిని. నాకు ఆ కాథలిక్ మార్మికత బాగా నచ్చేది. ఇంట్లోనే వీరు బొమ్మ

కొవ్వొత్తులూ పూలూ ఇవన్నీ పెట్టడం కూడా నచ్చేది. మేరీ మాత ముందు వాళ్లు క్రాస్ పద్ధతిలో మ్రొక్కటం కూడా చాలా నాటకీయంగా వుండేది.

ఆరు వారాలు బాగా శిక్షణ పొంది ట్రూపుతో నేను కలిసి నాట్యం చేయటం మొదలుపెట్టాను. చిన్నప్పటి ధైర్యం ఇప్పుడు లేదు. ప్రేక్షకుల ముందు నా కాళ్లు వణకటం మొదలయింది! చాలా వారాలకు కాని మళ్లీ మామూలుగా మిగతా వాళ్ళలాగా నాట్యం చేయలేకపోయాను. కాని గుంపులో గోవిందాలాగా వుండటం నాకిష్టంలేదు. ప్రత్యేకంగా నా అంతట నేను ఏదయినా ప్రదర్శన ఇవ్వాలనీ, అదీ హాస్యంగా వుండాలనీ అనుకునేవాడిని. ఎంతసేపూ కుర్ర జోకర్‌గా హాస్యగాడిగా స్టేజిమీద ఒంటరిగా వుండాలనే అనుకునేవాడిని. కాని చివరికి నా ప్రణాళిక ఇద్దరి ముగ్గురితో చెప్పాను. కనీసం ఇద్దరం కలిసి హాస్యంగా నటిద్దాం అని. ఒకతనితో జతకట్టాను. ఇద్దరం బ్రిల్ అండ్ చార్లీ 'మిల్లినీయర్ ట్రాంప్స్' అని పేరు పెట్టాం. మీసాలు పెట్టుకుని ఉంగరాలు పెట్టుకుని హాస్యం పుట్టించాలని ప్రణాళికలు వేశాను. కాని ఇది ఎప్పటికీ నిజం కాలేదు.

చివరికి 'లాంక్‌షైర్ లాడ్స్' లాగానే స్టేజీమీద ఆడడం ప్రతి రాత్రి రెండు మూడు ప్రదర్శనలు, రెండు మూడుచోట్ల ఇవ్వటం మామూలు అయిపోయింది. మాకు మేకప్‌కూడా వేసేవాళ్లు కాదు. సహజంగా వుంటేనే ప్రేక్షకులకు నచ్చుతుందని జాక్సన్ అనేవాడు. లండన్ బైట వూళ్లలో ప్రదర్శనలకు వెళ్లినప్పుడు పగలు ఏదో బడికి పంపేవారు. కాని ఇది నా చదువుకేమీ ఉపయోగపడలేదు.

క్రిస్టమస్ రోజుల్లో 'సిండరిల్లా' ఆడేవారు. ఆందులో కుక్కల పిల్లుల పాత్రలు మేము వేసేవాళ్లం. లండన్‌లో అప్పుడే హిప్పోడ్రోం కట్టారు. ఆ రోజుల్లో అది కొత్తది. నాటకాలకీ సర్కస్‌కీ పనికి వచ్చేది. మధ్యలో స్టేజీ వుండేది. ఆ స్టేజీ, క్రిందికి దిగిపోయేది. తర్వాత నీళ్లతో నింపి వేసేవారు.

అందమైన అమ్మాయిలు వచ్చి నీళ్లలోకి దిగి మాయమైపోయేవారు. మార్సెలీన్ – ఈయన చాల గొప్ప ఫ్రెంచ్ హాస్యగాడు. గాలంతో వచ్చి అక్కడ చిన్న బల్లమీద కూర్చొని, చిన్న నగలు డైమండు దండ గాలం ద్వారా నీళ్లలోకి వదిలేవాడు. గాలానికి ఏదో తగిలి లాగుతున్నట్లు నటించేవాడు. చివరికి గట్టిగా పైకి లాగేవాడు. చిన్న కుక్కపిల్ల వచ్చేది. అది మార్సిలీన్ ఏమి చేస్తే ఆ పనే చేసేది. కూర్చుని తల క్రిందపెడితే, అదీ

అలాగే చేసేది. మార్సిలీన్ హాస్యం చాలా బాగుండేది. ప్రేక్షకులు పడిపడీ నవ్వేవాళ్లు. ఒకసారి నాకు ఒక పిల్లివేషం ఆయనతోపాటు వేసే అవకాశం వచ్చింది. ఒక కుక్కను తప్పించుకోవటానికి వచ్చి నా మీద పడేవాడు. నేను పాలు తాగుతున్నట్లు నటించాలి. ఆయన పడినపుడు నేను వెనక్కి వంగటం లేదని గోలచేసేవాడు. ఒకసారి ఒక కుక్క వెనక్కు వెళ్లి వాసన చూడటం మొదలుపెట్టాను (పిల్లి వేషంలో). ప్రేక్షకులు నవ్వారు. వాళ్లవంక చూసి మళ్లీ వాసన చూశాను. వాళ్లు ఇంకా నవ్వారు. కన్ను మూసి మళ్లీ అదే చేశాను. ఈసారి వాళ్లు పడీపడీ నవ్వారు. అట్లా రెండు మూడుసార్లు చేసి, చివరికి మేనేజర్, ప్రక్కనుంచి కోపంగా చూస్తుంటే ప్రక్కకు వెళ్లిపోయాను.

సిండరిల్లా బాగా ఆడింది. మార్సిలీన్‌కి అసలు కథలో ఏమీ సంబంధం లేదు, అయినా అసలు స్టార్ ఆయనే!

చాలకాలం తర్వాత న్యూయార్క్ హిప్పోడ్రోంలో కూడా మార్సిలీన్‌కి గొప్ప పేరు వుండేది. హిప్పోడ్రోం సర్కస్ రింగ్ తీసివేసిన తర్వాత మార్సిలీన్‌ని అందరూ మర్చిపోయారు! 1918లో అనుకుంటా, రింగ్ వింగ్ బ్రదర్స్ సర్కస్‌లో ఆయన్ను మళ్లీ తీసుకున్నారు లాస్ ఏంజిల్స్‌లో. కాని పదిమందిలో ఆయన ఒకడుగానే ఉండిపోతాడు. అప్పుడు ఒకసారి నేను వెళ్లి పలకరించాను. పాత విషయం గుర్తుకూడా చేశాను. ఆయన నిర్లిప్తంగానే వుండిపోయాడు. ఇది జరిగిన సంవత్సరానికి న్యూయార్క్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు, ఆయన గదిలో పిస్తోలుతో. అప్పుడు "మూన్ లైట్ రోజెస్" అని రికార్డు తిరుగుతూనే వుంది. ఈ సందర్భంలోనే ఒక విషయం ఇంకా కొన్ని చెప్పాలి.

చాలామంది పేరు గడించిన ఇంగ్లీషు హాస్యగాళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. టి-యి. డన్ విల్లి. చాలా గొప్ప హాస్యగాడు. ఒకసారి ఏదో బార్‌కి వెళ్తే "ఇక వీడి పని అయిపోయిందిరా" అని ఎవరో అనడం విని థేమ్స్ నది వడ్డుకు వచ్చి పిస్తోలుతో కాల్చుకు చచ్చిపోయాడు.

మార్క్ షిరిదాన్ ఇంగ్లాండులో గొప్ప జోకర్. గ్లాస్గోలో పార్క్‌లో కాల్చుకుని చనిపోయాడు.

ఫ్రాంక్ కాయిన్ – ఈయనతో ఒకసారి నేను కూడా నటించాను. చాలా మంచి హాస్యం పండించేవాడు. ఎప్పుడూ నవ్వుతూ నవ్వించేవాడు. ఒక మధ్యాహ్నం భార్యతో

బైటకు బయలుదేరి ఏదో మర్చిపోయినట్లు 'ఇప్పుడే వస్తాను ఉండ'మని, మెట్లెక్కి పైకివెళ్లి ఎంతసేపటికీ రాలేదు. అప్పుడు భార్య పైకి వెళ్లి చూసింది. అప్పటికే రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడు, గొంతు కోసుకొని.

చాలామంది కళాకారులు నేను చిన్నప్పుడే చూసినవాళ్లు. నాకు బాగా నచ్చిన వాళ్లు. వాళ్లకి విజయం పెద్దగా లభించలేదు.

జర్మో అనే సర్కస్ ఫీట్ చేసే 'జగ్లర్' రోజూ గంటలతరబడి సాధనచేసేవాడు. ఎంత బాగా సాధన చేసేవాడంటే బిలియార్డు కర్ర గడ్డంతో నిలబెట్టి, దాని చివర బిలియార్డ్స్ చెక్క బంతి నిలబెట్టేవాడు. ఏ పొరపాటూ చేయకుండా.

అలా సాధన చేసి చేసి, ఒక రాత్రి ప్రేక్షకులముందు ప్రదర్శించటానికి సిద్ధమయ్యాడు. ఏ పొరపాటూ లేకుండా ఆ ట్రిక్కు ఎంతో కష్టమైన ట్రిక్కు ముక్కు క్రింద కర్ర, కర్రమీద బంతి, బంతిమీద బంతి అవలీలగా నిలబెట్టాడు. కాని ప్రేక్షకులకు ఇది చాలా సామాన్యంగా కన్పించింది. పెద్దగా స్పందన లేదు. అప్పుడు మేనేజరు, "చూడు జర్మో, నీవిది చాలా సులభంగా కనపడేట్లు చేశావు. రెండు మూడుసార్లు విఫలమయి కష్టపడి చేసినట్లుంటే, ప్రేక్షకులు బాగా స్పందించేవారు" అని అన్నాడు. అప్పుడు జర్మో "ఇది నిలబెట్టలేనంత గొప్పవాణ్ణి కాదు" అని నవ్వాడు.

జర్మో జోస్యం కూడా చెప్పేవాడు. నన్ను చూసి "నీవేది నేర్చుకున్నా మరచిపోవు, నీకు ఉపయోగపడుతుంది" అనేవాడు.

తర్వాత గ్రిఫిత్ సోదరుల హాస్యం కూడా మొరటుగా వుండేది. ప్రేక్షకులను నవ్వించటానికి వాళ్లు ముఖాలమీద తన్నుకునేవారు. బైట చాలా ప్రేమగా వుండేవారు.

ఆ రోజుల్లో గ్రిమాల్డి గొప్ప హాస్యగానికింద లెక్క. లండన్‌లో నేల టిక్కెట్టుకోసం ప్రేక్షకులు పడి చచ్చేవారు. ఇది అమ్మ గొప్పగా చెప్పేది. ఆడవాళ్లలో మేరీ లాయిడ్. ఆమె పెద్ద తిరుగుబోతుగా ప్రసిద్ధికెక్కింది. ఆమె టివోలీలో ప్రదర్శన ఇచ్చినప్పుడు, స్టేజి వెనకాల చాలా ఆందోళనతో పచార్లు చేస్తుండేది. స్టేజిమీదకు వెళ్లగానే చాలా సులభంగా నటించేది.

బ్రాన్స్‌బీ విలియమ్స్: ఈయన డికెన్సు పాత్రలన్నీ నటించేవాడు. డికెన్సు పుస్తకాలు చదివాడు కూడా. ఆయన ఊరియా హెూప్, బిల్‌సైక్స్ "ఓల్డ్ క్యూరియా సిటీ షాప్"లు,

బ్రాన్స్ బీ చాలా అందంగా వుండేవాడు యువకుడు. ప్రేక్షకులను డికెన్స్ పాత్రలతో ఉ
ర్రూతలూగించేవాడు. అతని మూలంగా నాకు డికెన్స్ పుస్తకాలమీద ఆసక్తి కలిగింది.
అలాగే నేను "ఆలివర్ ట్విస్ట్" కొన్నాను. అది చదివి ఆ పాత్రలతో కలిసిపోయాను.
బ్రాన్స్‌బీ లాగా నటించటం మొదలుపెట్టాను. ఇది జాక్సన్ చూసి నా ప్రతిభను వెంటనే
పసిగట్టాడు. అప్పుడే నన్ను ప్రపంచానికి పరిచయం చేయాలని నిర్ణయించుకున్నాడు.

అలాగే ఒక రాత్రి మిడిల్ బరోలో మా ట్రూపు డాన్సు చేయటానికి స్టేజీమీదకు
రాబోతోంది. అప్పుడు జాక్సన్ మధ్యలోకి వచ్చి "మీకు బ్రాన్స్‌బీ విలియమ్స్ లాగా?"
ఓల్డ్ కూరియాసిటాషావు'లోని ముసలివాడిని పరిచయం చేస్తాను" అని ప్రేక్షకులతో
అంటే, వాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. అప్పటికే వాళ్లకు విసుగుగా వున్నట్లుంది.

అయినా నేను స్టేజీమధ్యలోకి వచ్చాను. తెల్లని డాన్సు బట్టలూ, ఎర్రని బూట్లూ
వేసుకుని, 90 ఏళ్ల ముసలివాడిగా ముఖానికి వేషం వేసారు. ముసలి విగ్గు పెట్టి. అది
నాకు అంతగా పట్టలేదు. ఎందుకంటే నా తల చాలా పెద్దదికదా! అది బట్టతల విగ్గు!
చుట్టు రిమ్ములాగా జుట్టు వుందికూడా. స్టేజీమీదికి ఒంగి నడుచుకుంటూ, ఒక కీటకం
లాగా వచ్చాను. ఇది ప్రేక్షకులకు బాగా నచ్చినట్లుంది. అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు
మొదట్లో. తర్వాత నన్నుచూసి కేకలు వేశారు. అప్పుడు నేను "హుష్ – నిశ్శబ్దం –
లేకపోతే మా నెల్లీ నిద్ర లేస్తుంది" అన్నాను (నెల్లీ అప్పటికే చచ్చిపోయింది) 'గట్టిగా
మాట్లాడు' అని అరుస్తున్నారు. నేను వాళ్లను లెక్క చేయలేదు. నెల్లీకి నిద్రాభంగం
అవుతుందని మెల్లగా మాట్లాడుతున్నాను. అప్పటికి ప్రేక్షకులకు అర్థమయ్యింది. నెల్లీ
చనిపోయినట్లు నాకు తెలీదని – అంతే నా ప్రతిభను ఆ రకంగా జాక్సన్ పరిచయం
చేశారు!

ఈ ట్రూప్‌లో కొన్నాళ్లు బాగానే గడిచింది. కాని జాక్సన్‌కి రోజులు బాగోలేదు.
వచ్చే ఆదాయం మాకు జీతాలివ్వటానికే చాలటం లేదు. అప్పుడు నేనూ, ఇంకొక
కుర్రాడూ సర్కస్ పట్ల సాధనచేసి ఎక్కువ డబ్బు సంపాదించాలని ప్రొద్దున్నే
సాధనచేసేవాళ్లం. తాడుమీద రింగులతో ఒకరోజున పడిపోతే నా బొటనవ్రేలు బెణికింది
కూడా. దానితో ఆ సాధన ఆపివేశాను.

ఈ ట్రూపు డాన్సుతో పాటు ఏదో ఒకటి కొత్తగా ప్రయత్నం చేసేవాణ్ణి. బంతులు
ఎగరవేయటం, పళ్లాలు ఎగరవేయటం, వాటిని–మూడిటిని పట్టుకోవటం బాగా
అలవాటు చేసుకున్నాను. ఇవన్నీ తర్వాత నాకెంతో ఉపయోగపడినాయి.

మూడు నెలల తర్వాత జాక్సన్ మా నాన్నకు సహాయం చేయటానికి (ఆయనకు బాగా జబ్బుచేసింది) ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు. చాలామంది 'వాడవల్లి' నటీనటులు సహాయం చేశారు. జాక్సన్ 'లాంక్‌షైర్ లాడ్స్' కూడా. ఆ రాత్రి నాన్న స్టేజీమీదకు వచ్చాడు. చాలా కష్టంగా ఊపిరి పీలుస్తూ చాలా బాధాకరంగా చిన్న ఉపన్యాసం ఇచ్చాడు. నేను ప్రక్కనే నిలబడ్డాను. ఆయన త్వరలో చనిపోతాడనే నిజం నాకు అప్పుడు తెలీలేదు.

మేము లండన్‌లో వుంటే ప్రతివారం అమ్మను చూసి వచ్చేవాణ్ణి. అమ్మ నన్నుచూసి "ఏమిటిరా చిక్కిపోతున్నావు" అనేది. తర్వాత జాక్సన్‌కి ఉత్తరం రాసింది. ఆయనకు కోపం వచ్చి నన్ను ఇంటికి పంపివేశాడు.

ఆమె అన్నట్లుగానే నాకు ఆస్థ్మా వచ్చింది. అది తగ్గలేదు సరికదా దగ్గు ఎక్కువైంది. నాకు టి.బి. వచ్చిందని అమ్మ నమ్మకం. అందుకనే అన్ని పరీక్షలూ చేయించింది. అన్నీ బాగానే వున్నాయని చెప్పారు. కాని నా ఊపిరితిత్తులు బలహీనమై, ఆస్తమా తగ్గకుండా బాధపెట్టింది. వైద్యుడు "ఇది త్వరలోనే తగ్గిపోతుంది. ఆందోళన అవసరంలేదు" అని చెప్పాడు.

ఈ కాలానికి సంబంధించి నా జ్ఞాపకాలు సరిగా లేవు. అపుడు రోజులు ఎలా గడిచాయి – సిడ్నీ ఏమయ్యాడు, మేము ఎన్ని ఇళ్లు (గదులు–గూళ్లు) మారాము. చివరికి పోనాల్ టెర్రెస్ నం 3కి ఎప్పుడు చేరాము? ఇవన్నీ స్పష్టంగా గుర్తులేవు. కాని మా పేదరికం, మా చుట్టుపక్కల వాళ్లతో మా పరువు – ఇవి బాధపెట్టేవి. ఎంత లేనివాళ్లయినా ఆదివారం రాత్రి ఇంటిలో వంట చేసుకుని అందరూ ఆ వున్నదేదో తినేవాళ్లు. కనీసం ఈ పని చేయలేనివారికి ఏ మాత్రం గౌరవం ఉండేది కాదు. మేము ఈ రకమన్నమాట! అమ్మ నన్ను దగ్గర కొట్టుకు పంపేది. ఆరు పెన్నీలతో ఇంత మాంసం – రెండు కూరగాయలు తెమ్మని. ఆదివారంనాడు ఇంతకంటే అవమానం ఉండదు. ఇంటిలో ఏమీ వండనందుకు అమ్మను విసుక్కునేవాడిని. ఆమె ఏదో సర్దిచెప్పేది. ఒకరోజు శుక్రవారం గుర్రపు పందాలలో 5 షిల్లింగులు వస్తే అమ్మ ఆ ఆదివారం వంట చేస్తానని చెప్పింది.

కాల్చిన మాంసం తెచ్చింది కానీ దానిమీద ఇది వండి తినాలి అని రాసివుంది. అప్పుడు మా ఇంట సొంతదారు వంటింట్లో వండి, అది అప్పటికే చిన్న బంతిలా

అయిపోయింది. ఎలా అయితేనే ఆ ఆదివారం ఇద్దరం ఇంట్లో వండుకుని తిన్నాం. అదే పెద్ద గౌరవం!

అంతలో మా జీవితంలో మంచి మార్పు వచ్చింది. అమ్మ స్నేహితురాలు ఒక రోజు కలిసి తన పరిస్థితి ఇప్పుడు చాలా బాగా వుందనీ, స్టాక్‌వెల్ పేటలో వుంటున్నట్లూ చాలా డబ్బున్న మిలిటరీ ఆఫీసర్ని చేసుకున్నట్లూ చెప్పింది. తనతో వుండటానికి 'రమ్మంది. అమ్మంటే ఆమెకు చాలా ఇష్టం.' ఈ వేసవి గడపవచ్చు అనికూడా వత్తిడి చేసింది.

అమ్మ తన సూది దారం – నేను 'లాంక్‌షైర్ లాడ్' సూటులో అక్కడికి వెళ్లటానికి బాగానే వుంటుందనుకున్నాం. సిడ్నీ ఎక్కడో పనికి వెళ్ళాడు.

ఆ విధంగా ఈ పేదలపేట వదలి, రాత్రికి రాత్రి లాన్స్‌డేన్ స్క్వేర్‌లోని మంచి ఇంటిలోకి వచ్చాము. ఇల్లంతా పనివాళ్లతో సందడిగా వుంది. మంచి పడక గదులు, దుప్పట్లు, కిటికీ తెరలు, ఇంట్లో ద్రాక్షగుత్తులు. అవన్నీ రోజూ తరిగిపోవటం నాకు బాధగా వుండేది.

ఇంట్లో నలుగురు పనివాళ్లు. ముగ్గురు పనికి, ఒకళ్లు వంట చేయటానికి. నేనూ, అమ్మా కాక ఇంట్లో ఇంకొక అతిథికూడా వున్నాడు. యువకుడు ఆకర్షణీయంగా చిన్ని మీసాలతో అందంగా వున్నాడు. అప్పుడు తెల్ల మీసాల మిలటరీ కల్‌నెల్ వచ్చాడు. ఈ కుర్ర అతిథి కనపడేవాడుకాదు. కల్‌నెల్ ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో తెలియదు.

ఆయన ఇంట్లో వున్నప్పుడు అంతా ఆయువున్నట్లే ఉండేది. ఆయనకు కనపడవద్దని అమ్మ చెప్తుండేది.

ఒక రోజున నేను హాలులోకి వస్తుండగా ఆయన మెట్లు దిగుతున్నాడు. సిల్కు కోటులో వున్నాడు. బట్టతల, తెల్లని చెంపసరాలు. గులాబీరంగు ముఖం. నన్నుచూసి నవ్వి, ఆయన దారిన ఆయన వెళ్లిపోయాడు. అయితే నాకు అర్థమయ్యేది కాదు. కల్‌నిల్ వస్తే అంతా ఎమర్జన్సీ లాగా వుండేది. ఎందుకని. ఆయన వెళ్లగానే మా అందమైన యువకుడు వచ్చేవాడు. మళ్లీ ఇల్లంతా మామూలుగా వుండేది! నాకు మీసాల యువకుడు బాగా నచ్చాడు. అతనితో చాలా దూరం నడుస్తుండేవాడిని. రెండు గ్రేహౌండ్ కుక్కలు కూడా మాతో వుండేవి. క్లాపకు కామన్ సింటర్‌కి వెళ్లేవాళ్లం. అక్కడ

మందులషాపు వుండేది. అక్కడ సెంట్లూ, సబ్బులూ, పౌడర్లూ వుండేవి. ఇన్నిరకాల వాసనలు మంచి ఉత్సాహాన్నిచ్చేవి. అతను అమ్మకు చెప్పేవాడు. నాకు ఆస్తమా తగ్గాలంటే ప్రొద్దునే చన్నీళ్ళ స్నానం చేయించమనేవాడు. అవి నిజంగానే పనిచేసేవి. నేను చాలా ఉత్సాహంగా తయారయ్యాను.

నాకు ఆశ్చర్యం వేసింది. ఎంత తొందరగా మనం పరిసరాలకు అలవాటు పడిపోతాము? అందులో సుఖాలు, అందుబాటులో వున్నప్పుడు – ఒక వారంలో ఇవన్నీ మనవేనని గర్వ పడిపోయాను. ఇంత సుఖంగా మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన ఆహారం. ఇంటినిండా మనుషులు. పనిచేసే పనిలేదు! కుక్కల్ని నడిపించటం అదే పని! సమయానికి మధ్యాహ్న భోజనం, మళ్లీ రాత్రి డిన్నర్! అదీ వెండి పళ్లాలు, కత్తులు – కటారులతో తినడం. ఇంకా ఏమికావాలి? ఈ ఇంటికి వెనక ఇంకా పెద్ద ఇల్లు వుంది. అక్కడ కూడా ఇంటినిండా నౌకర్లే – వాళ్లింట్లో ముగ్గురు వుండేవాళ్లు. ఇద్దరు భార్యాభర్తలూ వాళ్లబ్బాయీ. అతనికి నా వయస్సే. నేను అతనితో ఆడేవాడిని. రాత్రి డిన్నర్‌కి అక్కడే వుండేవాడిని. మంచి మిత్రులుగా మారిపోయాము. వాళ్ల నాన్న సిటీ బాంక్‌లో మంచి ఉద్యోగంలో వున్నాడు.

తర్వాత నన్ను చాలా బాగా చూసేవాళ్లు, రెండిళ్ల పనివాళ్లు. అవును నేను బాగా వున్నవాడిలాగానే లెక్క! అక్కడ వేసవి అయిపోగానే మళ్లీ పోన్‌వాల్ ట్రెస్ నెం 3కి వచ్చేశాము. అది చాలా విచారకరమైనరోజు. కాని మళ్లా మా స్వాతంత్ర్యం మాకు వచ్చినట్లే.

ఆ విధంగా, ఆ ధనిక సిల్క్ తెరలు తొలగిపోగానే, మళ్లీ మా అసలయిన పేదల పేటకు వచ్చేశాం!

నాలుగో అధ్యాయం

నాన్న మరణం

1899 సంవత్సరం ఇంగ్లాండుకి చాలా గడ్డుకాలం. మీసాల రాజరికం, నాయకులు, మిలటరీ అధికారాలు. నౌకాదళం, అన్ని రకాల వ్యాపారస్థులు, చివరికి క్రికెట్టు ఆటగాళ్లు, ఏమి పటాటోపం – ఎంత పేదరికం. అన్నీ కలగలిసి దేశాన్ని చివరికి వార్తాపత్రికల్లో కార్టూన్ బొమ్మలుకూడా అతలాకుతలం చేసినాయి. ఆఫ్రికాలో బోయర్ రైతులు ఇంగ్లాండు సైనికులను కాల్చి చంపుతున్నారు. వీరి ఎర్రరంగు యూనిఫాంతో తేలికగా బలి అయిపోతున్నారు. తర్వాత దాన్ని కాకీ రంగుకు మార్చారు. ఇవన్నీ నాకు వినపడుతూండేవి. చివరికి ఎంతో కష్టపడి ఇంగ్లాండు విజయం సాధించినట్లు పాటలు వినవచ్చేవి. అవే దేశభక్తి గీతాలు! అందరూ ఈ కబుర్లు చెప్పే వాళ్లు కాని అమ్మ ఎప్పుడూ యుద్ధం సంగతి ఎత్తేది కాదు. ఆమె పోరాటం వేరుకదా!

ఇప్పుడు సిడ్నీకి పద్నాలుగేళ్లు వచ్చాయి. స్కూలు అయిపోయింది. స్ట్రాండ్ పోస్ట్ ఆఫీసులో టెలిగ్రాఫ్ బాయ్‌గా ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు సిడ్నీ జీతం. అమ్మ కుట్టుపని సంపాదనతో మాకు తినటానికేం లోటు లేదు. అమ్మ కుట్టు పనికూడా కాకుండా ఇంకా చిల్లర పనులు కూడా చేసి ఏదో పదోపరకో సంపాదించేది. అమ్మకి పన్నెండు జాకెట్లు కుట్టాలంటే పన్నెండు గంటలు పట్టేది, ఒక్కోసారి వారానికి యాభైనాలుగు (54) జాకెట్లు కుట్టేది. ఆరు షిల్లింగుల తొమ్మిది పెన్నీలు! తరచుగా రాత్రిళ్లు నేను పడుకుని ఆ గుడ్డి దీపం వెలుతురులో కుట్టుమిషన్ మీదకు వంగి అలసిన కళ్లతో వణికే పెదవులతో పనిచేస్తున్న అమ్మను అలాగే చూస్తూ ఆ మిషన్ మోతకు నిద్రలోకి జారుకునేవాడిని. అమ్మ చాలాసేపు పనిచేసేది. అంటే మర్నాడు ఇవ్వవలసిన బట్టలున్నాయని అనుకోవాలి.

అప్పుడే "సిడ్నీకి బట్టలు కావాల్సి వచ్చింది. వారమంతా పోస్టల్ బట్టలే వేసుకునే వాడు. ఆదివారం – కూడా. అప్పుడు సిడ్నీ స్నేహితులు ఎగతాళి చేయటం మొదలుపెట్టారు – అప్పుడు 18 షిల్లింగులు ఖరీదు చేసే సూటు సిడ్నీకోసం, అదీ నీలం రంగుది, కష్టపడి కొన్నది. దానితో మేము దివాళా తీసినట్లయింది. అన్న సోమవారం ఉద్యోగానికి వెళ్లగానే అదే నీలం సూటుని తాకట్టుపెట్టి ఏడు షిల్లింగులు తెచ్చేది – దానితో మాకు రోజులు గడిచేవి. వారం పనిచేసి మళ్లీ శనివారం తాకట్టు విడిపించి సూటు తెచ్చేది. ఆదివారం వేసుకోవటానికి! ఈ విధంగా ఒక సంవత్సరంగా నడిచింది, నీలం సూటు దారాలుగా మారటానికి! ఒక మధ్యాహ్నం సోమవారం, అమ్మ, సూటు తీసుకు వెళ్లింది. కాని తాకట్టు కొట్టువాడు "మీకు ఈ సూటుమీద డబ్బు ఇవ్వలేం క్షమించండి" అన్నాడు. "ఎందుకని" అని అడిగితే "ఇది పాతదయిపోయింది. ఇప్పుడు ఏమీ విలువ చేయదు – నాకు చాలా నష్టం" అన్నాడు. "మళ్ళీ శనివారం తీసుకుంటాము కదా" – అమ్మ అంది. "నేను మూడు షిల్లింగులే ఇవ్వగలను..." అన్నాడు. అమ్మ ఎప్పుడూ కంటనీరు పెట్టేది కాదు. కాని ఇంటికి కన్నీళ్ళతోనే వచ్చింది. ఇప్పటివరకూ వారానికి ఏడు షిల్లింగులతోనే నడుపుకు వచ్చింది. ఇప్పుడు ఈ కష్టం!

నాకుకూడా, వున్న బట్టలన్నీ చిరిగిపోయాయి. ఇప్పట్లో బట్టలు కొనే అవకాశమే లేదు. అలా చిరిగిన అతుకుల బట్టలతోనే వీధిలో ఒకరోజు నా స్నేహితునికి ఎదురుపడ్డాను. చాలా సిగ్గువేసింది. అతడు నన్ను మామూలుగానే పలకరించాడు. అమ్మ ఎలా వుందని అడిగాడు. నాకైతే ముళ్లమీద నిలబడినట్లుంది. పైకి డాబుగా చాలా గంభీరమైన గొంతుతో "ఈ పాతబట్టలతోనే నేను వడ్రంగి పని నేర్చుకుంటున్నాను – అక్కడంతా దుమ్ము పడుతుందికదా" అని అన్నాను. కానీ అతనివేమీ గమనించటంలేదు. మళ్లీ ఏదో అడిగేలోపు నేను మరోవైపు పరుగుపెట్టాను.

అమ్మ అంటుండేది – "నీవు వంగి ఏరుకుందామంటే ఏమీ దొరకదు" అని. కాని ఇది అమ్మే పాటించేది కాదు. నాకు చాలా కోపం వచ్చింది కూడా.

ఒకరోజు అమ్మా–నేనూ బ్రామ్‌టన్ ఆసుపత్రినుంచి తిరిగి వస్తున్నాము. దారిలో ఒక పెద్దావిడను పిల్లలు అల్లరి పెడుతున్నారు. ఆమె దరిద్ర దేవతలాగా వుంది. జుట్టు గొరిగి వుంది (ఆ రోజుల్లో ఇది చాలా అసహజం). ఆ కుర్రాళ్లు ఆమెను ఎగతాళి

చేస్తున్నారు. పాపం ఏమీ చేయలేక దూరంగా నిలబడి, వాళ్లను అదిలిస్తోంది. అపుడు అమ్మ, దగ్గరకు వెళ్లి "ఎవ్వరూ ఇవాస్టాకా?" అని గుర్తుపట్టింది. "అవుని 'లిల్లీ" అని పలకరించింది. కుర్రాళ్లు దూరంగా పోయారు. ఇదంతా నాకు చాలా చిరాకుగా వుంది. ముఖ్యంగా ఇవాస్టాక్ అవతారం. అనారోగ్య పరిస్థితి, దూరంగా వెళ్లిపోయాను. తర్వాత ఇద్దరూ కలిసి మా యింటిపైకే వస్తున్నారు. నా దగ్గరకు రాగానే "చార్లీని గుర్తుపట్టావా?" అమ్మ అడిగింది. ఇవా "ఆ చిన్నప్పుడు ఎత్తుకునే దాన్నికదా" అంది. దానికి నాకు మరీ అసహ్యమేసింది.

అమ్మకు, 'ఇవాస్టాక్', నాటకాల రోజుల్లో మంచి నటిగా అందగత్తెగా బాగా తెలుసు. పాపం ఇప్పుడు ఇలా అయిపోయింది. అమ్మ ఇవాను స్నానం చేసి (పబ్లిక్ బాత్‌లో) రమ్మని – ఇంటికి తీసుకు వచ్చి తినటానికి పెట్టింది. అలసిపోయిన ఇవా – సిడ్నీ పడక కుర్చీలోపడి నిద్రపోయింది. తర్వాత ఆమె వెళ్లిపోయేటప్పుడు తాను ఇవ్వగలిగిన బట్టలూ – రెండు షిల్లింగ్‌లూ ఇచ్చి మరీ పంపింది. తర్వాత 'ఇవాస్టాక్' మాకు కనపడనే లేదు!

అమ్మ తనకు తెలిసిన 'టేలర్' వాళ్ల ఇంటి దగ్గర్లో, గది తీసుకుని (ఈమె అమ్మకు చర్చిలో పరిచయం) పోనాల్ టెర్రీస్ ప్రాంతం వదిలి వచ్చింది మాతోసహా. అప్పటికి నాన్న బ్రతికే వున్నాడు. టేలర్‌కి యాభైఏళ్లు వుంటాయి. ముఖం ముడతలుపడి, వెడల్పాటి ముఖంతో వుండేది. తర్వాత ఆమె పళ్లు కట్టించుకున్నట్లు గమనించాను. ఆమె చర్చిలో పాడినప్పుడు ఈ కట్టుడు పళ్లపైన 'చర్మం' బాగా కనపడేది. అదొక వింతగా అన్పించేది. ఆమె చాలా హుషారుగా వుండేది. అమ్మను తన రెక్కల క్రింద పెట్టుకుని కాపాడింది. చర్చివాళ్లు కూడా ఆమె చెప్పబట్టి, గది చాలా చవకగా అద్దెకిచ్చారు. ఆమె భర్త టేలర్ అచ్చంగా డికెన్స్ పాత్ర (పిక్‌విక్) లాగా వుండేవాడు. ఈయన రూళ్లకర్రలు చేసేవాడు. చాలా మంచివి. ఈ పనిచేసేది ఆ యింట్లో పై అంతస్తులో. ఇది నాకు చాలా బాగా నచ్చింది. అక్కడికి ఆకాశం దగ్గరగా అనిపించేది. ఆయనకు నేను చిన్న, చిన్న పనులు చేసి పెడుతూ వుండేవాడిని.

టేలర్స్‌కి ఒక కూతురుండేది. అచ్చం వాళ్ల అమ్మపోలికే. వాళ్ల నాన్నలాగానే చర్చికి వెళ్లేది కాదు. పాపం వాళ్లమ్మ భర్తనూ – కూతుర్నీ చర్చికి తీసుకు వెళ్లటానికి చాలా ప్రయత్నాలు చేసింది. ఫలించలేదు. ఆరోజు నేను టేలర్ పనిని చూస్తున్నాను.

అమ్మ గొంతు క్రిందనుంచి వినపడింది. ఏమి జరిగిందో తెలియదు. టేలర్ కూతురుతో "నా గురించి నీవేమనుకుంటున్నావు? మూర్ఖురాలా" అని అంది. "ఆ మాట బైబిల్‌లో వుందా?" అని ఆ అమ్మాయి ఎగతాళిగా అంది. అప్పుడు అమ్మ "డెటరో నామీనీ 28వ అధ్యాయంలో 37 పద్యంలో దానికే ఇంకో పదముంది. కాని నీకు ఈ మాట సరిపోతుంది" ఆ తర్వాత మేము పోన్‌వాల్ టెర్రీస్‌కి తిరిగి వెళ్లిపోయాము. నాన్న ఎప్పుడూ 3 స్టార్స్‌బార్‌కి వెళ్లేవాడు కాదు. ఆయన స్థాయి వేరు. కాని ఆ రోజున నేను ఆ బార్ ప్రక్కనుంచి వెళ్తూ ఎందుకో లోపల ఆయన వుండవచ్చు అనిపించి తొంగిచూశాను. నిజమే! ఆ మూల చీకటి నీడలో వున్నాడు. నేను వెళ్లి పోదామని వెనక్కు తిరిగాను. ఆయన నన్ను చూసినట్లున్నాడు. ముఖంలో వెలుగు నింపుకుని నన్ను దగ్గరకు రమ్మన్నాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అంతకుముందు ఎప్పుడూ నన్ను ఇంత ప్రేమగా పిలవలేదు. కుర్చీమీద ఒక ప్రక్కకు వంగిపోయి – మనిషి అంతా ఉబ్బిపోయి ఉన్నాడు. (నెపోలియన్ లాగానే) శ్వాస తీయటం ఇబ్బందిగా వున్నట్లుంది. నన్ను దగ్గరకు తీసుకుని అమ్మ గురించీ – అన్న సిడ్నీ గురించీ అడిగాడు. నేను వెళ్లిపోవటానికి లేచినప్పుడు – నన్ను మొదటిసారిగా ముద్దు పెట్టుకున్నాడు. అదే ఆయన్ను ఆఖరుగా చూడటం బ్రతికి ఉండగా.

మూడు వారాల తర్వాత సెయింట్ థామస్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆసుపత్రికి వెళ్లటానికి కూడా ఆయన్ను తాగించాల్సి వచ్చింది. ఆసుపత్రిలో చేరిన తర్వాత ఆయనకు స్పృహ వచ్చింది. బైటకు వెళ్లిపోవటానికి నానా రభస చేశాడు. కాని అప్పటికే ఆయనకు మృత్యువు సమీపించింది. అమ్మ ఆయన్ను చూడటానికి చాలాసార్లు వెళ్లింది. ఎప్పుడు వెళ్లినా విషాదంగానే తిరిగి వచ్చేది. 'మళ్లీ నీ దగ్గరకు వచ్చేస్తాను' అని గొడవ చేసేవాడని చెప్పింది. అందరం కలిసి ఆఫ్రికా వెళ్లిపోదాం అని అనేవాడని. ఇవన్ని జరగవనీ తెలుసు – అనేది అమ్మ. ఒకరోజు రెవరెండు మాక్నీక్ నాన్నను చూడటానికి వెళ్లి "చార్లీ నిన్ను చూస్తుంటే నాకు మనిషి ఏ విత్తనం వేస్తే ఆ మొక్కే మొలుస్తుంది. ఏ చెట్టు నాటితే ఆ పళ్లే తింటాడు" అనే సామెత గుర్తుకొస్తుంది, అన్నాడు.

అమ్మకు చాలా కోపం వచ్చింది. "చనిపోయే వ్యక్తిని ఇలాగేనా పలకరించేది?" అని కోపగించుకుంది.

ఆ తర్వాత కొద్దిరోజులకే నాన్న కాలం చేశాడు. అంత్యక్రియలు ఎవరు చేస్తారో తెలపమన్నారు ఆసుపత్రివాళ్లు. అమ్మదగ్గర డబ్బులేక పోవటంతో – నటీనటుల

సామాజిక ధర్మనిధి వాళ్లను అడుగుతానంది. కానీ నాన్న వంశీకులు అది అవమానంగా తీసుకుని గొడవచేశారు. ఆ ఖర్చులన్నీ ఆఫ్రికా నుంచి వచ్చిన ఆల్బర్ట్ బాబాయి భరిస్తానని అనడంతో ఆ సమస్య తీరింది.

ఆసుపత్రినుంచి టూటింగ్ స్మశానానికి గుర్రాల బండిలో తీసుకు వెళ్లారు. శవపేటిక మూసేముందు అమ్మ నాన్నను చూడటానికి వెళ్లింది. అమ్మతోపాటు నేనుకూడా – శవపేటిక లోపల తెల్లని సాటిన్ గుడ్డతో చేసి వుంది. నాన్న ముఖం చుట్టూ పసుప్పచ్చ తెల్లని పూలున్న రెమ్మలు పెట్టి వున్నాయి. అంతకుముందు మా మారుటమ్మ తమ్ముడితో వచ్చి వెళ్లింది.

స్మశానంవరకూ ఈ బండి సవారి చాలా ఇబ్బందికరంగా జరిగింది. మేము ఎప్పుడూ ఆల్బర్ట్ బాబాయిని కలువలేదు. ఇదే మొదటిసారి. ఆయన చాలా సంస్కారంగా మాట్లాడినా, ఎంతో మర్యాదగా ప్రవర్తించినా మాకు చాలా అసహజంగా అనిపించింది. ఆయన ఆఫ్రికాలో గుర్రాల వ్యాపారం చేస్తున్నాడు.

ఈ తతంగం అంతా వర్షంలోనే జరిగింది. గుంట తీసినవాళ్లు శవపేటికను దింపి తడి మట్టి పోశారు. పేటికమీద ఆ మట్టిపెళ్ల పడినప్పుడు పెద్ద శబ్దం వచ్చేది. ఇదంతా నాకు చాలా దుఃఖం తెప్పించి – భయంకూడా వేసింది. అందరూ పూలు–మట్టి–కొన్ని వస్తువులు గుంటలో వేస్తున్నారు. అమ్మకు పూలు కొనటానికి కూడా డబ్బులేదు. నా చేతిలో గుడ్డ తీసి శవపేటికమీద వేసింది. నా చెవిలో "మనిద్దరికీ ఇది సరిపోతుందిలే" అంది. తర్వాత చాప్లిన్స్ అంతా భోజనానికి ఎక్కడో ఆగారు. మేము ఇంటికి వెళ్లిపోయాము.

మేము ఇంటికి వచ్చేసరికి ఇంట్లో తినటానికి ఏమీలేదు. ఏదో ఇంత మాంసం ముక్క నీళ్లు కారుతోంది చిన్న పళ్లెంలో. అమ్మదగ్గర డబ్బుకూడా లేదు. ఉన్న రెండు పెన్నీలు సిడ్నీకిచ్చింది. నాన్న ఆసుపత్రిలో వున్నప్పుడు – అమ్మ పెద్దగా పనిచేయలేదు. ఈ వారం, అన్న తెచ్చిన ఏడు షిల్లింగులూ అయిపోయాయి కూడా – నాన్న అంత్యక్రియలు తంతు ముగిసే సమయానికి మాకు ఆకలికూడా వేస్తోంది. మేము ఇంటికి చేరి ఏమి చేయాలో పాలుపోక ఉండగా, అప్పుడే వీధిలో పాతసామాను కొనేవాడు వెళ్తున్నాడు. పాత దీపపు బుడ్డి వుంటే – అమ్మ అయిష్టంగానే దానికి అరపెన్నీకి అమ్మి రొట్టె కొని తెచ్చింది. అదీ మాంసంముక్కా కాల్చి తిన్నాము.

నాన్నకు వారసురాలు అమ్మేకదా – ఆసుపత్రివాళ్లు మర్నాడు కబురు చేశారు – నాన్న సామాను తీసుకు పొమ్మనమని. నాన్నకి చెందిన, రక్తపు మరకలతో వున్న నల్లని కోట – లోదుస్తులూ, ఒక చొక్కా. ఒక నల్లని టై. పాత గౌను. పాత చెప్పులు.

ఇవన్నీ తీసుకొని ఇంటికి చేరాలి. ఆ పాత చెప్పులు దొరికినపుడు అందులోనుంచి అరపౌండు బిళ్లపడింది. ఇది నిజంగా దేవుడిచ్చిందే అవుతుంది.

కొన్నివారాలు నా చేతికి ఒక గుడ్డ కట్టుకు తిరిగాను. అది మా దుఃఖానికి గుర్తు అన్నమాట! అది నాకు బాగా ఉపయోగపడింది. శనివారం సాయంత్రం పూలు అమ్మటానికి వెళ్లినప్పుడు పూలగుత్తులన్నీ అమ్మగలిగాను. నా చేతికి కట్టుకున్న గుడ్డచూసి నాకేదో కష్టం వచ్చిందని, అడిగిన వాళ్లందరూ నా పూలు కొన్నారు. "అమ్మా పూలు కావాలా? అక్కా పూలు కొంటారా" అని అడిగినపుడు నా చేతికి వున్న పట్టీ చూసి "ఎవరు బాబు" అని అడిగేవారు. 'మా నాన్న' అని చెప్పేవాడిని. వారు ఎంతో దయతో పూలు కొనటమే కాదు నాకు ఇంకా ఎక్కువ సొమ్ము కూడా ఇచ్చేవారు.

అమ్మ ఆశ్చర్యపోయింది. ఒక్క షిల్లింగుకు అయిదు షిల్లింగులు సంపాదించాను అని తెలిసి.

ఒకరోజు నేను ఒక 'పబ్'లో నుంచి బైటకు వస్తుండగా అమ్మ చూసింది. అంతే ఆ తర్వాత నన్ను పూలు అమ్మనీయలేదు.

"తాగుడే మీ నాన్నను చంపింది. అలాంటి డబ్బు మనకు మంచిది కాదు." అని గట్టిగా చెప్పింది.

ఈ సంఘటన తర్వాతే నాలో ఒక వ్యాపారి ఉన్నాడని నమ్మాను. అప్పటినుంచీ ప్రతిదీ వ్యాపార దృష్టితోనే చూశాను. అన్ని దుకాణాల కిటికీలు పరిశీలించేవాడిని. చేపల దగ్గరనుంచి బంగాళదుంపల చిప్స్‌వరకూ దేనిలో లాభం వస్తుందా అని లెక్కలు వేస్తుండేవాడిని. అదికూడా అన్నీ తినుబండారాల గురించే ఎక్కువ ఆలోచించేవాడిని. ఇప్పుడు నాకు కావలసింది కేవలం పెట్టుబడే. కాని అదే ఎలా వస్తుంది? ఈ ఆలోచనలతో అమ్మను ఒప్పించి బడి మానేశాను. అప్పటినుంచి పనికోసం వెతకటం మొదలు పెట్టాను. అద్దాల కొట్టులో, పనిచేశాను. ఖాళీ వున్నప్పుడు. సెల్లార్లో

(నేలమాళిగ)లోకి వెళ్లి సబ్బులు, గంజిపిండి, కొవ్వొత్తులు, మిఠాయిలు, బిస్కెట్లు, అన్నీ చేస్తూ చేరవేస్తూ రుచి చూస్తూ చివరికి ఆరోగ్యం పాడయ్యేవరకు వచ్చింది.

అప్పుడు వైద్యంకోసం వెళ్లి ఆ వైద్యుడి దగ్గరే పనిచేశాను. తర్వాత మెడికల్ ఇన్సూరెన్సు వైద్యులదగ్గర (ఇక్కడే ఇదివరకు అన్న సిడ్నీ చేశాడు) పనిచేశాను. వారానికి 12 షిల్లింగులు ఇచ్చేవారు. నా పని, వచ్చినవాళ్లను పలకరించి, చీటీలివ్వటం, అందరూ వెళ్లిపోయిన తర్వాత అంతా శుభ్రం చేయటం. ఇదంతా నా పనే. వైద్యునికోసం వేచివున్న రోగుల్ని నవ్విస్తుండేవాడిని. కాని శుభ్రం చేయటానికి వచ్చేసరికి చిరాకు పుట్టేది. చివరికి ఇదే నా ఉద్యోగం వూడేటట్లు చేసింది. ఆ పది అడుగుల కిటికీలు దుమ్ముపట్టి గది చీకటి అయిన తర్వాత ఆ పనికి నా వయసు చాలదు అని తేల్చారు. ఈ విషయం తెలిసి ఏడ్చాను కూడా. డాక్టరు టేలర్ భార్య చాలా సంపన్నురాలు. చివరికి ఆమె ఇంట్లో పనిచేయటానికి డాక్టరుగారు నియమించారు. నిజంగా సంతోషంతో ఎగిరి గంతేశాను.

వెంటనే ఉద్యోగంలో చేరాను. ఇంట్లో వున్న పనివాళ్లందరికీ నేను ఆత్మీయుడుగా అయిపోయాను. వాళ్లందరూ నన్ను చిన్ని పిల్లవానిగా ముద్దుగా చూస్తూ నిద్రకు వెళ్లేముందు 'గుడ్ నైట్' అని ముద్దు పెట్టేవాళ్లు. చివరికి ఆ ఇంట్లో వంట మనిషిగా కుదురుకుపోయేవాడినే. విధి విలాసం మరోరకంగా వుంది! ఒక్కసారి డాక్టరుగారి భార్య నన్ను అటకమీద వున్న అట్టపెట్టెలూ చెత్తా చెదారం తీసివేయమంది. నేనూ ఆ పనిలో నిమగ్నమై వుండగా అక్కడ పొడవాటి గొట్టం కనపడింది. ఆ గొట్టం పట్టుకుని బూరలాగా ఊదాను. అది చాలా బాగుంది అని అనుకుంటుండగానే ఆ ఇల్లాలు వచ్చి నాకు మూడురోజుల సమయం ఇచ్చి పని మానిపించింది.

తర్వాత పుస్తకాల కొట్లో పనిచేశాను (డబ్లు.హెచ్. స్మిత్ & సన్). నా వయసు తెలిసింతర్వాత నన్ను మానిపించింది. ఒకరోజు గాజు సామాను కూడా తయారు చేశాను (నోటితో ఊది) అప్పుడే ఆ రోజు సామాను అందాలు చూస్తూ వేడి, నోట్లోకి వెళ్లి స్పృహ తప్పి పడిపోయాను. తర్వాత ఆ రోజు కూలీకోసం కూడా అక్కడకు వెళ్లలేదు. తర్వాత ప్రింటింగ్ ప్రెస్‌లో చేరాను. అక్కడ వున్న ఇరవయి అడుగుల ప్రింటింగ్ యంత్రం, చాలా సులభంగా నడపవచ్చు అనుకున్నాను. కాని దగ్గరకు వెళ్లి చూస్తే అది నన్ను మింగివేసేలా వుంది. ఫోర్‌మాన్ "ఊ– నడువు" అని అన్నపుడు

భయంవేసింది. కాని మెల్లగా చేరుకుని అక్కడే వారానికి 12 షిల్లింగులకు పనిచేశాను. ఈ పని దినాలు మూడువారాలు నడిచాయి. ప్రొద్దునే లేవటం, లాక్‌హర్ట్ టీరూం మీదుగా పనికి వెళ్లటం. అదొక సరదాగా వుండేది. ప్రింటింగ్ ఉద్యోగం కూడా బాగానే సాగుతోంది. వారానికి పని ఎక్కువగా వుండేది. ఆ పెద్ద పెద్ద ఇంక్ రోలర్లు కడగటం చాలా శ్రమగా వుండేది. అది ఒక్కొక్కటి వందపౌండ్లు బరువుండేది. చివరికి నాకు జ్వరం వచ్చింది. మూడువారాల తర్వాత అమ్మ 'ఇక చాలు బడికి వెళ్లు' అని గొడవచేసింది.

ఇప్పుడు అన్న సిడ్నీకి 16 ఏళ్లు. ఒకరోజు చాలా సంతోషంగా ఇంటికి వచ్చాడు. డోనోవాన్ కాజిల్ అనే ప్రయాణీకుల నౌకతో (ఆఫ్రికా వెళ్లేది) ఉద్యోగం వచ్చింది అని చెప్పాడు. నెలకు రెండు పౌండ్ల పది షిల్లింగుల జీతం! అంతేకాక ప్రయాణీకులు ఇచ్చే మామూళ్లుకూడా అతనికే వస్తాయి.

అడ్వాన్సుగా 35 షిల్లింగులు ఇస్తారు. ఇది అమ్మకే ఇస్తాడుగా. అందుకే అంత సంతోషంగా ఇంటికి వచ్చి చెప్పాడు. అప్పుడే మేము చెస్టర్ వీధిలోని రెండు గదుల ఇంటికి మారాము.

అన్న మొదట యాత్రనుంచి వచ్చినప్పుడు మా ఆనందానికి అంతేలేదు. జీతంకాక మూడు పౌండ్లు మామూళ్లుకూడా వచ్చినాయి. అంత డబ్బు అమ్మ ముందు బల్లమీద పోసినపుడు ఎప్పుడూ ఇంత సొమ్ము చూడలేదే అనుకున్నాను. నా చేతులతో ఆ డబ్బుతో కాసేపు ఆడుకున్నానుకూడా! అది వేసవికాలం. కేకులు–ఐస్‌క్రీంలు తినాల్సిన రోజులు! ఆ తర్వాత ఆదివారం మాకు కావల్సినవన్నీ తిని ఆనందించాం.

ఆ తర్వాత అన్నకు జలుబుచేసి ఇంటి దగ్గరే చాలారోజులుండిపోయాడు. షర్బత్‌లు, అయిస్‌క్రీంలు తింటూ కాలక్షేపం చేశాను. సిడ్ని తన నౌకాయాత్ర గురించి చాలా చెప్పాడు. ప్రొద్దునే తను బూర ఊదగానే అందరూ నవ్వారట! ఎందుకంటే సిడ్నీకి అలవాటుపోయింది. అప్పుడూ అందరూ (తోటివాళ్లు) నవ్వుతూ ఎగతాళి చేసి ఏడ్పించారని తర్వాత సరిగ్గా ఊది ఉద్యోగం నిలబెట్టుకున్నానని చెప్పాడు. మొదటి కొద్దిరోజులు ఎలా ఇబ్బంది పడిందీ చెప్పినప్పుడు నవ్వుకున్నాం.

తర్వాత రెండో యాత్రకు కూడా అన్నకు పిలుపు వచ్చింది. మళ్లీ 35 షిల్లింగులు ముందుగా ఇచ్చారు. అది అమ్మకు ఇచ్చి యాత్రకు వెళ్లిపోయాడు. ఆ డబ్బు మాకు

మూడువారాలు కూడా రాలేదు. ఇంకా మూడు వారాల వరకూ అన్న రాదు. అమ్మ కుట్టుపని చేస్తున్నా ఇది ఏమూలకూ చాలదు. మళ్లీ మా కష్టాలు మొదలు. కాని నా ప్రణాళికలు నాకున్నాయి. అమ్మదగ్గర పాతబట్టలు చాలా వున్నాయి. ఆ రోజు శనివారం. నేను మార్కెట్టు దగ్గరకు వెళ్లి అమ్ముతానని చెప్పాను. అమ్మకు ఇష్టం లేదు. 'న్యూయింగ్‌టన్ బట్స్' దగ్గరకు వెళ్లి రోడ్డుప్రక్క అవన్నీ పరిచి మురుగు కాలువ ప్రక్కన నిలబడి "రండి ఏది కావాలంటే అది. ఎంత ఇస్తే అంత" అని కేకలు పెడుతూ నిలబడ్డాను. కానీ ఒక్కళ్లూ కొనలేదు. ఆగి చూసి, నవ్వుకుంటూ వెళ్లిపోతున్నారు. చివరికి రెండు చలికోట్లు అమ్మాను. ఆరు పెన్నిలకి. తర్వాత ఎవ్వరూ ఆగలేదు. ఎదురుగావున్న నగలకొట్టు వాళ్లు చూస్తున్నారు. ఎగతాళిగా ఒకడు వచ్చి 'వ్యాపారం ఎప్పుడు పెట్టావు' అని అడిగాడు. నేను 'ఇప్పుడే' అన్నాను. అతను వెళ్లి తన ఇద్దరు పనివాళ్లతో వెకిలిగా ఏదో చెప్పాడు. ఇక చాలు. భరించలేక మూట నెత్తిన పెట్టుకుని ఇంటికి చేరాను. అమ్మతో చెప్పాను. 6 పెన్నీలు అమ్మాను అని. 'అరె అంత మంచివి ఆరు పెన్నీలకిచ్చావా' అంది అమ్మ. కష్టాలలో అన్నీ విడ్డూరంగానే అన్పిస్తుంటాయి.

ఆ రోజుల్లో అద్దె కట్టాలని ఉన్నా కట్టలేకపోయేవాళ్లం. అద్దె ఇవ్వాలిసి వచ్చేరోజు ఇంటినుంచి వెళ్లి పోయేవాళ్లం! చివరికి మళ్లీ పోన్‌వాల్ టర్రేస్ మూడవ నంబరు ఇంటికి చేరాము.

కెన్నింగ్‌టన్ రోడ్ వెనకాల ఒక ముసలాయన తన కొడుకుతోపాటు మెస్‌లో పనిచేస్తున్నాడు. వాళ్లు ఊళ్లవెంట తిరుగుతూ బొమ్మలు తయారుచేసి అమ్మేవాళ్లు. వాళ్లు చాలా స్వేచ్ఛాజీవుల్లా ఏ బాధలూ లేకుండా బ్రతుకుతున్నట్లు చూసి అసూయ గలిగేది. వాళ్లకు పెట్టుబడి కూడా అవసరం లేదు. ఒక షిల్లింగ్‌తో వ్యాపారం మొదలు పెట్టవచ్చు! చెప్పుల పెట్టెలు దుకాణాల నుంచి ఊరికే తెచ్చుకునేవారు. దుకాణదారులు అవి వదిలిపోతే చాలనుకునేవారు. అలాగే బెరడు పొడీ, రంపం పొడీ తెచ్చి అవీ ద్రాక్షపెట్టెలలో దొరికేవి. చౌకగా దొరికే జిగురుతో సన్నని ట్వైన్ దారం, పల్చని చెక్కముక్కలు రంగురంగుల మెరిసే కాగితాలు. వీటన్నిటితో ఏడు డజన్ల పడవలు తయారుచేసేవారు. ఒక్కో పడవా 25 పెన్నీలకి అమ్మే వాళ్లు. ఇది చాలా లాభసాటి వ్యాపారం. వంద రంగు రంగులివి పెట్టి తేలికగా అమ్మేవాళ్లు. నాకున్న పరిచయంతో వాళ్లకు పనిచేయటం మొదలుపెట్టాను. కాస్త అలవాటయిన తర్వాత ఆ వ్యాపారం నేనే చేయటం

మొదలుపెట్టాను. ఇంట్లో ఈ బోట్లు పెట్టడానికీ, జిగురు వేసి చేయటానికి అమ్మకి ఇబ్బందిగా వుంది. అమ్మ పనికి ఇది అడ్డమైపోయింది. ఆదాయం అమ్మకే ఎక్కువ వస్తుంది కాబట్టి నా పని ఆగిపోయింది. ఆ కాలంలో తాతయ్యని చూడటానికి కుదరలేదు. గత సంవత్సర కాలంలో ఆయన జబ్బుతో బాధపడుతున్నాడు. చెప్పులు కుట్టటంతో ఆయన చేతులు వాచిపోయినాయి. ఇదివరలో అమ్మకు ఎంతో కొంత సొమ్ము ఇచ్చి ఆదుకొనేవాడు. అప్పుడప్పుడు ఆయన భోజనానికి పిల్చి, మంచి తినుబండారాలు పెట్టేవాడు.

మా తాత ఎప్పుడూ నాకు ఎలా మాట్లాడాలో, వ్యాకరణం అంటే ఏమిటో చెప్పి కోపగించుకునేవాడు. అందుకనే ఆయనంటే నాకు గిట్టేది కాదు. అప్పుడు ఆయన కీళ్లవాతంతో చికిత్సలో వున్నాడు. అమ్మ ఆయన్ను చూడటానికి వెళ్తుండేది. వెళ్లినప్పుడల్లా గుడ్లు తెచ్చేది. అదే మాకు చాలా ఎక్కువ. ఆమెకు తీరిక లేనపుడు అమ్మ నన్ను తాతని చూసిరమ్మని పంపేది. తాత నన్నుచూడగానే బాగా ఉత్సాహంగా అక్కడవున్న నర్సమ్మలతో జోకులు వేస్తూ నవ్విస్తుండేవాడు. ఆయన అక్కడ వంటింట్లో పని చేస్తుండేవాడు. అందుకే మాకు గుడ్లు వస్తుండేవి. ఇలా కొన్నాళ్లు గడిచింది. ఆయనకు కీళ్లవాతం తగ్గిన తర్వాత ఆ చికిత్సాలయం వదలివెళ్లిపోయాడు. మాకు గుడ్లూ ఆగిపోయాయి!

అప్పుడే ఆరువారాలు గడిచిపోయాయి. ఇంకా సిడ్నీ రాలేదు. మొదట్లో అమ్మ పెద్దగా కంగారు పడలేదు. ఇంకోవారం గడవగానే ఆమెకు ఆందోళన మొదలయింది. నౌక కంపెనీకి ఉత్తరాలు రాసింది. సమాధానంగా అతన్ని ఆఫ్రికా కేప్‌టౌన్‌లో దింపారని అక్కడే కీళ్ల వాతానికి వైద్యం చేస్తున్నట్లు చెప్పారు. మేము రోజులు ఇలాగే గడుపుతున్నాం. అమ్మ కుట్టుపని, నేను నాట్యం నేర్పుతూ కొంత సంపాదించి పొట్ట గడుపుకుంటున్నాము.

ఈ కాలంలోనే 'మాకెర్తీ'వాళ్లు కెన్నింగ్‌టన్ రోడ్‌లో నివసించటానికి వచ్చారు. శ్రీమతి మకెర్తీ ఐరిష్ హాస్యనటి. అమ్మకు స్నేహితురాలు. ఆమె భర్త వాల్టర్ మకెర్తీ. ఆయన (అకౌంటెంటు) పదేళ్లక్రిందట అమ్మతోపాటు నటించిన శ్రీమతి మకర్తీ ఇప్పుడు కెన్నింగ్‌టన్ రోడ్‌లోని వాల్‌కాట్ బంగళాకి వచ్చారు. వాళ్లబ్బాయికి నా వయస్సే వుంటుంది. చిన్నప్పుడు కూడా కలిసి ఆడుకున్నాము. కెన్నింగ్‌టన్ రోడ్‌లోకి వాళ్లు వచ్చిన తర్వాత అమ్మ ఎక్కువసార్లు కలవకపోయినా నేనూ వాలీ మంచి స్నేహితులమయ్యాము. బడి వదలగానే ఇంటికి వచ్చి అన్ని చిన్ని చిన్ని పనులూ చేసి

వాలీ ఇంటికి పరుగు పెట్టేవాణ్ణి. వాళ్ల ఇంటి వెనక, వాలీ నేనూ నాటకాలు నటించేవాళ్లం. నేను ఎప్పుడూ విలన్‌గానే వుండేవాణ్ణి. అట్లాగైతేనే నటనకు ఎక్కువ అవకాశం వుండేది. నేనే దర్శకత్వం కూడా. రాత్రి భోజన సమయందాకా ఆడుకునేవాళ్లం. సాధారణంగా నన్ను కూడా ఆహ్వానించేవాళ్లు. తప్పనిసరిగా భోజనాల వేళకు వుండేవాడిని కూడా. ఒక్కోసారి నా కదలికలు వారు పట్టించుకోనిరోజున అయిష్టంగానే ఇంటికి వెళ్లిపోయేవాణ్ణి. అమ్మ నన్ను చూసి 'రా నాన్నా' అంటూ తినటానికి ఏదో ఇంత రొట్టి – తాత ఇచ్చిన గ్రుడ్డును టీతోనూ ఇచ్చేది. ఇద్దరం మూడో అంతస్తు కిటికీ దగ్గర కూర్చొని కబుర్లు చెప్పుకునేవాళ్లం. అమ్మ కథలు చదివేది. క్రింద నడిచి వెళ్లేవారిని చూస్తూ ఏదో సంగతి చెప్తుండేది. వాళ్ల గురించి కథలల్లి నన్ను నవ్విస్తుండేది.

ఇంకోవారం గడిచిపోయింది. సిడ్నీ దగ్గర్నుంచి కబురే లేదు. అమ్మ పరిస్థితిని అప్పుడు నా వయసు అంచనా వేయలేకపోయింది. ఎంతో ఉదాసీనంగా కూర్చుని కిటికీలోంచి చూస్తుండేది. రోజురోజుకి మాటలు తగ్గిపోయినాయి. గదులు అలాగే వదిలివేసింది. ఆమె కుట్టు పనికూడా కుంటు పడుతోంది. పని చేయించుకున్నవాళ్లు ఆమె పనిలో తప్పులు పడుతున్నారు కూడా. అప్పుడే ఆ కుట్టుమిషను తీసుకుపోయారు. నా డాన్సు క్లాసులుకూడా అర్ధంతరంగా ఆగిపోయాయి. అమ్మ ఏమీ పట్టించుకో కుండా ఉండిపోయింది.

అప్పుడే శ్రీమతి మెకర్తీ అకస్మాత్తుగా చనిపోయింది. అంతలోనే ఆమె జీవితం ముగుస్తుందనుకోలేదు. నా చిన్ని మెదడులో అప్పుడు మెకర్తీ, అమ్మను పెళ్లి చేసుకుంటే బాగుండేది అనుకున్నాను. వాలీతో నా స్నేహం బాగా గట్టిపడేది. అమ్మ కష్టాలన్నీ తీరిపోయేవి కదా.!

శ్రీమతి మెకర్తీ అంత్యక్రియలయిపోగానే అమ్మతో అన్నాను కూడా. "అమ్మ నీవు మకర్తీ గారిని తరచూ కలుస్తుండు. నువ్వు ఆయన్ను పెళ్లి చేసుకుంటే బాగుంటుంది" అన్నాను. "ఆయనకూ సమయం కావాలి కదా" అంది. "నీవు ఏ ప్రయత్నమూ చేయవు. చక్కగా మంచి బట్టలు వేసుకో. ఆకర్షణీయంగా తయారవ్వు. నీవు అందంగా వుంటావుకదా. కాని ఎప్పుడూ ఈ కంపు గదిలో కూర్చొని ఆలోచిస్తూంటావు." అని విసుక్కున్నాను. ఆ విధంగా విసుక్కున్నందుకు చాలా బాధపడ్డాను తర్వాత.

అమ్మ సరైన ఆహారం లేక చాలా చాలా నీరసం అయిపోయింది. వంట్లో రక్తం లేకుండా పాలిపోయింది. అంత నీరసం లోనూ గది అంతా శుభ్రం చేసింది.

మా బడికి వేసవి సెలవులు ఇచ్చారు. ప్రొద్దునే ఈ గదిలోంచి బయటపడి మెకర్తీ ఇంటికి, వాలీ దగ్గరకు వెళ్ళాలి. ముందు మా యింట్లోనుంచి బయటపడాలి. మధ్యాహ్నం భోజనానికి రమ్మన్నాడు కూడా. (లోపల ఏదో పీకుతోంది – వెంటనే అమ్మ దగ్గరకు వచ్చేయాలని).

మెకర్తీ ఇంటినుంచి తిరిగి మా పోనెల్ టిర్రెస్ ఇంటికి వచ్చాను. కాని క్రింద గేటు దగ్గరే ఆపేశారు, అక్కడి పిల్లలు.

"మీ అమ్మకు పిచ్చెక్కింది" అని అరిచారు.

నాకు చెంపమీద కొట్టినట్లు అనిపించింది. "ఏమన్నావు?" అని అడిగాను.

"కావాలంటే, మా అమ్మనడుగు" అంది ఒక అమ్మాయి.

"అన్ని ఇళ్లకూ వచ్చి బొగ్గులు పంచిపెడుతోంది. పుట్టినరోజు బహుమతులంటూ" అని ఇంకో పిల్ల అంది.

నేను మా మూడో అంతస్తుకు పరుగుపెట్టాను. రొప్పుతూ మా గది తలుపులు తీశాను. అది వేసవి మధ్యాహ్నం. "అమ్మా" అని గట్టిగా అరిచాను. కిటికీ దగ్గరే కూర్చొని ఉంది. "ఏమిటి – ఏమయింది?" అంది నిర్లక్ష్యంగానే. అంతే వెళ్లి అమ్మఒడిలో తల వుంచుకొని గట్టిగా ఏడ్చాను. "ఏమిటి?" అంది. నా తల నిమురుతూ.

"నీకు బాగోలేదమ్మా" అన్నాను. "అవును అది నిజమే" అంది. "అందరి ఇళ్లకీ వెళ్లి – ఏదో ఇచ్చావని చెప్తున్నారు" అన్నాను. "అవును – నేను సిడ్నీకోసం వెదుకుతున్నా. వాడ్ని నా దగ్గరకు రాకుండా వుంచుతున్నారు, ఎవరో" అంది. అప్పుడర్థమయింది క్రిందవాళ్లు చెప్పింది నిజమేనని. "అమ్మా, నేను వైద్యుణ్ణి తీసుకువస్తా" అంటూ ఏడ్చాను.

"సిడ్నీని మెకర్తీ వాళ్లు దాచారు. నా దగ్గరకు రానివ్వకుండా." అంది మళ్లీ. నాకు ఏడుపు ఆగటం లేదు. "అమ్మా నేను వైద్యుణ్ణి తీసుకు వస్తా"నని లేచాను. తలుపు దగ్గరకు వెళ్తుంటే "ఎక్కడికి వెళ్తున్నావు..." అని ఊరకనే అడిగినట్లుంది. "ఇప్పుడే వస్తాను...." అని బైటకు వచ్చాను. క్రింది ఇంటావిడ వుంది. "నేను వెంటనే వైద్యుణ్ణి తీసుకురావాలి..." అన్నాను. "మేము డాక్టరుకోసం కబురు పంపాము..." అంది.

చర్చి డాక్టరు, ముసలాయన, వచ్చి అమ్మను చూశాడు. ఇంటి యజమాని చెప్పినదంతా విన్నాడు. "ఇది మతి భ్రమణే. ఈమెని ఆసుపత్రికి పంపండి" అన్నాడు. తర్వాత ఒక కాగితం రాసి యిచ్చాడు. అందులో అమ్మ స్థితి ముఖ్యంగా సరైన ఆహారం లేక ఆమె మతిభ్రమణ చెందింది అని పేర్కొన్నాడు. ఆమెకు రక్తము, కండర బలం అన్నీ హరించుకు పోయాయి అని నాతో చెప్పాడు. "బలమైన ఆహారం, విశ్రాంతీ వుండాలి. త్వరలోనే కోలుకుంటుంది." అని నన్ను ఓదార్చాడు.

అమ్మకు వున్న బట్టలు సరిగావేసి జాగ్రత్తగా క్రిందకు తీసుకువెళ్లారు. అమ్మ, చిన్నపిల్లలా దేనికీ ఎదురు చెప్పలేదు. తన స్వంత నిర్ణయం లేకుండా బలహీన పడిపోయింది. అక్కడికి ఒక మైలు దూరంలోనే ఆసుపత్రి వుంది. ఈ కాస్తదూరం మేమంతా దిగులుగా నడుస్తున్నాం. అమ్మ మత్తులో వున్నట్లు వూగిపోతోంది. అప్పుడు నేను జాగ్రత్తగా పట్టుకుని పడిపోకుండా చూశాను. ఆ వేసవి ఎండ మమ్మల్ని మాడ్చివేస్తున్నట్లనిపించింది. చూసినవాళ్లు అమ్మ తాగి వున్నట్లునుకున్నారు. నాకు వాళ్లు దెయ్యాల్లా అనిపించారు. ఎక్కడకు వెళ్తున్నామో, ఎందుకు వెళ్తున్నామో తెలియక తికమకపడుతోంది. నేనే ఓదార్చాను. నీరసంగా నవ్వుతోంది.

చివరికి ఎలాగో అక్కడికి చేరాము. ఒక యువ వైద్యుడు మేము తెచ్చిన కాగితం చూసి అమ్మను, "పర్వాలేదు" అని దయతో లోపలకు తీసుకు వెళ్లాడు. తర్వాత నర్సులు వచ్చి ఆమెను నడిపించారు. "అమ్మా! రేపు కనపడతాను" అన్నాను. అమ్మ వెనక్కు చూస్తూ నర్సుతో వెళ్లింది. అప్పుడు వైద్యుడు "అవునూ, నీవెక్కడ వుంటావు?" అన్నాడు. "నేను మా పిన్నితో వుంటాను..." ఆలోచించికుండానే అన్నాను.

అక్కడనుంచి తిరిగి వస్తూ, ఏమీ తెలియని బాధ అలుముకోవడంతో మరీ దిగులు పడ్డాను. ఒక రకంగా ఇది అమ్మకు మంచిదే. మా యింట్లో చీకటిలో, ఆ కిటికీలోనుంచి శూన్యంలోకి చూడటం కంటే అమ్మకు ఇదే మంచిది. మంచి ఆహారం, మందులూ, విశ్రాంతీ దొరుకుతాయి, నేను అమ్మగురించి దిగులు పడకుండా. కాని వాళ్లు తీసుకు వెళ్లేముందు అమ్మచూసిన చూపూ, ఆమె కళ్లలోని విషాదం నేనెలా మర్చిపోను? ఆమె సంతోషంగా వున్నప్పుడు ఎలా వుండేది. ఆమె సౌందర్యం ఎంత స్వచ్ఛంగా వుండేది. ఆమె ప్రేమ ఎంత నిస్వార్థంగా వుండేది. ఆమె ఎంత కష్టంలో వున్నా నేను బడినుంచి రావటంచూసి నవ్వుతూ ఎదురు వచ్చేది. ఆమె కష్టాలేమీ ఆమె ప్రేమను నిర్వీర్యం

చేయలేకపోయాయి. వున్నదేదో ఆప్యాయంగా పెట్టి, జుట్టు సవరించి బుగ్గలు తడిమేది. ఎలాంటి అమ్మ! ఇంత చాక్లెట్టు నాకోసం దాచిపెట్టి ఇచ్చేది. నేను ఏడుస్తుంటే తన ఒడిలో చోటిచ్చేది.

నేను సరాసరి ఇంటికి వెళ్లలేదు. ఎలా వెళ్లను? నూయింగ్‌టన్ బట్స్ మార్కెట్టు దగ్గరకు వెళ్లి కిటికీలోంచి కనపడే వస్తువులు చూస్తూ గడిపాను. అలా తిరిగి మా చీకటి గదికి వచ్చి చూస్తే మరింత దిగులు ఆవహించింది. మరీ శూన్యంగా వుంది. కుర్చీలో కూలబడి చుట్టూ చూశాను. ఒక టబ్‌లో బట్టలు నానబెట్టి వున్నాయి. కప్‌బోర్డ్‌లో సగం వున్న టీ పొట్లం వుంది. ఇంకేమీ లేదు తినేందుకు. ఆ ప్రక్కనే అమ్మచేతి సంచి వుంది. అందులో మూడు అర పెన్నిలున్నాయి. తాకట్టు టికెట్టులున్నాయి. ఆ బల్ల చివర నాకోసం వుంచిన మిఠాయి వుంది. ఇంక నాకు ఏడుపు ఆగలేదు.

ఆ రాత్రి అలసటతో నిద్రపోయాను. ప్రొద్దున లేచి మళ్లీ అక్కడి శూన్యాన్ని చూసి మరీమరీ దిగులు పడ్డాను. గదిలో ఎండ పొడపడుతోంది. ఈ వెల్తురు అక్కడ అమ్మలేకపోవటం చూపిస్తున్నట్లుంది. నేను అలాగే కూర్చుండిపోయాను. అంతలో ఇంటి యజమానురాలు వచ్చింది. "నీవు ఇక్కడే వుండు. అదీ నేను ఈ గది అద్దెకిచ్చేవరకు, నీకు ఆకలేస్తే అడుగు" అంది. నేను కృతజ్ఞతలతో ఆమెను చూసి, "అన్న వచ్చి మీకివ్వవలసినంతా ఇస్తాడు" అన్నాను. కాని ఆహారం అడగటానికి చాలా సిగ్గుపడ్డాను.

నేను అన్నట్లు, మర్నాడు అమ్మను చూసేందుకు వెళ్లలేదు. కాని మా యింటావిడ వెళ్లి వైద్యుణ్ని కలిసి వచ్చింది. అమ్మను కేన్‌హిల్ ఆశ్రమానికి పంపినట్లు తెలిసింది. ఇక్కడికి 'కేన్‌హిల్' ఇరవయి మైళ్లుంటుంది. అంత దూరం వెళ్లే వనరులు నా దగ్గర లేవు! అన్న వచ్చిన తర్వాత ఇద్దరం కలసి వెళ్లాలి. కొన్నిరోజులు ఎవ్వరినీ కలవలేదు. ఎవరితో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. ఎవ్వరూ చూడకుండా బైటకు పోయేవాడిని. ఏదోరకంగా ఏదొకటి తినేవాడిని. ఒకరోజు ప్రొద్దున్నే నేను బైటకు పోవటం మా యింటి యజమానురాలు చూసింది. "ఏమైనా తిన్నావా?" అంది. తల అడ్డంగా వూపాను. "అయితే రా" అని గదిలోకి తీసుకెళ్లింది. నేను మెకర్తీ వాళ్ల ఇంటికి వెళ్లలేదు. అమ్మగురించి చెప్పవలసి వస్తుందని. ఏదో నేరం చేసిన వాడిలాగా ఎవ్వరికంటా పడకుండా వారంరోజులుగా తిరుగుతున్నాను. ఈ విధంగా ఒకరకమైన ఆవృత్తానికి అలవాటుపడ్డాను. అది ఆనందంగా లేదు, బాధగానూ లేదు. నా భయమంతా అన్న

రావటం ఆలస్యమైతే మా యింటి యజమానురాలు అధికారులకు చెప్పి నన్ను అప్పగిస్తుందేమోనని. మళ్లీ హన్‌వెల్ బడికి పంపుతారని. అందుకని ఆమెకు కనపడకుండానే తిరుగుతున్నాను. ఒక్కోరాత్రి బైటనే ఎక్కడైనా నిద్రపోతున్నా.

వడ్రంగి పని వాళ్లతో పరిచయం కలిగింది. వాళ్లు చాలా కష్టజీవులు. కెన్నింగ్‌టన్ రోడ్ వెనక చీకటి షెడ్డుల్లో పనిచేసుకుంటారు. రంపంతో కోస్తూ బాడితలతో, ఉలులతో పనిచేస్తూ రోజంతా అదేపని. ఆ చెక్క ముక్కలను ఒక్కోటి అరపెన్ని ఖరీదుచేసే కట్టలుగా కట్టేవాళ్లు. నేను వాళ్ల పనిలో సహాయం చేయటం మొదలుపెట్టాను. శుక్రవారం–శనివారం ఈ చెక్కముక్కలు (పొయిలోనో – చలిమంటకో వాడతారు) అమ్మేవారు. నాకు అమ్మకాల మీద ఉత్సాహం లేదు. ఈ షెడ్డులో పనిచేయటమే బాగుండేది.

మా 'బాస్' (అలానే పిలిచేవాళ్లం) పెద్దముక్కు – ఒంటి పన్నుతో వున్నా సౌమ్యంగా ఉండేవాడు. నాకు రెండు పెన్నిలు ఇచ్చి రొట్టె–వెన్న తెమ్మని చెప్పేవాడు. నేను ఆ మూలనే వున్న 'యాష్' టీ కొట్టుకు వెళ్లి ఒక పెన్నీకి రొట్టె ఒక పెన్నీకి వెన్న (వీళ్లు నాకు బాగా తెలిసినవాళ్లు – ఎప్పుడూ ఎక్కువగా ఇచ్చేదయ గలవాళ్లు కొని తెచ్చేవాణ్ణి. రొట్టెకు వెన్నరాసి అప్పుడప్పుడు కొంత మాంసం కొవ్వు కూడా వుండేది. కాల్చి తినేవాళ్లం. చాలా రుచిగా వుండేది.

బాస్‌ని ఎప్పుడూ నేను డబ్బు అడగలేదుకాని వారాంతానికి ఆరు పెన్నిలు ఇచ్చేవాడు. అది నాకెంతో సంతోషం కలిగించేది. బాస్‌తోపాటు జో వుండేవాడు. ఇతనికి మూర్ఛ రోగం వుండేది. ప్రొద్దున ఏడుగంటల నుంచి రాత్రి ఏడుగంటల వరకూ పనిచేసేవాళ్లు. అప్పుడు ఆ రేకుల షెడ్డు మూసి వెళ్లిపోయేవాళ్లు. నాకు చాలా దిగులుగా వుండేది.

ఒకరాత్రి బాస్ మమ్మల్ని సౌత్ లండన్ సంగీత సభకి టికెట్టు కొని తీసుకు వెళ్ళాడు. నాకు చాలా ఆనందంగా వుంది. ఫ్రెడ్ కర్నో కామెడీ. 'ఎర్లీబర్డ్స్' చూడబోతున్నాం (ఈ కంపెనీలో నేను తర్వాత చేరాను). అప్పుడు జోకి మూర్ఛ వచ్చింది. నేనూ, బాస్ నాటకాన్ని చూడటానికి వెళ్ళాం.

నా బడి భయం పోలేదు. ఈ వడ్రంగి మేస్త్రీలు కూడా నా బడి గురించి అడిగేవాళ్లు. అప్పుడు వేసవి శెలవులు.

తర్వాత శలవులైపోయిన తర్వాత వాళ్లకు అనుమానం రాకుండా మధ్యాహ్నం వరకూ కనపడకుండా వుండి నాలుగున్నరకు వచ్చేవాడిని పనిచేయటానికి. అప్పటివరకు, ఎండలో బజార్లవెంటా, పార్కుల్లోనూ తిరుగుతూ వుండడం విసుగ్గా వుండేది. నాలుగున్నరకు వడ్రంగి మేస్త్రి షెడ్డుకి రావటం ఆనందంగా వుండేది. ఒక రాత్రి మెల్లగా నా గదిలోకి వెళ్తుండగా మా యింటి యజమానురాలు నన్ను పట్టుకుంది. చాలా సంతోషంగా 'ఈ టెలిగ్రాం చూడు' అని ఇచ్చింది. "రేపు ఉదయం పదిగంటలకి వాటర్‌లూ స్టేషన్‌లో దిగుతాను సిడ్నీ" అని వుంది.

ప్రొద్దున్న అన్నను కలవటానికి వెళ్లినప్పుడు నా అవతారం నలిగిపోయిన బట్టలు, వంగిపోయిన టోపీ, నిద్రలేని కళ్లు, ఇవన్నీ చూసి "ఏమయింది?" అన్నాడు. నేను "అమ్మకు మతి స్థిమితం లేదు, ఆసుపత్రికి పంపాను" అని వెంటనే చెప్పాను. అన్న ఆ వార్తలు కష్టంతో తీసుకున్నా "నీవెక్కడ వుంటున్నావు" అన్నాడు. 'పోనాల్ టర్రీస్'లోనే అన్నాను. ఇంతలో అన్న, సామాన్లు అన్నీ ఒక బండిమీద పెట్టించాడు. అందులో ఒక గెల అరటిపళ్లున్నాయి. 'ఇవి మనవేనా' అని అడిగాను. 'అవి ఇంకా పండలేదు. ఒకరోజు ఆగాలి' అన్నాడు. ఇంటికెళ్లే దారిలో అమ్మను గురించి అడుగుతూనే వున్నాడు. అదంతా చెప్పటం నాకు చాలా రిలీఫ్ బాగా వుంది. తను కేప్‌టౌన్ ఆసుపత్రిలో వుండిపోయాననీ, తిరుగు ప్రయాణంలో ఇరవయి పౌండ్లు సంపాదించినట్లూ, అమ్మకివ్వాలనుకుంటున్నట్లూ చెప్పాడు. నౌకలో చాలామంది సైనికులు, చిన్నలాటరీల వాళ్లద్వారా డబ్బు సంపాదించినట్లు చెప్పాడు. అప్పుడు తన ఆలోచనలూ ప్రణాళికలూ చెప్పాడు. "ఈ నౌకలమీద ప్రయాణాలు ఆపేస్తాను. నటనమీద మనసుపెట్టి నటుణ్ణవుతాను" అని నమ్మకంగా చెప్పాడు.

ఈ ఇరవయి పౌండ్లతో మూడువారాలు గడపవచ్చు. ఈలోగా ఏ నాటక శాలలోనో పని దొరుకుతుందని అన్నాడు. మేము బండిలో బండెడు సామానుతో అరటి గెలతో రావటం అక్కడ అందరికీ ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ వుంది. ముఖ్యంగా మా యింటి యజమానురాలికి.

అదే రాత్రి నన్ను బట్టలకొట్టుకు తీసుకువెళ్లి కొత్త బట్టలు కొన్నాడు. ఆ రాత్రి సౌత్ లండన్ హాలుకు వెళ్లాము. "ఇప్పుడు అమ్మ వుంటే మనతో ఎంత బాగుండేది"

అన్నాడు. ఆ వారమే కేన్‌హిల్‌కి వెళ్లి అమ్మను చూశాము. మేము సందర్శకుల గదిలో కూర్చుండగానే మాకు ఈ నిరీక్షణ భరించలేననట్లుగా తయారయింది.

ఇప్పుడు అమ్మతో మేమే వున్నాము. అన్న అన్ని కబుర్లూ చెప్పాడు. అమ్మ అన్నీ వింటూ తల వూపుతూ చూసింది. "అమ్మా, నీకు త్వరగానే తగ్గిపోతుంది" అన్నాను.

తర్వాత వైద్యుడు చెప్పాడు "కేవలం మంచి ఆహారం లేకనే ఆమె ఆరోగ్యం చెడిపోయింది. ఇప్పుడు మందులు, ఆహారం, విశ్రాంతితో కొన్ని నెలలు పట్టవచ్చు, ఆమె మామూలు మనిషి కావాలంటే" అని.

నా చెవిలో అమ్మమాటలే మోగుతున్నాయి. "అవును నీవు ఒక కప్పు టీ ఇచ్చి వుంటే, ఆ మధ్యాహ్నం నాకీ స్థితి వచ్చేది కాదు" అంది. అవును ఈ మాటలే నా చెవిలో మార్మోగుతున్నాయి...

అయిదో అధ్యాయం

నటునిగా

అప్పటి మా స్థితి చాలా ఘోరంగా వున్నా, నాకపుడు అదృష్టం వుంది. నేను అన్ని పనులూ చేసేవాడిని. పత్రికలు అమ్మేవాడిని, ముద్రణలో పనిచేసేవాడిని. బొమ్మలు తయారు చేశాను. గాజు సామాను చేసేవాడిని. వైద్యుడి దగ్గర వున్నాను. ఇన్ని పనులు చేసినా నా దృష్టి నటించాలనే దానిమీదే వుండేది. అన్న సిడ్నీకూడా అదే ఆలోచించాడు. నేను చేసే పనుల్లో ఎప్పుడు విరామం దొరికినా బూట్లు పాలిష్ చేసుకుని, బట్టల దుమ్ము దులుపుకుని, టైని సరి చేసుకుని, బ్లాక్ మోర్ (నాటకాల ఏజంటు) దగ్గరకు వెళ్లేవాడిని. మొదటిసారి ఆ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఎంతో హుందాగా మంచి బట్టల్లో అక్కడ పనిచేసేవాళ్లు కనిపించేవారు. వారు ఎంతో స్పష్టంగా ఒకరితో ఒకరు మాట్లాడడం విన్నాను. ఒకరకమైన చేయూతతో కాస్త దూరంగా ఒక మూలగా నిలబడి ముఖ్యంగా వాళ్ళు అవతారం అంతా చూస్తుండేవాడిని. ఇంతలో లోపలి గదిలోనుంచి ఒక గుమాస్తా వచ్చి అక్కడ మాట్లాడుతున్న వారితో నీకు ఏమీ వేషం లేదు, నీకు కూడా, అరే నీకు "అని అందర్ని పంపించివేస్తుండేవాడు. ఆ కార్యాలయం చర్చిలాగా కాళీ అవుతూ వచ్చింది. అప్పుడే అతను నన్ను చూశాడు. "ఏయ్ నీకేంకావాలి?" "చిన్నవాళ్ల పాత్ర ఏమీ లేదా" అని అడిగాను. "నీవు ఇక్కడ నమోదు చేసుకున్నావా?" తల వూపాను. ఆశ్చర్యంగా నన్ను లోపలకు తీసుకువెళ్లాడు. నా పేరూ, చిరునామా ఇంకా వివరాలూ అన్ని తీసుకుని "ఏదయినా అవకాశం వుంటే కబురు పెడతారు" అన్నాడు. నాకు వేషం వచ్చినంత సంతోషంగా తిరిగి వచ్చాను.

సరిగ్గా అన్న తిరిగివచ్చిన నెలకు నాకు బ్లాక్‌మోర్ ఏజంటు దగ్గర్నుంచి ఒక పోస్ట్‌కార్డ్ వచ్చింది, వచ్చి కలవమని. అపుడు కొత్త సూటులో వెళ్లి బ్లాక్‌మోర్‌ని కలిశాను. ఆయన నవ్వుతూ చాలా సౌమ్యంగా వున్నాడు. నా చేతికి ఒక చీటి ఇచ్చి చార్లెస్

థ్రోమెన్ ఆఫీసులో హామిల్టన్ గారికిమ్మన్నాడు. అది చూసి హామిల్టన్ నన్ను ఎగాదిగా పరీక్షించాడు. ఇంత చిన్నగా వున్నావేమిటని. నా వయసు 14 అని అబద్ధం ఆడాను (అప్పుడు 12 1/2 సం॥రాలే).

ఆయన నాకు బిల్లీ వేషం ఇచ్చాడు. అది షెర్లాక్‌హాం నాటకంలో తపాలా కుర్రాడి వేషం. అది 40 వారాల యాత్రతో వచ్చే శిశిరంలో మొదలవుతుంది.

"అప్పటివరకు కొత్త నాటకంలో ఒక వేషం ఉంది. ఆ నాటకం పేరు "జిమ్ కాక్ నీ రొమాన్స్." ఇది షెర్లాక్ హామ్ టూర్‌కంటే ముందు రెండువారాలు నడుస్తుంది. ఇంకోవారం రోజుల్లో మొదలవుతుంది. నీకు జీతం 2 పౌండ్ల పది షిల్లింగ్‌లు" అని హామిల్టన్ చెప్పారు. నా మనసులో ఈ జీవితమే పెద్ద అదృష్టం అనుకున్నా. కాని ఆయనతో 'నా జీతభత్యాలు అన్నీ అన్న మాట్లాడుతాడు' అని బెట్టుగా అన్నాను. ఆయన నవ్వుతూ కార్యాలయంలో పనిచేసేవాళ్లందర్ని పిలిచి "చూశారా – ఇతనే మన బిల్లీ" అని అందరికీ పరిచయం చేశాడు. అందరూ ఆనందంగానే వున్నారు నన్ను చూసి ఆనందించారు. అప్పుడే అనిపించింది 'ఇంక రోజులు మారిపోయాయి. ఈ ప్రపంచం నన్ను ఎంతో, దయతో తన చేతుల్లోకి తీసుకుంది' అని. హామిల్టన్, సెయింట్స్ బరీకి ఒక ఉత్తరం ఇవ్వమని నాకిచ్చారు. అది తీసుకుని లీసెస్టర్ స్క్వేర్‌లో వున్న గ్రీన్‌రూం క్లబ్‌లో వున్న సెయింట్స్‌బరీ గారిని కలిసాను. అక్కడా అంతే, ఆయనా అంతే. అందర్నీ పిలిచి నన్ను పరిచయం చేశాడు. 'జిమ్' నాటకంలో నా వేషం 'సామా'కి సంబంధించిన కాగితాలు ఇచ్చారు. 'ఇది నాటకంలో చాలా ముఖ్యమైన పాత్ర. బాగా సాధనచెయ్యి' అని. 'ఫర్వాలేదు ఇంకా వారం రోజులుందిగా అని' చాలా ధైర్యం చెప్పారు.

అక్కడ నుంచి మా గదికి ఇక మబ్బుల్లోనే నడిచాను! అన్నతో అన్నీ చెప్పాను. ముఖ్యంగా నాకు సంబంధించిన జీతభత్యాల విషయం "నువ్వే మాట్లాడాలి" అని. ఇన్నాళ్లకు అమ్మ కల నిజం కాబోతోంది. ఇంక పేదరికం నిన్నటిమాట. ఇప్పుడు మాకు ఒక స్టేటస్ వున్నట్లు, నేను ఒక ముఖ్యమైన ప్రపంచంలో అడుగు పెడుతున్నాను. ఒక బంగారు గడప దాటుతున్నాను. అన్నకూడా "ఇది మన బ్రతుకులకు ఒక ముఖ్యమైన మలుపు, ఇప్పుడు అమ్మవుంటే ఎంతో సంతోషించేది కదా ఇక్కడ." "అవును, మనం సంవత్సరంలో 60 పౌండ్లు పొదుపు చేయవచ్చు." అన్నాను. తర్వాత హామిల్టన్‌తో అన్న మాట్లాడాడు. జీతం గురించి బేరం చేశాడు. కాని ఆయన 'అంతే' అన్నాడు. మాకు అదే ఎక్కువకదా!

ఇంటికి వచ్చి బాగా సాధన చేశాను. అన్న చదివేవాడు. నా పాత్రకి సంబంధించిన సంభాషణలన్నీ ఎలా పలకాలో ఎక్కడ ఆపాలో ఎప్పుడు ఎక్కడ ఎలా తిరగాలో అన్నీ సాధన చేశాను. అంతా కంఠతా వచ్చేసింది. తర్వాత సెయింట్స్‌బరీ ముందు రిహార్సల్‌చేసి చూపాను. 'అరె ఇంతకు ముందు నటించావా? అంతా బాగుంది. మాట్లాడేటప్పుడు తల ఎక్కువగా వూపకు' అని మాత్రం చెప్పాడు.

కింగ్‌స్టన్ థియేటర్‌లో 'జిమ్' ఒక వారం నడుస్తుంది. మరోవారం పుల్‌హామ్‌లో. ఈ నాటకం చాలా నాటకీయత వున్న కథ. మతిమరుపు 'డ్యూక్', ఒక పూలమ్మే అమ్మాయితో (ఆ అమ్మాయి గదిలోనే వుంటాడు) వాళ్లతోబాటు 'సామ్మీ' (నా పాత్ర) అనే వార్తాపత్రికలు అమ్మే కుర్రవాడు కూడా వుంటాడు. డ్యూక్ మంచంమీద, అమ్మాయి చేరువలో సామ్మి నేలమీద నిద్రపోతుంటారు.

మొదట సీను – లాయరు కార్యాలయం. జేమ్స్‌సీటన్ గట్‌రాక్. ఈయన చాలా సంపన్నుడు. ఈయన మా డ్యూక్‌కి తెలిసినవ్యక్తే. లాయరు భార్య ఒకప్పుడు డ్యూక్ ప్రేయసి, ఇప్పుడు సహాయంకోసం లాయర్ను అర్థిస్తున్నారు. కాని లాయరు డ్యూక్‌ని ఛీత్కరించి పొమ్మంటున్నాడు. జబ్బుగా వున్న డ్యూక్ అక్కడ వున్న కాగితాలు కోసే కత్తిని పట్టుకుని లాయర్ను కొట్టేందుకు వెళ్లబోయి మూర్ఛవచ్చి లాయరు ముందుకు పడిపోయాడు. ఈ సమయంలోనే లాయరు భార్య (ఒకప్పటి డ్యూక్ ప్రియురాలు) గదిలోకి వస్తుంది. డ్యూక్‌కి సహాయం చెయ్యమంటుంది. కాని లాయరు డ్యూక్‌ని తిడతాడు. పైగా అతను నీ ప్రియుడేగా, "మీకు సిగ్గులేదు...", అంటూ దూషిస్తాడు. మాటా మాటా పెరిగి లాయరు భార్య అక్కడ వున్న కత్తితో అతన్ని పొడుస్తుంది. లాయరు కత్తిపోటుకి చనిపోతాడు. డ్యూక్ ఇంకా క్రింద పడివున్నాడు. మతిలేక. లాయరు భార్య భయంతో వెళ్లిపోతుంది. తర్వాత డ్యూక్ లేచి "అరే ఎంతపని చేశాను..." అనుకుంటాడు. చచ్చిపోయిన లాయర్ను చూసి. అతని చేతుల్లో వున్న డబ్బునీ, విలువైన బంగారాన్నీ తీసుకుని కిటికీలో నుంచి వెళ్లిపోతూ "లాయరూ చివరికి నాకు సహాయం చేశావు. ధన్యవాదాలు" అంటూ నిష్క్రమిస్తాడు. తరువాత రంగం డ్యూక్ వుండే చోటు. అక్కడికి ఒక అపరాధ పరిశోధకుడు వస్తాడు. అక్కడున్న బీరువాని పరీక్షిస్తుంటాడు. సరిగ్గా ఇప్పుడే నేను ఈల వేసుకుంటూ ప్రవేశిస్తాను. అతన్ని చూసి ఆగి, 'ఓయి ఇది ఆమె పడుకునేచోటు అని తెలుసా?"

"ఏమిటి? ఈ బీరువాలోనా? నీవిలా రా" అన్నాడు.

"ఇక్కడకు ఎలా వచ్చావు?" "అది మర్చిపో. ఆ తలుపు వేసిరా" "ఏం మర్యాద తెలీదా?"

అయినా ఆడవాళ్లు పండుకునే చోటికి నీలాంటివాళ్లు రావచ్చా?"

"నేను అపరాధ పరిశోధకుణ్ణి."

"అమ్మో పోలీసా?" "నిన్నేమీ చేయనులే. నాకు కొన్ని వివరాలు కావాలి."

"పోలీసులు మంచి చేస్తే అదృష్టమే."

"ఇక్కడెవరుంటున్నారు?"	"డ్యూక్‌గారు."
"ఆయన అసలు పేరు?"	"నాకెలా తెలుస్తుంది?"
"ఆయనెలా వుంటాడు?"	"సన్నగా, నెరిసిన జుట్టు, గడ్డం నున్నగా, టోపీతో, కళ్లజోడుతో...."
"మరి 'జిమ్' ఎవరు?"	"అతడు కాదు. ఆమె, అవునా?"
"ఆమేనా ఇక్కడ వుండేది?"	"ఆఁ... ఆమె మీరు చూస్తున్న బీరువాలో నిద్రపోతుంది!"

ఇలా గడిచేది నాటకం. ఈ నాటక ప్రదర్శన జరుగుతున్నప్పుడు నా మాటలకి ప్రేక్షకులు నవ్వుతుండేవారు మెచ్చుకోలుగా. అయితే 'జిమ్' నాటకం పెద్దగా విజయవంతం కాలేదు. కాని నన్నూ, నా నటననూ మెచ్చుకుంటూ "లండన్ టాపికల్ టైమ్స్" నాకు మంచి భవిష్యత్తు వుందంటూ రాసింది. ఇది చూసి నేనూ సిడ్నీ చాలా ఆనందించాం. 'జిమ్' రెండు వారాలు నడిచిన తర్వాత 'షెర్లాక్ హోమ్స్' రిహార్సల్ మొదలుపెట్టాము. అప్పటికీ మేము 'ఫోనాల్ టెర్రెస్'లోనే వుంటున్నాము. నాటకాల ఆదాయం ఎంతవరకు వస్తుందో మరి! అదే అనుమానంతో అంతకంటే ఎక్కువ అద్దె భరించలేక.

తర్వాత ఒకసారి అమ్మను చూడటానికి వెళ్లాము. అమ్మ పరిస్థితి ఏమీ మెరుగు పడలేదు. నేను చూడలేనని అన్న చూసి వచ్చాడు. ఆసుపత్రి లోపలికెళ్లి. తర్వాత నేను నాటకాల యాత్రలో వున్నప్పుడు అన్న తరచూ అమ్మను చూసి వస్తుండేవాడు. షెర్లాక్‌హోంగా నటించే హెచ్.ఎ. సెయిట్స్‌బరీ అచ్చం స్ట్రాండ్ మాగజైన్ వేసిన షెర్లాక్

బొమ్మను పోలి వుండేవాడు. పొడవైన ముఖం, ఫాలభాగం, షెర్లాక్ వేషానికి చక్కగా సరిపోయేది, ఆ నాటకం రాసి నటించిన విలియం గిల్లిట్ కంటే కూడా సెయింట్స్ బరీకే ఎక్కువ పేరు వచ్చింది. టూర్‌లో నేను చిన్నవాడిని కాబట్టి సెట్లు తయారుచేసే వడ్రంగితో, ఆయన భార్యతో (ఈమె దుస్తులు తయారు చేస్తుండేది) పాటు వుండే ఏర్పాటు చేశారు. వారిద్దరూ తరచూ తాగుతుండేవారు. వారితోపాటు భోజనం చేయడం కుదిరేదికాదు. అందుకని ఎక్కువగా పగలు వూరంతా, తిరిగి వచ్చేవాణ్ణి. మూడువారాల తర్వాత ఒక్కడినే వుండటానికి ఏర్పాటు చేసుకున్నాను. ఒంటరిగా వుంటే ఎంతో ఏకాంతంలోకి వెళ్లిపోవటం అలవాటయింది. రాత్రి ప్రదర్శన వేళవరకూ ఎవ్వరినీ కలిసేవాడిని కాదు. నా మాటలు నేనే వింటూ గడిపేవాడిని. ఈ ఒంటరితనం చాలా బాధ కలిగించేది. ఉత్తరాది పట్టణాల్లో ఆదివారాలు చర్చిగంటలు వింటూ రహదారులు తిరిగేవాడిని (ప్రదర్శన లేనప్పుడు). పగలంతా ఆ వూళ్లోవున్న దుకాణాలూ, సంతలూ తిరిగేవాడిని.

అలా తిరిగి తిరిగి నేనుండే ఇంటికి చేరేవాడిని. అప్పటికి ఇంటి యజమాని రొట్టెలు కాలుస్తుండేది. ఆ వాసనా, ఆ వేడీ నాకెంతో ఓదార్పుగా వుండేది. వారితోపాటు భోజనంచేసి తృప్తిగా నిద్రపోయేవాడిని. ఈ ఉత్తర పరగణాలలో ఆరు వారాలు ప్రదర్శనలు ఇచ్చాం.

అన్నకు ఇంకా ఏ వుద్యోగం రాలేదు. ప్రదర్శనల శాలలోకూడా చుక్కెదురైంది. తర్వాత ఒక హోటల్‌లో వుద్యోగంకోసం ప్రయత్నించాడు. స్ట్రాండ్‌లోని కోల్ హాక్ హోటల్‌లో. నూటయాభైమంది ఆ వుద్యోగానికి వస్తే వాళ్లు సిడ్నీనే తీసుకున్నారు. అయినా అన్నకు నాటకాల్లో చేరలేకపోయానని బాధవుండేది. నాకు తరచూ వుత్తరం రాస్తుండేవాడు. నేను ఎక్కువ జవాబు రాసేవాణ్ణి కాదు. దానికి కారణాలు ప్రత్యేకం లేకపోయినా నేనున్న పరిస్థితులే అనుకోవాలి. ఒకసారి అన్న వుత్తరం రాశాడు. "అమ్మకు జబ్బు చేసింది. ఇప్పుడు లోకంలో నీకు నేనూ – నాకు నువ్వూ తప్ప ఎవరున్నారు – నాకు వుత్తరం రాస్తుండు – నాకు ఒక తమ్ముడున్నా డని గుర్తుండాలికదా" అని. ఈ వుత్తరం నన్ను పూర్తిగా మార్చివేసింది. అప్పటినుంచి వెంటనే జవాబులు రాస్తుండేవాడిని. మా అనుబంధం తర్వాత మా యిద్దరి జీవన గమనంలో దృఢంగా నిలిచిపోయింది. ఒంటరిగా వుండడం అలవాటయి పోయింది. మా ట్రూపులో ఎవ్వరైనా కనపడితే

తప్పుకు వెళ్లిపోయేవాడిని. ఇంకొకరితో మాట్లాడడం కూడా అలవాటు తప్పి, మా తోటినటులు బజారులో కనపడితే, వెంటనే ఏమీ మాట్లాడలేకపోయేవాడిని.

తర్వాత నన్ను నేనే నిర్లక్ష్యం చేయటం మొదలయ్యింది. నా అలవాట్లు కూడా నిలకడ-నియమం లేక సరైన బట్టలుకూడా వేయటం తగ్గింది. అందుకు చీవాట్లు కూడా తప్పేవి కావు.

తోడుకోసం ఒక కుందేలును పెంచాను. దాన్ని దాయటం చాలా కష్టమైపోయేది. దానికి, పిలిచినప్పుడు రావటం, ఎవరైనా వచ్చినప్పుడు దాక్కోవటం నేర్పాను. ప్రతి పట్టణంలో నేను ఏదో ఇంటిలో పేయింగ్ గెస్ట్‌గా వుండేవాడిని కదా. నాకు ప్రొద్దున్నే పలహారం తెచ్చినపుడు యజమాని, కుందేలు వాసనకు అనుమాన పడేది. వాసనను దాయలేం కదా.

అలాగే ఒక వూళ్లో ఇంటి యజమాని నేను లేనపుడు కుందేలును బైటకు తీసుకెళ్లి వదిలివేసింది. నేను అనుమానంగానే అడిగాను. బహుశా పారిపోయి వుంటుంది' అని, అన్నది ఆమె. ఆ విషయం అక్కడితో ముగింసింది.

ఎబ్‌లేక్ అనే వూరు చాలా చెమ్మగా వికారంగా వుండేది. అక్కడ మూడు రాత్రులు వుండాలి. ఒక ఇంట్లో వుండటానికీ తినటానికి మాట్లాడుకున్నాను (ఇది మామూలే). మా ట్రూపు అంతా ఏదో హోటల్‌లో సర్దుకుంది.

ఆ రాత్రి ప్రదర్శన తర్వాత ఇంటికి వచ్చాను. ఆ ఇంటి యజమాని నన్నుచూసి, నువ్వు 'మనిషి కప్పను' చూస్తావా? అని అడిగాడు. అతడు మా నాటకం చూసివచ్చాడు.

నాకర్థమయ్యేలోపే "గిల్బర్ట్ - ఇటురా" అని పిలిచాడు. వారి వంటింటిలో నుంచి రెండుకాళ్లు లేని మనిషి ఆకారం బైటకు వచ్చింది. "ఇతనే గిల్బర్ట్ - చాలా ట్రిక్కులు చేస్తాడు. ఏదీ ఒకసారి కప్పలాగా ఎగురు" అన్నాడు. గిల్బర్ట్ చేతులు మీదే నా ఎత్తు ఎగిరాడు. ఇదంతా చూసి నేను చాలా గాభరాపడిపోయాను. అతనికి ఏదైనా సర్కస్‌లో అవకాశం వుంటుందా అని నన్ను అడిగారు. నాకు తెలిసిన కొన్ని సర్కస్ కంపెనీ పేర్లు చెప్పాను. ఆ రాత్రి నా గది తలుపులు గట్టిగా వేసుకున్నా, నాకు నిద్ర పట్టలేదు. మర్నాడు ఆ వూరు వదిలి వెళ్లిపోయాను.

నలభై వారాలు జిల్లాలన్నీ తిరిగి చివరి ఎనిమిది వారాలూ లండన్ వెలుపల ప్రదర్శనలు ఇవ్వటానికి వచ్చాం. 'షెర్లాక్‌హోం' నాటకం బాగా విజయవంతమైంది. అందుకని మూడువారాల విరామం తర్వాత రెండో యాత్రకూడా మొదలు పెడతారు.

ఇక ఇప్పుడు అన్నా, నేనూ పోనాక్ గది వదిలి కెన్నింగ్‌టన్ వీధిలోకి మారాలని అనుకున్నాం. పాములు కుబుసం వదలినట్లు, మేము మా పేదరికపు ముసుగు వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాం. గతాన్నుంచి, ఆ గుర్తులనుంచి దూరంగా రావటమే మా లక్ష్యం. నేను 'షెర్లాక్ హోం' నాటక కంపెనీ వాళ్లతో మాట్లాడి – అన్నకు ఏమైనా చిన్న వేషం ఇమ్మని అడిగాను. అన్నకు వారానికి ముప్పయి అయిదు షిల్లింగుల వేతనంతో వాళ్లిచ్చారు కూడా! అప్పుడు ఇద్దరం కలిసి వుండవచ్చుకదా!

మా రెండో యాత్ర ముగిసేసరికి – అమ్మ వున్న ఆసుపత్రి నుండి వుత్తరం వచ్చింది. అమ్మ పూర్తిగా కోలుకుందని! ఇదెంత శుభవార్త! మేము వెంటనే అమ్మను తీసుకు రావటానికి ఏర్పాట్లు చేశాం. మేము అప్పుడు 'రెడింగ్' పట్టణంలో వున్నాం. అక్కడ కలుసుకునే ఏర్పాటు జరిగింది.

అమ్మ వస్తుందని మంచి ఇల్లు తీసుకున్నాం. రెండు పడక గదులూ ఒక హాలూ. పియోనోతో సహా ఆమె గదంతా పూలతో అలంకరించాం. ఆ రాత్రి మంచి భోజనం ఏర్పాటు చేశాం.

అన్నా, నేనూ రైలుస్టేషన్‌కు వెళ్లాం. అక్కడ ఎదురు చూడటం చాలా కష్టమైంది. చివరికి రైలుబండి వచ్చింది. ఎంతో ఆత్రుతతో దిగే వాళ్లని అందర్నీ చూస్తున్నాం. అదిగో చివరికి అమ్మ! నవ్వుతూ మావైపే వస్తోంది. మమ్ముల్ని కలిసి ఆశ్చర్యంగా పలకరించింది. మా ఆనందానికి హద్దేలేదు. అక్కడనుంచి బండిలో మేము తీసుకున్న ఇంటికి వెళ్లేలోపు, ఎన్నో సంగతులు మాట్లాడుకున్నాం. ఇల్లు చేరి అమ్మకు అంతా చూపించాము. చివరికి హాల్లో కూర్చుని ఒకర్ని ఒకరు చూసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నాం. నాకు లోపల లోపల ఏడుపు వస్తోంది. ఆపుకుంటున్నాను. అమ్మ పాపం మాకోసం ఎన్ని కష్టాలు పడింది. తాను తినకుండా నాకు పెట్టింది. ఆమె లేకపోతే మా జీవితాలకు అర్థం ఏమిటి. ఇవన్నీ ఒక్కసారిగా నా గుండెల్లోనుంచి తన్నుకు వస్తున్నాయి. అయినా అమ్మను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక బైట పడలేదు.

అమ్మ కొంచెం బరువు పెరిగినట్లుంది. వయసుకూడా తెలుస్తోంది. "అమ్మా మా నాటకం యజమానిని కలిసినపుడు నువ్వు దర్జాగా వుండాలి" అన్నాను. అప్పుడు తన పౌడరు డబ్బా తీసి కొద్దిగా బుగ్గలకు అద్దుకుంది. "నేను బ్రతికి వుండడమే అదృష్టం నాయనా" అంది.

మెల్లగా మేము ముగ్గురం అలవాటవుతున్నాము. అమ్మ మాతోపాటే టూరులో వచ్చింది. ప్రదర్శన తర్వాత మేము ఇల్లు చేరేసమయానికి మాకు కావాలసినవన్నీ తెచ్చి వుంచేది. తప్పనిసరిగా పూలు తెచ్చేది. మేము ఎంత పేదరికం అనుభవించినా అమ్మ ఎప్పుడూ పూలు మరిచిపోయేది కాదు.

అమ్మ ఎంతగా మాలో కలిసిపోయినా మా ఎడబాటు కలిగించిన దూరం పూర్తిగా తరిగిపోలేదు. ఒక అతిథిగా మాతో వుంటున్నట్లనిపించింది.

అమ్మ లండన్ వెళ్లి వుండడానికి నిర్ణయించుకుంది. ఈ యాత్రలో తిరగటం చాలా ఖరీదుతో కూడింది. లండన్‌లో ఇల్లు తీసుకుని మా యాత్ర ముగిసే సమయానికి మాకు సిద్ధంగా ఉంచుతానని చెప్పింది. ఇదివరకు మేము వున్న చెస్టర్ వీధిలో మంగలి షాపుపైన ఇల్లు తీసుకుంది. పది పౌండ్లు పెట్టి కావాల్సిన సామాన్లు కొంది (వాయిదాల పద్ధతిలోనే). అన్నా – నేనూ కలిసి వారానికి నాలుగుపౌండ్లు పైన అయిదు షిల్లింగులు సంపాదిస్తున్నాము. అందులో అమ్మకు ఒక పౌండు అయిదు షిల్లింగులు పంపిస్తున్నాము.

రెండవ యాత్ర అయిన తర్వాత అమ్మ దగ్గరకు వచ్చాము. అమ్మతో వుండడం ఎంత ఆనందం! కొద్దివారాలు కలిసి వున్నాము. అప్పటికే నాకూ అన్నకూ – జిల్లాలలో పెద్ద యిళ్లూ అక్కడి వసతులూ అలవాటయి ఈ చెస్టర్ వీధిలో ఇల్లు ఇరుకనిపించింది. అమ్మ లేకపోతే మేము వుండే వాళ్లం కాదు! ఇది అమ్మకు కూడా అర్థమైంది. మమ్మల్ని పంపటానికి రైలుబండి దగ్గరకు వచ్చింది. చేతి గుడ్డ వూపుతూ వీడ్కోలు చెప్పింది. పైకి ఉత్సాహంగా కనిపించినా లోపల ఆమెకు దిగులు వున్నట్లే అనిపించింది.

మేము మా మూడో యాత్రలో వుండగా అమ్మ మాకు, మా మారుటి అమ్మ చనిపోయినట్లు వ్రాసింది. మేము ఈమె ఇంట్లోనేగా వున్నాము! నాన్నపోయిన నాలుగేళ్లకే ఈమె చనిపోయింది. మా మారుటి తమ్ముడు మేము చదివిన పోన్‌వెల్ బడిలోనే వున్నాడు. అమ్మ వెళ్లి తమ్ముణ్ణి చూసి వచ్చింది. వాడికి అన్ని విషయాలూ చెప్పి గుర్తు చేయటానికి

ప్రయత్నించింది. కాని చిన్న వయసులో జరిగినవేవీ వాడికి గుర్తు లేవు. వాడికి నాన్నే గుర్తులేదు. ఇప్పుడు 10 ఏళ్లు వచ్చినాయి. ఆ స్కూల్లో మా మారుటి అమ్మ పేరుతో వాడు నమోదు చేయబడ్డాడు. అమ్మకు తెలిసినంత వరకూ ఎవ్వరూ చుట్టాలు కూడా లేరు. మిఠాయి, పళ్లు కొనియిచ్చి తరచూ చూడటానికి వస్తానని చెప్పి వచ్చింది అమ్మ. తర్వాత వెళ్లింది కూడా. కాని ఆమెకు మానసిక రోగం మళ్లీ తిరగబెట్టింది. మళ్లీ కేన్‌హిల్ ఆసుపత్రిలో పెట్టవలసి వచ్చింది. ఇదంతా మాకు అశనిపాతంలా అయ్యింది. వివరాలు ఏమీ తెలియలేదు. మాకు వచ్చిన ఉత్తరంలో, అమ్మ అక్కడి వీధుల్లో అసంగతంగా తిరుగుతుంటే ఇరుగు పొరుగు వారు ఆమెను మానసిక చికిత్సకోసం కేన్‌హిల్‌లో చేర్పించారని మాత్రం వార్త వచ్చింది.

మేము ఏమి చేయగలం? నిజాన్ని భరించాలికదా – అమ్మ ఆ ఆసుపత్రిలోనే చాలాకాలం ఉండిపోవల్సి వచ్చింది. ఆమెకు పూర్తిగా నయం కాలేదు. మా స్థితి మారే వరకూ అక్కడే వుంచి తర్వాత ఒక ప్రైవేటు ఆసుపత్రికి మార్చాం.

దేవుడు దయదల్చి ఆమెకు చివరికి స్వస్థత చేకూర్చాడు. ఆమె జీవితంలో చివరి ఏడు సంవత్సరాలు పూర్తి ఆరోగ్యంతో పూర్తి వెలుతురులో తన సంతానం సాధించిన విజయాలను చూసి ఆనందిస్తూ గడిపింది!

మేము ఈ యాత్రలోనే వుండిపోవాల్సి రావటంతో అమ్మను వెంటనే చూడలేకపోయాం. ఫ్రోమెన్ కంపెనీ టూర్ అయిపోయింది. అప్పుడు హారీయార్క్, థియేటర్ రాయల్ సొంతదారు, 'షెర్లాక్ హోం" హక్కులు చిన్నిచిన్ని పట్టణాల్లో ప్రదర్శించేందుకు కొన్నాడు. నన్నూ – సిడ్నీని తీసుకున్నాడు కాని జీతాలు తగ్గిపోయాయి.

ఇది చాలా సాదాసీదా నాటకాల కంపెనీ. నాకు తేడా బాగా తెలిసి వచ్చింది. అంతకు ముందున్న అనుభవంతో ఇప్పటి దర్శకునికి సలహాలు ఇవ్వటానికి ప్రయత్నించాము. ఈ దర్శకుడు కూడా తరచూ అడిగేవాడు. నేను "ఫ్రామన్" కంపెనీలో ఏ విధంగా చేశారో చెప్పేవాడిని. ఇది అందరికీ కాస్త చిరాకు కలిగించేది. రంగస్థల మేనేజరు ఒకసారి పది షిల్లింగుల అపరాధ రుసుం వేశాడు కూడా, కోటుకు గుండీ లేదని!

'షెర్లాక్ హోం' నాటకం రాసిన విలియమ్ గిల్లెట్ లండను వచ్చారు. ఆయనతో మేరీడోరో కూడా వుంది. వాళ్లు 'క్లారిస్సా' అనే నాటకం వేస్తున్నారు. ఇది కూడా

ఆయన రాసిందే. దీనికి విమర్శకుల ప్రశంసలు రాలేదు. ఆ బాధతో 'షెర్లాక్ హోం బాధలు' అని ఒక చిన్న గల్పిక తయారు చేశాడు. అందులో ఆయనకి సంభాషణలే లేవు. ముగ్గురే పాత్రలు. ఒక పిచ్చిదీ, షెర్లాక్‌హోంకూ, ఆయనకి సహాయంగా వుండేవాడు.

అదిగో అప్పుడే నాకు టెలిగ్రాం పంపారు. 'బిల్లీ' పాత్ర వేయటానికి వస్తారా అని. నేను వేరే ఒప్పందంలో వున్నాను కదా. అయినా మా కొత్త కంపెనీని అడిగాను. వాళ్లకి ఆ చిన్ని పట్టణాలలో మరొక 'బిల్లీ' దొరకటం కష్టమే. నా అదృష్టం బాగుంది. వాళ్లకి ఒక కుర్రవాడు దొరికాడు. దానితో నేను లండన్ వెళ్లటానికి అవకాశం లభించింది.

మళ్లీ లండన్లో అది 'వెస్ట్ ఎండ్' హాల్లో నాటకం వేయడం నాకు పునర్జన్మ లాంటిదే.

మర్నాడు గిల్లెట్‌ని కలిసినప్పుడు "నాతో షెర్లాక్ హోం నాటకంలో నటిస్తావా?" అని అడిగాడు. నేను ఉత్సాహంగా తప్పనిసరిగా గిల్లెట్ గారూ" అని సమాధానం చెప్పాను.

ఆ మర్నాడు రిహార్సల్‌కి ఉదయమే రంగస్థలానికి వెళ్లినపుడు, మేరీడోరోని చూశాను. తెల్లని వేసవి దుస్తుల్లో మెరిసిపోతోంది. చాలా అందంగా వుంది. అప్పుడే బగ్గీ దిగి తన తెల్లని గౌనుమీద ఏదో మురికి మచ్చ వుండడం చూసి అక్కడి మేనేజర్ని అడిగింది. "ఇది ఎలాగైనా పోయేట్లు చెయ్యవచ్చా?" అని. అతను చెప్పిన నిస్సహాయమైన సమాధానం విని, "ఇది చాలా దారుణంకదా?" అని ఆమె చెప్పిన తీరు ఎంత హుందాగా వుంది!

ఆమె ఎంత అందంగా వుంది! నేను భరించలేనంతగా. ఆమె అందమే కాదు – ఆమె బట్టలూ, సున్నితమైన ఆమె పెదవులూ, తెల్లని ఆమె పలువరుసా, చిన్న చుబుకం, ఎర్రని చీకటి జుత్తూ, కాఫీరంగు కళ్లూ, ఇవేమీ భరించలేనట్లుగా ఆమె చిరుకోపం కూడా అంత మధురంగా ఉండి, అంత దగ్గరగా చూస్తూ కదలలేక పోయాను. అప్పుడు నాకు 16 ఏండ్లు. ఇంత అందమైన వెలుతురుకు సమిధను కాకూడదని నిర్ణయించుకున్నాను. కాని ఏమి అందం – ఆ మొదట చూపులోనే ప్రేమించేశాను కూడా.

ఈ 'షెర్లాక్ హోమ్' నాటకంలో 'ఇరీన్ వాన్‌బ్రూ' పిచ్చి దానిలాగా నటించిందామె. అన్నీ పిచ్చి మాటలు చెప్పింది. 'విల్లియమ్ గిల్లెట్' మౌనంగా నాటకాలు రాసుకుంటూ కూర్చుని వింటాడు. తర్వాత నన్ను పిలిచి ఒక కాగితం ముక్క ఇస్తాడు. ఇంతసేపు పిచ్చిది వాగుతూనే వుంటుంది. ఆ కాగితం తీసుకొని లేచి బయటకు వెళ్తాను. తర్వాత ఇద్దరు పెద్దవాళ్లు వచ్చి ఆమెను బైటకు తీసుకు వెళ్తారు. నేను, హోమ్ ఇద్దరమే వుంటాము స్టేజీమీద. "అదే సరైన పిచ్చాసుపత్రి సర్" అంటాను.

ఈ నాటకం విమర్శకుల నోళ్లు మూయించటానికి రాశాడు. మొదటివారం గడిచింది. మేనేజరు నా జీతం 'ఫ్రామన్' వాళ్లు ఇచ్చినంత (రెండు పౌండ్ల పది షిల్లింగులు) ఇచ్చాడు. ముందుగా అనుకోకపోయినా.

ఈ నాటకం రిహార్సల్ జరుగుతున్నప్పుడు 'మేరీ డోరో' మెట్లమీద తారసపడేది. 'నమస్తే' అని అంటుండేవాడిని. ఆమెకూడా నవ్వుతూ 'నమస్తే' అంటూ వెళ్లిపోయేది. ఇంకా అందంగా అనిపించేది.

ఈ నాటకం బ్రహ్మాండంగా ఆడింది. రాజరికపు అతిథులు వచ్చి చూసేవారు. క్వీన్ అలెగ్జాండ్రీయా, గ్రీసు రాజుకూడా, ప్రిన్స్ క్రిష్టియన్ అందరూ వచ్చి చూస్తుండేవారు.

ఈ నాటకం వేస్తున్నపుడే లార్డ్‌కిచినల్, డయాన బోనికాట్ నన్ను మెచ్చుకుంటూ మాట్లాడేవాళ్లు. 'షెర్లాక్ హొం' నడుస్తుండగానే సర్ హెన్రి ఇర్వింగ్ చనిపోయారు. ఆయన్ను 'వెస్ట్ మినిష్టర్ అబ్బేలో (ఇది రాజరికపు శ్మశానంలో) ఖననం చేశారు. ఈ అంత్యక్రియలకి నన్ను పిలిచారు. (వెస్టెండ్ నటుడుకి ఆ గౌరవం వుండేది).

ఇంకా రెండు వారాలలో 'హొం' నాటకం అయిపోతుందనగా 'బోసికాట్' నాకు ఒక పరిచయ లేఖ ఇచ్చారు, "కెండాల్" అనే దంపతులు కొత్త నాటకంలో వేషంకోసం. నేను సరిగ్గా 10 గంటలకు వెళ్లాను. ఆమె ఇరవయి నిమిషాల ఆలస్యంగా వచ్చింది. 'ఆ నువ్వేనా' అని, త్వరలో జిల్లాలన్ని టూర్ చేయబోతున్నాం. రేపు అన్ని విషయాలూ మాట్లాడవచ్చు ఇదే సమయానికి రా." అంది. ఆమె మాట్లాడటం పూర్తయిన తర్వాత–

'సారీ – నేను లండన్ బైటకు రాలేను' అని టోపీ తీసుకు వెళ్లిపోయాను. తర్వాత 10 నెలలు పని లేకుండా వుండిపోయాను!

'హౌం' నాటకం చివరి రాత్రి మేరీ డోరో కనపడింది. ఆమె మర్నాడే ఫిలిడిల్ఫియా (అమెరికా) వెళ్లిపోతోంది. ఆ బాధ భరించలేక ఆ రాత్రి విపరీతంగా తాగి పడుకున్నాను. (రెండు-మూడు సంవత్సరాల తర్వాత అమెరికాలో ఆమె కనపడినపుడు నన్ను పరిచయం చేసుకుంటానికి సిగ్గు పడ్డాను. ఆమె అందం ఏమాత్రం తగ్గలేదు!

'షెర్లాక్ హౌం' నాటక ప్రదర్శన అయిపోయింది. ఇప్పుడు నాకూ, సిడ్నీకీ పనిలేదు. కాని సిడ్నీకి వెంటనే చార్లీ మినన్ కంపెనీలో కామెడీ వేషం వచ్చింది. అప్పుడు ఈ హాస్య ప్రధానమైన చిన్న చిన్న నాటకాలు తిరుగుతుండేవి. ఇవన్నీ సర్కస్ హాస్యంలా వుండేది. ఫ్రెడ్ కార్నో అనే ఆయన ఇట్లాంటి ముప్పయి కంపెనీలు తయారుచేసి ఆడించాడు. అన్నీ పక్షులే 'జైలు పక్షులు', 'అమ్మ పక్షులు' 'ఉదయం పక్షులు' ఇవే పేర్లు. వీటి ద్వారానే లండన్‌లో మంచి హాస్యనటులు ఫ్రెడ్ కిచెన్, జార్జిగ్రేవ్స్, హారావెల్డన్, బిల్లీ రీవ్స్, చార్లీబెల్ మొదలయిన వారంతా కీర్తి గడించారు.

సిడ్నీని వారానికి నాలుగు పౌండ్లకు తీసుకున్నారు. నాకు ఇందులో ఎటువంటి వేషం లేదు. కాని నేను పొదుపు చేసిన సొమ్ముతో లండన్ (పూల్ రూం) లో తిరుగుతూ గడిపాను.

ఆరవ అధ్యాయం

తొలిప్రేమ

తొలియౌవనం తొంగి చూసే వయసులో సహజంగా జరిగే ఉద్వేగం, భావావేశం నన్నుకూడా స్థిమితంగా వుండకుండా ఏవేవో పగటి కలలు కంటూ, ఏదో జరగాలని ఎదురూచూస్తూ గడిపే అస్తవ్యస్తమైన మానసిక స్థితిలో పడి రోజులు గడుస్తున్నాయి. నా వృత్తి కేవలం పొట్టకూటికేనని, కళ అనేది నా మనసులోగానీ, నా నిఘంటువులోగాని చేరలేదు, అనీ నా విశ్వాసం. ఒకప్రక్క వయస్సు గందరగోళం, మరోప్రక్క పనివత్తిడీ, నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేవి. ఇదే కాలంలో వేశ్యగృహాలలో, వారకాంతలతో, అప్పుడప్పుడు తాగుడు. ఇవన్నీ పడుగు పేకల్లా పెనవేసుకుపోయి, నా తొలియౌవనపు రోజులు చిరాకుగానే గడుస్తుండేవి. కాని ఇవేమీ నన్ను తమలోకి లాగలేకపోయాయి. ఎందుకంటే నేను మానసికంగా రొమాన్సూ, సాహసం, ఇవే కోరుకునేవాడిని. వాటికోసం ఎదురు చూసేవాడిని! ఎంతో తపించేవాడిని కూడా.

మంచి బట్టలు వేసుకుని, అదే సూటు, టై, బూటు నీటుగా వేసుకుని, బుగ్గలు నున్నగా వుండే కుర్రవాడు. అందరూ అతన్నే చూడాలనీ, ఏదో ప్రేమతో సాహసంతో రోజు గడవాలనీ అనుకోవటం పరిపాటే. అప్పుడు నేను తిరిగేది అటువంటి సమాజంలో. ఆ సమాజంలోని యువకుడికి ఎంతో శక్తి వుంటుంది? అలా ఉందని అనుకుంటాడు. తనచేతిలోనే ఈ ప్రపంచాన్ని శాసించే శక్తి వుందనీ, దీన్ని సర్వనాశనం చేయగల సత్తా ఉందనీ అనుకోవడంలో తప్పేమిటి?

మనిషిలో దాగున్న సహజ జంతు లక్షణం అతనికి తెలియదా? ఆ జంతు బలంతోనేగా ఇన్ని యుగాల నుంచీ తన పరివారాన్ని ఏలుతున్నాడు! మోసం చేస్తున్నాడు. విధ్వంసం సృష్టించటంలో ఆనందిస్తున్నాడు!

బెర్నాడ్‌షా – ''నేను మనిషిగా వున్నందుకు ఎప్పుడూ అపరాధిగా బాధపడుతుంటాను'' అని, అందుకేగా వాపోయాడు!

చివరికి 'కాసే' సర్కస్ కంపెనీలో పని దొరికింది. ఇదంతా ప్రేక్షకులను నవ్వించటానికి చేసే నటనే. అది డాక్టరు వాల్‌పోర్డు బాడీ! ఇది మరీ చౌకబారు హాస్యంగా కాకుండా, వ్యక్తి గతంగా మలిచిన పాత్ర. ఈ పాత్ర నన్ను కంపెనీ స్టార్‌గా పెంచింది. వారానికి 3 పౌండ్లు!

అప్పుడు నేను లండన్‌లో కెన్నింగ్‌టన్ రోడ్‌లో ఫీల్డ్స్ (శ్రీమతి) మడామ్ ఇంట్లో వుండేవాడిని. ఉండటానికీ, తినటానికీ అక్కడే. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. పెదరికా, తెల్మా, ఫోచీ! అన్నకూడా లండన్‌లో వున్నపుడు మాతో వుండేవాడు.

కాసే సర్కస్‌లో పని అయిపోయిన తర్వాత కూడా కెన్నింగ్ టన్ రోడ్‌లోనే వుండేవాడిని. ఫీల్డ్స్ మాడెమ్ చాలా దయగలదీ, ఓర్పుగలదీ. ఆమే, ముగ్గురు కూతుళ్లూ, భర్త చాలా అనురాగంగా కుటుంబ బంధంతో వుండేవాళ్లు. అప్పుడు నాకు 17 ఏండ్లు. అమ్మా, కూతుళ్లూ ఇంట్లో పని అంతా వంతులు వేసుకుని చేశేవారు. నాలాంటివాళ్లు ఆరుగురం (అంతా ఒకే కంపెనీలో పని చేసేవాళ్లం) వుండేవాళ్లు. మాలాంటి వాళ్లకు గదులు అద్దెకిచ్చిన సంపాదనేవాళ్లకు ఆధారం. ఫీల్డ్స్ భర్త, రష్యన్ – చెక్కపని చేసేవాడు. తెల్మా అనే అమ్మాయికి ఇరవయి ఏళ్లుంటాయి. ఆమే పెత్తనం చేసేది ఇంట్లో. అంతకు మునుపు ఒక లాయరుతో లేచిపోయి కొన్నాళ్ల తర్వాత తిరిగి వచ్చేసింది. పని అంటే బద్దకం. అయినా పెత్తనం చేయటానికి అడ్డమేమిటి?

అప్పుడప్పుడు ఈ పని వంతుల దగ్గరే కూతుళ్లు పేచీలు పడేవారు. మాటామాటా పెరిగి అమ్మ (ఫీల్డ్సు) టీపాయ్ విసిరి కొట్టేది. తెల్మా ఏమయినా తక్కువ తిన్నదా. ఒక గ్లాసు మెల్లగా పడేసి పగలగొట్టేది. ఇల్లంతా పగిలిన పెంకులుతో నిండిపోయేది. చివరికి ఫోచి పనిచేయటానికి ముందుకొచ్చేది, నిజానికి తెల్మా చేయాలని తెలిసినా.

తర్వాత మూడునెలలు నాకు పనిలేదు. అయినా నేను వాళ్లతోనే వుండిపోయాను.

ఆ రోజుల్లోనే నన్ను ఫారెస్టర్స్ సంగీత సభలో ఒక వారం ట్రయల్ వేయమన్నారు. ఆ విషయంలో నేను చాలా ఆశలు పెట్టుకున్నాను. అది విజయవంతం అయితే నేను

పెద్ద స్టార్‌నయిపోతాను. ఒక్క సంవత్సరంలో పత్రికల్లో నా పేరు పెద్దగా పడుతుంది. ఫీల్డు కుటుంబానికి తప్పనిసరిగా టిక్కెట్లు తెచ్చి యిస్తాను అని కూడా చెప్పాను.

కాని చివరికి నిరాశే మిగిలింది. చాలాచాలా సాధన చేసి తీరా స్టేజీమీదకొచ్చి చాలా పేలవంగా పాడి నటించాను. చివరికి ఒక్కళ్లు కూడా నవ్వలేదు. పైగా నా మీదకి చిల్లర నాణాలూ, బత్తాయి తొక్కలూ విసిరారు. మొదట్లో ఏమి జరుగుతోందో అర్థం కాలేదు. అర్థమయ్యేలోపు అంతా అయిపోయింది. స్టేజీవదిలి బట్టలుమార్చే గదిలోకి వెళ్లి, విగ్గు గిగ్గు తీసి చెప్పకుండా వెళ్లిపోయాను. అది చాలా నిరాశా, నిస్పృహా కలిగించింది. నన్ను చాలా బాధకు గురిచేసింది. అన్నకు ఏమీ చెప్పలేదు. ఫీల్డు కుటుంబానికీ చెప్పలేదు. నాలో నేను కుమిలిపోయాను.

తర్వాత 'మెర్రా మేజర్' అనే చౌకబారు నాటకంలో నటించాను. అదీ విజయవంతం కాలేదు. నా పాత్రకు ఒక ముసలి భార్య ఉండేది. ఆమె వచ్చి నాటకంలో మధ్యలో నన్ను ముద్దుపెట్టుకునేది. ఇది నాకు మరీ జుగుప్స కలిగించేది. అదికూడా ఒక కారణం.

తర్వాత ఒక నాటకం రాశాను. దానిపేరు 'డజను హాస్యగాళ్లు.' అది చార్మ్‌కంటే అనే ఆయన చూసి 3 పౌండ్లు ఇచ్చి కొన్నాడు. నన్నే దర్శకత్వం చేయమన్నాడు. మూడురోజులు రిహార్సల్స్ తర్వాత ఒక చీటీ పంపాడు. ఆపేయమని. కారణాలు చెప్పలేదు. అసలే తరుగులో వున్న నా 'కేరీర్' మరీ దిగజారిపోయింది. నేను ఇంకా నిస్పృహలో పడిపోయాను.

అప్పుడే అన్న వచ్చాడు. 'ఈ సంగతి నీ నటులకు చెప్పావా' అని అడిగాడు. 'లేదన్నాను.'

'వెళ్లిచెప్పు' అని అరిచాడు. కానీ నాకు ధైర్యం చాలలేదు. అన్నే వెళ్లి వాళ్లకు చీటీ చూపించి సారీ చెప్పాడు. అంతటితో నా రచన ఆగిపోయింది. నేను గట్టిగా ఏడ్చానుకూడా. అన్నే ఓదార్చాడు...

తర్వాత నేను ఏది మొదలుపెట్టినా విజయవంతం కాలేదు. దురదృష్టం కూడా మనతోనే వస్తుందేమో రోజులు బాగోపోతే. కాని దేనికైనా ఒక అంతం వుంటుంది కదా. నా దురదృష్టం కూడా మారింది!

అన్న ఎప్పటినుంచో అడుగుతున్నాడు 'కార్నో'ని నాకు వేషం (జోకర్) ఇవ్వమని. నా వయస్సు చిన్నదని – మరీ పసివాడిలా ముఖం వుందని ఆయన ఇవ్వలేదు. చివరికి నాకు 'ఫుట్‌బాల్ మాచ్' అనే హాస్య నాటకంలో వేషం ఇవ్వటానికి అంగీకరించి, దానికి సబంధించిన 'డైలాగులు' ఇచ్చాడు. 'వెల్డన్' అనే ఆయన దీంట్లో హీరోలాంటివాడు. ఆయనకు చాలా పేరుంది. రంగం మీదకు రాగానే ప్రేక్షకులు నవ్వుతారు. ప్రతి మాటకూ కేకలూ–నవ్వులే! అంతగా పేరున్న నటుడు.

'కార్నో'ని కలిశాను. 'అన్న నీ గురించి చెప్తున్నాడు. నీవు 'వెల్డన్'తో పాటు నటించగలవా, అని అడిగాడు. ఎందుకైనా మంచిది ఈ నాటకం లండన్‌లో 'ఎంపైర్లో' నడుస్తున్నదని నన్ను వెళ్లి చూడమన్నాడు. నా వేషం తెలుస్తుందని. ఆ రాత్రే చూశాను. నేను వేయాల్సిన వేషధారి బలహీనంగా వున్నాడు. ఇది నాకు మంచి అవకాశం. నేను ఇంకా బాగా చేయగలను.

వెల్డన్ రిహార్సల్‌కి వచ్చేవాడు కాదు. ఒకసారి వచ్చి కొత్తగా వచ్చిన నన్ను చూసి "ఇతను సరిగా చేయగలడా నా ప్రక్కన" అని అనుమాన పడ్డాడు.

ఈ నాటకంలో వెల్డన్ స్టేజీమీదకు వచ్చేవరకూ, ఎవ్వరూ నవ్వేవారు కాదు. అది నేను పూర్తిగా మార్చేశాను. నా ప్రతిచర్యా నవ్వు పుట్టేట్టు చేశాను. ప్రతిమాటకీ గోలగోలగా అరిచారు! అవును అవకాశం వచ్చినప్పుడే నిలబడాలి – లేదా పతనమే!

దీనితో నా ఆత్మ విశ్వాసం పెరిగి పూర్వపు చార్లీ వచ్చినట్లు – స్టేజీమీద ఆడాను. వెల్డన్‌కూడా మెచ్చుకున్నాడు. కార్నో నన్ను సంవత్సరం ఒప్పందం మీద తీసుకున్నాడు. వారానికి నాలుగు పౌండ్లు! అన్నకు టెలిగ్రాం ఇచ్చాను! ఈ నాటకం లండన్‌లో 14 వారాలు ఆడింది. తర్వాత చుట్టుపక్కల జిల్లాలకు వెళ్లింది.

లండన్ చుట్టుప్రక్కల మా నాటకం ప్రదర్శింపబడినప్పుడు పరిస్థితి మారిపోయింది. వెల్డన్‌కి లండన్‌లో వచ్చిన ప్రేక్షకుల ప్రతిస్పందన ఇక్కడ కరువైంది. ఇక్కడి ప్రేక్షకులు నా నటననూ, నా మాటలనూ విపరీతంగా ఆస్వాదించి కరతాళధ్వనులతో థియేటర్లు మారుమోగించారు. ఇదే విషయం వెల్డన్ ని వేధించింది. నాటకంలో కొన్నిచోట్ల ఆయన నా చెంపమీద కొట్టాలి. ఆయన నిజంగానే కొట్టడం మొదలుపెట్టాడు. ఒకటి, రెండుసార్లు భరించి, "మీరు నన్ను చూసి అసూయ పడుతున్నారా?" అని అడిగాను. "అసూయా?"

అని ఆశ్చర్యం నటించి, ''నీకున్న ప్రతిభ నా చిటికెనవ్రేలు గోరంతకూడా ఉండదు.'' అన్నాడు. నేను సమాధానంగా ''నీ ప్రతిభని ఆ గోటిలోనే ఉంచుకో'' అని బయటికి వెళ్ళిపోయాను.

లండన్ తిరిగి వచ్చిన తరువాత, అన్న సిడ్నీ కూడా కలిసాడు. అప్పుడు బ్రిక్‌ష్టన్ రోడ్‌లో మంచి ఫ్లాటు తీసుకోవాలని నిర్ణయించుకొన్నాము. దానిని నలభై పౌండ్లతో, చక్కగా మంచాలూ, కుర్చీలూ సోఫాలతో అలంకరించాలని నూయింగ్‌టన్ బడ్స్ సామానుల కొట్టుకెళ్ళి మాట్లాడాము. దాని యజమాని మా మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇల్లంతా అలంకరించారు. రెండు సోఫాసెట్లూ, చిన్న షాండిలేర్ లాంటి లైటూ, ఓ అర్ధనగ్న స్త్రీ శిల్పం ప్రక్కకు చూస్తుంటే చిత్రకారుడు ఆమెమీద వాలబోయే ఈగను కొడుతున్నట్లు ఉన్న చిత్రం. ఈ చిత్రంతోనే ఆ గదంతా ఒకరకమైన వింత అందాన్ని సంతరించుకొంది. నెం. 15 గెన్‌షా మాన్షన్స్, బ్రిక్‌ష్టన్ రోడ్డు, ఇది మా కలల స్వర్గం. మేము మళ్ళీ జిల్లాలన్నీ మా ప్రదర్శనలతో తిరిగొచ్చే సరికి మా ఇల్లంతా సిద్ధంగా ఉంటుంది. అలసిపోయి వచ్చిన మేము ఆ వాలు కుర్చీలలో, మెత్తటి సోఫాలలో హాయిగా విశ్రమించే వాళ్ళం.

పదహారేళ్ళప్పుడు నాకు రొమాన్స్ అంటే, నా మనస్సులో ఉన్న దృశ్యం ఒక చిన్న గుట్టమీద ఒక యువతి హొయలుపోతూ, తన పొడవాటి జుట్టు గాలికి కదులుతుంటే సూర్యాస్తమయం చూడటం. అప్పుడు నేను ఆమెతో గోల్ఫ్ ఆడుతున్నట్టూ, మంచుతో తడిసిన గడ్డిమీద నడుస్తున్నట్టూ ఊహించుకొనేవాణ్ణి. కాని, ఇదంతా రొమాన్స్. ప్రేమ వేరు. అందులోనూ కౌమారప్రేమ తీరే వేరు. అది ఒకరకమైన నియమిత దారిలో ఉంటుంది. చూపులూ, చిన్నచిన్న మాటలూ, తక్కువ కాలం. ప్రకృతి అంతా మనకోసమే సానుభూతితో ఉన్నట్లూ, జీవితం ఆనందమయమైనట్లూ అనిపిస్తుంది. సరిగ్గా ఇదే నాకు జరిగింది. అప్పటికే నాకు పందొమ్మిదేళ్ళు నడుస్తున్నాయి. ఒక హాస్యనటుడిగా కార్నో కంపెనీలో పేరుకూడా ఉంది. కానీ, ఏదో లోపించినట్లు అనిపించేది. వసంతం వచ్చింది, వెళ్ళిపోయింది. వేసవి నాలో శూన్యాన్ని నింపింది. నా రోజువారీ జీవితం, నా చుట్టూ వాతావరణం పేలవంగా తయారయింది. నాకు భవిష్యత్తులో అంతా మామూలుగా, సామాన్యంగా, బద్ధకంగా, గుంపుల మధ్య జీవితమే కనబడుతోంది. కేవలం పొట్టకూటికోసం పనిచేయటం, దానితో తృప్తిపడటం నీచంగా

అనిపిస్తోంది. బ్రతుకంటే ఇదేనా? ఇంతకంటే మరే ఆనందం లేదా? నేను అశాంతితో, అసంతృప్తితో వీధులచుట్టూ, పార్కులచుట్టూ తిరగటం మొదలుపెట్టాను. అప్పుడే జరిగింది నేను ప్రేమలో పడడం.

అప్పుడు ఎంపైర్ థియేటర్‌లో ఆడుతున్నాము. ఒక్కో రాత్రి రెండు, మూడు ప్రదర్శనలిచ్చే వాళ్ళం వేరు వేరు థియేటర్లలో. ఒక చోటునుంచి మరోచోటుకి ప్రత్యేక వాహనంలో వెళ్ళేవాళ్ళం. ముందు ఎంపైర్ థియేటర్‌లో ప్రదర్శన ఇచ్చి, కాంటర్‌బరి ప్రదర్శనశాలకు వెళ్ళి, అక్కడి నుంచి టివోలికి వెళ్ళేవాళ్ళం. వెలుతురు ఉండగానే మా పని మొదలయ్యేది. వేసవి వేడి తీక్ష్ణంగా ఉండేది. దానికితోడు ఎంపైర్ థియేటర్ ఎప్పుడూ నిండేది కాదు. దీనితో నా బాధ మరీ ఎక్కువయ్యేది. మాకు ముందు ఒక నృత్య ప్రదర్శన జరుగుతుండేది. దానిపేరు యాంకీడూడిల్ గరల్స్. ఈ విషయం నాకు పెద్దగా తెలియదు. ఒకరోజు సాయంత్రం రంగస్థలం ప్రక్కన వేచి ఉండగా ఆ నృత్యంచేసే అమ్మాయిలలో ఒకామె పడిపోయింది. అది చూసి ప్రక్కనవాళ్ళంతా కిచకిచమంటున్నారు. నాతోపాటు ఉన్నవాళ్ళు కూడా ఎగతాళిగా నవ్వారు. నేను సానుభూతితో చూస్తుండగా ఆమె పెద్దకళ్ళు నావైపు తిరిగాయి. ఆ కళ్ళల్లో తడి, భీతహరిణేక్షణలాగా కంగారు, చక్కటి ఆమె కోలముఖం మత్తు కలిగించే ఆమె చిక్కటి పెదవులు, అంత చక్కటి తెల్లని పలువరస – ఆహా! నాకు కరెంటు షాకే కొట్టింది. ఆమె మెల్లగా నావైపుకు వచ్చింది. వచ్చి, చిన్న అద్దం పట్టుకొని చెదిరిన జుట్టు సవరించుకుంటోంది. అప్పుడు ఆమెని మరీ పరీక్షగా చూశాను. ఇదే మొదలు. తరువాత రోజు 'ఆమెను ఆదివారం కలుద్దామా?' అని అడిగాను. ఆమె నవ్వి, "నువ్వెవరో తెలియదు. నీ ముఖం కూడా పూర్తిగా చూడలేదు నీ ఎర్రముక్కు తప్ప." అప్పుడు నేను 'అమ్మ పక్షు'లలో తాగుబోతు హాస్యగాని లాగా, తోక కోటుతో, తెల్ల టై కట్టుకొని, ఎర్ర ముక్కుతో నటించేవాడ్ని. "నా ముక్కు మరీ అంత ఎర్రగా ఉండదు. అట్లాగే నేను కనబడేంత అనాకారిని కాదు. రేపు వచ్చేటప్పుడు మంచి ఫోటో తీసుకొస్తాలే" అన్నాను. అట్లాగే మర్నాడు రాత్రి మంచి సూటూ, టై లో ఉన్న ఫోటో ఇచ్చాను. అది చూసి "అరే! నువ్వు చాలా చిన్నవాడివే" అని ఆశ్చర్యపోయింది. "నా వయసెంతనుకుంటున్నావు" అని అడిగాను. "కనీసం ముప్ఫయి" అంది. నేను నవ్వి "పంథొమ్మిదేళ్ళే" అన్నాను. అలా మొదలైంది.

మా ప్రదర్శనలతో, రిహార్సల్‌లతో మాకు సమయమే చిక్కేది కాదు. అయినా ఆమె వచ్చే ఆదివారం కెనింగ్‌టన్ గేటు దగ్గర నాలుగు గంటలకు కలుస్తానని మాట ఇచ్చింది. ఆదివారం రానే వచ్చింది. చక్కగా ఎండ కాస్తోంది. నేను నల్లటి సూటూ, చక్కటి టై వేసుకొని చిన్నచేతి కర్రతో ట్రామ్ దిగి పదినిమిషాలు ముందుగా వచ్చాను. ఆ తరువాత పదినిమిషాలు వచ్చి పోయే వాళ్ళను చూస్తూ ముఖ్యంగా ట్రామ్‌లో దిగేవాళ్ళని చూస్తూ, ఆమె ముఖబింబాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా. నాకెన్నో అనుమానాలు. ఆమె నిజంగా అందంగా ఉంటుందా? నేనంటే ఇష్టపడుతుందా? ఇదంతా భ్రమేనా? నాకు నిరాశ తప్పదా? ఇంతలో ట్రామ్ దిగి మూడు నిమిషాలు తక్కువ నాలుగింటికి ఒకామె నావైపు వస్తోంది. అంతే నా గుండె జారిపోయింది. నేను పడే ఆత్రుతలో ఆమె మరీ అనాకారిగా కనపడింది. ఇందుకేనా ఈ మధ్యాహ్నం అంతా గడిపాను అనుకుంటూ టోపీ తీసి ఆమెకి అభివాదం చేశా! ఆశ్చర్యం. ఆమె నన్ను దాటి వెళ్ళిపోయింది. అరే భగవంతుడా అనుకొన్నా.

సరిగ్గా నాలుగు దాటిన తరువాత అప్పుడే ఆగిన ట్రామ్‌లోనుంచి, ఒక యువతి గాలిలో కాలుపెట్టినట్లు దిగి నా ముందుకొచ్చింది. ఆమె ఏ అలంకారం చేసుకోలేదు. అయినా చాలా అందంగా ఉంది. ఇత్తడి గుండీలతో, నీలం రంగు కోటులో చిన్న టోపీ పెట్టుకొని, రెండు చేతులూ పైకోటు జేబులలో పెట్టుకొని "వచ్చాను" అంది.

ఆమె సాన్నిధ్యం నన్ను మూగవాణ్ణి చేసింది. నేను చాలా కదిలిపోయాను. ఏమి చెప్పాలో కూడా తెలియక 'బండి పిలవనా!' అని అడిగా. 'బండి పిలుస్తాను' అని ఆమెను ఎగాదిగా చూసి, 'ఎక్కడికెళదాం' అని అడిగా. ఆమె "ఎక్కడికైనా సరే." అయితే "వెస్ట్‌ఎండ్ వెళ్ళి భోజనం చేద్దాం."

ఆమె "నా భోజనం అయిపోయింది" అంది. "బండిలో మాట్లాడుకుందాం" అని బండెక్కిచ్చాను. నాలో చెలరేగుతున్న ఉద్వేగం ఆమెని కంగారు పెట్టినట్లుంది. బండిలో నేను నాలుగైదుసార్లు నువ్వు చాలా అందంగా వున్నావని అన్నాను. ఏదో రకంగా ఆమెను సంతోషపెడదామని ప్రయత్నిస్తున్నాను. అప్పటికే మూడు పౌండ్లు జేబులో ఉన్నాయి. ఆమెను ఖరీదైన హోటల్‌కి తీసుకువెళ్ళి, నా ప్రేమను ప్రదర్శిద్దామని ప్రయత్నం. ఆమెను గాలిలో తేల్చి ఉక్కిరి బిక్కిరి చేయాలని నా ఆలోచన. కాని, ఆమె

చాలా సాదాసీదాగా ఉంది. నా పిచ్చివాగుడుకి కంగారు కూడా పడింది. 'నువ్వే నా దేవత' అన్నాను కూడా (ఆ మాట, ఆ మధ్యనే నేర్చుకొన్నాను).

ఆమెకి ఎంతవరకు అర్థమైందో నాకు తెలియదు. నాకు కావల్సిందల్లా ఆమె సాన్నిధ్యమే. అంతకంటే మించిన కోరికా లేదు. ఇప్పుడు నా జీవితంలో అందమూ, ఆనందమూ రెండూ ఒక్కచోటే ఉన్నాయి. ఇది చాలా అరుదైన విషయం కదా!

ఆ సాయంత్రం నాతోపాటు భోజనం చేయమని ఆమెను బలవంతం చేశాను. కాని ఆమె కేవలం ఫలహారమే తీసుకుంటాననీ, నన్ను భోజనం చేయమనీ చెప్పింది. ఆ ఖరీదైన రెస్టారెంట్‌లో ఒక ప్రక్క మేమిద్దరమే ఉన్నాం. నేను తినలేనంత భోజన పదార్థాలు తెప్పించి, తినడానికి నానా ఇబ్బంది పడ్డాను. ఏ కత్తితో ఏది కొయ్యాలి, ఏ గరిటతో ఏది తినాలి అని హైరానా పడ్డాను. భోంచేస్తుండగా ఏం మాట్లాడానో కూడా గుర్తులేదు. చివరికి ఇద్దరం అక్కడ్నుంచి సంతోషంగా బయటపడ్డాం. ఆమె ఇంటికి వెళ్ళిపోతానంది. అదీ నడిచి. ఆమె ఉండేది కాంబర్‌వెల్‌లోనే. ఇది నాకు మరీ అనుకూలమైనదే. ఆమె ప్రక్కన నడవడం ఆనందకరమే. ఇప్పుడు నా ఉద్వేగం తగ్గింది కదా. ఆమె కూడా శాంతంగా ఉంది. థేమ్స్ నది ప్రక్కన నడుస్తూ హెట్టి తన స్నేహితుల గురించి, చిల్లరమల్లర విషయాల గురించి, చిన్నచిన్న ఆనందాల గురించి చెప్తుంటే విన్నాను. ఏమి విన్నానో గుర్తులేదు. కానీ ఆ రాత్రి ఆమెతో నడక స్వర్గంలో ఉన్నట్లనిపించింది. నా మనసులో ఉవ్వెత్తున లేచే ఆనంద డోలికలతో ఆమెను ఇంటిదగ్గిర వదిలిపెట్టి థేమ్స్ నది ప్రక్కకి వచ్చాను. నాలో ఏదో దేవత ప్రవేశించినట్లు, నా శరీరమంతా వెలుగుతో నిండిపోయినట్లనిపించింది. మూడు పౌండ్లలో మిగిలిన చిల్లరంతా థేమ్స్ నది ఒడ్డున నిదురపోతున్న పేదవాళ్ళకి పంచిపెట్టాను.

మేము తరచూ కలుద్దామని వాగ్దానాలు చేసుకొన్నాం. నాకు రోజూ ప్రదర్శననుంచి రావడం రాత్రి రెండయ్యేది. అయినా ఆమెను కలవడానికి ప్రొద్దున్నే లేచేవాణ్ణి. ఇప్పుడు కాంబర్‌వెల్ వీధి అంటే నాకొక మాయాలోకం. ఎందుకంటే హెట్టీకెల్లి అక్కడే ఉంటుంది కదా. ఆమెతో పొద్దున పొద్దున్నే మంచులో నడవడం, చేతిలో చెయ్యి వేసుకొని రైలుబండి దగ్గరకు వెళ్ళడం, ఏమికావాలో తెలియని అయోమయంలో విడిపోవటం. ఇది నా దినచర్యగా మారిపోయింది. ఒకప్పుడు చెత్తాచెదారంతో అసహ్యంగా ఉందనిపించిన కాంబర్‌వెల్ వీధి ఇప్పుడు నన్ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఉదయం

మంచుతెరలు, ఆ మంచు తెరలలోంచి హెట్టీ రావటం. ఇద్దరం చేతులు కలుపుకొని నడవటం. ఇది ఒక కల. ఒక మంత్రజాలం. ఇలా కొన్నిరోజులు గడిచింది. తరువాత ఆమె ప్రవర్తన మారింది. ఒకరకమైన నిర్లక్ష్యం ఆమెలో కనపడుతోంది. ఇప్పుడు నా చెయ్యికూడా తీసుకోవడంలేదు. 'ఏమిటి, నన్ను ప్రేమించడంలేదా' అని అడిగాను నవ్వుతూనే. 'నీకు మరీ కోరికలెక్కువ' అంది, 'నాకు పదిహేనేళ్ళేకదా! నువ్వు నాకంటే నాలుగేళ్ళు పెద్ద' అంది. ఇదేమీ నాకర్థంకాలేదు. ఉన్నట్టుండి ఇంతదూరాన్ని పెంచిందేమిటి, అనుకున్నాను. ఆమె తల ఎత్తి ముందుకు చూస్తూ చాలా సొంపుగా నడిచింది. అదీ హైస్కూల్ విద్యార్థినిలాగా. అప్పటికే ఆమె చేతులు ఓవర్‌కోటు జేబులోనే ఉన్నాయి. అయితే "నువ్వు నన్ను ప్రేమించడం లేదా" అని అడిగాను. "ఏమో నాకు తెలియదు" అంది. "నీకు తెలియదా, అయితే ప్రేమించడం లేదన్నమాట" అన్నాను. ఆమె నిశ్శబ్దంగా నడుస్తోంది.

"నాకు తెలుసు, నేననుకుంటూనే ఉన్నాను. నిన్ను కలిసినందుకు విచారించవలసి వస్తుందని." ఇలా అని ఆమె స్పందనకోసం ఆమె ముఖంలో చూశాను. హెట్టి మాత్రం 'నాకు తెలియదు నాకు తెలియదు.' అంటూనే ఉంది. అప్పుడు ''నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అని ఒక సవాలు విసిరాను.

"నేను మరీ చిన్నపిల్లని కదా అంది." "నువ్వు పెళ్ళి చేసుకోవాల్సి వస్తే, నన్నే చేసుకుంటావా, ఎవరినైనా చేసుకుంటావా?"

దీనిక్కూడా ఆమె "ఏమో నాకు తెలియదు" అంటూ "నువ్వంటే నాకిష్టం" అంది.

"అంతేనా నన్ను ప్రేమించటంలేదా?" అన్నాను.

అప్పటికే నా గుండెలు జారిపోయినాయి. ఆమె మౌనంగా ఉండిపోయింది. ఆ ఉదయం మబ్బులతో నిండిపోయింది. ఆ వీథంతా చీకటిపడిపోయింది. అప్పుడు "తప్పంతా నాదే, నేనే తొందరపడ్డా" అని, "ఇక మనం కలవవద్దు," అంటూ ఆమె స్పందనకోసం చూశాను.

ఆమె 'అట్లాగే' సాదాసీదాగా అంది. అప్పుడు ఆమె చేతిని చేతిలోకి తీసుకొని "హెట్టీ నేను వెళ్తాను, మనిద్దరికి ఇదే మంచిది. ఇప్పటికే నన్నావహించావు" అని అన్నాను.

'సరే వెళ్ళొస్తాను' అని వెళ్ళిపోయింది. ఆమె నిష్క్రమణ నన్ను భరించలేని శూన్యంతో నింపివేసింది. నేను చేసిన తప్పేంటి? మరీ తొందరపడ్డానా? నేను పెళ్ళిసంగతి ఎత్తకుండా ఉంటే బాగుండేదేమో? ఆమెను మరీ కంగారు పెట్టానా? ఇలా ఆలోచిస్తూ. అవును నాకు ఇది జరగాల్సిన శాస్తే. నిద్రపోయి ఈ విచారాన్ని మరచిపోదామని ప్రయత్నించాను. నన్ను ఇంత తేలికగా ఎట్లా తీసేయగలదు ఆమె?

మర్నాడు నా కాళ్ళు కాంబర్‌వెల్ వీధిలోకే తీసుకెళ్ళాయి. వాళ్ళమ్మ కలిసింది. 'నువ్వు హెట్టిని ఏమన్నావు? ఇంటికొచ్చి ఒకటే ఏడుస్తోంది' అంది. 'నేనేం చేశాను' అని అమాయకంగా అన్నాను. 'ఇప్పుడు చూడొచ్చా' అని కూడా అడిగాను. అయితే వాళ్ళమ్మ దానికి ఒప్పుకోలేదు. అప్పుడు ఆమెను ఆ దగ్గరలో వున్న పబ్‌కి తీసుకువెళ్ళి బీర్ ఇప్పించాను. అప్పుడు మళ్ళీ అడిగాను. నేను హెట్టీని చూస్తానని. ఇద్దరం కలసి ఇంటికెళ్ళాం. హెట్టీయే తలుపు తీసింది. ఆమె దగ్గరనుంచి సన్‌లైట్ సబ్బు వాసన వస్తోంది. తలుపుదగ్గరే నిలబడింది, ఆమె పెద్దకళ్ళతో ఏ భావనా లేకుండా. నాకు ఎటువంటి ఆశా కలగలేదు. "నేను మళ్ళీ వీడ్కోలు చెప్పడానికి వచ్చాను" అన్నాను. ఆమె 'అలాగే వెళ్ళిరా' అంది. నేను వెనక్కి తిరిగాను. నా వెనకాల తలుపు మూసుకొన్నది. తరువాత నాలుగైదుసార్లు ఆమెను కలిసినా, మా మధ్య మాటలే కరువైనాయి. కానీ హెట్టీ ప్రభావం నా మీద చాలా కాలం పనిచేసింది.

ఏడవ అధ్యాయం

పారిస్!

1909లో పారిస్ వెళ్లాను. బర్నెల్ అనే ఆయన కార్నో కంపెనీని పారిస్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. నేను మరో దేశానికి వెళ్లటానికి మహదానందం పడిపోయాను. పారిస్ వెళ్లే వారం రోజులు ముందు ఊల్‌విచ్‌లో ఒక ప్రదర్శన ఇచ్చాం. అది ఒక అధ్వాన్నమైన ఊరు. నేను మార్పుకోసం చూస్తున్నాను. ఆదివారం ప్రొద్దున్నే రైలుబండి ఎక్కాలి. కాస్తలో రైలు తప్పిపోయేదే. చివరికి ఎలాగో ఎక్కగలిగాను. పారిస్ కనుచూపు మేరలోకి రాగానే చాలా ఉత్సాహపడిపోయాను. ఇది ఇంగ్లండ్ కాదు అని అనుకుంటూనే ఉన్నాను. ఇది వేరే దేశం. ఇది ఫ్రాన్స్. ఇవే నా బుర్రలో తిరుగుతున్నాయి. మా నాన్న ఫ్రెంచివాడే. మా నాన్న మామ ఎంత గర్వంగా చెప్పేవాడో చాప్లిన్ వంశానికి మూలపురుషుడు ఒక ఫ్రెంచి యోధుడని.

కాలస్ నుంచి పారిస్‌కి మా ప్రయాణం చాలా నీరసంగా జరిగింది. అయినా పారిస్ దగ్గరవుతున్నప్పుడు నాలో ఉత్సాహం ఉరకలేసింది. నిర్మానుష్యంగా ఆకులు లేని చెట్లమధ్యలోంచి వెళ్తున్నాను. పారిస్ మహానగరం అల్లంత దూరాన వెలుగులోకి వస్తోంది. మాతో ప్రయాణం చేసే ఫ్రెంచి యువకుడు అదిగదిగో పారిస్ నగరం అంటున్నాడు.

పారిస్ నా ఊహలను మించి ఉన్నది. నగరమంతా తిరిగాను ఆనందంగా. ప్రతిరోడ్డూ, వీధీ ఆగి నడవాలనిపించేది. అప్పుడు రాత్రి ఏడుగంటలయింది. రెస్టారెంట్‌ల లోంచి బంగారు కాంతులు రమ్మని పిలుస్తున్నాయి. ఆరుబయట వేసిన బల్లలూ కుర్చీలూ, వచ్చి కూర్చోమని ఆహ్వానిస్తున్నాయి. ఒకటి రెండు మోటారుకార్లు కనబడక పోతే ఇది మోనెట్, రెనాయిర్ కాలానికి చెందిన నగరమే. అందరి ముఖాల్లో ఆనందమే

కనపడుతోంది. అందరిలోనూ చైతన్యం తొణికిసలాడుతోంది. నేను జీవిస్తున్న లండన్‌కీ, ఈ నగరానికీ ఎంత వ్యత్యాసం ఉంది? ఆదివారం రాత్రులు పనేమీ ఉండేది కాదు.

అప్పుడు మేము ఫాలిస్ బెర్జర్ షోకు వెళ్ళేవాళ్లం. అక్కడే సోమవారం మా ప్రదర్శన ఉండేది. అటువంటి థియేటర్‌ని నేను ఎక్కడా చూడలేదు. బంగారు రంగు గీతలతో, మెత్తటి సోఫాలతో, నిలువెత్తు అద్దాలతో కళకళలాడిపోయేది. పైనుంచి వ్రేలాడదీసిన గాజు షాండిలీర్స్ దీపాలతో వెలిగిపోయేది. మందపాటి తివాచీలతో నడకదారులూ, పురప్రముఖులు కూర్చొనే బాల్కనీలూ హుందాగా ఉండేవి. భారతదేశపు పంజాబు రాజకుమారులు, తమ గులాబీ రంగు తల పాగాలతో దర్జాగా వచ్చేవారు. ఫ్రెంచి, తుర్కిష్ అధికారులు తమ అధికార లాంఛనమైన దుస్తులలో వచ్చి కోనియాక్ చప్పరిస్తుండేవారు. బయట హాలులో సంగీతం వినపడుతుండేది. సంపన్న స్త్రీలు తమ ఫర్‌కోటూలూ, చేతిసంచులూ అక్కడ బీరువాలలో పెట్టి తమ తెల్లని బాహువులు ప్రదర్శించేవారు. వీరంతా ప్రత్యేకంగా ఆహ్వానించబడిన అతిథులు. ఈ ఫాలిస్ బర్జర్ థియేటర్‌లో నైపుణ్యంగల తర్జుమాదారులు లోపల తిరుగుతూ ఉండేవారు. వారి టోపీమీద వారి వృత్తిపరమైన చిహ్నంకూడా ఉండేది. వీరు అనేక భాషలు అలవోకగా మాట్లాడేవారు. మా ప్రదర్శన అయిపోయిన తరువాత, నేను ఇటువంటి అతిథులతో కలిసిమెలిసి తిరిగేవాణ్ణి. ఆ సందర్భంలో ఒక హంసలాంటి మెడగల అందగత్తె నా గుండెను తట్టింది. ఆమె పొడవైన గిబ్బన్ జాతి అమ్మాయి. చాలా అందగత్తె. చక్కటి ముక్కు, వెడల్పైన కనురెప్పలు, నల్లని వెల్వెట్ డ్రెస్‌లో చేతికి తెల్లని గ్లౌస్ వేసుకొంది. ఆమె నా ముందునుంచి వెళ్తూ ఒక గ్లోవ్ క్రిందపడేసి వెళ్లింది. నేను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా దానిని తీసి ఆమెకిచ్చాను. నాకు కృతజ్ఞతలు తెలిపింది. నేను కొంటెగా 'మరొక్కసారి పడేస్తే బాగుండునే అన్నాను. 'ఏమిటి' అంది. అప్పుడర్థమయ్యింది ఆమెకు ఇంగ్లీషు రాదని. నాకు ఫ్రెంచి రాదు, ఆ దగ్గరలో ఉన్న తర్జుమాదారుని పిలిచి సహాయం అడిగాను. "చూడు ఈమె చాలా నన్ను ఆకర్షిస్తోంది. కానీ ఆమెతో గడపడం చాలా ఖరీదైన వ్యవహారమేమో" అని అనుమానం వెలిబుచ్చాను.

అతను ఏమీలేదు ఒక లూయిస్ (ఫ్రెంచి రూపాయి) మాత్రమే. "ఆఁ! అలా అయితే సరే" (నాకు లూయిసే చాలా ఎక్కువ).

అప్పుడు తర్జుమాదారుణ్ణి కొన్ని ఫ్రెంచిమాటలు ఓ కాగితం మీద రాసిమ్మన్నాను. ఈ మాటల్ని అవసరమైనప్పుడు ఆమెదగ్గర వాడదామని నా ఉద్దేశ్యం. అప్పుడతనిని

నేను మా ఇద్దరికీ అనుసంధానం చేయమన్నాను. అతను వెళ్ళి ఆమెతో మాట్లాడి అంతా ఓకే అన్నాడు. అని ఒక్క లూయిసే, కానీ నువ్వు ఆమెను ఇంటిదగ్గర దింపాలి. ఒక్కసారి ఆలోచించి "ఎంత అవ్వొచ్చు టాక్సీకి?" అన్నాను. అతను పది ఫ్రాంక్‌లలోపే అన్నాడు. ఇది నాకు చాలా ఎక్కువ. ఏంటీ ఆమె నడవలేదా అని అడిగాను కాస్త హాస్యంగానే. అరే ఈమె ఫస్ట్‌క్లాస్ లేడి. ఆమెకు తప్పనిసరిగా టాక్సీ డబ్బులు ఇవ్వాలి. నేను ఇక తప్పక ఒప్పుకున్నాను. అన్ని విషయాలూ పూర్తయిన తరువాత బాల్కనీకి వెళ్ళే మెట్లదగ్గర ఆమెను కలిసాను. "బాగున్నారా?" అని అడిగాను. 'ఓకే మిస్టర్' అంది. అప్పుడు నా ప్లాన్ ప్రకారం నా ప్రదర్శన అయిన తరువాత ఆమెను కలవాలి. నా తర్జుమా స్నేహితుడు 'నువ్వు టాక్సీ పిలువు నేనామెను తీసుకొస్తాను, సమయం వృథా కాకుండా' అన్నాడు. ఈ 'వృథా' అవడం ఏమిటో అర్థం కాలేదు నాకు. అయినా ఆమెతో కలిసి పారిస్ వీధులలో ప్రయాణం సాగించాను. వీధి దీపాల రంగురంగుల వెలుతురులో ఆమె తెల్లని మెడ, చక్కని పలువరస మెరిసిపోతున్నాయి. ఆమెతో నువ్వు దేవతలా ఉన్నావన్నాను. నువ్వు బాగా ఫ్రెంచి మాట్లాడతావే అంది. అప్పుడు నేను 'నిన్ను మొదటిసారి చూసినప్పుడే ప్రేమించాను. అదికూడా చాలా ఉద్వేగంగా' అన్నాను. అప్పుడు నేనన్నదాంట్లో చిన్న తప్పు పట్టుకుంది. తప్పు పట్టుకొని నవ్వింది. అది తలచుకొనిమరీ నవ్వింది. అంతలో తన గడియారం చూసుకొంది. అది ఆగిపోయి వుంది. అప్పుడు టైమెంత అని నన్నడిగింది. అంటూ పన్నెండుగంటలకి చాలా ముఖ్యమైన పనుంది అని చెప్పింది. నేను ఈ రాత్రి కాదుగదా అన్నాను. అవును ఈ రాత్రే అంది. కానీ ఈ రాత్రంతా నాతో ఉండే ఏర్పాటుగదా అన్నాను. ఆమె ఉలిక్కిపడి, 'లేదు, కాదు రాత్రంతా కాద'ంది. 'అయితే నిమిషానికి ఇరవై ఫ్రాంక్‌లా' అన్నాను. అవును. అప్పుడు బల్బు వెలిగింది. 'అయితే టాక్సీ ఆపు,' అని నేను టాక్సీ దిగిపోయి, డ్రైవరుతో ఆమెను థియేటర్ దగ్గర దింపి వెళ్ళమని ఏడ్పుముఖంతో ఇంటి (హోటల్)కి వెళ్ళాను.

మా ప్రదర్శన అక్కడ పదివారాలవరకూ సాగేదే. కానీ కార్నోకి చాలా ఒప్పందాలు ఉన్నాయి. అప్పుడు నా జీతం వారానికి ఆరు పౌండ్లు. నాకంతా ఖర్చయిపోయేది. పారిస్‌లో మా అన్న తరుఫున చుట్టం ఒకాయన పరిచయమయ్యాడు. ఆయన నాకు ఆ మహానగరంలో ఖరీదైనవన్నీ పరిచయం చేసాడు. ఆ విధంగా నా డబ్బంతా ఖర్చయింది. నేను పారిస్ రాకముందు నేను ప్రేమించిన హెట్టీకూడా ఫాలిస్‌బెర్జర్

లోనే ప్రదర్శనకు వస్తుందని తెలిసింది. నేనామె రాకకోసం ఎదురు చూస్తున్నాను. కానీ ఆ ట్రూపు మాస్కో వెళ్ళిపోయిందని ఒక అమ్మాయి చెప్పింది. ఆ అమ్మాయితో మాట్లాడుతుండగా, వాళ్ల అమ్మ పిలిచి, క్రొత్తవాళ్ళతో మాట్లాడవద్దని కోప్పడింది. నాకు ఆ అమ్మాయితో పరిచయం తరువాతయింది. నేనున్న హోటల్‌లో ఆ అమ్మాయి, వాళ్ళ అమ్మతోనూ, చెల్లితోనూ ఉంటోంది. చాలాసార్లు వాళ్ల గదికి టీ త్రాగడానికి వెళ్ళాను. ఒకరోజున నేను వెళ్ళినప్పుడు అమ్మ ఒక్కటే వుంది. నన్ను టీ త్రాగమని బలవంతం చేసింది. టీ పోస్తుండగా ఆమె చేతులు వణుకుతున్నాయి. చాలా ఉద్వేగంగా ఉంది. నేను లేచి టీ కప్పు బల్లమీద పెడుతుండగా ఆమె నా దగ్గరకు వచ్చింది. నా కళ్ళల్లోకి చూస్తూ, నువ్వు చాలా మంచివాడివి అంది. నువ్వు నా కొడుకులాంటివాడివని నన్ను ముద్దుపెట్టుకొంది. ఈ తతంగమంతా నాకర్థం కాలేదు. ఆఁ! నువ్వు చాలా మంచివాడివంటూనే ఉంది. నన్ను చాలాసార్లు భోజనానికి పిలిచింది. మేం ముగ్గురం కలిసి భోంచేసేవాళ్ళం. పెద్దమ్మాయి ప్రక్కగదిలో పడుకొనేది. చిన్నమ్మాయీ అమ్మా ఒకమంచం మీద పడుకొనేవారు. ఒకరోజు భోజనంచేసి, అమ్మకూ, చిన్నమ్మాయికూ వీడ్కోలు చెప్పి నేను నా గదికి వెళుతున్నాను. మధ్యలో పెద్దమ్మాయి నన్ను పిలిచి, రహస్యంగా 'నీ తలుపు తీసి ఉంచు' అని చెప్పింది. కానీ నేను తలుపు తాళంపెట్టి పడుకున్నాను. నేను కనబడినంత అమాయకుడ్ని కాదుగదా! మా ట్రూపు కుర్రవాళ్ళతో కలిసి పారిస్ రహస్యాలని ఛేదించాను. తెల్లవారుఝామున నాలుగింటికి గదులకు చేరేవాళ్ళం. ఒకరాత్రి మందు ఎక్కువయ్యి ఒకడితో పేచీ పడ్డాను కూడా. వాడిపేరు ఎర్నిస్ స్టోన్. అతను నిజంగా బాక్సరే. మేమిద్దరం కలబడుతుండగా పోలీసులు వచ్చి విడదీశారు. రూమ్‌కి వచ్చి 'నీ పని చెబుతానుండు' అని బెదిరించాడు. అతనుకూడా నా హోటల్‌లోనే ఉంటున్నాడు. నా రూమ్‌పైనే అతని రూము. అతను రాకముందే తెల్లవారుఝామున నాలుగింటికెళ్ళి తలుపుకొట్టాను. నన్ను లోపలికి రమ్మని శబ్దం రాకుండా బూట్లు తీసేయమన్నాడు. చాలాసేపు మేమిద్దరం బాక్సింగ్ చేసాం. నాకు బాక్సింగ్ రాదుకదా. అయినా అతని దెబ్బలన్నీ తప్పించుకొన్నాను. అతను నన్ను కొట్టపోయి వెళ్ళి గోడకు గుద్దుకున్నాడు. ఆ తరువాత నా పళ్ళు కదిలేటట్టు గుద్దాడు. ఇకచాలు ఆపేయమన్నాను. నా గదిలోకి వెళ్ళి పడుకున్నాను. నా నోటివెంట రక్తం కారుతూనే ఉంది. ఉదయం నాకోసం టీ తెచ్చేఅతను నన్ను చూసి గావుకేక పెట్టాడు. తరువాత నా జీవితంలో ఎవరితోనూ బాక్సింగ్ చేయలేదు.

ఒకరోజు రాత్రి మా తర్జుమా స్నేహితుడొచ్చాడు. చాలా పేరున్న సంగీత విద్వాంసుడు నన్ను కలవాలని కబురు పెట్టాడు. నా తర్జుమా స్నేహితుడు ఆ విద్వాంసుడున్న బాల్కనీ సోఫా దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయనతోపాటు అందమైన యువతికూడా ఉంది. ఆమె రష్యన్ బాలేలో నాట్యకత్తె. ఆమెను కూడా పరిచయం చేశాడు. ఆ సంగీత విద్వాంసుడు నన్ను చాలా మెచ్చుకొన్నాడు. నీకు "సంగీతం, నాట్యంలో సహజమైన ప్రావీణ్యం ఉంది. నువ్వు నిజమైన కళాకారుడివి" అనికూడా అన్నాడు. నేను ఆయనకు ధన్యవాదాలు తెలిపి బయటకు వచ్చి మా తర్జుమా స్నేహితుడ్ని అడిగాను, 'ఆమె ఎవరు అని?' ఆమె రష్యన్‌బాలేలో పెద్ద తార అని చెప్పాడు. మరి ఈయనెవరు? అడిగాను. ఆయన తెలియదా? ఆయన డి. బస్సీ. చాలా గొప్ప పేరున్న సంగీత దర్శకుడు అని చెప్పాడు. అంతటితో నా ఫ్రాన్స్ టూర్ అయిపోయింది. విచారంగా పారిస్ నుంచి తిరిగి వచ్చాను. లండన్ చుట్టుప్రక్కల జిల్లాలు తిరగడం మొదలుపెట్టాను. ఆహా! పారిస్‌కీ, ఇక్కడికీ ఎంత వ్యత్యాసం? ఇక్కడ ఆదివారాలు ఎంత పేలవంగా ఉంటున్నాయి. దుకాణాలన్నీ మూసివేసి, చర్చిగంటలతో మరీ నిస్పృహ కలిగిస్తున్నాయి. ఈ విధంగా ఆరునెలలు ఇంగ్లండ్ అంతా తిరిగాము, ఇంతలో కార్నో నాకు ఒక మంచి వార్త చెప్పాడు. ఇక ఈ ప్రదర్శనకి నేనే హీరోను. హారీవెల్డన్ విశ్రాంతిలోకి వెళ్ళిపోతున్నారని. నాకిక మంచిరోజులు వచ్చినట్లే. దీని తరువాత ఆక్స్‌ఫర్డ్‌లో ప్రదర్శన ఇవ్వాలి. అక్కడే నా ప్రతిభను ప్రదర్శించాలి. వాల్‌పోస్టర్‌లో పైన నా పేరు ప్రముఖంగా ముద్రిస్తారు. ఇక్కడ నేను విజయం సాధిస్తే నా ప్రణాళికలన్నీ విజయవంతం అవుతాయి. నా జీతంకూడా బాగా పెరుగుతుంది. ఈ 'ఫుట్‌బాల్ మాచ్' నాటకం వెయ్యటానికి వారంరోజులే సమయం ఉంది. నా ముందువేసిన హారీవెల్డన్ ఒకరకమైన యాసతో మాట్లాడేవారు. ఇది నేను మార్చాలనుకున్నాను. దురదృష్టవశాత్తూ మొదటిరోజునే నా గొంతులోకి లారింగైటిస్ వచ్చింది. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకొని మొదటిరోజు ప్రదర్శనకు సిద్ధమయ్యాను. నాకు గొంతు సహకరించలేదు. గొంతు చించుకొని అరిచినా ఎవరికీ వినపడలేదు. తరువాత కార్నోవచ్చి నానా చీవాట్లు పెట్టాడు. రేపు రాత్రికి నా గొంతు సరి అవుతుందని చెప్పాను. కానీ అదింకా దిగజారింది. ఇట్లా అయితే నా ఉద్యోగం ఊడినట్లే. ఆక్స్‌ఫర్డ్ కల చెదిరిపోయింది. నేను జ్వరంతో మంచంమీద పడ్డాను.

సంవత్సరం నుంచి హెట్టీ దర్శనమే కాలేదు. ఈ జ్వరంలోనించి బయటపడి బలహీనంగా ఉన్నప్పుడు ఆమెను గురించే ఆలోచించాను. అలా ఆలోచిస్తూనే

కాంబర్‌వెల్ వీధికి వెళ్లాను. అక్కడ నన్ను వెక్కిరిస్తూ 'టూలెట్'బోర్డ్ ఉంది. తరువాత అక్కడ వీధులన్నీ తిరిగాను. నీరసంగా, ఒకరోజు రాత్రి అలా తిరుగుతుండగానే ఎవరో పిలిచారు. తీరాచూస్తే అది హెట్టీయే. నా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చింది. 'చార్లీ ఇక్కడేం చేస్తున్నా'వని. 'నిన్ను చూడడానికే వచ్చాను' అని చెప్పాను. 'ఏమిటి ఇలా చిక్కిపోయావు' అంది. 'ఇప్పుడే జ్వరం నుండి కోలుకుంటున్నాను.'

ఆమెకి అప్పుడే పదిహేడేళ్లు వచ్చాయి. చక్కనైన దుస్తులు వేసుకొంది. చాలా అందంగా ఉంది. మళ్ళీ అడిగింది. 'ఇటెందుకు వచ్చావు? ఒక స్నేహితుని కలిసి వస్తున్నానని' చెప్పాను. ఇప్పుడు మా అన్న దగ్గరికి వెళ్తున్నాను వస్తావా? అని అడిగాను. దారిలో చెప్పింది ఆమె అక్క ఒక అమెరికన్ షావుకారిని పెళ్ళి చేసుకుంది. నైస్ నగరంలో సెటిలయినట్లు. రేప్రొద్దున బయలుదేరి వాళ్ళ దగ్గరకు వెళ్తున్నాని చెప్పింది. ఆ సాయంత్రం ఆమెను చూస్తూ ఆమె మీద నా ఇష్టం ఎలా ఆవిరైపోయిందో గమనిస్తూ వచ్చాను. ఈమెకూడా మామూలుగా అందరిలాంటిదేనా? నాకేమీ కాదా? అనుకుంటూ నిస్పృహతో బాధపడ్డాను. ఇప్పుడు నేను నిజంగా ఈమెను పెళ్ళి చేసుకోగలనా అని నన్ను నేను ప్రశ్నించుకొన్నాను. 'లేదు. నేనెవరినీ చేసుకోను. నేనసలు పెళ్ళి చేసుకోను' అని నిర్ణయించుకున్నాను. తిరుగు ప్రయాణంలో ఆమెతో నడుస్తూ ఆమె సంతోషంగా మంచి జీవితం గడపాలని కోరుకుంటున్నట్లు చెప్పాను. ఆమె భావోద్వేగంతో కన్నీళ్ళు పెట్టింది. ఆ రకంగా మేమిద్దరం విడిపోయాం.

"ఫుట్‌బాల్ మాచ్" నాటకంలో నా ప్రదర్శనతో నేను నిరాశ పరిచిన తరువాత, కార్నో నన్ను మళ్ళీ "అమ్మ పక్షుల"లో తీసుకొన్నాడు. ఇప్పుడు నాకు పూర్తిగా స్వస్థత చేకూరింది. మళ్ళీ నా గొంతు నా స్వాధీనంలోకి వచ్చింది. నా వైఫల్యాలన్నీ నన్ను వెంటాడుతున్నాయి. నేను వెల్డన్‌కి సరితూగనని భావన కలిగేది. నా ఆత్మవిశ్వాసం పూర్తిగా తిరిగి పొందలేకపోయాను. ఇప్పుడు ఏ వేషం వేయాలన్నా, నాకు భయం వేస్తోంది. అటువంటి సమయంలో నా ఒప్పందకాలం పూర్తయిందని కార్నోతో చెప్పవలసి వచ్చింది. నిజానికి కార్నో ఎవరినైనా తీసివేయవచ్చు. కానీ నేనంటే అతనికి ఏదో తెలియని ఇష్టం. ఈ రెండు పార్శ్వాలూ తెలుసు నాకు. ఇటువంటి స్థితిలో కార్నోముందు నిలబడ్డాను.

కార్నో, "అయితే నీకు జీతం పెంచాలన్నమాట" అని ఎగతాళిగా అడిగాడు. 'నీకు గుర్తుందా ఆక్స్‌ఫర్డ్‌లో ఏం జరిగింది? అప్పటినుంచి అన్నీ ఫిర్యాదులే. కంపెనీకి చాలా చెడ్డపేరొచ్చింది' అన్నాడు.

నేను దానికి 'నా బాధ్యతేముంది అన్నాను.' 'వాళ్ళంటారయ్యా నేనుకాదు' అన్నాడు.

"వాళ్ళేమన్నారన్ని" అడిగాను. కార్నో కొద్దిగా ఆగి నా వంక చూస్తూ 'నీకు ప్రతిభే లే'దన్నారు. ఇది నాకు అశనిపాతంలాగా తగిలింది. చాలా కోపం కూడా వచ్చింది. అయినా తమాయించుకొని, "మిగతావాళ్ళట్లా అనుకోవడం లేదే. వేరే కంపెనీవాళ్లు మీరిచ్చే దానికంటే ఎక్కువిస్తామని అంటున్నారు" అని అన్నాను. (నిజానికి నాకు అటువంటి ప్రతిపాదన ఏదీ లేదు.) అయినా కార్నో "ఆ ప్రదర్శన నువ్వే తగలేశావనీ, నీ హాస్యం మండినట్లే ఉంటుందనీ అంటున్నారు. కావాలంటే వినిపిస్తాను," అంటూ ఫోన్ తీశాడు. ఫోన్‌తీసి బిజినెస్ ఎట్లా ఉందని అడిగాడు అటునుంచి సమాధానం, 'చాలా తక్కువ' ఉందని వచ్చింది.

ప్రదర్శన ఎలా ఉందని అడిగాడు.

నీరసంగా ఉందని.

"చాప్లిన్ నటన గురించి ఏమంటున్నారు" అని అడిగాడు.

"కంపు కొడుతోంది" అని వచ్చింది.

అప్పుడు ఫోన్ నాకిచ్చాడు.

'నువ్వే విను' అని. అవతలి వ్యక్తితో నేను, 'అవును చార్లీ కంపుకొడుతున్నాడు, కానీ నీ థియేటర్ మరీ పెంటకుప్పలా ఉంది' అన్నాను. అక్కడితో ఆ సంభాషణ అయిపోయింది.

కార్నో నన్ను ఎంతగా అణగదొక్కాలని ప్రయత్నించినా నన్ను అణగదొక్కలేక పోయాడు. నేను 'జీతం పెంచకపోతే ఒప్పందం ఖరారు చేయను' అని చెప్పాను. అప్పుడు వారానికి ఐదు పౌండ్లు ఇస్తున్నాడు. ఇప్పుడు ఆరు పౌండ్లు ఇస్తే ఒప్పందం కుదురుతుందని చెప్పాను. నాకు ఆశ్చర్యం కలిగించేటట్లు కార్నో ఒప్పుకున్నాడు.

ఆల్ఫ్‌రీక్స్ అనే ఆయన కార్నో కంపెనీకి అమెరికాలో మేనేజరు. ఆయన ఇంగ్లండ్ వచ్చాడు. బయట పుకారేమంటే ఆయన మంచి హాస్యనటుడికోసం వెతుకుతున్నాడు. అమెరికా తీసుకెళ్లేందుకు. ఇక్కడ ఆక్స్‌ఫర్డ్ మ్యూజిక్ హాలులో నా వైఫల్యం తరువాత నాకు అమెరికా వెళ్ళాలని బుద్ధిపుట్టింది. దీనికి కారణం అమెరికాలో సాహసయాత్ర చేయటం ఒక్కటే కాదు. ఒక క్రొత్త జీవితాన్ని ఒక క్రొత్త ప్రపంచంలో మొదలుపెట్టాలనే ఆలోచనే. అదృష్టవశాత్తు నేను నటిస్తున్న 'స్కేటింగ్' అనే నాటకం బర్మింగ్‌హాంలో చాలా విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. సరిగ్గా అదే సమయంలో ఆల్ఫ్‌రీక్స్ వచ్చాడు. ఆయన చూస్తుండగా నేను చేయవలసిందంతా చేశాను. దాని పర్యవసానమే ఆల్ఫ్‌రీక్స్ నన్ను ఎంచుకొన్నాడు. అమెరికా కమెడియన్‌గా. కానీ కార్నో నన్ను ఒదిలిపెట్టలేదు. నాతో ఆయనకి చాలా ప్రణాళికలున్నాయి. ఇట్లాగే కొన్ని వారాలు గడిచింది. అప్పుడే ఒక క్రొత్త నాటకం తయారుచేశారు. దాని పేరు. 'ద ఓస్ ఓస్.' కార్నో దీనిని అమెరికా కోసమే తయారు చేసాడు. అమెరికాలో అన్నీ రహస్య జీవితాలే. ఈ నాటిక అక్కడ బాగా విజయవంతం అవుతుంది అని నమ్మాడు.

నాకు ఏదైనా అమెరికా వెళ్ళటమే కావాలి. ఇంగ్లండులో నేను చేయవలసిన పనేమీ లేదని తెలిసింది నాకు. నాకున్న చదువుకి, నేను నటిస్తున్న నాటకాల కంపెనీలకి ఇక్కడ ఇంతకన్న ఎక్కువ గుర్తింపురాదు. అందుకనే అమెరికా వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

ఓడ బయలుదేరే ముందురాత్రి లండన్ వెస్ట్ ఎండ్, లీసెస్టర్ స్క్వేర్, కోవెంట్రి స్ట్రీట్, మాల్, పికాడిల్లీ అన్నీ చెడతిరిగాను. ఇదే చివరిసారిగా లండన్ చూస్తున్నట్లు! తెల్లవారు ఝామున రెండుగంటలదాకా తిరుగుతున్నాను. నా మనసంతా శూన్యంగా, విచారంతో నిండిపోయింది. నాకు వీడ్కోలు చెప్పడం ఇష్టంలేదు. ఎవరేమనుకున్నా స్నేహితుల నుండి, బంధువుల నుండి విడిపోవడం ఆనందదాయకం కాదుగదా! ప్రొద్దున్నే ఆరుగంటలకి లేచాను. అప్పటికి అన్న సిడ్నీ నిదురపోతూనే ఉన్నాడు. అందుకని నేనొక చిన్న చీటీమీద "నేను అమెరికా వెళుతున్నాను. నీకు ఉత్తరాలు రాస్తుంటాను. ప్రేమతో చార్లీ" అని పెట్టి బయలుదేరాను. అమెరికా ఓడ ఎక్కటానికి!

ఎనిమిదవ అధ్యాయం

అమెరికా! అమెరికా!!

పన్నెండురోజులు సముద్రయానం – అదీ భయంకరమైన వాతావరణంలో – తర్వాత మా ఓడ క్యూబెక్ చేరింది. మధ్యలో మూడురోజులు చుక్కాని విరిగితే మరమ్మత్తులు చేశారు. నిజానికి ఈ ఓడ గొడ్డుగోదాని చేరవేసేది. అందులో అలాంటి జంతువులేమీ లేవుగానీ, పుష్కలంగా ఎలుకలు మాత్రం తిరుగుతున్నాయి. నా మంచం క్రిందకు వచ్చి కోపంగా చూసేవి. చివరికి చెప్పులతో కొడితేగాని పోయేవికావు. నాకు మాత్రం క్రొత్త ప్రదేశానికి వెళ్తున్నామన్న ఉత్సాహంతో సంతోషంగా వుంది!

అది సెప్టెంబరు మాసం. పొగమంచు తెరలను చీల్చుకుని, మా ఓడ 'న్యూ ఫౌండ్‌లాండ్' దాటింది. తర్వాత కెనడా భూతీరం కనిపించింది. అప్పటికే సన్న తుపర్లు పడుతూ వున్నాయి. సెయింట్ లారెన్స్ నదీ తీరంలో మనుషులెవరూ వున్నట్లు లేదు. క్యూబెక్ నగరం, మా ఓడనుంచి చూస్తుంటే ఎలా వుంది? ఇక్కడేనా 'హామ్లెట్' దెయ్యం తిరిగేది అనిపించింది. ఇదే ఇలా వుంటే, మరి అమెరికా ఇంకెలా వుంటుందో?

కాని టోరోంటో చేరేసరికి పరిసర ప్రాంతాలు చాలా సుందరంగా వున్నాయి. మేపుల్ చెట్లూ ఆకులు వింత రంగుల్లో కనులకు ఇంపుగా కనిపించాయి. టోరోంటోలోనే మేము అమెరికాకి రైలుబండి మారాము. అమెరికా దేశపు ముద్రలు మా ప్రయాణ పుస్తకాల మీద వేశారు. అక్కడ నుంచి న్యూయార్క్ ఆదివారం వుదయం పదిగంటలకు చేరాము. నేను ఎంతో విన్న న్యూయార్క్ 'టైమ్స్ స్క్వేర్' దగ్గర ట్రైన్ దిగి చూశాను. చాలా నిరాశ చెందా! వీధులలో చెత్తాచెదారం ఎగురుతోంది. అలాగే బ్రాడ్వేకూడా నిద్రపోతున్నట్లుంది. అప్పుడే నిద్ర లేచిన బద్ధకస్తురాల్లాగా అనిపిస్తోంది. ప్రతి వీధి చివరా, ఎత్తు కుర్చీలు – అందులో కూర్చొని బూట్‌పాలిష్ చేయించుకునేవారు. వీళ్లను చూస్తే ఇప్పుడే కాలకృత్యాలు తీర్చుకుని వచ్చినట్లున్నారు. అక్కడ వున్న అగంతకులందరూ

దిక్కుతోచనివారిలా చూస్తున్నారు. ఏదిఏమైనా ఇది న్యూయార్క్ నగరం, సాహసాలకు మారుపేరు. మమ్మల్ని గందరగోళపరచి భయభ్రాంతుల్ని చేస్తోంది. పారిస్‌లాగా స్నేహపూర్వకంగా ఆహ్వానించదు. పారిస్‌లో నాకు ఆ భాష రాకపోయినా ప్రతి వీధిచివరా నాకు ఆహ్వానం, ఆతిథ్యం ఎదురు చూసేవి! కాని బాబోయి – నూయ్యార్క్! ఇది పెద్ద వ్యాపారానికి ప్రతీక. ఆకాశాన్నంటే హర్మ్యాలు – వాటిముందు మీరు పిపీలికంలాగా చిన్నబోతారు. అవీ దయా దాక్షిణ్యం లేకుండా మిమ్మల్ని లెక్కచేయనట్లు తలలు ఆకాశంలో మబ్బుల్లో పెట్టుకుంటాయి. జన సామాన్యానికి అందుబాటులో వుండని ఇక్కడ బార్‌లు – కనీసం కూర్చొనేందుకు కుర్చీలు కూడా వేయరు. కాలు పెట్టుకునేందుకు ఒక గొట్టంలాంటి పొడవాటి ఇత్తడి తప్ప, రెస్టారెంట్లు చాలా పరిశుభ్రంగా – పాలరాతి నేలతో చల్లగా – నిర్లక్ష్యంగా అనిపిస్తాయి.

యానహాట్టన్ 43వ వీధిలో – వెనకవైపు ఒక గది తీసుకున్నాను. అది చాలా మురికిగా చిన్నదిగా వుంది. నాకు వెంటనే లండన్‌లో మా యిల్లు గుర్తుకొచ్చి ఇంటి బెంగ పట్టుకుంది. ఇప్పుడు నేనుంటున్న భవనం నేల మాళిగిలో బట్టలు శుభ్రపరిచి ఇస్త్రీ చేసేవారు. ఈ వాసన నా దిగులుని ఇంకా ఎక్కువ చేసింది.

మొదటిరోజు తినటానికి వెళ్లిన రెస్టారెంటులో ఏమి చెప్పాలో అర్థం కాలేదు. నేను మాట్లాడే ఇంగ్లీషు చాలా నెమ్మదిగా స్పష్టంగా వుండేది. కాని ఇక్కడ చాలా వేగంగా ముక్కలు ముక్కలుగా భాషను నరికి – వాళ్ళ వేగానికి అడ్డురాకుండా మాట్లాడుతారు. నేను చెప్పేది వారి వేగాన్ని తగ్గిస్తుందని నాకు భయం వేసేది. నేను ఈ వేగవంతమైన జీవన శైలికి క్రొత్తవాణ్ణి. ఖచ్చితంగా వేగంగా పనిచేసేవారు. బూటు పాలిష్ చేసేవారు, బార్‌లో డ్రింక్ ఇచ్చేవాళ్ళు, రెస్టారెంట్‌లో కోడిగుడ్డు పాలు షేక్ ఇచ్చేవాళ్ళు – ఎవ్వరైనా సరే వేగంగా, నేర్పుతో నిష్ఠతో పనిచేసేవారు.

ఆ కూడలిలో మొదటిరోజు – నేను ఎవ్వరికీ చెందననే భావన కలిగింది. ఇక్కడి వారు ఎంతో విశ్వాసంతో ఈ మొత్తం న్యూయార్క్ వారిదే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. అందులో ఆప్యాయత – మర్యాద చూపించటం ఒకరకమైన బలహీనతగా వాళ్ళు భావిస్తారని అనుకున్నాను. మెల్లగా నాటకాలూ – ప్రదర్శనలూ వేసే బ్రాడ్వేకి వచ్చాను. ఇక్కడ నూలు దుస్తుల్లో తేలికగా కనపడుతున్నారు. నేను ఇంగ్లాండు చలిలోనుంచి – ఇక్కడ వేసవిలో పడ్డాను. అప్పటివరకూ ఈ విషయం తట్టనేలేదు. ఒక్కసారిగా నా

దృష్టి మారిపోయింది. ఈ బ్రాడ్వేమాయ తెలిసి వస్తోంది. అక్కడి థియేటర్ల రంగు దీపాలూ – రెస్టారెంట్లూ వింత సంగీతమూ నన్ను అమెరికా జీవితం అర్థం చేసుకునేట్లు చేశాయి. వ్యాపార ప్రకటనలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. నాటకాల వాల్‌పోస్టర్లు రమ్మని ఆహ్వానిస్తున్నాయి.

"అవును. ఇదే – ఈలాంటి జీవితం కావాలి! నాకు ఇది తగిన ప్రదేశము" అని అనుకున్నాను.

ఈ బ్రాడ్వేలో అందరూ – నాటకాల గురించి, ప్రదర్శనల వ్యాపారాల గురించే మాట్లాడుతారు. లీషుబర్ట్, మార్టిన్‌బెక్, విలియమ్ మారిస్, పెర్సి విలియమ్స్ ఇన్ని పేర్లు వినపడతాయి.

ఇక్కడి పత్రికలన్నీ ముఖ్యంగా నాటకాల గురించి, తారల గురించే వ్రాస్తాయి. గుర్రప్పందాల మాదిరి ఈ పోటీలో ఏది ముందో ఏది తర్వాతో రేటింగ్ ఇస్తాయి. మా ట్రూపు కూడా ఈ రేటింగ్ చూసుకుని విఫలమయితే ఇంగ్లాండు తిరిగి వెళ్లిపోవటమే!

మేము రిహార్సల్ చేయటానికి ఒక గది తీసుకున్నాము. ముసలి హాస్యగాని పాత్రకోసం, డ్రూరీ లేన్ అనే డెబ్బయిఏళ్ల వయస్సు నటుణ్ణి తీసుకున్నారు. ఆయనకు మాటలు సరిగ్గా పలకవు. ఆయనదే పెద్ద పాత్రకూడా.

మా 'కార్నో' కంపెనీకి ఇక్కడ చాలా పేరుంది. అందుకని మాకు పత్రికల్లో మొదటి, పెద్ద వార్తకిందే వేశారు. మంచి చిత్రకారునితో మా పోస్టరుకూడా తయారు చేశారు. నాకు నచ్చకపోయినా, 'కార్నో' చెప్పినట్లు అమెరికాకు అదేకావాలి!

లండన్‌లో మా షోకి బాగా స్పందన వుండేది. నా ప్రతిచర్య, మాట – నవ్వు పుట్టించేవి. మరి ఇక్కడ? మా ప్రదర్శనకు ముందు నేను పడిన తపన, వేదన అంతా ఇంతా కాదు. రంగం మీదకి రాకముందు చుట్టూ వున్న అమెరికన్ నటీనటులు, ప్రేక్షకలోకం వీళ్ళందరూ నన్ను చాలా గందరగోళ పరిచారు. ఇదేదో నాకు పరీక్షలాగా అనిపించింది.

ఇక్కడ దృశ్యం ఒక ఆరుబయట క్యాంప్ గుడారంలోంచి టీ కప్పుతో నేను బయటికి వస్తాను. అక్కడున్న హట్సన్ గారితో శుభోదయం చెప్పి కొంచెం నీళ్ళుంటే ఇస్తారా? అని అడుగుతాను.

ఈ పాటికి ఇంగ్లండ్‌లో నవ్వులతో నిండిపోయేది హాలు. 'ఆర్చి' తప్పనిసరిగా ఇస్తాను. అయినా నీళ్ళెందుకు?

(ఇక్కడ అమెరికన్ ప్రేక్షకులు కొంచెం కదిలారు.) "రాత్రి బాగా నిదురపట్టిందా" హట్సన్.

"ఘోరంగా నన్ను ఒక గొంగళి పురుగు తరుముతున్నట్టు కలవచ్చింది."

ప్రేక్షకులలో ఏమీ చలనం లేదు. నాటకం ఇట్లాగే సాగింది. మమ్మల్ని పరీక్షగా ప్రక్కనుంచి చూస్తున్న నటులంతా వెళ్ళిపోయారు. చాలా పేలవంగా నాటకం పూర్తయింది. ఇంతకంటే మంచి నాటకాలున్నా కార్నో ఇదే వేయమన్నాడు. దానికి ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాము.

మరో దేశంలో ప్రదర్శన విఫలమయిందంటే దాని పర్యవసానం ఘోరంగా ఉంటుంది. మమ్మల్ని ఎవరో తరుముతున్నట్లు, వేమ తప్పించుకు తిరుగుతున్నట్లనిపించేది. తోటి అమెరికన్ నటీనటులు మమ్మల్ని అంటురోగుల క్రింద చూసేవారు. చివరికి వరసనే నిలబెట్టి తుపాకీతో కాలుస్తారేమో అనికూడా అనిపించింది. ఈ అవమానం నన్ను మరీ క్రుంగదీసింది. పగలంతా మాన్‌హట్టన్ రోడ్లమ్మట తిరిగేవాణ్ణి. ఉద్యానవనాలు, బ్రతికిన కాలేజీలు, చచ్చిన కాలేజీలు చూసేవాణ్ణి. ఎంత తిరిగినా న్యూయార్క్ మహా నగరం నన్ను మరీ చిన్నబుచ్చుకొనేటట్లు చేసేది. ఈ ఆకాశహర్మ్యాలు చూస్తే ఇవన్నీ వీళ్ళు విజయానికి సంకేతాలుగా కనబడేవి. ఇంకా లోతుగా వెళ్ళి అక్కడ మురికి వాడలు కూడా చూసాను. పేదరికాన్ని దిగంబరంగా దర్శించాను. ఈ సంపద ప్రక్కన పేదరికం మరీ నగ్నంగా కనబడేది.

అయితే అమెరికన్లు ఎవరూ మా వైఫల్యాన్ని పట్టించుకోలేదు. వారికంత సమయం కూడా ఉండదు. వీరు వేటాడేది ఆటాడ్డంకోసం కాదు. చంపడంకోసమే. అలాగే వీరు జూదం ఆడేది జాక్‌పాట్ కోసమే. ఎంత తొందరగా ఎన్ని ఎక్కువ డాలర్లు సంపాదిస్తే ఇక్కడ అంత మొనగాడు. ఇవన్నీ చూసిన తరువాత నాకు ఇక్కడ ఎక్కువ అవకాశాలు కనపడినాయి. నేను ఈ ప్రదర్శన వ్యాపారంలో ఉంది కేవలం డబ్బుకోసమే కదా! కళ, గిళ అని ఎప్పుడూ నేను పిచ్చిగా అనుకోలేదు గదా! అలాంటప్పుడు నేను దీనినే పట్టుకు ఎందుకు వ్రేలాడాలి. ఇక్కడ డబ్బుకోసం ఏమైనా చేయవచ్చుకదా! అందుకని

ఇక్కడే ఉండడానికి నిర్ణయించుకున్నాను. నా వైఫల్యాన్ని మర్చిపోవడానికి నా విజ్ఞానాన్ని పెంచుకోవాలని నిర్ణయించుకొన్నాను. ఒక పుస్తకాల కొట్లో దూరాను. ఇంగ్లీషు గ్రామరు, లాటిన్ ఇంగ్లీషు డిక్షనరీ, కొన్ని వాచకాలు కొని చదవడానికి నిర్ణయించుకొన్నాను. కానీ నా చదువు సాగలేదు. అదృష్టవశాత్తూ మా నాటకం పెద్దగా ఆడలేకపోయినా పత్రికల్లో నా పేరు ఘనంగానే రాశారు. వెరైటీ అనే పత్రికలో "ఈ ఇంగ్లీషు హాస్యగాడు అమెరికాకి బాగా పనికివస్తాడు" అని. ఇక మేమందరం పెట్టెలు సర్దుకొని వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాము, ఇంగ్లండ్‌కి.

చివరి వారంలో 5th Avenue థియేటర్లో ప్రదర్శన ఇచ్చాము. అక్కడ ఎక్కువగా ఇంగ్లీషు రెస్టరెంట్స్. బట్లర్లూ, డ్రైవర్‌లూ ఉన్నారు. సోమవారం రాత్రి మా ప్రదర్శనకి వాళ్ళందరూ వచ్చారు. నా ప్రతి మాటకీ, చేతకీ హాలు దద్దరిల్లిపోయింది. మా కంపెనీలో ఉన్నవాళ్ళంతా ఆశ్చర్యపోయారు నాతో సహా. ఈ వారం జరుగుతుండగానే మమ్మల్ని ఒక అమెరికా ఏజెంటుచూసి ఇరవైవారాల అమెరికా టూర్‌కి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఈ టూర్‌లో అమెరికా కొంతభాగం తిరిగాము. నేను గ్రహించినదేమిటంటే ప్రతిచోటా జూదం ఎక్కువ ఆడతారు. అదికూడా పాచికలాటే ఎక్కువ. వీరికి తొందరగా డబ్బు సంపాదించడం కావాలి. నాకు కూడా ఈ జూదంలో చాలాసార్లు డబ్బు వచ్చింది. ఈ రకంగా నేను చాలా డబ్బు పొదుపు చేశాను. నా జీతం వారానికి డెబ్భై అయిదు డాలర్లు. అందులో యాభైడాలర్లు తప్పనిసరిగా పొదుపుచేసి మాన్‌హట్టన్ బ్యాంక్‌లో వేసేవాడ్ని. ఈ టూర్‌లోనే నాకు ఒక టెక్సన్ రైలులో పరిచయమయ్యాడు. అతనూ, నేనూ కలసి ఒక వ్యాపారం ఆలోచించి రెండువేల ఎకరాలలో పందులని పెంచాలని ప్రణాళిక తయారు చేశాం. నాకు ఈ ప్రణాళికలో చాలా డబ్బు కళ్ళముందు కనబడింది. ఐదేళ్ళలో ఒక్కొక్కళ్ళకి లక్షడాలర్లు వస్తాయని అంచనా వేశాం. తరువాత ఎప్పుడు పడుకున్నా ఈ పందుల పెంపకమే కలలోకి వచ్చేది. రైలులో ప్రయాణం చేస్తుంటే కిటికీలోంచి వెనక్కు పరుగెత్తే పొలాలన్నీ పందులతో నిండిపోయి ఉండేవి.

ఆ తరువాత ఈ పందుల పెంపకం గురించి ఒక పుస్తకం కొని చదివాను. ఆ పుస్తకంలో ఆ పందులని బరువు పెరిగేందుకు ఏ రకంగా వాటి విత్తులు కొడతారో చదివిన తరువాత నా కలలన్నీ ఆవిరైపోయాయి.

ఈ యాత్రలోనే నేను వయొలిన్, సెల్లో, రెండూ నాతోపాటు తీసుకొచ్చాను. నాకు పదహారేళ్ళప్పుడు రోజుకి నాలుగైదు గంటలు వయొలెన్ సాధన చేశాను. నేను ఎడమచేత్తో సాధన చేసేవాణ్ణి. ఏదైనా సంగీత కచేరీలో వయొలిన్ వాయించాలని కోరిక. కానీ నాకు ఆ నైపుణ్యం ఎప్పటికీ అబ్బలేదు. అందుకని అది కూడా వదలి వేశాను. 1910లో షికాగో నగరం ఎంత వికారంగా ఉండేదో అంత ఆకర్షణీయంగా ఉండేది. అక్కడ విపరీతమైన చైతన్యం తొణికిసలాడుతుండేది. బాగా కండలున్న వీరునిలాగా అనిపించేది. దాని చుట్టూ ఉన్న వేల ఎకరాల ఖాళీస్థలాలు ఎడారిలా అనిపించేవి.

చికాగోలో జరిగే ప్రదర్శనలలో ఒక ప్రత్యేకత వుండేది. చాలా లావుపాటి స్త్రీలతో హాస్యనటులు ఆడి పాడేవారు. వారు ఎంత లావు వుండేవారంటే వారిని చూస్తే మగవాడికి జుగుప్స కలిగే విధంగా వుండేది. ఈ ప్రదర్శనల ఉద్దేశ్యం కూడా ఇదేనేమో! ప్రేక్షకులకు ఎటువంటి శృంగార తలపులూ రాకుండా ఉండేందుకేనేమో అనిపించేది. చికాగో 'మగ' తనానికి ఇదే మందు!

చికాగోలో వాబాష్ ఎవిన్యూలో ఒక చిన్న హోటల్‌లో వున్నాను. అది చిన్నదే అయినా రమణీయంగా వుండేది. మేమున్న హోటల్లో చాలామంది షో-యువతులు వుండేవారు. మాకు ఎప్పుడూ ఏదో ఆశ వుండేది. ఎవరైనా దొరక్కపోతారా అని! కాని అలాంటిదేమీ ఎప్పుడూ జరగలేదు నాకు ముఖ్యంగా!

అప్పుడే ఒక అందమైన అమ్మాయి ఎప్పుడూ ఒంటరిగా వుండేది (ఈమెకూడా డాన్సు ట్రూపులోదే). నేను ఎన్నోసార్లు ఆమెను పలకరించి స్నేహం చేద్దామని అనుకున్నాను. కాని అటువైపు నుంచి ప్రేరణేమీ రాలేదు. తర్వాత నా తోటివాడు - ఆమెతో మాట్లాడాడు. అతనితో నేను ఆ అమ్మాయి ఏమంటుంది? అని అడిగాను. 'అవును చాలా మంచిది. కాని సిఫిలిస్ వుంది' అని అన్నాడు. అందుకే అందరికీ దూరంగా వుంది.

మేము అందరం చందాలువేసి ఆమె వైద్యానికి సొమ్ము ఇచ్చాము. అప్పుడే వచ్చిన 'సాల్‌వర్సాన్' అనే మందుతో నయం చేయించుకుంది.

ఇలాగే ప్రతి నగరంలో వేశ్యా గృహాలుండేవి. 16 నుంచి 25 ఏళ్ల అమ్మాయిలు ఎప్పుడూ అందుబాటులో వుండేవారు. ముఖ్యంగా చికాగోలో 'ఎవర్నీ సిస్టర్స్' నడిపే

వేశ్యాగృహం ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందింది. వీరిద్దరూ మధ్యవయస్కులు. వీరి వేశ్యాగృహాలలో అన్నిజాతుల, అన్ని దేశస్థుల అమ్మాయిలు ఉండేవారు. గదులుకూడా ఆదేశ పద్ధతి ప్రకారం అలంకరించేవారు. టర్కీ, జపాన్, లూయీ 14. అరబ్ గుడారం కూడా ఉండేది. ఇది చాలా ఖరీదైన వ్యవహారం కూడా. అస్సలు విషయం ఏమిటంటే ఈ వేశ్యా గృహాలకి కేవలం కోటీశ్వరులేకాదు పారిశ్రామిక వేత్తలూ, కేంద్రమంత్రులూ, పార్లమెంట్ సభ్యులూ, న్యాయమూర్తులూ అక్కడికి వస్తుండేవారు. షికాగోలో ఏదైనా ప్రపంచ మహాసభలు ఏవైనా జరిగితే ఒకరోజు ఈ మొత్తం వేశ్యాగృహాలను వారే ఆక్రమించేవారు. ఒకసారి బాగా డబ్బున్న ఒక కాముకుడు మూడు వారాలపాటు సూర్యోదయం చూడకుండా లోపలే ఉండిపోయాడని కథ కూడా విన్నాను.

షికాగో వదిలి ఇంకా పడమరగా ప్రయాణించిన కొద్దీ ఎంతో విశాలమైన దేశం కనపడుతుంది. మనస్సుకి ఖాళీస్థలం కావాలికదా! అది ఎంత పెద్దదయితే అంత బాగుంటుంది. ముఖ్యంగా నా దృష్టి మరీ విశాలమైనది. క్లీవ్‌లాండ్, సెయింట్ లూయిస్, మినియా పోలీస్, సెయింట్‌పాల్. కాన్సాస్ సిటీ, డెన్వర్, బట్టీ, బిల్లింగ్స్ ఇలాంటి నగరాలన్నీ భవిష్యత్ చైతన్యంతో కళకళలాడుతుండేవి. ఇదంతా నాకు బాగా నచ్చింది.

మా ట్రూపు సభ్యులతో కలిసి మెలిసి ఉండేవాళ్ళం. ప్రతి ఊళ్ళో వేశ్యా గృహాలన్నీ చూసేవాళ్ళం. కొన్ని ఊళ్ళల్లో వేశ్యమాత మా ఆరుగురికోసం ఇంక ఎవరినీ రానిచ్చేది కాదు. అప్పుడప్పుడు కొంతమంది అమ్మాయిలు మా నటులతోపాటు వచ్చేసేవారు కూడా.

మోంటానా రాష్ట్రంలోని బట్టీ జిల్లాలోని వేశ్యాగృహాలన్నీ ఒక పొడవాటి వీధిలో ఉండేవి. ఆ వీధికి అటూ ఇటూ సన్నసన్న సందులుకూడా ఉండేవి. అక్కడ అమ్మాయిలు పదహారేళ్ళ వరకూ ఉండేవారు. కేవలం ఒక డాలరే ఖరీదు. ఆ పడమటి అమెరికాలో బట్టీలో ఉన్న అందగత్తెలు ఇంక ఎక్కడా లేరని ప్రతీతి. అది నిజంకూడా. అక్కడెవరయినా అందగత్తె కనబడిందంటే ఆమె అక్కడినుంచే వచ్చిందని అనుకోవాలి. చాలా సంవత్సరాల తరువాత ప్రఖ్యాత రచయిత సోమర్ సెట్‌మామ్‌తో ఆయన వ్రాసిన 'వర్షం' అనే నాటకంలో శాడీథామ్సన్ పాత్ర గురించి చర్చించాను. బట్టీలోని ఏ వేశ్యకూడా ఆయన వర్ణించినట్లు దుస్తులు వేసుకోదు అని చెప్పాను.

1910 సం॥లో బట్టీలో గని కార్మికులే ఎక్కువమంది ఉండేవారు. వాళ్ళు మెడకి ఎర్రని గుడ్డ కట్టుకొని, తలకి శిరస్త్రాణం పెట్టుకొని వీధిలో దర్జాగా నడిచేవారు. ఒకసారి

నేను చూస్తుండగానే ఒక ఖైదీ పారిపోతుంటే, పోలీసు అధికారి తుపాకి వాడి కాళ్ళమీద కాల్చడం జరిగింది. అదృష్టవశాత్తు వాడు దెబ్బ తగలకుండానే దొరికిపోయాడు.

మేము ఇంకా పడమరగా ప్రయాణించాము. విన్నిపెగ్, టకోమా, సియాటిల్, వాన్‌కోవర్, పోర్ట్‌లాండ్ నగరాలలో ప్రదర్శనలిచ్చాము. ఈ నగరాలలో ప్రేక్షకులంతా ఇంగ్లీషువారే! అందుకని మా ప్రదర్శనను బాగా ఆదరించారు. ఆహ! చివరికి కాలిఫోర్నియా వచ్చాం. ఇది భూతల స్వర్గమే. ఎప్పుడూ ఎండ కాస్తూ బత్తాయి తోటలతో, ద్రాక్ష తోటలతో, కొబ్బరి చెట్లతో చైతన్యం ఎగసిపడే పసిపిక్ మహా సముద్ర తీరం ఉన్న రాష్ట్రం. ముఖ్యంగా శాన్‌ఫ్రాన్సిస్కో అద్భుతమైన నగరం. మంచి గాలి, మంచి వెలుతురు, మంచి భోజనం చవకగా దొరికే నగరం. నేను మొదటిసారిగా ఇక్కడే కప్పకాళ్ళు తిన్నాను. ఇది 1910. 1906లో ఇక్కడ చాలా పెద్ద భూకంపం వచ్చింది. దానినే వీళ్ళు అగ్నిప్రమాదం అంటారు. ఈ నాలుగేళ్ళలో నగరం పూర్తిగా కోలుకుంది. ఎక్కడా ఆ భూకంపం అగ్ని తాలూకు, ధుమ్ము ధూళి, కూడా లేదు. అంతా క్రొత్తగా ప్రకాశిస్తుంది. చివరికి నేనున్న ఈ చిన్న హోటల్ కూడా. మేము ఎంప్రెస్ థియేటర్‌లో ప్రదర్శనలిస్తున్నాము. ఆ థియేటర్ యజమాని సిడ్‌గ్రామన్. చాలా స్నేహపాత్రుడు. ఆయన మా ప్రదర్శనలో నన్నుచూసి చాలా మెచ్చుకున్నాడు. ముఖ్యంగా అక్కడ వేసిన వాల్‌పోస్టర్‌లో నా బొమ్మే ఉంది. ఒకసారి గ్రామన్ నా దగ్గరికి వచ్చి "కార్నోతో నీ ఒప్పందం అయిపోయిన తరువాత నువ్వు వచ్చేసెయ్యి. మనిద్దరం కలిసి నాటకాలు తయారు చేద్దాం." అన్నాడు. ఇది నాకు చాలా ఉత్సాహాన్ని కలిగించింది. నిజానికి ఈ నగరంలోనే ఒకరకమైన ఆశా, వ్యాపారం మిళితమై ఉంటుంది.

ఇక్కడికి దక్షిణంగా ఉన్న లాస్‌ఏంజిల్స్ చాలా వికారమైన, విశాలమైన నగరం. జనాభా కూడా పాలిపోయినట్లు, వేడికి, ఉక్కకి బక్కచిక్కినట్లు అనిపిస్తారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న తాజాదనం ఇక్కడ ఉండదు. కాలిఫోర్నియా రాష్ట్రం ఉత్తర సరిహద్దులో సహజ నిధి నిక్షేపాలున్నాయి. లాస్ ఏంజిల్స్‌లోని హాలివుడ్ ప్రపంచం కూలిపోతే ఆ సహజ వనరులే కాపాడుతాయి. ఈ రాష్ట్రాల్లో మా ప్రదర్శన చివరగా సాల్ట్‌లేక్ సిటీలో ఇచ్చాం. ఇది ఒక ఎండమావిలాగా వేడికి గాలిలో దూరంగా తేలుతుంటుంది. ఇక్కడ ప్రేక్షకులు కూడా అంతే. చివరికి ఈ యాత్ర ముగించుకొని న్యూయార్క్‌కి తిరిగి వచ్చాము, ఇంగ్లాండ్ వెళ్ళిపోయే ఉద్దేశంతోనే. కానీ విలియం

హారిస్ అనే ఆయన మమ్మల్ని మరొక ఆరు వారాలు మా నాటకాలన్నీ 42వ వీధిలో ఉన్న ఆయన థియేటర్‌లో ఆడమన్నాడు. మా మొదటి ప్రదర్శన "ఇంగ్లీషు మ్యూజిక్ హాలులో ఒకరాత్రి" చాలా విజయవంతంగా నడిచింది. మొదటివారంలో మా నాటకం చూడడానికి ఇద్దరు స్నేహితులొచ్చారు. అందులో ఒకాయన "నాకెప్పుడైనా డబ్బొస్తే అతనిని "బుక్" చేస్తాను." అని అన్నాడు. త్రాగుబోతుగా నా నటన చూసి ఆయన పేరే మాక్స్‌సెనెట్. ఆ తరువాత కీస్టోన్ కంపెనీ ఆయనే పెట్టాడు.

ఈ ఆరువారాలూ బ్రహ్మాండంగా ప్రదర్శనలిచ్చాము. దాని ఫలితమే విలియం మారిస్ మరో ఇరవై వారాలు మాకు అమెరికా టూర్ ఏర్పాటు చేశాడు. ఈ రెండో టూర్ కూడా విజయవంతంగా పూర్తిచేశాం. ఇంక మూడువారాలే ఉంది. మళ్ళీ శాన్‌ఫ్రాన్సిస్కో, శాండియాగో, సాల్ట్‌లేక్ సిటీలో ప్రదర్శనలివ్వాలి. తరువాత ఇంగ్లండ్ వెళ్ళిపోవాలి. శాన్‌ఫ్రాన్సిస్కో వదిలిపెట్టే ముందురోజు సాయంత్రం మార్కెట్ స్ట్రీట్‌కి నడుచుకుంటూ వెళ్ళాను. అక్కడ "మీ అదృష్టం చెప్పబడును ఒక డాలరు మాత్రమే," అని ఒక కిటికీ దగ్గర వ్రాసి ఉంది. నేను లోపలికి వెళ్ళాను. ఒక లావుపాటి స్త్రీ లోపలి నుంచి ఏదో తింటూ నేనున్న చోటుకు వచ్చింది. నన్ను ఒక చిన్న బల్లదగ్గర కూర్చోబెట్టింది. నా వంక చూడకుండానే 'దయచేసి అక్కడ కూర్చోండి' అని కొన్ని పేకముక్కలు నాకిచ్చి మూడుసార్లు కలపమంది. మూడుముక్కలు తీసి ఆమె ముందు పెట్టమంది. చేతులు బల్లమీద పెట్టమంది. అప్పుడు తీక్షణంగా చూస్తూ "నువ్వు చాలా దూరం ప్రయాణం పెట్టుకున్నావు అంటే నువ్వు అమెరికా వదలి వెళ్ళిపోతావు. అయినా త్వరలోనే తిరిగి వస్తావు. అప్పుడు వ్యాపారం మొదలు పెడ్తావు. ఇప్పుడు చేసేదానికి భిన్నంగా వుంటుంది."

ఇక్కడ ఆమె తత్తరపాటు పడి "భిన్నంగా అంటే అదీ ఇట్లాంటిదే. కాని నువ్వు దాంట్లో బాగా విజయం సాధిస్తావు. నీ ముందు కాలమంతా వృత్తిపరంగా అద్భుతంగా ఉంది. కానీ అదేమిటో నాకు తెలియదు. హ! నువ్వు పెళ్ళి చేసుకుంటావు. మూడుసార్లు చేసుకుంటావు. పిల్లలుకూడా పుడతారు." మళ్ళీ నా చేతులు చూసి, నా ముఖం చూసి "నీ చేతుల్లోకి చాలా డబ్బు వస్తుంది" నువ్వు నిమోనియా వచ్చి 82వ సం॥లో చనిపోతావు" అని చెప్పి నా చేతులు వదిలేసి ఒక డాలర్ ఇవ్వమంది. "ఏమైనా అడుగుతావా?" అంది. "ఏమీ లేదు" అన్నాను. నవ్వుకొంటూ బయటికి వచ్చేశాను. ఆమె చెప్పినవన్నీ జరిగినవి. ఒక్క పిల్లల విషయంలో తప్ప.

తరువాత సాల్ట్‌లేక్ సిటీ. అక్కడ వార్తాపత్రికలన్నీ దొంగతనాలు, దారి దోపిడీల గురించి రాస్తున్నాయి. నైట్ క్లబ్‌లలో, రెస్టారెంట్‌లలో తినడానికి వచ్చిన వాళ్ళందరినీ గోడకు నిలబెట్టి దోచుకుపోతున్నట్లు రాసినాయి. దోచుకునే వారంతా ముఖాలకు ముసుగులు వేసుకొని మరీ దోచుకుంటున్నారు. మా ప్రదర్శన అయిపోయిన తరువాత మామూలుగా మేము దగ్గరలో ఉన్న నైట్‌క్లబ్‌లో ఒకటి, రెండు పెగ్‌లు తీసుకుంటాము. ఆ రకంగా అక్కడి వాళ్ళతో పరిచయం పెంచుకున్నా. అలా ఒక సాయంత్రం ఒక లావుపాటి సరదాగా ఉన్న మనిషి పరిచయమయ్యాడు. ఆయనతో పాటు మరో ఇద్దరున్నారు. "నన్నుచూసి నువ్వేకదా ఎంప్రెస్ థియేటర్‌లో నాటకంలో నటించింది" అన్నాడు. నేను అవుననన్నట్లు తల వూపాను. అతను తన తోటివారిని పిలిచి మమ్మల్ని పరిచయం చేశాడు. ఆ లావుపాటి అతను ఇంగ్లీషువాడే. కాని అమెరికన్‌లా మాట్లాడుతున్నాడు. అందరూ ఆయన్ని ఫాట్ అని పిలుస్తారు.

"నేను ఇక్కడ రాగి గనులలో చాలా కష్టపడి పనిచేశాను. కానీ ఏమీ డబ్బు మిగలలేదు," అని నా దగ్గరగా వచ్చి ఇప్పుడు చేసే పని అంతా డబ్బే అని ఒక నోట్ల కట్ట చూపించాడు. పద తాగుదాం అన్నాడు." జాగ్రత్త నోట్లు బయటికి కనబడనీయకు. ఎవరన్నా దోచుకుంటారు" అన్నాను. అతను రహస్యంగా" ఆ పని చేసేది మనమే కదా" అన్నాడు. అని నా వంక చూసి వంకరగా నవ్వాడు. నాకు ఒళ్ళంతా చెమటలు పట్టింది. అతను నన్నే చూస్తూ" అర్థమైందా అన్నాడు. నేను తలమాత్రం ఊపాను. ఇంకా దగ్గరగా వచ్చి," ఆ వెధవలని ఇద్దరినీ చూడు. ఇదే నా కంపెనీ. వాళ్ళకు మెదడుండదు. కానీ కండబలం ఎక్కువ, అంటుండగా నేను పెదవులకి వేలు అడ్డం పెట్టాను "ష్..." అని. అతడు ఓకే సోదరా! మేము రాత్రికి ఓడ ఎక్కుతున్నాము. మనం ఇంగ్లీషువాళ్ళం కదా" అన్నాడు." నిన్ను ఇస్లింగ్‌టన్ ఎంపైర్‌లో చాలాసార్లు చూశా. ఆ పెట్టెలోంచి లోపలికి, బయటికి చాలాసార్లు పడ్డావుకదా! అయినా నీ ఉద్యోగం చాలా కష్టమైంది." నేను నవ్వి ఊరుకొన్నాను. అతను మరీ దగ్గరగా వచ్చి" మనం జీవితాంతం స్నేహితులుగా ఉందాం. న్యూయార్క్‌లో నీ చిరునామా ఇవ్వు. అప్పుడప్పుడు ఉత్తరం రాస్తుండు" అన్నాడు. కానీ తరువాత అతని దగ్గరనుంచి ఏమీ ఉత్తరం రాలేదు.

తొమ్మిదవ అధ్యాయం

రెండవసారి అమెరికా

అమెరికా వదిలి వెళ్లటం నాకంతగా బాధ అనిపించలేదు. ఎలాగైనా తిరిగి రావాలనే నిర్ణయించుకున్నాను కాబట్టి. కాని ఎప్పుడు, ఏ విధంగా అనేది నాకే తెలియదు. కాని ఇప్పుడు లండన్ వెళ్లి మా చిన్న గూట్లో హాయిగా వుండాలని తహతహగా వుంది. అమెరికా యాత్ర తర్వాత మా గూడు గుడిలాగా అన్పిస్తోంది! చాలాకాలంగా అన్న సిడ్నీ ఉత్తరమే రాలేదు. తన దగ్గరనుంచి వచ్చిన చివరి వుత్తరంలో మా తాత వచ్చి – మా ఫ్లాట్‌లో వుంటున్నాడని రాశాడు. నా రాక తెలుసుకుని నా కోసం రైలు స్టేషన్‌లో ఎదురు చూస్తున్నాడు. నన్ను కలిసి ఇప్పుడు అపార్టుమెంట్‌లో తను ఉండడం లేదని పెళ్లి కూడా చేసుకున్నట్లు చెప్పాడు! అంటే నాకు మా పాత ఫ్లాట్ లేదు! ఇది నాకు నిరాశ కలిగించింది. నా జీవితానికి ఒక అర్థం కలిగించిన, చిన్న గూటిని వదిలివేయటం చాలా బాధాకరం. బ్రిక్‌స్టన్ వీధిలోనే వెనుకగా ఒక గది తీసుకుని కాలక్షేపం చేస్తున్నాను. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా అమెరికా వెళ్లిపోవాలని అనుకున్నాను. ఆ మొదటి రాత్రి లండన్ అంతా ఖాళీగా అన్పించింది.

ఇప్పుడు సిడ్నీ పెళ్లి చేసుకోవడం ప్రతి రాత్రీ ప్రదర్శనకు వెళ్లటంమూలంగా మేము పెద్దగా కలవలేకపోతున్నాము. అమ్మను చూడటానికి వెళ్లాం. అమ్మ పరిస్థితి అలాగే వుంది. అన్న చూసి వచ్చి చాలా బాధగా చెప్పాడు. 'ఏమీ తగ్గలేదు, ఆమె ఆరోగ్యం మెరుగు పడలేదు' అని. నాకు చూసే ధైర్యం లేదు. ఆమెకు కరెంటు షాకులు, మంచు నీటి స్నానాలు ఇవన్నీ ఊహించటానికే బాధగా వుంది. మేమిద్దరం ఒక నిర్ణయానికి వచ్చాం. ఈ ఆసుపత్రి (మానసిక) నుంచి తీసుకు వెళ్లి, మంచి వైద్యులున్న ప్రత్యేక మానసిక వైద్యం చేయించుదామని. ఆ ఖర్చు ఇప్పుడు మేము భరించే స్థితిలో వున్నాము కదా!

రోజురోజుకీ నాకు నా అస్తిత్వం మీద అసహ్యం వస్తోంది. నాకు దిక్కుతోచని పరిస్థితి వచ్చింది. కాని సహజంగానే ఈ దిగులు అంతగా నన్ను కమ్ముకోలేదు. మెల్లమెల్లగా లండన్ వాతావరణం, ఇక్కడ బాగా పరిచయమైన పరిసరాలూ నా విచారాన్ని కొంతవరకు తగ్గించాయి. ఇప్పటి ఇంగ్లండ్ వేసవిని నేను ఆస్వాదించటానికి మానసికంగా సిద్ధపడ్డాను.

మా బాస్, కార్నో నన్ను ఆయన వారాంతాలు పయనించే పడవలోకి ఆహ్వానించాడు. టాగ్స్ దీవికి వెళ్లేందుకు. ఆయన ప్రత్యేకమైన పడవ ఎంతో అందంగా, అతిథులకు చాలా ఖరీదయిన గదులతో నిర్మించబడింది. రాత్రిళ్లు రంగురంగుల దీపాలతో వెలిగిపోతోంది. పడవ పై అంతస్తులో రాత్రి భోజనాలకు చక్కని ఏర్పాట్లు చేశారు. వాతావరణం చాలా బాగుంది. ఇదిగో ఇలాంటి సందర్భం – నాకు ఎంతో విలువైంది.

మేము సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాం, కాఫీ, సిగిరెట్లు తాగుతూ – ఇంతలో మా ప్రక్కగా చిన్ని బోటులో ఒకడు బాగా తాగి, "ఆహా ఏమి పడవ – ఏమీ ఆడంబరం" అని నోటికి వచ్చినట్లు వాగుతున్నాడు. వీడు ఈ పని బకింగ్‌హం పాలెస్ దగ్గర చేయగలడా? సాటి ఇంగ్లీషు వాడిని లెక్కించటానికి ఇలాంటి వెధవలు వెనుకాడరు. అప్పటి సమాజంలో ఇవన్నీ మామూలే. ప్రక్కవాడిని మంచి స్థితిలో చూస్తూంటే అసూయ.

మళ్లీ మా ప్రదర్శన 14 వారాలు లండన్ చుట్టూ జరిగింది. ప్రేక్షకులు బాగా వచ్చారు. బాగా ఆనందించారు. కాని లోలోపల నాకు మళ్లీ అమెరికా వెళ్లగలనా అనే అనుమానం తొలుస్తూనే వుంది. నాకు నా దేశం అంటే ఎంతో ప్రేమ. కాని ఇక్కడ ఇంతకంటే పైకి వచ్చే అవకాశాలు తక్కువ. మళ్లీ నేను నిరాశతో వుండిపోతానని భయం!

మళ్లీ అమెరికాలోనూ ప్రదర్శనకు ఒప్పందం కుదిరిందని తెలుసుకుని ఆనందంతో పొంగిపోయాను.

ఆ ఆదివారం అమ్మను చూశాను. ఇప్పుడు ఈ ప్రత్యేక వైద్యంతో అమ్మ చాలా మెరుగుపడింది. అన్న మళ్లీ జిల్లాల యాత్రకు వెళ్లేముందు మేము కలిసి భోజనం చేశాము. లండన్‌లో చివరి రాత్రి భావోద్వేగం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. వెస్టెండ్ అంతా చెడ తిరిగాను రాత్రంతా. మళ్లీ ఈ వీధులు చూస్తానా?

ఈ ప్రయాణం 'ఒలింపిక్' నౌకలో చేశాము. నేరుగా న్యూయార్క్ నగరానికే వచ్చాము. మెల్లగా నౌక రేవులో ఆగబోతూంటే నాకు క్రొత్తగా అనిపించలేదు. ఇంటికి వస్తున్నట్లే అనిపించింది. కొత్తవాళ్లకి కొత్తగా పాత వారికి దగ్గరగా!

న్యూయార్క్ నగరం ఎంత బాగా నచ్చినా నా మనసంతా పడమటి నగరాలమీదే వుంది. పసిఫిక్ తీరాలకు వెళ్లక పూర్వం మేము చిన్న చిన్న నగరాలలో ప్రదర్శనలు ఇచ్చాము. చికాగో చుట్టుప్రక్కల, ఫిలడిల్ఫియా వెలుపల మొ॥చోట్ల. మామూలుగానే ఒంటరిగానే వుండేవాడిని. దీనిలో చాలా సౌఖ్యం వుంది. మానసికంగా నన్ను నేను సిద్ధం చేసుకోవటానికి అవకాశం వుండేది. నాలాగా ఒంటరిగా ప్రపంచాన్ని ఎదుర్కొనే వారు వున్నారు. ఇందులో వున్న అన్యాయాలను ఎదుర్కోవాలని, అందుకు సన్నద్ధం కావాలని, జ్ఞానార్జన పట్ల ప్రేమ పెంచుకున్నాను. ఈ ప్రపంచం అమాయికులను ఎలా ద్వేషిస్తుందో – అణగద్రొక్కుతుందో, దానిని వ్యతిరేకించాలనే ఆరాటం నన్ను పాతపుస్తకాలమ్మే చోట్లకు తీసుకు వెళ్లేది. అలాంటి సందర్భమే రాబర్ట్ ఇన్‌గర్‌సోల్ 'వ్యాసాలు– ఉపన్యాసాలు' అనే పుస్తకం దొరికింది. ఆయన హేతువాదం నన్ను ఆకర్షించింది. 'ఓల్డ్ టెస్ట్‌మెంట్'లోని హింస మానవాళికి ఎటువంటి మాయని మచ్చో ఎలా దిగజార్చుతుందో అర్థమైంది. ఎమర్‌సన్ రచనలూ చదివాను. అతను రాసిన 'నీకు నీవే ఆధారం' నన్ను ఎంతో ప్రభావితం చేసింది. 'స్కోఫెన్‌హార్'ని తర్వాత చదివాను. 'ప్రపంచం–ఇచ్ఛ–ఆలోచన' ఎంతగానో చదివాను. 40 ఏళ్లుగా చదువుతూనే వున్నాను.

వాల్ట్‌విట్‌మన్ రాసిన 'ఆకులు–గడ్డిపరకలు' నన్ను చాలా ఇబ్బందిపెట్టింది. హృదయం–ప్రేమల గురించి ఆయన ఆలోచనలు విపరీతంగా వుండేవి. ప్రదర్శనల మధ్యలో చాలా మంది రచయితలను కలిసే అదృష్టం కలిగింది. మార్క్ ట్వేన్, పో, హాతార్న్, ఇర్వింగ్, హాజ్‌లిట్ మొదలయినవారు కలిశారు.

నా రెండో టూర్‌లో గొప్ప పుస్తకాలు ఎక్కువ చదవలేదు. ఈ రంగస్థల జీవితం ఎంతటి రణస్థలమో! కాని ఎంత కష్టతరంగా వుంటుందో అని వంటబట్టించుకున్నాను.

ఈ చౌకబారు సంగీత నాటకాలు చాలా చికాకుగా రోజురోజుకూ నన్ను కృంగతీస్తోన్నాయి. రోజుకు మూడు నాలుగు ప్రదర్శనలిస్తూ ఇక్కడే కృంగి కృశించి పోతానేమో అనే అనుమానం కూడా కలిగింది. ఇంగ్లండులో వారానికి ఆరు రోజులు,

రోజుకు రెండు ప్రదర్శనలు. చాలా ఆనందంగా వుండేది. అయితే అమెరికాలో ఎక్కువ సంపాదించి పొదుపు చేయవచ్చు! అయిదు నెలలుగా ఈ సంగీత నాటకాల ప్రదర్శనలతో ఎండిపోయాను! అందుకనే ఒక వారం రోజులు శెలవు దొరకగానే నన్ను నేను మర్చిపోయి రసవత్తరంగా తిరగాలని నిర్ణయించుకున్నాను. దీనికోసం డబ్బు కూడా కూడబెట్టాను. ఇప్పుడు ఖర్చులోని మజా చూడాలనుకున్నాను! మంచి బట్టలు కొన్నాను. ఒక చిన్న 'సూట్‌కేస్' కూడా కొన్నాను. దుకాణందారు, 'ఇవి మీ గదికి పంపమంటారా సార్' అని అడిగినపుడు ఒక అంతస్తు పెరిగినట్లు అనిపించింది! ఇప్పుడు న్యూయార్క్ వెళ్లి మజా చేయాలి అనుకున్నాను!

హోటల్ ఆస్టర్‌లో గది తీసుకున్నాను. ఆ రోజుల్లో అది గొప్ప హోటల్. నా కొత్త సూటు వేసుకుని టోపీ, చేతికర్ర పట్టుకుని, అక్కడి లాబీలోకి వచ్చాను. అక్కడి పుస్తకంలో సంతకం పెట్టి, (రోజుకు 4–50 డాలర్లు.) ముందుగా ఇవ్వాలా అని అడిగాను. హోటల్ గుమాస్తా – 'ఆ–అవసరం లేదుసార్'

అక్కడి డాబు దర్పం చూస్తూ మెల్లగా గదికి చేరాను. ఒక్కసారిగా ఏడ్వాలని అన్పించింది. అక్కడే ఒక గంట వుండి, గది, స్నానాల గది అన్నీ జాగ్రత్తగా చూశాను. వేడి నీళ్లూ, చల్లనీళ్లూ అన్నీ చూసి 'ఆహా సుఖాలు, ఖరీదయిన జీవితం ఎంత హాయిగా వుంటుందని' అనుకున్నాను.

స్నానం చేసి తల దువ్వుకుని నా కొత్త రాత్రి దుస్తులు వేసుకొని, ఈ గది అద్దె మొత్తం 'అనుభవించా'లని అనుకున్నాను. ఇప్పుడు ఏదయినా చదువుతూ సోఫాలో కూర్చోవాలి – వార్తాపత్రిక? ఫోన్‌చేసి అడగాలంటే బెరుకుగా అనిపించింది. గదిలోని వైభవం ఎంత బాధాకరంగా వుంది! కొంతసేపు ఈ తియ్యని బాధ అనుభవించాను. సూటూ, బూటూతో క్రిందికి వెళ్లాను. భోజనాల గది ఎక్కడ అని అడిగి – లోపలికెళ్లి చూస్తే ఒకరిద్దరున్నారు. అక్కడి వెయటర్ ఎదురు వచ్చి "సార్ ఈ కిటికీ దగ్గర కూర్చుంటారా?" అని అడిగాడు. "ఎక్కడైనా ఫర్వాలేదు" అన్నాను. ఒక్కసారిగా పదిమంది వెయిటర్లు వచ్చి నా చుట్టూ మూగారు. ఒకరు చల్లని నీరు, ఒకరు 'మెనూ' మరొకరు రొట్టె–వెన్న తెచ్చారు. నాకు ఆకలికంటే ఉద్వేగం ఎక్కువైంది. అయినా జాగ్రత్తగా అక్కడ వున్న వివరాలు చూసి, కోడిమాంసం, వెనిల్లా ఐస్‌క్రీం – పళ్లరసాలు చెప్పాను.

మరో వెయిటర్ అక్కడ వున్న వైన్ రకాలు చెప్పాడు. షాంపేన్ సగం సీసా తెచ్చాడు. ఈ భాగ్యాల వైభోగం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇంకా ఆకలీ, మద్యం వీటికి ఖాళీ ఏది? అయినా జాగ్రత్తగా అన్నింటికీ న్యాయం చేసి నాకు సేవలందించిన వెయిటర్‌కి ఒక డాలరు టిప్ ఇచ్చాను! ఆ రోజుల్లో అది చాలా గొప్ప! అతను నా కోసం వెళ్లేందుకు తలుపు తీసి వంగి నిలబడ్డాడు! గదికి వచ్చి చేతులు శుభ్రంగా కడుక్కొని ఒకసారి కోటు సరిచూసుకుని క్రిందికి వచ్చి బైట అడుగు పెట్టాను. బైట వేసవి వెచ్చదనం హాయిగా వుంది. అక్కడ నుంచి మెట్రోపాలిటన్ ఒపేరా హాలుకు వెళ్లాను. మామూలుగా ఇది నాకిష్టం వుండదు. దీనిలో భాగాలే సంగీత నాటకాలు – కాని ఇప్పుడు నా 'మూడ్' వేరు. టికెట్టు కొని రెండో బాల్కనీలో కూర్చున్నాను. ఇది జర్మన్ భాషలో వుంది. ఒక్క ముక్క అర్థం కాలేదు. కనీసం కథ కూడా తెలీదు. కాని చనిపోయిన రాణీని తీసుకు వెళ్తుంటే ఆ సంగీతం ఎంత విషాదంగా వుందంటే, నాకు ఏడుపు ఆగలేదు! బైటకు వచ్చేసరికి నా అవతారం చాలా బాధాకరంగా వుంది.

మెల్లగా అక్కడి వీధులు తిరిగాను. ముఖ్యంగా కాస్త చీకటిగా వున్న వీధులు. అలా తిరిగి తిరిగి అలసిపోయి హోటల్ గదికి చేరాను. లాబీలో హెట్టీ సోదరుడు ఆర్థర్ కెల్లీ కనిపించాడు. 'చార్లీ ఎక్కడికి వెళ్తున్నావు' అని ఆశ్చర్యపోయాడు. 'నిద్ర పోవటానికి' అని ఆస్టర్ హోటల్ గదివంక చూసాను. దీని ప్రభావం బాగా పనిచేసింది! ఇంకా ఇద్దరు అతనితో వున్నారు. నన్ను వాళ్లకు పరిచయం చేసి ప్రక్కనే మాడిసన్ అవెన్యూలో తన అపార్టుమెంటుకు రమ్మన్నాడు. కాఫీ తాగుతూ మాట్లాడుకోవచ్చు అంటూ. అతనితో వెళ్లి అక్కడ కొంతసేపు కూర్చున్నాను. 'హెట్టీ' విషయం ఏమీ రాలేదు. ఇప్పుడు అతను ఇక్కడ మంచి వ్యాపారంలో వున్నాడు. అతని బావతో కలిసి చేస్తున్నాడు. అతనికీ, నాకూ చాలా అంతరం వుంది.

మర్నాడు ఫిలడెల్ఫియా తిరిగి వచ్చేశాను. ఈ ఒక్కరోజు ఒంటరితనం చాలు. ఇక మళ్లీ నా కంపెనీ నాకు కావాలి. మర్నాడు కంపెనీ వాళ్ళతో కలిశాను. అప్పుడే వాళ్ళకు ఒక తంతి వచ్చింది. బ్రాడ్వేనుంచి. ఎవరో ఛాఫిన్ అనే పేరుతో. మా ట్రూపులో ఛాఫిన్ పేరు ఎవ్వరికి లేదు. అది చాప్లిన్ అయివుంటుందని నన్ను చూడమన్నారు. సమాధానం పంపాను. ఇక్కడ చాప్లిన్ వున్నాడని. ఈలోపు నా కలలకు అంతు లేకుండా పోయింది. ఎవరైనా నా పేర నిధి వదిలి వెళ్లారా? తంతి వచ్చింది లాయర్ల భవనం

నుంచి. 'చాప్లిన్' కలవండి అని సమాధానం. తీరా వెళ్తే – వాళ్లు లాయర్లు కారు. సినిమా నిర్మాతలు. చార్లెస్ కెస్సెక్ కీస్టోన్ కంపెనీ భాగస్థుడు. నన్ను చూసి "మాక్‌సెన్నెట్ నిన్ను ప్రదర్శనలో చూశాడు. తాగుబోతు నటనలో నీకిష్టమైతే ఇప్పుడు ఫోర్డ్ స్టెర్లింగ్ స్థానంలో నిన్ను తీసుకోవటానికి మేము సిద్ధం. ఇది సినిమా!" అని అన్నాడు. నాలో కొన్నాళ్లుగా సినిమాల గురించి ఆలోచనలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికే రీవ్స్ నన్ను కలిసి ఈ కార్నో సంగీత నాటకాలను సినిమా తీద్దామని అన్నాడు. కాని వాళ్ళిద్దరికి సినిమాల గురించి ఏమీ తెలియదు.

'ఇంతవరకు కీస్టోన్ కామెడీ చూశావా?' కెస్సల్ అడిగాడు. చాలా చూశాను. కాని నా అభిప్రాయం చెప్పలేదు. అవి ఎంత చెత్తగా వున్నాయో. కాని నల్ల కళ్ళు 'మెబిల్ నార్మండ్' అనే ఆమె అందాలు అందులో చూడతగింది. ఈ సినిమాలకున్న ప్రచారం అంతులేనిది. ఒక సంవత్సరం ఇందులో చేసి మళ్ళీ మా పాత కంపెనీకి వచ్చేయొచ్చు. పైగా వాతావరణం ఈ నాటకాల కంపు నుంచి దూరంగా వైభవంగా వుంటుంది కూడా. 150 వారానికి – కాని నేను వారానికి 200 డాలర్లు! అడిగాను. ఇది కార్నో ఇచ్చేదానికంటే రెండింతలు! "ఇప్పుడు అంతా సానెట్ చేతిలో వుంది. అతనితో చెప్తాను కాలిఫోర్నియాలో. అక్కడ నుంచి నీకు తెలియచేస్తాము" అని అన్నాడు. చివరికి వాళ్ల దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. మొదటి మూడునెలలు 150 డాలర్లు వారానికి – తర్వాత నెలలు 175 డాలర్లు – అదీ ఒక సంవత్సరం ఒప్పందం!

ఇప్పటి ప్రదర్శనలు అయిపోగానే జేరాలి. చివరికి లాస్‌ఏంజల్స్‌లో ఎంప్రెస్‌లో ఆడాము. అది చాలా బాగా విజయవంతం (క్లబ్బులో ఒక రాత్రి) అదీ సంగీత నాటకం. దానిలో కూడా తాగిన 50 ఏళ్ల పాత్ర. అది చూడటానికి సెన్నెట్ వచ్చాడు. నాటకం అయిపోయిన తర్వాత వచ్చి నన్ను మెచ్చుకున్నాడు. ముందుముందు ఎలా వుంటావో తెలియదు కదా! ఎప్పుడు వచ్చి చేరతావు అని మామూలుగా అడిగాడు. నేను సెప్టెంబరు మొదటివారం నుంచి రాగలనని చెప్పాను. అప్పటికి కార్నో కంపెనీతో ఒప్పందం అయిపోతుంది. కాన్సాస్ నగరం ఈ రాత్రి అయిపోతూంది. అక్కడినుంచి ట్రూపు ఇంగ్లాండు వెళ్ళిపోతుంది. నేను లాస్‌ఏంజెలస్ వెళ్తాను. ఇక ఇక్కడ నుంచి నేను ఒంటరిగా నా బ్రతుకు నేను బతకాలి. ఇది నాకంత విశ్వాసం కలిగించలేదు. కాని చివరి ప్రదర్శన తర్వాత అందరికీ బీరు తెప్పించి, వీడ్కోలు ఇవ్వటం బాధగా అన్పించింది.

మా ట్రూపులో ఆర్థర్ డండో అనే ఆయన (నా నాటకాలు ఎప్పుడూ ఇష్టపడేవాడు కాదు) నాకు బహుమతి ఇస్తున్నామని పుకారు రేపాడు. అది నన్ను కాస్త కదిలించింది. కాని చివరికి ఏమీ జరగలేదు.

తర్వాత కార్నో కొడుకు చెప్పాడు నన్ను ఇబ్బంది పెట్టాలని నాలుగు మాటలు చెప్పి, మేకప్ ముక్కలు అయిపోయనవి పెట్టి ఒక బహుమతి తయారు చేశాడు. నేను అందరికీ బీరు ఇప్పించి వీడ్కోలు చెప్పిన తర్వాత అతనికి ధైర్యం చాలక ఆ ఆలోచన మానుకున్నాడు.

పదవ అధ్యాయం

సినిమా ప్రపంచం

ఉత్సాహం, ఆతృతలతో లాస్‌ఏంజెలిస్ చేరి గ్రేట్ నార్తరన్ అనే చిన్న హోటల్‌లో గది తీసుకున్నాను. మొదటిరోజు సాయంత్రం మా కార్నో కంపెనీ ప్రదర్శనలిచ్చిన ఎంప్రెస్‌లో రెండో ఆట చూశాను. అక్కడ వున్న గుమస్తా నన్ను గుర్తు పట్టాడు. సెన్నెట్, కుమారి నార్మండ్‌తో వెనక వరసలో వున్నారని వారిని కలుస్తారా అని అడిగాడు. నాకు చాలా ఆనందం కలిగింది. అందరం కలిసిప్రదర్శన చూశాము. ఆట అయిన తర్వాత ముగ్గురం కలిసి భోజనానికి దగ్గర్లో వున్న హోటల్‌కి వెళ్లాము. సెన్నెట్ నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. నేను చేసే మధ్యవయసు తాగుబోతు వేషానికీ నా వయసుకూ ఎంత తేడా వుంది అని వింతగా చూశాడు! 'నీకింకా చాలా వయస్సుంటుందని అనుకున్నాను' అన్నాడు. ఇప్పటివరకూ ఆయన హాస్య నటులంతా వయసున్న వారేనని చెప్పాడు. నేను కొంచెం కంగారు పడ్డాను. "మీరు ఎంతగా వేషం మారిస్తే అంత వయస్సుగా నటిస్తాను" అని భరోసా ఇచ్చాను. అయినా స్టూడియోకి వచ్చి అందర్నీ పరిచయం చేసుకోమన్నాడు. నార్మండ్ నా గురించి ఏమనుకుంటోందో నాకు తెలియదు. మౌనంగానే వుండి పోయింది. భోజనాలూ తర్వాత సెన్నెట్ రేసింగ్ కారులో నన్ను హోటల్ దగ్గర దింపి వెళ్ళిపోయాడు.

మర్నాడు ఎడెండేల్ స్టూడియోకి వెళ్లేందుకు బస్‌లాంటిది ఎక్కాను. స్టూడియో వూరు బైట వుంది. స్టూడియో వున్నచోటు, అటూ ఇటూ కాకుండా వుంది. కొన్ని ఇళ్లూ, కొని పరిశ్రమలూ వున్నట్లుగా వుంది. అదంతా అడితీలతో చెక్క ఇళ్లు కట్టినట్టుగా వుంది. అలా అడిగి అడిగి చివరికి కీస్టోన్ స్టూడియో ఎదురుగా వచ్చాను. అది మరీ అధ్వాన్నంగా వున్నట్టుంది. నూటయాభై చదరపు అడుగుల చతురస్రంలో ఒక రేకుల

షెడ్డు వుంది. లోపలికి వెళ్లేందుకు చెట్లమధ్య నించి దారి వుంది. మొదట్లో ఒక పాత బంగళా కూడా వుంది. వీధికి రెండోప్రక్క నుంచి లోపలికి వెళ్లాలా వద్దా అని ఆలోచిస్తూ నిలబడ్డాను! అది మధ్యాహ్నం భోజన సమయం. అప్పుడే ఆ బంగళాలో నుంచి ఆడవాళ్లూ, మగవాళ్లూ బైటకు వస్తున్నారు. అక్కడ స్టూడియో కారుల బారులు కూడా. వాళ్లంతా వీధికి మరోప్రక్కనున్న చిన్న దుకాణంలోకి వెళ్ళి సాండ్‌విచ్‌లు తింటూ వచ్చారు. ఒకరిని ఒకరు పేరుతో పిలుస్తూ తొందరపడుతున్నారు.

నాకు ఒక్కసారిగా సిగ్గు ముంచుకు వచ్చింది. వాళ్లకి కనపడకుండా ఒక ప్రక్కగా వెళ్లి నిలబడ్డాను. ఒకవేళ సెన్నెట్-నార్మండ్ కూడా వస్తారేమో అని కంగారు పడ్డాను. కాని వాళ్ళు బంగళాలో నుంచి బైటకు రాలేదు. ఒక అరగంట అలాగే నిలబడి తిరిగి హోటల్‌కి వెళ్లిపోవటానికి నిర్ణయించుకున్నాను. ఈ విధంగా రెండు రోజులు తిరిగి లోపలికి వెళ్లి అందరి ముందు సెన్నెట్‌ను కలిసే ధైర్యం చాలలేదు. మూడోరోజున సెన్నెట్ ఫోన్ చేశాడు. ఎందుకు రాలేదని. ఏదో సాకు చెప్పితే వెంటనే రమ్మని అన్నాడు. నా కోసం ఎదురు చూస్తున్నామన్నాడు. అప్పుడు సరాసరి సెన్నెట్ బంగళా దగ్గరకు ధైర్యంగా వెళ్లి "సెన్నెట్ ఎక్కడ వుంటారు?" అని అడిగాను!

నన్నుచూసి చాలా ఆనందించాడు. స్టూడియోలోకి తీసుకు వెళ్ళాడు. నాకు చాలా థ్రిల్లింగ్‌గా వుంది. అక్కడి స్టేజి అంతా మెత్తటి వెలుగు పంచుకునివుంది. ఆ వెలుతురు తెల్లని గుడ్డలలో నుంచి వస్తున్న సూర్యుని కాంతి. అది ఒక మార్మిక కాంతిని వెదజల్లుతోంది! ఈ వెల్తురులోనే చిత్రీకరిస్తుంటారు. ఒకరిద్దరు నటులు పరిచయం అయిన తర్వాత 'ఏమి జరుగుతోంది' అని అడిగాను. వరసగా మూడు సెట్టులు వేసి వున్నాయి. ఒక సెట్టులో నార్మండ్ ఒక తలుపు బాదుతోంది. 'నన్ను లోపలికి రానివ్వండి' అని. అంతే కెమెరా ఆపేశారు. సినిమాలు ఇలా ముక్కలు ముక్కలుగా తీస్తారని అప్పటివరకూ నాకు తెలియదు!

మరో సెట్టులో పేరు గడించిన ఫోర్డ్ స్టెర్లింగ్ వున్నారు. ఈయనకే నేను వారసుడిని! సెన్నెట్ ఆయన్ను పరిచయం చేశాడు. ఫోర్డ్ ఈ స్టూడియో వదిలి వెళ్లిపోతున్నారు. ఆయన యూనివర్సల్ స్టూడియో స్థాపించటానికి సొంతంగా. ఆయనకు ఇంటా బైటా బాగా పేరుంది. అందరూ ఆయన చుట్టు మూగి నవ్వుతున్నారు!

సెన్నెట్ నన్ను ప్రక్కకు తీసుకెళ్లి ఇక్కడ పనిచేసే తీరు తెన్నులు వివరంగా చెప్పాడు. "మాకేమీ ఖచ్చితమైన కథంటూ లేదు. ఒక ఆలోచనలోంచి అన్ని సంఘటనలూ పుట్టుకొస్తాయి. చివరికి ఒకరి వెంట ఒకరు పరుగులు పెడ్తూ నవ్వు పుట్టించటమే ఈ హాస్యం సినిమా" అంటూ చెప్పాడు. నాకు దీనిలో ఏమీ హేతుబద్ధత కనపడలేదు. పైగా చివరిలో ఈ పరుగులు అసలు ఇష్టం లేదు. అలా పరుగులు పెడితే ఇంక నటనకు ఆస్కారం ఏది? నాకు సినిమాలు ఏమీ తెలియదు. ఇంక నటన సంఘటనలు ఏమి చెప్పగలను?

ఆ రోజంతా ఒక సెట్టు నుంచి మరో సెట్టు చూస్తూ స్టూడియో అంతా తిరిగాను. వాళ్లు పనిచేసే తీరుతెన్నులు గమనించాను. అందరూ ఫోర్డ్ స్టెర్లింగ్‌ను అనుకరిస్తున్నట్లు వుంది. ఇది నాకు మరీ ఇబ్బంది కలిగించింది. ఎందుకంటే ఆయన శైలి నాకు నచ్చదు. ఆయన ఒక డచ్‌వానిగా నటిస్తున్నాడు. ఆయన్ను ఎవరో ఇబ్బంది పెడుతున్నారు. ఈయన డచ్‌లో ఏదో అంటూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఈ మూకీ సినిమాలో ఏమీ వినపడదు గదా!

సెన్నెట్ నా నుంచి ఏమి ఆశిస్తున్నాడో అంతుబట్టలేదు. నా నటనా శైలి ఆయన చూశేగదా ఫోర్డ్‌కూ, నాకూ సామ్యం ఉండదని ఆయనకు తెలుసు గదా – ఇక్కడ సీన్లన్నీ ఫోర్డ్‌కోసం ఆయన శైలిలోనే తయారయి వున్నాయి! రాస్కో కూడా ఆయన్నే అనుకరిస్తున్నాడు!

ఈ స్టూడియో ఒక వ్యవసాయ క్షేత్రంలో వుంది. నార్మాండ్ బట్టలు మార్చుకునే గది పాత బంగళాలో వుంది. ఆ ప్రక్కనే మరో గది వుంది. అదీ ఆడవాళ్ల గదే. ఆ బంగళాకు ఎదురుగా ఏదో రేకుల బారన్ వుంది. అదీ చిన్న చితకా నటులూ, కాపలా రక్షకులూ బట్టలు మార్చుకునే చోటు. వాళ్లంతా సర్కస్ హాస్యగాళ్లు. ఇంకా మల్లయోధులు!

నాకు ఒక గదీ అదీ, సెన్నెట్ వాడుకునేది, ఫోర్డ్ స్టెర్లింగ్ మేకప్ వేసుకునేదీ ఇచ్చారు.

అదీ మరో రేకుల షెడ్డులాంటిదే. నార్మండ్‌తో బాటు ఇంకా అందమైన యువతులు వున్నారు. ఇదంతా నాకు 'అందం – అడవి జంతువులు' మాదిరిగా అన్పించింది.

ఈ వాతావరణంలో దారీ తెన్నూ తెలియక చాలా రోజులు స్టూడియోలో స్టూడియో చుట్టూ, సెట్టుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాను. అప్పుడప్పుడు సెన్నెట్ కనపడే



వాడు. కాని ఆయన పని హడావుడిలో వుండేవాడు. నాకు అనుమానం వచ్చేది. బహుశా తను నన్ను తీసుకోవటంలో పెద్ద తప్పు చేశానని విచారిస్తున్నాడేమో – ఈ ఆలోచనతో నేను మరీ కుంగిపోయాను.

ప్రతిరోజూ నా మానసిక తీరు సెన్నెట్ నవ్వుమీద ఆధారపడేది. ఆయన నవ్వుతూ పలకరిస్తే నాకు ఆశ చిగురించేది.

మిగతావాళ్ళు నన్ను ప్రక్కన పెట్టినట్టే అనుకున్నాను. అలా శనివారం వచ్చింది. సెన్నెట్ నన్ను పిలిచి 'ఆఫీసులో నీ జీతం తీసుకో వెళ్ళు' అని ఎంతో దయతో అన్నాడు. "ఇప్పుడు నాకు పని ముఖ్యం – మనం కూర్చుని మాట్లాడుకుందాం – జీతం తొందరేముంది" అన్నాను. "పని విషయం – మనం చర్చించుకుందాలే, ముందు చెక్కు తీసుకో" అని పురమాయించాడు!

తొమ్మిది రోజులు దొర్లిపోయాయి. ఫోర్డు నా మీద సానుభూతి చూపేవాడు. పని అయిపోయిన తర్వాత ఆయన కారులో నన్ను నగరంలో దింపేవాడు. దారిలో అలెగ్జాండ్రయా బారులో మద్యం కూడా ఇప్పించేవాడు. అక్కడ ఆయన స్నేహితులు చాలమంది కలిసేవారు. అందులో ఎల్మార్ ఎక్స్‌వర్త్ అనే పెద్దమనిషి ఎగతాళిగా "ఏమిటీ నీవేనా ఫోర్డ్ వారసుడివి? నిజంగానే నవ్విస్తావా?" అనేవాడు. "ఆ విషయం ఇప్పుడు అవసరమా?" అని అంటే ఫోర్డ్ నాకు వత్తాసుగా "ఏమిటి నువ్వు చార్లీని చూడలేదా ఎంప్రెస్‌లో తాగుబోతుగా? చాలా నవ్వించాడే" అన్నాడు.

కాని ఎల్మార్ ఎగతాళి మానలేదు. "ఎక్కడా ఇంతవరకు నన్ను నవ్వించలేదు" అంటూ నవ్వాడు. ఫోర్డ్ చెప్పాడు నాతో "ఎల్మార్ చాలా చదువుకున్నాడు – బాగా డబ్బున్నవాడు రాజకీయాలలో కూడా పలుకుబడి వున్నవాడు" అని నాకు గుసగుసగా చెప్పాడు. కాని ఆ బోడిగుండు, పళ్లు లేని విచారంగా (ఏడుపుగా) కనపడే ముఖం – నాకేమీ నచ్చలేదు.

ఒకరోజు రాత్రి 'ఏమిటి ఇంకా పని మొదలవలేదా? ఇంగ్లీషు రాదా?" అన్నాడు. "ఇంకా లేదులే" అన్నాను. 'త్వరగా నీ హాస్యం మొదలుపెట్టు' అని ఎగతాళి చేశాడు. అప్పటికే ఆయన సూటీ పోటీ మాటలతో విసిగిపోయి వున్నాను.

ఇక తప్పదని 'నేను కనీసం నీలా జోకర్‌లాగా వుంటే 'ఇప్పుడే మొదలు పెట్టవచ్చు' అన్నాను.

'అహా–మొత్తానికి పౌరుషం వచ్చిందే' అయితే ఈరోజు నేనే మద్యం ఇప్పిస్తాను' అంటు నవ్వాడు.

ఎట్లాగైతే ఆరోజు రానేవచ్చింది. సెన్నెట్, నార్మాండ్ ఫోర్డ్ అందరూ స్టూడియోకి దూరంగా ఎక్కాడో చిత్రీకరణకు వెళ్లారు. స్టూడియో అంతా ఖాళీగా అయినట్లుంది. లేమన్ అనే ఆయన కీస్టోన్ స్టూడియోలో పెద్ద దర్శకుడిగా పేరుంది. ఆయన ఒక్కడే వున్నాడు. 'ఒక కొత్త సినిమా చేస్తున్నాము. నువ్వు వేషం వెయ్యి' అని నన్ను పురమాయించాడు.

లేమన్ నటులకు పెద్దగా విలువ ఇవ్వడు. అంతా సాంకేతికంగా ఆర్భాటంగా కథ నడిచిపోతుంది. నటులు ఇటూ అటూ పరుగులు పెడుతూ కిందపడి లేస్తూ నవ్విస్తుంటారు. ఆయనకు ఈ విధంగానే ఎక్కువ పేరు వచ్చింది. ఏ విధంగానైనా నవ్వించటమే అప్పుడు విజయానికి కొలమానం!

ఇప్పుడుకూడా కథ ఏమీ లేదు. ఇది ప్రింటింగ్ ప్రెస్, ఎడిటర్ ఆలోచన అంతే. నేను తోకల కోటు – ఎత్తు టోపీ – సైకిల్ హాండిల్ బార్ మీసాలు – వేషం! లేమెన్‌కి ఆలోచనలే కరవయినాయి. సహజంగా నేను ఎక్కువగా సలహాలు ఇచ్చి చిత్రీకరణ జరుపుతున్నాము. ఇది లేమన్‌కి చిరాకుగా వుంది కూడా. నా ట్రిక్కులకు అందరూ నవ్వుతున్నారు కూడా. వార్తాపత్రిక సంపాదకునితో మాటామంతీ జరుగుతున్నాయి. నాకు తోచిన హాస్యం అంతా గుప్పించాను. మూడు రోజుల్లో చిత్రీకరణ పూర్తయింది. చివరగా ఎడిటింగ్ చేశారు. వారు కత్తిరించగా మిగిలిన సినిమా చూసి చాలా నిరాశ చెందాను. నేను చేసిన హాస్య సన్నివేశాలను మధ్యలో కత్తిరించారు! (ఆ తర్వాత చాలా సంత్సరాలకు లేమెన్ చెప్పాడు. ఆ పని అసూయతో చేశానని).

ఆ మర్నాడు సెన్నెట్ తిరిగి వచ్చాడు. ఆ రోజు మూడు రంగాలపై చిత్రీకరణ జరుగుతోంది. అందరూ చాలా హడావుడిగా వున్నారు. నేను సాదాసీదా దుస్తుల్లో పని లేకుండా వున్నాను. సెన్నెట్ నన్ను చూడాలని కనపడేట్లు నిలబడ్డాను. ఆయన నార్మండ్‌తో వున్నాడు. అది హోటల్ లాబీసెట్. చుట్ట చివర్లో నములుతూ ఆలోచనలో వున్నాడు. "ఇక్కడ నవ్వులు కావాలి. చార్లీ ఏదైనా హాస్యపు వేషం వేసుకో – ఏదైనా ఫర్వాలేదు" అన్నాడు. నాకు ఏ ఆలోచనా లేదు. అంతకుముందు వేసిన రిపోర్టర్ వేషం నాకు నచ్చలేదు. ఆలోచిస్తూ దుస్తులు మార్చుకునే గదిలోకి వెళ్లాను. పెద్ద పంట్లము

– పొడవాటి బూట్లు – డెర్బీటోపీ చేతిలో వంగిన కర్ర. అన్నీ వ్యతిరేకాలే వుండాలి. ఇలా అనుకుంటూ వయసు విషయం కూడా కుర్రాడిలాగానా – ముసలివాడిలాగానా తేల్చుకోలేదు. అందుకనే చిన్న మీసం పెట్టుకున్నాను. నా వయసు దాయటానికి. మెల్లగా ఒక వ్యక్తి తయారయ్యాడు. నాకే తెలియని ఒక అవతారం పుట్టింది. నడకతో అతనెవ్వరో తెలిసిందనుకున్నాను. మేకప్‌తో స్టేజిమీదకు వచ్చేసరికి ఈ కొత్త అవతారం పూర్తయింది. అలా వెళ్లి సెన్నెట్ ముందు ఒకటి రెండుసార్లు కర్ర వూపుతూ నడిచి – ఆలోచిస్తూండగానే, నాలో హాస్యగాడు బైటకు వచ్చాడు. సెన్నెట్ విజయానికి కారణం అతని ఉత్సాహం. ఏదో చేయాలి – చేయించాలి అని తపన!

నన్నుచూసి ఒక సామాన్య ప్రేక్షకుడిలాగా నవ్వి, తర్వాత పగలబడి నవ్వి, నిలువెల్లా వణికిపోయాడు!

ఈ ప్రోత్సాహంతో సెన్నెట్‌తో, "చూడండి ఈ పెద్దమనిషికి చాలా కోణాలున్నాయి. పెద్దమనిషి ఒక కవి! కలలు కనేవాడు. ఎప్పుడూ ఏదో మంచి జరుగుతుందని ఆశించేవాడు. రొమాన్సు కోసం సాహసంతో ఎదురు చూసేవాడు,'' అంటూ వివరించాను. అంతేకాదు ఒక విజ్ఞానవేత్త, క్రీడాకారుడు – సంగీతకారుడు, జమీందారుగా పోలో ఆడేవాడుగా కూడా కనపడతాడు. అంతేకాదు లేకపోతే సిగరెట్టు ముక్కలు ఏరుకుంటాడు. చిన్నపిల్లల దగ్గర చాక్లెట్లు కూడా దొంగిలిస్తాడు. కోపం వస్తే ఎవర్నైనా తన్నటానికీ సిద్ధమే..." అని చెప్పాను. నేను చెప్పినంతసేపు నవ్వుతూనే వున్నాడు. "అలాగే అలాగే కెమెరా ముందుకు వచ్చి ఏమి చేస్తావో చెయ్యి" అన్నాడు.

ఈ కథ కూడా నాకు తెలియదు. వాళ్లందరికీ ఒక ప్రియుడు – భర్త ఇదీ ముగ్గురి మధ్యలో గొడవ!

హోటల్ లాబీకి వచ్చాను. రావటంతోనే తూలిపడబోయాను. అమ్మాయి కాలు తగిలి హోటల్ గది కోసం వచ్చినట్లు నటిస్తూ కాని నిజానికి డబ్బు లేదు. అమ్మాయికి టోపీతీసి క్షమాపణ చెప్పాను. పక్కకు తిరిగి సోఫా తగిలి పడబోయాను. అప్పుడు టోపీ తీసి క్షమించమని అడగబోయాను! (కెమెరా వెనకనుంచి నవ్వులు). అప్పటికే అక్కడ గుంపు చేరారు. మా రిహార్సల్ అయ్యేసరికి స్టూడియో అంతా అక్కడ చేరి నవ్వుతున్నారు. ఇది నిజంగా మాకు ప్రోత్సాహకరమే! అప్పటికే ఫోర్డ్ కూడా వెనకనుంచి చూస్తున్నాడు. చివరికి అంతా బాగా జరిగింది!

ఫోర్డ్‌కీ రాస్కోలుకీ ఇద్దరికీ నచ్చింది. కాని చెప్పటానికి వెనుకాడుతున్నారు.

మా సీను డెబ్భయి అయిదు అడుగులు నడిచింది. సెన్నెట్, లెమెన్ ఆలోచనలో వున్నారు. మామూలు హాస్యం పది అడుగులే వుంటుంది. నేను "అది నవ్వించేదయితే పొడుగుతో పేచీ ఏముంది?" అన్నాను. వాళ్లు అలాగే వుంచటానికి నిర్ణయించారు.

ఆ రోజు నిర్ణయించుకున్నాను. నా వేషం ఇదేనని. తిరిగి వెళ్తున్నప్పుడు – తోటీ నటుడు ఎంతో మెచ్చుకున్నాడు "చూద్దాం – సినిమాహాలులో కూడా నవ్వులు పండాలి కదా!" అన్నాను, నా సంతోషాన్ని పంచుకుంటూ!

ఒకసారి అలెగ్జాండ్రియా బార్‌లో ఫోర్డ్, ఎల్మెర్‌తో చెప్పాడు. ఆ బాగీ పంట్లూమూ, చిన్న టోపీ, పెద్ద బూట్లూ, వంగిన చేతికర్రా – మీసాలూ వాడు ఎవరో తెలియదు. కాని చూస్తే నవ్వు ఆగదు. వాడికి వళ్ళంతా తేళ్లు పాకుతున్నట్లు కదులుతాడు" అంటూ చెప్పాడు.

నా వేషం చాలా తేడాగా వుంది. అమెరికన్లకు పరిచయం లేనిది. నాకే తెలియదు. కాని ఆ వేషంలోకి వెళ్లగానే ఆ పెద్దమనిషి నిజంగానే వుంటాడు. నాలో హాస్యం పుట్టుకొస్తుంది. అతనే 'ట్రాంప్'!

నాకు చిన్నచిన్న బిట్ వేషాలు బాగా కుదిరాయి. ప్రతి రాత్రి ఇంటికి వెళ్లే దారిలో నా తోటి నటుడు, ఆ రోజు స్టూడియోలో ఏమనుకున్నారో వార్తలు చెప్పేవాడు. నా హాస్యం ఏ విధంగా నవ్వులు పుట్టిస్తోంది, ఎవరేమన్నారు అని వివరంగా చెప్పేవాడు. "నువ్వు చేతులు కడుక్కుని వేళ్లు అతని మీసాల మీద రుద్దావు – అలాంటిది ఇంతవరకు ఎవరూ చేయలేదు" ఇలా చెప్పేవాడు నేను గాలిలో తేలిపోయేవాడిని! సెన్నెట్ దర్శకత్వంలో నాకు ఎటువంటి ఇబ్బందీ కలుగలేదు. అందరూ అప్పటికప్పుడు ఏదో చేసి నవ్వించడమే ముఖ్యం. ముందు తర్వాత ఏమి చెయ్యాలో ఎలా చెయ్యాలో (దర్శకునికి కూడా) ఏ ఆలోచనా ఉండేది కాదు. ఇది నాకు చాలా అవకాశం ఇచ్చింది. నా ఆలోచనలన్నీ ఆచరణలో పెట్టేవాడిని. నాకు ఆత్మ విశ్వాసం కలగటానికి ఎదుటివాడికి కూడా ఏమి చెయ్యాలో తెలియని స్థితే కారణం. సెన్నెట్ నన్ను చాలా ప్రోత్సహించాడు. ఇప్పటికి సెన్నెట్‌నీ స్టూడియో వాళ్లనీ గెల్చినట్లే – ఇంక ప్రేక్షకుల దగ్గరే నా పరీక్ష!

తర్వాత సినిమా లేమన్‌తో చేయాల్సి వచ్చింది. మళ్ళీ మామూలే – ఆయనకూ నాకూ ఘర్షణ. ఆయనకూడా కీస్టోన్ స్టూడియో వదిలి వెళ్ళిపోతున్నాడు. ఇంక రెండు

వారాలే వుంటాడు. ఆయన నన్ను "నీకు సినిమా అనుభవం లేదు. ఇక్కడ వ్యక్తిగత హాస్యానికే చోటులేదు. ఇదంతా మెకానిక్స్" అనేవాడు. మధ్యలో నా పద్ధతి ప్రకారం కొంత చేసేవాడిని. ఎంత కోత పెట్టినా పోకుండా జాగ్రత్త పడేవాడిని.

ఆ తర్వాత నికోలస్ దర్శకునితో ఇదే సమస్య వచ్చింది. వాళ్ల పాత్ర పద్ధతిలోనే నన్ను పరుగెత్తమనేవాడు. నన్ను నటించటానికి నవ్వించటానికీ అవకాశం ఇచ్చేవారు కాదు. నాకు ఓర్పు నశించిపోతోంది. ఎదురు చెప్పేవాణ్ణి. దర్శకులు కదా – 'మేము చెప్పింది నీవు చెయ్యాలి' అనేవారు. సెనెట్ కూడా "నీవు చెప్పింది చేయి మిగతాది దర్శకులే చూసుకుంటారు" అనేవాడు.

రోజురోజుకూ నాకు ఈ ఘర్షణతో విసుగు పుట్టిపోతోంది. ఇంతలో నేను నటించిన 'మెబెల్స్ వింత కథ' థియేటర్‌లో విడుదల అయ్యింది. నేను కూడా హాలుకు వెళ్లి చూశాను. చాలా భయపడుతూ. అయితే ప్రేక్షకులు నా నటనను బాగానే ఆదరించారు. కొత్తవాడినని చెత్తగా తీసివేయలేదు.

అయితే సెన్నెట్‌కి ఇది ఎంతవరకూ నచ్చిందో తెలీదు. నచ్చలేదనే అనుకున్నాను. అప్పటికే ఇద్దరు దర్శకులు నా మీద ఫిర్యాదుచేసి మొరబెట్టుకున్నారు. సెన్నెట్ నన్ను పిలిచి "ఇదిగో చార్లీ! దర్శకులు చెప్పినట్టు చేయి. అదే చాలు" అని మరీమరీ చెప్పాడు.

ఆ రకంగానే అయిదారు సినిమాలు పూర్తయినాయి. వాళ్లంతగా గోలపెట్టినా నా పద్ధతిలోనే చాలావరకూ వారి కత్తెర్లకు అందకుండా చేశాను. ఈలోగా ఈ ఎడిటింగ్ ఫిల్మ్ కడగటం ప్రింటింగ్ అదే లాబొరేటరీ పనీ అన్ని చూస్తూ వచ్చాను.

చివరగా మెబెల్ నార్మండ్ (ఈమెకు నిండా ఇరవయి ఏండ్లు కూడా లేవు) సినిమా దర్శకత్వం చేస్తోంది. అందులో నటించమని సెన్నెట్ చెప్పాడు. నాకు మరీ ఆశ్చర్యం వేసింది. చిత్ర నిర్మాణంకోసం ఊరు బైటకు వెళ్లాము. అక్కడ ఒక మంటలార్పే లారీ, నీటిగొట్టం. ఇదీ విషయం. ఇందులోనే 'నా మార్క్ కామెడీ పెడతాను' అన్నాను. నార్మండీ ఒప్పుకోలేదు. తను చెప్పినట్లే చేయమంది. "అలా అయితే ఎవరూ నవ్వరు. నన్ను చెయ్యనీయమ్మ" అని అన్నాను. ఇద్దరికి మాటకూడా పెరిగి నేను పనిలోనుంచి దూరంగా వెళ్లిపోయాను. దానితో నార్మండీ చిత్రీకరణ ఆపివేసి కెమరా కింద దిగులుగా కూర్చుంది. అందరికీ ప్రీతిపాత్రమైన నార్మండీ దిగులు పడడం ఎవ్వరికీ ఇష్టం లేదు. ఒక్కరిద్దరు నన్ను తుపాకితో కాలుస్తామన్నారు. నాకు, ఆమెను, అంత అందమైన

అమ్మాయిని ఏడ్పించడం బాగుండలేదు. వెళ్లి సారీ చెప్పి 'నన్ను చెయ్యనీయమ్మ' అని అన్నాను. ఆమె అప్పటికీ 'నేను చెప్పినట్లు చేయండి' చాలు అని మొండికేసింది.

ఆ రోజుపని పూర్తి చేసుకుని స్టూడియోకి వెళ్ళాం. జరిగిందంతా సెన్నెట్‌కి చేరటం ఎక్కువ సమయం పట్టలేదు. ఆయనా చాలా కోపగించాడు. నేను ముఖం కడుక్కునే లోపు గదిలోకి వచ్చి "నీవుద్దేశ్యం ఏమిటి? ఏ దర్శకునితోనూ పనిచేయవా?" అని గట్టిగా అడిగాడు. నేను విషయం వివరించటానికి ప్రయత్నం చేశాను. 'నీకు చెప్పాను కదా వాళ్ళు చెప్పినట్లు చేయమని' అని కోపంగా అని 'అలా అయితేనే పనిచేయి' అనికూడా అనేశాడు.

నేను, "చూడండి మీరు వుద్యోగం ఇవ్వకముందు నేను పని చేశాను. ఇప్పుడు మీరు పొమ్మన్నా సరేకాని నా వుద్దేశ్యం మంచి సినిమా చేయాలని..." అని అంటుండగానే తలుపు మూసి వెళ్లిపోయాడు. ఇక నా సంగతి ఇక్కడతో సరి అనుకున్నాను.

తిరుగు ప్రయాణంలో నాతోటి నటుణ్ణి అడిగాను 'నన్ను తీసివేస్తారా?' అని. అతను "తీసివేసినా ఆశ్చర్యం లేదు. సెన్నెట్ మీ గదిలో నుంచి వచ్చినప్పుడు చూస్తే వాతావరణం అనుకూలంగా లేదనిపించింది" అన్నాడు.

"పర్వాలేదులే – నా దగ్గర 1500 డాలర్లున్నాయి. ఇంగ్లాండు పోవటానికి అంతకంటే అవదుకదా?" అన్నాను.

ప్రొద్దున్న 8 గంటలకే ఫోన్ వచ్చింది రమ్మని. నాకు ఏమిచేయాలో తెలియక మేకప్పు గదిలో కూర్చున్నాను. కాళీగానే. అంతలో సెన్నెట్ వచ్చాడు. "చార్లీ, నీతో మాట్లాడాలి రా" అని నార్మండీ గదికి తీసుకు వెళ్ళాడు.

అక్కడ "చూడు చార్లీ నువ్వు మంచి నటుడివి. నార్మండీకి నువ్వంటే చాలా ఇష్టం. మా అందరికీ కూడా." నేను కరిగిపోయాను. "నాకు కూడా మీరంతా ప్రాణం కాని నన్ను బాగా చేయనివ్వండి" అన్నాను. "కొన్నాళ్ళు నీ అహాన్ని ప్రక్కనపెట్టు. ఆమె చెప్పింది చేయి." అని బ్రతిమాలుతున్నట్లు అన్నాడు.

"చూడండి మీరు నన్ను సినిమా తీయనివ్వండి. నన్ను నేను నిరూపించుకుంటా" అన్నాను. "అది ఎవ్వరూ విడుదల చేయపోతే?" అన్నాడు. నా బాంక్‌లో 1500 డాలర్లు వున్నాయి. వదిలేస్తాను" అన్నాను.

"నీ దగ్గర కథ వుందా?"

"ఎన్ని కావాలంటే అన్ని" అన్నాను.

"అలాగే కానీ ముందు నార్మండీ సినిమా అయిపోనీ తర్వాత చూద్దాం" అన్నాడు. ఇద్దరం చేతులు కలిపి స్నేహపూర్వకంగా విడిపోయాం. తర్వాత నార్మండీతో పనిచేయటం చాలా సరదాగా గడిచిపోయింది. ఆ సినిమా కూడా పూర్తిచేశాం.

కొన్నాళ్ళకు అసలు విషయం తెలిసింది. అంతకు ముందు రాత్రి న్యూయార్క్ నుంచి ఫోన్ వచ్చింది. నా సినిమాలకు మంచి గిరాకీ వుంది. ఇంకా తీసి వెంటనే పంపమని!

మామూలుగా కీస్టోను కామెడీ అంటే 20 ప్రింట్లు తీస్తారు. ముప్పయి అంటే విజయవంతం అయినట్లు. చివరి సినిమా, అది, నా నాలుగో సినిమా. 45 ప్రింట్లు కావాలని టెలిగ్రాం వచ్చింది. అదీ విషయం. సెన్నెట్ ప్రసన్నుడు కావటానికి!

అప్పట్లో దర్శకత్వం కిటుకులు తేలికే. కుడి ఎడమలు తెలిస్తే చాలు. ఒక సీనులో కుడిప్రక్క నుంచి వెళ్తే, తర్వాత సీనులో ఎడం ప్రక్కనుంచి రావాలన్నమాట! ఇవన్నీ ప్రాథమికమైన విధానాలు. తర్వాత కెమెరా ఎక్కడ ఎలా పెట్టాలో అదీ చాలా ముఖ్యం. ఒక సీను గానీ, నటుణ్ణిగానీ సరిగ్గా చూపించేది కెమెరా పెట్టిన తీరే! అలాగే దగ్గర షాటు, దూరం షాటు ఇలా ఒక్కోటి ఈ సాంకేతిక విషయాలన్నీ ఆకళింపు చేసుకున్నాను.

మొదటి సినిమా దర్శకత్వం చేస్తున్నప్పుడు నేననుకున్నంత తేలిక పని కాదని అనిపించింది. నా విశ్వాసం కూడా కొంత సడలింది. ఒకరకంగా చాలా బాధ కలిగించింది కూడా. మొదటిరోజు పనిని సెన్నెట్ చూసిన తర్వాత నాకు కొంత ఊరట. సినిమా పేరు. వర్షంలో కష్టాలు (caught in the Rain) ఇదేమీ గొప్ప సినిమా కాదు. కాని హాస్యాన్ని పండించి డాలర్లు కురిపించింది! ఇదిపూర్తయిన తర్వాత సెన్నెట్ ఏమనుకుంటున్నాడో తెలుసుకోవాలని అనుకున్నాను. సినిమా చూసి బైటకు వస్తూ 'రెండోది ఎప్పుడు మొదలు పెడ్తావు' అని నవ్వుతూ అన్నాడు! అప్పటి నుంచి నా చిత్రాలన్నీ నేనే రాసుకుని నేనే దర్శకత్వం వహించాను. సెన్నెట్ నా జీతం కాక మరో 25 డాలర్లు బోనస్ కూడా ఇచ్చాడు.

అప్పటి నుంచి నన్ను దత్తత తీసుకున్నట్లు నన్ను విడిచి పెట్టలేదు. ప్రతీరాత్రి భోజనానికి తీసుకెళ్లేవాడు.

కథల గురించి ఎప్పుడూ మాట్లాడుకునేవాళ్లం. నేను చెప్పిన కథలన్నీ అంగీకరించేవాడు.

ప్రేక్షకులతోపాటు సినిమా చూడడం ఒక గొప్ప అనుభవం. కీస్టోన్ కామిడీ అంటే జనంలో ఒక రకమైన స్పందన వచ్చేది. నేను తెరమీద కనపడగానే ప్రేక్షకులు కేరింతలు కొట్టేవారు, నేనేమీ చేయకుండానే! ఇది నాకు చాలా ఆనందకరమైన విషయం! ఇలా జీవితం గడిచిపోతే చాలనుకున్నాను. ఇప్పుడు వారానికి రెండువందల డాలర్లు వస్తున్నాయి!

నేను పనిలో పడి అలెగ్జాండ్రియాలో బార్‌కి వెళ్ళటంలేదు. ఎల్మర్‌ని కలవలేకపోయాను కూడా. తర్వాత ఎప్పుడో కలిసి నన్ను పట్టుకున్నాడు. "ఏయ్ విను. ఈ మధ్య నీ సినిమాలు చూశాను. ఒట్టు! నీ స్టైలు చాలా బాగుంది. అందరికంటే భిన్నంగా వుంది. నవ్వాగటంలేదు కూడా. ఈ విషయం మొదట్లో చెప్పలేదే?" అని వదిలి పెట్టలేదు. మేము చాలా మంచి స్నేహితులమైపోయాము!

నేను కీస్టోన్ స్టూడియో నుంచి చాలా నేర్చుకున్నాను. అలాగే వాళ్ళకీ చాలా నేర్పాను. నేను సినిమా తీయటం నేర్చుకున్నాను. వాళ్లకి నటనా రంగపు మెళకువులు నేర్పాను. ఇది నేను నా సంగీత నాటకాల నుంచి తెచ్చినవి.

అలాగే మూకీ చిత్రాలలో సైగలు కూడా చాలా మోటుగా వుండేవి. వాటిలో నాజూకుతనంగానీ మార్మికతగానీ వుండేవి కాదు. ఇవన్నీ నేనే అలవాటు చేశాను. ఏ సమయంలో ఏ విధంగా సైగ చేయాలో, ఏ సైగ చేసీ చేయనట్లు వుండాలో అన్నీ అభివృద్ధిచేసి చూపాను. భూగర్భ సారనిపుణుని లాగా ఇంతవరకూ తెలియని చాలా గొప్ప నిధులుగల గనులలోకి వెళ్తున్నట్లుగా వుండేది. నా వృత్తిపరమైన విజయం కనుచూపు మేరలో కనపడుతోంది. ఏదో బంగారు వాకిలి దగ్గర నిలబడి గొప్ప సంపదల ప్రపంచం లోనికి ప్రవేశించ బోతున్నట్లనిపించేది.

విజయం స్నేహితులను సంపాదిస్తుంది. స్టూడియోలో అందరూ నాకు స్నేహితులైపోయారు. నన్ను 'చార్లీ' అని పని చేసే వాళ్లందరూ ప్రేమగా పిలిచేవాళ్లు. ఇది నాకు చాలా సంతోషం కలిగించేది. ఇది విజయానికి సంకేతమని తెలుసు!

ఇప్పుడు నా పనిమీదా నా కథలమీదా నాకు నమ్మకం కుదిరింది. దీనికి నేను సెన్నెట్‌ను అభినందించాలి! ఆయనకూడా నాలాగా ఏమీ చదువుకోలేదు. కాని చేసే

పని మీద శ్రద్ధా విశ్వాసం వుండేవి. అవే నాకూ అంటించాడు! మొదట చెప్పింది "....మా దగ్గర కథలేమీ లేవు. ఒక ఆలోచన దానికి సహజ పరిణామాలు ఇలాగే సినిమా తీస్తాము...." అని మొదటిరోజున చెప్పింది నాకు ఎంతో విశ్వాసాన్నీ నా ఆలోచన శక్తికి ఉత్సాహాన్నీ ఇచ్చింది. నాటకంలో ఆలోచనకు అవకాశం లేదు. మనకిచ్చిన పాత్ర సంభాషణలు ప్రతిరాత్రి చదువుకుంటూ పోవడమే. ఇంకే సాహసం చేయటానికి అవకాశం లేదు.

కాని సినిమా వేరు. చాలా స్వేచ్ఛ వుంటుంది. ఆలోచనే సాహసం. సెన్నెటూ నేనూ ఎన్నో సాహసాలు చేశాం! నా ఆలోచనకు అంతే లేకుండా పోయింది, ప్రతి కొత్త ఆలోచనా ఒక సాహసవంతమైన హాస్య సినిమా! దీనికి అంతూ పొంతూ లేదు. మన ఆలోచనకు ఆకాశమే హద్దు!

ఇక్కడ పెద్ద నాటకాల పుస్తకాలు అవసరం లేదు. గొప్ప రచయితలు అవసరం లేదు. మేము మేధావులమీద ఆధారపడనవసరం లేదు.

ఉదాహరణకు: 'ప్రీహిస్టారిక్ పాస్ట్' అనే సినిమా మొదటి సీను నేను ఎలుగుబంటు తోలు దుస్తులు వేసుకొన్నాను. అక్కడ చుట్టూ చూసి నా దుస్తుల మీద వెంట్రుకలు పీకి పైపులో పెడుతుంటాను. ఇది చాలు తర్వాత నేను రాయటానికి! ఇందులోనే ప్రేమా–కొట్లాటా. తర్వాత ఒకరివెనక ఒకరు తరుముకుంటూ పోవటం!

ఇప్పుడు గుర్తు తెచ్చుకుంటే ఈ హాస్యారసానికి మరో కోణం గురించిన ఆలోచన ఎప్పుడు వచ్చిందో చెప్పగలను. అది 'న్యూ జానిటర్' సినిమా పని జరుగుతోంది. ఆ సీనులో ఆఫీసు మేనేజర్ నన్ను పనిలోంచి తీసివేస్తాడు. అతన్ని బ్రతిమాలుతూ, నాకు చాలా పెద్ద కుటుంబం, బాధ్యత వుంది. పనిలోనుంచి తీసివేయొద్దని సైగలు చేస్తున్నాను. దానిలో బాగా భావోద్వేగాన్ని దట్టించి చూపాను. ఈ రిహార్సల్ జరుగుతుండగా డోరతా అనే నటి చూస్తూ ఏడుపు ఆపుకోలేక పోయింది. అది హాస్యం కోసమని తెలుసు. కాని దానిలో చాలా విచారం వుంది! అన్నది. 'నన్ను నిజంగా ఏడ్పించావు' అని కూడా అంది. నా మనసులో వున్నదదే! నవ్విస్తూ కూడా ఏడ్పించవచ్చు! అదే ఆలోచన నాలో వుంది!

స్టూడియోలో అంతా కండలరాయిళ్లు ఎక్కువ. ఒక రకమైన పురుష పరమైన వాతావరణమే. ఒక్క నార్మండీ అందాలు, మంచితనం హాయిగా వుండేవి. అందరికీ

ఆమె అంటే ఆరాధన. ఆమె మంచితనమంటే దేవతే! నన్ను సోదరునిలాగా చూసేది. తన మంచితనంతో అందర్నీ ఆకట్టుకునేది. అప్పటికే సెన్నెట్‌కీ ఆమెకీ ప్రేమ వ్యవహారం వుండేది. ముగ్గురం కలిసి రాత్రి భోజనానికి వెళ్లి, భోజనాల తర్వాత సెన్నెట్ అక్కడే నిద్రపోయేవాడు. అలసి – నేను నార్మండీ – రాత్రి షికారులకూ, సినిమాలకూ, వెళ్లి వచ్చి సెన్నెట్‌ని లేపే వెళ్లేవాళ్లం. మా మధ్య ఎప్పుడూ అపార్థాలు రాలేదు.

ఒకసారి నేనూ నార్మండీ, రాస్కో ఒక చారిటీ ప్రదర్శనకు వెళ్లి సాన్‌ఫ్రాన్సిస్కోలో వున్నాము. అప్పుడు నార్మండీ, నేను చాలా భావోద్వేగానికి లోనయ్యాము.

అది చాలా విజయవంతమైన ప్రదర్శన. మేము చాలా సంతోషంగా వున్నాము. నార్మండీ తన కోటు తెచ్చుకోవటానికి గదికి తీసుకు వెళ్లమని అడిగింది.

గదిలో ఆమెకు కోటు తొడిగి, ఒకరకమైన మైకంలో ఆమెకు ముద్దు పెట్టాను. ఆమెకూడా నన్ను ముద్దాడింది. బైట అందరూ నాకోసం వేచి వున్నారు. అందుకనే వెంటనే వెళ్లిపోయాం. తర్వాత ఒకసారి నేను ఈ విషయాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్దామని అనుకున్నాను. కాని మేబెల్ నార్మండీ "వద్దు చార్లీ, మనిద్దరికీ కుదరదు." అని సున్నితంగా ఆ విషయాన్ని ముగించింది.

ఈ సమయంలో డైమండ్ జిమ్ బ్రాడీ లాస్‌ఎంజెలెస్ వచ్చాడు. హాలీవుడ్ అప్పుడే రూపు దిద్దుకుంటోంది. ఆయన డాలీ సిస్టర్స్, వాళ్ల మొగుళ్లతోసహా దిగాడు. చాలా ఎక్కువ ఖర్చుతో అందరికీ డిన్నర్ పార్టీలు ఇచ్చేవాడు.

ఒకరాత్రి అలెగ్జాండ్రియా హోటల్‌లో రాత్రి పార్టీ ఇచ్చాడు. అక్కడ డాలీ సిస్టర్లు, మొగుళ్లతోసహా, కార్లోట్టా మోంటరీతో టెల్లిజెన్, హీరో సారా బెర్న్ హార్ట్, మాక్ సెన్నెట్, మేబెల్ నార్మండీ, బ్లాంచ్‌స్వీట్, నాట్ గుడ్ విన్, ఇంకా చాలా మంది వచ్చారు. డాలీ సిస్టర్స్ చాలా అందంగా వున్నారు. వాళ్లిద్దరూ, వాళ్ల మొగుళ్లూ, డైమండ్ జిమ్ బ్రాడీ వాళ్లంతా కలిసి కట్టుగా వుండేవారు. వారి అనుబంధం అది.

డైమండ్ జిమ్ అసలైన అమెరికన్ చొక్కా చేతికి రత్నాల గుండీలు కఫ్‌లు పెట్టుకు వచ్చేవాడు. మరోసారి ఎమెరాల్డ్ సెట్‌తో వచ్చాడు. నేను నోరు తెరిచి చూసేవాడిని. అమాయకంగా అడిగాను కూడా. ఇవన్నీ నిజమైనవేనా? అని. అతను నవ్వి "అవును – ఇది చూడు అని కోటుకింద బెల్టు చూపాడు. అదీ పెద్ద ఎమరాల్డ్ పచ్చలతో వుంది.

"అద్భుతం – చాలా బాగున్నాయి" అన్నాను. అతను చాలా గర్వంగా ఇలాంటివి నా దగ్గర పది వున్నాయి. రోజుకొకటి ధరిస్తాను." అని చెప్పాడు.

అది 1914. నాకు 25 ఏండ్లు! ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. పనిలో తల మునకలుగా వుండేవాడిని. నా సినిమాలు బాగా విజయవంతం అవటం – ఈ పనిలో మజా వీటితో మరీ ఆనందంగా వుండేది. పైగా ఒకప్పుడు నేను అభిమానించిన తారలంతా పరిచయం అవుతున్నారు. ఆ విధంగానే మేరీ పిక్‌పోర్డ్, బ్లాంచ్‌స్వీటు, మిరియం కూపర్, క్లారాకిమ్‌బాల్ యంగ్, గిష్ సోదరీమణులు ఇలా అందరూ కలిసేవారు! వారి అందం కళ్లారా చూసి ఆనందించేవాడిని!

థామస్ ఇన్స్, ఆయన స్టూడియోలో బార్బెక్యూ పార్టీలు ఇచ్చేవాడు. ఆ స్టూడియో ఒక అడవిలో వుంది. ఆ అడవి పసిఫిక్ సముద్రానికి చాలా దగ్గర్లో వుంది. ఆ అద్భుతమైన రాత్రుళ్లు అందగత్తెలతో కుర్రాళ్లు నాట్యం చేస్తూ చక్కని సంగీతంతో పాటు పసిఫిక్ సముద్రపు అలల మెత్తని హోరు వింటూ గడిచిపోయేవి.

పెగ్గీ పియర్స్ చాలా అందగత్తె – చక్కగా చెక్కినట్లుండే ముఖం – పొడవాటి మెడ. నిండైన పెదవులు. కాస్త బొద్దుగా వున్న స్తనాలు. అబ్బా ఈమె నా మనసు దోచింది. మేము కలిసిన మొదట్లోనే మా మధ్య మంట రేగింది. ఇద్దరికీ నిద్దరే లేదు. ప్రతి ఉదయం స్టూడియోకి రావటం ఆమెకోసం చూడటం. చాలా రమణీయంగా వుండేది. ఆదివారాలు వాళ్లింటికి ఫోన్ చేసేవాడిని. ప్రతి రాత్రి ప్రేమకోసం కలిసేవాళ్లం. ప్రతి కలయికా ఒక యాతనే. ఆమెకూడా నన్ను ఇష్టపడింది. కాని మాకు కలిసి రాలేదు. ఎందుకో ఆమె వ్యతిరేకించేది. ఇక నిరాశతో నేను వదిలివేశాను. అప్పట్లో నాకు పెళ్లి చేసుకునే ఆలోచనే లేదు. సాహస జీవితానికి స్వేచ్ఛ కావాలి. బాధలు వుండకూడదు! నా మనసులో వున్న రూపానికి ఏ యువతీ దగ్గర్లోకి రాలేదు!

ప్రతి సినిమా స్టూడియో ఒక కుటుంబంలాంటిది. ఈ ఒక రీలు సినిమాలు ఒక వారం రోజుల్లో పూర్తయిపోయేవి. మహా అయితే రెండువారాలు – అంతే! ఇక్కడ కాలిఫోర్నియా రాష్ట్రంలో సంవత్సరానికి తొమ్మిది నెలలు ఎండకాస్తుండేది. అదే కారణంతో సినిమాలు అన్నీ ఇక్కడే చిత్రీకరించేవారు. చిత్రీకరణకు వెల్తురు కావాలి.

క్లిగ్ లైట్లు 1915లో వచ్చాయి. కాని అవి అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఈ కాంతిలో – ఎండలాగా మెత్తదనం – తెల్లదనం వుండేదికాదు. ఆ దీపాలను ఎవ్వరూ వాడలేదు. పైగా అవన్నీ సర్దటానికి చాలా సమయం పట్టేది.

కీస్టోన్ లఘు చిత్రాలు ఒక వారం రోజుల్లో తీసేవాళ్లం. నిజానికి నేను ఒక పూటలో పూర్తి చేశాను. అది "ఇరవయి నిముషాల ప్రేమ" అదీ నవ్వులమయం. అలాగే 'డబ్బు-డైనమైటు' ఇది బాగా డబ్బు చేసింది. తొమ్మిది రోజుల్లో తీసాను. కాని ఖర్చు 1800 డాలర్లు అయింది. బడ్జెట్టు ఎక్కువైందని నా బోనస్‌లో కోత పెట్టాడు సెన్నెట్!! పైగా ఈ సినిమాని రెండు రీళ్లలో విడుదల చెయ్యాలి - అన్నాడు. అదే సినిమా ఆ సంవత్సరంలో 130వేల డాలర్లు సంపాదించింది.

ఇప్పుడు నా సినిమాలు బాగా విజయవంతం అయినాయి కదా - (థర్టి మినిట్స్ ఆఫ్ లవ్, డో అండ్ డైనమైట్, లాఫింగ్ గ్యాస్, ది స్టేజి హ్యాండ్) ఇవన్నీ డాలర్లు కురిపించాయి. దీని తర్వాత నేనూ, నార్మండూ కలిసి కథా చిత్రాలలో నటించాము. దాన్ని మేరీ డ్రెస్సలర్ దర్శకత్వం వహించింది. మేరీతో పని చేయటం ఆనందమే. కాని సినిమాలో అంత శక్తి లేదు. తర్వాత మళ్లీ నా సినిమాలు నేను దర్శకత్వం చేసుకున్నాను.

అన్న సిడ్నీని అమెరికా తీసుకు రావాలని, సెన్నెట్‌కి చెప్పాను. సెన్నెట్‌కి మరో 'చాప్లిన్' పేరు ఉపయోగపడుతుందని - వారానికి రెండువందల డాలర్ల ఒప్పందంతో తీసుకు వచ్చాడు. సిడ్నీ భార్యతో సహా దిగాడు.

అప్పుడు నేను స్టూడియో బైట చిత్రీకరిస్తున్నాను. ఆ రాత్రి కలిసి భోజనం చేశాము. ఇంగ్లాండులో నా సినిమాలు ఎలా పోతున్నాయి అని అడిగాను. అన్న వివరంగా చెప్పాడు.

అక్కడ వాల్‌పోస్టర్లుపై పేపర్లలో నా పేరు ప్రముఖంగా వేసేవారనీ, అమెరికన్ కామెడీని వారు ఇంతవరకూ చూడలేదనీ, తాను ఒకరోజు సినిమా థియేటర్‌లోనే చేసి తను ఫలానా అనీ, సినిమా చూడాలని చెప్పాడట - వాళ్లు వెంటనే తన కోసం మూడు సినిమాలు వేశారని చాలా బాగా ఆనందించానని చెప్పాడు.

'ఇంతకీ నీ స్పందన ఏమిటి?' అని అడిగాను.

చాలా సంతోషంగా 'నీ ప్రతిభ నాకు తెలుసు!' అన్నాడు.

మాక్‌సెన్నెట్ లాస్‌ఏంజలిస్ క్రీడా క్లబ్‌లో సభ్యుడు. ఆయన మరొకరికి తాత్కాలిక సభ్యత్వం ఇవ్వవచ్చు - ఆ సౌకర్యం నాకు ఇచ్చాడు. నేను వెంటనే క్లబ్బులో గది

తీసుకుని మారిపోయాను. వారానికి 12 డాలర్లు. అన్ని కలిపినా 25 డాలర్లు దాటేది కాదు. అక్కడకే సినిమా జనం అంతా వచ్చేవారు. చాలా సందడిగా వుండేది! పియానో, చిన్న గ్రంథాలయం కూడా వుండేది. మే డిపార్ట్‌మెంట్ స్టోర్ యజమాని, మోస్ హాంబెర్జెర్ నా ప్రక్కనే వుండేవాడు. అన్ని సదుపాయాలూ వాడుకున్నా, నా డిన్నర్ పార్టీలతో సహా 75 డాలర్లు ఖర్చయ్యేది.

క్లబ్బులో, వార్తలన్నీ తెలుస్తూండేవి. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యిందని ఆరు నెలల్లో అయిపోతుందని మాట్లాడుకునేవాళ్లం. తర్వాత నాలుగేళ్లు నడవవచ్చా అని కూడా అంటుండేవారు. ఏది ఏమయినా కాలిఫోర్నియాదాకా ఫిరంగి మోతలు వినపడేవి కావు.

ఇదే కాలంలో సెన్నెట్ – నా ఒప్పందం పొడిగించాలని అడిగేవాడు. నాకేంకావాలో చెప్పమనేవాడు. అప్పటికే నా పేరుకున్న విలువ నాకు తెలుసు. నేనంటే జనాలలో వున్న పిచ్చికూడా తెలుసు. ఆలోచించి వారానికి వెయ్యిడాలర్లు ఇవ్వమన్నాను. "అంత నాకే రాదు కదా" అన్నాడు. 'అవును నీ పేరుకు బాక్సాఫీసు విలువ వుండదు' అని – "అదే నా పేరు ప్రచారం చేస్తే జనం బారులుకడతారు కదా – అందుకని" అన్నాను. 'కాని మా స్టూడియో లేకుండా ఏమి చేస్తావు' "ఇప్పుడు 'ఫోర్డ్' ని చూడు ఏమయిందో" అని గుర్తు చేశాడు. నిజమే కీస్టోన్ వదిలింతర్వాత ఫోర్డ్ సినిమాలు ఆడటంలేదు.

"అయినా నాకు స్టూడియోతో పని లేదు. ఒక పార్క్, ఒక పోలీసు, ఒక అమ్మాయి – ఒక కెమెరా....." అంతే అన్నాను.

సెన్నెట్ తన భాగస్తులకు టెలిగ్రాం ఇచ్చాడు. 'చార్లీ' ఒప్పందం ఏమి చేద్దాం అని. తర్వాత సెన్నెట్ ఇలా చెప్పాడు – ఇంకా నాలుగు నెలలు వుంది కదా – అయినా నీకు మొదటి సం॥ (వారానికి) 500 డాలర్లు – రెండో సం॥ 700, మూడో సం॥ 1500 ఇస్తాము సరేనా?" అన్నాడు. దానికి నేను ఇదే తిరగేసి ఇస్తే ఒప్పుకుంటాను అన్నాను. అక్కడితో ఆ విషయం పక్కన పెట్టాము.

ఇంకా నెలరోజుల్లో కీస్టోన్ ఒప్పందం అయిపోతుంది. ఇంకా వేరే కంపెనీ ఏదీ నాకు కబురే పంపలేదు. ఏమిచేయాలో తోచలేదు. నా బాధ సెన్నెట్ చూస్తూనే వున్నాడు. కాని నేను దిగి రాలేదు.

నా మనసులో ఒక ఆలోచన వుంది. నా స్వంత కంపెనీ పెట్టుకుందాం అని.

సిడ్నీ కీస్టోన్‌లో చేరిం తర్వాత మంచి సినిమాలు తీసాడు. "ది సబ్‌మెరైన్ పైలెట్" బ్రహ్మాండంగా డబ్బు వసూలు చేసింది. అన్నను అడిగాను స్వంతంగా కంపెనీ పెడదామని. కాని తను ఇప్పుడు సంతోషంగా వున్నానని అన్నాడు. "ఇంతవరకూ జీవితంలో వారానికి 200 డాలర్లు చూడలేదు. ఇది వదులుకోలేను....." అన్నాడు. అతను కీస్టోన్ స్టూడియోలోనే మరొక ఏడాది వున్నాడు.

ఒకరోజు కార్ల్ లేమెక్ అనే ఆయన ఫోన్ చేశాడు, యూనివర్సల్ కంపెనీ నుంచి. 'అడుక్కి పన్నెండు సెంట్లు – సినిమాకి ఫైనాన్సు (పెట్టుబడి) ఇస్తాను వారానికి వెయ్యి డాలర్లు ఇవ్వలేము' అని. అదీ కుదరలేదు.

ఆ సమయంలోనే ఒక యువకుడు – జెస్ రాబిన్స్ అని ఎస్సానే కంపెనీ నుంచి వచ్చాడు. నా గురించి విన్నాననీ, నేను పదివేల డాలర్లు బోనస్‌గా అడిగి వారానికి 1200 డాలర్లు ఒప్పందం అంటున్నానని విన్నట్లు చెప్పాడు.

ఈ పదివేల డాలర్లు మొత్తం నా మనస్సులో పడిపోయింది. నిజానికి దీంట్లో నిజం లేకపోయినా!

ఆ రాత్రి అతన్ని పిలిచాను భోజనానికి. అతన్నే మాట్లాడనిచ్చాను. 'ఎస్సానే కంపెనీ యజమానులు జార్జ్ కూపర్, బ్రౌంకో బిల్లీల దగ్గర్నుంచి వస్తున్నాను. వీటన్నింటికీ వారు ఇష్టపడుతున్నార'ని చెప్పాడు. వారానికి 1250 డాలర్లు. బోనస్ విషయం వాళ్లే మాట్లాడతారని అన్నాడు. 'ఇన్ని మెలికలతో కష్టం' అన్నాను. 'చాలా మంది మంచి ఆఫర్‌లు ఇస్తున్నారు. కాని ఎవ్వరూ డబ్బు చూపట్లేదు' అన్నాను. అతను వాళ్లకు ఫోన్ చేసి, నాతో, 'సరే, ఒప్పందానికి సరే' అన్నాడు. మర్నాడు 600 డాలర్లు ఇచ్చి, పదివేలు యజమానులు నేరుగా ఇస్తారని చెప్పాడు. ఆండర్సన్ లాస్‌ఏంజలిస్ వస్తున్నారని. ఆయనా వచ్చి చాలా ప్రోత్సాహంగా మాట్లాడాడు. కాని పదివేలు ఆయన భాగస్తుడు స్పూర్ ఇస్తాడని చెప్పాడు. 'ఆయన చికాగోలో వున్నాడు' అంటూ....

ఇంకా నాకు రెండువారాలే సమయం ఉంది కీస్టోన్‌తో. నా చివరి సినిమా 'ప్రీ హిస్టారిక్ పాస్ట్' పూర్తి చేశాను. ఇక్కడనుంచి వెళ్ళటం కష్టంగానూ వుంది. పనిమీద శ్రద్ధ పెట్టలేకపోయాను. నా కళ్లముందు చాలా ఒప్పందాలూ, వ్యాపారాలూ కనపడుతున్నాయి. చివరికి చిత్రాన్ని పూర్తి చేశాను!

పదకొండవ అధ్యాయం

చికాగో పయనం

క్రీస్టోన్ స్టూడియో వదలి రావటం ఎంతో బాధాకరం. సెన్నెటూ, మిగతావారూ నాకు చాలా ఆత్మీయులైపోయారు. అందుకనే ఎవరికీ, నేను వీడ్కోలు చెప్పకుండానే బైటపడ్డాను. అదంతా సాదాగా జరిగినా చాలా గాయపరిచింది. ఆ శనివారం చివరి సినిమా కత్తిరింపులూ, అతికింపులూ పూర్తి చేసి సోమవారం ఆండర్సన్‌తో సాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లిపోయాను. అక్కడకి ఆయన క్రొత్త మెర్సిడెస్ కారు వచ్చింది. దానిలో నైల్స్ నగరం వెళ్లాము. అది రైలు పట్టాల ప్రక్కనే వుంది. చిన్న వూరు. నాలుగయిదువందల జనాభా వుంటారేమో! గొడ్ల పెంపకం, పశుగ్రాసం పెంచటం ప్రధానోత్పత్తి.

ఆ వూరి బయట పొలంలో ఒక చిన్న స్టూడియో వుండేది. దానిమీద 'ఎస్సానే' అని పేరు ఉంది. (అది స్పూర్ అండ్ ఆండర్సర్‌కి సంకేతం) ఆ స్టూడియో పరిసరాలు చూడగానే నా మనసు కుంగిపోయింది. అంతకంటే నిరాశ మరేమీ వుండదు! అది చూసి ఆండర్సన్ "చికాగో స్టూడియోలు బాగుంటాయి" అన్నాడు. తర్వాత ఆయన అక్కడి పనివాళ్లతో వ్యాపార విషయాలు మాట్లాడుకుని వాళ్లకు సూచనలిచ్చాడు. మేము చికాగో రైలు బండి ఎక్కాము.

ఆండర్సన్ దగ్గర ఒక విధమైన ఆకర్షణ ఉంది. చాలా దయాగుణం కూడా వుంది. రైలుబండిలో నన్ను సొంత తమ్ముడిలాగా చూశాడు. అతనికి గొప్ప ఆత్మవిశ్వాసం కూడా. "ఏమీ దిగులు పడకు, అంతా బాగా జరుగుతుంది" అంటూండేవాడు.. ఎప్పుడూ వ్యాపారం గురించే ఆలోచించేవాడు. అందులో దిట్ట! ఆ ప్రయాణం చాలా ఉత్సాహకరంగా జరిగింది. మాతోపాటు ఇంకా ముగ్గురు ప్రయాణిస్తున్నారు మొదటి తరగతిలో. వాళ్లు మాకు భోజనాల బోగీలో కలిసారు. అందులో ఇద్దరు చాలా సంపన్నుల్లా

కనిపించారు. మూడో వ్యక్తి సామాన్యంగా వున్నాడు. మోటుగా కూడా. వీళ్ళు ముగ్గురు కలిసి భోజనం చేయటం వింతగానే అన్పించింది. భోజనాలు అయిన తర్వాత అందులో ఒక పెద్దమనిషి, పోతూ ఇటు వచ్చాడు. తాను సెయింట్ లూయిస్ నగర పోలీసు అధికారినని (షెరీఫ్), ఆండర న్‌ని గుర్తుపట్టినట్లు చెప్పాడు. ఇప్పుడు తమతోపాటు కరుడుగట్టిన ఖైదీ వున్నాడనీ అతన్ని సెయింట్ క్వెనిటిన్ నుంచి సెయింట్ లూయి తీసుకు వెళ్తున్నట్లు వివరించాడు. ఈయనతో వున్న రెండోవ్యక్తి జిల్లా ప్లీడరు.

'మీకు వివరాలు చెప్పాలని వచ్చాను' మాతో వున్నవాడు హాంక్ ఒక పోలీసు అధికారిని చంపాడు. చాలా దొంగతనాలు చేశాడు. ఇతనికి ఉరి తప్పదు' అన్నాడు. 'సెయింట్ క్వెనిటన్ కారాగారం నుంచి విడుదల కాగానే మేము పట్టుకున్నాము. ఏ గొడవ చేయకుండా వస్తే మొదటి తరగతిలో తీసుకు వెళ్తాము, లేదంటే చేతికి బేడీలు వేసి గొలుసులతో రావాలని అతను మేము చెప్పినట్లే మాతో వస్తానని ఒప్పుకున్నాడు' అని చెప్పాడు.

అక్కడినుంచి వాళ్లు కూర్చొన్నచోటుకు వెళ్లాము. మాకు ఖైదీని పరిచయం చేశాడు. 'హాంక్' మామూలుగా నవ్వాడు. మాతో చేతులు కలిపి మిమ్మల్ని చూశాను అన్నాడు ఆండర్సన్‌తో నా గురించి పెద్దగా తెలిసినట్లు లేదు!

మాకు లోపల చాలా వత్తిడిగా ఉంది. ఈ ఖైదీతో, పోలీసులతో గడపటం. ఈ ఉద్రిక్తతతోనే షెరీఫ్ "మీ పనికి బైట చాలా ప్రపంచం వుంది. అదీ చాలా కఠినమైంది" అని అన్నాడు. ఆండర్సన్ "అవును ప్రపంచం చాలా కర్కశంగా వుంటుంది" అన్నాడు.

"మేము దాన్ని నివాస యోగ్యంగా చేయాలని ప్రయత్నం." 'కావాలంటే హాంక్‌ని అడగండి" అని కూడా అన్నాడు. ఖైదీ 'అవును – అవును' అన్నాడు.

"మేము హాంక్‌తో చెప్పాం – మాతో సహకరించమని. అది ఫలించి ఇప్పుడు సంకెళ్లూ, గొలుసులూ లేకుండా మొదటి తరగతిలో ప్రయాణం చేస్తున్నాడు" అన్నాడు. "ఇప్పుడు కేవలం కాలికి మాత్రమే ఇనప చట్రం వేశాము." నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. 'అదేమిటి?' అన్నాను. హాంక్ తన పంట్లాము పైకి లాగి చూపాడు. అతని చీలిమండకు 4 అంగుళాల వెడల్పు, మూడు అడుగుల మందం వున్న ఇనప తొడుగు వేసి ఉంది. బరువు సుమారు నలభై పౌండులుంటుంది. "ఏమిటీ దీనితోనే నిద్రపోతాడా" అని ఆశ్చర్యపోయాను.

హంక్ నవ్వాడు. షరీఫ్ అతని వంక అదోలాగా చూశాడు. ఆ తరువాత వాళ్ళు సెయింట్ లూయిలో దిగిపోయారు. నాకు ఇదంతా చూసి ఎద్దును చంపబోయే ముందు మెటడార్‌లాగా షరీఫ్ కనబడ్డాడు. ఆ రోజు డిసెంబర్ 31 వాళ్ళు దిగిపోతుంటే క్రొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపాము. హంక్ మాతో "అవును అన్ని మంచి విషయాలకీ ఒక ముగింపు ఉంటుంది" అంటూ దిగిపోయాడు. నాకైతే అతన్ని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. ఆ ఇనపపట్టి బరువుతో కాలు ఈడ్చుకుంటూ అతను వెళుతుంటే నాకు చాలా బాధ కలిగింది. ఆ తరువాత కొద్దిరోజులకే అతన్ని ఉరితీశారని విన్నాను.

షికాగో చేరాం. మాకోసం స్టూడియో మేనేజరు వచ్చాడు. కానీ స్ఫూర్ మహాశయుడు కనపడలేదు. ఆయన క్రొత్త సంవత్సరం వేడుకలకి ఎక్కడికో వెళ్ళాడని చెప్పారు. నేను కూడా ఈ క్రొత్త సంవత్సరం సెలవలు కదా పనేమీ ఉండదు అనుకున్నాను. క్రొత్త సంవత్సరాన్ని యాండర్‌సన్‌తో కుటుంబంతోనే గడిపాను. ఆ రోజు రాత్రే ఆయన కాలిఫోర్నియా వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు స్ఫూర్ వచ్చి అన్ని విషయాలు చూస్తాడని చెప్పాడు. నాకు ఇస్తానన్న పదివేల డాలర్లు కూడా. ఈ స్టూడియో పారిశ్రామిక వాడలో ఉంది. ఒకప్పుడు అది సామానుల గిడ్డంగి అయి ఉంటుంది. నేను ఉదయాన్నే వెళ్ళాను. అప్పటికింకా స్ఫూర్ రాలేదు. ఎవరూ పనిలో దిగినట్లు లేదు. నాకేదో అనుమానం వచ్చింది. వీళ్ళందరికీ ఏదో తెలిసిన విషయం నా దగ్గర దాస్తున్నారనిపించింది. అయినా నేను అంతగా పట్టించుకోలేదు. ఒక మంచి సినిమా తీస్తే ఇవన్నీ సమస్యలే కాదు. మేనేజరుని పిలిచి "మీ అందరి సహకారం అన్ని సదుపాయాలతో సహా నాకుంటుంది కదా!" అని అడిగాను. ఆయన "తప్పకుండా, అందుకు కావలసిన సూచనలన్నీ యాండర్‌సన్ చేసి వెళ్ళారు సర్" అని చెప్పాడు. "అయితే నేను పని వెంటనే మొదలుపెడతాను," అని చెప్పాను. "మంచిది సర్, మేడమీద మిస్‌లోలా ఉంది ఆమె దగ్గర వ్రాత ప్రతులున్నాయి" అన్నాడు. "లేదయ్యా నా కథలు నేనే రాసుకుంటాను" అన్నాను. ఈ స్టూడియోలో అందరూ బ్యాంక్‌లో గుమస్తాల్లాగా పనిచేస్తున్నారు. కాగితాలు మోసుకెళుతూ ఇటూ అటూ తిరుగుతూ హడావుడిగా కనబడ్డారు. ఈ విధంగా చేస్తే వీరి వ్యాపారానికి మేలేమో కానీ సినిమాలకి కాదు. ఇక్కడి వాతావరణం సృజనాత్మకంగా లేదు. మేడమీద ఉన్న కార్యాలయాన్ని చూస్తే బాంక్‌లో డబ్బులు ఇచ్చే గదుల్లాగా ఉన్నాయి. పంజరాల్లో పక్షులులాగా ఉన్నారు. ఆరు గంటలకల్లా అన్ని దీపాలూ ఆర్పేసి వెళ్ళిపోతారు.

ఆ మర్నాడు వీళ్ళ నటులుండే చోటికి వెళ్ళి నాకు కొంతమంది నటులు కావాలి అని అడిగాను. ఖాళీగా ఉన్నవారిని పిలవమని చెప్పాను. నా ముందు కొంతమందిని నిలబెట్టారు. అందులో బెన్‌టర్పిన్ అనే మెల్లకన్ను వ్యక్తి ఉన్నాడు. ఈయనకి ఈ సినిమా విషయాలు కాస్త తెలిసినట్లే ఉంది. అతన్ని తీసుకొన్నాను. కథానాయిక లేదు. చాలామందిని చూసి, మాట్లాడిన తరువాత క్రొత్తగా వచ్చిన ఒక అందమైన అమ్మాయిని ఎంపిక చేశాను. కానీ, ఆమె, ముఖంలో ఎటువంటి భావనలూ పలికించలేకపోయింది. ఆమె పేరు "గ్లోరియా స్వాన్‌సన్" (చాలా సంవత్సరాల తర్వాత ఆమె నాతో చెప్పింది. "ఇలాంటి వినోద భరితమైన సినిమాలలో నటించడానికి ఇష్టపడక అలా చేశానని" చెప్పింది.) ఫ్రాన్సిస్ బుష్‌మన్ అనే ఆయన ఈ తంతంతా చూసి "చార్లీ ఇక్కడ నీకు కనపడేదంతా నిజం కాదు." అన్నాడు. "ఈ స్టూడియో గురించి నువ్వు అనుకొనేదంతా సరైన అభిప్రాయం కాదు." అన్నాడు. ఎట్లాగైతే కొన్ని భాగాలు తీసి చూపించమన్నాను. ఆశ్చర్యంగా వాళ్ళు నెగిటివ్ ఫిల్మే చూపించారు. ఎందుకంటే, ఫిల్మ్ ఖర్చు తగ్గించడానికి వీళ్ళు ఈ మధ్యనే సినిమా వ్యాపారంలో ప్రవేశించి నట్లున్నారు. మంచి సినిమాలు తియ్యటంకంటే కూడా డబ్బు ఆదా చెయ్యడం పైనే దృష్టి ఎక్కువ. యాండర్‌సన్ (బ్రాంకోబిల్లి) కౌబాయ్ సినిమాలలో బాగా డబ్బు సంపాదించాడు. ఇంక దేనిమీదా వీళ్ళకి శ్రద్ధ లేదు.

ఎట్లాగయితే "హిజ్ న్యూ జాబ్" అనే సినిమాను పూర్తిచేశాను. అప్పటికి రెండువారాలయింది. ఇంతవరకూ స్ఫూర్ అనే ఆయన లేడు. నా వారాంతపు జీతమూ రాలేదు, నా పదివేల బోనస్ రాలేదు. ఒకరోజున వాళ్ళ కార్యాలయంలోకి వెళ్ళి 'ఎక్కడ ఆ స్ఫూర్' అని గట్టిగా అరిచాను. నా ప్రశ్నకి ఎవరూ సమాధానం చెప్పలేదు. నా కోపమంతా వెళ్ళగక్కి వచ్చేశాను.

చాలా సంవత్సరాల తరువాత ఈ విషయంపై స్ఫూర్ నాకు వివరణ ఇచ్చాడు. ఒకటి, యాండర్‌సన్ నాతో ఒప్పందం చేసుకొన్న విషయం స్ఫూర్‌కి తెలియదు. ఆ విషయం స్ఫూర్‌కి తెలిసిన తరువాత 'ఇంత ఎక్కువ జీతానికి తీసుకున్నావా' అని గొడవ చేశాడు. దానితో యాండర్‌సన్ ఈ విషయాన్ని కాలానికి వదిలేసి కూర్చున్నాడు.

తరువాత యాండర్‌సన్ షికాగో వచ్చినప్పుడు ఆయన భోజనానికి చాలా పెద్ద హోటల్‌కి వెళ్ళాడు. అక్కడ ఆయన స్నేహితులు కలిసి "మీ కంపెనీ చార్లిని తీసుకుందట

గదా! చాలా మంచి పని చేశారు" అని ఆయనను అభినందించారు. ఇది స్పూర్‌కి మింగుడు పడలేదు. ఆయన హోటల్‌లో ఉండగానే చార్లీచాప్లిన్ పేరు బాగా వినపడింది. స్పూర్ ఒక పరీక్ష చేద్దామని అక్కడ హోటల్ బాయ్‌ని పిలిచి అతనికి ఇరవై అయిదు సెంట్లు ఇచ్చి "చాప్లిన్‌కి ఫోన్ వచ్చింది" అని గట్టిగా అరవమన్నాడు. దానితో హోటల్ లాబీ నిండిపోయింది. ఇది నిజంగా స్పూర్‌కి ఆశ్చర్యకరమైన విషయమే. రెండవది ఫిల్మ్ ఎక్స్‌ఛెంజ్‌లో మామూలుగా ముప్ఫై, నలభై కాపీలు పోయే సినిమా చాప్లిన్ పేరు వినపడగానే అది వంద ప్రింట్లకి వెళ్లింది. దీనితో స్పూర్‌కి చార్లీచాప్లిన్ అంటే ఏమిటో తెలిసి వచ్చింది.

అప్పుడే మేము కలవడం. నన్ను కలుస్తూనే చాలా క్షమాపణలు చెప్పుకుంటూ వచ్చాడు. జరిగిందానికి చాలా చింతిస్తున్నామని, మీ ఒప్పందాలు ఖచ్చితంగా గౌరవిస్తామని చెప్పాడు. మీరు ఒప్పందాలని గౌరవించే పద్ధతి నా అనుభవమే చెప్తోంది. మనకి ఒప్పందం లేనట్లే గదా అన్నాను. స్పూర్ పొడవాటి మనిషి. చాలా మెత్తగా మాట్లాడతాడు. కాస్త అందంగా కూడా ఉంటాడు. క్రింది పెదవి లోపలికి, పై పెదవి ముందుకి ఉంటుంది. మళ్ళీ నాకు ఒకసారి క్షమాపణ చెప్పి, "ఇప్పుడే మీకు ఇవ్వవలసిన సొమ్ము అందజేస్తా'మన్నాడు. 'నాకేమీ తొందరలేదులే' అన్నాను. అక్కడితో ఆ విషయం ముగిసింది. నేను షికాగోలో ఉన్నంతకాలం స్పూర్ నా గురించి చాలా జాగ్రత్తలు తీసుకొన్నాడు. నేను ఆ సినిమా పూర్తి చేసి ఆయనతో ఇలా చెప్పాను. "నానుంచి మీరు ఇంకా మంచి సినిమాలు కోరుకునేట్లయితే నన్ను కాలిఫోర్నియా పంపించండి. ఈ స్టూడియో నా పనికి పనికి రాదని చెప్పాను." అయితే నన్ను యాండర్‌సన్ దగ్గరికి పంపించడానికి ఏర్పాట్లు చేశాడు. ఇక్కడ యాండర్‌సన్ గురించి నాలుగు మాటలు చెప్పాలి. బ్రాంకో బిల్లీ అనే కౌబాయ్‌గా పరిచయమైన యాండర్‌సన్ అన్నీ ఒక రీలు సినిమాలే తీశాడు. అందులో తుపాకులూ, గుర్రాల షూటింగూ ఉంటుంది. ఆయన దగ్గర ఏడు కథలున్నాయి. అవే తిరగేసి, మరగేసి తీస్తుంటాడు. వాటితోనే లక్షల డాలర్లు సంపాదించాడు. అతను పనిచేసేది కూడా అప్పుడప్పుడు మాత్రమే. వరుసనే వారంరోజులు పనిచేస్తాడు. ఐదు వారాలు మాయమైపోతాడు. ఇది యాండర్‌సన్ తీరు.

నైల్ స్టూడియోకి చేరాను. ఆ స్టూడియో చుట్టూ యాండర్‌సన్ చిన్నచిన్న బంగ్లాలు కట్టించాడు. స్టూడియోలో పనిచేసే వారికోసం. నన్ను తనతో పాటే ఉండమన్నాడు.


CHARLIE CHAPLIN
IN
"A NIGHT IN THE SHOW"
ESSANAY-CHAPLIN BRAND
Essanay
Perfection Pictures
GEORGE KLEINE SYSTEM, DISTRIBUTORS

అది చాలా పెద్ద బంగళా. నేను చాలా సంతోషించాను ఆ మాటలకి. చివరికి బంగళాలో ప్రవేశించి లైటువేసిన తరవాత ఆశ్చర్యపోవడం నావంతైంది. బంగళా అంతా ఖాళీగా ఉంది. ఏ సామానూ లేదు. ఒక్క ఇనుపమంచం, ఒక కుర్చీ తప్ప. ఆ మంచం ప్రక్కనే ఒక బల్లా. ఆ బల్ల మీద సిగరెట్లు పడేసే ఇత్తడి యాష్‌ట్రే, దాని నిండా ఆర్పిన సిగరెట్లు. నాకు ఇచ్చిన గది కూడా ఇలాగే ఉంది. ఒక స్నానాల గది సంగతి చెప్పే పనే లేదు. అందులో ఏదీ పనిజేయటం లేదు. ఇదా లక్షాధికారి యాండర్‌సన్ ఉండే ఇల్లు అనుకొన్నాను. ఈయనకి డబ్బుందిగానీ ఎలా బ్రతకాలో తెలియదు. ఈయన మోజంతా ఖరీదైన కార్లమీద, కుస్తీ పోటీల మీద భార్యాబిడ్డలని షికాగోలో వదిలి ఈయన దేశం అంతా తిరుగుతుంటాడు. ఒక అర్థంగాని వింత విశ్రాంతిలేని మనిషి. ఒంటరిగా ఏవో సుఖాలకోసం పరుగులు తీసే వ్యక్తి యాండర్‌సన్.

ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకు మారడం నాకు ఇబ్బందిగా వుంది. మళ్ళీ ఇక్కడ అందరినీ ప్రోగుచేయాలి, ఒక కెమెరా మెన్‌ని, అసిస్టెంట్ డైరక్టరునీ, నటీనటులనీ. ఈ స్టూడియోలో వినోదభరితమైన సినిమాలే తీయరు. కానీ, ఇక్కడ వేరే కంపెనీ ఒకటి పనిచేస్తుంది. అది యాండర్‌సన్ పని చేయనప్పుడు అద్దె ఇచ్చి ఆయన స్టూడియో వాడుకుంటారు. వాళ్ళు తీసే సినిమాలు కాస్త వినోదభరితమైనవే. ఈ కంపెనీలో కొంతమంది నాకు పనికొచ్చేవాళ్ళున్నారు. అయితే మళ్ళీ కథానాయిక లేదు.

స్టూడియో వాళ్ళకి కాఫీ హౌటల్‌సెట్ వేయమని చెప్పాను. నా దగ్గర కథంటూ ఏమీ లేదు. వినోదానికి కాఫీ హౌటల్ సెట్ కొంతవరకు ఉపయోగపడుతుంది. ఈ సెట్ తయారవుతుండగా నేనూ, యాండర్‌సన్‌నూ శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళాము. కథానాయిక వేటలో. శాన్‌ఫ్రాన్సిస్కోలో యాండర్‌సన్ సంగీత నృత్య నాటకం ఒకటి నడుస్తున్నది. అక్కడ చాలామంది అమ్మాయిలు ఉన్నా, కెమెరాకు సరిపోయే ముఖం కోసం చూస్తున్నాము. యాండర్‌సన్‌తో పాటు పనిచేసే కారల్‌స్ట్రాస్ అనే జర్మనీ యువకుడు ఒకమ్మాయి పేరు చెప్పాడు. ఆమె ఆ దగ్గర టేట్‌కాఫీలో కలిసినట్లు చెప్పాడు. మేము టేట్ హౌటల్‌కి వెళ్ళి ఆమె గురించి వాకబు చేశాం. చివరికి ఆమెను పిలిపించాం. ఆమె పేరు 'ఎడ్నాకుర్వియాన్స్' చాలా అందంగా ఉంది. పైగా కాలేజీ చదువు చదివింది. ప్రస్తుతం ఆమె తన సోదరితో ఉంటోంది. మేము కలిసినప్పుడు ఆమె చాలా విచారంగా

ఉంది. ఏదో ప్రేమవ్యవహారం బెడిసి కొట్టిందట. చాలా నెమ్మదిగా పెద్ద కళ్ళతో, చక్కటి పెదవులతో, తెల్లటి పలువరసతో చూడ ముచ్చటగా ఉంది. నాకు ఈమె నటించగలదా, హాస్యం పండించగలదా అని అనుమానం వచ్చింది. కనీసం నా సినిమాలో ఒక అందమైన అలంకరణగా ఉంటుందని తీసుకొన్నాను. మరునాడు నైల్స్‌కు తిరిగి వెళ్ళాం. అప్పటికి సెట్ పూర్తికాలేదు. అయినంతవరకూ ఏమీ బాగోలేదు. ఈ స్టూడియోలో సాంకేతిక నిపుణులే లేనట్లున్నారు. కొద్ది మార్పులు చేయమని చెప్పి ఒక శీర్షిక ఆలోచించాను. "హిజ్ నైటవుట్." ఒక త్రాగుబోతు సంతోషాన్ని వెతుక్కుటూ రాత్రిపూట తిరగడం. ఇదీ ఆలోచన. ఆ నైట్‌క్లబ్ సెట్‌కి ఒక ఫౌంటెన్ పెట్టమన్నాను. రేపు షూటింగ్ అనగా ఆ ముందు రోజు సాయంత్రం యాండర్‌సన్ కంపెనీ అందరినీ సాయంత్రం భోజనానికి ఆహ్వానించింది. ఒక పాతికమంది వరకూ చేరాము. బీరు, శాండ్‌విచెస్, పేకాట సరదాగా గడుస్తుంది. మాటల సందర్భంలో హిప్నటిజమ్ గురించి చర్చ వచ్చింది. అందులో నా ప్రావీణ్యత గురించి గొప్పలు చెప్పాను. ఎవరినైనా సరే అరవై సెకండ్లలో నిద్రపుచ్చుతానని చెప్పాను. ఎడ్నా నమ్మలేదు. 'అంతా వట్టిదే. నన్నెవరూ నిద్రపుచ్చలేరు' అంది. 'అయితే పందెం కాస్తావా' అని అడిగాను. 'నిన్ను అరవై సెకండ్లలో నిద్రపుచ్చుతాను పదిడాలర్ల పందెం' అన్నాను. ఎడ్నా పందానికి సిద్ధమయింది. 'తరువాత నీకేదన్నా అయితే నన్నడగవద్దు. నాది పూచీ కాదు' అని ఆమెను బెదరగొట్టడానికి ప్రయత్నించాను. ప్రక్కనున్న వాళ్ళు కూడా 'వద్దు ఎడ్నా వద్దు' అన్నారు. కానీ ఎడ్నా వినలేదు. నేను పందానికి సిద్ధమంది. సరే గోడదగ్గర నుంచో వీళ్ళందరికి దూరంగా అని ఆమెను గోడదగ్గర నిలబెట్టి ఏవో మంత్రాలు వేసినట్టు చేతులు తిప్పాను. 'ఎవరైనా గడియారం చూడండి' అన్నాను. అందరూ చూడడం మొదలు పెట్టారు. నేను ఎడ్నా దగ్గరకు వెళ్ళి "చూడు ఎడ్నా ఒక నిమిషంలో నువ్వు నిదురపోతావు ఒక నిమిషంలో నువ్వు పూర్తిగా అచేతనం అయిపోతావు" అంటూ ఆమె దగ్గరికి వెళ్ళి ముఖం మీద చేతులు తిప్పుతూ, గడియారం చూస్తున్నారా! అన్నాను. హ! మొదలుపెట్టు అన్నారు. నేను మెల్లగా ఆమె దగ్గరకు వచ్చి, 'ఇంకా మెల్లగా నిద్ర నటించు' అన్నాను, అంటూ చేతులు త్రిప్పసాగాను. మా వెనుకనుంచి ఐదు, పది, పదిహేను అని వినబడుతున్నాయి. అదిగో నీకు నిదరొస్తోంది. అదిగో నీకు నిదరొస్తోంది అన్నాను. (లోపల నాకు భయంగానే ఉంది). వెనుక నుంచి నలభై అయిదు. యాభై అంటున్నారు.

ఆమె మెల్లగా నిదరొస్తున్నట్లు క్రిందకి ఒరిగిపోతుంది. అప్పుడే పట్టుకున్నాను పడిపోకుండా. 'ఎవరైనా సాయానికి రండిరా బాబు' అన్నాను. తీసుకెళ్ళి అక్కడ సోఫాలో పడుకోబెట్టాను. ఆమెకి స్పృహ వచ్చిన తరువాత ఆమెను నేను చాలా అభినందించాను. నా మనసులో ఆమె ఓటమిని అంగీకరించే గొప్పదనానికి జోహార్లు అర్పించాను.

నైల్స్‌లో వుండగా నాలుగు వినోద ప్రధానమైన సినిమాలు తీసాను. ఇక్కడ స్టూడియోలో నిర్మాణానికి అనుకూల పరిస్థితులు సరిగ్గా లేవు. ఇక్కడే కూర్చొని సమయం వృధా చేయటం ఇష్టంలేక యాండర్సన్‌కి చెప్పాను. అదే కాకుండా స్టూడియో మొత్తం నాకే చాలకపోవటంతో మిగతా చిత్రాలకు సమయం చాలటంలేదు. అందుకని వెంటనే లాస్‌ఏంజిలెస్ నడిబొడ్డున బాయిల్ హైట్సు అని స్టూడియో అద్దెకు తీసుకుని నాకు అప్పగించాడు.

అక్కడ నేనుండగా హాల్‌రోచ్, హెరాల్డ్ లాయిడ్ – ఇద్దరూ వచ్చి స్టూడియో ఖాళీ సమయంలో వాడుకుంటామని అద్దెకు తీసుకున్నారు. ప్రతి చిత్రంలో నా విలువ పెరిగిపోతుండటంతో ఎస్సానే కంపెనీ ఒక రెండు రీళ్ల చిత్రానికి రోజుకు 50 డాలర్లు వసూలు చేస్తోంది. అంటే 50 వేల డాలర్లు పైగా ముందుగానే చిత్రానికి వసూలు చేస్తున్నారు. ఒక రాత్రి నేను స్టార్ హోటల్‌కి తిరిగి వచ్చిన తర్వాత నాకో అత్యవసరమైన టెలిఫోన్ వచ్చింది. అది 'ఎక్జామినర్' అనే పత్రిక నుంచి. వారికి న్యూయార్క్ నుంచి ఒక టెలిగ్రాం వచ్చిందని చదివి వినిపించారు. దాని సారాంశం: ప్రతి సాయంత్రం పదిహేను నిమిషాల చొప్పున రెండువారాలు న్యూయార్క్‌లో హిప్పోడ్రోంలో కనపడితే 25 వేల డాలర్లు ఇస్తాము చాప్లిన్‌కి అని!

నేను ఈ విషయం యాండర్సన్‌కి చెప్పాను ఫోన్లోనే ఒక సినిమా పూర్తి చేస్తాను. నన్ను న్యూయార్క్ వెళ్లనివ్వమని అడిగాను. కాని దీనికి యాండర్సన్ ఒప్పుకోవటం లేదు. నేను గట్టిగా అరవవలసి వచ్చింది, అతనికి సరిగా వినపడక. ఇది హోటల్‌లో వున్న మిగతావారికి ఇబ్బంది కలిగించి "ఇక అరవటం ఆపి నిద్రపోతావా?" అని గొడవ చేశారు.

తర్వాత యాండర్సన్ నాతో రెండు రీళ్ల సినిమా తీసి యిస్తే, తనే 25 వేల డాలర్లు ఇస్తానన్నాడు. రేపు లాస్‌ఎంజిల్స్ వచ్చి చెక్కు ఇస్తామన్నాడు. అక్కడతో ఆ

సంభాషణ ఆపి ఇందాక గొడవ చేసిన వాళ్లతో 'గో టు హెల్' అని గట్టిగా అరిచి పడుకున్నాను.

మర్నాడు ఆండర్సన్ వచ్చి 25 వేల డాలర్లకు చెక్కు ఇచ్చాడు. ఆ న్యూయార్కు కంపెనీ దివాళా తీసిందని విన్నాను. అదీ అదృష్టమంటే! ఇప్పుడు లాస్ఏంజిలిస్ లో ఉండడం నాకు చాలా సంతోషంగా వుంది. ఇప్పుడున్న బాయిల్ హైట్స్, కీస్టోనుకు దగ్గర్లో వుంది. అన్న సిడ్నీని కలవటానికి చాలా వీలుగా వుంటోంది. ఇప్పుడు మా యిద్దరి ఒప్పందాలూ దాదాపు ఒక్కసారే అయిపోవచ్చు. సిడ్నీ ఇక నా వ్యాపారమంతా తనే చూస్తానని అంటున్నాడు.

లాస్ఏంజెలిస్‌లో నాకు వచ్చిన పేరు ప్రఖ్యాతులు తెలుస్తాయి. కానీ వేరే నగరాల్లో ఎట్లా వుందో తెలియదు. కాని వార్తలు చాలా ప్రోత్సాహకరంగా వున్నాయి. న్యూయార్క్‌లో చాలా బొమ్మలు చేసే కంపెనీ, నా బొమ్మలు అన్నిచోట్ల అమ్ముతున్నారనీ, ఒక సంగీత బృందం నా మీద పాట కట్టి "చార్లీ చాప్లిన్ ఫీట్" అని పాడుతున్నట్లూ వింటున్నాం.

చాలా వ్యాపార సంబంధమైన సూచనలూ, ఆహ్వానాలూ అందుతున్నాయి. పుస్తకాలు, బట్టలు, కొవ్వొత్తులు, బొమ్మలు, సిగిరెట్లు, టూత్‌పేస్టుతో సహా! ఇక అభిమానుల వుత్తరాలకు అంతే లేదు. గుట్టలు గుట్టలు పేరుకుపోతున్నాయి. సిడ్నీ, 'వాటన్నిటికీ జాబులు రాయాలి. ఒక కార్యదర్శిని పెట్టుకో' అన్నాడు.

సిడ్నీ, యాండర్సన్‌తో నా సినిమాలను విడిగా అమ్మాలని చెప్పాడు. ఇప్పటికే వంద ప్రింటులకు పైగా పోతున్నా డబ్బంతా థియేటర్లకే వెళ్లిపోతోంది. అందుకని థియేటర్లు సీట్ల బట్టి రేట్లు పెడదామని అన్నాడు. ఈ లెక్క ప్రకారం ఒక్క సినిమాకు లక్షడాలర్ల పైన వస్తుంది!

మొదట్లో యాండర్సన్ ఒప్పుకోలేదు. 'థియేటర్ల యజమానులు ఒప్పుకోరు. ఇది వ్యాపారానికి వ్యతిరేకం' అని అన్నాడు. తర్వాత 'మోషన్ పిక్చర్ హెరాల్డ్' పత్రికలో 'ఎస్సానే' కంపెనీ పంపిణీ పద్ధతి మారుస్తోంది అని. దీనివల్ల చాప్లిన్ సినిమాలకు లక్ష డాలర్లు వస్తాయని రాసింది. ఈ వార్త చదివి నా చెవులు నిక్కబొడుచుకున్నాయి! ఇప్పుడు వారానికి 1250 డాలర్లు. అన్ని పన్లూ నేనే చెయ్యాలి. కథా, మాటలూ దర్శకత్వం కత్తెర్లూ అతికింపులూ అన్ని నేనే. ఒక్కో సినిమాకు చాలా సమయం పడుతోంది. ప్రతిరెండు మూడు వారాలకూ ఒక సినిమా తీసి యిస్తున్నా.

చికాగో నుంచి స్పూర్ వూడి పడ్డాడు. ప్రతి సినిమాకి 10 వేల డాలర్లు బోనస్ ఇస్తానని కాగితం రాసి యిచ్చాడు. ఆ హుషారుతో నా ఆరోగ్యం బాగుపడింది.

ఆ సమయంలోనే డి.డబ్లు. గ్రిఫిత్ గొప్ప సినిమా తీశాడు. 'ది బర్త్ ఆఫ్ నేషన్' అని. అతను గొప్ప దర్శకుడు. తప్పనిసరిగా చూడవలసిన చిత్రం 'డి మిల్లె' (టెన్ కమాండమెంట్స్). ఈయన 'విస్పరింగ్ కోరస్' మొదలుపెట్టాడు. తర్వాత 'కార్‌మెన్' తీశాడు. Male & Female తర్వాత చాలాకాలం స్థబ్దంగా వుండిపోయాడు. ఆయన 'కార్‌మెన్' బాగా నచ్చి దాన్ని రెండు రోజుల్లో తీసిచ్చాను. అదే ఎస్సానేకి నా చివరి సినిమా! అది విడుదలకు ముందు దాన్ని నాలుగు రీళ్లు చేసి పాడు చేశారు. ఇది నా పేరు చెడగొట్టటానికే! ఆ తర్వాత ఒప్పందాలతో ఈ విషయం గట్టిగా రాయించాను. నా సినిమాల విషయంలో ఎవ్వరూ కల్పించుకోరాదని!

స్పూర్ మళ్ళీ దిగాడు. రెండు రీళ్ళ సినిమా 35000 డాలర్లు ఇస్తానని, సినిమా ఖర్చు తానే భరిస్తానన్నాడు. నాకు చుక్కలు కనిపించాయి. నేను ముందుగా 1 లక్షా 50 వేల డాలర్లు బోనస్ అదనంగా ఇమ్మన్నాను. దానితో ఆయన వెనక్కి తగ్గాడు.

నేను 'కార్మన్' పూర్తి చేస్తున్నపుడు, సిడ్నీ న్యూయార్క్‌లో వ్యాపార లావాదేవీలు మాట్లాడుతున్నాడు. నాకు భవిష్యత్తు చాలా కాంతివంతంగా కనపడుతోంది. డబ్బూ, పేరూ ఉప్పెనలా వస్తున్నాయి. ఇవి సంతోషించదగినవి. భయపెట్టేవి కూడా! కాని ఎంత అద్భుతమైన విషయం! అప్పుడు నేను శాంతా మోనికాలో, ఉంటున్నాను. నేనున్న ఇల్లు సముద్ర తీరానికి ఎదురుగా వుండేది. అప్పుడప్పుడూ 'నాట్ గుడ్‌విన్' కేఫ్‌లో భోజనానికి వెళ్లేవాడిని. నాట్ గుడ్‌విన్ చాలా గొప్ప నటుడు. అటు షేక్స్పియర్ నాటకాల్లో ఇటు వినోద భరితమైన సాంఘిక నాటకాలలో నటించాడు. ఎనిమిదిసార్లు పెళ్లి చేసుకున్నాడు. అందరూ అందగత్తెలే. ఆయన సర్ హెన్రీ ఇర్వింగ్‌కి చాలా ముఖ్య స్నేహితుడు.

ఆయన ఐదో భార్య మాక్సిన్ ఎలియట్. ఈమె రోమన్ సెనేటర్, అని చెప్పేవాడు. ఆమె చాలా అందగత్తె. తెలివిగలది కూడా. గుడ్‌విన్ చాలా సంస్కారంగల వ్యక్తి. ఆయన, నటన నుంచి విశ్రాంతి తీసుకొని ఈ హోటల్ నడుపుతున్నాడు. మా ఇద్దరికీ మంచి స్నేహం కుదిరింది. చలికాలపు సాయంత్రాలు సముద్రపు తీరం వెంట నడుస్తూ గడిపేవాళ్లం.

అక్కడ ఏకాంతంలోని విషాదం నాలో ఏవో తెలియని మంటలు రేపుతుండేది. ఆ సాయంత్రాలు నా జీవితంలో ఎంతో ప్రశాంతతనూ ఇచ్చేవి. నేను న్యూయార్క్ వెళుతున్నాను అని తెలిసి గుడ్‌విన్ నాకు మంచి సలహా ఇచ్చాడు. "చార్లీ నువ్వు చెప్పుకోదగిన విజయాన్ని సాధించావు. నీ ముందు అద్భుతమైన జీవితం ఉంది, అదీ నువ్వు జాగ్రత్తగా ఉంటేనే సుమా!" అని, "నువ్వు న్యూయార్క్ వెళ్ళిన తరువాత బ్రాడ్‌వే వెళ్ళకు. జనం కంట్లో పడకు. చాలామంది తారలు చేసే తప్పు, వారు జనం మధ్య తిరగడమే. అలా చేస్తే జనానికి ఉన్న భ్రమలన్నీ తొలగిపోతాయి. మనమూ మామూలు మనుషుల లాగానే కనబడతాము. నిన్ను అందరూ ఆహ్వానిస్తారు. కానీ ఆ ఆహ్వానాన్ని స్వీకరించకు. ఒకరిద్దరిని స్నేహితుల్ని మాత్రం ఎంచుకో. చాలామంది నటీనటులు పిలిచిన పేరంటానికల్లా వెళ్ళి, అల్లరి పాలవటం నాకు తెలుసు. జాన్‌డ్రూ ఇలాగే నాశనమైపోయాడు. పిలిచిన వాళ్ళందరి ఇళ్ళకీ వెళ్ళాడు. వారు ఆయనకోసం థియేటర్‌కి వెళ్ళడం మానేశారు. వాళ్ళింటికే హీరో వస్తున్నప్పుడు వాళ్ళెందుకు వెళతారు? నీవు ఒక రకంగా ప్రపంచాన్ని జయించినట్లే. నువ్వు దానిపైన నిలబడే నీ జయకేతనం ఎగురవేయాలి" అంటూ మరెన్నో విషయాలు చెప్పాడు. మేమిద్దరం రెండు ధ్రువాలం. గుడ్‌విన్ ఆయన జీవిత గమనం చివర్లో ఉన్నాడు. నేను ఆరంభంలో ఉన్నాను.

మేమిద్దరం ఆ సముద్ర తీరాన, సంధ్యా సమయాన అలా కబుర్లు చెప్పుకొంటూ గడిపాము. నేను 'కార్‌మెన్' సినిమా ఎడిటింగ్ పూర్తి చేసి, చిన్న పెట్టె సర్దుకొని ఆ సాయంత్రం ఆరుగంటల రైలుకి న్యూయార్క్ బయలుదేరాను. నేను వచ్చే విషయం అన్న సిడ్నీకి తంతి పంపించాను. రైలుబండి న్యూయార్క్ చేరడానికి ఐదురోజులు పట్టింది. నేను ఒంటరిగానే ప్రయాణం చేశాను. నేను మేకప్‌లో లేకపోతే నన్నెవరూ గుర్తు పట్టేవారు కాదు. ఈ రైలుబండి టెక్సాస్ మీదుగా వెళుతోంది. గడ్డం గీసుకోవడానికి స్నానాలగదికి (వాష్‌రూమ్‌కి) వెళ్ళాను. నా ముందు చాలామంది వరుసలో ఉన్నారు.

అప్పటికే నేను అండర్‌వేర్‌తోనే ఉన్నాను. 'అమరిల్లో' స్టేషన్ రాబోతోంది. ప్లాట్‌ఫారం మీద చాలా సందడిగా ఉంది, జనంతో నిండిపోయి ఉంది. జెండాలు కట్టి ఉన్నాయి. ఆ ప్లాట్‌ఫారం మీద బల్లలు వేసి, తినుబండారాలు, పానీయాలు పెట్టి ఉన్నాయి. బహుశా ఏ స్థానిక ప్రబుద్ధ కోసమో చేసి ఉండవచ్చు. ఇంతలోనే రైలుబండి ఆగింది. నేను గడ్డానికి సబ్బు రాసాను. "ఎక్కడ? చాప్లిన్ ఎక్కడ" అని అరుస్తూ జనం

లోపలికి వచ్చారు. అటూ, ఇటూ పరిగెత్తుతున్నారు. కంపార్ట్‌మెంట్‌లో. ఎక్కడున్నాడు చాప్లిన్ అంటూ అరుస్తూ నన్నడిగారు. ముఖం మీద సబ్బుతో 'నేనే' అన్నాను. "అమరిల్లో మేయర్" తరుపున, అభిమానుల అందరి తరుపున మిమ్మల్ని క్రిందకి వచ్చి ఫలహారము, పానీయము తీసుకోమని కోరుతున్నారు. అని ఆహ్వానించారు. నాకు ఒక్కసారిగా కంగారు పుట్టింది. 'ఇట్లా రాలేను నేను' అన్నాను. అప్పుడు వాళ్ళు "మీరవన్నీ పట్టించుకోకండి. ఒక గౌను వేసుకొని క్రిందకు దిగండి" అని అన్నారు. అయినా గబగబా ముఖం కడిగి చొక్కా, టై, కోటు వేసుకొని గుండీలు పెట్టుకొంటూ క్రిందకి దిగాను. క్రింద అంతా గోలగా ఉంది.

మేయరుగారు మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నారు. ఆయన మాటలు జనం కేరింతల్లో వినపడడం లేదు. ఆయన మళ్ళీ "చాప్లిన్‌గారి అభిమానులందరి తరుపున అమరిల్లో" అని అంటుండగా జనం తోసుకొంటూ వచ్చారు. మేయరు నన్ను గుద్దుకున్నాడు. నేను వెళ్ళి రైలుబండికి గుద్దుకున్నాను. అంతటితో ఆత్మ రక్షణలో పడి మేయర్ స్వాగత వచనాలు ఆగిపోయాయి. అంతలో పోలీసులు 'వెనక్కి పొండి, వెనక్కి పొండి' అని అరుస్తూ జనాన్ని వెనక్కి తోసారు. కాసేపటికి అంతా సద్దుమణిగింది. మేయరుగారు మళ్ళీ స్వాగత వచనాలు మొదలుపెట్టాడు. ఒక గరిటెతో టేబుల్ మీద కొడుతూ "మీరు మా మధ్యలోకి రావడం చాలా ఆనంద దాయకం. మాతోపాటు కొన్ని బిస్కట్లు, ఒక కోకాకోలా తీసుకోండి" అన్నాడు. ఆ తరువాత "మీరేమైనా మాట్లాడతారా" అని అడిగాడు. నేను "అమరిల్లోకి రావడం, ఈ కాసేపు గడపడం చాలా ఆనందంగా, ఆశ్చర్యంగా ఉందని" అన్నాను. తరువాత మేయర్‌తో కూర్చొని నేనొస్తున్నట్లు ఎలా తెలిసింది అని అడిగాను. ఆయన టెలిగ్రాఫ్ ఆపరేటర్ చెప్పాడని చెప్పారు.

నేను సిడ్నీకిచ్చిన తంతి ముందు అమరిల్లో, ఆ తరువాత కెన్సాస్‌సిటి షికాగో తరువాత న్యూయార్క్ చేరింది. ఈ నగరాల్లోని తంతి సిబ్బంది, వార్తాపత్రికలకు ఉప్పందించారు. నేను వెళ్ళి రైలులో కూర్చొన్నాను. ఆ తరువాత ప్రయాణంలో అందరూ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ వెళుతున్నారు. ఇదంతా నాకు ఒకప్రక్క ఆనందాన్నీ, ఒకప్రక్క విచారాన్నీ కలిగించింది. నేను స్తబ్దుగా అలా కూర్చొండిపోయాను. బండి బయలుదేరే ముందు చాలా టెలిగ్రామ్‌లు నా చేతిలో పెట్టారు. అందులో ఒకటి 'కెన్సాస్ సిటీకి స్వాగతమ'ని ఇంకొకటి 'మీరు షికాగోలో స్టేషన్ మారాలని, మేము కారు సిద్ధం

చేసామ'ని, ఇంకొకటి 'మీరు మా బ్లాక్‌స్టోన్ హోటల్‌లో అతిథిగా ఉంటా'రని. కెన్సాస్ సిటీ వచ్చేముందు రైలు పట్టాల బారునే జనం నిలబడి ఉన్నారు. అంత పెద్ద స్టేషన్ జనంతో నిండిపోయి ఉంది. జనాన్ని సర్దలేక పోలీసులు తిప్పలు పడుతున్నారు. నేను కూర్చొన్న పెట్టెదగ్గర ఒక నిచ్చెన వేసారు. బోగీ పైకెక్కి అందరికీ కనబడమని. అమరిల్లోలో చెప్పిన మాటలే ఇక్కడా చెప్పాను. తరువాత ఇంకా చాలా టెలిగ్రామ్‌లు నా చేతికి ఇచ్చారు. షికాగో వరకూ ఇదే తంతు. నాకిది ఆనందంగానే ఉంది. కానీ ఆలోచిస్తే ఇంత పిచ్చేమిటా అనిపించింది. ఏదో నాలుగు హాస్యభరితమైన (నవ్వు పుట్టించే) వినోద చిత్రాలకే ఇంత వేలం వెర్రి అయితే ఈ పేరు ప్రఖ్యాతులంతా బూటకమే కదా. నేనెప్పుడూ ప్రజలు నన్ను గుర్తించాలనే కోరుకున్నా. కానీ దురదృష్టవశాత్తూ నన్ను ఒంటరిగా నిలబెడుతున్నారు. ఇది నాకు చాలా విచారకరంగా, దిగులుగా అనిపించింది. షికాగోలో నేను ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు మారాలి.

అక్కడ నాకోసం పొడవాటి కారు సిద్ధం ఉంచారు. బ్లాక్‌స్టోన్ హోటల్ వాళ్ళు నాకోసం పెద్ద గదిని సిద్ధంచేసారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకొని న్యూయార్క్ బయలుదేరాను. బయలుదేరే ముందు న్యూయార్క్ పోలీస్ అధికారినుంచి ఒక టెలిగ్రామ్ వచ్చింది. నన్ను గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లో కాకుండా 125వ వీధి స్టేషన్‌లో దిగిపొమ్మని. ఎందుకని అంటే గ్రాండ్ సెంట్రల్ స్టేషన్ జనంతో నిండిపోయిందని. ఆ 125వ వీధి స్టేషన్ దగ్గర అన్న సిడ్నీ నాకోసం నా కారుతో సిద్ధంగా ఉన్నాడు. నా దగ్గరగా వచ్చి నా చెవిలో "ఏమనుకుంటున్నావు నువ్వు. ఈ రోజు తెల్లవారు ఝామునుంచి అభిమానులు గుంపులుగా చేరుతున్నారు. అన్ని పేపర్లలో నువ్వు లాస్‌ఏంజిల్స్‌లో బయలుదేరిన దగ్గరనుంచి ప్రతిరోజూ వార్తలు ఇస్తూనే ఉన్నారు. ఒక వార్తాపత్రిక చూపించాడు. దాంట్లో తాటికాయంత అక్షరాలతో 'ఇడుగో చాప్లిన్' అని రాసి ఉంది. ఇంకొక దాంట్లో 'కనబడు చాప్లిన్' అని ఇట్లా ఉన్నాయి. హోటల్‌కి వెళ్లే దారిలో సిడ్నీ నాతో చెప్పాడు. మ్యూచువల్ ఫిల్మ్ కార్పొరేషన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నానని. ఆరువందల డెబ్భైవేల డాలర్లు (వారానికి పదివేల డాలర్ల లెక్కన) ఇన్సూరెన్స్ పరీక్ష పాసయిన తరువాత నూటయాభైవేల డాలర్ల బోనస్ (ఒప్పందాల సంతకాలప్పుడు) ఇచ్చే ఏర్పాటు అని చెప్పాడు. అలా చెప్పి తనకి లాయర్‌తో పని వుందని చెప్పి నన్ను ప్లాజా దగ్గర దింపి వెళ్ళిపోయాడు.

నాకు హామ్‌లెట్ మాటలు గుర్తుకొచ్చాయి. "ఇప్పుడు నేను ఒంటరివాణ్ణి." ఆ మధ్యాహ్నం, ఆ సాయంత్రం అక్కడి వీధులన్నీ తిరిగాను. అద్దాల వెనుక వస్తువుల్ని చూసుకొంటూ అలక్ష్యంగా.

ఇప్పుడు నాకు జరగబోయే దేమిటి? నా జీవన గమనంలో నా వృత్తిపరంగా ముఖ్యమైన సందర్భంలో, నా దారేదో తెలియని స్థితిలో ఉన్నాను. వీళ్ళందరికీ నేను తెలుసు. కానీ నాకెవరూ తెలియదు. నాలో దిగులు కమ్ముకొంటోంది. ఒకసారి కీస్టోన్ హాస్యగాడు అనడం నాకు గుర్తొస్తోంది. "ఆc, చార్లీ వచ్చేసాం" అన్నాడు." 'ఎక్కడికీ' అన్నాను. అదే గుర్తొచ్చింది ఇప్పుడు. గుడ్‌విన్ సలహాకూడా గుర్తొచ్చింది. బ్రాడ్‌వేనుంచి దూరంగా ఉండమన్నాడు. విజయాల పటాటోపం నుంచి, దాని ద్వారా వచ్చే కృత్రిమ స్నేహితుల నుంచి దూరంగా ఉండమన్నాడు. ఇప్పుడు నేను నా స్నేహితులు నాకు కావసినవారు ఎక్కడున్నారా అని అన్వేషణ మొదలుపెట్టాను. న్యూయార్క్‌లో వున్నారా? లండన్‌లో వున్నారా? అని ప్రశ్నించుకున్నాను. నా తొలిప్రేమ హెట్టికెల్లీ ఇంకా నా మనసులో ఉంది. కానీ ఆమె గురించి ఏ వార్తా తెలియదు. నేను సినిమాలలోకి వచ్చినప్పటినుంచి ఆమె గురించి వినలేదు. కానీ న్యూయార్క్‌లోనే ఆమె అక్కతోపాటు ఉంటోంది.

నేను నడుస్తూ ఐదో అవెన్యూకి వచ్చాను. ఎనిమిదివందల ముప్ఫైనాలుగు నంబరు ఇంట్లో హెట్టీ సోదరి ఉంటున్నట్టు గుర్తు నాకు. ఆ ఇంటి బయట చాలాసేపు నిలబడ్డాను. హెట్టీ అక్కడ ఉన్నదో లేదో కూడా నాకు తెలియదు. లోపల నుంచి ఆమె బయటికొస్తే బాగుండును అని అనుకుంటూ తిరిగాను. ఒక అరగంటసేపు అక్కడే తిరిగాను. అక్కడినుంచి చైల్డ్స్ రెస్టారెంట్‌కి వెళ్ళి గోధుమ కేకు, కాఫీ ఆర్డరు ఇచ్చాను. అక్కడున్న సేవకురాలు ముందు నన్ను గుర్తు పట్టలేదు. మళ్ళీ వెన్నపూస తెమ్మనప్పుడు గుర్తుపట్టింది.

ఆ తరువాత అంతా కోలాహలమే. వంటింట్లో నుంచి కూడా అందరూ వచ్చేశారు. చివరికి వాళ్ళందరిలో నుంచి బయటపడి టాక్సీ ఎక్కడం పెద్దపనే అయింది. చూసారా మనకు కావలసింది దొరకదు. మనకి అందుబాటులో ఉన్నది మనకు అవసరం ఉండదు.

రెండురోజులు న్యూయార్క్ నగరంలో తిరిగాను ఎవరినీ కలవకుండానే. ఆనందం, ఆవేదన నన్ను ఆవరిస్తూనే ఉన్నాయి. ఈలోపుగా ఇన్సూరెన్స్ వైద్యుల పరీక్షలు

అయిపోయాయి. తరువాత అన్న సిడ్నీ చాలా సంతోషంగా వచ్చి అంతా బాగుంది అన్నాడు. తరువాత అందరిముందూ ఒప్పందాల మీద సంతకాలు చేశాను. లక్షా యాభైవేల డాలర్ల చెక్కు తీసుకొంటుండగా ఫోటో తీసారు. ఆ సాయంత్రం టైమ్స్క్వేర్‌లో నిలబడి అక్కడ చూపిస్తున్న వార్త చూసాను. దాని సారాంశం "చాప్లిన్ మ్యూచువల్ కంపెనీతో సంవత్సరానికి ఆరు లక్షల డెబ్భైవేల డాలర్ల ఒప్పందం కుదిరింది." ఈ వార్తను నేను నాకు సంబంధం లేనట్లుగా చూసాను. ఇప్పటివరకూ నాకు జరిగిన సంఘటనల్లో నాలో ఉద్వేగాన్ని ఎండపెట్టాయి. ఇప్పుడు ఎలా స్పందించాలి?

మనిషిని పేదరికంలాగే సంపద కూడా భయపెడుతుంది. సహజంగానే రెంటి నుంచి పారిపోవాలనే ప్రయత్నిస్తుంటాడు మనిషి.

పన్నెండవ అధ్యాయం

సినిమాలూ – సంపదా

ఒంటరితనం చికాకు పుట్టిస్తుంది. దానిలో ఒక దిగులు దాగి వుంటుంది. ఏదో తెలియని లోటు. సిగ్గరితనం కూడా చోటు చేసుకుని చికాకు కల్గిస్తుంది. కాని ఈ జాడ్యం అందరికీ వుండేదే. ఒంటరితనం చాలా విసుగ్గా వుంటోంది. నిస్పృహ గలిగిస్తోంది. నాకన్నీ వున్నాయి. వయస్సు – సంపద – పేరు ప్రఖ్యాతులు. కాని స్నేహం కోసం న్యూయార్క్ వీధులు ఎందుకు తిరుగుతున్నాను? ఎందుకు ఈ విధంగా కలవరం చెందుతున్నాను? అలా ఏదో కూడలి దగ్గరే జోసీకార్లిమ్స్ ఎంతో అందమైన తార, కలయిక జరిగింది. "ఏమిటి ఒంటరిగా ఏమి చేస్తున్నారు" అని ఎంతో సానుభూతితో అడిగింది. నేనేదో నేరం చేసిన వాడిలాగా సిగ్గుపడి, 'అలా భోజనానికి వెళ్తున్నాను – మీరుకూడా వస్తే సంతోషిస్తాను' అని అనాలని అనుకున్నాను. కాని నా మొహమాటమే అడ్డుపడింది.

ఆ రోజు సాయంత్రమే మెట్రోపాలిటన్ ఒపేరా హాలు దగ్గర్లో David Belasco అల్లుడు మౌరిస్ గెస్ట్ కలిసాడు. ఈయన అంతకుముందు నాకు లాస్ ఏంజలెస్‌లో పరిచయమే. ఈయన టికెట్లు కొని ఎక్కువ ఖరీదుకు అమ్మే వ్యాపారం చేసేవాడు. తర్వాత ఆయన నాటకాల నిర్మాతగా ఎదిగాడు 'The Miracle' (దీనికి మాక్సు రీన్‌హార్ట్ దర్శకత్వం వహించాడు)తో మౌరీసు గొప్పవాడయ్యాడు. మౌరీస్‌వి పెద్ద బాదంకాయ కళ్లు. పెద్దనోరు – లావుపాటి పెదాలు – ఇదీ ఆకారం! చాలా ఉద్వేగంతో మాట్లాడేవాడు. మాటల్లో మనల్ని పడేసేవాడు!

"ఎక్కడికి పోతావు!" ఇంకా నేను మాట్లాడకముందే "నాకు ఫోన్ చేయలేదేమి?" అంటూ దబాయించేవాడు. నేను 'అలా నడుస్తున్నాను' అనేవాడిని. 'ఒంటరిగానా?

నువ్వు ఒంటరిగా వుండకూడదు. ఇప్పుడు ఎక్కడికి? అలా చల్లగాలికి అంటే నన్ను వెనక్కు తిప్పిరా, నాతో నీకు సరయిన మిత్రుల్ని పరిచయం చేస్తాను' అని తీసుకెళ్తాడు. 'ఎక్కడికీ' అని గోలచేసేవాడిని. 'నీకు నా స్నేహితుడు – కారుసోను పరిచయం చేస్తాను.' ఈ రోజు మధ్యాహ్నం 'కార్మేన్' వుంది. కారుసో, హెరాల్డిన్ వస్తున్నారు' అని ఒపేరా హౌస్‌లోకి తీసుకువెళ్లి ముందు వరుసలో రెండు ఖాళీ సోఫాలలో కూర్చోబెట్టి – మెల్లగా నీవు చూస్తుండు, ఇప్పుడే వస్తానని మాయమయ్యాడు! నేను "కార్మేన్" సంగీతం చాలాసార్లు విన్నాను. ఇప్పుడు వినపడేది వేరుగా వుంది. నాకు గందరగోళంగా వుంది. ఇంకా రెండు నిమిషాలలో అయిపోతుందనగా గెస్ట్ మెల్లగా వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు. 'ఇది 'కార్మెన్' ఏనా?" రహస్యంగా అడిగాను. 'నీ దగ్గర ప్రోగ్రాం కాగితం లేదా' అని ఎదురు ప్రశ్న. 'చూడు – కారుసో, గెరాల్డిన్ బుధవారం మధ్యాహ్నం కార్మెన్" అన్నాడు. ఇంతలో తెర దిగిపోయింది.

నన్ను చేయి పట్టుకొని స్టేజి వెనకకు తీసుకుపోయాడు. నిశ్శబ్దంగా అక్కడి దృశ్యాన్ని మారుస్తున్నారు స్టేజి కుర్రాళ్ళు. అక్కడి వాతవారణం చెదిరిపోయిన కలలాగా వుంది. అందులో నుంచి ఎత్తైన హుందాగా వున్న వ్యక్తి. ఎర్రని కళ్ళతో నన్ను చూశాడు కిందికి (నేను పొట్టి కదా!). అతను ఆ స్టేజి మధ్యలో నిలబడి వున్నాడు. దృశ్యాన్ని మారుస్తున్న కుర్రాళ్లకు అడ్డంగానే వున్నాము.

"ఎలా వున్నారు గట్టీ – కసజా?" అని గెస్ట్ అడిగాడు. ఏదో గొణిగి – అవును నీవన్నది నిజమే. ఇది 'కార్మన్' కాదు. 'రిగోవెట్టో'. చివరి నిమిషంలో గెరాల్డెన్ రాలేనని చెప్పాడట." అని నన్ను పరిచయం చేసి 'ఇప్పుడు 'కారుసో'ని కలుస్తాం – ఆ గది ఎక్కడ?" అన్నాడు. 'అదిగో స్టేజీ మేనేజరు చూపిస్తాడు' అని కసజా ఆయన పనిలో పడిపోయాడు. 'రా చార్లీ 'కారుసో'ని కలుద్దాం' అని కదిలాడు. నేను 'ఇప్పుడెందుకు, షో మధ్యలో' అని నేనంటుండగానే – 'ఏమీ పర్వాలేదు' రా' అని లాక్కెళ్లాడు. ఇంతలో అక్కడ లైటు పోయింది. చీకట్లో మేము తచ్చాడుతున్నాం. 'కారుసో' గదికోసం మేనేజరు 'నేను లైటు వేస్తాను' అన్నాడు.

గెస్ట్ 'చూడు నాకోసం జనం ఎదురు చూస్తుంటారు అర్జంటుగా వెళ్లాలి' అన్నాడు. 'నన్ను వదిలి పోతున్నావా?' అని ఆందోళన పడ్డాను. 'ఏమీ ఫర్వాలేదు – నీకంతా బాగానే వుంటుంది' అంటూ నేను మాట్లాడేలోపు అదృశ్యమైపోయాడు.

ఇంతలో స్టేజీ మేనేజరు అగ్గిపుల్ల వెలిగించి 'ఇదిగో – ఇదే' అని తలుపు తట్టాడు. లోపలినుంచి గట్టిగా కేక వినిపించింది, ఇటాలియన్‌లో. మేనేజర్ ఇటాలియన్‌లోనే సమాధానం చెప్పి, చివర 'చార్లీ చాప్లిన్' అని కలిపాడు. మళ్లీ లోపల నుంచి పిడుగులా శబ్దం. 'మరోసారి వద్దాం' అని నేను జారుకోబోయాను. కాని మేనేజరు వదల్లేదు. ఇంతలో తలుపు ఓరగా తెరుచుకుని ఎవరో తొంగిచూశారు. మేనేజర్ నన్ను చూసి 'చార్లీ చాప్లిన్' అని నసిగాడు. అప్పుడు తలుపు తెరుచుకుంది. 'లోపలికి రండి' అంటూ.

మేము లోపలికి వెళ్లేసరికి కారుసో అద్దం ముందు కూర్చొని వున్నాడు. మీసాలు పెట్టుకుంటూ, మా వంక తిరగకుండానే అద్దంలో చూస్తున్నాడు. నాతో వచ్చిన మేనేజర్ "సార్ ఈయన సినిమాలో నటించే చార్లీచాప్లిన్" అని నన్ను కాస్త ముందుకు తోసాడు! ఆయన ఇంకా మీసం అంటించుకుంటూనే వున్నాడు. అద్దంలో నన్ను చూసి బెల్టు పెట్టుకుంటూ 'మీ సినిమాలు బాగా ఆడుతున్నాయనుకుంటా?"

'అవును' అన్నాను. "చాలా ఆనందంగా వుండి వుండాలి మీరు" అన్నాడు. అంతలో మేనేజర్ వెళ్తానన్నట్లు చూశాడు. నేను "టోరియాడోర్" దృశ్యం తప్పకచూడాలి. మేము వెళ్తాం అన్నాను. ఓ అది కార్మెన్ కదా – ఇది 'రిగోలెట్టో' అని గట్టిగా నవ్వాడు. అప్పుడు నాకు నవ్వాగలేదు. ఈ విధంగా న్యూయార్క్‌లో తిరగవలసినవి – కలవవలసినవాళ్లు – ఆస్వాదించదగినవి – అన్ని పూర్తి చేసి వీలయినంతవరకూ ఇంక తిరుగు ప్రయాణం, కొత్త ఒప్పందం క్రింద పని మొదలు పెట్టాలనే ఉత్సాహంతో ఆలోచిస్తున్నాను. ఆ వెంటనే లాస్ ఏంజెలెస్ ప్రయాణమై పోయాను. లాస్‌ఏంజెల్స్ చేరిం తర్వాత అలెగ్జాండ్రియా హోటల్‌లో బసచేశాను. ఇది చాలా డాబుసరి హోటల్. పాలరాతి స్తంభాలు, పెద్ద పెద్ద షాండిలీరు దీపాలు, ఖరీదయిన తివాచీలు ఇదీ ఈ హోటల్ ప్రత్యేకత.

ఇక్కడ లాబీలోని తివాచీకి ప్రత్యేకత వుంది. అది 'అదృష్ట తివాచీ'గా పేరు పొందింది. చాలామంది సినిమావాళ్లు ఆ తివాచీ మీద నిలబడే కోట్ల డాలర్ల ఒప్పందాలు, బేరాలు చేసేవారు. అబ్రహామ్‌సన్ అనే ఆయన ఇక్కడే తన సంపదనంతా ప్రణాళిక ప్రకారం పొందాడు. అతను చాలా చౌకబారు సినిమాలు అమ్మి, స్టూడియోలో ఖాళీ సమయాన్ని సొమ్ము చేసుకుని సంపాదించాడు. కొలంబియా కంపెనీ హారీకొహెడ్ కూడా తన వ్యాపకాన్ని ఇక్కడే ఇలాగే మొదలు పెట్టాడు. అబ్రహామ్‌సన్ చాలా నిజాయితీగల యధార్థవాది.

తనకు 'కళ' అంటే నమ్మకం లేదు. కేవలం డబ్బు సంపాదించడమే తన ప్రాధాన్యత అని తన రష్యన్ యాసలో చెప్పాడు. అతను తీసిన సినిమాలన్ని మరీ నేలబారుగా వుండి, హీరోయిన్‌ని అన్ని కోణాలలో చూపించి సొమ్ము చేసుకునేవాడు. ఈ విధంగానే రెండు మిలియన్ల డాలర్లు సంపాదించి, హాయిగా వృత్తిపరంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ తివాచీ మీదకి సిడ్ గ్రూమెన్ సాన్‌ఫ్రాన్సిస్కో నుంచి తన కోట్ల విలువచేసే లాస్ ఎంజెలెస్ థియేటర్ గురించి బేరాలకోసం వచ్చాడు. ఆయన ఆలోచనలన్నీ వింతగా వుంటాయి.

సిడ్ ప్రచారంలో చాలా ముందుంటాడు. ఒకసారి రెండు టాక్సీలను ఒకదాని వెంట ఒకటి పరుగెత్తించాడు. దానిలో వింతేముంది? దానిలో వున్నవాళ్లు వుత్తుత్తి తూటాలతో ఒకరిమీద ఒకరు తుపాకులు పేల్చుకుంటారు. ఆ టాక్సీలకు 'సిడ్" మిలియన్ డాలర్ల థియేటర్ల చీకటి వీరులు" అని ప్రచారపు బొమ్మలు పెట్టి వుంటాయి. ఆ విధంగా లాస్ ఏంజెలెస్ అంతా తిరిగి హడావుడి చేస్తారు! ఆయన కొత్త థియేటర్ బైట హాలీవుడ్ తారలతో అడుగులు – చేతిముద్రలు తడి సిమెంటుతో వేయించాడు!

నేను హోటల్‌లో దిగిన మొదటిరోజున మేనేజరు నాకు ఒక వుత్తరం ఇచ్చాడు. అది ప్రముఖ అందాల తార మాడీఫీలీ పంపింది. డిన్నర్‌కి రమ్మని. చాలా ఆనందం కలిగింది. నా సెక్రెటరీని ఫోన్ చెయ్యమన్నాను. డిన్నర్ బట్టల్లో రావాలా – మామూలుగా రావచ్చా – అని. ఆ రెండోవైపు 'ఎవరు మాట్లాడేది' అని నా సెక్రెటరీ అని తెలుసుకుని 'ఫర్వాలేదు – మామూలుగానే' అంది.

నేను వెళ్లేసరికి ఫీలీ – హాలీవుడ్ హోటల్ బాల్కనీలో నాకోసమే వేచి చూస్తోంది. చాలా అందంగా వుంది.

బాల్కనీలో కూర్చుని చాలాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. మిగతా అతిథులు వస్తారని చూస్తున్నారు కాని – అడిగితే ఎవరూ రావటల్లేదు అంది. 'మేమిద్దరమేనా?' నాకు ఆశ్చర్యమే. అంతే నా బుర్రలో పిచ్చి ఆలోచనలు వచ్చాయి. మిస్ ఫీలీ మరీ అందగత్తే కాదు. చాలా 'రిజర్వుడు'గా కూడా వుంటుంది. ఈ సమావేశానికి అర్థం ఏమిటి? నాకున్న ఆలోచనలు ఆమెవైపు పంపాను. కాని ఆమె అవేమీ పట్టించుకోలేదు. 'బైటకు వెళ్దామా? పబ్‌కు వెళ్లి...' అన్నాను. 'లేదు నాకు ప్రొద్దున్నే రిహార్సల్ వుంది.

పెందరాళే నిద్రపోవాలి' అంది. అంతటితో నా చలిమంట ఆరిపోయింది! కాని 'మీకు ఈ సాయంత్రం అంత ఉత్సాహకరంగా లేదనుకుంటా' అంది.

"మీకు పావలోవాలో డిన్నర్‌కి రావాలని ఆహ్వానం పంపాను. అప్పుడు మీరు న్యూయార్క్‌లో వున్నారని తెలిసింది." అంది. అప్పుడు నేను ఉత్తరం తీసి చూపాను. దానిమీద తారీఖు నేను చూశాను.

"అవును సరిగ్గా మూడునెలల ఆలస్యంగా వచ్చినట్లున్నాను..." అని గట్టిగా నవ్వుకున్నాము.

లాస్ ఎంజెలెస్‌లో 1910లో చాలామంది పెద్ద గొప్ప వ్యాపారస్తులూ, పారిశ్రామిక వేత్తలూ ఉండేవారు.

విలియమ్ క్లార్క్ – ఈయన రాగి గనుల రాజు. ప్రతీసంవత్సరం సింఫనీ ఆర్కెస్ట్రా వారికి 1,50,000 డాలర్లు ఇచ్చేవాడు. ఈయన వయొలిన్ కూడా వాయించేవాడు.

స్కాటీ అనే ఆయన రియల్ ఎస్టేట్ ఆసామి. వందల – వేల డాలర్ల పార్టీలు ఇచ్చేవాడు. వెయిటర్లకీ వందల్లో టిప్పులిచ్చేవాడు. రాత్రికి మాయమయ్యేవాడు. మళ్లీ నెలకో, ఆ తర్వాతో వచ్చి మళ్లీ పార్టీలు డబ్బు నీళ్లలాగా ఖర్చుపెట్టేవాడు. ఈయనకు డబ్బు ఎలా ఎక్కడనుంచి వచ్చేదో తెలిసేది కాదు. డెత్‌వాలీలో ఏదో గని వుందని పుకారు. కొందరు ఈయనతో అక్కడకు వెళ్ళాలని ప్రయత్నించారు కాని కుదరలేదు. 1960లో ఈయన చనిపోయేవరకు ఈ రహస్యం ఎవరికీ తెలీదు. డెత్‌వాలీలో ఒక చిన్న 'కాటేజ్'లాంటిది మాత్రం వుంది, ఇప్పటికీ!

కానీ గాట్స్ అనే ఆవిడకు 40 మిలియన్ డాలర్లు ఉండేవి.

ఈమె సోషలిస్ట్. ప్రభుత్వ వ్యతిరేకులకూ, సోషలిస్ట్ నాయకులకూ కోర్టు ఖర్చులకు డబ్బిచ్చేది.

రైస్ కర్టిస్ విమానం విన్యాసాలు చేసేవాడు. అప్పుడు డబ్బుకోసం చాలా ప్రయత్నం చేశాడు. ఇప్పుడు చాలాపెద్ద విమానాల కంపెనీ!

ఏ.పి. గియానికి రెండు బాంకులుండేవి. తర్వాత వాటినే బ్యాంక్ ఆఫ్ అమెరికాగా అభివృద్ధి పరిచాడు.

హోవర్డ్ హగ్స్ పెద్ద సంపదకు వారసుడు. అవే పెట్రోలు డ్రిల్లింగ్ యంత్రాలు. తర్వాత విమానాల తయారీలో ఆరితేరాడు. అంత పెద్ద పారిశ్రామికవేత్త చెత్త హోటల్స్‌లో వుండేవాడు. అదొకరకమైన వింత ప్రవర్తనే. ఆయన అప్పుడప్పుడు సినిమాలు తీశాడు. 'హెల్స్ ఏంజెల్స్' అని. ఆ పేరు చూడండి! వీళ్లందరూ నాతో స్నేహంగా వుండేవారు. నన్ను డిన్నర్లకూ, పార్టీలకూ పిలిచేవారు. ఆ రోజుల్లో నేను శుక్రవారాలు జాక్ డోయిల్స్ చూసేవాడిని. సోమవారాలు సంగీత రూపకాలకు, గురువారాలు మొరోస్కో ధియేటర్‌కీ వెళ్లేవాడిని. అప్పుడప్పుడు సింఫనీ ఆర్కెస్ట్రాకి కూడా వెళ్లి కూర్చునేవాడిని.

వాలెంటీనో చిన్న చిన్న వేషాలు వేసేవాడు. కాని అంతగా పేరేమీ లేదు. అప్పుడు నేను క్రీడారంగ క్లబ్బులో వుండేవాడిని. అక్కడే కలిసాడు. తర్వాత సంవత్సరం వరకు కలవలేదు. అప్పటికి పెద్ద తారగా వెలిగిపోతున్నాడు. నన్ను కలిసినపుడు మామూలుగా పలకరించాడు. దూరంగా వుండేవాడు. అప్పుడు 'నీవు దేవతల వరసలో చేరిపోయావు' అన్నాను. అంతే ఆయన బెట్టు అంతా కరిగిపోయింది. తర్వాత చాలా స్నేహంగా వుండేవాడు. ఎప్పుడూ విచారంగా వుండేవాడు. అమ్మాయిలంటే తగని పిచ్చి. ఇతను ఎంతగా ఎగబడేవాడో, వాళ్లు అంతగా మోసం చేసేవారు.

వీళ్లందరూ నాకు సన్నిహితంగా సాయంత్రాలు ఆనందంగా గడపటానికి కలిసేవారు. కాని స్నేహం సంగీతంలాంటిది. నన్ను అలరించాలి. అవసరాలు తీర్చటం కాదు. నా కొత్త ఒప్పందం 6,70,000 వేల డాలర్లు పని మొదలు పెట్టటానికి సిద్ధం అయిపోయాను. నాకోసం ఒక స్టూడియో అద్దెకు తీసుకున్నారు. మంచి నటీనటుల్ని సాంకేతిక సిబ్బందినీ ఇచ్చారు. కాల్‌ఫీల్డ్ ఇక్కడే వుండేవాడు, వ్యాపారం అవసరాలు చూస్తూ – మ్యూచ్యువల్ ఫిలిం కార్పోరేషన్ తరఫున.

నా మొదటి సినిమా (Floor walker) ఇది 'కదిలే నిచ్చెన' తో తీసాను. బాగా విజయవంతం అయ్యింది. అప్పుడు సెన్నెట్ ఈ 'కదిలే నిచ్చెన' ఆలోచన మాకెందుకు రాలేదు? అన్నాడు. నాకు బాగా విశ్వాసం కుదిరింది. వరసనే Fireman, Vagabond, One. AM, The Court, The Pawnshop, Behind the Screen, The rink, Easy Street, The cure, THe immigrant, THe Adventurer. అన్నీ 16 నెలల్లో తీసాను. ఒప్పందం ప్రకారం అన్ని పూర్తయినట్లే. మధ్యలో జలుబులు, పార్టీలు కాలయాపనతో సహా.

అప్పుడప్పుడు కథలు ఇబ్బంది పెట్టేవి. మధ్యలో ఆగిపోయేవి. ఎంత ఆలోచించినా ముందుకు సాగేది కాదు. అప్పుడు అందర్నీ పంపించి ఒక్కణ్ణే సెట్‌లో కూర్చొనేవాడిని. లేదా వెనకగా నీడల్లో నడుస్తూ ఆలోచించేవాడిని. ఒక్కోసారి వెంటనే ఆలోచన తట్టేది. ఒక్కోసారి రోజంతా కుదిరేది కాదు. అలా గచ్చుమీద దుమ్ములేచి కింద పూలు కనపడినట్లు స్పష్టంగా దృష్టికి వచ్చేది. ఇదంతా కాల్‌ఫీల్డు గమనిస్తూ ఉండేవాడు. నిర్మాణ ఖర్చులు వాళ్లవే కదా. అన్నీ జాగ్రత్తగా చూసేవాడు. 'పరిష్కారం వస్తుంది' అనేవాడు.

ఆలోచన రాగానే అందర్ని పరిగెత్తించేవాడిని. ఇన్ని సినిమాలు తీసినా ఒక్కళ్లకూ దెబ్బలు – తగల్లేదు. ప్రమాదాలు లేవు. ఆ విషయంలో అందరం జాగ్రత్త పడేవాళ్లం. ఒక్కసారే నా ముక్కు పగిలింది. రెండు కుట్లు పడ్డాయి.

ఈ ఒప్పందం పూర్తవటం నాకు చాలా తృప్తీ, ఆనందం కలిగాయి. ఇప్పుడు నాకు ఏ ఒప్పందాల బంధాలూ లేవు! నా బాంకులో బాగా డబ్బు చేరింది. నాకు చాలా పేరు వచ్చింది. ఇప్పుడు నా వయసు 27 మాత్రమే! ఎంతో ప్రపంచం నా ముందుంది.

ఇప్పుడు అందరూ నన్ను చూసి స్నేహంగా వుండేవాళ్లు నాకు ఏదయినా సమస్య వస్తే వాళ్లు తీర్చటానికి సిద్ధంగా వుండేవారు. అయినా నాకు ఇవన్నీ ముఖ్యం కాదు.

జె.పి. మోర్గన్ స్నేహితుడు. ఎలియట్ అనేవాడు "డబ్బు వుందా మర్చిపో మంచిది." అని. నేను 'అది గుర్తుంచుకోవలసింది' అని నవ్వేవాడిని. విజయం కొత్త ద్వారాలు తెరుస్తుంది. అక్కడ కొత్త వ్యక్తులు తారసపడతారు!

ఈ ఒప్పందం అయిపోతుండగా అన్న సిడ్నీ వచ్చాడు. 'చార్లీ ఇప్పుడు నీవు మిలీనియర్‌వి! ఇప్పుడే ఒక ఒప్పందం ఖరారు చేసాను. 1 మిలియన్ 200 డాలర్లు! నేను అప్పుడే స్నానంచేసి తుండు కట్టుకు తిరుగుతున్నా వయొలిన్ వాయిస్తూ. "ఆ అద్భుతం! అన్నాను" అప్పుడు సిడ్ని ఈ దృశ్యం తప్పనిసరిగా రాసుకోవల్సిందే. నువ్వు తుండుతో తిరగటం, నేను 1 మిలియన్ 200 డాలర్ల ఒప్పందం తేవటం దానికి నీ స్పందన" ఆహా అంటూ నవ్వాడు. కాని ఈ డబ్బు ఊరికే రాదు. సంపాదించాలి కదా! ఇప్పుడు నా స్టేటస్ (అంతస్తు చూపించాలి) ఈ ఆలోచన వచ్చింది. ఇద్దరం బయటకు వెళ్లాం. ఒక కార్ల షోరూంలో ఏడుగురు కూర్చునే పెద్దకారు ఉంది. 'ఎంత' అన్నా '4900 డాలర్లు' అన్నాడు. పార్సెల్ చేయి అన్నాను! మీరు కారు చూడరా? అన్నాడు.

'నాకేమీ తెలియదుకదా' అంటూ ఒక టైర్‌మీద వేలితో నొక్కాను. ఈ వ్యవహారం చాలా తేలికగా జరిగింది. నా పేరు ఒక కాగితం మీద రాసి ఇవ్వటమే. కారు ఇక నాదే.

నాకు డబ్బు గురించి ఏమీ తెలియదు. కాని సిడ్నీకి తెలుసు. షేర్లు ఎ,బి రేటింగ్స్ షేర్లు మార్చుకోవటం, బాండ్లు పరిశ్రమలు – వడ్డీ వ్యాపారం సెక్యూరిటీలు, పొదుపు ఖాతాలు – అన్నీ. ఆ రోజుల్లో పెట్టుబడులు బాగా లాభాలు తెచ్చేవి. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి నన్ను వాటా కలవమన్నాడు. 2 1/2 లక్షల డాలర్లు నేను కలిసి ఉంటే 50 మిలియన్లు వచ్చేవి.

డబ్బు–సంపద కనపడదు.

అంకెలు, అవసరానికి మించిన సామానే. ఇందులోనే దాగి వుంటుంది! సంపద!

పదమూడవ అధ్యాయం

ప్రముఖులతో పరిచయాలు

నేను పనిచేస్తున్న స్టూడియోకి చాలా పేరుప్రఖ్యాతలున్న మహామహులు వచ్చేవారు. వారిలో మెల్బా, లియోపాల్డ్, గోడోస్కీ, పాడిరిస్కి, నిన్‌జిస్కీ, పావలోవా ప్రముఖులు కొద్దిమంది. పాడిరిస్కి చాలా విలాసంగా వుండేవాడు. తన గొప్పతనం ప్రదర్శిస్తూ తలెత్తుకు తిరిగేవాడు. ఆయన పొడవాటిజుట్టు చాలా ఆకర్షణీయంగా వుండేది. సన్నగా వంగిన మీసకట్టు, కింది పెదవి క్రిందుగా చిన్న వెంట్రుకల గుబురు! ఇదంతా చాలా మాయగా వుండేది. గర్వం ప్రదర్శిస్తున్నట్లుగా.

ఆయన పాడేచోట, దీపాలు తగ్గించి, ఒక అద్భుతమైన వాతావరణం కల్పించేవారు. ఆయన పియోనా దగ్గర కూర్చునే ముందు – ఎవ్వరైనా ఆ బల్ల లాగివేస్తే బాగుండునని అనుకునేవాడిని! యుద్ధం జరుగుతున్న రోజులు – ఒకసారి న్యూయార్క్ రిట్జి హోటల్‌లో కలిసినప్పుడు ఎంతో ఉత్సాహంగా పలకరించాను. 'ఏమిటి ప్రదర్శన చూస్తున్నారా?' అని. చాలా సీరియస్‌గా ముఖం పెట్టి 'నేను నా దేశ సేవలో వున్నప్పుడు ప్రదర్శనలు ఇవ్వను' అని గొప్పగా చెప్పాడు.

పాడిరిస్కి తర్వాత పోలాండ్ ప్రధానమంత్రి అయ్యాడు. కాని నాకెప్పుడూ ఆయన్ను అడగాలని అనిపించేది. విఫలమైన వెర్ససెల్లీస్ ఒప్పందంకోసం 'మీలాంటి ప్రతిభగల కళాకారుడు – ఒక రాజకీయవేత్తగా దిగజారిపోవటం ఎలా జరిగింది' అని.

లియోపాల్డ్ గోడోస్కి చాలా గొప్ప పియానో వాద్యకారుడు. చాలా సాదాసీదాగా నవ్వుతూ వుండేవాడు. లాస్‌ఎంజెలిస్ లో ప్రదర్శన తర్వాత ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. అక్కడకు నేను చాలాసార్లు వెళ్లాను. ఆదివారాలు ఆయన సాధన చేయటం

వినే భాగ్యం కలిగేది. ఆయన చిన్ని చేతుల వేళ్లు పియానో మెట్లమీద నాట్యం చేయటం వింతగా చూసేవాడిని.

నింజిస్కీ, రష్యన్ బాలే ఒప్పందంతో స్టూడియోకి వచ్చాడు. ఆయన చాలా సీరియస్‌గా వుండేవాడు. అందంగా కూడా కనపడేవాడు. కళ్లు ఎప్పుడూ విచారంగా వుండేవి. ఒక సన్యాసి మామూలు బట్టల్లో వున్నాడేమో అనిపించేది. అప్పుడు ది క్యూర్ చిత్రీకరిస్తున్నాము. ఆయన కెమెరా వెనక కూర్చున్నాడు. నేను కొన్ని నవ్వించే చేష్టలు చేస్తున్నాను. కాని ఎప్పుడూ నవ్వలేదు. మిగతావాళ్లందరూ నవ్వుతున్నారు. కాని నింజిస్కీ ఇంకా విచారంగా కనిపించాడు. చివర్లో నా దగ్గరకు వచ్చి అభినందించాడు. మళ్లీ రావచ్చా అని అడిగాడు. 'తప్పని సరిగా' అన్నాను. మరో రెండు రోజులు ఇలాగే జరిగింది. ఆయన కనీసం చిరునవ్వు కూడా చిందించలేదు! చివరి రోజున నేను కెమెరాలో ఫిల్మ్ లేకుండా చిత్రీకరించటం మొదలు పెట్టాను. ఎందుకంటే నింజిస్కీ వుంటే నేను హాస్యం పండించలేక పోతానేమోనని ఆలోచన వచ్చిందికూడా! చివర్లో నా దగ్గరకు వచ్చి 'చాలా బాగుంది. ఇది బలే బాగా వుంది. నీవు నాట్యం చేస్తున్నావు' అన్నాడు. నేను ఇంతవరకు రష్యన్ బాలే చూడలేదు. అదేకాదు ఏ బాలే చూడలేదు. ఆ వారాంతం మాటినీకు వెళ్లాను. థియేటర్ దగ్గర డయాగిలేవ్ ఆహ్వానించాడు.

మొదటి భాగం 'షెహరాజెడి.' ఇది అంతగా నచ్చలేదు. అన్నీ మోతాదు మించి వున్నాయి. తర్వాత నింజిస్కీ వచ్చాడు. 'పాస్ డి డాక్స్.' ఆయన రావటంతోనే నేను అదిరిపోయాను. నేను చాలా కొద్దిమంది మేధావులను చూశాను. అందులో నింజిస్కీ ఒకడు. ఆయన మనల్ని మాయ చేస్తాడు. దేవుడులాగా వేరే ప్రపంచాలు చూపిస్తాడు. ఆయన ప్రతి కదలికా కవిత్వమే! ప్రతి అడుగూ మరో వింత లోకంలో ప్రవేశమే! మధ్యలో 'డయాగిలేవ్'ని అడిగాను. ఆయన గదిలోకి తీసుకు వెళ్లమని. ఆయన్ను చూసి మాట్లాడలేకపోయాను. అలాంటి వాళ్లని మెచ్చుకోవాలంటే కేవలం చేతులు కలిపితే చాలదు. ఆయన అలంకరణ చేసుకుంటుంటే నేను మౌనంగా కూర్చున్నాను. కళ్ల కింది ఆకుపచ్చ గీతలు గీసుకుంటున్నాడు. 'ఫౌనే' కోసం! ఏదో అడుగుతున్నాడు నా సినిమాల గురించి. నేను ఏదో చెప్తున్నాను. అంతలో గంట మోగింది. కాని నింజిస్కీ కదల్లేదు. నేను వెళ్లి ప్రేక్షకుల్లో కూర్చుంటాను అన్నాను. 'తొందర్లేదు' వుండండి అన్నాడు. ఇంతలో సంగీతం వినిపించింది. 'మీరు వెళ్లేసమయం కదా' అని లేవబోయాను.

'అబ్బే' అని 'ఆగండి' ఇంకా సంగీతం వినిపించాలి' అన్నాడు. ఇంతలో మేనేజర్ వచ్చాడు. ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారని. తర్వాత ఆయన ప్రదర్శన అద్భుతంగా సాగింది. ఎవ్వరూ ఆయనకు సాటిరారు. ఆయన సృష్టించిన సంగీత వేదన, చీకటి విషాదపు మార్మికత అందులో ఆయన కదలిక గాలిలో తేలుతున్నట్లూ నీటి మీద నడుస్తున్నట్లూ అలవోకగా జరిగిపోయేవి. ఎంతటి అద్భుతమైన ప్రదర్శన!

తర్వాత ఆరునెలలకు ఆయన మతిస్థిమితం తప్పింది. దాని ఆరంభాన్ని నేను ప్రదర్శన చూసిన రోజునే గమనించాను. ప్రేక్షకులు ఎదురు చూస్తున్నప్పుడు నింజిస్కీ సున్నితమైన మనసు, తర్వాత యుద్ధభీభత్స వాతావరణాన్ని తట్టుకోలేక చీకటి లోకాలలో సేద దీరింది.

పావలోవాని కలిశాను. ఈమెను స్నేహితులంతా 'పావ్' అంటారు. అప్పుడు యూనివర్శల్ స్టూడియోలో సినిమా చిత్రీకరణలో వుంది. మేమిద్దరం మంచి స్నేహితులమైపోయాము. విచారించవలసిన విషయమేమంటే ఆమె నటనలోని లాస్యాన్నీ, వేగాన్నీ ఆ పాతతరం సినిమా పట్టుకోలేకపోయింది. ఆ విధంగా ప్రపంచానికి ఒక అద్భుతమైన కళాకారిణి దూరమై పోయింది!

పావ్‌లోవాకి రష్యన్ కాన్సోలేట్ గౌరవ సూచకంగా 'డిన్నర్' ఇచ్చారు. అప్పుడు నేనూ వున్నాను. అది అంతర్జాతీయ వ్యవహారం. చాలా పద్ధతిగా జరిగింది. చాలా ఉపన్యాసాలూ, చర్చలూ జరిగినాయి. కొంతమంది ఫ్రెంచ్‌లో, మిగతావారు రష్యన్‌లో ప్రసంగించారు. నేనొక్కడినే ఆంగ్లంలో మాట్లాడిన గుర్తు. నేను మాట్లాడే ముందు ఒక ప్రొఫెసర్, పావ్‌లోవా ప్రతిభ గురించి చాల గొప్పగా వివరించాడు రష్యన్ భాషలో. ఆ ప్రసంగం మధ్యలో ప్రొఫెసర్ కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. చివరికి వెళ్లి పావొలోవాని గట్టిగా ముద్దు పెట్టుకొని నిష్క్రమించాడు.

ఇంత జరిగిన తరువాత నేను ఏమి మాట్లాడినా చాలా పేలవంగా వుంటుందనుకున్నాను. నేను లేచి నాకు తెలిసిన ఆంగ్ల భాషలో పావలోవా గొప్పతనాన్ని చెప్పలేదు. అందుకని నాకు తెలిసిన చైనా భాషలో అర్థం కాకుండా మాట్లాడి, ఆ ప్రొఫెసర్ కంటే తీవ్రంగా వూగిపోయి పావలోవాని పొగిడి, చివరికి గట్టిగా ఆమెను ముద్దు పెట్టుకుని మా తలలమీద గుడ్డ కప్పి ఆమెతో ముద్దులలో మునిగిపోయాను.

వచ్చిన అతిథులంతా నవ్వుల్తో చప్పట్లతో హోరెత్తించారు. అంతటితో అప్పటివరకు ఎంతో గంభీరంగా సాగిన ఆ వ్యవహారం తేలికగా సాగింది.

సారాబ్రెండెట్ ఆర్పెకులో సంగీత రూపకాలు వేసేది. అప్పటికి ఆమె నటనాపరంగా చివరి రోజుల్లో వుంది. ఆమె ప్రతిభను నేను చూసే అవకాశమే కలగలేదు. కాని, డూస్, లాస్‌ఎంజెలిస్ వచ్చినపుడు వయసు మీరుతున్నా ఆమె ప్రతిభ ఏమాత్రం తగ్గలేదు. ఆమెకు ఇటాలియన్ గ్రూపు బాగా ప్రోత్సాహం ఇచ్చేది. ఆమె స్టేజిమీదకు రాకముందు ఒక అందమైన యువకుడు చక్కగా నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరించేవాడు.

ఈ యువకునితో డూస్ ఎలా సరితూగగలదని నేను ఆశ్చర్యపోయేవాడిని. అప్పుడు ఎడమవైపు రంగంనుంచి ఎత్తుగావున్న స్థలంమీద ఆర్చికిందుగా వచ్చేది. చేతుల్లో తెల్లని పూవులు బుట్ట తెచ్చి పియానోమీద పెట్టేది. ఆ పూలను సరిచేస్తూ. ఆమె నాజూకైన చేతులు గాలిలో తిప్పేది. అప్పుడు ప్రేక్షకులు ఎంతో మెచ్చుకుంటూ గుసగుసలాడేవారు. అంతటితో ఆ యువకుని మీదనుంచి దృష్టి మళ్ళీ డూస్‌నే చూసేవారం. ఆమె అలా పూలు సరిచేసి మెల్లగా నాజూకుగా అక్కడి చలిమంట వైపు వచ్చేది. అక్కడ కుర్చీలో కూర్చొని ఆ యువకుని అలవోకగా చూసి మళ్లీ తన చూపు – అందులో మానవజాతి జ్ఞానం – దుఃఖం కలగలిసి వుండేవి – చలిమంటవైపు మరల్చేది. అతని ఆర్ద్రత లేని మాటలకు తన చేతులు ఎంతో సున్నితమైనవి. నాజూకు వ్రేళ్లు చలికి వెచ్చబెట్టుకుంటూ ఒక ఉద్వేగభరితమైన గొంతుతో మాట్లాడేది. నాకు ఒక్క మాటా అర్థం కాకపోయినా ఒక గొప్ప కళాకారిణిని చూస్తున్నట్లుగా వుండేది.

కాన్సెన్స్ కోలియర్, ఈమె లేడీ మేకబెత్‌గా సర్ హెర్బ్‌ర్ట్ ప్రక్కన నటించేది. ట్రైయాంగిల్ ఫిల్మ్ కంపెనీకి. ఒకరోజు లెవీ కేఫ్‌లో నేను కూర్చున్నచోటుకి చిన్ని చీటీ వచ్చింది. 'మిస్ కోలియర్ మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు – ఆమె కూర్చున్న బల్ల దగ్గరకు రాగలరా' అని. ఎన్నిసార్లు నా చిన్నతనంలో ఈమెను ఆలివర్ ట్విస్ట్‌లో నాన్నీగా చూశాను. 'ఎటర్నల్‌సిటీ'లో చూశాను. ఆమెను కలవటంకంటే ఆనందం ఏముంటుంది? ఆరోజు నుంచి మేము జీవితాంతం స్నేహితులగానే వుండిపోయాం! ఆమె చాలా ఆత్మీయురాలు. ఎంతో జీవకళ తొణికిసలాడే ఆమె ప్రవర్తన అందర్నీ ఆకర్షించేది. అందర్నీ కలపాలని తాపత్రేయపడేది.

సర్ హెర్బర్ట్‌ట్రీ ఈయన ఇంగ్లీషు నాటక రంగానికి డీన్‌లాంటివాడు. అటు మనసుకూ – ఇటు ఉద్వేగానికీ సమానంగా హత్తుకుపోయేది ఆయన నటన.

'ఆలివర్ ట్విస్ట్'లో ఫాగిన్ వేషం చాలా హాస్యంగాను – ఎంతో భయంకరంగానూ వుండేది. కొద్దిపాటి కదలికలతో ప్రేక్షకులకు భయం కలిగించేవాడు. ఈయన ఒక పాత్రలో వేయమంటే చాలా అలవోకగా పరకాయ ప్రవేశం చేసి మన కళ్లముందు నిలబెట్టేవాడు. ఆయన స్వెంగాలి పాత్ర దీనికి తార్కాణం. ఇది ఒక అర్థంలేని పాత్ర. కాని దాన్నే హాస్యంతో నింపి, ఒక కవిత్వంలాగా మలిచేవాడు. విమర్శకులు సర్ హెర్బర్ట్‌నూ తరచూ ఆయన పోకడలనూ ఒక పిచ్చి అలవాటుగా చెప్పేవారు. కాని ఆ అలవాట్లని ఆయన చాలా ప్రభావంగా వుపయోగించేవాడు. ఆయన నటించిన జూలియస్ సీజర్ – చాలా మేధోపరమైన పద్ధతిలో వుండేది. మార్క్ ఏంటొని – ఆ అంత్యక్రియల సమయంలో మామూలు పద్ధతికి భిన్నంగా ఆ ప్రజలకు పై ఎత్తున వున్నట్లు – వారంతా విరక్తి చెందినట్లూ మాట్లాడేవారు.

నేను 14 ఏండ్ల వయసులో హెర్బర్ట్‌ట్రీని రంగంపై చూశాను. ఇప్పుడు కాన్ట్లెంన్సు నాతో ఆయనతో ఒక సాయంత్రం డిన్నర్ ఏర్పాటు చేసినప్పుడు నాకు చాలా ఉత్సాహం కలిగింది. మేమంతా అలెగ్జాండ్రియా హోటల్‌లో కలవాలి. నేను కావాలనే ఆలస్యం చేశాను. నాకంటే ముందు కాన్ట్లెంన్సు వచ్చి వుంటుంది. నా మీద ఒత్తిడి తగ్గుతుందని. కాని నేను వెళ్లేసరికి నన్ను ఆయన గదికి ఆహ్వానించాడు. ఆయన ఒక్కడే వున్నాడు. ఆయన సినిమా దర్శకుడు – జాక్ ఎమర్సన్ కూడా వున్నాడు. "రండి–రండి చాప్లిన్. మీ గురించి చాలా విన్నాను, కాన్ట్లెంన్స్ చెపుతుంటుంది." అని ఆహ్వానించాడు. నన్ను ఎమర్సన్‌కి పరిచయం చేశాడు. ఇప్పుడు "మాక్‌బెత్ ప్రదర్శన గురించి చర్చిస్తున్నాము." తర్వాత ఎమర్సన్ వెళ్లిపోయాడు. నన్ను ఒక్కసారిగా బిడియం ఆవహించింది.

అప్పుడు ఆయన అన్నారు – "సారీ చాప్లిన్ నిన్ను ఇబ్బంది పెట్టాను. మేము, మాక్‌బెత్ – దెయ్యం సీను గురించి ఆలోచిస్తున్నాము...." "అలాగా – అద్భుతం" అని గొణిగాను.

"అవును నీకు చాలా పేరు వచ్చింది ప్రపంచ వ్యాప్తంగా."

'ఆc అంత లేదండీ' అంటూ సణిగాను.

"లేదు చార్లీ, ఇంగ్లాండులో, ఫ్రాంసులో సైనికులు నీమీద పాటలు పాడుతున్నారు!"

"అలాగా, నాకు తెలీదండీ" అన్నాను అమాయకంగా. అప్పుడు ఆయన నావంక పరీక్షగా చూశాడు. కాస్త అనుమానంగా కూడా. అప్పుడు, 'ఇంకా కాన్సెస్టెన్స్ రాలేదే, ఫోన్ చేస్తాను' అని, 'నీవు మా అమ్మాయి ఐరిస్‌ని కలవాలి' అన్నాడు.

నాకు చాలా హాయిగా అన్పించింది. అంతలో పొడవాటి అమ్మాయి గదిలోకి వచ్చింది, సిగరెట్టు కాలుస్తూ. "ఎలా వున్నారు చాప్లిన్?" అంటూ చేయందించింది. 'బహుశా నేనొక్కదాన్ని మిమ్మల్ని తెరమీద చూడలేదనుకుంటా!' ఐరిస్, స్కాన్‌డినేవియన్‌లా అనిపించింది. పొట్టిపొగాకు జుట్టు, చట్టిముక్కు, లేత నీలిరంగు కళ్లు.' అప్పుడు ఆమెకు 18 ఏండ్లు ఉంటాయేమో! చాలా అందంగా, విశిష్టంగా, సంస్కారవంతంగా కన్పిస్తోంది. ఆ వయస్సులో ఒక కవితల పుస్తకం ప్రచురించింది. మీ గురించి కాన్సెంస్సు చాలా చెప్తుంటుంది.' నేను నవ్వి వూరుకున్నాను. అంతలో సర్ హెర్బర్ట్ వచ్చారు. 'కాన్సెంసు రావటం లేదు. మనం భోజనం చేద్దాం' అన్నారు.

ఓరి దేవుడా ఎలా ఈ అపరిచితులతో ఈ రాత్రి గడిచేది అనుకుంటూ, మౌనంగానే భోజనాల గదికి వెళ్ళాం. మౌనంగానే కూర్చున్నాము. నన్ను మంచి వాతావరణంలో వుంచాలని చాలా ప్రయత్నించారు. కాని ఏదో శవయాత్ర నుంచి వచ్చినట్లు అందరూ మౌనంగానే వున్నాం. తర్వాత ఐరిస్ ఆ ప్రయత్నం కూడా మానివేసింది. ఎంత త్వరగా భోజన పదార్థాలు వస్తాయా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. అట్లాగయినా ఈ వత్తిడి తగ్గవచ్చు.

ఇంతలో నన్నడిగారు, ఎప్పుడైనా ఫ్రాన్సు వెళ్లారా, రోమ్ చూశారా, సాల్జ్‌బర్గ్ ప్రయాణించారా, మాక్స్ సినిమాలు చూశారా? ఇలా ప్రశ్నలతో... నేను తల అడ్డంగా వూపాను. అప్పుడు ట్రీ అన్నారు 'చార్లీ నువ్వు ప్రయాణాలు చేయాలి. ప్రదేశాలు చూడాలి. అవి నీకు ఎంతగానో వుపయోగంగా వుంటుంది." 'నాకు అంత సమయం దొరకటం లేదు – నా విజయాలు నన్ను వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. 14 ఏళ్లపుడు మిమ్మల్ని 'స్వెంగాలి', ఆంటోనీ 'ఫాల్స్‌స్టాఫ్' పాత్రల్లో చూశాను. మీరు నిజంగా రక్త మాంసాలతో వుంటారని నమ్మలేకపోయాను. ఈరోజు మీతో కూర్చొని భోజనం చేయటం ఇది ఒక కల!"

ఆయన నిజంగా కదిలిపోయాడు. 'నిజంగా' 'నిజంగా' అంటూ.

ఆ తర్వాత మేము ఆత్మీయులమైపోయాం. చాలా రాత్రుళ్లు కలిసి భోజనం చేశాము. అప్పుడప్పుడు కాన్‌స్టెన్స్ వస్తుండేది. విక్టర్ హ్యూగో రెస్టారెంట్‌లో కాఫీ తాగుతూ విషాద సంగీతం వింటూ ఎన్నో సాయంత్రాలు గడిపాము.

కాన్‌స్టెన్స్ ద్వారానే డగ్లస్ ఫెయిర్ బాంక్స్ అందం గురించీ, ప్రతిభ గురించీ విన్నాను. ముఖ్యంగా అతి చతురమైన మాటలు, అదీ రాత్రి భోజనాల తర్వాత. నిజానికి ఇవి నాకంత యిష్టముండదు. ముఖ్యంగా తెలివిగల అబ్బాయిల విషయాలు. కాని చివరికి అతని ఇంటి దగ్గర ఒక సాయంత్రం కలిసే ఏర్పాటు జరిగింది. నేనూ, డగ్లస్ ఇద్దరమూ ఆ రాత్రి కలయికను తప్పించాలని ప్రయత్నించాం. నాకు తల నొప్పిగా వుందని చెప్పాను. డగ్లస్ కూడా వంట్లో బాగోలేదని కబురు చేసాడు. కాని కాన్‌స్టాన్స్ ఇవేమీ వినలేదు. మేము వెళ్లి ఇంటి గంట కొట్టగానే – డగ్లస్ బిలియర్డ్స్ గదిలోకి వెళ్లిపోయాడు. ఆ రాత్రినుంచి మేము స్నేహితులమైపోయాం! డగ్లస్‌కి చాలా పేరు ప్రఖ్యాతులున్నాయి. అతనికి ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. ఆ రోజుల్లో 'రాబిన్ హుడ్' కోసం పది ఎకరాలలో పెద్ద సెట్టువేశాడు. అందులో ఒక రాజమహల్ కోట, చుట్టూ కందకం పైకి లేపే వంతెన. అంతా బ్రహ్మాండంగా వుండేది. తన ప్రతిభ చాలా తక్కువ అని, ఎదుటవారి గొప్పతనాన్ని మెచ్చుకునేవాడు. మేము చాలా సరదా సాయంత్రాలు గడిపాము, అతని బివర్లే హిల్స్ ఇంటి ఆవరణలో. అక్కడే అతని చిత్రీకరణ కూడా చేస్తుండేవాడు! ఆ రోజుల్లో బివర్లీ హిల్స్‌లో ఎవ్వరూ వుండేవారు కాదు. రోడ్లూ, ఫుట్‌పాత్‌లూ అలా వెళ్ళి మాయమయిపోయేవి. పెద్ద పెద్ద వీధి దీపాలు తెల్లని దోమలతో ఒంటరిగా నిలబడి వుండేవి. చాలా వాటిని దగ్గర్లో వుండే వాళ్లు మాయం చేస్తుండేవారు. నాకు తెలిసి బెవర్లీ హిల్స్‌లో నివసించిన మొదటి సినిమా హీరో – డగ్లస్ ఫెయిర్ బాంక్స్. నేను చాలా రాత్రుళ్లు అతని ఇంట్లో వున్నాను. నాకు నిద్రపోయే ముందు (అడవికుక్కల అరుపులు వినపడుతుండేవి. అక్కడి వున్న చెత్త డబ్బాలు కెలుకుతూ.) –

అతనితో ఎప్పుడూ ఇద్దరు ముగ్గురు వుండేవారు. టాకు – ఇతను డగ్లస్‌కి కథలు వ్రాసేవాడు. కార్ల్ ఇతను ఒలంపిక్ ఆటగాడు. ఇంకా ఇద్దరు కౌబాయ్స్ వుండేవారు. టాకూ, డగ్లసూ, నేనూ ముగ్గురం మూర్ఖులులాగే వుండేవారం!

మేము ముగ్గురం తెల్లవారక ముందు అక్కడకు దగ్గర్లో కొండమీదికు వెళ్లే వాళ్లం గుర్రాల మీద. కేవలం సూర్యోదయం చూడటానికి. మేము నిద్రపోయిందని గొణుగుకునే వాళ్లం. నేను సూర్యోదయం ఆడవాళ్లతో చూడాలని అనేవాడిని. నన్ను డగ్లస్ మాత్రమే గుర్రం ఎక్కించాడు. ఎందుకంటే గుర్రాల మీద నాకు సరైన అభిప్రాయం లేదు. ప్రపంచంలో ఆ జంతువుకి అనవసరంగా ఎక్కువ పేరు వచ్చిందని. అది నమ్మదగింది కాదని నా అభిప్రాయం! ఆ రోజుల్లో అతని భార్యనుంచి వేరయి వుంటున్నాడు. చాలా సాయంత్రాలు స్నేహితులకు డిన్నర్ పార్టీలు ఇచ్చేవాడు. అతనికి మేరీ ఫిక్‌ఫోర్డ్‌తో ప్రేమ వ్యవహారం నడుస్తుండేది. నేను చాలాసార్లు చెప్పాను. మీరు పెళ్లివరకూ వెళ్లవద్దు. కలిసి బ్రతకండి అని. ఇది ఆ రోజుల్లో చాలా సంప్రదాయ విరుద్ధం. అయినా నేను చాలా గట్టిగా చెప్పేవాణ్ణి. పెళ్లి వద్దు అని. వాళ్లు చివరికి పెళ్లి చేసుకున్నారు. అందర్ని ఆహ్వానించారు. నన్ను తప్ప!

నేనూ, డగ్లసూ చాలాసార్లు వేదాంతం మాట్లాడుతుండేవారం. నేను ఈ జీవితానికి ఏమి హేతువు, అర్థమూ లేదని అనేవాడిని.

ఒక సాయంత్రం చిన్న గట్టుమీద కూర్చున్నాం. వెన్నెల్లో నక్షత్రాల గుత్తులు కదులుతున్నాయి. 'డగ్లస్ నువ్వేమైనా చెప్పు – ఈ జీవితానికి తలాతోకా లేదు' అన్నాను. 'అలా అనకు – చూడు ఈ చంద్రుడు నక్షత్రాలు ఆకాశం ఇదంతా అర్థం లేదంటావా? నాకూ–నీకూ ఇంత మంచి జరుగుతుంటే దీనికి కారణం లేదా? నీకు వచ్చిన పేరుప్రఖ్యాతులూ నీ ప్రతిభా ఇదంతా అర్థం లేదంటావా? అన్నాడు. అవును 'నాకేమిటి వార్నర్ బ్రదర్స్, ఎల్.బి. మేయర్ వాళ్లకు కూడా...' అంటూ నవ్వాను.

డగ్లస్ చాలా రొమాంటిక్ వ్యక్తి. నాకెప్పుడైనా తెల్లవారుఝామున మూడు గంటలకు మెలకువ వచ్చేది. అప్పుడు చక్కని సంగీతం విన్పించేది. డగ్లస్ మేరీతో లాన్‌లో నాట్యం చేస్తుండేవాడు. అరె ఎంత గొప్ప సీను! కాని మూడో వ్యక్తికి చోటులేని ఈ రొమాన్సు చాలా అద్భుతమైంది. డగ్లస్ చాలా బాగా ఆనందించేవాడు!

ఆ రోజుల్లో హాలీవుడ్ గొప్పగా పెరిగిపోతోంది. గొప్ప గొప్ప రచయితలు – నటీనటులూ, మేధావులూ అందరూ అక్కడకు చేరి సినిమాలకు తమవంతు సేవ చేస్తున్నారు. ప్రపంచం నలుమూలలనుండి వచ్చి ఇక్కడకు చేరుకున్నారు. సర్ గిల్బర్ట్

పార్కర్, విలియం జె. లాక్, రెక్స్ బీచ్, జోసెఫ్ హెర్జ్ షీమర్, సోమర్సట్ మామ్, గోవర్నర్ మారిస్, ఇబనెజ్, ఎలినార్ గ్లిన్, ఎడిత్ వార్టన్, కాత్‌లీన్ నోరిస్, ఇంకా చాలా మంది.

సోమర్సెట్ మామ్ హాలీవుడ్‌లో ఎప్పుడూ పనిచేయలేదు. కాని ఆయన కథలకు చాలా గిరాకీ వుండేది. రెండు మూడు వారాలు ఉండి ఎక్కడికో దీవులకు వెళ్లిపోయేవాడు. ఆయన కథలన్నీ అక్కడే వ్రాసాడు. ఒకసారి డిన్నర్ దగ్గర నాకూ, డగ్లస్‌కూ ఒక కథ వినిపించాడు. 'సాడీ థాంప్సన్' తర్వాత ఇదే రెయిన్ పేరుతో మంచి సినిమాగా వచ్చింది.

ఈ హాలీవుడ్ గోలలోనే చాలా చౌకబారు హోటలు వుండేది. అదే 'హాలీవుడ్ మోటల్.' రచయితలంతా ఇక్కడే వుండేవారు. ఇది లాస్ ఏంజెలెస్ నుంచి హాలీవుడ్ వెళ్లే రోడ్‌లో వుండేది. ఇక్కడ గది దొరకటమే కష్టంగా వుండేది. ఇక్కడకు రావటానికే హాలీవుడ్ సినిమావాళ్లు వెనకాడేవారు. కాని కథలకోసం, రచయితలకోసం తప్పనిసరిగా రావలసి వచ్చేది. ఎలినార్ గ్లిన్ ఇక్కడే రెండు గదుల్లో వుండేది. అందులో ఒక గదిని దిళ్లు, దివానులు వేసి అతిథులకోసం వుంచేది.

ఆమెను ఒకసారి డిన్నర్ పార్టీలో, ఆమె ఇచ్చినదే, పదిమంది హాలీవుడ్ జనానికి, ఆమె గదిలో కూర్చుని మధువు సేవిస్తూ వుండగా అందరితో – నేను ముందుగా వెళ్లాను. నన్ను ఆమె ఎంతో ఆప్యాయంగా రెండు చేతుల్లో నా బుగ్గల్ని తీసుకుని "రా, రా, నిన్ను దగ్గరగా చూడనీ – నీ కళ్లు తేనె రంగు అనుకున్నా – కాని నీలిగా వున్నాయే – ఎంత అద్భుతం!' అని నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఆమె ఆంగ్ల రచయితగా మంచి పేరు గడించింది. ఆ రోజుల్లో ఆమె రాసిన 'మూడువారాలు' అప్పటి ఎడ్వర్డు రాజరికాన్ని చాలా ఇరుకున పెట్టింది. అప్పటి రాణి, పాల్ అనే అతనితో ప్రేమ వ్యవహారం నడిపి గర్భవతి అయింది. తర్వాత ముసలి రాజుని పెళ్లి చేసుకుని పుట్టిన మగ బిడ్డను రాజ్యానికి వారసునిగా చెలామణి చేస్తుంది. ఇదీ కథ.

ఇంకా అతిథులు రాకమునుపు నన్ను లోపలి గదిలోకి తీసుకువెళ్ళి అక్కడ గోడకు వేలాడుతున్న మొదటి ప్రపంచ యుద్ధపు వీరులను చూపింది. 'వీరంతా నా స్నేహితులే' అని గర్వంగా చెప్పింది.

ఈమె అప్పుడప్పుడు మాయమంత్రాలు చేస్తుండేది. ఒకసారి డగ్లస్ భార్య మేరీని మంత్రించి నిద్రపుచ్చింది. నేనూ డగ్లసూ చూస్తున్నాము. పాపం మేరీ గంటసేపు నిద్ర నటించవలసి వచ్చింది!

ఆమె కథలు కొన్ని వింతగా వుంటాయి. 'Her Moment' ఒకటి చాలా భయం కొల్పే విధంగా వుంటుంది. ఒక సంపన్నురాలు, త్వరలో ఒకరిని పెళ్లి చేసుకోవాలి. కాని అతన్ని ప్రేమించదు. ఒకసారి గుర్రంమీద చిన్న అడవిలోకి వెళ్తుంది. ఆమెకు చెట్లూ మొక్కలూ అంటే చాలా ప్రీతి.

అలా చూస్తుండగానే గుర్రం దిగి తిరుగుతుండగా, ఆ పొదల్లో వున్న చిన్న పాములాంటి కీటకం ఆమెను స్తనం మీద కాటు వేస్తుంది. ఈ బాధతో గట్టిగా అరుస్తుంది. అటుగా వెళ్తున్న ఆమె ప్రేమికుడు వచ్చి చూస్తాడు. ఆమె చెప్పగా తెలుసుకుని 'అయ్యో ఇది చాలా విషపూరితం' అని. 'త్వరగా ఏదోకటి చేయి – విషం' అని బాధ పడుతుంది. అప్పుడతడు ఆమె పై గౌను చింపి తనవైపు తిప్పుకుని (కెమెరాకు కనపడకుండా) నోటితో స్తనంమీది విషంలాగి ఆమెను రక్షిస్తాడు. ఆమె తర్వాత అతన్ని వివాహం చేసుకుంటుంది.

పద్నాలుగవ అధ్యాయం

సొంత స్టూడియో

ఇప్పటి ఒప్పందం అయిపోగానే నేను ఫస్ట్ నేషనల్ కంపెనీతో పనిచేయడానికి ఉత్సాహపడ్డాను. కానీ, మాకు స్టూడియో లేదు. అందుకని హాలీవుడ్‌లో కొంత స్థలం కొని, స్టూడియో కట్టాలని నిర్ణయించాను. నేను ఎంపిక చేసిన స్థలం "సన్‌సెట్" – "లాబ్రియా" రెండు కూడళ్ళలో ఉంది. అప్పటికే దానిలో పది గదుల ఇల్లు ఐదు ఎకరాల నిమ్మా, బత్తాయి, పీచ్ చెట్లున్నాయి. ఆ స్థలంలో నేను చక్కటి స్టూడియో కట్టాను. అందులో ఫిల్మ్ డెవలపింగ్ లాబొరేటరీ, ఎడిటింగ్ గదులు, కార్యాలయం అన్నీ చక్కగా నిర్మించాము. ఈ నిర్మాణపు పనులు జరుగుతుండగా నేనూ, ఎడ్నా పూర్వియాన్స్ ఇద్దరం హొనొలులూ దీవులకు నెలరోజులపాటు విశ్రాంతికోసం వెళ్ళాము.

ఆ రోజులలో హవాయి దీవులు చాలా అందంగా వుండేవి. నాకు అక్కడనే ఉండిపోవాలనే ఆలోచన వచ్చినా అది చాలా దిగులుగా అనిపించింది. ప్రధాన భూభాగానికి రెండువేల మైళ్ళ దూరంలో ఉండడం దిగులు అనిపించింది.

ఇక్కడ ఎంత ప్రకృతి సౌందర్యం ఉన్నా ఎన్నో రకాల పూలు, పళ్ళు, తోటలు ఉన్నా ఇక్కడ జీవించడం అనే భావన లిల్లీపువుల్లో బందీ అవ్వడమే. ఎడ్నాలాంటి సౌందర్యవతి నా ప్రక్కన వున్నప్పుడు నా హృదయం స్పందించడం తప్పదుకదా! మేమిద్దరమూ లాస్‌ఎంజెల్స్‌లో కలసి పనిచేసినప్పుడు నేనున్న ఎథ్లిటిక్ క్లబ్ దగ్గరలోనే ఎడ్నా అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుంది. ప్రతిరాత్రి ఆమెను నేను క్లబ్‌కి భోజనానికి తీసుకొచ్చే వాడిని. మా ఇరువురికి పరస్పరము చాలా గౌరవం ఉంది. నా మనసు లోపల ఏదోరోజున మేమిద్దరం పెళ్ళి చేసుకోవచ్చు అనే ఆలోచన కూడా ఉంది.

కానీ, ఎడ్నాపట్ల నా అవగాహన వేరు. నా అనుమానాలు, అనిశ్చయం ఇవన్నీ ముప్పిరిగొని ఉన్నాయి. 1916లో మేము ఒకరినొకరు విడవకుండా అన్ని ప్రదేశాలూ

తిరిగాము. రెడ్‌క్రాస్ సభలకి, విందులు, వినోదాలు కలిసే చేసాం. ఈ సందర్భంలో ఎడ్నా కాస్త అసూయ చూపించేది. ఎవరైనా నాకు దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తే వెంటనే ఆమె అక్కడనుంచి నిష్క్రమించిన తర్వాత నాకు ఒక చిన్న చీటి వచ్చేది, ఎడ్నా స్పృహ తప్పినట్లు. ఆ సాయంత్రం ఇక ఆమెతోనే గడపాల్సి వచ్చేది. ఒకసారి నాకు విందు ఇస్తున్న అందమైన ఎయిర్ హోస్టెస్ నాకు దగ్గరగా రావడానికి ప్రయత్నించింది. నాతో నాట్యం చేస్తూ నన్ను దూరంగా తీసుకెళ్ళింది. ఆ వెంటనే ఎడ్నా దగ్గరనుంచి చీటీ వచ్చింది ఆమె మూర్ఛపోయినట్లు. ఈ చీటీలను అందుకోవడం మొదట్లో నాకు ఆనందంగానే ఉంది. ఎందుకంటే ఒక అందమైన యువతి నాకోసం పరితపిస్తోంది కదా! కానీ రానురాను ఇదొక అలవాటుగా మారిపోయింది. తర్వాత చిరాకుగా అనిపించింది. ఒకసారి ఫాన్నీ వార్డ్ విందులో చాలామంది అమ్మాయిలూ, అబ్బాయిలూ ఉన్నారు. ఇక్కడ కూడా సమయం చూసి ఎడ్నా మూర్ఛపోయింది. తరువాత లేచి థామస్‌మెఘాన్ ఉన్నాడా? అని అడిగింది. అతను పారమౌంట్ పిక్చర్స్‌కి చెందిన అందమైన కథానాయకుడు. దీనిగురించి నాకు అప్పుడేమీ తెలియదు. తరువాత రోజు ఫాన్నీ వార్డ్ చెప్పినప్పుడే తెలిసింది. నాకూ ఎడ్నాకూ ఉన్న సాన్నిహిత్యం అతనికి తెలుసు. నన్ను ఇబ్బంది పెట్టాలనే ఈ రకంగా ప్రవర్తించింది. ఇది నిజంగా నేను నమ్మలేకపోయాను. నా అహం దెబ్బతింది. చాలా కోపంకూడా వచ్చింది. ఇదే నిజమైతే మా స్నేహాన్ని పొడిగించడం నాకిష్టంలేదు. కానీ లోలోపల ఆమెను ఒదులుకోవడమూ ఇష్టంలేదు. ఈ శూన్యం చాలా బాధాకరమైనది. ఒక్కసారిగా మా స్నేహమాధుర్యం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ సంఘటన జరిగిన మర్నాడు నేను పని చేయలేకపోయాను. ఆ మధ్యాహ్నం ఆమెకి ఫోన్ చేసి వివరాలు అడిగాను. ఆ విధంగానైనా నా అహాన్ని చల్లబరుద్దామని. కానీ నేను వ్యంగ్యంగా మాట్లాడి ఆమెను ఎగతాళి చేసాను. "ఎడ్నా, నిన్న విందులో నాకు బదులుగా మరొకరికోసం కబురు చేసావట. ఈ మధ్య నీకు మతిమరపు వస్తున్నదా." ఆమె గట్టిగా నవ్వింది. కొంచెం గందరగోళం పడింది. "దేని గురించి మాట్లాడుతున్నావు చార్లీ" అంది, ఆమె తెలియనట్లు. 'నీకెవరు చెప్పారు.' అంది. నేను "ఎవరు చెబితే ఏమిటి. నన్ను అంతమందిలో వెర్రివెధవను చేశావు గదా" అన్నాను. ఆమె చాలా ప్రశాంతంగా "నువ్వు చాలా అబద్ధాలు వింటున్నావు" అంది. నేను ఆమెను బాధించాలని "నువ్వు నటించాల్సిన అవసరం లేదు. నీకిష్టమైన పని నువ్వు చేయవచ్చు. మనమిద్దరం పెళ్ళి చేసుకోలేదు కదా! నువ్వు

నీ పని శ్రద్ధతో చేస్తే చాలు. నాకు కావల్సింది అదే" అన్నాను. (ఆ తరువాత రోజులలో ఆమె నన్ను ఏమీ ఇబ్బంది పెట్టలేదు. చాలా శ్రద్ధగా చిత్రీకరణలో పాల్గొంది.) 'మనమిద్దరం ఎప్పుడూ మంచి స్నేహితులమే' అంది. నన్ను బాధించిందే ఇది. ఆ తరువాత చాలాసేపు ఆమెతో ఫోనులో మాట్లాడాను. అప్పటికే నా పరిస్థితి దారుణంగా ఉంది. ఏదోరకంగా సంధి చేసుకుందామని ప్రయత్నించాను. ఆమె అంటే నాకు ఇష్టం మరీ ఎక్కువైంది. మా సంభాషణ మెల్లమెల్లగా నిశ్శబ్దంగా మారింది. చివర్లో ఆ రాత్రికి భోజనానికి కలుద్దామని చెప్పాను. ఆమె కొంచెం వెనుకాడింది. కానీ నేను ఒత్తిడి చేసాను. నిజం చెప్పాలంటే బ్రతిమాలాను. నా అహాన్నంతా ప్రక్కనపెట్టి ఆమె ముందు మోకరిల్లాను. చివరికి ఆమె అంగీకరించింది.

ఆ రాత్రి మేమిద్దరమే కలిసి భోజనం చేసాం. ఆమె ఇంట్లోనే మాకోసం వంట చేసింది. ఒకరకమైన ప్రశాంతత నెలకొంది. నాకు కాస్త మనఃశ్శాంతి చిక్కింది. ఆ మర్నాడు మామూలుగా పనిచేయగలిగాను. అయినా లోలోపల నా దిగులూ, ఆత్మన్యూనతా తగ్గలేదు. నన్ను నేను తిట్టుకొన్నాను. ఆమెను నిర్లక్ష్యం చేసినందుకు బాధపడ్డాను. నేను ఒక సంధిగ్ధంలో పడిపోయాను. ఈ బంధాల్ని తెంపివేసుకోవాలా?

ఒకవేళ మేఘాన్ విషయం అబద్ధమేమో! ఇలా మూడువారాలు గడిచిపోయింది. ఒకరోజున ఆమెకి రావలసిన డబ్బుకోసం స్టూడియోకి వచ్చింది. ఆమె వెళ్ళిపోయేటప్పుడు నాకు ఎదురుపడింది. ఆమెతోపాటు ఒక స్నేహితుడున్నాడు. నావంక చూసి "నీకు టామీ మేఘాన్ తెలుసా?" అని అడిగింది. ఈమెను ఇప్పుడే కలుస్తున్నానా అనుకున్నాను. పైకి బింకంగా "తెలియకేమి, టామీ ఎలా ఉన్నారు మీరు" అన్నాను. అతనూ కాస్త గందరగోళ పడ్డాడు. మేము రెండు మూడు మాటలు మాట్లాడిన తర్వాత వాళ్ళు స్టూడియో వదిలి వెళ్ళిపోయారు.

ఏదిఏమైనా జీవితం సంక్లిష్టమైనదే. అది మనకి ఒక ముగింపంటూ ఇవ్వదు. ఇక్కడ ప్రశ్న ప్రేమైనా, ప్రేమ వ్యవహారం కాకపోతే మరొక సమస్య. జీవితంలో విజయాలు అద్భుతంగా ఉంటాయి. కానీ వాటితోపాటు పేరు ప్రఖ్యాతులు నిలుపుకోవడానికి ఎంతో కష్టపడాలి. చివరికి నాకు పనిలోనే ఓదార్పు.

సంవత్సరంలో 52 వారాలు – రాయటం, నటించటం, దర్శకత్వం చేయటం – ఇదంతా చాలా కఠినమైనది. దీనికి చాలాచాలా శక్తి యుక్తులు కావాలి. ఒక చిత్రం

పూర్తయ్యేసరికి నా శక్తి మొత్తం హరించుకుపోయేది. ఒకరోజంతా మంచంమీద పడి వుండేవాడిని. సాయంత్రానికి లేచి నెమ్మదిగా నడక సాగించేవాడిని. అన్నిటికీ దూరంగా, వ్యాకులపాటుతో గుండె బరువెక్కేది. దుకాణాల అద్దాల కిటికీల వంక చూస్తూ బజార్లు తిరిగేవాడిని. అసలు ఆలోచించటమే మానివేసేవాడిని. అంతగా అలసి స్తబ్దంగా ఉండేది మెదడు. కాని మర్నాటి ప్రొద్దునకి శక్తి తిరిగి వచ్చేది. పూర్తిగా పుంజుకుని పనికి స్టూడియోకి వెళ్లేవాడిని. మళ్లీ అంతా ఉత్సాహభరితంగా పనిలో మునిగిపోయేవాడిని. లీలగా వచ్చే ఆలోచనతో సెట్టులు వేయమని చెప్పేవాడిని.

సెట్టు కట్టటం మొదలుపెట్టిన తర్వాత కళా దర్శకుడు వచ్చి వివరాలు అడిగేవాడు. ఆ విధంగా ఎక్కడ తలుపులు పెట్టాలో ఎక్కడ కిటికీలు వుండాలో చెప్పేవాడిని. ఈ విధంగా చాలా హాస్యచిత్రాలు తీశాను!

ఒక్కోసారి నా మెదడు పేనిన తాడులాగా బిగిసిపోయేది. అలాంటప్పుడు ఏదోవిధంగా విశ్రాంతి కోరుకునేవాడిని. అలాంటప్పుడు ఆ రాత్రి ఒక ఆటవిడుపే. నాకు మద్యం ఎప్పుడూ ఉత్సాహాన్నిచ్చేది కాదు. నిజానికి అది పనికి అడ్డంకి కూడా. పూర్తి జాగరూకత వుండాలంటే సహజంగానే ఉండాలి. ముఖ్యంగా నవ్వుల సినిమా తీయాలంటే.

శృంగారం, ఇది ఎప్పుడూ నాకు పనిలోనే... అది నిజంగా నేను కోరుకున్నప్పుడు దొరికేది కాదు. ఎందుకంటే బజారులో కొనే వస్తువు కాదు. నేను చాలా నిబద్ధతతో పనిచేశాను. నిజాయితీగా పని చేశాను. 'బాల్ జక్' అన్నట్లు ఒకరాత్రి శృంగారం తర్వాత మర్నాడు తన నవలలో ఒక మంచి పుట చిరిగిపోయినట్లే అని. నేను కూడా స్టూడియోలో పనిరోజు నష్టపోయినట్లే అనుకుంటాను.

నేను ఈ సొంతకథ రాస్తున్నానని తెలిసి ఒక పేరున్న రచయిత్రి "మీకు నిజం చెప్పే ధైర్యముందని అనుకుంటాను" అంది. నేను నా రాజకీయ పరిచయాల గురించి అనుకున్నాను. కాని ఆమె నా శృంగార జీవితం గురించి మాట్లాడుతోంది. అందరూ ఆత్మకథ అంటే తమతమ శృంగార కథలన్నీ ఏకరువు పెట్టాలనీ, అదే నిజాయితీ అనీ అనుకోవచ్చు. దానిమూలంగా వ్యక్తిత్వం తెలియాల్సిన పనిలేదు. అంతకంటే చలీ, ఆకలీ పేదరికంలోని అవమానాలు – మన వ్యక్తిత్వాన్ని ఎక్కువ ప్రభావితం చేస్తాయి. మన జీవితపు సంక్లిష్టతలో శృంగారం అంత ముఖ్యమైనది కాదని అనుకుంటాను.

అందుకనే ఈ సొంతకతలో నా శృంగారం తాలూకు రాత్రుల్ని వర్ణించటం అంతగా ఇష్టపడను. అవి అంత కళాత్మకం కాదూ, కావ్య వస్తువు కాదూ. అన్నిటికంటే శృంగారానికి దారితీసే పరిస్థితులే ఉత్సాహకరంగా వుంటాయి.

నా జీవితంలో కూడా శృంగారపు భాగం – అంచలంచెలుగానే జరిగింది. ఒక్కసారి ఎంతో శక్తి, ఉద్వేగంతో, కొన్నిసార్లు చాలా నీరసం నిరాశజనకంగా! కాని అదే జీవితమని ఎప్పుడూ అనుకోలేదు. నేను సృజనాత్మక వ్యాపకంలో వున్నాను. అదే నన్ను పూర్తిగా ఆవహించేది.

ఎలాగో శృంగారం గురించి మాట్లాడుకుంటున్నాం కదా – ఒక విషయం చెప్పి ముగిస్తాను.

ఒక రాత్రి న్యూయార్క్ నుంచి లాస్ ఏంజెలెస్ వచ్చి అలెగ్జాండ్రియా హోటల్లో గది తీసుకున్నాను. ప్రయాణ బడలికతో గదికి త్వరగానే చేరాను. బట్టలు మార్చుకుంటూ న్యూయార్క్‌లో విన్న కొత్త పాట ఒకటి పాడటం మొదలు పెట్టాను. ఒక చరణం అవగానే ఆశ్చర్యంగా నా ప్రక్క గదిలోనుంచి తర్వాత చరణం విన్పించింది సన్నని గొంతుతో. తర్వాత చరణం నేను పాడాను. ఇదొక ఆటలాగా పాట సాగింది. పాట పూర్తయింది కాని ఆట అయిపోలేదు. తర్వాత సన్నగా ఈల వేశాను. మళ్లీ ఆమె అందుకుంది. పరిచయం చేసుకోవాలా? అసలు ఎవ్వరు? ఎలా ఉంటుంది? దీనిలో సాధక బాధకాలేమిటి? అన్నీ అనుమానాలే! అప్పుడు గట్టిగా నవ్వి – 'చాలా బాగుందే' అన్నాను. అటునుంచి 'ఏమన్నారు' అంది. "మీరు ఇప్పుడే న్యూయార్క్ నుంచి వచ్చారుకదూ" అన్నాను. 'మీరేమంటున్నారో నాకు విన్పించలేదు' అంది. 'అలా అయితే తలుపు తీయండి' అన్నాను. 'కొద్దిగా తెరుస్తాను – మీరు రావటానికి ప్రయత్నించవద్దు' అంది. 'ఒట్టు – రాను' అన్నాను. అప్పుడు ఆమె తలుపు ఓరగా తీసింది. ఒక సిల్కు నైటీలో దేవతలా వుంది! "లోపలికి రావద్దు – వస్తే బాదేస్తాను" అంటూ పల్లికిలించింది.

'ఎలా వున్నారు?' అప్పటికే నేనెవరో తెలుసనుకుంటా – తర్వాత కథ మామూలే. ఆ రాత్రి ఆమె నాతో అంది ఎట్టి పరిస్థితిలోనూ తనని అందరిలో పలకరించకూడదని. కనీసం తలకూడా ఊపకూడదని! అంతే ఆమె గురించి నాకేమీ చెప్పలేదు. పేరుకూడా!

మర్నాటి రాత్రి – నేను గదిలోకి రాగానే ఆమే మెల్లగా నా తలుపు తట్టింది.

మూడోరాత్రి నాకు ఇక ఇబ్బందిగా అనిపించింది, ఈ రాత్రి సంగమాలు. నాకు చాలా పని వుంది. అప్పుడే సినిమా ప్రపంచంలో నిలబడ గలుగుతున్నాను. ఇలాంటి వ్యవహారాలకి సమయంలేదు. అందుకని నాలుగోరాత్రి నిశ్శబ్దంగా గదిలోకి వచ్చి, చీకట్లోనే పడుకున్నాను. మెల్లగా తలుపు మీద చప్పుడయింది. నేను విన్పించుకోలేదు.

మర్నాడు వుదయం హోటల్ లాబీలో చురచుర చూసింది. అయిదో రాత్రి నా తలుపు బద్దలు కొట్టినంత పని చేసింది. ఆ మర్నాడు నేను హోటల్ ఖాళీచేసి వెళ్లిపోవటం ఇద్దరికీ మంచిదని, ఆ పనే చేశాను! అదీ నా శృంగార గాధ!

కొత్త స్టూడియోలో – నా మొదటి చిత్రం – డాగ్స్ లైఫ్. దీన్లో కాస్త వ్యంగ్యం వుంది. కుక్క బతుకుతో నా వేషం ట్రాంప్ జీవితాన్ని పోల్చడం! ఇప్పటివరకూ అన్నీ నవ్వులు రాల్చటానికి తీసిన సినిమాలే. ఇప్పుడు హాస్యాన్ని కథాత్మకంగా వ్యధాత్మకంగా చూపాలని – ఒక సీన్‌లో నుంచి మరో సీన్‌లోకి అల్లుకుంటూ మొత్తాన్ని అర్ధవంతంగా ముగిస్తూ వచ్చా, ఈ కుక్క బతుకుని. మొదట కుక్కలు తగవులాడుకుంటుంటాయి. అందులోని బలహీనమైన కుక్కను రక్షించాలి. తర్వాత ఒక డాన్సు ట్రూపులో దయనీయంగా వున్న అమ్మాయిని రక్షించాలి. ఆ తర్వాత చాలా పరిణామాలు – ఒకదాని తర్వాత ఒకటి పరంపరగా వస్తుంటాయి. చివరికి విషాదం వినోదం కలగలసి ఒక ఆర్ద్రమైన భావనతో ప్రేక్షకులు వెళ్తారు. నా మొదట చిత్రాలు – చాలా సామాన్యంగా కేవలం నవ్వుల కోసం తీశాను. అవి కీస్టోన్ రోజుల్లో. అప్పుడు ఈ ట్రాంప్ – చాలా స్వతంత్రుడు. దేనికీ బందీకాదు. చివరికి కథకు కూడా! అప్పుడు అతని బుద్ధికంటే సహజ గుణాలే ఎక్కువ చురుకుగా పనిచేసేవి. అతని కనీస అవసరాలకోసమే అతడు తన మనుగడ సాగించేవాడు.

తర్వాత తర్వాత ఈ ట్రాంప్ – చాలా ఎదుగుదల చూపించాడు. సినిమా సినిమాకి అతని బుద్ధి వికసించింది. అతనిలో కరుణ, సున్నిత భావాలు బహిర్గతమైనాయి. ఇది చాలా సమస్య తెచ్చిపెట్టింది. ఎందుకంటే ట్రాంప్ పుట్టింది – నవ్వించటానికి. కాని ఈ సున్నిత భావాలు ఎలా పండించాలి?

దీనికి పరిష్కారం ట్రాంప్‌ని పియర్రాట్‌గా మలిచాను. ఈ మార్పుతో ట్రాంప్ ఇక కేవలం హాస్యగాడేకాదు, ఒక హీరోకూడా. కాని ఒక అందమైన అమ్మాయి ఒక

చిరుగుపాతల పేదవాణ్ణి ఎలా ఇష్టపడుతుంది? ఈ సమస్య నాకు అన్ని చిత్రాల్లోనూ తలఎత్తింది.

'ది గోల్డ్‌రష్'లో కథానాయిక ట్రూంప్‌ని ఎగతాళి చేస్తుంది. ఈ సంఘటనే ఆమెకు అతనిమీద ఇష్టం కలిగిస్తుంది. సానుభూతితో – కాని అతను దానినే ప్రేమ అనుకుని పొరపాటు పడ్డాడు.

'సిటీలైట్స్'లో అమ్మాయి చూపులేనిది. ఈ కథనంలో ట్రూంప్ ఆ అమ్మాయితో చాలా అన్యోన్యంగా ఉంటాడు. ప్రేమగా కూడా ప్రవర్తిస్తాడు. అయితే ఇదంతా అమ్మాయి చూపు వచ్చేవరకే!

ఇలా కథాకథనం అభివృద్ధి చేస్తుంటే నా హాస్యధోరణి తగ్గుతూ వచ్చింది. అప్పుడే నాకు ఒక అభిమాని ఉత్తరం రాశాడు. "అప్పుడు ప్రేక్షకులు నీకు దాసోహం, ఇప్పుడు నీవు ప్రేక్షకులకు దాసోహం" అని.

అప్పటి హాస్య చిత్రాలలో కూడా ఏదైనా ఉద్వేగం కోసం ప్రాకులాడేవాడిని. మామూలుగా అది సంగీతంతో సాధించేవాళ్లం. ఒక పాతపాట 'ది ఇమ్మిగ్రేషన్' చిత్రానికి ఆ వాతావరణం తెచ్చింది. ఇద్దరు కాందిశీకులు వాన కురుస్తున్న వాతావరణంలో పెళ్ళి చేసుకుంటారు. దానికి ఆ పాట నేపథ్యంగా అమరింది! మిగతా చిత్రాలకు కూడా సాధారణ సంగీత ధ్వనులే ఒక వాతావరణం సృష్టించేవి.

'ట్వెంటీ మినట్స్ ఆఫ్ లవ్' ఇందులో పోలీసులూ, హాస్పిటల్ నర్సులూ పార్కులూ, ఇదీ వాతావరణం. దీనికి 'టూ మచ్ మస్టర్డ్' పాటలు రెండు అంచెలుగా వినిపించాను. అలాగే 'సిటీలైట్స్'కి 'పయోలెటేరా' పాటను, 'గోల్డ్‌రష్'కి 'ఆల్డ్ లాంగ్ సైనె' పాటను వాడుకున్నాను!

1916లో నాకు పూర్తి నిడివి చిత్రాలు తీయాలని చాలా ఆలోచనలున్నాయి. అందులో చంద్రుని మీదికి ప్రయాణం, అక్కడ ఒలింపిక్ క్రీడలు – భారరహిత వాతావరణంలో ఈ ఆటలన్ని ఎలా వుంటాయో వూహించండి. అప్పుడే అభివృద్ధి అనే పదానికి ఎంత వ్యంగ్యార్థం వుంటుందో!

అలాగే భోజనం పెట్టే యంత్రం! అలాగే మన ఆలోచనలు రికార్డు చేసే టోపీ! చివరిగా భోజనం పెట్టే యంత్రాన్ని 'మోడ్రన్ టైమ్స్'తో వాడాను.

నన్ను ప్రశ్నలతో ముంచెత్తేవి పత్రికలు – నాకు ఆలోచనలు (సినిమాకు) ఎలా వస్తాయి అని! ఈరోజువరకూ నా దగ్గర సమాధానం లేదు. కాని గాఢమైన కోరిక వుంటే (వాటికోసం) అవే వస్తాయి, అని గ్రహించాను. సంగీతం, సాయం సంధ్య, ఇలాంటివే ఎంతో మంచి ఆలోచనలు, ఆచరణ సాధ్యమయ్యేవి.

ఒక విషయాన్ని తీసుకుని, దాన్ని కథగా మలచి కథనంగా పెంచి, దానిలో కలిసిపోతే అప్పుడు చిత్రీకరించవచ్చు. లేదా వదిలివేసి మరో విషయాన్ని ఎత్తుకోవచ్చు. ఇలా పోగుచేసి ఆ పోగులో ఒక నూలు తీసి నేసుకోవటమే! అందులోనే కావలసిన తాడు తయారవుతుంది.

కేవలం అదేపనిగా ఆలోచిస్తే ఆచరణ యోగ్యమైన విషయం తట్టవచ్చు. అదొక పిచ్చి! ఈ వ్యవహారమంతా చాలా బాధాకరమైనది. గందరగోళమైనది. ఉత్తేజకరమైనది. చాలా సమయం సమసిపోతుంది కూడా. కొంతమందికి ఇది తేలికగా వుండవచ్చు. కాని అది అంత తేలిక విషయం కాదు.

కానీ ప్రతీ హాస్యగాడు ఈ హాస్యాన్ని వేదాంత పరంగా చూపటానికి ప్రయత్నిస్తాడు. మనషి ప్రవర్తనలోని లోటుపాట్లనూ, జీవిత సారాన్నీ పట్టుకోవాలని ప్రయత్నిస్తాడు. ఫ్రాయిడ్ చెప్పినట్లు అన్ని శృంగార సంబంధపరమైనవే కాదు. ఈ విషయంలో ఆయనతో ఏకీభవించను. ఆలోచనలన్నీ సహజాతమైనవి. ఒకరకమైన ఆటవికమైనవి కూడా. జీవితపు సంక్లిష్టత, దుఃఖాన్ని తెలుసుకోవడానికి పెద్దగా చదవవలసిన అవసరం లేదు. సహజంగానే, సహజ నైపుణ్యం, నా హాస్యపాత్రల మీద ప్రభావం చూపింది. నవ్వించటం చాలా సామాన్యమైన విషయంగా అంటే, జనాన్ని ముందు కష్టాలలోనికి నెట్టి, తర్వాత బైటకు తీసుకు రావడమే! కాని హాస్యం చాలా విచిత్రమైంది. మ్యాక్స్ ఈస్ట్‌మన్ ఆయన పుస్తకంలో 'ది సెన్స్ ఆఫ్ హ్యూమర్' బాధలో నుంచే హాస్యం వస్తుందన్నాడు. మానవజాతి – స్వయం బాధితులన్నాడు. తెరమీద పాత్ర బాధల్లో మూలుగుతుంటే చూసేవాడికి నవ్వొస్తుంది. అలాగే హింస కూడా.

వీటన్నిటితో నేను ఏకీభవిస్తాను. కాని ఇందులో చాలా డ్రామా ఉంది. హాస్యంకంటే ఇవి రెండూ ఒకే మాదిరివి. కాని నా దృష్టితో హాస్యం అంటే మామూలు వ్యవహారం ప్రవర్తనకంటే కొంచెం భిన్నంగా హేతుబద్ధంగా నిర్హేతుకంగా కనిపించే (సర్రియల్) ఇదే మన మంచితనాన్ని నిలబెడుతుంది. ఏది ముఖ్యమో అదే పనికిరానిదై పోతుంది.

హాస్యం అన్నిటినీ తేలిక చేసేస్తుంది. జీవితంలోని చేదుని భరించే శక్తి నిస్తుంది. మనం జీవితాన్ని ఎంత ఎక్కువ గంభీరంగా తీసుకుంటామో అది అంత డొల్ల అని అనిపిస్తుంది.

ఉదాహరణకు అంత్యక్రియల దగ్గర స్నేహితుల బంధువుల కలయిక చాలా నిశ్శబ్దంగా జరుగుతుంది. ఆలస్యంగా వచ్చినవాళ్ల బంధువు మెల్లగా శబ్దం చేయకుండా వెళ్లి కూచుంటాడు. అతను కూర్చున్న చోట ఎవరో టోపీ మర్చిపోయి వుంటాడు. ఈ హడావుడిలో, ఆలస్యంగా వచ్చిన బంధువు ఆ టోపీమీద కూర్చుంటాడు. అది అణిగిపోతుంది. అతను చాలా విచారంగా దాన్ని తీసి ఆ టోపీ యజమానికి ఇస్తాడు. అతను చాలా కోపంతో అది అందుకుని మళ్లీ అంత్యక్రియల్లో మునిగిపోతాడు. అంతే అంత్యక్రియ మొత్తం గంభీరత ఎంత హాస్యాస్పదంగా మారిపోయింది!

పదిహేనవ అధ్యాయం

మొదటి ప్రపంచ యుద్ధం

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయిన మొదట్లో – అందరూ అది నాలుగు నెలలకంటే ఎక్కువకాలం జరగదని, అప్పటికి అందుబాటులో వున్న కొత్త మారణాయుధాలు బలిగొన్న అంతులేని ప్రాణాలు, మానవజాతి ముమ్మందు ఇటువంటి అనాగరికమైన పరిస్థితులను తప్పనిసరిగా తప్పించాలని అన్నారు. కాని అదంతా తప్పని తర్వాత నిరూపింపబడింది. ఆ యుద్ధం పుణ్యమా అని జరిగిన మారణకాండ, ప్రాణనష్టం – జరిగిన విధ్వంసం – నగరాలన్నీ నేలమట్టం కావటం ఇవన్నీ నాలుగు సంవత్సరాలు సాగినాయి.

ప్రపంచం మొత్తం నివ్వెరపోయింది. ఈ రక్తస్రావం ప్రపంచం మొత్తం అరుణమయం చేసింది. ఇదంతా ఎవరు ఎందుకు మొదలు పెట్టారో తెలియని స్థితి. ఎవరో రాజ బంధువును చంపటంతో మొదలయిందని నమ్మించ చూశారు. కాని ఇంతటి ఘోర కార్యానికి ఆ చిన్న కారణం మూలమంటే ఎవ్వరూ నమ్మలేదు. అప్పుడు ఇది ప్రజాస్వామ్య ప్రతిష్ఠాపన కోసం జరుగుతున్న ప్రయత్నమని కొన్ని దేశాలు ప్రచారం చేసిన ఈ ప్రజాస్వామ్యం – సామాన్య జన మారణహోమంలో జరిగిందని అనుకోవచ్చు. ఈ ప్రజాస్వామ్యపు ముసుగులో చాలా సింహాసనాలు ఒరిగిపోతున్నాయి.

ప్రజాతంత్ర దేశాలు ఏర్పాటయినాయి. మొత్తం ఐరోపా రూపమే మారిపోయింది.

అప్పుడే 1915లో అమెరికా దేశం ఈ యుద్ధంలో పోరాడటం గర్వకారణంగా ఉందని ప్రకటించింది!

అప్పటికి కూడా రేషన్ అవసరం రాలేదు. అన్ని వస్తువులూ బాగానే దొరుకుతున్నాయి. రెడ్‌క్రాస్ విందులూ, వినోదాలూ మామూలుగానే జరుగుతున్నాయి

ఆ వంకతోనే. నన్నుకూడా ఈ విందులకు పిలుస్తున్నారు. నా ప్రక్కన కూర్చుంటానికి, అలాంటి విందులో, ఒక సంపన్నురాలు 20వేల డాలర్లు ఇచ్చింది రెడ్‌క్రాస్‌కు. ఇప్పుడిప్పుడే ఈ యుద్ధం ప్రభావం కాలిపోర్నియా తీరానికి చేరింది.

1918లో అమెరికా డబ్బుకోసం "బాండ్"లు విడుదల చేసింది. వాటి పేరు 'లిబర్టీ బాండ్'లు. వాటిని జనంలోకి తీసుకువెళ్ళి అమ్మాలి. మూడో 'బాండ్' అమ్మటానికి అధికారికంగా నన్నూ డగ్లస్ ఫెయిర్‌బాంక్స్, పిక్‌ఫోర్డ్, మా ముగ్గుర్ని వాషింగ్టన్ రావాలని కబురు వచ్చింది.

అప్పటికి 'డాగ్స్ లైఫ్' పూర్తి చేసాను. ఆ సినిమా విడుదల చేయాలని మూడు రాత్రులూ పగళ్లూ నిద్ర మాని ఎడిటింగ్ చేసి సిద్ధం చేశాను. ఆ తర్వాతే రైలు ఎక్కి రెండు రోజులు లేవకుండా నిద్రపోయాను! తర్వాత మేము ముగ్గురం మా ఉపన్యాసాలను రాసుకునేందుకు ప్రయత్నించాం. ఎప్పుడూ ఈ రకమైన అనుభవం లేకపోవటంతో ఇది పెద్ద సమస్యగా సవాలుగా తయారయ్యింది. అందుకని మేము ప్రయాణం చేసే మార్గంలో మా కోసం ఎదురు చూస్తున్న అభిమానులకు ఈ ఉపన్యాసాలు ఇవ్వాలని అనుకున్నాము.

అలాంటి ఒక రైలు స్టేషన్‌లో ముందు డగ్లస్ మాట్లాడి తర్వాత మేరీని పరిచయం చేశాడు. ఆమె మాట్లాడిన తర్వాత నావంతు వచ్చింది. నేను ఉపన్యాసం మొదలు పెట్టాను. అభిమానులు గుంపులు గుంపులుగా వున్నారు. నేను కాస్త భయపడుతూనే మొదలు పెట్టాను. ఆ వెంటనే రైలు బయలు దేరింది. రైలు ముందుకు సాగుతుంటే గుంపులు తగ్గిపోసాగారు. గుంపులు పల్చబడతుంటే నాకు ధైర్యం ఎక్కువగా వస్తోంది. చివరికి గట్టిగా అరవటం మొదలు పెట్టాను!

వాషింగ్టన్‌లో మమ్మల్ని బజార్లలో ఊరేగించారు. ఒక ఆట మైదానం దగ్గరకు తీసుకు వచ్చారు. ఇక్కడే మా మొదటి ఉపన్యాసం ఇవ్వాలి. ఈ 'లిబర్టీ బాండ్' కొనమని పౌరులకు తెలియ చెప్పాలి!

అక్కడి వేదిక తాత్కాలికంగా కట్టారు. దానిచుట్టూ అమెరికా జండాలు ఎగురవేశారు. నా ప్రక్కనే ఒక అందమైన నౌకాదళ అధికారి వున్నారు. అతనితో అన్నాను 'నేనెప్పుడు ఉపన్యాసం ఇవ్వలే'దని. 'ఎందుకు దానిని గురించి ఎక్కువగా ఆందోళన? పౌరులకు సూటిగా చెప్పేయండి బాండ్‌లు కొని తమ దేశభక్తి చాటుకోమని' అని సలహా ఇచ్చాడు!

అంతలోనే నాపేరు వినపడింది. అంతే వేదిక మీదికి దొరిలినంత పనిచేశాను. వెంటనే వాగటం మొదలు పెట్టాను. 'మీరు కొన్న ప్రతి 'బాండ్' ఒక సైనికుణ్ణి కాపాడుతుంది. జెర్మన్లు వచ్చేసారు. మనల్ని ఆక్రమిస్తారు. మన సైనికులే మనల్ని కాపాడుతారు. మనకి విజయాన్ని తెచ్చి పెడతారు' అని గబగబా మాట్లాడుతూ కంగారుగా వేదిక దిగబోయి నౌకాదళ అధికారిపై పడ్డాను!

ఈ కార్యక్రమం అయిన తర్వాత మేము అధ్యక్షుడు విల్సన్‌ను కలవాలి. 'వైట్‌హౌస్'లోనే. ఇది మాకు చాలా ఉత్సాహంగా వుంది. మమ్మల్ని శ్వేత సౌధానికి తీసుకు వెళ్ళారు. అక్కడి 'ఆకుపచ్చ గది' లోకి. అప్పుడు కార్యదర్శి వచ్చి 'వరసలో నిల్చోండి – ఒక అడుగు ముందుకు వేయండి' అంది. అంతలో అధ్యక్షుడు విల్సన్ వచ్చాడు. అప్పుడు మేరీ అంది – 'పౌరులు చాలా ఉత్సాహంగా వున్నారు. బాండ్లన్ని అమ్ముడుపోతాయి' అంది. నేను అందుకని, 'అవును తప్పనిసరిగా....' అన్నాను. అప్పుడు అధ్యక్షులు నన్ను చూసి 'ఆఁ.... అలాగా' అని ఒక జోక్ చెప్పారు. మేము తప్పనిసరిగా నవ్వాల్సి వచ్చింది!

మేరీ, డగ్లసూ ఉత్తర దిక్కు వెళ్ళారు. నేను దక్షిణాదికి వెళ్ళాను. బాండ్లు అమ్మటానికి. 'రాబ్ వాగ్నర్'ని నాతో రమ్మన్నాను. లక్షల డాలర్ల బాండ్లు అమ్మగలిగాం.

నార్త్‌కారో లీనా సిటీకి చేరాం. అక్కడి షావుకారు మాకు విందు ఏర్పాటు చేశాడు. ఆ విందుకు అమెరికా సైనికాధికారులు కొంతమంది వచ్చారు. అందులో 'జనరల్ స్కాట్' కూడా వున్నారు. ఆయనకు ఈ షావుకారంటే చిరాకు. 'ఒక అతిథికీ అరటిపండుకూ తేడా ఏమిటి?' అని అడిగాడు. మేము ఏమీ మాట్లాడలేదు. 'అరటిపండు తోలు తీయవచ్చు!' అని గట్టిగా నవ్వాడు.

దక్షిణాది పెద్ద మనుష్యుల విషయాలు–అగస్టాలో ఒక జడ్జిగారిని కలిశాం. ఆయనే మాకు ఆతిథ్యం. ఆయన పేరు హెక్‌షా! మాకు ఇచ్చిన విందులో ఆరుగురమే వున్నాము. అప్పుడే జడ్జిగారు "మీ హాస్యంలో నాకు బాగా నచ్చే అంశం–అది చాలా సహజంగా వుంటుంది. మీకు మనిషి బలహీనతలు బాగా తెలుసు. మీ చిత్రాలన్నీ అవే తెలుపుతున్నాయి. ఎంత గొప్పవాడైనా పిర్రలమీద తన్నితే అతని గర్వమంతా అణగి పోతుంది. ఈ విషయం మీకు బాగా తెలుసు." అలాగే ఆయన స్వగతంలా మాట్లాడుతున్నాడు. నేను రాబ్‌తో అన్నాను 'నా పుట్టిన రోజు పండగ మొదలయింది' అని.

తర్వాత విందులో జడ్జిగారు 'ఈ విందులో తక్కువమంది వున్నందుకు ఏమీ అనుకోకండి. మీతో దగ్గరగా గడిపాలని నేను ఎక్కువమందిని ఆహ్వానించలేదు' అన్నారు. ఈ జడ్జిగారు నన్ను అడిగారు – మీ వయస్సు ఎంత అని. 29 అన్నాను. 'ఇంకా పెళ్లి చేసుకోలేదా?' లేదన్నాను. 'నా వయస్సు 45. నేను బ్రహ్మచారిగా వున్నాను. అందుకు ఒక కారణం – నా దగ్గరకు వచ్చేవన్ని విడాకుల కేసులే. ఇద్దరూ కలిసి వుండలేరని భావన వస్తే ఇంకా వారికి విడాకులు వెంటనే మంజూరు చేస్తాను. నాకు ఈ ప్రాంతంలో విడాకుల జడ్జి అని పేరుకూడా ఉంది.' అన్నారు. ఆ గొంతులో ఏదో విషాదం తొంగి చూసింది.

ఆయన ఇంటిని చూపారు. అది పాతతరం జార్జియన్ భవనం. గొప్పగా ఉంది. లోపల 18వ శతాబ్దపు మంచాలూ, సోఫాలూ, ఇంటి సామానూ ఎంతో విశిష్టంగా వున్నాయి. 'ఎంత అందంగా వుంది' అని ఆశ్చర్యపోయాను. 'అవును ఇల్లు వుంది. భార్య లేదు' అని అన్నాడు. 'ఈ పొరపాటు నువ్వు చేయకు' అని గంభీరంగా అన్నారు.

తర్వాత డగ్లసూ, మేరీ, నేనూ న్యూయార్క్‌లో ప్రచారం చేశాము. అక్కడి గవర్నరు మాతో వున్నారు. మిలిటరీ బ్యాండ్ ప్రతిసారీ జాతీయగీతం వాయిస్తోంది. అన్నిసార్లు గవర్నరు లేచి నిలబడాల్సి వస్తోంది. ఆ తర్వాత జాతీయ గీతాన్ని ఆపేశారు! ఆ విధంగా లక్షల డాలర్ల బాండ్లు అమ్మే ప్రచారం ముగించాము.

న్యూయార్క్‌నుంచి లాస్ ఎంజెలిస్ బయలుదేరక ముందు మేరీజోరో అప్పుడు పాత పారమౌంట్‌కి పనిచేస్తోంది. ఆమె నన్ను కలవాలని కబురు చేసింది. నా అభిమానినని. ఆమెను నేను కలిశాను. అప్పుడు చెప్పాను "నేను మీతో కలిసి పనిచేశాను." షెర్లాక్ హెూం'లో నేనే బిల్లీనని గుర్తు చేశాను. ఆమె ఆశ్చర్యపోయింది.

మేము ఆ వెచ్చని వేసవి సాయంత్రం కలిసి భోజనం చేశాము. మేరీ చాలా రొమాంటిక్‌గా కొవ్వొత్తుల వెలుగులో విందు ఏర్పాటు చేసింది.

తర్వాత లాస్‌ఎంజెలిస్ వచ్చేశాను. అథ్లెటిక్ క్లబ్‌లోనే ఉండే ఏర్పాటు చేసుకున్నాను. 'డాగ్స్ లైఫ్' అనుకున్న దానికన్నా ఎక్కువ ఖర్చయింది. తర్వాత ఏమి సినిమా తియ్యాలి అని ఆలోచనలో పడిపోయాను. మథనపడ్డాను కూడా!

అప్పుడే నాకు యుద్ధం నేపథ్యంలో సినిమా తీయాలని అనిపించింది. అందరూ వద్దు – ఇది ప్రమాదకరమైనది. ఆ ప్రయత్నం మానుకోమన్నారు. ప్రమాదమో – కాదో ఆ ఆలోచన నాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది!

'షోల్డర్స్ ఆర్మ్స్' మొదట్లో 5 రీళ్లు సినిమాగా అనుకున్నాను. మొదట్లో ఇంటి జీవితం. మధ్యలో యుద్ధం – తర్వాత చివర్లో విందులు. ఇదీ ప్రణాళిక. ఐరోపా నాయకులను అందర్ని ఆ విందులో చూపాలని నా ఉద్దేశ్యం. కైజర్‌ను జయించటంతో సినిమా అయిపోతుంది. నా కల కూడా!

మొత్తం చిత్రీకరించి యుద్ధానికి ముందూ, వెనుకా తీసివేశాను. దానిలో హాస్యం కేవలం అంతర్లీనమే.

చార్లోట్ హీరో. అతను అతని నలుగురు సంతానంతో ఇంటికి వస్తుంటాడు. ఇంట్లో వాళ్లను వదిలి మూతి తుడుచుకుంటూ తలుపు తీస్తాడు. అతని ముఖానికి ఒక పెద్ద మూకుడు వచ్చి తగులుతుంది. భార్యను చూపించం – ఆమె వేసుకునే వంటింటి గౌను అక్కడ చాలా పెద్దది వేలాడుతుంటూంది.

తర్వాత చార్లోట్ యుద్ధంలో చేరటానికి పరీక్షలకు వెళ్తాడు. అతన్ని పూర్తిగా నగ్నంగా నిలబెడతారు. డా. ఫ్రాంసిన్ అనే పేరు ఉన్న గాజు తలుపు దగ్గర నిలబడ్డాడు. అవతల ఒక నీడ కనపడుతుంది. అది స్త్రీ అనుకుని ప్రక్క అద్దాల తలుపులోంచి వేరు ఆఫీసుకు వెళ్తాడు. అక్కడ అన్ని కాబిన్స్‌లోని మనుషులు ఇతన్ని చూస్తారు. కంగారుగా ఇంకో తలుపులోంచి ఇలా చివరికి ఒక బాల్కనీకి వస్తాడు. పూర్తి నగ్నంగా. కింద పెద్ద వీధి జనంతో వుంటుంది. ఇదంతా చిత్రీకరించాం కాని సినిమాలో పెట్టలేదు.

చివరికి చార్లోట్‌ని అనామకునిగానే వుంచి మిలిటరీలోనే చూపిద్దామని. 'షోల్డర్స్ ఆర్మ్స్' మండు వేసవిలో తీసాము. చెట్లు కొమ్మలు అడ్డుపెట్టుకుని. నాకు బయట చిత్రీకరించటం నచ్చదు. అక్కడ ఏదీ మన చెప్పుచేతల్లో వుండదు. కేవలం గాలికి కూడా మన ఏకాగ్రత కొట్టుకు పోతుంది!

ఈ సినిమా ఎక్కువ కాలం పట్టింది. డబ్బు కూడా ఎక్కువ ఖర్చయ్యింది. నాకు పూర్తిగా నచ్చలేదు. తీసి డబ్బాల్లో పెట్టేద్దాం అనుకున్నాను. డగ్లస్ చూస్తానన్నాడు. ఒక స్నేహితునితో వచ్చాడు. నేను చెప్పాను చెత్తకుండీలో వేద్దామని వుంది అని. అయినా

చూశాడు – మొదటి నుంచి చివరి వరకు బిగ్గరగా నవ్వుతూనే వున్నాడు. సినిమా పూర్తయిన తర్వాత బైటకు వచ్చాం. ఆయన కళ్ళు నవ్వీ నవ్వీ తడిసిపోయాయి.

'ఏంటి నిజంగా ఫన్నీగా వుందా?' అన్నాను. ఆయన తన స్నేహితుని చూసి 'నీవేమంటావు – ఈ సినిమాని చెత్తకుండీలో వేస్తానంటున్నాడు' అని మళ్లీ నవ్వాడు. చివరికి 'షోల్డర్స్ ఆర్మ్' విడుదల చేశాను. అది గొప్పగా విజయం సాధించింది. అందులో సైనికులకు చాలా నచ్చింది. ఇది కూడా డాగ్స్ లైఫ్ వలెనే ఎక్కువ ఖర్చయింది. ఇప్పుడు నన్ను నేను మించిపోవాల్సి వచ్చింది. మా కంపెనీ 'ఫస్ట్ నేషనల్' నాకు సహాయం చేయవచ్చు. నేను వాళ్లతో చేరిన దగ్గర్నుంచి వాళ్ళ వ్యాపారం బాగా వుంది. నిర్మాతల్నీ, తారల్నీ 250 వేల డాలర్లు ఇచ్చి బుక్ చేసుకుంటున్నారు. తర్వాత యాభైశాతం వాటా కూడా ఇస్తున్నారు. వాళ్ల సినిమాలు తక్కువ ఖర్చుతో చేస్తున్నారు. అలాగే తక్కువ డబ్బు వసూలు చేస్తున్నారు.

నేను జె.డి. విలియమ్స్‌తో మాట్లాడాను. ఆయనే ఫస్ట్ నేషనల్ అధ్యక్షుడు. నాకు ఖర్చయిన అదనపు డబ్బు ఇప్పించమని అదీ 15 వేల డాలర్లు. దానికి మేము త్వరలో కలుస్తాము. అప్పుడు చర్చిస్తాము అన్నాడు. ఇదెలా వుందంటే జనరల్ మోటర్ల ఫ్యాక్టరీలో ఒక కార్మికుడు, జీతం పెంచమని అడిగినట్లు!

తర్వాత వాళ్లు 'చార్లీ నువ్వు ఒప్పందానికి కట్టుపడాలి' అన్నారు. "మీకు ఆ సినిమాలు 6 నెలల్లో ఇస్తాను. వాటి నాణ్యత గురించి పట్టించుకోవద్దు." అన్నాను. 'అది నీ యిష్టం' అన్నారు.

"నేను నా సినిమాల విలువను కాపాడడం కోసం ఈ డబ్బు అడుగుతున్నాను. ఇది తినుబండారాలు వ్యాపారం కాదు. వ్యక్తిగతమైన ప్రతిభ. దీనికి చాలా విలువ వుంటుంది" అన్నాను. అయినా వాళ్లు ఏమీ కదలిక చూపలేదు. నాకున్న డిమాండును

కూడా వాళ్లు పరిగణలోనికి తీసుకోలేదు. అప్పుడు సిడ్నీ చెప్పాడు. త్వరలో మోషన్ పిక్చర్స్ కన్వెన్షన్ జరగబోతోంది. అందరూ నిర్మాతలు కలిసి పెద్ద కంపెనీ పెడతారని. ఇదీ పుకారు అని. అందుకనే వాళ్లు అంత మొండిగా వ్యవహరిస్తున్నారు.

తర్వాత సిడ్నీ వెళ్లి మేరీని డగ్లస్‌ని కలిశాడు. వాళ్లు కూడా ఈ వ్యవహారంతో ఆందోళనగానే వున్నారు. వాళ్లకి పారమౌంట్‌తో ఒప్పందాలు చివరి దశలో వున్నాయి. అప్పుడు మేము ఈ విషయంలో ఒక రహస్య కార్యదర్శిని నియమించి విషయం గ్రహించాలి. అలాగే ఒక తెలివిగల ఆకర్షణీయమైన అమ్మాయిని ఈ పనికి నియమించాము. ఆమె సినీ నిర్మాతల కంపెనీ కార్యదర్శుల నుంచి చాలా తెలివిగా ఒక వారం రోజుల్లో మాకు చాల విలువైన సమాచారం అందించింది. దాని సారాంశం: సినీ నిర్మాతలందరూ కలిసిపోయి ఒక పెద్ద విడుదల కంపెనీని పెడతారు.

అప్పుడు వ్యాపారం మొత్తం వాళ్ల చేతుల్లో వుంటుంది. నటీనటులు వాళ్ళ చెప్పుచేతల్లోకి వస్తారు. థియేటర్లన్నీ వాళ్ల అధీనంలోకి వస్తాయి. ఇదీ ప్రణాళిక. దీనిని మేము డి.డబ్ల్యు. గ్రిఫ్ఫిత్, బిల్ హార్ట్‌కి చూపాము. వాళ్లుకూడా మాలాగే స్పందించారు. అప్పుడు సిడ్నీ ఒక ఆలోచన చెప్పాడు. వార్తా పత్రికలను పిలిచి నటీనటులంతా కలిసి ఒక కంపెనీ పెడుతున్నారు. థియేటర్లను అయిదు సంవత్సరాల ఒప్పందంపై తీసుకుంటారు అని. దీనితో నిర్మాతల ఆటలకు అడ్డుకట్ట వేయవచ్చు అని. ఇది కేవలం వారిని కట్టడి చేయటానికే. కాని కంపెనీ పెట్టే వుద్దేశ్యం మా ఎవ్వరికీ లేదు.

అందుకని కన్వెన్షన్‌కంటే ముందు మేము ఈ వార్త పత్రికలకు చెప్పాలని. ఆ రాత్రి మేము అలెగ్జాండ్రియా హోటల్‌లో భోజన శాలలో కలిశాం. డగ్లస్ – మేరీ గ్రిఫ్ఫిత్, బిల్ హార్ట్, నేను. మేము మాట్లాడుకుంటుండగా. జె.డి. విలియమ్స్ హోటల్‌కి వచ్చి మమ్మల్ని చూసి కంగుతిన్నాడు. అలా ఇంకో నిర్మాత రావటం, చూసి వెళ్ళటం. వాళ్లు వచ్చినప్పుడు డగ్లస్ బిగ్గరగా మిలియన్ డాలర్ల వ్యాపారం మాట్లాడడం. ఇలా కొంతసేపు జరిగింది.

ఆ తర్వాత ఒక అరడజను పత్రికల వాళ్లు మా చుట్టూ చేరారు. మేము మా ప్రకటన ఇచ్చాము. యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీని మొదలు పెడుతున్నట్లు.

ఆ మర్నాడు ప్రొడక్షన్ కంపెనీ తలకాయలు అక్కడ రాజీనామాలు ఇచ్చి మా దగ్గరకు రావటానికి సిద్ధపడ్డారు.

మేము మేరీ పిక్ ఫోర్డ్ ఇంటి దగ్గర సమావేశం పెట్టాం. అందరం ఎవరి లాయర్లను వాళ్లు తెచ్చుకున్నాం. అప్పుడు మొత్తం ఇందులో వున్న – న్యాయపరమైన వ్యాపార సంబంధమైన వివరాలన్ని మేరీ చెప్తుంటే నేను ఆశ్చర్యపోయాను. చట్టాలలోని సెక్షన్‌లు అన్నీ చెప్పి మరీ వివరాలతో ఇదే అమెరికా సినిమా – ఇట్ బిలాంగ్స్ టు అజ్ జెంటిల్‌మెన్ అని ముగించింది ఇది నాకూ చాలా నవ్వు తెప్పించింది.

అప్పుడు మేరీ పిక్ ఫోర్డ్‌ని హెల్లీ గ్రీన్‌తో పోల్చేవాళ్లు.హెల్లీ గ్రీన్ తన వ్యాపార మెలుకువలతో కోటి డాలర్లు సంపాదించింది. మాతో పారమౌంట్ కంపెనీ అడాల్ఫ్ జోకర్ వస్తానన్నాడు. ఈయన చాలా సమర్థుడు. నెపోలియన్ లాంటివాడు. 'మీకు పూర్తి హక్కు వుంది – ఈ వ్యాపారంలో ఎక్కువ వాటా రావటానికి.' అని మాతో చెప్పేవాడు. మీరే సృష్టిస్తారు. సృజనకారులు అని పొగిడేవాడు. ఆయన మా కంపెనీ వాటా అడిగేసరికి, మాకు ఒప్పందం కుదరలేదు. ఆరె నెలల్లో మేరీ–డగ్లస్ మా కొత్త కంపెనీకి సినిమాలు తీస్తున్నారు. నేను ఇంకా ఆరు సినిమాలు ఫస్ట్ నేషనల్‌కి తీయాలి. వాళ్ల నిరంకుశమైన శైలి నా పనికి అడ్డమైపోయింది. నేను లక్ష డాలర్ల లాభం ఇచ్చి ఒప్పందం రద్దు చేద్దామని అన్నాను. అయినా వాళ్లు వినలేదు. ప్రస్తుతానికి మేరీ డగ్లస్ మాత్రమే వాళ్ల సినిమాలు యునైటెడ్ ఆర్టిస్ట్స్ ద్వారా పంపిణీ చేస్తున్నారు. వారికిది భారంగానే వుంది. వాళ్లు 20 శాతానికే పంపిణీ చేస్తున్నారు. కంపెనీకు మొదట ఆరు నెలల్లో 10 లక్షల డాలర్ల నష్టం వచ్చింది. తర్వాత నా మొదటి సినిమా 'గోల్డ్ రష్' విడుదలతో ఈ అప్పు తీరిపోయింది. తర్వాత ఇక వాళ్లు చాలా సంతోషించారు.

ఇప్పుడు యుద్ధం చాలా క్లిష్ట దశకు వచ్చింది. ఐరోపా అంతా మారణకాండ – విధ్వంసం జరుగుతోంది. సైనికులకు మనుషుల్ని ఎలా చంపాలో శిక్షణ ఇస్తున్నారు. చాల దారుణమైన పరిస్థితి నెలకొని వుంది. సైన్యంలోనికి రానివారిని అయిదేళ్లు జైలుశిక్ష విధిస్తున్నారు. ఎవరైనా మామూలు దుస్తులు వేసుకుంటే చాలా అవమానంగా వుండేది.

అప్పటికే నన్ను కొన్ని పత్రికలు విమర్శించటం మొదలుపెట్టినాయి. నేను యుద్ధంలో పాల్గొనే ప్రయత్నం చేయటంలేదని. మిగతావారు నన్ను సమర్థించారు. నా సైన్య విన్యాసాలకంటే నా హాస్యచిత్రాలే ఎక్కువ అవసరం అని.

అప్పుడు అమెరికన్ సైన్యం అంతా ఇరవయిల్లో వున్నారు. ఉత్సాహంతో వున్నారు. ఫ్రాంస్ వెళ్లారు. అప్పటికీ యుద్ధాలలో పండిపోయిన ఇంగ్లాండు, ఫ్రాంస్ సైన్యం

వాళ్లని నియంత్రించింది. కాని అమెరికన్ శక్తులు రావటంతో – అందరూ కలిసి ముందుకు వెళ్లారు. నాటో కూడా సైన్యాలు విజయం సాధించటం మొదలు పెట్టినాయి. చివరికి కైసర్ హాలెండ్ పారిపోయినట్లు వార్తలు వచ్చాయి.

అప్పుడు వార్తాపత్రికలు 'ఒప్పందం కుదిరింది. శాంతి సాధించాం' అని పెద్ద అక్షరాలతో రాశారు. ఈ వార్త వచ్చినపుడు నేను అథ్లెటిక్ క్లబ్‌లో నా గదిలో వున్నాను. ఇంక నగరమంతా ఒకటే సందడి. పండగ బాజాలు ఈలలు. గంతులు ఆలింగనాలు, ముద్దులు చివరికి శాంతి–శాంతి!

ఎక్కడా యుద్ధం లేకుండా జీవితం సాగించటం అంటే కారాగారం నుంచి బైటకు వచ్చినట్లే – కాని కొన్ని నెలలవరకూ మేము కార్డులు లేకుండా బైటకు వచ్చేవాళ్లం కాదు!

ఏది ఏమైనా కూటమి గెల్చింది. కాని నిజానికి శాంతి ఎక్కడ? ఒక్క విషయం మాత్రం నిజం. నాగరికత అనేది మనకు తెలిసిన రీతిలో వుండదు. ఆ తరం వెళ్లిపోయింది. దానితోపాటు ఆ మర్యాదలు, ఆ విలువలు కూడా కొట్టుకు పోయాయి.

ఇవి ఏ తరంలోనూ ఒకే విధంగా వుండవు!

పదహారవ అధ్యాయం

పెళ్ళీ-పెటాకులూ

టామ్ హార్రింగ్టన్ నా జీవితంలో సేవ చేయటానికే ప్రవేశించినా అప్పుడు జరిగిన సంఘటనలకు సాక్షిగా నిలిచాడు. అతను బట్టలందించేవాడిగా బెర్ట్‌క్లార్క్‌కు సహాయకారిగా వుండేవాడు, కీస్టోన్ కంపెనీతో. బెర్ట్ ఒకసారి నాతో చర్చించాడు. అతను చాలా మంచి పియానో వాద్యగాడు. ఒక సంగీత ప్రచారణ కంపెనీతో వాటా కలవమన్నాడు. మేమిద్దరం కలిసి ఒక గది అద్దెకు తీసుకుని నా పాటలు రెండు నా సంగీత దర్శకత్వంలోనే రికార్డులు చేసి అమ్మటానికి పెట్టాము. కేవలం మూడు రికార్డులే అమ్మాము. ఒకటి చార్లెస్ కాడ్‌మన్‌కి, మిగతా రెండు ఆ వైపుగా వచ్చిన అమాయకులకు.

అప్పుడే టామ్ ఆఫీసు కాపలా వుండేవాడు. తర్వాత నెలరోజులకు క్లార్క్ న్యూయార్క్ వెళ్లాడు. ఆఫీసు మూత పడింది. కాని టామ్ నాతోనే వుండిపోయాడు. ఆశ్చర్యం ఏమిటంటే అప్పటివరకు అతనికి జీతమే లేదు! అతను పూర్తి శాఖాహారి. టీ, కూరగాయలు, రొట్టెతోనే కాలక్షేపం చేసేవాడు. అప్పటినుంచి అన్ని పనులూ, బట్టలు అందించేవాడు. ప్రతి పనికీ తలలో నాలుకలా వుండేవాడు. ఆయనే నా కారు డ్రైవరు కూడా! టామ్ చాలా నెమ్మదస్తుడు. అతని వయస్సెంతో కూడా తెలిసేది కాదు. సన్నని పెదాలు, ఎత్తైన కనుబొమ్మలూ, ఈ ప్రపంచాన్ని జాలిగా చూసే కళ్లు! అతను ఐర్లాండ్ మూలాలు కలవాడు. ఒకరకమైన మార్మికత అతన్ని అంటిపెట్టుకుని ఉండేది! అతను మత మఠాలతో వుండవలసిన వాడు. ఈ సినిమా ప్రపంచంలో ఎలా పడ్డాడో తెలియదు!

ఉదయాన్నే అథ్లెటిక్ క్లబ్‌లో నా గదికి వచ్చేవాడు. అప్పటికే నాకు వచ్చిన ఉత్తరాలూ, వార్తా పత్రికలూ తీసుకుని నాకోసం ఉదయపు ఫలహారం పురమాయించేవాడు. ఏమీ మాట్లాడేవాడు కాదు! నాకోసం పుస్తకాలు తెచ్చేవాడు.

లిఫ్‌కాడియో హెర్న్, ఫ్రాంక్ హారిస్ – ఈ రచయితలు. వీళ్లగురించి నేనెప్పుడూ విననే లేదు. టామ్ మూలంగానే బాస్‌వెల్ రాసిన 'లైఫ్ ఆఫ్ జాన్సన్' చదివాను. 'మీరు రాత్రి త్వరగా నిద్రపోవటానికి' అని నవ్వేవాడు.

నేను పలకరించందే నోరు విప్పేవాడు కాదు. నేను టిఫిన్ చేస్తున్నప్పుడు మౌనంగానే అన్నీ వడ్డించేవాడు. చివరికి నా జీవితంలో అతను భాగమైపోయాడు. నేను 'ఇది చేయి' అని అనటమే తరువాయి, ఆ పని అయిపోయేది.

ఆ రోజు నేను అథ్లెటిక్ క్లబ్ నుంచి బయలుదేరే ముందు టెలిఫోన్ మ్రోగకపోతే నా జీవితం మరొక రకంగా వుండేదేమో! ఆ ఫోన్ చేసింది – సామ్ గోల్డ్‌విన్. ఆ సాయంత్రం ఆయన ఇంటికి విందుకు రమ్మని. అదీ సాగరతీరంలో! అది 1917 చివర్లో!

ఆ మధ్యాహ్నం మబ్బులతో ఆహ్లాదకరంగా వుంది. అక్కడ ఆలివ్ థామస్ ఇంకా చాలామంది అతిథులూ, అందమైన అమ్మాయిలూ చాలామంది వున్నారు. సాయంత్రం వేళకు మిల్డ్రెడ్ హారిస్ అనే అమ్మాయి వచ్చింది. చాలా అందంగా వుంది. ఆమె ఎస్కార్ట్ హామ్‌తో వచ్చింది. ఎవరో అన్నారు. ఆమెకు ఎలియట్ డెక్టర్‌తో వ్యవహారం వుంది అని. ఆయనకూడా ఈ విందులో వున్నాడు. కాని ఆమెను ఏమీ పట్టించుకోవడం లేదు. ఆ తర్వాత ఆమె గురించి నేను ఆలోచించలేదు. నేను వెళ్లటానికి సిద్ధమవుతుండగా ఆమె తనను దారిలో దింపమని అడిగింది. ఎవరో స్నేహితునితో వచ్చినట్లూ, అతను తనని వదిలి వెళ్లి పోయినట్లూ చెప్పింది. కారులో నేనన్నాను 'బహుశా నీ స్నేహితుడు డెక్టర్ ఉంటే అసూయ పడేవాడు అని!' ఆమె, 'డెక్టర్ చాలా మంచివాడని' అంది. అవును 'అతను చాలా అదృష్టవంతుడు కూడా' అన్నాను. ఇదంతా సాదాసీదా సంభాషణే. ఆమె అంది, లూయీస్ వేబెర్‌కి పనిచేసినట్లు. ఇప్పుడు పారమౌంట్ సినిమాలో నటిస్తున్నట్లు.

ఆమెను తన ఇంటిదగ్గర దింపి, చాలా చిన్న చిలిపి అమ్మాయి అనుకున్నాను. ఆమెను దింపిన తర్వాత నాకు చాలా హాయిగా అన్పించింది. ఒంటరిగా నా గదిలో చేరి అయిదు నిమిషాలు కూడా అవలేదు. ఫోన్ మోగింది. హారిస్! 'ఏమీలేదు – మీరు ఏమి చేస్తున్నారో తెలుసుకుందామని' అంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మేమేమన్న ప్రేమికులమా?

'నేను భోజనం చేసి పడుకుని చదువుకుంటాను' అన్నాను. అప్పటికే ఆమె గొంతులో మార్పు వచ్చింది. 'మళ్లీ ఎప్పుడు కలయిక?' అంది. 'నీవు ఎలియట్‌ను మోసం చేస్తున్నావేమో?' అన్నాను. 'నాకు అతనంటే లెక్కలేదు.' అంది. నేను చివరికి భోజనానికి రమ్మన్నాను. ఆమె చాలా అందంగా వుంది. నాకు అంతగా ఉత్సాహం లేదు. మా యిద్దరికీ మధ్య ఎటువంటి భావోద్వేగం లేదు. కేవలం శృంగారపు అవకాశమే. నేను రొమాంటిక్‌గా వుండటానికి చాలా ప్రయత్నం చేశాను. ఆ రాత్రి అలా గడిచింది. మరో వారం రోజులు ఆమె సంగతే మరచిపోయాను టామ్ చెప్పేవరకు ఆమె ఫోన్ చేసిందని. నేను టామ్‌తో అన్నాను – 'చెప్పలేకపోయావా, నాకు కలవాలని లేదని' అని. అప్పుడు టామ్ అన్నాడు – 'మీరు చాలా అందమైన అమ్మాయితో సామ్ మేయర్ ఇంటినుంచి వచ్చారని ఆరోజు మిమ్మల్ని తీసుకు వచ్చిన డ్రైవరు అన్నాడు' అని. నేను ఒక్కసారిగా అదిరిపడ్డాను. ఈ మాట నా అహానికి బాగా హత్తుకుంది! తర్వాత విందులూ, వినోదాలూ వారాంతాలూ వెన్నెల రాత్రులూ సముద్ర తీరాలూ – ఇవన్నీ అయిపోయేలోగా జరగరానిది జరిగింది. మిల్డ్రెడ్ నెలతప్పింది. ఆమె చాలా ఆందోళన చెందింది.

టామ్ లోపల ఏమి దాచుకున్నాడోగానీ తనలోనే దాచుకున్నాడు.

ఒకరోజు నాకు ఉదయపు ఆహారం తెచ్చి నిలబడి వున్నాడు. అప్పుడు నేను హఠాత్తుగా, నా పెళ్లి ఆలోచన గురించి చెప్పాను. 'ఏ రోజు' అని మాత్రం అన్నాడు. 'ఇవాళ ఏ రోజు' అని అడిగాను.

'మంగళవారం'

'అయితే శుక్రవారం ఏర్పాట్లు చెయ్యి!' అన్నాను.

'పెళ్లికూతురు మిల్డ్రెడ్ హారిస్ అనుకుంటాను?' అన్నాడు.

'అవును.'

కాసేపు మౌనంగా వుండి 'మీ దగ్గర వివాహపు ఉంగరం వుందా?' అన్నాడు.

'లేదు – నీవే ఒకటి తీసుకురా' అని 'ఏర్పాట్లు చూడు' అన్నాను. ఇంక దీన్ని గురించి మళ్ళీ చర్చలేదు.

తర్వాత 'శుక్రవారం సాయంత్రం ఎనిమిది గంటలకు' అన్నాడు. నేను హారిస్‌ని పెళ్లిళ్ల రిజిస్ట్రారు స్పార్క్ ఇంట్లో కలవాలని చెప్పాడు!

ఆ రోజు చాలా ఎక్కువ సమయం పని చేశాను. చివరికి స్పార్క్స్ ఇంటికి చేరాం. అక్కడి హాల్లో హారిస్ కూర్చుని వుంది. నాకు జాలివేసింది. మామూలు బట్టల్లో వుంది. చాలా అందంగా. నా చేతిలోకి టామ్ ఉంగరం పెట్టాడు. (ఆ ఉంగరం ఆమె వేలికి తొడగాలి). అంతలో పొడవాటి వ్యక్తి వచ్చాడు. స్పార్క్స్ 'చార్లీ మీ కార్యదర్శి చాలా కార్యశూరుడు. ఇది నీ పెళ్లి అని అరగంటక్రితం వరకు తెలియదు సుమా' అని నవ్వాడు. అతన్ని గదిలోకి తీసుకువెళ్లి పెళ్లి తంతు చాలా సాదాగా ముగించాడు. అప్పుడు ఉంగరం ఆమె వేలికి తొడిగాను. 'చార్లీ, ముద్దు పెట్టటం మరిచిపోకు' అని అన్నాడు రిజిస్ట్రార్!

ఇదంతా నాకు ఆనందంగా లేదు. ఏదో వలలో, అనవసరపు వ్యవహారంలో చిక్కుకున్నట్లు అన్పించింది. ఆమెకూ నాకూ పదేళ్లు తేడా వుంది. నాకు భార్య కావాలి. ఈమె నా భార్యగా వుండగలదా అనే సందేహం నన్ను పట్టి పీడిస్తోంది. మా కలయికకు సరయిన పునాది లేదనిపించింది.

మర్నాడు స్టూడియోకి బరువెక్కిన మనసుతో వెళ్లాను. అక్కడ ఎడ్నా వుంది. అప్పటికే వార్తలు చదివింది. 'అభినందనలు' అంది. ఆమె అక్కడ వుండటం నాకు అసౌకర్యం అన్పించింది.

తర్వాత డగ్లస్‌తో చెప్పాను. హారిస్ నాకు అంతగా భారం కాదు, మేధోపరంగా అన్నాను. నేను చాలా తెలివిగల అమ్మాయిని, బాగా చదివిన విదుషీమణిని పెళ్లి చేసుకోవాలని లేదు అనికూడా చెప్పాను. కాని లోలోపల భయంగానే వుంది. ఈ పెళ్లి మూలంగా నా పని చెడిపోతుందని. నేను ఈమెను ప్రేమించలేదే ఇప్పుడు పెళ్లి అయ్యింది. ఇప్పుడైనా ప్రేమగా వుండాలి. ఈమెకు ఎంత దగ్గరగా వుండగలను? ఏ విధంగా ఈ పెళ్లిని విజయవంతం చేయాలి?

కాని మిల్డ్రెడ్‌కి ఇదంతా ఆటగా, ఒక సాహస చర్యగా వుంది. ఏదో అందాల పోటీలో గెలిచినట్లుగా ప్రవర్తించింది. ఆమెకు ఏదీ నిజంలాగా అన్పించలేదు. నేను మా భవిష్యత్తు ప్రణాళికలు చెప్తుంటే ఎటో చూసేది. మా పెళ్లయిన రెండోరోజు ఎమ్.జి.ఎమ్. కంపెనీ శామ్ మేయర్ ఆమెతో ఒప్పందానికి రాయబారాలు నడిపాడు. 50 వేల డాలర్లు. ఒక సంవత్సరం ఆరు సినిమాలు. నేను ఆమెను ఆ ఒప్పందం ఒప్పుకోవద్దన్నాను. నీకు సినిమాలే కావాలంటే ఒక్క సినిమాకు 50 వేలు వచ్చే ఏర్పాటు చేస్తానన్నాను.

మోనాలీసా లాగా నవ్వి నేను చెప్పినవి అన్నీ వింది. మర్నాడు ఎమ్.జి.ఎమ్.తో ఒప్పందం చేసుకుంది! ఈ తల ఊపటం, అన్నిటికీ సరేనని, తర్వాత దానికి వ్యతిరేకంగా ప్రవర్తించటం నాకు చాలా చిరాకుగా అన్పించింది.

ఈమె ప్రవర్తనా మేయర్ ప్రవర్తనా నాకు చిర్రెత్తుకొచ్చింది. మా పెళ్లి రిజిస్ట్రేషన్ సిరా ఆరకముందే ఆమెతో ఈ ఒప్పందం చేయించాడు మేయరు! ఆ తర్వాత నెలరోజుల్లోనే మేయరుకూ మిల్డ్రెడ్‌కూ పొరపొచ్చాలు వచ్చాయి. అప్పుడు ఆ విషయంలో నన్ను కల్పించుకోమని అడిగింది. నేను ససేమిరా మేయర్ను కలవనని చెప్పాను. ఆ సాయంత్రం నాకు తెలియకుండానే ఆయన్ను విందుకు ఆహ్వానించింది. చివరి నిమిషంలో ఇదంతా చెప్పింది. అంతలోనే కాలింగ్ బెల్ మోగింది. నేను లైబ్రరీలోకి వెళ్లి దాక్కున్నాను. వాళ్లు హాల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. నేనింట్లోనే వున్నానని అనుమానం మేయరికి. ఆయన మాటలన్నీ ఆచి తూచి వస్తున్నాయి. మిల్డ్రెడ్ 'చార్లీ బహుశా రాకపోవచ్చు' అని అంది. మేయర్ విందారగించకుండానే వెళ్లిపోయాడు.

మా పెళ్లి జరిగిపోయిన తర్వాత మిల్డ్రెడ్ కడుపు ఒట్టిదేనని తేలింది! ఇలాగే చాలా నెలలు గడిచిపోయాయి. అప్పటికి ఒక్క సినిమా మూడు రీళ్లు 'సన్నిసైడ్' తీయగలిగాను. అనుమానం లేకుండా ఈ పెళ్లి నాకూ, నా పనికీ, నా సృజనాత్మకతకు పెద్ద గుదిబండ అయిపోయింది. 'సన్నిసైడ్' అయిన తర్వాత నాకు సినిమా కథే తట్టలేదు. ఇంత దారుణం ఎప్పుడూ లేదు.

దీనిలో నుంచి బైటపడటానికి ఒక నాట్య ప్రదర్శనకు వెళ్లాను. అక్కడ నాట్యం చేసినతను బాగా చేశాడు. కాని చివర్లో అతను అభివాదం చేసేముందు నాలుగేళ్ల పసివాడిని తీసుకు వచ్చాడు. ఆ బుడతడు వంగి అభివాదం చేసి వెళ్లేముందు చక్కని లయతో అడుగులువేసి వెళ్లిపోయాడు. అంతే ప్రేక్షకులు చప్పట్లతో హోరెత్తించారు. ఆ బుడతడిని మళ్లీ రప్పించారు. అతను కొద్దిసేపు నాట్యంలాంటిది చేసి చాలా సహజంగా, జాకీ కూగన్ అతని పేరు, ప్రేక్షకులను అలరించాడు.

తర్వాత అతన్ని గురించి మరిచిపోయాను. మేము అందరం పొడక్షన్ రంగం మీద కూర్చున్నాము. అందరూ నా చుట్టూ వున్నారు. నాకు కథకోసం ఆలోచనే రావటం లేదు. అందరికీ ఆ వారం నేను చూసిన నాట్య ప్రదర్శన, ఆ కుర్రవాని గురించి చెప్పాను. అప్పుడు ఒకరు 'అతన్ని రాస్కో అర్బకిల్ ఒక సినిమాకోసం బుక్ చేశారు'

అని చెప్పాడు. అరే ఈ ఆలోచన నాకెందుకు రాలేదు? అని అతన్ని దృష్టి పెట్టుకుని కథలల్లటం మొదలు పెట్టాను. ట్రాంప్, కుర్రవాడు కలిసి, కిటికీల అద్దాలు పెట్టటం, తర్వాత పని దొరకనప్పుడు కుర్రవాడు రాళ్లతో అద్దాలు పగలగొడుతూ, ట్రాంప్ అద్దాలు పెడుతూ ఇలా చెప్పుకుంటూ వెళ్లాను. ఇన్ని చెప్పిన తర్వాత ఏమిటి ఉపయోగం? రాస్కో అతనిని బుక్ చేశాడు కదా. ఎంతపని జరిగింది అని బాధపడ్డాను.

ఆ రాత్రీ ఆ పగలూ ఇవే ఆలోచనలు. ఆ కుర్రవాడితో కథ ఎలా నడపాలి అని. మర్నాడు మా వాళ్లందర్నీ రిహార్సల్‌కి రమ్మన్నాను. ఎందుకో నాకే తెలియదు.

అందరం కలిసి అక్కడే కూర్చుండిపోయాం! అంతలో ఎవరో అన్నారు ఇంకో కుర్రవాడిని వెదుకుదాం. అందులోనూ నల్లవాడయితే మరీ మంచిది అని. కాని నా దృష్టంతా జాకీమీదే వుంది. ఆ మధ్యాహ్నం మా ప్రచారకర్త రాబిన్‌సన్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. రొప్పుతున్నాడు కూడా. 'రాస్కో బుక్ చేసింది కుర్రవాణ్ణి కాదు – అతని తండ్రిని' అని వార్త చెప్పాడు.

'అయితే వెంటనే జాకీని ఫోన్‌లో పట్టుకోండి' అన్నాను. 'వెంటనే రమ్మని చెప్పండి' అని కూడా అరిచాను.

దీనికి అందరూ నన్ను ఎంతో అభినందించారు. అరే ఇంకా జాకీతో ఒప్పందం కాలేదే – అందుకని రాబిన్‌సన్‌తో చెప్పాను. 'జాగ్రత్త ఏ అనుమానం రాకూడదు – తండ్రికి కూడా ఏమీ చెప్పకు. ఇక్కడకు వచ్చేవరకు ఏమీ తెలియకూడదు' అని జాగ్రత్తలు చెప్పాను. చివరకు రెండు గంటల తర్వాతగాని తండ్రి దొరకలేదు. మా వాళ్లు అతన్ని పట్టుకు వచ్చారు!

అతను రాగానే జబ్బ పుచ్చుకొని చాలా చాలా మాట్లాడాను. కుర్రవాడికిది చాలా మంచి అవకాశం, వదలుకోవద్దు అని. 'నా కొడుకా?' అని ఆశ్చర్యపోయాడు. అవును ఒక్క సినిమా నాతో చెయ్యాలి. అతని జాతకం మారిపోతుంది.'

'ఓ అలాగే – ఆ కుర్ర కుంకను తీసుకో' అలా ముగిసింది.

హాలీవుడ్‌లో ఒక నానుడి వుంది. పిల్లలూ, కుక్కలూ మంచి నటులని! దీంట్లో చాలా నిజం వుంది. వాళ్లు సహజంగా చేసే పనుల్లోనే హాస్యం వుంటుంది. జాకీతో నాకు ఎటువంటి సమస్యా రాలేదు. అన్ని చాలా త్వరగా నేర్చుకున్నాడు.



కిడ్

'ది కిడ్' చిత్రీకరిస్తున్నాము. అందులో ఒక సీనులో కుర్రవాడు రాయి తీసుకుని కిటికీ అద్దంమీదకు వేయటానికి చేయి వెనక్కు సాచినప్పుడు అతనికి పోలీసు కోటుగుండీలు తగుల్తాయి. దానితో ఆ చేయి మెల్లగా కిందకు దింపి – రాయి పైకి ఎగరవేసి పట్టుకుంటాడు. కాస్త దూరం నడిచి, పోలీసునుంచి, ఆ రాయి పక్కకు విసిరి – తర్వాత పరుగు తీస్తాడు. ఈ వివరాలన్ని జాకీతో చెప్పి, సాధన చేయించాను. రెండు మూడుసార్లు చేశాడు. అతనికి ఆ సంఘటనలోని భావోద్వేగం పూర్తిగా అర్థమయ్యి – చిత్రీకరణలో నిండుతనం తీసుకు వచ్చాడు. ఈ సీనే చిత్రానికీ, జాకీకీ కూడా చాలా ముఖ్యమైంది.

కాని అన్నీ అంత తేలికగా, బాగా రావు. చిన్న సీనులు అనుకున్నవే చాలా కష్టమై పోయేవి. ఒకసారి జాకీని గేటుకు పట్టుకు వుయ్యాల వూగమన్నాను. కాని ఎన్నిసార్లు తీసినా అతని ముఖంలో ఏ భావమూ ప్రతిఫలించలేదు. దీనికి కారణం అక్కడ ఏ విషయమూ లేకపోవటమే. ఆ సీను చిత్రంలోంచి తీసివేశాను.

లోపల ఏమీ కథ లేకపోతే మామూలుగా నటించటం చాలా కష్టం. ది కిడ్‌లో జాకీ చాలా అద్భుతంగా చేశాడు! జాకీ నాన్న ఒప్పందం కూడా రద్దయింది. అతన్ని కూడా ది కిడ్‌లో తీసుకున్నాను. అతనికి ఒక దొంగ వేషం ఇచ్చాను. చిత్రీకరణలో చాలా సహాయకారిగా వుండేవాడు.

ఒకసారి జాకీ గట్టిగా ఏడవాల్సి వచ్చింది. ఎంత ప్రయత్నించినా అతనికి ఏడుపు రావటంలేదు. వాళ్ల నాన్న – నేను ఏడ్పిస్తానన్నాడు. నాకు జాకీని హింసించడం ఏమాత్రం ఇష్టంలేదు. ఆ విషయమే ఖచ్చితంగా చెప్పాను. 'అబ్బే అటువంటిదేమీ వుండదు' అన్నాడు. అయినా నేను మేకప్‌గదిలోకి వెళ్లాను. అంతలోనే గట్టిగా ఏడుపు, కేకలు విన్పడ్డాయి.

'జాకీ సిద్ధంగా వున్నాడు' అన్నాడు వాళ్ళ నాన్న. ఆ సీనులో కుర్రవాడిని నేను రక్షించాలి. బాలల నిర్బంధ గృహం నుంచి!

అతను నిజంగానే ఏడుస్తూ కన్నీరు కారుస్తున్నాడు. నేను ఎత్తుకొని గుండెలకు హత్తుకొని ముద్దు పెట్టాను. చిత్రీకరణ అయిపోయింది. అతని బుగ్గలు కందిపోయాయి. వాళ్ల నాన్నను అడిగాను 'ఏం చేశారు' అని. 'స్టూడియోలో నుంచి ఆ నిర్బంధ శాలకు పంపిస్తాను' అన్నాను అంతే!

తర్వాత నేను చాలాసేపు ఓదార్చాను. 'మా నాన్న అబద్ధం చెప్తున్నాడని తెలుసు' అని జాకీ అనటం కొసమెరుపు!

గోవనీర్ మోరిస్ అనే ఆయన చాలా సినిమాలకు కథలు సమకూర్చాడు. నన్ను చాలాసార్లు ఆయన ఇంటికి పిలిచేవాడు. నేను 'ది కిడ్' గురించి చెప్పినప్పుడు 'అబ్బే ఇది పనిచేయదు – హాస్యం, డ్రామా రెంటిలో ఒక్కటే ఉండాలి. ఏదో ఒకటి వెనకపడుతుంది.' అన్నాడు. నా నమ్మకాలు నాకున్నాయి. 'కిడ్'లో వ్యంగ్యం, హాస్యం, నిజాయితీ, సహజత్వం, డ్రామా ఇంకా ఒక మార్మికమైన వాతావరణం ఇన్ని కలగలిసి వున్నాయి. 'కిడ్' ఒక నూత్న ప్రక్రియ.

'కిడ్' ఎడిటింగ్ జరుగుతుండగా ఏడేళ్ల 'చెస్' వీరుడు అద్లెటిక్ క్లబ్‌లో ఇరవయిమందితో ఒకేసారి చదరంగం ఆడాలి. డా॥ గ్రిఫిత్, కాలిఫోర్నియా ఛాంపియన్. ఈయన కూడా కూర్చుంటున్నాడు.

"U" ఆకారంలో బల్లలు ఏర్పాటు చేసి, ఆటకు సిద్ధం చేశారు. అతన్ని నాకు పరిచయం చేశారు. చాలా నిశితంగా మన కళ్ళల్లోకి చూస్తాడు. తక్కువ మాట్లాడతాడు. నేను గదిలో ఫిల్మ్ కత్తిరిస్తున్నాను, అతన్ని పట్టించుకోకుండా. కాసేపు ఆగి 'నీకు పీచ్ పళ్లు ఇష్టమేనా' అని అడిగాను. 'చాలా ఇష్టం' అన్నాడు. అయితే బయట చెట్టు వుంది. నీవు కోసుకుని నాకూ తెచ్చిపెట్టు' అన్నాను నా పని చేసుకుంటూ. 'చెట్టు ఎక్కడ?' అని చాలా వుత్సాహం చూపాడు. 'అదిగో కార్లో చూపిస్తాడు.' అని వూరుకున్నాను. తర్వాత 15 నిమిషాలు గడిచింది. అతని చేతిలో పీచ్ పళ్లతో వచ్చాడు. అలా మొదలయింది మా స్నేహం.

"మీరు చెస్ (చదరంగం) ఆడతారా?" నాకు రాదు అన్నాను. 'రాత్రికి ఇరవయి మందితో ఒకేసారి ఆడుతున్నాను, మీరు వచ్చి చూడండి' అన్నాడు.

'ఆ తర్వాత భోజనానికి వెళ్దాం' అన్నాను. ఆ రాత్రి జరిగిన చదరంగపు డ్రామా చూడటానికీ, మెచ్చుకోవటానికీ ఆడటం తెలియాల్సిన పనిలేదు. 20 మంది నడి వయస్కులు చదరంగపు బల్ల ముందు ఎంతో ఏకాగ్రతతో ఎత్తులు వేస్తుంటే, కుర్రవాడు మధ్యలో తిరుగుతూ అందరికీ సమాధానంగా ఎత్తులు వేస్తున్నాడు. 'అదిగో చెక్‌మేట్.' హర్షధ్వనులు. ఇలా అందరూ అయిపోయారు. చివరికి డా॥ గ్రిఫత్ మాత్రం మిగిలాడు.

ఆయన దగ్గరకు వెళ్లి మీరు ఈ ఎత్తు వేస్తే నేను ఇది, తర్వాత ఇది ఇలా రాత్రంతా గడిచిపోతుంది. మనం 'డ్రా' చేసుకుందాం – అని ముగించాడు. మూడువందలమంది చూస్తుండగా ఏడేళ్ల కుర్రవాడు సాధించిన ఈ ప్రక్రియ, చాలా దూరంగా వుందనిపించింది!

కుర్రవాని ముఖ కవళికలు చాలా వేగంగా మారిపోతున్నాయి. పోనుపోను ఈ చదరంగం అతని ఆరోగ్యాన్ని బలి తీసుకుంటుందేమోనని అనుమానం వచ్చింది. అలా ఆ చదరంగపు రంగం ముగిసింది.

నాకు మిర్లెడ్ పై అనురాగం పెరిగినా, మా యిద్దరి జంట ఏమాత్రం కుదురుకోలేదు. ఆమె మనసులో ఏముందో నాకు అంతుబట్టలేదు. అదంతా రిబ్బనుముక్కలతో, తలపిన్నులతో నిండిపోయింది. ఆమెకు ఆమె ఉన్నచోటు తప్ప మిగతా ప్రపంచం అంతా బాగుంటుంది. అలా ఒక సంవత్సరం గడిచిపోయింది. మా యిద్దరికి, ఒక మగ సంతానం కలిగి మూడురోజుల్లో కన్నుమూశాడు (అప్పటికి కళ్లు తెరవలేదు). ఈ సంఘటన మమ్మల్ని ఇంకా దూరం చేసింది. ఒకే ఇంట్లోనే వుంటున్నా కలవటమే మరిచిపోయాము. ఎవరి పనిలో వాళ్లం తలమునకలై వున్నాము.

వారాంతాలు, స్నేహితులతో గడపటానికి వెళ్తున్నట్లు చీటిపెట్టి వెళ్లిపోతుంది.

చివరికి ఆరోజు రానే వచ్చింది. ఆ వారం డగ్లస్ వాళ్లింట్లో వున్నాను. ఆయనే చెప్పాడు. 'ఈ పుకార్లు నీవు తెలుసుకోవాలి' అని. నా భార్యను అడిగాను, ఏమిటిదంతా అని. ఆమె 'నాకేమి తెలియదు' అంది అమాయకంగా. 'అయినా మనమీరకంగా కాపురం చేయలేము' అన్నాను. 'అయితే ఏం చేద్దాం అనుకుంటున్నావు?' అంది. ఎంత మామూలుగా అడిగిందంటే, నేనే అవాక్కయ్యాను. చివరికి 'మనం విడిపోతే మంచిదేమో' అన్నాను. దీనికి ఆమె సమాధానం చెప్పలేదు. 'ఆ విధంగా మనం సంతోషంగా వుండగలము. నీవు చాలా చిన్న వయసులో వున్నావు. నీ పనిలో చాలా ముందుకు వెళ్ళటానికి అవకాశం వుంటుంది. మనం స్నేహితుల్లా విడిపోదాం. నీ లాయర్లని నా లాయర్‌తో మాట్లాడమని చెప్పు, అన్నీ చక్కపడతాయి' అని వివరించాను.

'నాకు కావలసింది అమ్మను చూడటానికి డబ్బుంటే చాలు' అంది. 'ఇది మనమే పరిష్కారం చేసుకుందాం' అన్నాను. అంతలోనే 'నా లాయర్ని పంపుతాను' అంది.

'అలాగే కానీ, అప్పటి వరకు నీవు ఇంట్లోనే వుండు. నేను క్లబ్‌కు వెళ్లిపోతాను' అన్నాను. ఇదే పొరపాటయిపోయింది. అప్పటివరకూ వార్తా పత్రికలకు చెప్పకూడదని అనుకున్నది, నేను క్లబ్‌కి మకాం మార్చగానే మేము విడిపోయాం అని పత్రికలు గగ్గోలు పుట్టించాయి. దానికి మిల్డ్రెడ్ కాస్త ఆజ్యంపోసింది కూడా. పత్రికలవాళ్లకు నేనేమీ చెప్పలేదు. కాని నేను ఆమెను వదిలివేసినట్లూ, ఆమె విడాకులకు కోర్టుకు వెళ్తున్నట్లూ పుట్టించాయి. పత్రికల వాళ్లు మా యిద్దరి మధ్యా పెద్ద నాటకమే ఆడారు. ఆమె చెప్పిందని నాకూ, నేను చెప్పానని ఆమెకూ అబద్ధాలు చెప్పి తాటికాయంత అక్షరాలతో వార్తలు రాశాయి.

కాలిఫోర్నియా చట్టం ప్రకారం ఆమెకు 25 వేల డాలర్లు వస్తాయి. నేను లక్ష డాలర్లు ఇస్తానని చెప్పాను. ఆమె దీనికి అంగీకరించి విడాకులకు పత్రాలు సిద్ధం చేయమంది. తీరా సంతకాలకు వచ్చేసరికి మళ్లీ పేచీపెట్టింది. అయితే ఏ కారణమూ చెప్పలేదు. మా లాయరుకు అనుమానం దీనివెనక ఎవరో వున్నారని. నాకు అప్పటికే ఫస్ట్ నేషనల్ కంపెనీతో పేచీగా వుంది. కిడ్ విషయంలో వాళ్లు నాకు 4 లక్షల డాలర్లు ఇచ్చి సరిపెడదాం అనుకున్నారు. నాకు ఖర్చు 5 లక్షల డాలర్లు అయింది. అందుకని నేను ఒప్పుకోలేదు. పైగా 18 నెలల కష్టం! వాళ్లకి న్యాయపరంగా ఆధారాలు లేవు. అందుకని నా విడాకుల కేసును అడ్డంపెట్టుకుని కిడ్ విడుదల ఆపాలని వారి ప్రయత్నం!

అప్పటికి కిడ్ ఎడిటింగ్ పూర్తవలేదు. నా జాగ్రత్త నేను పడాలి కదా! అందుకని ఈ ఎడిటింగ్ పని మరో రాష్ట్రంలో చేద్దాం అనుకున్నాను. అంతే కిడ్ డబ్బాలన్నీ పట్టుకుని ఇద్దరు సహాయకులతో సాల్ట్‌లేక్ సిటీకి వెళ్లిపోయాను. అక్కడ హోటల్‌లో రెండు గదులు తీసుకుని 4 లక్షల అడుగుల సినిమాని ఎడిటింగ్ మొదలుపెట్టాను. అక్కడ ఎటువంటి సౌకర్యాలూ లేవు. చిన్న మూవియోలా తప్ప.

ఒక్కోసారి ఏ నంబరు రీలు డబ్బా ఎక్కడుందో తెలియక గంటల తరబడి వెతికేవాళ్లం. మంచాల కిందా, బల్లల వెనకా చివరికి ఆ విధంగానే పూర్తిచేశాను.

ఇప్పుడు దీని ప్రివ్యూ చూడాలి? ఇప్పటివరకు సినిమా రష్‌లు తప్ప పూర్తి తెరమీద వివరం చూడలేదు. ఎడిటింగ్ గదిలో చూసిందే చూసి, మాకు సినిమాలో మజా అంతా పోయింది.

ఇప్పుడు ప్రేక్షకులతో చూస్తేనే దీని జాతకం తెలుస్తుంది. చివరికి ఇక్కడే ఒక పెద్ద థియేటర్‌లో వేద్దామని నిర్ణయించాము. ప్రచారం చేయకుండా ఒక్క షో!

ఆ క్షణం రానే వచ్చింది. ఇప్పుడు వున్న ప్రేక్షకులకు ఏ సానుభూతీ వుండాల్సిన అవసరం లేదు. నేను ఊపిరి బిగబట్టి తెరవంక చూస్తున్నాను. 'చార్లీ చాప్లీన్ కొత్త సినిమా 'ది కిడ్' అని కనపడింది. అంతే పెద్దగా అరుపులు. నాకు భయం వీళ్లు ఏమి ఆశిస్తున్నారు? అని.

కిడ్ మొదటి సీన్లు మెల్లగా ప్రతిస్పందన లేకుండా వుంటాయి. ఇది నన్ను మరీ ఇబ్బంది పెట్టింది. తర్వాత ట్రాంప్ ప్రవేశం. మళ్లీ గోల! అక్కడ నుంచి చివరి వరకూ పగలబడి నవ్వుతూనే వున్నారు. ఆ విధంగా పరీక్ష సమాప్తమయింది.

ఇక సినిమా పూర్తయింది. ఎడిటింగ్ రీళ్ళతో సహా మేము మూటాముల్లె సర్దుకొని న్యూయార్క్ బయలుదేరాం. రిట్జ్ హోటల్‌లో దిగాను. అక్కడ దిగిన దగ్గర్నుంచి రూం దాటి బయటకు రావటానికి కుదరలేదు. నోటీసులు పట్టుకుని ఫస్ట్ నేషనల్ లాయర్లు తిరుగుతున్నారు నాకోసం అని. కిడ్ సినిమా ఆపాలనీ, కోర్టు కాగితాలు నా చేతిలో పెట్టాలని!

ఆ విధంగా మూడురోజులు గదిలోనే వుండిపోయాను. నాలుగోరోజు ఫ్రాంక్ హారిస్ నన్ను వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించాడు. మా వదిన దగ్గర పెద్ద గౌను తీసుకుని, ముఖానికి తెరలు కట్టుకుని హోటల్లో నుంచి బైటపడ్డాను.

ఫ్రాంక్ హారిస్ పుస్తకాలు చాలా చదివాను. నాకు చాలా నచ్చినాయి కూడా. ఆ రోజుల్లో ఆయన పియర్‌సన్ పత్రిక నడిపేవాడు. ఆర్థిక ఇబ్బందులతో పత్రిక మూసివేయాల్సి వస్తుందని. ఒకసారి పత్రికలోనే ప్రకటించాడు. అప్పుడు నేను స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందించాను. అప్పుడు ఆయన నాకు ఒక ఉత్తరం వ్రాశాడు.

చాప్లిన్‌కి, నాకు కనీసం పరిచయం కూడా లేకుండా సహాయం అందించిన వ్యక్తికి, ఎవరి హాస్యనటన నాకు ఆనందాన్నిచ్చిందో ఆ వ్యక్తికి, ఎవరైతే మానవ జాతి నవ్వేందుకు కృషిచేస్తారో వారిని ఏడ్పించకుండా, అటువంటి వ్యక్తికి స్నేహపూర్వకంగా నా యీ పుస్తకాన్ని పంపిస్తున్నాను (1919 ఆగష్టు).

ఆ రాత్రి ఫ్రాంక్‌ని మొదటగా కలిశాను. ఆయన పొట్టివాడు. కొంచెం లావు. ధృఢంగా వున్నాడు. పెద్ద తలకాయి! సైనిక హాండిల్ బార్‌లాంటి మీసాలు. ఆయన

గొంతు చాలా గంభీరం. అప్పటికి ఆయనకి 67 ఏళ్ళు. ఆయన భార్య చిన్నదీ, చక్కనిదీ, ఆయనంటే ప్రాణం.

ఫ్రాంక్ సోషలిస్ట్. బిస్‌మార్క్ అంటే ఆరాధన. ఫ్రాంక్ బిస్‌మార్క్‌ని అనుకరించి చూపేవాడు. జర్మన్‌లో చాలా గొప్ప నటుడు కావలసినవాడు! తెల్లవారు ఝామున 4 గం॥ల వరకు కబుర్లు చెప్పకున్నాం. ఆయనే ఎక్కువ మాట్లాడాడు!

ఆ రాత్రి మరొక హోటల్‌కి వెళ్దాం అనుకున్నాను. అన్ని హోటళ్లూ నిండుగా వున్నాయి. ఒక గంటసేపు టాక్సీలో హోటల్ గదికోసం తిరిగి, తిరిగి విసిగిపోయాను. అప్పుడు ఆ టాక్సీ డ్రైవరు – 40 ఏళ్లుంటాయి. కాస్త కరుకుగానే కనిపించాడు. 'చూడండి ఈ సమయంలో మీకు హోటల్ గది దొరకదు. మీకు అభ్యంతరం లేకపోతే మా యింటికి వచ్చి ఈ మిగతా రాత్రి గడపవచ్చు' అన్నాడు.

మొదట్లో ఏమిటిదంతా అనుకున్నాను – కాని అతను, 'నా భార్య పిల్లలూ కూడా వున్నారు' అన్నప్పుడు, 'నీకు రుణపడి వుంటాను' అన్నాను. అప్పుడు నేనెవరో చెప్పాను. అతను కొంచెం ఆశ్చర్యపోయి నవ్వాడు. 'నా భార్య చాలా సంతోషిస్తుంది' అన్నాడు.

మొత్తానికి బ్రాంక్స్ ప్రాంతానికి తీసుకు వెళ్లాడు. అక్కడి వరస ఇళ్ళల్లో ఒక ఇంట్లోకి వెళ్ళాం. లోపల సామాను పెద్దగా లేకపోయినా చాలా పరిశుభ్రంగా వుంది. నన్ను మెల్లగా ఒక పడక గదిలోకి తీసుకు వెళ్లాడు. ఆ మంచంమీద వాళ్లబ్బాయి నిద్రపోతున్నాడు. 'ఆగండి' అని అతన్ని ప్రక్కకు జరిపి ఇక పడుకోండి అన్నాడు. నాకు నైట్‌డ్రెస్ కూడా ఇచ్చాడు. నేను మెల్లగా అందులోకి దూరి నిద్రపోయాను. బాగా వెలుతురు వచ్చేసరికి మెలకువ వచ్చింది. దుప్పటిలోంచి సగం తెరిచిన కళ్ళతో చూస్తున్నాను. ఎనిమిదేళ్ల పాప తొంగిచూసి వెళ్లిపోయింది నవ్వుకుంటూ. బైట కొంత గందరగోళం మొదలయింది. 'మీరు స్నానం చేయవచ్చు' అని ఒక డ్రైస్సింగ్ గౌనూ, స్లిప్పర్లూ, ఒక టవలూ ఇచ్చాడు. 'బ్రేక్‌ఫాస్ట్ ఏం తెమ్మంటారు' అన్నాడు. 'ఏదైనా' 'గుడ్లు – రొట్టె –వెన్న–కాఫీ!'

'బ్రహ్మాండం' అన్నాను. నేను స్నానం చేసి వచ్చేసరికి అన్ని సిద్ధంగా వుంచారు. నేను టిఫిన్ చేస్తుండగానే బైట గదుల్లో కదలికలూ గుసగుసలూ వినపడుతున్నాయి. 'మీరు ఇక్కడ వున్నట్లు అందరికీ తెలిసిపోయింది' అని ఆమె నవ్వింది.

అంతలో టాక్సీ డ్రైవర్ వచ్చి వాళ్లకు 'ఒకసారి కనపడండి ఆలస్యం చేస్తే పత్రికల వాళ్లు వచ్చేస్తారు' అన్నాడు. 'అలాగే, ఆ పిల్లల్ని లోపలికి రానివ్వండి' అన్నాను. ఒకమ్మాయి వచ్చి నన్ను ఎగాదిగా చూసి 'ఈయన కాదు' అంటూ ఏడ్చింది. ఆమె స్నేహితురాలు 'యుద్ధంలో కనపడకుండా పోయిన మీ అన్నయ్య' అని చెప్పి తీసుకువచ్చింది.

తర్వాత నేను రిట్జ్ హోటల్ వెళ్లిపోయాను. నోటీసులు వున్నా లేకపోయినా ఇంక దాక్కోదలచలేదు. అప్పటికే కాలిఫోర్నియానుంచి ఒక తంతి వచ్చింది. 'అంతా, మిల్డ్రెడ్ వ్యవహారం అనుకూలంగా పూర్తి చేశాము' అని. ఆమె విడాకుల కోసం కోర్టులో కాగితాలు ఫైల్ చేసిందని.

ఆ సాయంత్రం టాక్సీ డ్రైవర్ వచ్చాడు, ఆయన కుటుంబంతో! 'పత్రికల వాళ్లు నన్ను రాత్రి కథ చెప్పమంటున్నారు. మీ అనుమతి లేకుండా చెప్పనని అన్నాను' అన్నాడు.

'తప్పనిసరిగా చెప్పండి' అన్నాను.

ఇక ఇప్పుడు ఫస్ట్ నేషనల్ పెద్ద మనుష్యులు అందరూ టోపీలు చేతిలో పట్టుకుని వరసన వచ్చారు. గోర్డాన్, వైస్ ప్రెసిడింట్, అన్నారు. (ఈయనకు చాలా థియేటర్లు వున్నాయి) "మీరు 1 1/2 మిలియన్ డాలర్లు అడుగుతున్నారట 'కిడ్' సినిమాకు?' అన్నారు. ఇంతవరకూ మాకు సినిమా కూడా చూపించలేదు?" అన్నాడు.

'మీరు చూడండి' అని ప్రదర్శన ఏర్పాటు చేశాను.

వీళ్లంతా ఏమాత్రం సానుభూతి లేనివారు. అనుమానపు పక్షులు. సినిమా చూసేందుకు ముఖాలు మాడ్చుకుని వచ్చారు.

సినిమా మొదలయింది. 'చిరునవ్వుతో, కన్నీటి బొట్టుతో కూడా' అంటూ. 'ఫర్వాలేదు' అన్నాడు గోర్డాన్.

సాల్ట్ లేక్ సిటీ ప్రదర్శన తర్వాత నాకు పూర్తి నమ్మకం కుదిరింది 'కిడ్' సినిమా మీద.

సినిమా పూర్తయింది. వీళ్లంతా ఏదేదో మాట్లాడుతున్నారు. నాకు చిర్రెత్తుకొచ్చింది. 'మీ నిర్ణయమేమిటి?'

'మా వాళ్లందరితో సంప్రదించాలి.'

'నేను అడిగింది సినిమాపై మీ అభిప్రాయం.'

'మేము సినిమా కొనటానికి వచ్చాం. అభిప్రాయాలతో పనేముంది.'

'ఒకవేళ మీకు బాగా నచ్చిందని చెప్పినా నేను రేటు పెంచను' అన్నాను వళ్లు మండి.

'కాని మేము అనుకున్నది వేరు' అన్నాడు ఒకాయన.

అదేమిటి? లండన్ బ్రిడ్జ్ పడిపోతుందనా'

'అలా కాదు. 1 1/2 మిలియన్ డాలర్లకు...'

'నా ధర అంతే... మీరు కావాలంటే తీసుకోండి లేదా వదిలేయండి' అప్పుడు జె.బి. విలియమ్స్ (ప్రెసిడెంట్) వచ్చి 'చార్లీ చాలా బాగుంది. చాలా ప్రత్యేకంగా వుంది. కొంత సమయం ఇవ్వు. నేను పరిష్కారం చేస్తాను' అన్నాడు.

'మీకు సరిగ్గా వారంరోజులు అంతే.'

తర్వాత వాళ్లు త్వరగానే నిర్ణయానికి వచ్చారు. మా లాయరు ఒప్పందం ఖరారు చేశాడు. 1 1/2 మిలియిన్ డాలర్లు ముందు ఇచ్చేట్లు. తర్వాత 50 శాతం లాభం. 5 సంవత్సరాలలో సినిమా తిరిగి ఇచ్చేట్లు. అది ఒప్పందం.

ఒక్కసారిగా నాకు పెద్ద భారం దించినట్లు, పెద్ద పంజరంలోంచి బైటపడినట్లనిపించింది. గాలిలో తేలిపోతున్నట్లనిపించింది.

అప్పటికే టాక్సీ వార్త పేపర్లో వచ్చింది. నాకు తెలిసినవాళ్లు ఫోనులు చేయటం మొదలుపెట్టారు. న్యూయార్క్ ఆతిథ్యం నన్ను ముంచెత్తింది. 'వోగ్' పత్రిక సంపాదకుడు ఫ్రాంక్, నాకు న్యూయార్క్ వెలుగులన్నీ చూపాడు. ఆ పత్రికల ప్రచురణకర్త కాండ్‌నాస్ట్ నాకు మంచి ఆతిథ్యం ఇచ్చాడు. ఆయనకు మాడిసన్ ఎవెన్యూలో పెద్ద పెంట్‌హౌస్ వుండేది. అక్కడ అందమైన భామలూ, నటీమణులూ వస్తుండేవారు.

రిట్జ్ హోటల్ చుట్టుప్రక్కల బ్రహ్మాండమైన కార్యక్రమాలు జరుగుతుండేవి. నాకు పగలంతా ఫోన్ మోగుతూనే వుండేది ఆహ్వానాలతో. ఆ రోజు రాత్రి, మర్నాటి వుదయం,

వారాంతం, ఇలా అన్నీ విందులూ, వినోదాలే. ఈ రకంగా ఈ మెరిసే నగరాన్ని పైపైన చూసి తర్వాత మేధోపరమైన కోణాన్ని దర్శించాలని ఆశించాను. అందుకు సరైన ప్రదేశం గ్రీన్‌విచ్ విలేజ్. చాలామంది హాస్యనటులు తమ జీవితంతో ఏదో సందర్భంలో, తమ మేధోపరమైన లోతును పెంపొందించుకొనే ప్రయత్నం చేస్తుంటారు. ఈ విధంగా నేర్చుకునేవారు అన్ని వర్గాల్లో వుండేవారు. దర్జీవాళ్లు, చుట్టలు చుట్టే వాళ్లు, డబ్బుకోసం కుస్తీలు పట్టేవాళ్లు, హోటల్ సర్వర్లు, లారీ డ్రైవర్లు... ఒకసారి గ్రీన్‌విచ్‌లోనే నిఘంటువుల గురించి చర్చిస్తూ ఇంతవరకూ సమగ్రమైన నిఘంటువు తయారవలేదని నిరాకార భావాలనుంచి పూర్తి శబ్ద చిత్రాలను ఆవిష్కరించే నిఘంటువు కావాలని నేను వాదిస్తున్నాను. 'అట్లాంటి పుస్తకం వుంది!' అన్నాడు, ఒక నల్లజాతి లారీ డ్రైవరు 'రోగెట్స్ థెసారస్', దానిపేరు అన్నాడు.

ఒకసారి అలెగ్జాండ్రియాలో వెయిటర్, కార్ల్‌మార్క్స్ గురించి విలియమ్ బ్లేక్ గురించి చెప్తుండేవాడు.

బ్రూక్లిన్ హాస్యగాడు, ఒక రకమైన యాసతో 'షేక్స్పియర్ నా వల్లనే ప్రభావితమైనాడు. కావాలంటే అతని లాటిన్ వరకూ వదిలివేయవచ్చు' అనేవాడు.

వీళ్లతోపాటు నా మేధోపరమైన ప్రయాణం సాగేది. నేను హాస్యనాటకాలు వేసినప్పటినుంచి ఇప్పటివరకూ ఎక్కువ పుస్తకాలే చదివాను. అయితే క్షుణ్ణంగా మాత్రం కాదు. నేను మెల్లగా చదువుతాను. అందుకని మొదటి అధ్యాయం అర్థమయ్యేలోపు, నాకు ఆ రచయిత సిద్ధాంతం శైలీ అర్థమయ్యేవి. అలా అవసరం లేనివి వదిలివేసేవాడిని. 'ప్లూటార్స్ లైవ్స్' అయిదు పుస్తకాలు ప్రతి పదం చదివాను. కొన్ని చాలా జాగ్రత్తగా చదివాను. కొన్ని తిరగవేశాను. అలా ఈ సంవత్సరాలలో ప్లాటో, లాకీ, కాంటే, బర్టన్ అనాటమీ ఆఫ్ మెలాంకలీ ఇలా – చాలానే చదివి నా మేధకు పదును పెట్టాను. గ్రీన్‌విచ్‌లో విమర్శకుడు వాల్డోఫ్రాంక్‌ని కలిశాను. హార్ట్ క్రేన్ (నవలాకారుడు), మ్యాక్స్ ఈస్ట్‌మన్ (కవి), ది మాసెస్, సంపాదకుడు డడ్లీ ఫీల్డ్. అందులో కొందరు.

ఇంకా న్యూయార్క్ పోర్ట్‌ట్రస్ట్ కంట్రోలర్ ఫాస్టర్‌నీ ఆయన భార్య మార్గరిట్‌నీ కలిశాను.

క్రిస్టిన్ రెస్టారెంటుకు వెళ్లేవాడిని. అక్కడే చాలా మంది రచయితలను కలిశాను. నటులుకూడా వచ్చేవారు. అప్పుడే 'ఎంపరర్ జోన్స్' రిహార్సల్ జరుగుతున్నాయి. దాని

రచయిత యూజినీ ఓనీల్ (ఈయనే తర్వాత నాకు పిల్లనిచ్చిన మామ). నాకు వాళ్ళ థియేటర్ చూపించారు. అది డబ్బా రేకుల షెడ్డు!

వాల్డోఫ్రాంక్ గురించి ఆయన పుస్తకంద్వారా తెలిసింది. (అవర్ అమెరికా) 1919లో ప్రచురించబడింది. మార్క్ ట్వేన్ గురించి వ్యాసం చాలా మంచిది. వ్యక్తిత్వాన్ని పూర్తిగా ఆవిష్కరించిన వ్యాసం!

ఈ వాల్డో గారే నా గురించి మొదటగా విమర్శనాత్మకమైన రచన చేశాడు. అలాగే మేము స్నేహితులైనాము.

వాల్డో రచనలు అమెరికా ఆత్మను ఆవిష్కరిస్తాయి. చారిత్రాత్మకంగా, మార్మికంగా కూడా. ఆయన ఉత్తర దక్షిణ అమెరికాల సంయోగంలాంటివాడు. గ్రీన్‌విచ్ విలేజ్‌లో మేము చాలా సాయంత్రాలు అర్థవంతంగా గడిపాము. ఆయన ద్వారానే హార్ట్‌క్రేన్‌ని కలిశాను. మేము ముగ్గురం వాల్డో గూటిలో ఎన్నో విషయాలు రాత్రి మొదలు మర్నాటి వుదయం వరకూ చర్చించేవాళ్లం! అవి ఎంతో అర్థవంతమైన సింపోజయములు. మా ఆలోచనలనూ, ఆంతర్యాలను వాటి అర్థాలను వెతుక్కుంటూ మాట్లాడుకునేవాళ్ళం.

హార్ట్‌క్రేన్ దగ్గర డబ్బులేదు. లక్షాధికారి అయిన వాళ్ల నాన్న క్రేన్ కవిత్వాన్ని నిరసించేవాడు. అందుకని వ్యాపారంలోకి రమ్మని అప్పటివరకూ డబ్బివ్వనని మొండికేశాడు. నాకూ ఈ ఆధునిక కవిత్వం మీద ఏమాత్రం ఆసక్తిలేదు. కాని ఈ నా సొంతకత రాస్తున్నప్పుడు, క్రేన్ రాసిన 'ది బ్రిడ్జ్' చదివాను. అది భావోద్వేగంతో నిండి, ఎంతో నాటకీయంగా, బాధాతప్తమై, గొప్ప పద, శబ్ద చిత్రాలతో ఉంది! నాకు మాత్రం ఆ కవితలు మరీ శబ్దమయంగా అనిపించాయి. అందులోనూ ఒక లయ వుందని అంగీకరించాలి!

ఆ రోజుల్లో కవిత్వం యొక్క ఉపయోగం పర్యవసానం గురించి చర్చించాము. నేనన్నాను కవిత్వం 'ప్రపంచానికి ప్రేమలేఖ' అని. 'అవును ఈ చిన్ని సంకుచిత ప్రపంచం!' అన్నాడు హార్ట్! నా వృత్తిని గురించి "నీది గ్రీకు హాస్యం" అన్నాడు.

హార్ట్‌కి గుగెన్‌హామ్ ఫెలోషిప్ వచ్చింది చాలా కాలం తర్వాత. అప్పటికే అతను వ్యసనాలకు బానిస అయి పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నాడు. మెక్సికో నుంచి తిరిగి వస్తూ నౌకలో నుంచి సముద్రంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆయన చనిపోయేందుకు కొన్ని సంవత్సరాల ముందు నాకు ఆయన కవితల పుస్తకం 'వైట్ బిల్డింగ్స్' (బావిడి వివరైట్) కవిత ముందు కాగితంలో ఇలా రాశాడు: చాప్లిన్‌కు 'ది కిడ్' చిత్రానికి గుర్తుగా, హార్ట్‌కేన్, 20 జనవరి 1928.

ఒక కవితకు 'చాప్లినెస్కి' అని నామకరణం చేశాడు.

గ్రీన్‌విచ్ విలేజ్‌లోనే డడ్లీఫీల్డ్ మాలోన్ చాలా ఉత్సాహవంతమైన విందు ఇచ్చాడు. డచ్ పారిశ్రామిక వేత్త జాన్ బోస్‌లైన్‌ని, మాక్స్ ఈస్ట్‌మెన్ ప్రభృతులను ఆహ్వానించాడు. అక్కడే 'జార్జ్' అనే పెద్దమనిషిని పరిచయం చేశారు. అతను చాలా నర్వస్‌గా ఉత్సాహంగా కనిపించాడు. ఆయన బల్గేరియా రాజుకు దగ్గర వ్యక్తి అని తెలిసింది. రాము సహాయంతో సోఫీలో విశ్వవిద్యాలయంలో చదివాడని! కాని ఈ జార్జి ఆ రాజును వదిలి కమ్యూనిస్టుగా మారాడు. అమెరికాలో ఐ.డబ్లు.డబ్లు.లో జేరాడు. ఈ తతంగంలో అతనికి 20 ఏళ్లు జైలుశిక్ష పడింది. రెండు సంవత్సరాలు కారాగారంలో వుండి అప్పీలు బెయిలు మీద బైటకు వచ్చాడు. ఈ విందులో అతనో మాజిక్ చేయటానికి టేబుల్ క్లాత్ వంటికి చుట్టుకున్నాడు. అక్కడ వున్నవాళ్ళంతా నాతోసహా ఇతను మళ్లీ జైలుకు వెళ్లటం ఖాయం అనే అనుకున్నాము. విందు తర్వాత నేను బయలుదేరుతూ వుండగా ఆ జార్జి 'ఏమిటి చార్లీ హడావుడి? ఇంకొంత సేపు వండవచ్చుగా' అన్నాడు. తర్వాత 'నా గురించి దిగులు పడకు' అని కూడా అన్నాడు. ఇంకా కొన్నాళ్లు న్యూయార్క్‌లో వుందామని వున్నా, కాలిఫోర్నియాలో పని పూర్తి చేయాల్సి వుంది. ముందుగా ఫస్ట్ నేషనల్ ఒప్పందాన్ని పూర్తిచేయాలి. తర్వాత మా సొంత కంపెనీ యునైటెడ్ ఆర్టిస్ట్స్ కోసం పని మొదలు పెట్టాలి.

న్యూయార్క్‌లో నేననుభవించిన స్వేచ్ఛా, నాకు లభించిన ఆతిథ్యమూ తర్వాత, కాలిఫోర్నియా రావటం బాధగానే వుంది. ఇప్పుడు రెండు రీళ్ళ సినిమాలు నాలుగు తీసి, వీళ్లకు ఇవ్వాలి. ఇది నాకు తలకు మించిన పనిలా తోచింది. చాలారోజులు స్టూడియో స్టేజీలమీద కూర్చుని ఆలోచించడం మొదలు పెట్టాను. కాసేపు వయొలిన్, కాసేపు పియానా లాగానే ఆలోచనకూ రోజువారి సాధన కావాలి! ఈ సాధన నాకు తప్పిపోయినట్లయింది.

న్యూయార్క్‌లో ఇంద్రధనుస్సులాంటి జీవితాన్ని చవిచూసి, ఇప్పుడు నేలకు దిగటానికి మనసొప్పటం లేదు. ఇంక లాభంలేదని, నా ఆంగ్ల స్నేహితుడు సిసిల్ రెనాల్డ్స్‌తో కలిసి కాటలీనాకు చేపల పట్టేందుకు బయలుదేరాను.

మీకు చేపలుపట్టే అలవాటు వుంటే, కాటలీనా దానికి స్వర్గమే. ఆవలాన్ అక్కడి నిద్రపోయే వూరు. చిన్నచిన్న హోటళ్లు. ఇక్కడ సంవత్సరం పొడవునా చేపలు పట్టవచ్చు. టూనా చేప దొరుకుతుందంటే, అద్దెకు బోటుకూడా దొరకదు.

తెలవారుతుండగా ఎవరో అరుస్తారు. అదిగో టూనా అని. 30 నుంచి 300 పౌండ్ల చేపలు ఎగురుతూ కనపడతాయి. నిద్రపోతున్న హోటళ్లన్ని లేచి కూచుంటాయి. బట్టలు వేసుకుంటానికి సమయం వుండదు. మీకు ముందుగా పడవ దొరికితే దానిలోకి దూకి పాంటు గుండీలు పెట్టుకోవాలి.

ఇలాంటి రోజుల్లో నేనూ, డాక్టరూ కలిసి ఎనిమిది టూనా చేపల్ని పట్టాము. ఒక్కోటి 30 పౌండ్లు బరువు! అవి ఎలా వస్తాయో – అంత త్వరగా మాయమైపోతాయి. మళ్లీ మామూలు చేపలవేటే. ఒక్కోసారి మా గేలానికి గాలిపటం కట్టి వదిలేవాళ్లం. అప్పుడు చేప పడితే గాలిపటాన్ని చూసి గేలానికి చిక్కేది నీటిపైనే. ఇది చాలా ఉత్సాహంగా వుండేది. మీరు నిజంగా చేప గేలానికి చిక్కడం చూడవచ్చు. తర్వాత నీటిలో నురగలతో గిరికీలు కొట్టి వందల అడుగులు నీటిలో మునిగిపోయేది!

ముక్కు చేప మాత్రం వంద పౌండ్ల నుంచి ఆరువందల పౌండ్ల బరువు వుండేవి. ఇది చాలా సున్నితమైన పని. గేలాన్ని మెల్లగా వదలాలి. చేప ఎరను పట్టుకుంటే దానితో వంద గజాలు ఈదుతుంది. అప్పుడు ఆగుతుంది. మనం బోటును ఆపాలి. ఒక్కనిమిషం ఆగితే అప్పుడు అది గేలానికి చిక్కుతుంది. మెల్లగా తాడును లాగితే అప్పుడు దాని నోటిలో గాలాల మల్లు దిగుతుందన్నమాట. ఇక అక్కడ నుంచి ఆట మొదలు. వందగజాలు ఈదటం, ఆగటం, మనం పడవలో వెంట పడటం, తాడు వదలడం మళ్లీ లాగడం, అది ఒక్కసారిగా పక్కకు తిరిగి 30–40 అడుగులు గాలిలో లేస్తుంది. అలా ఇరవయి ముప్పయిసార్లు ఎగిరి, తల బుల్‌డాగ్‌లా విదిలించి చివరికి నీటి అడుక్కు చేరుతుంది. అంత చేపను పైకి తేవటం చాలా శ్రమ! నేను పట్టిన ముక్కు చేప 175 పౌండ్లు బరువు. 22 నిమిషాలలో పైకి లాగ గలిగాం!

అవి నిజంగా గొప్ప దినాలు. నేనూ, డాక్టరూ బోటులో కునికిపాట్లు పడుతూ ఆ మంచు పడే వుదయాలలో, నీటిమీద తెరలాంటి పొగ, నీరూ ఆకాశమూ కలిసే దూరం, ఇవన్నీ మనసులో ముద్ర పడిపోయాయి. అంత నిశ్శబ్దం – సీగల్ అరుపుతో బద్దలయ్యేది. మా మోటారు బోటు నెమ్మదిగా కదులుతూండేది!

డా. రేనాల్డ్స్ గొప్ప న్యూరోసర్జన్. చాలా విజయాలు సాధించాడు ఆ దిశగా. నాకు చాలా కేసులు తెలుసు కూడా. ఒక చిన్నపిల్లకి బ్రెయిన్ ట్యూమర్ వుండేది. రోజూ ఇరవైసార్లు ఫిట్స్ వచ్చేవి. అలాంటి రోగిని ఆయన ఎంతో నైపుణ్యంతో ఆపరేషన్ చేసి రక్షించాడు. తర్వాత ఆమె గొప్ప శాస్త్రవేత్త అయింది! కాని సిసిల్‌కి తిక్క వుండేది. అతనికి నటించాలని కోరిక. దీనితో నాకు దగ్గరయ్యాడు. 'థియేటర్‌లో ఆత్మ వుంది' అనేవాడు. 'నీ వృత్తికూడా చాలా గొప్పది కదా' అనేవాడిని. 'నీవు చనిపోయే పిల్లను స్కాలర్ చేశావు కదా' అన్నాను. 'అదే నరం, సరైనది ఎక్కడుందో తెలిస్తే చాలు' అని తేలికగా చెప్పాడు. 'కాని నటనలో ఒకరకమైన బౌద్ధికమైన వ్యాకోచం వుంటుంది' అనేవాడు. 'మీరు మెదుడును ఎందుకు ఎంచుకున్నారు?'

'అదీ, దానిలో డ్రామా చాలా వుంది' అని సమాధానం.

చిన్నచిన్న నాటకాల్లో కనపించేవాడు. నా 'మోడ్రన్ టైమ్స్'లో జైలు సీనులో నటించాడు.

నేను ఈ చేపల వేటనుంచి తిరిగి వచ్చేసరికి అమ్మకు బాగా నయమైందని వార్త వచ్చింది. ఇప్పుడు యుద్ధం కూడా ముగిసింది. అమ్మను కాలిఫోర్నియా తీసుకు వచ్చేందుకు టామ్‌ని పంపాను.

నౌక ప్రయాణంలో చాలా మామూలుగా వుంది. అందరితో పాటు రాత్రి భోజనాలు చేసేది. పగలు డెక్‌మీద అన్నిరకాల ఆటల్లో పాల్గొనేది. న్యూయార్క్ చేరేంతవరకూ చాలా ఉల్లాసంగా వుంది. ఇమ్మిగ్రేషన్ ఆఫీసర్ – 'స్వాగతం చాప్లిన్ మాతా మీరు మా స్టార్ చాప్లిన్ తల్లి గారు' అన్నాడు. 'అవును మీరు జీసస్ క్రైస్ట్?' అంది. అంతే టామ్‌కి అర్థమయింది తాము సమస్యలో చిక్కుకున్నామని. చాలా ఆలస్యం తర్వాత ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు నిర్వహించి వీసా పొడిగిస్తాము' అని. అలా జరిగింది ఆమె అమెరికా ప్రవేశం. అమ్మను చూసి ఎంతకాలమైంది? దాదాపు పదేళ్లు దాటిపోయింది.

ఆమె రైలుపెట్టెలోంచి దిగుతుంటే నేను షాక్ తిన్నాను. ఒడిలి పోయిన ముదుసలి ఆకారాన్ని చూసి. అమ్మ నన్నూ, సిడ్నీనీ వెంటనే గుర్తుపట్టింది. చాలా మామూలుగా ఆరోగ్యంగా వుంది. సంతోషం! ఆమెకు సముద్ర తీరానికి దగ్గర ఒక బంగళా ఏర్పాటు చేశాను. ఆమె సేవకోసం ఒక జంటను నియమించి ఇంటిని చూస్తూ అమ్మకును

జాగ్రత్తగా కాపాడేందుకు నర్సును కూడా పెట్టాము. అన్న నేను ఎప్పుడు వీలయితే అప్పుడు వెళ్లి చూసేవాళ్లం. సాయంత్రాలు నేను ఆమెతో ఆటలాడేవాడిని వీలున్నప్పుడు. ఆమె పిక్నిక్‌లూ, యాత్రలూ చాలా ఇష్టపడేది. స్టూడియోకి కూడా వస్తుండేది. నా హాస్యచిత్రాలు వేసి చూపేవాడిని.

చివరికి 'ది కిడ్' న్యూయార్క్‌లో విడుదలయింది. అది పెద్ద విజయం సాధించింది. నేను చెప్పినట్లు జాకీ చాలా మంచిపేరు సంపాదించి, అతని వృత్తిలో 4 మిలియన్ల డాలర్లు పైగా సంపాదించాడు. నాకు న్యూయార్క్ వెళ్లి 'కిడ్' విజయాన్ని చూడాలని వున్నా వెళ్లటానికి సాహసించలేదు. ఆ విజయ వార్తలు కాలిఫోర్నియా నుంచి వినటమే బాగుంది.

ఈ సొంతకత సోదిలో సినిమా నిర్మాణం గురించిన సోది వుండటం అవసరమా కాదా? ఇప్పటికే మంచి పుస్తకాల గురించి సినిమా నిర్మాణం గురించీ, వచ్చినాయి. కాని అవన్నీ ఆ రచయిత అభిరుచుల మీద ఆధారపడి వుంటాయి. అవన్ని సాంకేతికంగా పనిముట్లను అందచేయవచ్చు.

అన్నింటికీ మించి ఊహాత్మకంగా ఆలోచనాత్మకంగా పనిచేయటానికి సృజనాత్మకత మూల వస్తువు. మిగతావన్నీ ప్రక్కవాద్యాలే. సృజనాత్మకత వుంటే మిగతా సాంకేతిక విషయాలు అవే సర్దుకుంటాయి. ఒక కళాకారునికి ఒక మూసలో వుండడం ఇష్టం వుండదు. అతనికి పూర్తి స్వేచ్ఛ కావాలి. ఇంక చెప్పాలంటే విశృంఖలత అవసరం. అప్పుడే అది తాజా వస్తువులాగా ఉత్సాహభరితంగా వుంటుంది. అందుకే కొత్త దర్శకుల సినిమాలు కొత్తగా వుంటాయి. తాజాగా వుంటాయి.

మేధోపరమైన కథ, వస్తువు, సమయ సందర్భాలు, సీనులు, రంగాలు అన్నీ బాగానే వుంటాయి. ఇవన్నీ ఒక నటుని నటనను ఎలా సానబెడతాయి? ఇక్కడే వీటి సమతుల్యం తప్పి ఒక మొద్దుగా అవతరించవచ్చు! ఎంత 'సింపుల్'గా వుంటే అంత తాజాగా వుంటుంది.

నాకు వ్యక్తిగతంగా సినిమా ట్రిక్కులు ఇష్టం వుండదు. మంటల్లోంచి కెమెరా చూపటం, ఒక బొగ్గు కణిక ప్రక్క నుంచి చూపడం, లేదా ఒక నటుని వెనకాల నడవటం. ఇవన్నీ అంతగా నాకిష్టం వుండదు. ప్రేక్షకులకు సీను అర్థమయితే ఈ

గిమిక్కులకు తావుండదు. ఇలాంటివన్నీ నటనకు అడ్డంకులే. కాని దురదృష్టం ఇదే 'కళ' అని ప్రచారం జరుగుతోంది!

సీనులో నటించే నటుల కదలికలను బట్టి కెమెరా కోణాలు పెడతాను. కెమెరా కదిలితే నటన లేనట్లే ఆ సీనుతో కెమెరా నటనను పట్టుకోవాలి. కెమెరా నటించకూడదు కదా. ఇప్పటికీ సినిమా తీయటంలో కాలయాపన తగదు. ఎంత కాలాన్ని సద్వినియోగం చేస్తే అంత మంచిది. ఐన్‌స్టీన్‌కీ, గ్రిఫిత్‌కీ ఈ విషయం తెలుసు. ఎక్కడ కట్ చెయ్యాలో ఎక్కడ డిసాల్వ్ చేయాలో తెలిస్తే సినిమా సంకేతాలు అర్థమయినట్లే.

చాలామంది విమర్శకులు నా కెమెరా సాంకేతికత పాతవాసనలతో వుంటుందంటారు. నేను కాలానుగుణంగా మారలేదు అనికూడా అన్నారు. ఏ కాలం? నా సాంకేతికత నా ఆలోచనలోనుంచే వస్తుంది. నా తర్కం నా దృష్టి అది ఎవరినుంచీ ఎరువు తెచ్చేది కాదు. ఇతరులు చేసేది నేను అనుకరించాల్సిన అవసరం ఏముంది? కళనూ కాలాన్నీ కళ్లెం వేయాలంటే రెంబ్రాంట్ – వాన్‌గాగ్ కంటే వెనకబడే వుంటాడు.

కొన్ని మాటలు సినిమా గురించీ – మంచి హిట్ తీయాలనుకునే వారికి ఇదే చాలా తేలిక పని! దీనికి ఆలోచన అవసరం లేదు. నటనలోగానీ, దర్శకత్వంలోగాని పెద్దగా నైపుణ్యం అక్కరలేదు. ఒక పది లక్షల డాలర్లు వుంటే గుంపులు, రంగురంగుల బట్టలు, పెద్ద పెద్ద సెట్టులు, సీనులు, గొప్పగా చూపటానికి పెద్ద పెద్ద కాన్వాసులు. క్లియాపాత్రను మోయటానికి అదే నైలు నదిలో ఇరవయివేల చిన్నపాటి నటులు – వీరంతా రెడ్‌సీలో ప్రయాణం. లేదా జెరికో గోడల వెంట అరవడం. ఇవన్నీ సాంకేతిక కాంట్రాక్టులు వుంటే చాలు. వడ్రంగి కట్టడాలకు కుర్చీలు చాలు.

దర్శకుడనే ఫీల్డ్‌మార్షల్ కుర్చీలో కూర్చొని స్క్రిప్టు పట్టుకుని చార్టులు చూపిస్తుంటే తర్వాత వారు చెమటలు కక్కుతు పరుగులు పెడుతుంటారు. ఒక ఈల వేస్తే కుడిపక్కనుంచి పదివేలు, రెండు ఈలలు వేస్తే, పదివేలు మరోప్రక్క నుంచి మూడు – అందరూ అన్ని ప్రక్కలా. ఇదీ సంగతి. దీనికి కథ కూడా. సూపర్‌మాన్ హీరో దూకుతాడు, ఎగురుతాడు అందర్ని చంపేస్తాడు. అందర్ని ప్రేమిస్తాడు. అతనికి ఏదీ లేదు. అందరి సమస్యలూ తీరిపోతాయి. దీనికి ఆలోచన ఎందుకు?

మరి దర్శకత్వం? ఒక సీనులో నటులను నడపాలంటే సైకాలజీ చాలా ముఖ్యం. ఒక్కోసారి ఆ నటుని కుటుంబ సభ్యులు వస్తే అతనికి చాలా నర్వస్‌గా వుంటుంది.

అప్పుడే దర్శకుడు తన సహాయతను చూపాలి. ఆ నటున్ని ప్రక్కకు తీసుకు వెళ్లి 'నిజానికి నాకే చాలా నర్వస్‌గా వుంది. నీవే చేయందించాలి' అంటే అతను తప్పనిసరిగా చక్కని ప్రదర్శన ఇవ్వగలడు.

మార్క్ కెల్లీ నాటకాల రచయిత. ఇలా అన్నాడు: నాటకాలకు నాటకీయతా ఉద్వేగమూ ముఖ్యం. మేధావితనం తర్వాతది. థియేటర్ అంటే ఉద్వేగమైన సీనులు, కర్టెన్లు, కాస్ట్యూములు. అన్నీ దానికే ప్రాముఖ్యతనిస్తాయి. ఈ విషయం చెకోవ్‌కి తెలుసు. మెల్నార్‌కీ తెలుసు. అందుకే వాళ్లు 'థియేటర్ ఎమోషన్' రంగం అన్నారు.

నాకు 'థియేట్రికలిజమ్' అంటే డ్రామా సృష్టి. అది అపోసియో పెసిస్. ఒక్కసారిగా పుస్తకాన్ని మూసివేయటం, లేదా సిగరెట్టు వెలిగించటం – కాని ఇది రెండవ విషయం. తుపాకి మోత. ఎవరైనా పడిపోవటం, ఎవరైనా ఏడవటం, అరవటం, ఒక్కసారిగా రావటం, అలాగే నిష్క్రమణ – ఇవన్నీ చౌకబారుగా వున్నట్లనిపిస్తుంది. కాని జాగ్రత్తగా చేస్తే ఇదే థియేట్రికలిజమ్.

థియేటర్ కవిత్వం! అది లేకుండా ఏ ఆలోచనా ఉపయోగకరంగా ఉండదు. థియేట్రికల్‌సెన్స్ వుంటే ఏదైనా గొప్పగా తీసుకు రావొచ్చు.

దీనికి ఉదాహరణ "ఉమెన్ ఆఫ్ పారిస్"కి ఒక ప్రోలోగ్ పెట్టాను. పెద్ద సినిమాలకు అలాంటివి అరగంటదాకా నడిచేవి. నా దగ్గర స్క్రిప్ట్, మాటలు లేవు. కాని బెతోవన్ సొనాటా రంగుల చిత్రం వుంది. ఒక కళాకారుని స్టూడియో సగం చీకటిలో, వయొలిన్ వింటూ ఒక చిన్న గుంపు. ఈ సీను రెండు రోజుల్లో తయారుచేసి స్టేజి ఎక్కించాను. ఒక పియానిస్ట్, ఒక వయొలినిస్ట్, కొంతమంది అపాచీ డాన్సర్లు, ఒక పాటగాడు. ఇలా అన్నిరకాల ట్రిక్కులూ వాడాను. స్టేజిమీద గెస్ట్‌లు సోఫాల్లో కూర్చున్నారు. వెనక ప్రేక్షకులను లెక్కచేయకుండా కొంతమంది స్కాచ్ తాగుతూ! వయొలినిస్ట్ సోనాటా వాయిస్తున్నాడు. మధ్యలో ఆపినపుడు ఒక గురక వినపడుతుంది. తర్వాత అపోచీ నృత్యం – అంతలో అరె మూడయింది వెళ్లాలి' అని అతిథి లేచి వెళ్లిపోతాడు.

తర్వాత ఒక పాట (అప్రాస్ బ్లాండ్) అని ఒక్క సిగరెట్టు వెలిగిస్తాడు. మెల్లగా అందరూ వెళ్లిపోతారు. దూరంగా పాడుకుంటూ చివరికి లైట్లార్పుతూ విందు

ఇచ్చినవాడు, కిటికీలోనుంచి వచ్చే వెన్నల్లో కనపడతాడు. అప్పుడు మెల్లగా తెర దిగుతుంది. ఇదంతా జరుగుతుండగా థియేటర్లో చీమ చిటుక్కుమన్నా వినపడేది. అరగంటసేపు ఏదీ జరగలేదు. కాని ఈ ప్రదర్శనకు విపరీతమైన స్పందన వచ్చింది!

నేను షేక్స్పియర్ నాటకాలను ఎంజాయ్ చేస్తానని అబద్ధం ఆడను. దానికి చాలా ఓపికా, చాలా డ్రామా, నటనా కావాలి. అదే నాకు నచ్చదు. అందులో అంత ధారాళమైన పద్యపాదాలు ఎలా భరించేది?

అవి వినటానికి బాగుంటాయేమో కాని స్టేజిమీద భరించడం కష్టమే. షేక్స్పియర్స్ కింగ్లు, రాణులు, దెయ్యాలు, వారి పటాటోపం అస్సలు నచ్చదు.

నేను వచ్చిన పేదరికంలో గౌరవానికి పటాటోపానికి తావేది? అది నా మానసిక లోపం కావచ్చు. నాకు రాచరిక వ్యవస్థ, యువరాజు మానసిక స్థితి అర్థం కాదు. హామ్లెట్ తల్లి ఎవరితో పడుకుంటే నీకేమిటి బాధ? అది హామ్లెట్ను బాధించవచ్చు. కాని నన్ను కదిలించలేదు.

ఇక నాటకాన్ని ప్రదర్శించటం, నాకు పాత పద్ధతులే నచ్చుతాయి. ప్రేక్షకులకు నిజాయితీగా నాటకాన్ని చూపాలి. దీపాల కాంతిని అడించడం నచ్చదు. చక్కగా తెరలు లేవడం, లేదా విడిపోవటంతో నాటకంలోని సీను అర్థం కావాలి.

ఇంక స్టేజి అలంకరణ విషయంలో నిర్భయంగా నిజాన్ని చూపాలి. అంతకంటే మెలికలు ఏమీ వుండకూడదు. గజిబిజి డిజైన్లూ, గందరగోళమైన వస్తువులూ కథనాన్ని చిన్నతనం చేస్తాయి.

ఎవరో అన్నారు నటన విశ్రాంతిలాంటిదని. అన్ని కళలూ అలాగే అనవచ్చు. నటనను నేర్పవచ్చా? నాకైతే ఆ నమ్మకం లేదు. చాలామంది తెలివిగల వాళ్లు ఈ విషయంలో విజయం సాధించలేకపోయారు ఎందుకని? కాని నటనకు ఒక అనుభూతి కావాలి. వీన్రైట్ ఈ విషయంలో ఆరితేరినవాడు. చార్లెస్లాంబ్ స్నేహితుడు కూడా. ఈయన చాల నిర్దయగా ఆయన చుట్టాన్ని కత్తిపోట్లతో చంపాడు. ఇటువంటి వ్యక్తి ఎప్పటికీ మంచి నటుడు కాలేడు.

అతి తెలివీ, నిర్దయా, ఇవి క్రిమినల్స్కి అసలు గుణాలు. అనుభూతిని మేధతో కలగలిపితే చక్కని నటుడు లభించగలడు.

మంచి నటుని మంచి లక్షణం – అతన్ని అతను పూర్తిగా ఇష్టపడాలి. చాలా మంచి నటులు, 'అరే ఆ పాత్ర నాకు లభించి వుంటే' అనేవాళ్ళు. అంటే ఆ పాత్రలో వాళ్ళను వాళ్లు చూసి ఆనందించగలగటం! ఇది అహంకారయుతంగా అనిపించినా మంచి నటుని లక్షణమే. ఇర్వింగ్ ది బెల్స్‌లో, ట్రీ స్వెంగాలిలో మార్టిన్ హర్వే ఎ సిగరెట్ మేకర్స్ రొమాన్స్. ఈ మూడు సామాన్యమైన పాత్రలే. కాని వారికి వాటి మీదున్న ప్రేమ అంతగా రాణింపజేసింది.

ఇక నటనా విద్యాలయాలు నాకేమీ తెలియదు. ఒక వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోగలగాలి. ఇది చాలామందిలో జరగదు. పాత్రను అర్థం చేసుకోవటానికి మానసిక స్థితి అవసరం. ఇది మరొకరు చెప్పేది కాదు.

అలాగే ఆ పాత్ర జీవితకథ తెలియాల్సిన పని లేదు. నాటకంలో ఇవన్నీ రాయరు కదా. ఇక ఎక్కువగా అందరూవాడే పదం 'సత్యం.' అసలు ఒక సత్యానికీ, మరొక సత్యానికీ చాలా వ్యత్యాసం వుంది. నిజానికి అన్ని సత్యాలలో అసత్యం దాగి వుంటుంది.

నేను ఎప్పుడూ నటించటం నేర్చుకోలేదు. కాని నా చిన్నతనం నుంచి ఆ వాతావరణంలో వుండడం నా అదృష్టం. అప్పటి గొప్ప నటీనటుల అనుభవాన్నీ, వైదుష్యాన్నీ అంది పుచ్చుకున్నాను. నాకు ప్రతిభ వున్నా ప్రతి సాధనలో, దానిలోని లోతుపాతులు తెలసుకోగలిగాను. టెక్నిక్ నేర్చుకోవచ్చు. కాని స్వయం ప్రతిభ లేకపోతే ఇవి రాణించవు. నటనలో ఎప్పుడు ఆపాలో, ఎప్పుడు మొదట పెట్టాలో తెలియాలి. టైమింగ్ కూడా చాలా ముఖ్యం.

నన్ను చాలా మంది అడుగుతారు. "మీరు మెచ్చేనటులు ఎవ్వరని." దానికి సమాధానం చాలా కష్టం. ఒకరు గొప్పవారంటే మరొకరు తక్కువని కాదు. కాని కొంతమంది చాలా సీరియస్ నటులు. మరికొంతమంది హాస్యగాళ్లు. మరికొంత ఆనంద పరచగలిగినారు.

ఆల్‌జోల్సన్ – ఈయన చాలా గొప్ప సహజ నటుడు. గొప్ప పాటగాడు. ఆయన పాటలోని ఆరోహణ – అవరోహణలతో మనల్ని తీసుకెళ్తాడు. మామీ పాటతో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించాడు. అలాగే సినిమాల్లో చివరి రోజుల్లో 'దేర్ ఈస్ రెయిన్‌బో అరౌండ్ మై షోల్డర్స్' పాట, 'వెన్ ఐ లీవ్ ది వరల్డ్ బిహైండ్' పాట. ఈ పాటలు ఎంత గొప్పవి! కవిత్వాన్ని మూర్తిమంతం చేశాడు. సామ్ బెర్నార్డ్ డచ్ హాస్యనటుడు. చిన్న విషయాలను

గొప్పగా నటించి చూపేవాడు. బైట అతను తాత్వికుడు. ఒకసారి ఫోర్డ్‌స్టెర్లింగ్ ఎంతో బాధగా 'నా భార్య నన్ను మోసం చేసింది' అని వాపోయాడు. అయితే ఏమిటి, వాళ్లు నెపోలియన్‌ని కూడా మోసం చేశారు!

ఫ్రాంక్ టిన్నీ నేను మొదటిసారి న్యూయార్క్‌లో చూశాను. వింటర్ గార్డెన్ హాల్లో ఆయన చాలా పేరుగలవాడు. ప్రేక్షకులతో నేరుగా మాట్లాడేవాడు. ఒక్కసారి స్టేజి ముందుకు వంగి రహస్యం ఈ హీరోయిన్ నేనంటే పడిచస్తుంది! అని చెప్పేవాడు ప్రేక్షకులకి. మళ్లీ ఎవరూ వినట్లేదు అని నిర్ధారించుకుని, 'సాయంత్రం కలిసినప్పుడు మంచి పొద్దు అని పలకరించాను. నేనంటే ఎంతిష్టమంటే కనీసం సమాధానం కూడా చెప్పలేకపోయింది.' అని ప్రేక్షకులకు రహస్యంగా చెప్పేవాడు. అంతలో హీరోయిన్ రావటం చూసి చూపుడు వేలుతో నోరు మూసుకుంటూ 'హుష్' అని హెచ్చరించేవాడు ప్రేక్షకుల్ని. హీరోయిన్ రావటంతో 'హీ కిడ్డీ' అని పలకరించినపుడు ఆమె కోపంగా వెళ్లిపోతూ, దువ్వెన జారవిడిచి నిష్క్రమించేది. అప్పుడు 'చూశారా మేమిద్దరమే వున్నపుడు, ఇంతే' అని ప్రేక్షకులకు చెప్పేవాడు. అపుడు మేనేజర్‌ని పిలిచి దువ్వెన తీసి యిచ్చేవాడు. ఇదంతా నాటకం!

తర్వాత సంవత్సరంలో అతని ఇంత ప్రతిభా గాలికి పోయింది. తన గురించి ఎక్కువగా పట్టించుకోవటంతో ప్రేక్షకులను అలరించలేకపోయాడు. ఇది నాకు చాలా వింత అనిపించింది.

తర్వాత రోజుల్లో 'లైమ్ లైటు'లో ఈ సమస్యను తీసుకున్నాను. దానికి కారణం వయస్సులు అడ్డంపెట్టుకున్నాను.

అమెరికన్ హీరోయిన్లలో ప్రిస్కీ చాలా యిష్టం. హాస్యాన్నీ, తెలివినీ చాలా చాతుర్యంగా కలిపి చూసేది. ఆమె మేన కోడలు ఏమిలేకుండా చాలా మంచి శైలితో తేలికగా అవలీలగా భావాలను పలికించేది! లెస్లీకార్టర్ కూడా మంచి నటి. అలాగే ట్రిక్సీఫ్రాంగజా, ఫన్నీ బ్రైస్ ఇంగ్లాండ్‌లో గొప్ప నటీమణులున్నారు. ఎర్లైన్‌టెర్రీ అడారీవ్, ఇరాన్ వాన్‌బ్రగ్, సిబిల్ తోర్న్‌డైక్ ఇంకా పాట్ కాంబెల్!

జాన్ బారీమోర్ చాలా గొప్పగా స్టేజి నటుడిగా నిలబడ్డాడు. కాని అతను అంతా జోక్‌గా తీసుకునేవాడు. స్టేజిమీద నడవటం హామ్లెట్ పోషించినా, లేదా రాణీతో పడగ్గదిలో గడపటం – అంతా అతని జుగుప్స గలిగించే హాస్యంతోనే చూపేవాడు.

జీన్ ఫాలర్ వ్రాసిన ఆయన జీవిత చరిత్రలో, రాత్రి మందు దిగకముందే హామ్లెట్ వేషం వేయటానికి స్టేజి మీదకు వస్తాడు. హామ్లెట్ పాత్ర పోషణలో మధ్యలో వాంతులు చేసుకుంటూ తూలుతూ నటించాడు. కాని అతని నటనను ఆంగ్ల విమర్శకులు చచ్చినట్లు పొగిడారు. ఇదేమన్యాయం?

జాన్‌ని నేను ఒక్కసారే కలిశాను. ఆయన యునైటెడ్ ఆర్టిస్ట్స్ ఆఫీసులో ఒక్కడే ఆలోచనలో వున్నపుడు. ఎవరో నన్ను పరిచయం చేశారు. అపుడు నేను ఆయనతో 'షేక్స్పియర్ హామ్లెట్‌ని మీరు బాగా చూపారు' అన్నాను. 'ది కింగ్' కూడా మంచి పాత్రే' అన్నాడు. నిజానికి ఈయన నిజాయితీ మెచ్చుకోదగిందే. కాని తర్వాత తర్వాత తాగుడుకు బానిస అయినాడు. ప్రపంచం మీద తన కోపాన్నీ, అసహ్యాన్నీ అంతే అసహ్యంగా తాగి తాగి చనిపోయాడు!

'ది కిడ్' చాలా విజయవంతం అయినా నా సమస్యలు తీరలేదు. ఇంకా నాలుగు చిత్రాలు తీసి వీళ్లకి ఇవ్వాలి. ఆలోచనలే రావటం లేదు. ఒక రకమైన నిరాశతో అక్కడ వున్న సామానుల గదిలో పచార్లు చేస్తున్నాను. ఏమైనా కనపడకపోతుందా, ఏదైనా ఆలోచన రాకపోతుందా అనే ఆశతోనే.

పాత పియానో, కారాగారపు తలుపులు విరిగిన కుర్చీలు. అంతలో నాకు రెండు 'గోల్ఫ్ క్లబ్‌లు' కనిపించాయి. ఆఁ అదీ ట్రాంప్ గోల్ఫ్ ఆడతాడు! అదీ 'ది ఐడిల్ క్లాస్'కి నాంది!

చాలా సింపుల్ కథ. ట్రాంఫ్ – ధనికుల ఆనందాలన్నీ రుచి చూస్తుంటాడు. దక్షిణాదికి వెచ్చదనం కోసం వెళ్తాడు. రైలు కింద ప్రయాణం చేస్తాడు. గోల్ఫ్ కోర్సులో వున్న బంతులతో గోల్ఫ్ ఆడతాడు. ఒక ఫాన్సీడ్రెస్ ఆటలో గొప్ప వాళ్లతో కలిసిపోతాడు. ట్రాంప్ బట్టల్లో అప్పుడే అందమైన అమ్మాయి పరిచయం అవుతుంది. కొంత రొమాన్సు, ప్రయత్నం తర్వాత తప్పించుకోవటం.

ఈ షూటింగ్‌లో నాకు బ్లోటార్చితో చిన్నగా కాలింది. తర్వాత మళ్లీ షూటింగ్ చేశారు. మా ప్రచురణకర్త కార్ల్ రాబిన్సన్ ఇదంతా ప్రచారం కోసం పత్రికలకు ఇచ్చాడు. ఆ సాయంత్రం తాటికాయంత అక్షరాలతో వచ్చింది. నాకు దిమ్మ తిరిగిపోయింది. ఫోన్లు, వుత్తరాలు, అభిమానులు వెంటబడ్డారు. నేను పత్రికలో అంత సీరియస్ కాదు

అని నోట్ ఇచ్చాను. కాని ఎవ్వరూ అది ప్రచురించలేదు! హెచ్.జి. వెల్స్ లాంటివాడు, "అయ్యో చార్లీ ఇక నటించడా? ఎంత దురదృష్టం" అని పత్రికలకు ప్రకటన పంపాడు! ఆయనకు నేను తంతి పంపాను, నిజాన్ని.

'ది ఐడిల్ క్లాస్' తర్వాత, ప్లంబర్ జీవితాన్ని, వాళ్లు ఎంత బాగా సంపాదిస్తున్నదీ తీసాను.

దీని తర్వాత నేను బాగా అలసిపోయాను. దీనికితోడు హెచ్.జి. వెల్స్ వుత్తరం కూడా. నాకు లోపల ఇంగ్లాండు వెళ్లి కొన్నిరోజులు గడపాలని వుంది! పది సంవత్సరాలయింది వచ్చి! మరో వుత్తరం కూడా – హెట్టి కెల్లీ రాసింది, నేను గుర్తున్నానా అని. ఇంగ్లాండు వస్తే తప్పని సరిగా కలవమని. ఇప్పుడు పెళ్లి చేసుకుని పోర్ట్‌మన్ స్క్వేర్లో వుంటున్నాను అని.

ఈ పది సంవత్సరాలు ఎన్నిసార్లు ప్రేమలో పడిలేచాను? టామ్‌తో చెప్పాను – 'సామాను సర్దు – ప్రయాణానికి' అని. 'రీల్స్‌కి చెప్పాను. కొన్నాళ్లు స్టూడియోకి శెలవులు ప్రకటించాను' అని. ఇంగ్లాండు వెళ్తున్నాను అని కూడా ప్రకటించాను!

పదిహేడవ అధ్యాయం

ఇంగ్లాండు ప్రవేశం!

ఇంగ్లాండు వెళ్లే నౌక రేపు ప్రయాణమవుతుంది న్యూయార్క్ నుంచి. ఆ ముందు సాయంత్రం నేను ఓ నలభై మంది అతిథులకు విందు ఏర్పాటు చేశాను. వారిలో ముఖ్యులు మేరీ పిక్‌ఫోర్డ్, డగ్లస్ ఫెయిర్ బాంక్స్, మేడమ్ మేటర్‌లింక్. మేమందరం చిన్నచిన్న సీన్లు ఆడాము. ముందుగా డగ్లస్, మేరీ ట్రామ్ కండక్టర్, టికెట్టు చింపి మేరీకి ఇస్తాడు. రెండో సీనులో మేరీ సహాయంకోసం అరవటం. డగ్లస్ మునిగిపోతున్న మేరీని ఒడ్డుకు చేర్చటం. మేమందరం 'డగ్లస్, డగ్లస్' అని అరిచాము.

సాయంత్రం రాత్రయ్యింది. అందరికీ కాస్త వైన్ నిషా కూడా ఎక్కింది. నేను, మేడమ్ మేటర్‌లింక్ ఒక విషాదభరితమైన సీను నటించాము. నా చేతుల్లో మేడమ్ చనిపోతుంటుంది. చనిపోయే ముందు ఆమెకు దగ్గు వస్తుంది. అది పెరిగి పెరిగి నాకు అంటుకుంటుంది. చివరికి దగ్గి దగ్గి నేను ఆమె చేతుల్లో చనిపోతాను! అదీ 'కామెల్లీ' డ్రామా!

మర్నాడు వుదయం 8.30కు నిద్ర లేపారు. ఆరోజే ప్రయాణం, నౌకలో. వెచ్చని నీళ్ల స్నానంతో బద్దకం తీరిపోయింది. నాతోపాటు ఎడ్వర్డ్ నాబ్ (ఈయనే కిస్మెత్ రాశాడు) ఈ ఒలింపిక్ ఓడలో ఇంగ్లాండు వస్తున్నాడు. పత్రికలవారి గుంపు నాతోపాటు కాబిన్ దాకా వచ్చారు. వీళ్లంతా ఇంగ్లాండు వస్తారని భయపడ్డాను. అందులో ఇద్దరు ఆ పనీ చేశారు!

చివరికి కాబిన్‌లో ఒంటరిగా మిగిలిపోయాను. అందులో పూలు, పళ్లు, శుభాకాంక్షలు అన్ని నిండిపోయాయి. ఇంగ్లాండు వదిలి పదేళ్లు –దశాబ్దం అయిపోయింది. ఇదే నౌకలో కార్నో కంపెనీ వాళ్లతో రెండో తరగతిలో ప్రయాణం చేశాను. అప్పుడే

స్టీవర్డు మమ్మల్ని నౌక అంతా చూపించి, మొదటి తరగతి కాబిన్లు బైటనుంచే చూడమన్నాడు. డబ్బున్న వాళ్లు ఎలా జీవిస్తారో ఎలా ప్రయాణం చేస్తారో తొంగి చూశాము. విలాస వంతమైన జీవనశైలి గురించి స్టీవర్డు ఉపన్యాసమే ఇచ్చాడు.

ఇప్పుడు అలాంటి కాబిన్‌లో కూర్చుని ప్రయాణం చేస్తున్నాను. ఇంగ్లాండుకు. అప్పుడు నేను వూరు పేరు లేని, కడుపు నింపుకోవటానికి వేషాలు వేసిన కుర్రవాణ్ణి. ఇప్పుడు కీర్తి, డబ్బు పుష్కలంగా వున్న ఒక తారగా ఇంగ్లాండు వెళ్తున్నాను. కాని నాకు లోలోపల మొదటిసారి స్వదేశాన్ని చూస్తున్న భావనే పెనవేసుకుపోయింది. మిగతావన్నీ వెనకనే వుండిపోయాయి. కొన్ని గంటల సముద్ర ప్రయాణం తర్వాత అంతా ఇంగ్లీషు వాతావరణం వచ్చేసింది నౌకలో, నేను, ఎడ్డీ రిట్జ్ రెస్టారెంటులో భోజనం చేసేవాళ్లం. విడిగా, ప్రత్యేకంగా, అక్కడ మాకు షాంపేన్, కార్క్యము, బాతు మాంసం, అన్నిరకాల వైన్లు, కేకులు, పుడ్డింగులు – అన్ని వడ్డించేవాళ్లు! ప్రతి సాయంత్రం చక్కగా నల్లని టై కట్టుకుని ఎంతో హుందాగా భోజనానికి వెళ్లేవాడిని! డబ్బు తెచ్చే విలాసాన్ని రుచి చూస్తూ!

ఈ ప్రయాణంలో చాలా విశ్రాంతి దొరుకుతుందని అనుకున్నాను. కాని, ఒలిపింక్ నౌక నోటీస్‌బోర్డు ఇంగ్లాండు పత్రికల వార్తలతో నిండిపోయేది. యునైటెడ్ న్యూస్, మార్నింగ్ టెలిగ్రాఫ్ "చాప్లిన్ వస్తున్నాడు. విజేత వస్తున్నాడు. అతని రాక రోమన్ విజయాన్ని తలపిస్తోంది."

ఇంక మరికొన్ని పత్రికలు నౌకలో నేను ఏ గంటలో ఏమి చేస్తున్నాను ఏకరువు పెడుతోంది. 'చార్లీ ఈజ్ మై డార్లింగ్' అనే పాట తయారయ్యింది కూడా!

'పొగమంచు మూలంగా నౌక రేవు చేరటం ఆలస్యం అవుతోంది నౌకాశ్రయంలో వేలమంది మంచుతో తడుస్తున్నారు చార్లీకోసం' "సౌత్ ఆంప్టన్ మేయరు స్వాగతం పలుకుతారు. అక్కడ పౌరసన్మానం ఘనంగా ఏర్పాటు చేశారు." ఇవీ వార్తలు. ఇంకెక్కడి విశ్రాంతి?'

ఇవన్నీ నేను ఎదురు చూడనివి. నేను చూడాలనుకున్నవి నేను జీవించిన స్థలాలు: కెన్నింగ్‌టన్ రోడ్, బ్రిక్స్‌టన్ ఏరియాలో, 3 పోన్‌వాల్ మేడ, 287 కెన్నింగ్‌టన్ రోడ్ నేను పనిలో సహాయంచేసిన వడ్రంగి మేస్త్రి షెడ్డు ఇప్పుడివన్ని నాకు దూరమైపోతున్నట్లనిపించింది.

చివరికి షేర్‌బర్గ్ రేవు చేరాము. నౌక దిగటమే గగనమైపోయింది. కెమెరాలు, పత్రికలవాళ్లు, అభిమానులు పోలీసులు 'ఇంగ్లాండుకు ఏమి తెచ్చారు – సందేశం? ఫ్రాన్స్‌కి సందేశం ఏమిటి?' ఐర్లండ్ పై మీ అభిప్రాయం?' ఇలా ప్రశ్నలతో ముంచెత్తారు. చివరికి రైలు పెట్టెలో కూర్చోబెట్టారు పోలీసులు. ఒక ఖైదీని తీసుకువచ్చినట్లు! పత్రికలన్నీ శీర్షికలు పెట్టాయి హోమ్ కమింగ్ ఆఫ్ కమేడియన్. ఆల్ లండన్ టాక్స్ ఆఫ్ చాప్లిన్స్ విజిట్. 'చాప్లిన్ గోయింగ్ టు లండన్' కొన్ని విమర్శలు వున్నాయి. చార్లీ గొప్పవాడే, కాని గ్రేట్ బ్రిటన్ యుద్ధంలో అపాయంలో వున్నపుడు ఇతను ఎక్కడ వున్నాడు? బాధ్యత లేదా? కెమెరా ముందు ట్రిక్కులు చేస్తూ తప్పించుకున్నాడా, తుపాకులు పట్టుకుని యుద్ధభూమిలో వుండాలి కదా?' అని కూడా విమర్శించాయి.

చివరికి రైలు పెట్టెలో నాతోపాటు హెట్టా సోదరుడు కూడా వచ్చాడు. అతని చెప్పాను హెట్టా వుత్తరం రాసింది చూడాలనుకుంటున్నాను అని! అతను నావంక వింతగా చూశాడు. 'హెట్టా చనిపోయింది' అని చెప్పాడు.

అయ్యో ఎంత పని, ఎంత విషాదం – నా హృదయం రోదించింది. నేనెదురు చూసిన అనుభూతిని ఎవరో దొంగిలించారు అని రోదించాను! చివరికి లండన్ పొలిమేరల్లోకి వచ్చాము. బైట ప్రకృతి వెచ్చగా వుంది. గాలిలో ఏదో ఎదురు చూస్తున్నట్లు ఎవరికోసమే వేచియున్నట్లు చెట్లు తలలూపుతున్నాయి. యుద్ధం తర్వాత ఏమీ మార్పు లేదు. అదే ఇంగ్లాండు. అవే ఇళ్లు. కాని ఏదో వుండవలసింది లేనట్లు అన్పిస్తోంది. అదంతా అనుకోవటంలోనే ఎదురుచూడటంలోనే వుందేమో!

అప్పటికి రైలు, స్టేషన్‌లోనికి ప్రవేశించింది. జనాన్ని దూరంగా పోలీసువాళ్లు కట్టి ఆపి వుంచారు! చాలా టెన్సషన్‌గా వుండింది. పోలీసు నన్ను ఖైదీలాగా ఆ జనాల దగ్గరికి జాగ్రత్తగా తీసుకు వెళ్లారు. నేను వాళ్లకి అభివాదం చేశాను. 'అడిగో చార్లీ – అతడే చాప్లిన్, మన చార్లీ చాప్లిన్' అరవటం మొదలుపెట్టారు. తర్వాత నన్ను టాక్సీ ఎక్కించి నా మారుటి తమ్ముడు ఆబ్రౌ (పదిహేనేళ్ల నుంచి నేను చూడనే లేదు) పిలిపించారు. నేను చెప్పాను వెస్ట్‌మినిస్టర్ బ్రిడ్జ్ పైనుంచి పోనిమ్మని. వాటర్‌లూ, యార్క్ రోడ్, అవే పాత ఇళ్లు. ఎల్.సి.సి. బిల్డింగ్ కొత్తగా కట్టింది. ఆ మూల తిరగ్గానే వెస్ట్‌మినిష్టర్ బ్రిడ్జి! ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. అవతలివైపు పార్లమెంటు పాలెస్. కాలానికి అతీతంగా నిలబడి!

ఇవన్నీ నేను వదిలి వెళ్లినప్పుడు ఇలాగే వున్నాయి.

నేను 'రిట్జ్ హోటల్' ఎంచుకున్నాను. దీనికి కారణం నేను ఇంగ్లాండు వదిలి వెళ్లేముందు కట్టారు. అప్పుడు దాని అందాలూ, మెరుగులూ, విలాసాలూ ఇవన్నీ విని విని ఎప్పటికైనా లోపలికి వెళ్లగలనా, అని అనుకునేవాడిని. ఇప్పుడు అందుకే రిట్జ్ హోటల్ ఎంచుకున్నాను. లోపలి అందాలు చూడాలని! అప్పటికే హోటల్ బైట చాలా పెద్ద గుంపు చేరింది. నేను టాక్సీ దిగి చిన్న ఉపన్యాసం ఇచ్చాను. జనం గోలగోలగా అరిచారు. తర్వాత లోపలికెళ్లి గదుల్లో దిగినా, బాల్కనీలోకి వచ్చి పదినిమిషాలకు ఒకసారి వాళ్లకు అభివాదం చేస్తున్నాను.

నా గదుల్లో కూడా స్నేహితులు నిండిపోయారు! వెంటనే వీటన్నిటికీ దూరంగా పోవాలని అనిపించింది. కాసేపు నిద్ర పోతాను అని చెప్పాను. అప్పటికి సాయంత్రం 4 గం॥లు అయ్యింది. అందరూ గదులు వదలి వెళ్లారు.

నేను వెంటనే బట్టలు వేసుకుని సర్వీసు లిఫ్ట్‌లో క్రిందికిదిగి వెనకవైపునుంచి బజారులో పడ్డాను.

జర్మన్ వీధిలో టాక్సీ ఎక్కాను. హై మార్కెట్ ట్రఫాల్గర్ స్క్వేర్ పార్లమెంటు వేపు, మళ్లీ వెస్ట్‌మినిష్టర్ బ్రిడ్జ్ – అక్కడ టాక్సీ ఆపించాను. అదిగో కెన్సింగ్‌టన్ రోడ్! అదే నమ్మశక్యం కాలేదు. ఇది నిజమే – ఏ మార్పూ లేదు. అదిగో క్రిస్ట్‌చర్చి – బ్రూక్ వీధి – చివరికి 3 పోన్‌ఆల్ టెర్రెస్ దగ్గర దిగాను. అప్పుడు నా మనస్సులో కొంత నెమ్మది వచ్చింది. ఇంటి దగ్గరకు నడిచాను. ఒక్క నిమిషం నిలబడి ఆ బొమ్మను గనించాను. ఇదీ 3, పోనాల్ టెర్రెస్ నావంక ఎండిపోయిన కపాలంలా చూస్తోంది. ఆ రెండు కిటికీలు మూసి వున్నాయి. అక్కడే అమ్మ దిగాలుగా కూర్చునేది. తిండి – కనీసం టీ కూడా లేక, నరాల బలహీనతలో మనసూ మతీ చెడిపోయి. ఇప్పుడు ఆ కిటికీలు మూసి వున్నాయి. వాటి రహస్యాలన్నీ దాచుకుని మౌనంగా వుండిపోయాయి. నేను ఇక్కడ నిలబడిన విషయం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ నిర్లిప్తంగా, కాని వాటి నిశ్శబ్దంలో నాకు 'మన్వంతరాల' నాటి బాల్యం ప్రతిధ్వనించింది.

3 పోనాల్ టెర్రస్‌లో ఏముంది? ఇన్నేళ్ల తర్వాత ఇంకా ఈ గూడు నా గుండెలో ఎందుకు నిలిచిపోయింది. ఎప్పుడూ నన్ను ఎందుకు రమ్మని పిలిస్తుంది? ఈ పేదరికం నాకు ఇష్టమయినదా? ఎవ్వరూ పేదరికం కోరుకోరు–అందులో మగ్గిపోవాలని

అనుకోరు. మరి? నాకు సమాధానం ఎప్పటికోగాని దొరకలేదు. అదిగో ఆ గూటిలోనే అమ్మవుంది. అమ్మె వెచ్చదనం వుంది. అమ్మ ప్రేమ వుంది. అమ్మ దుఃఖం వుంది. అమ్మ కష్టం వుంది. అమ్మ నమ్మకం వుంది. అమ్మ పేదరికం వుంది. అమ్మ అందం వుంది. అమ్మ నటిగా ధరించిన తళుకు దుస్తులున్నాయి. అమ్మ తొక్కిన కుట్టుమిషన్ శబ్దం వుంది. అమ్మ కంటినుండి ఒలికిన కన్నీటి బొట్లున్నాయి. టీ కెటిల్ శబ్దం వుంది. డికాక్షన్ వాసన వుంది. చివరి మాంసం ముక్క – చివరి రొట్టెముక్కలున్నాయి. దీపపుకాంతిలో ఆమె నీడ వుంది! అమ్మ చెప్పిన కథలున్నాయి. అమ్మ చదివిన బైబిల్ కథలోని విషాదం వుంది.

మనిషిలాంటి దేవుని ఆర్తనాదం వుంది. ఆమె మొక్కవోని ధైర్యం వుంది. నైతికత వుంది. ఆమె అంతులేని దయ వుంది – ఆమె చరిత్ర వుంది. చివరికి నిశ్శబ్దంలోకి జారుకున్న ఆమె మనస్సు వుంది. ఈ ప్రపంచం అంటే జాలి వుంది. అందుకే 3 పోనాల్ టెర్రస్ అంటే నా చిన్నతనం–అమ్మతో గడిపిన బాల్యం నాకెంతో విలువైన (జీవితం) సమయం.

నేను వదలుకోలేని గతం...

నిరంతర స్వగతం!

బరువుగా తల వంచుకుని ముందుకు కదిలాను! తర్వాత కెన్నింగ్ టన్ రోడ్‌లోకి వచ్చా. నేను పనిచేసిన వడ్రంగి మేస్త్రి రేకుల బారన్ అలాగే వుంది. ఇప్పుడు ఏ శబ్దాలూ రావటం లేదు. అక్కడ వడ్రంగి పనివారు లేరు.

287 కెన్నింగ్‌టన్ వీథికి వచ్చాను. ఇక్కడే సిడ్నీ, నేనూ వున్నాము. నాన్నతో మారుటమ్మతోపాటు. అప్పుడే నిరాశా నిస్పృహలన్నీ నన్ను మంచులా కప్పి వూపిరాడలేదు! ఇప్పుడు అమాయికంగా, అర్థంకానివిగా కనిపించాయి. కెన్నింగ్‌టన్ పార్క్ పోస్టాఫీసు దాటాను. ఇక్కడే నాకు సేవింగ్స్ ఖాతా వుంది. అందులో 60 పౌండ్లు 1908 నుంచి వున్నాయి అలాగే!

కెన్నింగ్‌టన్ పార్క్ ఇంకా పచ్చగానే వుంది. తర్వాత కెన్నింగ్‌టన్ గేట్‌దగ్గరకు వచ్చాను. ఇక్కడే మొదటిసారి హెట్టీని కలిసాను. అప్పుడే ట్రామ్ కారు వచ్చింది. ఎవరో ఎక్కారు కానీ ఎవరూ దిగలేదు!

అక్కడనుంచి బ్రిక్స్‌టన్ వీధిలో 15 గ్లెడ్‌షా మాన్షన్. సిడ్నీ, నేనూ ఇక్కడే వున్నాము ఇప్పటికే నా ఉద్వేగం అంతా నీరుగారి పోయింది. కేవలం నా ఉత్సుకతే మిగిలింది.

తర్వాత స్కూలు ఆటస్థలం. ఇప్పుడు భవనాలకోసం అది కుంచించుకు పోయింది.

అలా కెన్నింగ్‌టన్ రోడ్‌లో ఒక కలలో తిరిగినట్లు చాలాసేపు తిరిగాను. అప్పటినుంచి ఇప్పటివరకు జరిగింది కలయేమో, నిజం కాదేమో అని అనిపించింది. అసలు అమెరికా ఒక భ్రమ ఏమో అని కూడా అనిపించింది. ఇదే నిజమా, ఈ పేదరికమే నిజమా, నాలో ఎక్కడో ఈ వీధిల్లోని శక్తి నన్ను మళ్లీ ఊబిలోకి లాగుతున్నదేమో అని అనుమానం కూడా వచ్చింది! నా ఒంటరితనం, నా పేదరికపు బాధ గురించి చాలా చెత్త రాశారు. బహుశా నేనెప్పుడూ ఎక్కువమంది స్నేహితుల కోసం ఎదురు చూడలేదు. కీర్తి, సంపద స్నేహితుల్ని ఎక్కువ పరిచయాల్ని ఆకర్షిస్తాయి. అదీ మంచీ చెడూ రెండూ కలగలిసి వుంటాయి. నేను స్నేహాన్ని సంగీతంలా అనుభవిస్తాను. అది వినే సానుకూల పరిస్థితి వున్నపుడే! నాలాంటి వాళ్లకి అంత సమయం చిక్కకపోవచ్చు తరచూ.

నేను బాగా పెరిగిపోతున్నాను. అన్నిరకాల వాళ్ళూ నా చుట్టూ చేరుతున్నారు. నేను అంతర్ముఖుణ్ణి. అలాగే వృత్తిరీత్యా బహిర్ముఖుణ్ణి కూడా. నేను ఏకాంతంకోసం తపించే సమయంలో వీళ్లందరికీ బలవంతంగా దూరంగా వుండేవాణ్ణి. బహుశా ఈ విషయాన్నే నా విమర్శకులు ఎత్తిచూపారు. నేను తప్పించుకు తిరుగుతాననీ, నిజమైన స్నేహితులు లేరనీ ఏకాకిననీ. నా జీవితంలో నిజానికి వెలుగు చూపిన స్నేహితులు ఒకరో ఇద్దరో. నేను వారితో వున్నప్పుడు ఎంతో ఆనందంగా వుండేవాడిని! కాని నా వ్యక్తిత్వాన్ని గురించి వ్రాసిన వాళ్లు వీళ్లు అనుకున్నదే రాశారు. మంచీ – చెడూ, సోమర్‌సెట్ మామ్ ప్రఖ్యాత రచయితే ఇలా రాశాడు:

"చార్లీ చాప్లిన్ – ఈయన హాస్యం చాలా సహజంగా వుంటుంది. అప్పటికప్పుడు పుట్టినట్లు, మృదువుగా హాయిగా కూడా వుంటుంది. కాని వీటన్నిటి వెనకాలే ఏదో తెలియని బాధా, కష్టం వున్నట్లనిపిస్తుంది. అతను అన్ని రకాల 'మూడ్స్' పోతుంటాడు. దానికి అతని ముఖంలో ప్రవచించకపోవచ్చు. "రాత్రి నాకు ఏదో జరగరానిది జరిగింది ఏంచెయ్యాలో తెలియని స్థితి" అనిపిస్తుంది. నేను మళ్లీ చెప్తున్నాను. ఆయన హాస్యం

చుట్టూ విచారం వుంది. ఆయన్ను చూస్తే ఒక సంతోషంలో వున్న వ్యక్తిని చూస్తున్నట్లు అనిపించదు. నా అనుమానం చాప్లిన్‌ని అతని చిన్ననాటి పేదరికపు బ్రతుకు వెతలు ఇంకా వెన్నాడుతుండాలి. ఇప్పుడు లభిస్తున్న పేరుప్రఖ్యాతులూ సంపదా ఇవన్నీ అతన్ని బంధించి వుంచుతున్నాయి. అన్ని సంకెళ్ల నుంచి అతను బైటపడలేకపోతున్నాడు. బహుశా అతనికి స్వేచ్ఛ పేదరికంలోనే, మురుగు వాడల్లోనే వుందేమో? అప్పటి పోరాటంలోనే వెతుకుతున్నాడేమో ఆ లండన్ వీథులు. ఆ నిద్దర లేని రాత్రులు, ఆ తిండిలేని మధ్యాహ్నాలు. ఈ కష్టతరమైన బాల్య-యవ్వనాలు అతన్ని వీడడం లేదనిపిస్తుంది.

"ఇప్పుడు ఇంట్లోకి ఈ కొత్త ఇంట్లోకి వెళ్లి, అరే ఇక్కడ నాకేమి పని? అని ఆశ్చర్యపోతుండాలనుకుంటాను. మళ్లీ ఆ పాత యింటికి (కెన్నింగ్‌టన్ రోడ్ రెండో అంతస్తు) తిరిగి వెళ్లి ఆఁ ఇది నా స్థలం - ఇక్కడే నేనుండాలి అనుకుంటాడేమో?

"ఇలా ఎందుకంటున్నాను? ఒకసారి అతనితో లాస్‌ఏంజెలిస్ వీథుల్లో నడుస్తూన్నాను. అలా తిరుగుతూ పేదలు నివసించే వీథుల్లోకి వెళ్ళాము. అవి చాల ఇరుకుగా మురికిగా వున్నాయి. వాళ్లు ఆ గుడ్డి దీపాలలో ఏవో చేతితో చేసిన వస్తువులు అమ్ముతున్నారు. అటువంటి వారికి రోజు గడవటమే కష్టం. అవన్నీ చూస్తున్నప్పుడు నేను చార్లీని చూశాను. అతని ముఖంలో వెలుగు కనిపించింది. గొంతులో ఉత్సాహం ధ్వనించింది. "చూడండి. ఇది జీవితం - ఇదే నిజమైన జీవితం-మిగతాదంతా షామ్ అన్నాడు..."

దీనిలో నిజంలేదు. నేను అన్నది అప్పుడు మేము మెక్సికన్ పేటలో తిరుగుతున్నాము. 'చూడండి ఇక్కడ బెవర్లేహిల్స్‌లో కంటే ఎక్కువ చైతన్యం కనపడుతోంది' అని.

ఇది చాలా అన్యాయం. ఇలా పేదరికాన్ని గొప్పగా-గ్లామర్‌గా రాయటం క్షమించరానిది. ఇంకొకరి బాధను కవితాత్మకంగా వర్ణించటం చాలా నేరం.

ఇంతవరకూ పేదరికాన్ని ఆనందించిన వాడెవరూ నాకు తారస పడలేదు. బహుశా సోమర్‌సెట్ మామ్ తన నవలల్లోని వ్యక్తులెవ్వరినీ ఈ రకంగా సృష్టించి వుండడు. ఏ తిండి లేని వెధవా 'ఆహా లండన్ చీకటి వీధులు వెన్నెల్లో మెరిసిపోతున్నాయి' అనడు కదా.

నాకు పేదరికం ఉండదగింది కాదు. కోరుకోదగిందీ కాదు. నేను ఆ పేదరికం నుంచి నేర్చుకున్నది విలువలు మంట గలవటమే. బ్రతుకు పోరాటమే. అంతమాత్రంచేత సంపన్నుల విలువలకు ఎక్కువ ఖరీదు వుందనుకోను. ఇదికూడా వంకరగా చూడటమే!

సంపదా, పేరు ప్రఖ్యాతులూ, నాకు నేర్పింది, ప్రపంచాన్ని సరైన కోణంలో చూడమనే. ఎంత సంపన్నులైనా ఎంత ప్రముఖులైనా వాళ్లూ మనుషులేననీ, వాళ్ల బాధలు వాళ్లకున్నవనీ, మనలాగే వాళ్లు బలహీనతలు పోగొట్టుకోలేరనీ.

అంతేకాదు ఈ సంపదా, కీర్తి మరో విషయం కూడా నేర్పించాయి. కత్తికీ, కర్రకూ పెద్ద తేడా లేదని. బెత్తానికీ చెర్నాకోలుకీ తేడా లేదని. అమ్మాయిల మధ్యతరగతి కుటుంబాలపై మోపిన బరువు, అదే కాలేజీ చదువు – విశ్వవిద్యాలయం విద్య వీటిలోనే తెలివితేటలు విజ్ఞానం వుంది. అవి బైట దొరకవు అనికూడా నేర్పింది.

సోమర్‌సెట్ మామ్ లాంటివారు ఏమి రాసినా, నేను నేనే, నా వ్యక్తిత్వం నా ప్రత్యేకత. నాది నా పూర్వుల చరిత్రలాగే, నా కోరికలూ, నా కలలూ నా అనుభవాలూ వీటన్నిటి మొత్తమే ఈ చార్లీ చాప్లిన్!

లండన్ వచ్చిన తర్వాత కూడా హాలీవుడ్ స్నేహితుల మధ్యలోనే రోజులు గడిచిపోతున్నాయి. ఇది వదలించుకోవాలని కొత్త అనుభూతులకోసం, కొత్త ముఖాలకోసం వెతికాను.

ఈ అవకాశాన్ని, సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించున్నాను. ఈ కీర్తి పతాకాన్ని చేతిలో పట్టుకుని సంఘంలో గొప్పవాళ్లని కలవాలని ప్రణాళిక వేసుకున్నా. ముందుగా నేను హెచ్.జి. వెల్స్‌ని కలిసే ఏర్పాటు వుంది. ఆ తర్వాత నేను చాలా స్వేచ్ఛగా వున్నాను. నా స్నేహితుడు ఎడ్డీ 'రాత్రి గారిక్ క్లబ్‌లో విందు' అన్నాడు. అంటే "మళ్లీ నటులు, రచయితలు...' అవునా" అన్నాను.

'నన్నెందుకు ఈ ఇంగ్లీషు పల్లెటూర్లకూ ఇళ్లల్లోని విందులకూ పిలవరు? అవన్నీ చూడాలని వుంది' అన్నాను. నేను ఇప్పుడు యాత్రికుడిని కదా!

గారిక్ క్లబ్ చాలా పురాతనమైంది. పాత ఓక్ బల్లతో చీకటిగా వార్నీషు వాసనతో మంచి మూడ్‌లో వుంది!

అక్కడే సర్ జేమ్స్ బేర్రీ, ఇ.వి. లూయిస్, వాటర్ హాకెట్, లియార్డ్ ఫ్రాంటన్, సర్ ఎడ్విన్ లూటయిన్స్, స్మ్యూన్ బాన్‌క్రాఫ్ట్ ఇలా ఎంతోమంది గొప్ప పేరున్న వాళ్లు కలిసారు. ఆ సాయంత్రం చాలా సాదాసీదాగా వున్నా ఇటువంటి మహామహుల మధ్య గడపటం అదృష్టమే.

ఇటువంటి సమ్మేళనంలో మామూలుగా వుండటం కష్టం. ముఖ్యంగా డిన్నర్ తర్వాత ఉపన్యాసాలు లేవని చెప్పే ఎవరికి వారు మాట్లాడుతున్నారు. ఫ్రాంటన్ ఈయన గొప్ప శిల్పి. ఆయన ఎంతో సీరియస్‌గా మాట్లాడుతున్నారు. మేము ఉడకబెట్టిన మాంసం ట్రియాకిల్ పుడ్డింగు తింటున్నాము.

నేను పత్రికల వాళ్లకి మొదటి ఇంటర్వ్యూ ఇచ్చినపుడు చెప్పాను. నాకు చిన్నప్పటినుంచి Stewed eels (బొమ్మిడాయులు) ట్రియాకిల్ పుడ్డింగు చాలా ఇష్టమని అన్నాను. అదే ప్రచారం చేశారు. పార్టీ అయిపోయింది. అప్పుడు ఎడ్డీ అన్నాడు, 'సర్ జేమ్స్ బెర్రీ ఆయన ఇంటికి వచ్చి టీ తాగి వెళ్ళమన్నా'డని! భారీ ఎపార్ట్‌మెంటు. థేమ్సునది చాలా అందంగా వుంది. వెనక బాల్కనీలోకి తీసుకు వెళ్లాడు. ఎదురుగా వున్న (సందుకు అవతల) ఒక కిటికీ చూపి అదీ బెర్నాడ్‌షా గది. అక్కడ దీపం వుంటే, నేను మూడుసార్లు ఇదిగో ఈ గింజలతో కొడతాను కిటికీమీద. ఆయన తలుపు తీస్తే కాసేపు మాట్లాడుకుంటాం. లేదా నాలుగోసారి ఇక కొట్టను అని. చిలిపిగా స్కాటిష్ యాసలో చెప్పాడు.

పారమౌంట్ వాళ్లు పీటర్‌పాన్ సినిమా తీస్తున్నారు. 'నాటకానికంటే సినిమానే బాగుంటుంది అన్నాను' దీనితో బెర్రీ కూడా అంగీకరించాడు.

అప్పుడు 'మీరు కిడ్ సినిమాలో డ్రీంసీ సీన్స్ ఎందుకు పెట్టారు – అది కథా గమనానికి అడ్డంకదా' అన్నాడు. అవును కాని 'కిస్ ఫర్ సిండరెల్లా' ప్రభావంతో చేశాను. ఆ మర్నాడు ఎడ్డీతో షాపింగ్ వెళ్లాం. ఎడ్డీ అన్నాడు బెర్నాడ్‌షాని చూద్దాం అని. 'మనం ముందుగా అనుకోలేదు. ఆయనకు తెలియదు కదా?' అన్నాను.

'చూద్దాం' అని తీసుకువెళ్లాడు. సరిగ్గా మధ్యాహ్నం నాలుగ్గంటలకు వెళ్లి బెల్ కొట్టాం. మేము తలుపు తెరుచుకోవటానికి వేచి వుండగా నాకు ఒక్కసారిగా మానసిక ఆందోళన వచ్చింది. అంతే వెంటనే నా గదికి పరుగెట్టాను. తర్వాత 1931 వరకు ఆయన్ను కలిసే భాగ్యం కలగలేదు.

మర్నాడు టెలిఫోన్ మోగుతుంటే మెలకువ వచ్చింది. ఎడ్డీ మాట్లాడుతున్నాడు. ఎవరూ 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్?' 'ఈ రాత్రికా – చాలా సంతోషం' అని. నా గదిలోకి వచ్చాడు. "ఆ నిద్ర లేచారా? ఇప్పుడే 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' ఫోన్ చేశారు. ఈ రాత్రికి బకింగ్ హామ్ పాలెస్‌లో విందు!"

"ఈ రాత్రికి మరో ప్రోగ్రాం పెట్టుకోవద్దు' అని కూడా అన్నాడు. 'అరె మనకు హెచ్.జి. వెల్స్‌తో విందు వుందిగా రాత్రికి. అది ముందుగానే నిర్ణయమైందిగా' అన్నాను.

ఎడ్డీ నా మాటలు లెక్క చేయలేదు. చెప్పిందే చెప్పాడు. నాకు బకింగ్‌హాం పాలెస్‌లో యువరాజుతో విందు అంటే చాలా ఉత్సాహం వచ్చింది. కాని లోపల ఏదో అనుమానం పీడిస్తోంది. 'ఎడ్డీ! మనల్ని ఎవరైనా ఆట పట్టిస్తున్నారా? యువరాజు స్కాట్‌లాండ్‌లో కదా వున్నాడు, పత్రికల్లో చూశాను" అని హెచ్చరించాను.

అప్పుడు 'ఎందుకైనా మంచిది. ఒకసారి పాలెస్‌కి ఫోన్ చేస్తాను' అన్నాడు. తర్వాత నువ్వు చెప్పింది నిజమే. ఆయన స్కాట్‌లాండ్‌లోనే వున్నాడు' అన్నాడు నీరసంగా.

ఆ వుదయం మాకు చాలా చెడువార్త వచ్చింది. పాటీ ఆర్బకిల్ ఒక హత్యకేసులో ఇరుక్కున్నాడని. అతను కీస్టోను కంపెనీలో నా సహోద్యోగి. చీమకు కూడా హాని తలపెట్టడు. చాలా సౌమ్యుడు. పత్రికల వాళ్లకి ఇదే విషయం చెప్పాను. తర్వాత అర్బకిల్‌ని విడుదల చేశారు. అభియోగాలన్ని కొట్టివేశారు.

ఆ మధ్యాహ్నం హెచ్.జి. వెల్స్‌తో పాటు ఆస్వాల్డ్ స్టాల్ థియేటర్‌కు వెళ్లాలి. అక్కడ ఆయన రచన ఆధారంగా తీసిన సినిమా ప్రదర్శిస్తున్నారు. చాలా పెద్ద గుంపు వుంది. థియేటర్ దగ్గరకు రాగానే గుంపును తప్పించటానికి. నన్ను ఎత్తుకుని ఎలివేటర్‌లో పెట్టారు. ఆఫీసు గదుల్లో ఇంకా జనం వున్నారు. మేమిద్దరం చేతులు కలిపేలోపే చాలా కెమెరాలు లైట్లుతో క్లిక్ క్లిక్‌మన్నాయి. అప్పుడు వెల్స్ అన్నాడు మెల్లగా 'నువ్వూ, నేనూ ఇక్కడ గొర్రెలం' అని నవ్వుతూ.

సినిమా అయిపోయింది. అది అంత బాగోలేదు. వెల్స్ అన్నాడు 'ఆ కుర్రవాడిని గురించి నాలుగు మంచి మాటలు చెప్పు!' నిజానికి జార్జి. కె. ఆర్థర్ కుర్రవాడు. అతనే సినిమాను రక్షించాడు. వెళ్లేముందు రాత్రికి విందు మర్చిపోకు. 7.30 కి. మామూలు బట్టల్లో వచ్చెయ్యండి' అన్నాడు.

ఆ విందులో రిబెక్కా వుంది. సంభాషణలు వెసులుబాటుగా లేవు. హెచ్.జి. వెల్స్ రష్యా వెళ్లి వచ్చాడు. ఆయనే అదే మాట్లాడుతున్నాడు. "అక్కడ అభివృద్ధి చాలా మందకొడిగా వుంది. కాగితాల మీద రాయటం వేరు. పని చేయటం వేరుకదా" "అయితే దీనికి పరిష్కారం?" అని అడిగాను. "అందరికీ విద్య గరిపితే ఎవరిని వారు ఉద్ధరించుకుంటారు."

"నాకంత సోషలిజమ్ గురించి తెలియదు. ఏ పరిపాలనలోనయినా సాంఘికంగా కేవలం తిండికోసం పనిచేయటం – నేను అంగీకరించలేను. వ్యక్తి స్వాతంత్ర్యం – తన ఇష్టాన్ని పనిగా మార్చుకోవాలి. అదే సరైన రాజకీయ సాంఘిక వ్యవస్థ" అని అన్నాను. ఆయన నవ్వాడు.

'మరి నీ సినిమాలు?"

'అది పనికాదు – అది చిన్నిపిల్లల ఆట' అని చెప్పాను.

'సరే తర్వాత ఎక్కడకు వెళ్తున్నారు?'

'పారిస్ వెళ్దామనుకుంటున్నా' అన్నాను. అక్కడ నుంచి స్పెయిన్ వెళ్లి 'బుల్ ఫైట్' చూస్తాను.

"అలాగా? కాని గుర్రాలను కూడా హింసిస్తున్నారు కదా?" అన్నాడు.

"గుర్రాలంటే ఎందుకు సెంటిమెంటు?" అన్నాను కానీ, తర్వాత నన్ను నేను నిందించుకున్నాను ఈ విషయంలో చాలా కాలం!

ఆ మర్నాడు సర్ ఎడ్విన్ లూట్యెన్స్ (ఈయనా చాలా గొప్ప శిల్పాచార్యుడు) ప్రస్తుతం ఢిల్లీలో పార్లమెంటు బిల్డింగ్ ప్రణాళిక తయారు చేస్తున్నాడు. నా దగ్గరకు బకింగ్‌హాం పాలెస్ నుంచే వచ్చాడు. (కింగ్ జార్జిని కలిసి). ఆయనతోపాటు చిన్న పనిచేసే టాయిలెట్ మోడల్ తీసుకువెళ్లారు. అది చూసి రాజదంపతులు చాలా ముచ్చటపడి దానితోపాటు మొత్తం ఇంటిని అలాగే చిన్ని పరిమాణంలో తయారు చేయమన్నారు. తర్వాత దానిని ప్రదర్శనకు పెట్టి చాలా డబ్బు వసూలు చేశారు. సేవా కార్యక్రమాలకోసం!

దీని తర్వాత నాకు ఆతిథ్యం తగ్గిపోసాగింది. కొంతమంది రచయితల్ని కలిసి తర్వాత నేను చిన్నపుడు తిరిగిన ప్రదేశాలు చుట్టి వచ్చాను. తర్వాత హఠాత్తుగా పెట్టె

సర్దుకుని పారిస్ ప్రయాణమైనాను. ఏమాత్రం ప్రచారం లేకుండా ప్రయాణమైనాము. కాని కాలైస్ చేరేసరికి ఇంగ్లీషు ఛానెల్ దాటి అక్కడ చాలా పెద్ద సంఖ్యలో అభిమానులు చేశారు. వివే చార్లెట్ అంటూ అరిచారు. ప్రయాణంలో అతలాకుతలమై వున్నాము. అయినా నవ్వుతూ ప్రణామం చేశాము. అలాగే వెళ్లి రైలు ఎక్కాము. పారిస్‌లో కూడా ఇదే ఆహ్వానం. సంతోషంగానే వుంది.

నేను క్లారిడ్జ్ హోటల్‌లో వున్నాను. ఫోన్ మోగుతూనే వుంది. మిస్ మోర్గాన్ కార్యదర్శి ఎన్నోసార్లు ఫోన్ చేసింది.

జె.డి. మోర్గాన్ కూతురు. ఏదో ఛారిటీకి ప్రదర్శనకోసం అయి వుంటుంది. 'అయిదు నిమిషాలు చాలు' అని సెక్రెటరీ మరీ గొడవ చేసింది. అప్పటికే హోటల్ లాబీకి వచ్చాను. అక్కడ కలిసింది. అప్పటికి 3-45 సమయం. నేను 4.00 గం॥లకు పనివుంది అన్నాను. నాకు అయిదు నిమిషాలు చాలు అని అక్కడే సోఫాలో కూర్చోబెట్టింది. నేను ఏమిటి విషయం అని అడగకముందే అవును 'యుద్ధంలో ఫ్రాంస్ ధ్వంసమైంది 'సినిమా తీసుకోండి నన్ను వదిలివేయండి అన్నాను. మీరు వస్తే మరిన్ని వేల డాలర్లు వస్తాయి' అని అంది. మిమ్మల్ని ఫ్రాంస్ ప్రభుత్వం సన్మానిస్తుంది' అంది. 'తప్పనిసరిగానా' అన్నాను. 'అవును మేము సిఫారసు మాత్రం చేయగలం' అంది. కాని శాయిశక్తులా ప్రయత్నిస్తాను అంది. "సరే నేను ఇప్పుడు బెర్లిన్ వెళ్తున్నాను. నాకీ విషయం తెలియజేయండి' అన్నాను.

తర్వాత నా ప్రవర్తనకు నాకే సిగ్గువేసింది!

ఒక్కోసారి ఒక పరిచయం - ఎన్నో గొలుసు పరిచయాలనూ అవకాశాలనూ గలిగిస్తుంది.

నాకు ఇద్దరు వెనిజులా అమ్మాయిలు చెప్పారు. ఒకసారి రైలులో రాక్‌ఫెల్లర్ పరిచయమై చిన్న వుత్తరం ఇచ్చాడట. వారిద్దరు ఆ వుత్తరంతో న్యూయార్క్ సోషల్ లైఫ్ మొత్తాన్ని దున్నివేశారు. కాని వాళ్లు పెళ్లయిన వాళ్ల జోలికి పోకుండా మంచి పేరు తెచ్చుకున్నారు. చివరికి న్యూయార్క్ మహిళా మణులే వారికి పెళ్లిళ్లు కూడా చేశారు.

ఇక నావంతు నేను క్లారిడ్జ్‌లో స్నానం చేస్తుండగా, జార్జ్ కార్పెంటర్ అనే ఆయన బాత్‌రూంలోకి వచ్చేశాడు. (ఈయన న్యూయార్క్‌లో నాకు పరిచయమే) రండి రండి

మీకోసం సర్ ఫిలిప్ సాశన్ వచ్చారు అని. అది మొదలు మా స్నేహానికి తరువాత – 30 ఏళ్లు మా స్నేహం నడిచింది. ఆ రాత్రి, ఆయనతో విందులో పాల్గొన్నాను. ఆయన సోదరి అప్పుడు లేడి రాక్ సవేజిగా తెలుసు.

తర్వాతరోజు బెర్లిన్ వెళ్లిపోయాను. అక్కడ జనాల స్పందన చాలా గమ్మత్తుగా వుంది. నన్ను మొత్తం ఆక్రమించేశారు. నన్ను ఒక్క క్షణం ఒంటరిగా వదల్లేదు. వాళ్లతోపాటు ప్రతీ నైట్‌క్లబ్‌కు లాక్కెళ్లి తాగించారు. అప్పటికి నా సినిమాలు వాళ్లేమీ చూడలేదు. అక్కడ ఒక అమెరికన్ సైనికుడు గుర్తుపట్టి అందరికీ చెప్పాడు. అక్కడ నుంచి మరీ గొడవ మొదలయింది.

'షార్లీ షార్లీ అంటూ' అక్కడ జెర్మన్ నటి పోలా నెగ్రి నన్ను ప్రక్కకు తీసుకువెళ్లి రక్షించింది. నాకు ఒక మిస్టరీ వుత్తరం వచ్చింది.

"మనం న్యూయార్క్‌లో కలిసిన దగ్గర్నుంచి చాలా సంఘటనలు జరిగాయి. ఇప్పుడు జబ్బుచేసి ఆసుపత్రిలో వున్నాను. ఒకసారి కలవండి" ఇది ఎవరు రాశారో గుర్తుపట్టలేకపోయాను. జార్జి అని మాత్రం వుంది. తర్వాత ఈ జార్జి గుర్తువచ్చాడు. ఇతను జైలులో వుండాలి?

ఎందుకైనా మంచిదని అయిదు వందల డాలర్లు జేబులో పెట్టుకెళ్లాను. కాని ఆశ్చర్య పోవడం నావంతు అయింది. ఆసుపత్రిలో చాలా పెద్ద గదిలో అన్ని సౌకర్యాలతో వున్నాడు. పదిమంది సహాయకులూ టెలిఫోన్లూ – చాలా హడావుడి వుంది. నన్ను 'ఆ వచ్చారా? స్నేహం అంటే ఇది' అని అందర్నీ బైటకు పంపాడు.

తర్వాత తెలిసింది – ఇప్పుడు బాల్షివిక్ ప్రభుత్వానికి రైలింజన్లు బ్రిడ్జీలు కొంటున్నాడు. బాగా సంపాదిస్తున్నాడు అన్ని కేసులూ అమెరికాలోనే వదిలించుకున్నాడు అని. నా అయిదువందల డాలర్లు అలాగే మిగిలాయి.

బెర్లిన్ చాలా చప్పగా వుంది. యుద్ధపు ఛాయలు, కాళ్లు తెగిన సైనికులు, కూలిన భవనాలు, వీధి చివర్లో అడుక్కునే వారు. ఇది నిజంగా బాధ పడవలసిన విషయమే.

అప్పుడే మిస్ మోర్గాన్ కార్యదర్శి తంతి పంపింది. అప్పటికే పారిస్‌లో నా రాక, సినిమా ప్రదర్శన, థియేటర్, అన్ని నిర్ణయమైపోయాయి. తంతిలో 'చాలా కష్టపడ్డాను. మీకు తప్పనిసరిగా ఫ్రెంచ్ ప్రభుత్వ లాంఛనాలు అందుతాయి' అంది మోర్గాన్. మూడురోజుల బెర్లిన్ యాత్ర తర్వాత పారిస్ తిరిగి వచ్చాను.

'కిడ్' ప్రదర్శన ట్రొకాడెలో వుంది. ఆ రాత్రి నేనూ, మోర్గానూ మరి కొంతమందీ బాక్స్‌లో కూర్చున్నాం. సిసిలీ సోరిక్ రహస్యంగా ఈ రాత్రి మిమ్మల్ని ఫ్రెంచ్ ప్రభుత్వం సత్కరిస్తుంది' అన్నాడు.

సినిమా ఇంటర్వెల్ వరకూ ఏదో డాక్యుమెంటరీ నడిచింది. లైట్లు వెలిగాయి. మినిష్టర్ బాక్స్‌లోకి నన్ను తోడ్కొని వెళ్లారు. మినిష్టర్ ఏదో ఉపన్యాసం ఇచ్చి నాకు ఒక మెడల్ బహుమతి ఇచ్చారు. ఒక బిరుదు కూడా. చార్లీ చాప్లిన్ కళాకారుడు డ్రామా ఆర్టిస్ట్ పబ్లిక్ గౌరవం పొందదగినవాడు' ఇలా జరిగింది.

తర్వాత మోర్గాన్ నాకు చాలా మంచి వుత్తరం రాసింది. మర్నాడు మధ్యాహ్నం భోజనానికి 'విల్లా ట్రియానబ్'కి రమ్మని. అది గ్రీస్ ప్రిన్స్ పాలెస్ – ఎందరో రాజ బంధువులూ మిలిటరీ ఆఫీసర్లూ వచ్చారు. నన్ను మంచి మాటల్తో ముంచెత్తారు.

మర్నాడు నా స్నేహితుడు వాల్టో ఫ్రాంక్ వచ్చాడు. ఆయనతో పాటు జాకీస్ కోపీ (ఈయన ఫ్రెంచ్ నాటకాలను మలుపు తిప్పుతున్నాడు.) తర్వాత సర్కస్ చూశాము. కొన్ని హాస్య నాటకాలు, నైట్‌క్లబ్‌లు, లాటిన్ క్వార్టర్. ఆ రాత్రి అలా గడిచిపోయింది.

ఆ మర్నాడు లండన్ బయలుదేరాలి. సర్ ఫిలిప్ శాంసన్‌తో సమావేశం వుంది. ఆయన ల్లాయిడ్ జార్జితోబాటు నాకు సమావేశం ఏర్పాటు చేశారు.

కాని నేనెక్కిన విమానం మూడుగంటల (పొగమంచు మూలంగా) ఆలస్యంగా లండన్ చేరింది.

ఇక్కడే సర్ ఫిలిప్ గురించి నాలుగు మాటలు చెప్పాలి. ఆయన లాయడ్ జార్జికి యుద్ధపు రోజుల్లో కార్యదర్శి. నా వయస్సు వుంటుంది. చాలా అందగాడు. సంపదలతో తులతూగేవాడే. పార్లమెంటులో సీటు కూడా వుంది. (బ్రిటన్ నుంచి) అంత సంపదా – పేరూ వున్నా ఎప్పుడూ ఖాళీగా వుండటానికి ఇష్టపడడు. చాలా కష్టపడి తనకి ఇష్టమైన రీతిలోనే జీవిస్తాడు.

మొదటిసారి పారిస్‌లో కలిసినప్పుడు "నాకు అందరినుంచి పారిపోవాలని వుంది. చివరికి ఈ హోటల్ గోడల రంగులు కూడా విసుగు పుట్టిస్తున్నాయి' అన్నాను.

ఆయన నవ్వుతూ 'మీకు ఏ రంగులు ఇష్టం?' అని అడిగాను.

'పసుపు పచ్చ – బంగారు రంగు' అన్నాను నవ్వుతూనే. అప్పుడు "లింప్నే ఎస్టేటుకు వెళ్దాం. మీకు అక్కడ విశ్రాంతి దొరుకుతుంది' అన్నారు.

తీరా అక్కడకు చేరిం తర్వాత నాకు ఇచ్చిన గదిలో తెరలు పసుపు రంగు, బంగారు రంగుల్లో వున్నాయి.

ఆయన ఆలోచన గొప్ప కళాత్మకంగా వుండేది. గొప్ప టేస్ట్‌గలవాడు. అది నెరవేర్చుకునే సంపదా సత్తా వున్నవాడు.

నాకిచ్చిన విలాసవంతమైన స్వీటులో రాత్రంతా వెచ్చని సూప్, ప్రొద్దునే ఇద్దరు బట్లర్లు బండి తోసుకుని బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని. అందులో నేను అంతకుముందు చెప్పాను, ఇంగ్లాండు వచ్చిన దగ్గర్నుంచి అమెరికన్ వీట్ కేక్ దొరకడం లేదు అని. అందుకని ప్రత్యేకంగా అవే చేయించి పంపారు.

ఇద్దరు బట్లర్లు మేపుల్ సిరప్ వడ్డిస్తూ వేడివేడిగా పొగలు వస్తుంటే అరే బియన్‌నైట్ కథలా అన్పించింది! సర్ ఫిలిప్, ఇంటి పనులన్నీ కోటు జేబులో ఒక చేయి పెట్టుకుని దర్జాగా నడుస్తూ చేయిస్తూ అందర్ని నడిపిస్తాడు.

రెండోచేత్తో వాళ్ల అమ్మగారి ముత్యాలదండ తిప్పుతూండేవాడు. 'అలా చేస్తే అవి బ్రతికి వుంటాయి' అనేవాడు నవ్వుతూ.

నా విశ్రాంతి అయిన తర్వాత ఆయనతోపాటు బ్రైటన్ ఆసుపత్రికి వస్తారా అని అడిగారు. అక్కడ యుద్ధంలో కాళ్లు తెగినవాళ్లు వున్నారు అని.

నాకాదృశ్యం ఎంతో హృదయ విదారకంగా వుంది. వాళ్లు చాలా చిన్నవాళ్లు, వాళ్ల కళ్లల్లోకి చూడటానికే భయంవేసింది. వాళ్లకేమీ ఆశల్లేకుండా పూర్తిగా మంచంమీద పడివున్నారు.

ఇంకొకరికి వేళ్లు నరికి కట్టులు కట్టారు. మరికొంతమందిని చూడవద్దన్నారు. కాని సర్ ఫిలిప్ చూసి ఓదార్చి వచ్చారు.

లింప్నె ఎస్టేటు తర్వాత లండన్ కారులోనే వెళ్లాము. పార్క్‌లేన్‌లో ఆయన ఇంటికి. అక్కడ ఫోర్ జార్జెస్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ పెట్టారు. ఛారిటీకోసం. అది చాలా గొప్ప భవంతి. అంతా కార్పెట్లు (తివాచీలు) ఛాండిలీర్లతో అద్భుతంగా వుంది.

మేము భోజనానికి అక్కడే వున్నాము. నాకోసం బంతిపూలు పెట్టించాడు. అంతకుముందు వున్న పూలు తీసివేసి!

సర్ విలియమ్ ఆర్పెన్ స్టూడియోకి వెళ్లాం. అక్కడ ఫిలిప్ సోదరి బొమ్మ వుంది. లేడీ రాక్‌సావేజ్ గొప్ప అందగత్తె, మంచి ముఖవర్చస్సు.

తర్వాత హెచ్.జి. వెల్స్ పల్లెటూరు ఇంటికి వెళ్లాం. అక్కడ ఆయన భార్యా – ఇద్దరు కొడుకులూ వున్నారు. కేంబ్రిడ్జినించి వచ్చారు. ఆ రాత్రి వాళ్లతోనే వున్నాను. ఇటువంటి అనుభవం కోసమే తిరుగుతున్నాను.

ఆ మర్నాడు ముప్పయిమంది కేంబ్రిడ్జి నుంచి ప్రొఫెసర్లు వచ్చారు. అందరూ అక్కడ గుంపుగా చేరి గ్రూపు ఫోటోకోసం వేచియున్నట్లు కూర్చున్నారు.

నన్ను ఏదో వేరే గ్రహం నుంచి వచ్చిన జీవిలాగా చూస్తున్నారు.

ఆ సాయంత్రం హెచ్.జి. వెల్స్ ఒక ఆట ఆడారు. దాని పేరు జంతువు, కూరగాయ లేదా మినరల్. ఇది నాకు ఐ.క్యు. టెస్ట్ అనుకున్నాను.

ఆ రాత్రి చాలా చలిగా వుంది. కొవ్వొత్తుల వెల్తుర్లోనే నిద్రకు ప్రయత్నించాము.

ఉదయాన్నే వెల్స్ అడిగారు రాత్రి నిద్రపట్టిందా? అని. 'ఏదో' అన్నాను. 'అందరూ బాగా చలిగా వుందన్నారు' అన్నాడు. 'చలిగా కాదు – మంచుగా వుంది' అని నవ్వుకున్నాం.

ఇంకా మరికొన్ని జ్ఞాపకాలు. వెల్స్ చదవుకునే గది. డిమ్ముగా చీకటిగా బయట చెట్లు రాసుకుంటూ. వాలు బల్ల ఆయన భార్య నాకు చూపించిన 11వ శతాబ్దపు చర్చి, వయసు మళ్లిన శిల్పితో పరిచయం కొన్ని సమాధి రాళ్లమీద ఇత్తడి బిళ్లలు. St. జాక్ రాబోయ్ కలర్ ఫోటోగ్రఫీ అందాలు. హెచ్.జి. వెల్స్ ఒక కేంబ్రిడ్జ్ పిక్చర్ పేపర్ చదవటం నేను, 'ఏమిటి 15 శతాబ్దపు (మాంక్) గొంతులా వుందే' అని అనటం వెల్స్ కథ ఫ్రాంక్ హారిస్ గురించి. అప్పటికే 4th డైమెన్షన్ గురించి ఆలోచనలు. ఏ పత్రికల వాళ్లూ దాన్ని వేయకపోవటం. చివరికి హారిస్‌ని కలవటానికి వెళ్లటం పాత టోపీ పెట్టుకుని. అరె ఈ టోపీతోనే అందర్ని కలుస్తున్నారా. ఇక్కడ తెలివితేటలకి విలువలేదు. చివరికి ఆ చేత్తోని ఆ టోపీని పైన అప్పడంలా చేస్తాడని భయపడడం. ఎలాగో ఆ కథలు తీసుకుని మరికొన్ని రచనలు అడగటం.

ఇవన్నీ జ్ఞాపకాలే.

లండన్లో థామస్ బర్కోని కలిశాను. ఈయన లైమ్ హౌస్ నైట్సు రాశాడు. కాని నన్ను పూర్తిగా బైటకు లాగాడు. నా మనసులోని ఘోష అంతా చెప్పాను. వెల్స్‌కంటే ఎక్కువ చెప్పాను. నేనూ, థామసూ అక్కడ వీథులన్ని తిరిగాం. లైమ్ హౌస్, చీనా టౌన్ ఒక మాట మాట్లాడకుండా తిరిగాం. ఆయన అలాగే చూపిస్తాడు. ఏమీ చెప్పడు. ఆయన పైకి ఏమీ తెలియడు. నా గురించి ఏమనుకున్నాడో ఇప్పటికీ తెలియదు.

ఆ తర్వాత ఆయన ఆత్మ కథలాంటి ది విండ్ అండ్ ది రైన్ పుస్తకం మూడు నాలుగేళ్లకు పంపాడు. అది చదివి తర్వాత ఆయన మనసుకు నేనంటే ఇష్టమని తెలిసింది!

ఇలా ఇంగ్లాండు యాత్రలో వుత్సాహం మెల్లగామెల్లగా తగ్గిపోతూ వస్తోంది. నా కజిన్‌తో కలిసి భోజనం చేశాను. మర్నాడు జిమ్మిరస్సెల్‌ని, (కార్నో రోజుల్నాటి స్నేహితుడు) అప్పుడు పబ్ నడపుతున్నాడు. ఇంక అమెరికా వెళ్లిపోవటానికి ఆలోచన మొదలు పెట్టాను.

ఇంక ఇక్కడే వుంటే బద్ధకం పెరిగిపోతుంది. ఇంగ్లాండు వదలి పోవాలని అనిపించటంలేదు. కాని ఈ పేరు ప్రఖ్యాతులు ఇంకేమిస్తాయి? ఇప్పుడు పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్తున్నాను. లోపల విచారంగానే వున్నా నా వెనకే ఈ ఈలలు చప్పట్ల మోత దూరంగా వెళ్లిపోతాయి.

వీళ్లంతా నన్నెంతగానో గౌరవించారు. ఇంగ్లండు టూరులో ఫ్రాన్స్‌లో ఎంతో ఆదరించారు.

వాటర్‌లూ దగ్గర గౌడు నార్డ్ దగ్గర అభిమానుల కోలాహలం ఎంత గొప్పగా వుంది. కాని వారికి పూర్తి న్యాయం చేయలేకపోయాను. పూలమీద నడుస్తున్నట్లు!

అంతేకాదు నా గతం, 3 పోనాల్ టెర్రెస్ నాలో జీర్ణించుకుపోయాయి. ఇక్కడ బైట నాకోసం ఇక ఎదురు చూడవు.

ఇప్పుడు కాలిఫోర్నియా వెళ్లి పని మొదలు పెట్టాలి. అవును చాలా పని వుంది. పనిలోనే పరమార్థం! మిగతా అంతా విచిత్ర కల్పనే!

పద్దెనిమిదవ అధ్యాయం

అమెరికా రాక

న్యూయార్కు చేరగానే నాకు మేరీడోరో నుంచి ఫోన్ వచ్చింది. ఇదే కొన్ని సంవత్సరాల క్రితం అయితే? ఆ రోజు నేను ఆమెను భోజనానికి తీసుకు వెళ్లాను. ఆ తర్వాత మాటినీకి (లిలీస్ ఆఫ్ ది ఫీల్డ్) ఆమె నటిస్తున్నదే, వెళ్లాము.

ఆ సాయంత్రం మ్యాక్స్ ఈస్ట్‌మన్‌తోనూ ఆయన సోదరి క్రిస్టల్‌తోనూ విందారగించాను. మాతో జమైకా కవి మకాయ్ వచ్చారు.

న్యూయార్కులో చివరిరోజు 'సింగ్ సింగ్' చూడటానికి వెళ్లాను. నాతో ఫ్రాంక్ హారీస్ కూడా వున్నారు. దారిలో చెప్పాడు – స్వీయకథ రాస్తున్నానని కానీ మరీ ఆలస్యమైపోయిందేమో అన్నాడు. "వయసు మీరితే ఆ అవకాశాలు వేరుకుంటాయి – ఆవేశాలు తగ్గి ఆలోచనతో రాయవచ్చు' అన్నాను.

జిమ్‌లార్కిన్ – లేబర్ యూనియన్ నాయకుడు. అయిదు సంవత్సరాల కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు సింగ్–సింగ్‌లో. ఫ్రాంక్ హారీస్ చూడాలంటే వెళ్లాము. లార్కన్ గొప్ప వక్త. అన్యాయంగా శిక్ష వేశారు. తర్వాత అప్పటిలో గవర్నరు ఎ.ఎల్. స్మిత్ శిక్ష రద్దు చేశాడు. కాని అప్పటికే కొన్ని సంవత్సరాలు శిక్ష అనుభవించాడు!

కారాగార వాతావరణం వింతగా వుంటుంది. అక్కడ మానవత్వం వేరుచేసి పెడతారేమో అనిపిస్తుంది. సింగ్–సింగ్ జైల్లో – అది చాలా పురాతనమైంది. తడిగా చీకటిగా చాలా దిగులుగా వుంటుంది. ఒక్కో గదిలో 4 లేక 6గురు నిద్రిస్తారు. ఇలాంటి కారాగారం కట్టటానికి ఎటువంటి దెయ్యపు బుర్ర వుండాలి! మేము వెళ్లినప్పుడు వాళ్లు ఖాళీ స్థలంలో వ్యాయామం చేస్తున్నారు. ఒక్కళ్లు తప్ప. అతను చాలా చిన్న

వయస్సులో వున్నాడు. అతను అక్కడి గది బైట తలుపును ఆనుకుని ఉన్నాడు. కొత్తగా వచ్చాడని వార్డెన్ చెప్పాడు.

నేను అతన్ని దాటి, ఆ గది లోపల చూసి అదిరి పడ్డాను. 'ఇది మనుష్యులుండేది కాదు' అని అన్నాను. అతడు 'అవును' అన్నాడు. అంత భయంకరమైన వాతావరణం, వాసన, చీకటి. ఇక్కడ వీళ్లు ఎంత తొందరగా పిచ్చివాళ్లయిపోతారో అనిపించింది.

వార్డెన్ చాలా దయగలవాడు. 'ఇది చాలా ఇరుకయిపోతోంది. దీన్ని బాగుచేయాలంటే చాలా డబ్బు కావాలి. కాని మీలాంటివాళ్లను అడగలేంకదా' అన్నాడు.

ఆ తర్వాత కరెంటు కుర్చీ (ఉరిశిక్ష వేయటానికి) వున్న గది చూపారు. అది ఎంత సాదాసీదాగా వుందంటే అంత అమాయకంగా అన్పించింది. ఉరి అమలు చేసినప్పుడు ఆ కుర్చీలో కూర్చోపెట్టి కరెంటు (హై వోల్టేజ్) పెడతారు. ఆ తర్వాత ఆ శరీరాన్ని తీసుకువెళ్లి ఆ ప్రక్కన బల్ల మీద పడుకోబెట్టి, కోసి, చనిపోయాడని నిర్ణయించుకుంటారు కూడా! చనిపోయినపుడు మెదడు 212^0 ఫారిన్ హీట్ ఎక్కుతుంది. బాబోయ్ అని అక్కడ నుంచి బయటపడ్డాము.

తర్వాత లార్కెన్ కోసం అడిగాడు. వార్డెన్ చూపించటానికి అంగీకరించాడు (ఇది అక్కడ అనుమతులకు వ్యతిరేకం). లార్కెన్ చెప్పులు తయారు చేసేచోట వున్నాడు. వేళకాని వేళలో మా రాక అతన్ని ఇబ్బంది పెట్టింది.

అతని బాధ అతని భార్యా – పిల్లల గురించి. ఫ్రాంక్ తప్పనిసరిగా సహాయం చేస్తానని చెప్పాడు. జైలు బైటకు వచ్చిం తర్వాత, 'లార్కెన్‌లాంటివాడు జైల్లో మగ్గటం అన్యాయం' అన్నాడు ఫ్రాంక్.

తర్వాత హాలీవుడ్ వచ్చేశాము. అమ్మను చూడటానికి వెళ్ళాను. చాలా సంతోషంగా వుంది. నా లండన్ జైత్రయాత్ర గురించి అంతా తెలుసు ఆమెకు.

'అమా! నీ కొడుకు గురించీ ఈ హడావుడి గురించీ ఏమనుకుంటున్నావు' అన్నాను.

'చాలా సంతోషం చార్లీ – కానీ ఈ మాయా ప్రపంచం వదలి నీవు నాలాగా బ్రతకలేవా?' అంది.

'అమ్మా ఏమిటి? దీనిలో నీ పాత్ర ఏమిలేదా?' అని నవ్వాను.

'నాయనా నీ శక్తియుక్తులు దేవుని సేవలో పెడితే ఎంతోమందిని రక్షించగలిగేవాడివి కదా?'

'అవును నిజమే కాని డబ్బుని సంపాదించలేము.'

అక్కడతో ఆ సంభాషణ ముగించి వచ్చాను. అమ్మను చూసే రీవ్స్ చాలా సంతోషంగా వుంది. ఈమె నా మేనేజర్ భార్య. 'చాలా మంచి ఆరోగ్యంగా, మానసికంగా సంతోషంగా వుంటోంది అమ్మ' అని చెప్పింది. ఎప్పుడైనా బయటకు తీసుకు వెళ్లినప్పుడు చాలా డిగ్నిటితో హుందాగా ప్రవర్తించేదనీ, ఒక్కోసారి మొండికేసేదనీ, అంది.

ఇప్పుడున్న, ఇల్లు నేను ఈ మధ్యనే కట్టాను. నా స్వంత విషయాలు ఆమెకు తెలియకూడదనే అనుకునేవాణ్ణి. కాని 'చార్లీ, ఈ బాదరబందీలు అన్నీ వదిలించుకోలేవా?' అనేది. 'ఏమిటమ్మా అవి?' అని నవ్వేవాణ్ణి. (నా భార్యతో వున్న గొడవలని తెలుసు). అప్పటికే నాకిద్దరు కొడుకులు – (చార్లీ–సిడ్నీ).

దూరంగా పసిఫిక్ మహా సముద్రం కనపడుతోంది. ఇంట్లో వంటవాళ్లూ, తోటపనివాళ్లూ హడావుడిగా వుంది. 'అమ్మ ఎలా వుంది?'

ఆమె ఒక్క క్షణం ఆగి ఈ నిశ్శబ్దాన్ని ఎందుకు పాడు చేశారు? అంది. అయినా ఈ తోటా–చెట్లూ బాగున్నాయి చార్లీ అంది. 'అమ్మా! ఇద్దరు తోట పనివారున్నారు' అన్నాను. 'అలాగా అయితే నీవు బాగా షావుకారువన్నమాట!' అంది.

'అవును అమ్మ! ఇప్పుడు నా విలువ అయిదు మిలియన్ డాలర్లు' అన్నాను.

'అలాగా అయితే నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో నాయనా. లేకపోతే డబ్బుకు విలువ ఏముంటుంది?'

ఆ తర్వాత రెండు సంవత్సరాలు చాలా ఆరోగ్యంగా వుంది. నేను 'ది సర్కస్' తీస్తుండగా నాకు కబురు వచ్చింది అమ్మకు బాగాలేదు గాల్ బ్లాడర్ ఎటాక్ వచ్చి ఆసుపత్రిలో వుందని. నేను వెంటనే వెళ్లాను. అప్పటికే డాక్టర్లు నాకు చెప్పారు ఆమె కోలుకునే శక్తి లేదు ఆపరేషన్ చేయలేము అని. నొప్పి తగ్గించేందుకు మత్తు మందులేవో ఇచ్చారు. నేను వెళ్లి ఆమె చేయి పట్టుకున్నాను. మెల్లగా నా చేతిని నొక్కింది. అప్పటికే

స్పృహ కోల్పోతోంది. 'అమ్మా చార్లీని' అన్నాను ఏడుపు ఆపుకుని. 'అలాగా' అంది మెల్లగా. తర్వాత స్పృహ కోల్పోయింది.

ఆ మర్నాడు నేను షూటింగులో వుండగా కబురు వచ్చింది అమ్మ పోయిందని. మేకప్ తీసి వెళ్లాను. ఆ దారిలో చాలా వేడిగా వుంది. బైట ఎండగూడా అంత తీక్షణంగా వుంది. కిటికీకీ, మంచానికీ మధ్య నీడలో కుర్చీ వేసుకుని చాలాసేపు కూర్చున్నాను.

ఆమె ముఖంలో ఎంతో బాధ వుంది. ఇంకా ముందు మరింత బాధ వస్తుందని అనుకుంటున్నట్లు! ఎంత వింత జీవితం! ఇక్కడ ఏడువేల మైళ్ల దూరంలో పనికిరాని విలువల మధ్య ఆమె జీవించిన లాంబెత్ భూమికి దూరంగా జీవితాన్ని చాలించింది! ఆమె ధైర్యం, ఆమె పేదరికంలో కూడా హుందాతనం మమ్మల్ని ఎప్పుడూ బజారు పిల్లల్లాగా తిరగనివ్వకుండా, ఒక్క పొరపాటు మాట మాట్లాడకుండా జీవించింది. కనీసం తాగేందుకు టీ లేకపోయినా తన గౌరవాన్ని పోకుండా కాపాడుకుంది. ఆ ప్రయత్నంలోనే మనఃస్థిమితం కోల్పోయింది. జీవితం అంతా వృథాగా గడిచిపోయింది. నేను ఎంతో దుఃఖించాను.

తర్వాత గంటకు బైటకు వచ్చాను. బైట హారీక్రొకర్ నాకోసం వేచివున్నాడు. క్షమాపణలు చెప్పి నిశ్శబ్దంగానే ఇంటికి వెళ్లాం.

సిడ్నీ లండన్‌లో వున్నాడు. ఆరోగ్యం కూడా బాగుండలేదని రాలేకపోయాడు.

నేనూ – నా కొడుకులు – చార్లీ – సిడ్నీ కలిసి ఆమె అంత్యక్రియలు పూర్తి చేశాము. ఆమెను పచ్చని భూమిలోనే పాతి పెట్టాము. మంటలకు ఆహుతి చేయడానికి నా మనసంగీకరించలేదు. ఇప్పటికీ హాలీవుడ్ సిమిటరీలోనే వుంది! అమ్మ!!

నేను అమ్మను గురించి పూర్తిగా చెప్పలేకపోయానేమో! ఆమె, బాధ్యతల్నీ బాధల్నీ చిరునవ్వుతోనే భరించింది. ఎప్పుడూ ఎవరినీ కోపగించి ఎరుగదు. ఉంటే తింది. లేకపోతే అలాగే 3 పోనాల్ టెర్రేస్ కిటికీ దగ్గర కూర్చునేది. మమ్మల్ని ఎప్పుడూ గౌరవంగానే పెంచింది. ఆమె బాధల్ని సంతోషంగానే భరించింది! చివరికి దేవుని సేవలో మనశ్శాంతి వెతుక్కుంది!

★★★

క్లారా షెరిడెన్ ఈమె మంచి శిల్పి. హాలివుడ్ వచ్చింది. శామ్ గోల్డ్ విన్ ఆమెకోసం విందు ఇచ్చాడు. నన్ను పిలిచారు.

క్లారా పొడగరీ, అందగత్తే. ఈమె విన్సటన్ చర్చిల్ మేనకోడలు. రిచర్డ్ బ్రిన్స్‌లీ షెరిడెన్‌కి భార్య! ఆమె రష్యా విప్లవంలో అడుగు పెట్టిన మొదటి ఆంగ్ల యువతి.

లెనిన్–టాల్స్‌స్టాయిల తలలు శిల్పాలు చేయాలని బోల్ష్‌విక్ ప్రభుత్వం ఆమెను కోరింది!

న్యూయార్క్‌లో అమెరికాలో చాలామంది తలల శిల్పాలు చేసింది. ఆమెతోపాటు ఆరేళ్ల కొడుకు డిక్షన్ కూడా ప్రయాణం చేస్తున్నాడు. ఆమె నా విగ్రహం కూడా చేస్తానని అంది. అలా మా యింటికి సామానుతో వచ్చింది. భోజనం తర్వాత రోజూ చాలాసేపు కూర్చోవలసి వచ్చేది. కాని క్లారా చాలా తెలివిగా గొప్పగా మాట్లాడేది. మేమిద్దరం కబుర్లు చెప్పుకుంటూ ఈ తలకాయ శిల్పం పూర్తి చేశాము. దాన్ని చూసి ఇది పెద్ద రౌడీ తలలాగా వుందే అన్నాను! కాదు చార్లీ. దానికి విరుద్ధం.

ఇది చాలా గొప్ప తలకాయ – తెలివిగల వ్యక్తిది! అంది.

అప్పుడు అనిపించింది జీనియస్‌కీ క్రిమినల్‌కీ పెద్ద తేడా లేదనిపించింది! మీరు రష్యా గురించి గొప్ప పుస్తకం రాశారు. కాని మీరు రాజకీయాలలో ఎందుకు దిగుతారు? అది చాలా రొచ్చుకదా?' అన్నాను.

'నేను మాట్లాడేది భుక్తి కోసం కాని ఈ రోజుల్లో ఎవ్వరూ నిజాన్ని నమ్మరు కదా! నాకు రష్యన్లంటే ఎంతో ఇష్టం!'

ఇంతటి రష్యన్ ప్రచారకర్త లోపల చాలా నిజాయితీ వుందనిపించింది. ఆమెకు నిజాలు తెలుసు. తర్వాత టునిస్‌లో కాపరం పెట్టింది. లండన్ ఖర్చు భరించలేక. ఆమె కొడుకు 19 ఏళ్లకు చనిపోయాడు. ఆ షాక్‌లో నుంచి తేరుకోలేక కాథలిక్‌గా వుంది. దేవుని సన్నిధిలో మనశ్శాంతి వెతుక్కుంది!

ఒకసారి నేను సౌత్ ఫ్రాన్స్‌లో ఒక సమాధిమీద 'Pour quoi?' అని చూశాను. ఆ సమాధి 14 ఏళ్ల అమ్మాయిది. ఇది నిజంగా సమాధానం లేని ప్రశ్న. బాధనూ దుఃఖాన్నీ ఈ విధంగా భరించటానికి నైతికంగా సిద్ధమవుతారు.

మన జీవితానికి, మన అస్తిత్వానికీ ఏమయినా అర్థం వుందో లేదో ఎలా నమ్మటం? ఇది కేవలం యాదృచ్ఛికమేనా? సైంటిస్టులు అలాగే చెప్పుతారు కదా – జీవితం మరణం ఇవి ఎంత సంక్లిష్టమైనవి – యాదృశ్ఛికంగా ఎలా అవుతాయి? జీవన మార్గాల తర్వాత మరణం, గొప్ప జ్ఞాని హఠాన్మరణం ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, భూకంపాలు – ఇవన్నీ చూసినప్పుడు జీవితానికి విలువ ఏమిటనిపించవచ్చు—

వీటన్నిటికీ ఏదో మనకందని, మన జ్ఞానానికి అందని అర్థం పరమార్థం వుందనే అనిపిస్తుంది.

వున్నదంతా ఇదీ – ఏదీ పోదు – ఏదీ రాదు అంటారు శాస్త్రవేత్తలు. నిజానికి ఈ పదార్థంలోనే చైతన్యముంటే దానికి కార్యాకారణ సంబంధం వుండాలి. ఇది అంగీకరిస్తే ప్రతికార్యం ముందుగా నిర్ణయింపబడి వుండాలి!

నా ముక్కుమీద వేలితో రాసుకోవటం ఎక్కడో ఒక నక్షత్రం రాలిపోవటం రెండిటికీ ఎక్కడో కారణాలు వుండాలి కదా!

పిల్లి ఇంటి చుట్టూ నడుస్తుంది. ఆకు రాలిపోతుంది. చిన్నపిల్ల తూలిపడిపోతుంది. ఇవన్నీ అనంతంలోకి దారితీయవా? మన దృష్టి ఎంతవరకూ వెళ్తుంది? ఎంత దూరం చూడగలము? వీటికి మొదలూ తుదీ ఎలా తెలుస్తుంది?

నేను మతపరమైన నమ్మకాలు, మూఢనమ్మకాలు అస్సలు లేనివాణ్ణి. నా దృక్పథం మెకాలే. ఈ ప్రశ్నలన్నీ ఎప్పటినుంచో అలాగే వుండిపోయాయి. అప్పటి నుంచే ఎంతో శాస్త్ర విజ్ఞానం పెంపొందింది – కాని ఈ చర్య అలాగే సాగుతోంది. నేను ఏదీ నమ్మను – ఏదీ విస్మరించను. మనం ఏదయితే ఉపకరించుకుంటామో దానిలోని సత్యం అది లెక్కల్తో నింపి పంచ గలిగినంత వరకే సత్యం! మనం లెక్కలతోనే సత్యాన్వేషణ చేయలేము కదా! అన్నింటికీ బుజువులూ, ప్రమాణాలూ తేలేము. చనిపోయిన వాళ్లు కలల్లో కనపడతారు. వాళ్లు జీవించి వున్నారనే భ్రమలో వుంటాము. దీనికి ప్రమాణం వుండదు. హేతువూ వుండదు. మనకూ – మన బుద్ధికీ అంతుబట్టని అర్థంకాని సత్యాలెన్నో వుంటాయి. ఒక్క క్షణంలో లక్షోవంతు ఎలా అర్థం చేసుకోవాలి కాని లెక్కల ప్రకారం అది వుంది కదా!

నాకు వయసు మీరినకొలదీ విశ్వాసం పెరుగుతోంది. మన జీవితం అలాగే నడుస్తుంది. మనకు అర్థం అయ్యేలోపు ఈ నమ్మకం మనల్ని కమ్మివేస్తుంది. ఈ విశ్వాసం

మన బుద్ధికి కొనసాగింపు అనుకుంటాను. లెక్కలు – శాస్త్రం ఉదాహరణలు ఇవన్నీ సమాధానాలు చెప్పవు. అసంభవాన్ని కాదనేది విశ్వాసం.

ఈ విశ్వాసాన్ని కాదనటం – మనల్ని మనం కాదనుకోవటమే. అన్ని ప్రకృతి శక్తులు ఆధారపడేవి విశ్వాసంమీదే.

నా నమ్మకం అనంతంమీద! మనకు హేతుబద్ధంగా అర్థంకాని విషయం మీద. మనకర్థం కానివి మరో కోణంలో చాలా చిన్న విషయాలయి వుంటాయి. ఈ అర్థకాని విశ్వాంతరాళంలో అనంతమైన శక్తి దాగి వుంది.

హాలీవుడ్‌లో నేను ఇంకా ఒంటరిగాణ్ణే. నా స్టూడియోలో నా పని నేను చేసుకుంటూ గడుపుతున్నాను. అందుకని ఎక్కువమందిని కలిసే అవకాశం వుండదు. అందుకని నాకు స్నేహితులు కూడా తక్కువే. డగ్లస్ – మేరీ నాకు సాంత్వన సాంఘికంగా వాళు ్ల పెళ్లి చేసుకున్న తర్వాత వారు చాలా ఆనందంగా వున్నారు. డగ్లస్ కొత్త ఇల్లు కట్టాడు. ఫర్నిచర్ అంతా బాగా పెట్టాడు. ఎన్నో అతిథి గదులు కట్టించాడు. వాళ్ళు చాలా గొప్పగా జీవించేవాళ్ళు. అద్భుతమైన శైలిలో, మంచి సేవకులతో, మంచి ఆహారపు అలవాట్లతో వుండేవాళ్ళు. డగ్లస్ గొప్పగా ఆతిథ్యం ఇచ్చేవాడు కూడా.

స్టూడియోలో అతని ఆఫీసు – వుండే గదులు డ్రెస్సింగ్ గదులు టర్కిష్ బాత్‌తో సహా వుండేవి. స్విమ్మింగ్‌పూల్ కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడ స్టూడియోకి వచ్చిన పెద్దలకు విందు ఏర్పాట్లు చేయించేవాడు. అందర్నీ స్టూడియో అంతా తిప్పి చూపేవాడు. స్టీమ్‌బాతూ ఈత కొలనూ వాడుకోమనేవాడు. అంతా అయిన తర్వాత టర్కీ టవల్ చుట్టుకొని రోమన్ సెనేటర్లలాగా మెట్లమీద కూర్చొని కబుర్లాడుకునేవారు.

అలాంటి ఒక రోజున నన్ను సియామ్ రాజుకి పరిచయం చేశాడు. నిజానికి ఇలాగే చాలా గొప్పవారిని నేను కలిసేవాడిని. డ్యూక్, ఆల్బా – డ్యూక్ ఆఫ్ సదర్‌లాండ్, Austern Chamberlain - Maquis of vienna, The Duke of panaranda, ఇంకా చాలామంది.

నిజానికి వాళ్లకున్న రాజరికపు దుస్తులూ, మెడల్సూ అన్ని తీసివేసినప్పుడో లేదా తీసివేసిన వెంటనే అతని అసలు రంగు బైటపడుతుంది! ఈ రకంగా డ్యూక్ ఆఫ్ ఆల్బా చాలా గొప్పవాడని అనుకున్నాను.

డగ్లస్ కోసం ఇలాంటి గొప్ప అతిథులు వస్తే నాకోసం కబురు పెట్టేవాడు. నేనుకూడా చూపించదగిన వాడినే స్టూడియోలో! వాళ్లు స్టీమ్‌బాత్ అయింతర్వాత అలవాటు ప్రకారం పిక్ ఫెయిర్‌కి వచ్చేవాళ్ళు. షుమారు రాత్రి 8.00 గంటలకు. 8.50 గంటలకు భోజనం తర్వాత సినిమా చూపేవారు. ఈ తతంగంతో వాళ్ళ లోతుపాతులు ఎలా తెలుస్తాయి?

అతిథులు ఎక్కువగా వుంటే కొందరు నాతో పాటు మా యింటికి వచ్చేవారు. కానీ నేను డగ్లస్‌లాగా వాళ్లని మర్యాదలు చేయగలిగేవాడని కాదు. డగ్లస్ – మేరీ గొప్ప ఆతిథ్యం ఇష్టపడేవాళ్లు. నేను చాలా సహజంగానే వుండగలిగేవాణ్ణి. ముందు యువర్ గ్రేస్ అంటూ మొదలుపెట్టి తర్వాత జార్జీ-జిమ్మీ అంటూండేవాళ్లు.

భోజనాల దగ్గరకు డగ్లస్ చిన్న కుక్క వస్తుండేది. చాలా తేలికగా అందరి దృష్టినీ మరల్చేది. చిన్నచిన్న ట్రిక్‌లు చేస్తూండేది. అందరూ నా దగ్గర డగ్లస్ గురించి చాలా గొప్పగా మెచ్చుకునేవాళ్లు. ఎంత మంచి ఆతిథ్యం! అని.

ఇలా జరుగుతుండగా ఒకసారి జరగరానిది జరిగింది. నేను పేర్లు చెప్పటంలేదు (ఇప్పుడు). అయినా అందరూ రాజరికపు బిరుదులున్నవారే. వాళ్లకోసం ఒక వారం అంతా డగ్లస్ సమయం వెచ్చించాడు. వచ్చినవాళ్లు హనీమూన్ జంట! వాళ్లకోసం చేయాల్సినవన్నీ చేసి జాగ్రత్త పడ్డాడు డగ్లస్. తర్వాత కాటలీనాకు చేపలు పట్టే యాత్రకూడా వుంది! అక్కడ డగ్లస్‌కోసం పెద్ద చేప గాలానికి ఎరపెట్టి నీళ్ళలో ముంచి వుంచారు. కాని చేపలు ఏమీ పడలేదు. ఇది ఆ పెళ్లికూతుర్ని ఏమీ ఆనందపరచలేదు. తర్వాత డిన్నర్ దగ్గర, 'పెళ్లికూతురు చాలా విచారంగా వుంది. డగ్లస్‌కి ఏమి చేయాలో పాలుపోలేదు. రెండు రోజుల్నించి చూస్తున్నాను. ఈమె వ్యవహారం నాకు కొరుకుడు పడడంలేదు. ఈరోజు రాత్రికి ఆమె ప్రక్క సీటు నీకు వేయించాను ఎలాగైనా ఆమెను మంచి మూడ్‌లో పెట్టాలి' అన్నాడు!

రాత్రి రానే వచ్చింది. నిజానికి ఆమెను కదిలించటం కష్టం అనిపించి – నా నాప్‌కిన్ క్రిందపడవేసి వంగి 'దయచేసి నవ్వండి' అన్నాను. ఆమెకు అర్థం కాలేదు.

'మళ్లీ చెప్పాను.'

'కాస్త నవ్వండి.'

'ఏమిటీ నవ్వటం' అంది. అందరూ మీరు చాలా విచారంగా వున్నారని అనుకుంటున్నారు. అవును మీ రాశిఫలం ఏమిటి? యానియర్ అంది. అదీ సంగతి మీరు చాలా కష్టంలో వున్నారు. 'మీకెలా తెలుసు.' 'మీ రాశి చెబుతోంది.' అవును నాకు అందర్నించీ పారిపోవాలని వుంది. ఇదంతా నాకిష్టం లేదు. అవును 'ఇంకా చెప్పండి' ఈ సంవత్సరం అంతా ఇంతే – కాని మీరు సర్దుకుపోవాలి – ఎలా? ఏముంది జీవితం మనం అనుకున్నట్లు వుండదు. కావల్సినన్ని ఎప్పుడూ దొరకవు. దొరికిన వాటితోనే సంతృప్తి పడాలి. ఎవర్నీ ఇబ్బంది – అందులో కట్టుకున్నవాడిని – కష్టాలపాలు చేయకూడదు – అన్నాను. ఇవన్నీ ఆమెకు బాగా పనిచేశాయి. చాలా థ్యాంక్స్ నాకు ఒక దారి చూపారు అంది. తర్వాత డగ్లస్ అడిగాడు – 'ఏమిటి చెవులు కొరుక్కుంటున్నారు' అని. 'మామూలు విషయాలే' అని నవ్వాను.

పంతొమ్మిదవ అధ్యాయం

ఒప్పందం పూర్తి

ఇంకొంచెం కష్టపడితే ఫస్ట్ నేషనల్ ఒప్పందం పూర్తయిపోతుంది. వీళ్లు దయాదాక్షిణ్యమూ, దూరచూపూలేని స్వార్థపరులు. ఎంత త్వరగా వదిలించుకుంటే అంతమంచిది. అంతే. నాకు కథాచిత్రాలు తీయాలనే కోరిక పెరిగిపోతోంది.

ఈ చివరి మూడు సినిమాలూ, ఎలా పూర్తిచేయాలో అసలు చెయ్యగలనోలేదో అని ఊగిసలాటలో చాలారోజులు గడిచిపోతున్నాయి. ముందుగా 'పే డే' (2 రీళ్లు) పూర్తిచేసి యిచ్చాను. ఇంకా రెండు సినిమాలు. నా తర్వాత సినిమా 'ది పిలిగ్రిమ్' పెద్ద సినిమాలా తయారయ్యింది. అంటే మళ్లీ ఫస్ట్ నేషనల్ కంపెనీతో చర్చలూ, సమస్యలూ. కాని శ్యామ్ గోల్డ్‌విన్ అన్నట్లు నాకు వ్యాపారం తెలియదు. కాని ఎంత కావాలో తెలుసు. ఆ విషయంలో రాజీపడను. అలాగే ఈ కంపెనీతో నేనూ, మా లాయరూ కిందామీదా పడి ది పిలిగ్రిమ్ రెండు సినిమాల క్రింద లెక్కించి నాలుగు లక్షల డాలర్లు + లాభాల్లో వాటా ఇచ్చేట్లే బేరం చేశాము. 'ది కిడ్' విజయం తర్వాత వాళ్లు ఎదురు చెప్పలేకపోయారు. ఆ విధంగా ఫస్ట్ నేషనల్ కంపెనీతో ఒప్పందం పూర్తిచేసి బైటపడ్డాను.

ఇప్పుడు మా సొంత కంపెనీ అయిన యునైటెడ్ ఆర్టిస్ట్స్ కోసం సినిమాలు స్వేచ్ఛగా తీసుకోవచ్చు.

డగ్లసూ, మేరీ చాలా సంతోషంగా వున్నారు. వాళ్లు చెప్పినట్లు జో (Joeseph Schenck)ని కంపెనీలోకి తీసుకోవాలని చర్చలకు దిగాము. నిజానికి ఈ సూచన నాకు ఇష్టంలేదు. అంతకుముందేకదా జోకర్‌ని వద్దనుకున్నాము. ఇప్పుడు ఎందుకు? కానీ మేరీ చాలా వత్తిడి తెచ్చింది. ఆ విధంగా జో కంపెనీలో చేరాడు. అంతేకాదు అతనే కంపెనీ ప్రెసిడెంటుగా వ్యవహరిస్తున్నాడు.

ఆ తర్వాత కొన్నిరోజులకే నాకు అర్జెంటు కబురు వచ్చింది. కంపెనీ సమావేశం. రావాలని. అదీ కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలని. జో ఆశావహ ఉపన్యాసం అయిపోయింది. దీన్ని సమర్థిస్తూ మేరీ ఉపన్యాసం పూర్తయింది. 'మిగతా కంపెనీలూ, థియేటర్లూ అన్ని జట్టు కడుతున్నాయి. మనం వంటరిగా మిగిలిపోతున్నాము. వ్యాపారం చేయటం చాలా కష్టమైపోతోంది' అని కంగారు వ్యక్తం చేశారు.

ఇవన్నీ నన్నేమీ కదల్చలేకపోయాయి. నా పని మీదా, నా సినిమాల మీదా నాకు పూర్తి నమ్మకం వుంది. ఇటువంటి బెదిరింపులన్నింటికీ మనం పనితోనే సమాధానం చెప్తాము అని వాదించాను. కానీ వాళ్లు వినలేదు. జో అప్పటికే థిల్లాన్‌తో, రీడ్‌తో మంతనాలు జరిపాడు. యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీ వాల్‌స్ట్రీటు స్టాక్ ఎక్సేంజ్‌లో రిజిష్టర్ చేసి 400 లక్షల డాలర్లు ప్రజల దగ్గర వసూలు చేయవచ్చు. అప్పుడు మనకు ఆర్థిక భద్రత అని వాదించాడు. ఈ వాల్‌స్ట్రీటు వ్యాపారం నాకస్సలు ఇష్టంలేదు. ప్రజల సొమ్ముతో మనం షోకులు చేసుకోవటంమీద నాకు నమ్మకం లేదు. అది అప్పుతో నిప్పుతో చెలగాటమే. నేను ఒప్పుకోను. కుదరకపోతే నేనే కంపెనీ వదలిపోతాను అన్నాను. అంతే డగ్లసూ, మేరీ ఏ మాత్రం, జో చెప్పింది, అంగీకరించలేదు. నేను కంపెనీ వదలిపెట్టడం ఎవ్వరికీ ఇష్టంలేదు. దానితో ఈ విషయంపై చర్చలు ముగించాము.

యునైటెడ్ ఆర్టిస్ట్‌కోసం తీసే మొదట సినిమా గురించి ఆలోచించటం మొదలుపెట్టాను. ఇందులో ఎడ్నాని హీరోయిన్‌గా పెట్టి కథ చిత్రం తీయాలని ఆలోచన. ఎడ్నా అంటే చాలా ఇష్టం వున్నా, ఆమె అమ్మలా తయారవుతోంది. సినిమా కథకు ఎలా పనికివస్తుంది? ఇదీ సమస్య. అంతేకాక ఇక నా సినిమాలు కేవలం హాస్యానికే కాక, కథాపరంగా వుండాలని ఆశిస్తున్నాను. అంటే మొత్తం పాత్రలు నటీనటులలో కూడా మార్పు తీసుకురావాలి. కాని ఎలా చేయాలో ఆలోచన అయితే లేదు.

చాలానెలలు ట్రోజన్ విమెన్ అనే కథ గురించి ఆలోచించాను. దాని గురించి చాలా పరిశోధన చేశాము. చేసిన కొలదీ దాని ప్రణాళికా పెరిగి తడిసి ముప్పందమయ్యేట్లుంది. ఇంకా ఇతర కథలు 'నెపోలియన్ బోనపార్టీ' గురించి ఆలోచన

గోల్డ్ రష్

చేశాము. అతనికి సహాయకుడు కాన్ట్రెంట్ జ్ఞాపకాలను పరిశోధించాము. జోసెఫైన్ జీవితం తరచి చూసినకొలదీ, నెపోలియన్ అన్నిచోట్ల అడ్డువస్తున్నాడు. అంటే నెపోలియన్ వేషం నేనే వేయాలి. నెపోలియన్ ఇటాలీయా యాత్ర పూర్తిగా తీద్దామని అనుకున్నాను. కాని అప్పటి దుస్తులూ, వాతావరణం ఇవన్నీ మా తలకుమించిన భారం. ఇంత భారీ చిత్రాలు తీయటం నాకు అస్సలు ఇష్టం లేదు. అందుకే ఇది ప్రక్కన పెట్టాము.

సరిగ్గా ఈ సమయంలోనే 'పెగ్గీ హాప్‌కిన్స్ జేయీ' అనే ఆమె హాలీవుడ్‌లో దిగింది. ఆమెకు నగలూ, వజ్రాలూ ఆభరణాలతో పాటు బాంకులో మూడు మిలియన్ డాలర్లు నిలవకుండా వుంది. ఈ డబ్బు అయిదుగురు మొగుళ్ళ నుంచి విడాకుల భరణంగా వసూలు చేసింది! పెగ్గీ చాలా అందగత్తె. ఒకసారి నేను పారిస్‌లో కలిశాను. సరాసరి పారిస్‌నుంచే వచ్చింది. ఈ మధ్యనే ఈమె అందానికి ఒక యువకుడు బలయిపోయాడు. ప్రేమ భగ్నం కావటంతో ఆ నల్లని దుస్తులతోనే హాలీవుడ్ మీద దండయాత్రకు వచ్చింది. ఒకసారి విందులో తనకి చెడ్డపేరంటే చెడ్డ చిరాకనీ అంది. నేను కోరుకునేది ఒక్కటే – చక్కగా పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలని అంది. అంటూ తన వజ్రాల పచ్చల చేతి కంకణాన్ని సవరించుకుంది! నేను చూడటం గమనించి – 'ఇవా? నా సేవకు పారితోషికాలు' అంది!

ఇంకా ఒకసారి పెళ్లయిన రాత్రి శోభనం రాత్రి – 50 లక్షల డాలర్ల చెక్కు గదిలోకి తలుపుకిందగా పంపితేనే గడి తీస్తాను అంది.

నేను ఆశ్చర్యంగా 'అప్పుడు' అన్నాను 'చెక్కు లోపలికి వచ్చింది – నేను తలుపు తీశాను' అంది. 'అంతేకాదు ప్రొద్దున్నే అతను లేవక పూర్వమే బ్యాంకుకు వెళ్లి డబ్బు తెచ్చుకున్నాను' అని నవ్వింది! 'అతను వట్టి తాగుబోతు. తాగితే కాస్త చిరాకుగా ప్రవర్తించేవాడు. ఒకసారి షాంపేన్ సీసా వాడి నెత్తిన పగలగొట్టాను!' అంది నవ్వుతూ.

'అలా విడిపోయావా?' 'అదేమీ లేదు అప్పటినుంచీ నేనంటే మరీ పడిచచ్చేవాడు!'

కానీ నేనుమాత్రం ఆమె ప్రక్కన షాంపేన్ సీసా ఉన్నప్పుడు చాలా దూరంగా జాగ్రత్తగా వుండేవాడిని! ఒకసారి 'అలాంటి పిచ్చిపని చేస్తే ఎత్తి అవతల పడేస్తాను' అన్నాను. అయితే అప్పటినుంచి నన్ను దూరంగా పెట్టింది.

తర్వాత ఎమ్.జి.ఎమ్. టాల్‌బర్డ్‌తో దగ్గరగా వుంది. గ్రివింగ్ చాలా చిన్నవాడు. ఈమెను పెళ్లి చేసుకోబోతున్నాడని పుకార్లుకూడా పుట్టాయి. తర్వాత ఆయన వేడి చల్లారిపోయింది!

మాకున్న కొద్దిపాటి సమయం సాగిన పరిచయంలో చాలా కథలు చెప్పింది. పారిస్ కబుర్లు. ఆమె, ఫ్రెంచ్ ప్రచురణకర్తకు చెప్పిన సంఘటనలన్ని చెప్పింది. నాకు ఇవన్నీ సినిమాకు పనికి వస్తాయి అనిపించింది. 'ఉమెన్ ఆఫ్ పారిస్' పేరుపెట్టి ఆలోచించటం మొదలుపెట్టాను. ఎడ్నాకి ఇందులో నటించాలని చెప్పాను. చాలామంది విమర్శకులు అనేవారు. మూకీ చిత్రాలలో మానసిక సంఘర్షణ చూపడం కష్టమని. ఇప్పటివరకూ చెట్ల చుట్టూ తిరగడం, గట్టిగా గాలిపీల్చి వదలడం, కుర్చీలు ఊపటం ఇదే ప్రేమను వ్యక్తం చేసే తీరు తెన్నులు. మానసిక సంఘర్షణను వ్యక్తీకరించాలి. ఇంతవరకూ ఎవరూ చూపే ప్రయత్నం చేసినట్లు లేదు. అందుకని నన్ను అందరూ నిరుత్సాహపరిచే పరిస్థితి తెచ్చారు.

అందుకనే ఉమెన్ ఆఫ్ పారిస్ ఎంతో శ్రద్ధగా తీశాను. ఎడ్నా కూడా పాత్రను అర్థం చేసుకుని చక్కని హావభావాలు చూపింది. సినిమా అంతా చిన్నచిన్న సూచనలతోనే నడిపాను. నేను దర్శకత్వమే వహించాను. ఎడ్నా–అడాల్ఫ్ మెన్జో ప్రేయసి ప్రియులుగా నటించారు.

ఈ సినిమా చాలా విజయవంతమైంది. మూకీ చిత్రాలలో ఇది కొత్తకోణం. వ్యతిరేకాలనూ, మానసిక సంఘర్షణనూ చూపే ప్రయత్నంలో చాలా ఉద్వేగం వుండబట్టే ప్రేక్షకులు ఆదరించారు. తరువాత ఇదే పద్ధతిని చాలామంది అనుకరించారు!

నేను ఉమెన్ ఆఫ్ పారిస్ పూర్తి చేస్తుండగానే పోలానగ్రీ వచ్చింది హాలీవుడ్ తెరమీదకి. పారమౌంట్ కంపెనీ ఆమెకోసం ఎంతో ప్రచారం చేసింది. ఉన్నవీ లేనివీ కల్పించి పెగ్గీకీ, పోలాకీ మధ్య చిచ్చుపెట్టి రెండుప్రక్కలా వార్తలతో పత్రికలు నింపివేసింది. నిజానికి వీరిద్దరూ మంచి స్నేహితులు! ఇటువంటి విందులూ వినోదాల సమయంలో ఒకసారి హాలీవుడ్ బాల్‌లో పోలా నా బాక్స్ ప్రక్కనే కూర్చుంది. ఒక్కసారిగా "చార్లీ ఏమిటి నేను పారిస్‌నుంచి వచ్చి ఎంతకాలం అయ్యింది. ఒకసారి కూడా ఫోన్ చేయలేదు. ఇది అన్యాయం!" అంది! నేను నిజంగా బిత్తరపోయాను. అంత అందమైన పోలా నాకోసం ఎదురు చూడటం! ఆమెను బెర్లిన్‌లో ఒక అరగంట మాత్రమే కలిశాను.

"చార్లీ ఇది నిజంగా చాలా దారుణం. నీ ఫోన్ నంబరు ఇవ్వు, నేనే ఫోన్ చేస్తాను" అంది. నా అనుమానాలు నాకున్నాయి ఆడవాళ్లతో – కాని ఆహ్వానంలోని నిజాయితీ నన్ను మాయచేసింది.

తర్వాత ఆమె ఇంటికి – చాలా బ్రహ్మాండమైన ఇల్లు. విందుకు పిలిచింది. నాకు చక్కటి విందు ఇచ్చి ఆతిథ్యం అందించింది. తర్వాత మేము పబ్లిక్‌గానే తిరిగాము. ఇది పారమౌంట్ వాళ్లకి పారమౌంట్ ఇబ్బందిగా మారింది. పోలాకీ చార్లీకీ త్వరలో పెళ్లి అని పత్రికలు రాసాయి. అప్పుడు పోలా చార్లీ ఏమిటి అని నన్ను అడిగింది. 'నువ్వే చెప్పాలి పత్రికలకి' అని అన్నాను. 'ఏమని చెప్పమంటావు?'

నేనేమీ మాట్లాడలేదు.

తర్వాత ఆమె నన్ను కలవటానికి ఇష్టపడలేదు. నేను దూరంగా వుండిపోయాను. రెండోరోజు, 'చార్లీ ఏమిటి?' నన్ను పట్టించుకోవా?' అని నిందించింది.

ఇలా జరుగుతుండగా పారమౌంట్ మేనేజర్ నాతో అర్జెంటుగా మాట్లాడాలని అర్ధరాత్రి ఫోన్ చేశాడు. 'ఇప్పుడేనా? అవును వెంటనే అయితే రండి. వచ్చాడు. మీరు పోలాని విడిచిపెట్టాలి మేము చాలా నష్టపోతున్నాము.' 'అది ఆమెకు చెప్పండి.' 'నేనేమి చేయాలో నాకెవరూ చెప్పవలసిన పనిలేదు' అన్నాను. 'పత్రికల్లో పేపర్లో చూస్తున్నారుకదా. ఎందుకు ఖండించరు' అన్నాడు దురుసుగా.

'నన్నేమి చెప్పమంటారు?'

'మీకు ఆమె అంటే ప్రేమకదా?'

'ఆ విషయం మీకనవసరం కదా?'

'మేము ఎన్నో లక్షల డాలర్లు ఆమె సినిమాల్లో పెట్టాము. ఈలాంటి ప్రచారం ఆమెకు మంచిదికాదు. మాకూ మంచిది కాదు.'

'నేను మీ వ్యాపారాన్ని రక్షించటానికి పెళ్లి చేసుకోవాలనటం అన్యాయం కదా!'

ఆ తర్వాత పోలాకూ నాకూ రాకపోకలు ఆగిపోయాయి.

ఇది ఇలా జరుగుతుండగా ఒక మెక్సికన్ యువతి స్టూడియోకి వచ్చింది. నన్ను చూడాలని పట్టుపట్టింది. ఎలాగైనా ఆమెను నొప్పించకుండా పంపేయమన్నాను.

అంతటితో ఆ విషయం అయిపోయిందనుకున్నాను. కానీ నేను ఇంట్లో వుండగా ఆమె వచ్చి మెట్లమీద కూర్చుందనీ వెళ్ళటం లేదనీ చెప్పారు. ఎలాగైనా ఆమెను పంపమనీ అప్పటివరకూ నేను బైటకు రానని చెప్పాను. ఆ రాత్రి ఆమె వెళ్లిపోయిందని చెప్పారు.

మర్నాటి రాత్రి, నేనూ పోలా, డా. రెనాల్డ్, భోజనాలు చేస్తున్నాము. అంతలో బట్లర్‌వచ్చి ఆమె మళ్లీ వచ్చిందని, వెళ్లి నా బెడ్‌రూంలో వుందనీ చెప్పారు. నేను అదిరిపోయాను. పోలా ఆమెను తీసుకురమ్మంది. డా॥ రెనాల్డ్ కూడా ఆమెను పరీక్షించటం మంచిదన్నాడు. వెళ్లి చూసివచ్చాడు.

ఆమె చాలా చిన్నది. పాలిపోతూ వుంది. వెంటనే పంపించి వేస్తే మంచిది. "నేను చార్లీని చూడాలి. నాకు పిచ్చి అనుకుంటారు. నాకు చార్లీ నటన చాలా ఇష్టం. ఆయన్ను చూసి వెళ్ళిపోతాను" అంది అన్నారు.

అప్పుడు పోలా "నేను అమ్మాయిని చూస్తాను" అంది.

కిందికి తీసుకువచ్చారు. మాతో భోజనం చేయమన్నాం. వద్దని మాత్రం అంది. 'ఏమిటి నువ్వు చార్లీని ప్రేమిస్తున్నావా?' పోలా అడిగింది? 'లేదు – అతని సినిమాలు అంటే ఇష్టం. చూడటానికే వెళ్లాను. అతను గొప్పనటుడు. నీ సినిమాలూ చూశాను. నువ్వంత గొప్ప నటివి కాదు' దీనితో పోలా అహం దెబ్బతింది.

నేను అమ్మాయిని హెచ్చరించి మెక్సికో వెళ్ళటానికి డబ్బు వుందా అని అడిగితే వుందని చెప్పింది. 'అయితే వెంటనే వెళ్లిపో' అని అందరం చెప్పాము. కాని ఆమె కదలలేదు. పోలీసులను పిలిచాము. వాళ్లు ఆమెను తీసుకు వెళ్ళి. ఆసుపత్రిలో పెట్టి మర్నాడు వదలిపెట్టారు. ఆమె మళ్ళీ స్టూడియోముందు, రోడ్డుమీద విషం తాగి పడిపోయింది. మళ్లీ ఆసుపత్రి చికిత్స – తర్వాత ఆమె చెప్పింది వేషాల కోసం వచ్చానని. ఎలాగో నచ్చచెప్పి మెక్సికో పంపాను. ఇప్పుడు యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీకు మంచి సినిమా చేయాలని పట్టుదలతో వున్నాను. 'కిడ్' కంటే బాగుండాలని ఆశపడ్డాను.

చాలా ఆలోచించాను. ఇది గొప్పసినిమా కావాలి. ఇదీ ఆలోచన. ఇది గొప్ప సినిమా..

ఒక ఆదివారం డగ్లస్ ఇంట్లో ప్రొద్దున్నే ఫలహారం చేసిన తర్వాత చాలా సీనరీలు ఫోటోలు చూస్తున్నాము. అందులో కొన్ని అలాస్కాలో తీసినవి వున్నాయి.

మంచు పర్వతాలు ఎక్కుతున్నవి. ఎక్కేప్పుడు ఎదురైన కష్టాలు చిక్‌కోట్ కనుమ దాటి వరసలుకట్టి బంగారంకోసం జనం వెళ్ళటం చూశాను. వాళ్ల సహనం కష్టాలు. అంతే నాకు సినిమాకు కథ దొరికింది. తర్వాత దానిని ఎన్నో సీనులుగా పెంచుకుంటూ ఆలోచించాను.

హాస్యాన్ని పండించాలంటే జరగకూడనిది జరగాలి. అప్పుడు పరిస్థితి ఎదురు తిరుగుతోంది. మనల్ని చూసి మనం నవ్వుకోవాలి. కష్టాలను గట్టెక్కలేక. ప్రకృతిని దాటలేక, మంచుకొండలు కరిగించలేక. అప్పుడు పిచ్చెక్కుతుంది. దాంట్లోంచి హాస్యం వస్తుంది.

తిండికిలేక మంచులోపడి చస్తుంటే మంచీ చెడూ ఏమీ వుండదు. నేను బూటు వుడకేసి తింటాను. మేకులు బొమికల్లా ఏరుకుంటూ తాడుని నూడిల్లా పీకుతూ. నా స్నేహితునికి ఆకలితో నేను కోడిలా కనపడతాను. నన్ను పట్టుకోవటానికి వస్తుంటాడు. నేను పారిపోతుంటాను. ఆరునెలలు దానిమీద పనిచేసి స్క్రిప్ట్ అంటూ లేకుండానే సినిమా తీశాను. 'గోల్డ్ రష్' అని పేరుపెట్టాను.

ఈ సినిమా తీసేపుడు నేను రెండోపెళ్ళి చేసుకున్నాను. ఈ వివరాలు చెప్పటం ఇష్టంలేదు. నా కొడుకులు చార్లీ-సిడ్నీలకు తెలియటం ఇష్టంలేదు. రెండు సంవత్సరాలు ప్రయత్నించాము. కాని మా పెళ్లికి ఎవరూ ఆశీర్వాదం చేయలేదు. ఇదికూడా పెటాకులై పోయింది.

'గోల్డ్ రష్' పూర్తిచేసి స్ట్రాండ్ థియేటర్ న్యూయార్క్‌లో విడుదల చేశాం. సినిమా మొదటినుంచి చివరి వరకూ నవ్వులతో, చప్పట్లతో మారుమోగి పోయింది. నేను ధైర్యంచేసి మొదటి ఆట చూశాను.

హిరోమ్ అభ్రమ్. ఇతను యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీ వ్యాపారం మేనేజరు. బైటకువచ్చి నన్ను కౌగిలించుకున్నాడు. 'చార్లీ ఇది ఆరులక్షల డాలర్లు తెస్తుంది' అన్నాడు. అలాగే అంత సంపాదించింది.

ఈ సినిమా విడుదల అవగానే నాకు స్పృహ తప్పి పడిపోయి లేస్తూనే, రిట్జ్ హోటల్ మేనేజర్‌కి 'లాయర్ని పిలవండి. నాకు బాగోలేదు' అన్నాను. మీకు డాక్టరు కదా కావలిసింది అన్నాడు. కానీ లాయర్ విల్లురాయాలి అన్నాను. అతను కంగారుపడి

ఇద్దర్నీ పిలిచాడు. లాయరు లండన్‌లో వుండడం మూలాన రాలేదు. డాక్టరు వచ్చి మీకు, 'గాలి మార్పు కావాలి.' సముద్రపు ఒడ్డుకు వెళ్ళి వారంరోజులు గడపండి' అన్నాడు. నన్ను తీసుకువెళ్ళి బ్రైటన్ బీచ్‌లో ఒక హోటల్లో సముద్రపు తీరంలో వుంచారు. నేను కిటికీలోంచి చూస్తుండగానే జనం పోగయ్యారు. ఎలాగో వాళ్ళను పంపించారు.

ఇంతలో పెద్దగా కేక వినిపించింది. ఎవరో సముద్రంలో మునిగిపోయారు. ఒడ్డుకు తీసుకువచ్చి రక్షించటానికి ప్రయత్నించారు. అప్పటికే అతను చనిపోయాడు.

వెంటనే మరో ఇద్దరు ఇలాగే మునిగిపోయారు. వాళ్లను కూడా నా కిటికీ కిందనే రక్షించారు.

అంతే నేను వెంటనే మళ్ళీ లేచి న్యూయార్కు వెళ్లిపోయాను. రెండురోజుల తర్వాత కాలిఫోర్నియా వెళ్లటానికి తగినబలం వచ్చింది!

ఇరవయ్యవ అధ్యాయం

విందులూ-వినోదాలూ

బెవర్లీ హిల్స్ చేరాను. గెర్ట్రూడ్ స్టీన్ దగ్గర్నుంచి ఆహ్వానం సిద్ధంగా వుంది. స్నేహితుని ఇంట్లో విందుకు రమ్మని. నేను అక్కడకు చేరే సమయానికి, గెర్ట్రూడ్ పెద్ద హాలులో వాలు కుర్చీలో కూర్చుని వుంది. బ్రౌన్ రంగు గౌనూ, తెల్లని లేస్‌కాలర్‌తో చేతులు ఒడిలో పెట్టుకుని. వాన్‌గోగ్ చిత్రంలా కనిపించింది! (మేడమ్ రౌలిన్) ఆమె ఎర్రని జుత్తు. బన్‌తో ఉంటే, స్టీన్‌కి కత్తిరించిన బ్రౌన్ జుట్టు వుంది. అంతే తేడా.

వచ్చిన అతిథులంతా కొంచెం దూరంగా మర్యాదగా చుట్టూ నిలబడి వున్నారు. ఆమె దగ్గర వున్న సహాయకురాలు నా రాకను గమనించి స్టీన్ చెవిలో చెప్పినట్లుంది.... నా దగ్గరకు వచ్చి 'మేడమ్ మిమ్మల్ని కలవటానికి సిద్ధంగా వున్నారు' అంది. వెంటనే నేను ముందుకు వెళ్ళి ఆమెకు అభివాదం చెప్పాను. అక్కడ మాట్లాడే అవకాశమే లేదు. చాలామంది వస్తున్నారు. ఆమెకోసం వేచి వున్నారు కూడా.

మధ్యాహ్న భోజనాల దగ్గర ఆమె ప్రక్కనే నాకు కుర్చీ వేశారు. అదీ ఇదీ మాట్లాడి కళ గురించిన ప్రసక్తి వచ్చింది. అదీ కిటికీలో నుంచి కనపడే దృశ్యాన్ని మెచ్చుకుంటూ. కానీ ఆమెకు పెద్దగా ఆ విషయంలో ఉత్సాహం లేదు. 'ప్రకృతి అంతటా వుంటుంది. దానిలో ప్రత్యేకత ఏముంది?'

'అనుకరించటమే సరదాగా వుంటుంది' అంది. 'చూడండి అసలు పాలరాతికంటే తయారుచేసిన పాలరాయి ఎంత బాగా వుంటుందో' అలాగే "టర్నర్"సూర్యాస్తమయం నిజం దాని కంటే రంగులమయంగా వుంటుందికదా' అంది.

నేను ఆమె చెప్పిందానికి ఎదురు చెప్పకుండా అవునన్నాను.

"సినిమాలు మరీ గందరగోళంగా చిందరవందరగా తీస్తున్నారు. సాదాసీదాగా తీయలేరా? మీరు ఈ చివరినుండి వీధి మలుపుకు వెళ్లి కనపడకుండా వెళ్లిపోతే తర్వాత మరో మలుపు. ఇలా వుంటే ఎంత సాదాగా వుంటుంది?' అంది. నా నోటిదాకా వచ్చింది ది రోస్ ఈజ్ ఎ రోస్, ఈజ్ ఎ...' అని, కాని ఆపుకున్నాను. భోజనాలు చక్కని బెల్జియమ్ టేబుల్‌మీద, లేస్‌గుడ్డలు వేసి వడ్డించారు. అందరూ ఎంతో బాగుందని అన్నారు. భోజనాలు అయిన తర్వాత కాఫీ ఇచ్చారు. నా చేతికి దగ్గర్లో కాఫీ కప్పు పెట్టారు. నేను ఆమెతో ఏదో చెప్పు చేయి కదిపాను. కాఫీ లేస్ గుడ్డమీద ఒలికిపోయింది. చాలా చింతిస్తూ బాధపడ్డాను. అంతలో ఆమె చేయి తగిలి ఒక కప్పు పడిపోయింది. అప్పుడు గెర్‌ట్రూడ్ ఏమాత్రం తొట్రుపడకుండా 'మంచిది – నా గౌనుమీద పడలేదు' అంది.

జాన్ మేస్ ఫీల్డ్ స్టూడియోకి వచ్చాడు. పొడవుగా చాలా అందంగా వుంటాడు. దయార్ద్ర హృదయుడు. అర్థం చేసుకునే మనసున్నవాడు. ఇన్ని సుగుణాలున్న ఆయనతో చనువుగా వుండలేకపోయాను. ఆయన రాసిన 'ది విండో ఇన్ ది బెస్ట్' చదివాను. అందులో కొన్ని పాటలు గుర్తున్నాయి.

'కారాగార ద్వారం దగ్గర వాళ్లు గుమిగూడారు
గంట మోగుతుందని ఎదురుచూస్తూ
వాళ్లు ఎప్పుడూ ఎదురుచూస్తూనే వుంటారు.
కారాగారం నుంచి నరకానికి వెళ్లటానికి....'

ది గోల్డ్ రష్ తీస్తున్నపుడు ఎలినార్ గన్ అనే ఆయన ఫోన్‌చేశాడు. 'చార్లీ నువ్వు మేరియన్ డేలిస్‌ని కలవాలి' 'ఆమె నిన్ను కలవాలని తహతహలాడుతోంది' అని కూడా అన్నాడు. ఆరోజు అంబాసిడర్ హోటల్‌లో విందు ఏర్పాటు జరిగింది. తరువాత ది గోల్డ్ రష్ సినిమా చూసే ఏర్పాటు కూడా. ఇంతవరకూ మేరియన్‌ని కలవనేలేదు. కాని ఆమె ప్రచారం మాత్రం నిర్లక్ష్యం చేయలేనిది. అన్నిరకాల పత్రికలమీద ముఖచిత్రాలు ఆమె బొమ్మలతో నిండిపోయేవి. ఏ సినిమా పత్రికా ఈమె బొమ్మ లేకుండా విడుదల అయ్యేదికాదు.

ఇదే ఆమెకు శత్రువైంది. బాక్సాఫీసు దగ్గర విజయం దక్కేది కాదు. ఒకరోజు డగ్లస్ స్టూడియోలో మేరియన్ సినిమా 'వెన్ కింగ్ ఊడ్ వాస్ ఇన్ ఫ్లవర్' చూసాను.

నాకు ఆశ్చర్యం. ఆమె చాలా సున్నితంగా హాస్యం పండించింది. చక్కటి గ్లామర్ – అప్పీల్ వుంది. ఇంత ప్రచారం లేకుండానే చక్కని తారగా వెలిగేది.

గ్విన్ విందులో, ఆమె ప్రవర్తన చాలా నచ్చింది. చాలా సాదాసీదాగా వుంది. అప్పటి నుంచి మేము మంచి స్నేహితులమైపోయాము. ఆమెకు హార్ట్‌తో వున్న సంబంధం చాలా 'లెజెండ్రీ' దాదాపు ముప్పయి సంవత్సరాలు వారి అనుబంధం నడిచింది, ఆయన చనిపోయేవరకూ కూడా.

ఎవరైనా నన్ను మీ జీవితంలో ఎవరి ప్రభావం ఎక్కువ ఉంది? అని అడిగితే నేను తప్పనిసరిగా రాండాల్ఫ్ హార్స్ట్ అని చెప్తాను.

ఆయనతో అనుబంధం అన్నిసార్లూ సంతోషకరంగా వుండకపోవచ్చు. ఆయన గుణగణాలు చాలా గొప్పవి. ఆయన వ్యక్తిత్వం, రూపురేఖలు నన్నెంతగానో ఆకర్షించేవి. ఒకరకంగా చిన్నవాడిగా, చాలా తెలివిగలవాడిగా, దయాళువుగా, ఒక్కసారి చాలా కఠినాత్ముడుగా, ఎంతో శక్తివంతుడుగా ధనవంతుడుగా అన్నిటికీ మించి నిజాయితీపరుడుగా మెలిగేవాడు. ఆయనకున్న న్యూయార్కు ఆస్తులు 400 మిలియన్ల డాలర్లుపైనే. ఆ రోజుల్లో ఇది సామాన్యమైన సంపదకాదు!

ఆయన గురించి వ్యతిరేక అభిప్రాయాలు చెప్తుండేవారు. ఆయన చాలా దేశభక్తి కలవాడనీ, మరికొంతమంది ఆయన స్వార్థపరుడనీ అవకాశవాది అని, కేవలం ఆయన వార్తాపత్రికలు అమ్ముకోవటమే ఆయన ముఖ్యమైన వ్యాపారం అనీ దానిలోనే ఆయన విపరీతంగా సంపాదిస్తున్నాడనీ. కాని అతని వయస్సుకి ఆ వ్యాపారం చాలా సాహసంతో కూడుకున్నది. తర్వాత స్వేచ్ఛాయుతమైంది. ఆయనకు ద్రవ్య సంపదకు లోటు లేదు. ఎంత నగదు కావాలన్నా రస్సెస్ సేజ్ అందించేవాడు. అలాంటివాడు హార్ట్ తల్లి దగ్గరకు వెళ్లి "అమ్మా మీ అబ్బాయితో చెప్పండి. ఇప్పుడు వాల్‌స్ట్రీట్ గురించి చెడ్డగా రాస్తూ పోతే సంవత్సరానికి 10 లక్షల డాలర్లు పోతాయి" అని హెచ్చరికగా. అప్పుడు ఆమె "అలా అయితే మావాడు మరో ఎనభైఏళ్లు వ్యాపారంలో వుండవచ్చు..." అంది ఎంతో ధైర్యంగా!

నేను మొదటిసారి హార్ట్‌ని కలిసినపుడు నేను అమర్యాదకరంగా ప్రవర్తించాను. సిమ్ సిల్వర్‌మాన్ ఈయన 'వెరైటీ' పత్రిక ప్రచురణకర్త. ఈయనే హార్ట్ ఇంటికి తీసుకు వెళ్లాడు. అది రివర్‌సైడ్‌లో వుంది. అక్కడే భోజనాలు చేశాము. అది ఎంతో ధనికులుండే

ఇంటిలాంటిదే. రెండు అంతస్తులు. ఎంతో మేలైన చిత్రాలు (తైలవర్ణ) వున్నాయి. ఎత్తైన సీవింగ్ టేకు అల్మారాలు. ఎంతో విలువైన డిన్నర్ పింగాణీ సామాను. ఆ విధంగా ఆ ఇంట్లో అడుగుపెట్టాను. నాకు ఆయన కుటుంబాన్ని పరిచయం చేసారు. అందరం భోజనాలకు కూర్చున్నాము.

హార్ట్ భార్య చాలా ఆకర్షణీయమైన స్త్రీ. ఎంతో దయగల ఇంకా సామాన్యంగా వుండే ఆమె. హార్ట్ అందుకు భిన్నంగా కళ్లు పెద్దవిచేసి నన్ను ఎక్కువసేపు మాట్లాడనిచ్చాడు.

'మిమ్మల్ని మొదటిసారి చూసినపుడు బాక్స్‌ఆర్ట్ రెస్టారెంటులో అప్పుడు మీతో ఇద్దరు యువతులున్నారు. అది మీరేనని నా స్నేహితుడు మిమ్మల్ని చూపించాడు." టేబుల్ క్రిందనించి నా కాలు సిల్వర్‌మాన్ తొక్కాడు.

'ఓ అదా అని నవ్వాడు హార్ట్. అప్పుడు నేను తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేసి, 'ఒకవేళ మీరు కాదేమోలే' మీలాగా వుండే మరొకరు వుంటారు, నా స్నేహితుడు కూడా ఖచ్చితంగా మిమ్మల్ని గుర్తు పట్టినట్లు లేదు' అని జరిగిన తొందరపాటుని సరిచేయ ప్రయత్నించాను. "కావచ్చు మనుష్యుల్ని పోలిన మనుషులు వుంటారు కదా' అని నవ్వాడు.

'ఆ అవును అని' గట్టిగా నవ్వాను – అప్పుడు ఆయన భార్య 'అవును అది చాలా మామూలు విషయమే' అంది.

ఆ విధంగా భోజనాలు ముగిసాయి.

'మారియవ్ డేవియర్' హాలీవుడ్ వచ్చింది హార్ట్ కంపెనీ 'కాస్మో పాలిటెడ్' ప్రొడక్షన్‌లో పనిచేయటానికి. బెవెర్లి హిల్స్‌లో మంచి ఇల్లు అద్దెకు తీసుకుంది. హార్ట్ 280 అడుగుల విలాసవంతమైన పడవకొన్నాడు. పనామా కాలవ నుంచి కాలిఫోర్నియా సముద్రంలోకి ప్రయాణంకోసం. అప్పటినుంచి సినిమా జనం అరేబియా నైట్స్‌తో మాదిరి విలాసవంతమైన రాత్రులంటే ఏమిటో రుచి చూశారు. వారానికి రెండు మూడురోజులు మేరియన్ గొప్ప విందులు ఇచ్చేది. కనీసం వందమంది అతిథులు తక్కువ లేకుండా, నటులు నటీమణులు పార్లమెంటు సభ్యులు, పోలో ఆటగాళ్లు, పాటలుపాడేవాళ్లు. సంపాదకులు ఇంకా అనేకులు. చాలా వింత వాతావరణం ఒకరకమైన వత్తిడి, విచ్చలవిడితనం. ఎందుకంటే హార్ట్ ఎప్పుడు ఎలా నిర్ణయాలు

తీసుకుంటాడో? ఆయన సంపదా అధికారం అలా అన్పించేది. ఆయన మనసుబట్టే ఆ సాయంత్రం వాతావరణంలో మార్పులూ చేర్పులూ జరిగేవి.

ఒక సంఘటన గుర్తుకొస్తోంది. ఒకసారి మారియవ్ ఆమె అద్దె ఇంటిలో విందు ఇచ్చింది. ఆరోజు మేము 50 మందిని చేరాము. ఆరోజు ఎత్తైన కుర్చీలో హార్ట్ కూర్చుని వున్నాడు. ఆయన ఎడిటర్లూ సబ్ ఎడిటర్లూ చుట్టు వున్నారు. మారియన్ మంచి దుస్తులు అలంకరించుకుని, పడక కుర్చీలో ఎంతో హుందాగా అందంగా చూస్తోంది. కాని హార్ట్ ఆయన ఎడిటర్లతో చాలా ముఖ్యమైన విషయాలు చర్చిస్తున్నాడు.

అప్పుడు ఆమె కోపంతో 'హే, నిన్నే! అని అరిచింది.

'ఏమిటి నన్నేనా?' అన్నాడు. 'అవును నిన్నే ఇలారా!' అంది. అని ఆమె నీలంకళ్ళు అతనిమీద పరచి.

ఆయన స్టాఫ్ అంతా వెనక్కు వెళ్లిపోయారు. ఒక్కసారిగా గదిలో నిశ్శబ్దం రాజ్యమేలింది.

హార్ట్ మౌనంగా స్పింక్స్‌లా కూర్చుండిపోయాడు. ఆయన నవ్వు మాయమైపోయింది. పెదవులు సన్నబడి పోయాయి. వేళ్లతో కుర్చీమీద దరువు వేస్తున్నాడు.

కోపంతో అరవాలా వద్దా అని ఆలోచిస్తున్నాడు. నేను టోపీ తీసుకుని బైటకు పోదామని అనుకున్నాను.

ఆయన హఠాత్తుగా "నాకు పని వుంది వెళ్లాలి' అని లేచాడు. 'అయినా మీకు ఏం కావాలి మేడమ్' అన్నాడు దగ్గరగా వెళ్ళి.

"మీరు వ్యాపారం మీ ఆఫీసులో చేసుకోండి. నా యింట్లో కాదు ఇక్కడ అతిథులు మనకోసం వేచి ఉన్నారని మరచిపోవద్దు."

'ఆ అదా విషయం. అలాగే ఇప్పుడే అందరికీ డ్రింక్స్ అందిస్తాం' అంటూ నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్లిపోయాడు!

మేమందరం హాయిగా నవ్వుకున్నాం!

ఒకసారి లాస్‌ఏంజెలెస్ నుంచి న్యూయార్కు రైల్లో ప్రయాణం చేస్తున్నాము. నాకు ఒక తంతి వచ్చింది. ఆయనతోపాటు మెక్సికో రావాలని, నేను అర్జంటు వ్యాపారం

పనిమీద న్యూయార్క్కు వెళ్లాలి రాలేనని తంతి పంపాను. దారిలో కాన్సాస్ సిటీస్టేషన్‌లో ఆయన ఏజంట్లు ఇద్దరు నా దగ్గరకు వచ్చి "మిమ్మల్ని ఈ రైలులో నుంచి దింపటానికి వచ్చాము. హార్ట్ లాయర్లు మీ న్యూయార్క్ వ్యాపారపు లావాదేవీలు పూర్తిచేస్తారని హార్ట్ చెప్పారు! కాని నేను వాళ్లతో వెళ్లలేకపోయాను.

నాకు హార్ట్‌లాంటి వ్యక్తి సంపదను ఆయనలాగా వెదజల్లేవాడిని, ఎవరినీ చూడలేదు. రాక్‌ఫిల్లర్ సంపదయొక్క బాధ్యత తెలిసినవాడు మోర్గాన్ అయితే సంపదలో శక్తి చూడగలడు. కాని హార్ట్ తన చిల్లర ఖర్చులకోసం చిన్నచిన్న సరదాలకోసం మిలియిన్లు ఖర్చుపెట్టేవాడు.

శాంతా మోనికాలో మేరియన్‌కి ఇచ్చిన బీచ్‌హౌస్ రాజప్రసాదంలా కట్టింది. డెబ్భయి గదుల జార్జియన్ కట్టడం. ఇటలీనుంచి పనివాళ్లను తీసుకువచ్చి కట్టించాడు! బంగారు రంగు డాన్స్‌గది. భోజనాల హాలు రెనాల్డ్స్ చిత్రాలు, లారెన్స్ చిత్రాలు, పెద్ద లైబ్రరీ. ఒక మీట నొక్కితే ఒక అంతస్తు పైకి లేచే సినిమాల హాలు తయారు!

అదీ వైభోగం అంటే! అదీ హార్ట్ లైఫ్‌స్టైల్! మేరియన్ విందుల గది 50 మంది అతిథులకు సరిపోతుంది. ఎన్నో అతిథిగదులు పెద్దవి సిద్ధంగా వుంచేవారు. పెద్ద ఈతకొలను 100 అడుగుల పొడవు వుండేది. మధ్యలో ఒక వంతెనకూడా ఇదంతా సముద్రానికి ఎదురుగా! పెద్ద బార్ రూం కూడా. చిన్ని కాబిరె డాన్స్ ఫ్లోర్!

శాన్‌టా మోనికా ప్రభుత్వం చిన్న హార్బర్ కట్టాలని నావల్ నౌకలకూ వినోద యాత్రలకూ బోట్లు వుంచాలని అనుకున్నారు. అప్పటికే నాకు చిన్న ప్రయాణపు పడవ వుంది. ఇది మంచి ఆలోచన అని హార్ట్‌కి చెప్పాను. ఒక రోజున ఉపాహారం తీసుకుంటూ, 'అలాగా అది ఈ పరిసరాలన్నిటినీ సర్వనాశనం చేస్తుంది. నావికులంతా మన కిటికీలోంచి తొంగి చూస్తుంటారు. ఇదేదో వేశ్యాగృహమనుకుని." అంతే ఆ విషయం ఇక చర్చకు రాలేదు. చాలా సహజంగా వుండేవాడు. మంచి మూడ్‌లో వుంటే, చరెస్తన్ నృత్యం చేస్తుండేవాడు. అప్పుడప్పుడూ చాలా డల్‌గా కనిపించేవాడు. అలాగే వుండేవాడు కాని ఆ భావాలను దాచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించేవాడు కాదు.

ఈయన సంపాదకీయాలన్నీ ఆర్థర్ బ్రిస్‌బేన్ రాస్తుండేవాడు. కాని ఆర్థర్ చెప్పాడు హార్ట్‌ని మించిన సంపాదకుడు లేడని!

చాలా సందర్భాలలో చాలా చిన్న పిల్లవాడిలాగా ప్రవర్తించేవాడు. ఒకసారి మేము కారెట్సు గేము ఆడుతున్నాము. 'నన్ను వదిలి వేశారంటే' అని గొడవ చేశాడు. అప్పుడు జాక్ గ్లిబర్ట్ మేము చెప్పినట్లు ఆడండి అని పిల్ బాక్స్ ఆడదాం. నేను పెట్టీ మీరు బిళ్లా అన్నాడు. 'ఇటువంటి చెత్త నేను ఆడను' అని తలుపు నెట్టివేసి వెళ్ళిపోయాడు.

సాన్‌సైమన్‌లో వున్న ఆయన, నాలుగు వందల వేల (నాలుగు వేల ఎకరాల రాంచ్ పసిఫిక్ సముద్రానికి ముప్ఫయి మైళ్ల పొడవునా వుంది! అక్కడ వుండటానికి చిన్న కొండమీద ఇళ్లు కట్టించాడు. అవి సముద్ర మట్టానికి అయిదువందల అడుగుల ఎత్తులో వున్నాయి. కొన్ని కోటల భాగాలను ఇటలీ నుంచి తెచ్చి ఈ చిన్నకోట ఇక్కడ కట్టించాడు. దీనిచుట్టూ అయిదు విల్లాలున్నాయి (కాపలాకాస్తున్నట్లు). ఇంక లోపల అలంకరణ అంతా ఇటాలియన్ మాదిరిగా అతిథులకు ఆరుగురు వుండే అయిదు విల్లాలు. అసలు కోటలో 30 మంది అతిథులు. ఆటలూ పాటలకు వేరువేరు చోట్లు, ఇంక ఇంటికి కాపలాకు సేవకులు అరవైమందిపైనే! ఇక్కడ దగ్గర్లోనే ఒక జంతుశాలను కూడా ఏర్పాటు చేశాడు. దానిలో సింహాలున్నాయి, పులులున్నాయి. ఒరంగుటాలున్నాయి. కోతులూ, కొమ్మచ్చులూ, పాములూ, తేళ్లూ! కోటనుంచి అక్కడి వరకు అయిదుమైళ్ల రెండు ప్రక్కలా చెట్లూ ఆస్ట్రిచ్‌లూ నెమళ్లూ బైసన్లూ. మామూలు జంతువులకు అంతేలేదు! రైల్వే స్టేషన్ దగ్గర కార్లు సిద్ధంగా వుంచేవాడు. అతిథులను, తీసుకురావటానికి.

విమానంలో రావటానికి ప్రైవేటు ఎయిర్ పోర్ట్ కూడా ఉంది. ప్రతిరోజు రాత్రి ఏడున్నరకు అన్నిరకాలు మధువులు మెయిన్ హాలులో ఇచ్చేవాడు. ప్రక్కనే స్విమ్మింగ్‌పూల్. గుర్రపుస్వారి. టెన్నిస్ అన్నిరకాల ఆటలూ పాటలూ వుండేవి. ఆయన అందించే విందులు, ఎంతో అద్భుతంగా ఉదారంగా వుండే మొదటి చార్లెస్ విందు ఇస్తున్నట్లు అక్కడ వంటకాల జాబితా వుండేది! ఇంక వంటకాల సంగతి చెప్పే పనేలేదు!

శ్రీమతి హార్స్ట్ , సాన్ సైమన్ ప్రతి సంవత్సరం వచ్చేది. అంతా సాఫీగా జరిగిపోయేది. మేరియన్‌కీ శ్రీమతి హార్స్ట్‌కీ చక్కని అవగాహన వుండేది. ఆమె వచ్చే సమయానికి మేరియన్‌తో పాటు మా బృందమంతా మేరియన్ సాంతా మోనికా ఇంటికి, అదే బీచ్ వడ్డున చేరేవాళ్ళం. నాకు మిల్లిసెంట్ హార్స్ట్ భార్య 1916 నుంచి తెలుసు. మేము మంచి స్నేహితులంకూడా. ఎప్పుడైనా వారాంతానికి ఆమెతో పాటు రించ్‌కి రమ్మనేది. నేను అదే మొదటిసారి అన్నట్లు బుద్ధిగా వెళ్లేవాడిని. ఆమె అమాయికురాలేమీ

కాదు. ఆమెకు అన్ని విషయాలూ అన్ని వార్తలూ చేరుతూనే వుంటాయి. తెలియనట్లే వుంటూ చక్కని హాస్యాన్ని పండించేది. 'అది మేరియన్ కాకపోతే మరొక్కటి అవుతుంది' అంటూ నాతో చాలా ఆంతరంగికంగా చెప్పేది. 'ఇప్పటికీ మా మధ్య ఎవరూ లేనట్లే నటిస్తారే మీ స్నేహితుడు' అంటూ నవ్వులో కషాయం కలిపేది!

"నేను రాగానే ఎంతో తీయగా కబుర్లు చెప్తూ ఎన్నో బహుమతులు సిద్ధంగా వుంచుతారు. కాని కొన్ని గంటల సమయమే నాకు కేటాయించేది. ఎప్పుడూ ఒకటే నాటకం నడుస్తుండేది. భోజనం మధ్యలో ఒక బట్లర్ వచ్చి ఒక చీటి ఇస్తాడు. అప్పుడే 'క్షమించు మిల్లి – నేను వెళ్లాలి' అని మెల్లగా జారుకుంటాడు. కొంతసేపటికి తిరిగివచ్చి అర్జెంటు వ్యాపారం పనిమీద లాస్‌ఎంజెలెస్ వెళ్లాలి అని చెప్పేవాడు. మేమంతా అది నిజమని నమ్మినట్లు నటించేవాళ్లం! మా అందరికీ తెలుసు ఆయన వెళ్లేది మేరియన్ దగ్గరకేనని!!"

ఒక సాయంత్రం నేనూ, మిల్లిసెంటూ భోజనం తర్వాత తోటలో నడుస్తున్నాము. అక్కడి కొండమీది బంగ్లా వెన్నెల్లో తడిసిపోతోంది. ఎంతో అందంగా ఆ భవనం కనపడుతోంది. వెనకాలే ఏడుకొండల శిఖరాలు కొంచెం భయపెడుతున్నాయి. తళుకు తారలు ఆకాశంలో మెరుస్తూ నవ్వుతున్నాయి. అప్పుడప్పుడూ ప్రక్కన జూలోని సింహాలు గాండ్రింపుతో వినపడుతున్నాయి. ఒరంగూటా కేకలూ వినవస్తున్నాయి. ఇవన్నీ అక్కడ లోయల్లో ప్రతిధ్వనిస్తూ ఏదో మార్మికమైన వాతావరణం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఒరంగుటూ సాయంత్రం మెల్లగా మొదలుపెట్టి రాత్రి అయ్యేసరికి భయంకరంగా కేకలు పెడుతుంది. అలా రాత్రంతా దాని కేకలు వినపడేవి. 'దానికి పిచ్చి ఎక్కిందా' అన్నాను. ఈ ప్రదేశం అంతా వెర్రిగా వుంది చూడండి. ఆ చాటూ (Chateau) చూడండి. అది ఒక పిచ్చివాడు కట్టాడు. రోజూ ఎంతో కొంత దానికి కలుపుతూ చివరకు చనిపోయేవరకూ ఈ కట్టటం ఆపడు. తర్వాత దీనికి విలువేముంది? ఎవ్వరూ దీనిని పోషించలేరు కదా. హోటల్‌గా పనికిరాదు. ఒకవేళ ప్రభుత్వానికి ఇచ్చినా వాళ్లు ముందుకు రాకపోవచ్చు. ఇది ఒక విశ్వ విద్యాలయంగా కూడా పనికి రాదు! అంది.

మిల్లిసెంటు, భర్త గురించి ఎప్పుడూ పెద్దరికంతోనే మాట్లాడేది. అంటే ఆమె ఆయన్ను ఎంతో అనురాగంతోనే చూస్తుందనుకోవాలి. ఆమె చాలా దయాళువు.

ఇతరులను అర్థం చేసుకునే విశాల హృదయం కలది. కాని తర్వాత సంవత్సరాల్లో నా రాజకీయ చరిత్ర గందరగోళం అయినప్పుడు నన్ను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

ఒక సాయంత్రం నేను సాన్ సైమన్ వచ్చాను వారాంతానికి. అప్పుడు మేరియన్ నన్ను కలిసింది. చాలా కలవరపాటుతో వుంది. ఎవరో తన అతిథిని చిన్న కత్తితో అటకాయించారు. ఆమెకు కలవరపాటు వస్తే నత్తిగా మాట్లాడేది. ఆమె చాలా కంగారుగా "ఇది ఎవరు చేశారో తెలియదు. కాని ఈ ప్రాంతం ఇప్పటికే చాలామంది గూఢచారులు వెతుకుతున్నారు. మా అనుమానం ఎవరో ఫిలిప్పినో అయి వుంటాడని.

'ఎవర్ని గాయపరిచారు?' అడిగాను.

'ఈరోజు రాత్రికి విందులో కలుద్దువుగానిలే' అంది. అలాగే విందులో ఆ యువకుణ్ణి చూశాను. అతని ముఖానికి కట్లు కట్టి వున్నాయి. ముఖంలో కళ్లు పళ్లు మాత్రమే కనపడుతున్నాయి! ఆ పళ్లే ఇకిలిస్తున్నాడు!!

మేరియన్ టేబుల్ కింద నుంచి నన్ను గిచ్చి 'అదిగో అతనే' అంది. అతను ఈ గాయాలను పట్టించుకోకుండా హాయిగా తింటున్నాడు! ఎవరు ఏమడిగినా భుజాలు ఎగరవేస్తున్నాడు! విందు అయిపోయిన తర్వాత ఈ సంఘటన జరిగిన చోటు మేరియన్ చూపించింది.

"ఇదిగో ఈ విగ్రహం వెనక నుంచి వచ్చి గాయపరిచారు. చూడండి ఇక్కడ రక్తపు మరకలున్నాయి" అంది. 'ఇతను ఇక్కడేం చేస్తున్నాడు?' అన్నాను. 'అతని శత్రువు నుంచి పారిపోవాలని.'

అంతలో మళ్లీ ఆ అతిథి వచ్చాడు. అతని ముఖం రక్తసిక్తమైంది. మేరియన్ అరిచి పైకి గెంతింది 'బాబోయ్' అంటూ.

'నన్ను మళ్లీ గాయపరిచారు' అన్నాడు. అతన్ని ఇద్దరు డిటెక్టివ్‌లు ఎత్తుకుని అతని గదికి తీసుకువెళ్లారు. అతన్ని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. అంతలో మేరియన్ మాయమయ్యింది. తర్వాత గంటలో హాల్లో కనిపించింది. ఆమె అనుమానంగా అతనే గాయపరచుకున్నాడని అంటున్నారు. వాడు వుట్టి పిచ్చివాడు. అందరూ అతన్ని పట్టించుకోవాలి అని తాపత్రయం!" అంది. అంతటితో ఆ గోల సద్దుమణిగింది. అందరూ ఎవరి పనుల్లో వారు చేరిపోయారు!!

సర్ థామస్ లిప్టన్ అక్కడికి అతిథిగా వచ్చాడు. తర్వాత, బీచ్ బంగ్లాకి వచ్చాడు. ఆయన స్కాట్‌కదా, చాలా స్వచ్ఛంగా ఉత్సాహంగా మాట్లాడాడు.

"చార్లీ నువ్వు అమెరికా వచ్చావు, ఇక్కడ బాగా సంపాదించావు. నేను మొదటిసారి వచ్చినపుడు గేదల నౌకలో వచ్చాను. అప్పుడు 'ఈసారి నా స్వంత నౌకలో రావాలి' అని అనుకున్నాను. 'నా టీ వ్యాపారంలో కోట్లు పోగొట్టుకున్నాను' అన్నాడు.

అలెగ్జాండ్ ముర్, ఈయన స్పెయిన్ అంబాసిడర్. లిప్టనూ, నేనూ ఎన్నోసార్లు సాయంత్రాలు కలిసి విందారగించాం. లాస్‌ఏంజెలెస్‌లో వాళ్ళిద్దరూ రాజకుమారుల గురించి రాజకుమార్తెల గురించి సిగరెట్టు పీకల్లా మాట్లాడేవాళ్లు. రాజరికం అనేది ఏదో పేర్లకోసమే అన్నాడు.

ఈ రోజుల్లోనే మేరియన్‌ను, హార్స్ట్‌నూ ఎక్కువసార్లు కలిసాను.

వాళ్ళ చాలా సంపన్న జీవితాన్నీ, విలాసవంతమైన జీవనశైలినీ ఇష్టపడేవాడిని. నాకెప్పుడూ వాళ్లింటి తలుపులు తెరచివుంటాయి. ప్రతీవారాంతం అక్కడే గడిపేవాడిని. ముఖ్యంగా మేరీ, డగ్లసూ యూరోప్ వెళ్ళినప్పుడు నాకు వేరేచోటు వుండేదికాదు.

ఒక వుదయం ఫలహారం తర్వాత చాలామంది వున్నారు. మేరియన్ నా సలహా అడిగింది. ఆమె చిత్రకథ గురించి. ఇప్పుడున్నది హార్స్ట్ కి నచ్చదు అన్నాను. ఆ కథ స్త్రీవాదం గురించి.

అప్పుడు "స్త్రీయేకదా మొగవాణ్ణి ఎంచుకునేది, మగవాడికి ఎక్కడ అవకాశం వుంది, తన స్త్రీని ఎంచుకోవటానికి?" అన్నాను. అదేమిటి? మగవాడే కదా స్త్రీని ఎంచుకునేది? అన్నాడు హార్ట్.

"అవును మనం అలాగే అనుకుంటాం – కాని ఎవరో అందకత్తె – నీ వంక వేలెత్తి చూపిస్తే అతను నాకు కావాలి అంటుంది. అంతే నీవు ఆమెతో వెళ్ళిపోతావు" అన్నాను. "నీవు చెప్పేది అసంభవం చార్లీ."

అలా కాదు – దీంట్లో ఒక సాంకేతిక సమస్య వుంది. మనం గుడ్డిగా నమ్ముతాం – మనమే వాళ్లని ఎంచుకున్నాం అని – కాని జరిగేది దీనికి వ్యతిరేకం" అన్నాను.

అంతే హార్స్ట్ టేబుల్‌మీద గట్టిగా గుద్ది "చార్లీ నేను తెలుపు అంటే నీవు నలుపు అంటావు" అన్నాడు కోపంగా.

నాకు కొంత కంగారు పుట్టింది. బట్లరు నాకు కాఫీ ఇస్తున్నాడు. నేను అప్పుడు "నా సామాను సర్ది టాక్సీ పిలుస్తావా?" అన్నాను.

అంతే మరోమాట లేకుండా నేను లేచి వెళ్ళిపోయి రూంలో తిరుగుతున్నాను. చాలా కోపంగా వున్నాను. అంతలో మేరియన్ వచ్చింది. 'చార్లీ ఏమిటి సమస్య' అంది.

"ఎవరూ నన్ను విసుక్కోవలసిన పనిలేదు. ఆయన ఏమనుకుంటున్నాడు. ఈయన ఏమైనా – నెపోలియనా?"

అంతే ఒక్క మాట లేకుండా గది వదిలి వెళ్లిపోయింది. తర్వాత హార్స్ట్ వచ్చాడు. ఏమి జరగనట్లు – "చార్లీ ఏమిటి విషయం?" అన్నాడు నవ్వుతూ.

"నేను కేకలకు అలవాటు పడలేదు. ముఖ్యంగా నేను అతిథిగా వచ్చినప్పుడు. అందుకని వెళ్లి...." ఇంక ఆ మాట పూర్తి చేయలేకపోయాను.

తర్వాత హార్స్ట్ కూడా "నాతోపాటు నడిచి, మనం ఈ విషయం మాట్లాడుకుందాం." ఆయన గొంతుకూడా వణుకుతోంది. ఇద్దరం కలిసి హాల్లోకి వెళ్లాం. అక్కడ ఇద్దరు కూర్చునే సోఫా వుంది. హార్స్ట్ ఆరడుగుల నాలుగు అంగుళాల మనిషి. అక్కడ వున్న చిన్న సోఫాలో కూర్చున్నాడు. మిగిలిన కాస్త స్థలం నాకు చూపించి, 'చార్లీ కూర్చో, మనం మాట్లాడాలి' అన్నాడు.

ఆయన ప్రక్కనే కూర్చున్నాను. ఆ చిన్న సోఫాలో ఒకరిని ఒకరు ఆనుకోకుండా కూర్చోలేంకదా. మరోమాట లేకుండా ఆయన, నా చేతిని పట్టుకుని, 'చార్లీ చూడు.' ఇంకా ఆయన గొంతు వణుకుతోంది. 'నాకు మేరియన్ ఈ స్క్రిప్టు రాయటం ఇష్టంలేదు' కాని నువ్వు చెప్పావంటే ఆమె గౌరవిస్తుంది. అందులో నువ్వు ఆమోదిస్తే దానికి తిరుగులేదు. అందుకని నాకు చిరాకు వేసి అరచివుంటాను."

అంతే నేను కరిగిపోయాను. "అంతా నాదే తప్పు. చాలా సారీ, ఏమీ అనుకోవద్దు" అని అన్నాను. తర్వాత కరచాలనం చేసుకొని మళ్లీ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గరకు వెళ్ళాం. ఆ సోఫాలోనుంచి లేచేటప్పుడు ఇద్దరం ఒకరిని ఒకరు పట్టుకుని లేవాల్సి వచ్చింది!"

నేను పచార్లు చేస్తుండగా మేరియన్ వచ్చి పరిస్థితి బాగోలేదని, హార్స్ట్ దగ్గరకు వెళ్ళి కాస్త గట్టిగానే చెప్పింది. చార్లీకి క్షమాపణ చెప్పమని. తర్వాత నాతో చెప్పింది

'తుఫానుకు ముందు ఉరుములు మోగుతాయి కదా' అంది నవ్వుతూ మేరియన్. ఎప్పుడూ సంతోషంగా వుంటే చాలా ఆకర్షణీయంగా అలంకరించుకునేది. హార్‌స్ట్ న్యూయార్కు వ్యాపారం మీద వెళ్లితే ఆమె బెవర్లీ హిల్స్ ఇంటికి అతిథుల్ని ఆహ్వానించి విందులిచ్చేది. అంతా ఎంతో సరదాగా గడిపేవాళ్ళం.

తర్వాత రుడాల్ఫ్ ఇంటిలో విందులు, ఆ తరువాత నా యింటిలో విందులూ వినోదాలూ.

ఒక్కోసారి బస్సు అద్దెకు తీసుకుని అతిథుల్ని చేరవేసేవాళ్ళం. సంగీతం కోసం పాటలు పాడేవాళ్ళని అందర్ని చేరదీసేవాళ్ళం.

మా మలిబూ బీచ్‌కి వెళ్ళేవాళ్ళం. హార్‌స్ట్ విలేఖరి వచ్చేవాడు. హారీక్రోకర్ వచ్చేవాడు.

అక్కడ చలిమంట వేసి తెల్లవారు ఝామువరకూ ఆటలాడుకుంటూ గడిపేవాళ్ళం. అప్పుడప్పుడు కుందేళ్ళని కూడా వేటాడేవాళ్ళం.

తర్వాత హారీక్రోకర్ నా సహాయక దర్శకుడుగా వచ్చాడు. ఇలాంటి రాత్రిళ్ళు మేము 4-5 గంటలు ప్రొద్దున్న వరకూ బీచ్‌లో గడిపేవాళ్ళం.

"ఇదంతా హార్‌స్ట్ కి తెలిస్తే మనలో ఎవరి ఉద్యోగం పోతుంది? నాదిమాత్రం కాదు" అనేది మేరియన్.

ఇలాంటి విందు జరుగుతుండగా మేరియన్‌కి హార్‌స్ట్ ఫోన్ చేశాడు. ఆ ఫోన్ మాట్లాడి వచ్చిన మేరియన్ 'మీకు తెలుసా, నా మీద నిఘా పెట్టాడు!' అంది.

"ఫోన్‌లో డిటెక్టివ్ పంపిన రిపోర్ట్ అంతా చదివాడు" అంది. "గంటగంటకూ ఎక్కడ వుందో అన్నీ వివరంగా ఆ డిటెక్టివ్ వివరాలు పంపాడు."

తర్వాత చెప్పింది "ఇప్పుడు ఆయన వస్తున్నాడు నాతో - అన్ని వ్యవహారాలు ముగించటానికి" అని.

ఆమెకు చాలా కోపం వచ్చింది. ఎందుకంటే ఆమె ఏ తప్పూ చేయలేదు. "స్నేహితులతో గడపటమే తప్పా?" అంది.

డిటెక్టివ్ రిపోర్ట్ కూడా సరైనదే కదా? కాని దీన్ని అర్థం చేసుకునేప్పుడు అపార్థాలు వస్తాయి.

కన్సాస్ సిటీకి హార్స్ట్ తంతి పంపాడు. "నా మనసు మార్చుకున్నాను. నేను ఆ ప్రదేశాలన్నీ మళ్లీ చూడలేను. ఎంతో ఆనందంగా గడిపిన ప్రదేశాలు. అందుకని – న్యూయార్క్ వెళ్లిపోతున్నాను" అని.

దాని తర్వాత మళ్లీ తంతి పంపాడు. లాస్ఏంజెలెస్ వస్తున్నట్లు.

అసలు చిక్కు ఇప్పుడే – మా అందరికీ ఈ వ్యవహారం చిక్కు సమస్యగా వుంది. ఆయన లాస్ఏంజెలెస్ రాగానే మేరియన్‌ని కలిసి ఇద్దరూ ఒకటైపోయారు. దాని పర్యవసానం బ్రహ్మాండమైన విందు – హార్స్ట్‌ని బౌర్ బెవర్లీహిల్స్ ఆహ్వానిస్తూ!!

మేరియన్ వందమందికిపైగా సరిపడా విందు భోజనానికి తాత్కాలికమైన ప్రదేశాన్ని సిద్ధం చేసింది. రెండురోజుల్లోనే అది పూర్తి ఏర్పాట్లు జరిగాయి. లైట్ల ధగధగతో మెరిసిపోయింది. ఆ సాయంత్రం ఆమె గొప్పగా అలంకరించుకుంది. చేతికి 78 వేల ఎమ్‌రాల్డ్ ఉంగరం పెట్టింది. అది హార్స్ట్ బహుమతి.

ఎవరి ఉద్యోగమూ ఊడలేదు చివరికి!!

మార్పుకోసం మేము హార్స్ట్ పడవలో వారాంతాలు గడిపేవాళ్ళం. అక్కడ నుంచి కాటలీనా చేపలు పట్టటానికి వెళ్లేవాళ్ళం. లేదా దక్షిణాదిలోనున్న సాన్‌డియాగోకు వెళ్ళేవాళ్ళం. ఇలాంటి ఒక ప్రయాణంలో దామస్ ఇన్స్, ఈయనే కాస్మోపోలిటన్ ప్రొడక్షన్ చూస్తున్నాడు. చాలా అస్వస్థుడయ్యాడు. చివరికి నౌక నుంచి బైటకు మోసుకువెళ్ళారు. కాని ఆ ట్రిప్పులో నేను లేను. ఎవినార్ గ్లిన్ ఉన్నాడు. ఆయనే చెప్పాడు. ఇన్స్ చాలా విలాసవంతమైన జీవి అని. కాని మధ్యాహ్నం భోజనం చేస్తుండగా హఠాత్తుగా నొప్పి వచ్చి పడిపోయాడని. తర్వాత తీరానికి తీసుకువెళ్ళి ఆసుపత్రిలో చేర్పించారు. అప్పుడే తెలిసింది అతనికి గుండెపోటు వచ్చిందని. తర్వాత మూడు వారాలకే చనిపోయాడు.

దీని పర్యావసానం ఇన్స్‌ని తుపాకీతో కాల్చి చంపారని పుకార్లు పుట్టించారు. ఇవన్ని అసత్యాలే. ఎందుకంటే అతను చనిపోయే రెండు వారాలకు ముందు నేనూ, మేరియనూ, హార్స్టూ ముగ్గురం ఆయన బెవర్లీ హిల్స్ ఇంటికి వెళ్ళి చూశాము. మా అందర్నీ చూసి ఎంతో సంతోషం వెలిబుచ్చాడు 'ఇన్స్'. త్వరలో కోలుకుంటానని నమ్మకం వ్యక్తపరిచాడు కూడా!

ఇన్స్ మరణం హార్స్ట్ కాస్మోపాలిటన్ ప్రొడక్షన్‌కి చాలా సమస్య అయిపోయింది. అందుకని వార్నర్ బ్రదర్స్ తీసుకున్నారు.

తర్వాత రెండు సంవత్సరాలకు ఎమ్.జి.ఎమ్ వాళ్లు తీసుకున్నారు. అక్కడే మేరియన్‌కి చాలా పెద్ద డ్రెస్సింగ్ గది కట్టారు. దానికి నేను 'ట్రియనాన్' అని పేరు పెట్టాను!

ఇక్కడే హార్స్ట్ తన వార్తా పత్రికల వ్యాపారం అంతా నడిపేవాడు. ఒక్కోసారి మేరియన్ గదిలో 20-30 పత్రికలు పరచుకుని అక్కడ హార్స్ట్ వాటిలో మునిగిపోయేవాడు. తన కుర్చీలో కూర్చుని ఆ పత్రిక శీర్షిక ఛండాలంగా వుంది. ఈ కథలో వీళ్లంతా ఎందుకున్నారు? ఇలా అన్నిటినీ నిశితంగా పరిశీలించేవాడు.

ఇంతలో ఒక పత్రిక తీసి చూసి 'దీని ప్రచారం ఏమయింది? ఈ నెల చాలా తక్కువగా వుందీ - రేలాంగ్‌కి టెలిగ్రాం ఇవ్వండి' అనేవాడు! అంతలో సినిమా సెట్టులోనుంచి మేరియన్ వచ్చేది, చాలా హుందాగా! ఆ పేపర్ల మీద నడుస్తూ, 'ఈ చెత్తంతా తీసివేస్తారా? దయచేసి' అనేది!!

హార్స్ట్ చాలా నెయివ్‌గా వుండేవాడు. మేరియన్ నటించిన చిత్రాన్ని చూడటానికి వెళ్ళేప్పుడు నన్ను తప్పని సరిగా తీసుకు వెళ్ళేవాడు. ముగ్గురం కలిసి కారులో వెళ్ళేవాళ్ళం. థియేటర్ దగ్గరకు రాగానే ఆయన ఒక్కడే వెనక ద్వారం ద్వారా వెళ్ళేవాడు. మేరియన్‌తో రావటం పత్రికలు వాళ్ళు చూడకూడదని. ఇంత జాగ్రత్తపడినా.

ఒకసారి హార్స్ట్ పత్రిక - ఎక్జామినరీకి, టైమ్స్‌కీ పేచీ వచ్చినప్పుడు - టైమ్స్ హార్స్ట్ వెనకపడి చివరికి వ్యక్తిగత దూషణకు దిగింది. హార్స్ట్ డబుల్ జీవితాన్ని ఎండగడుతూ కథలు రాసింది. అప్పుడు హార్స్ట్ సమాధానం పత్రికా ముఖంగా ఇవ్వలేదు. నా దగ్గరకు వచ్చి 'మిసెస్ డేవీస్ (టైమ్స్ ఓనరు) శవపేటికను నాతోపాటు మోస్తావా' అన్నాడు. 'తప్పనిసరిగా' అన్నాను.

1933లో హార్స్ట్ నన్ను ఆహ్వానించాడు. ఆయనతో పాటు ఐరోపా యాత్రకు. ఆయన కునార్డ్ నౌకలో సగం బుక్‌చేశాడు. ఆయన సిబ్బందీ అతిథులకోసం. కాని నేను వెళ్ళలేదు. ఎందుకంటే మరో ఇరవయి మందితో తిరగటం నాకిష్టం లేదు. ఆయన ఎక్కడ ఆగితే అక్కడ ఆగాలి. ఎక్కడ పరుగు పెడితే అక్కడ ఉరకాలి. అందుకని రానన్నాను.

ఇలాంటి అనుభవం నాకు మెక్సికో యాత్రలో బాగా జరిగింది. అప్పుడు నా రెండో భార్య గర్భవతి. ఒక పదికారులు వరసలో వెళ్తున్నాయి. ఆ రహదారి అంతా

ఎగుడు దిగుడుగా వుంది. అదంతా నాకు చాలా చిరాకుగా వుంది. చివరికి ఆ ప్రయాణం ఆపి ఆ రాత్రి మెక్సికన్ పల్లెటూరులో ఆ రాత్రి గడిపాము. అక్కడ రెండు గదులే వున్నాయి. మేము ఇరవయిమంది ఉన్నాము. అందులో ఒక గది నా భార్యకు ఇచ్చారు.. ఎవినార్ గ్లినూ, నేనూ ఆమెతో వున్నాము. కొంతమంది బల్లలమీదా, కుర్చీల్లో, కిందా నిద్రపోయారు. వంటింట్లో, కోళ్ల గదిలో కూడా. వీళ్లందర్నీ అలా చూడటం గొప్పగా వుంది. నా భార్య మంచంమీద పడుకుంది. ఎవినార్ సోఫాలో, నేను రెండు కుర్చీలు కలిపి – ఆ విధంగా, పడివున్నాం.

ఆ రాత్రి ఎవ్వరూ నిద్రపోలేదు. ఎవినార్ రిట్జ్ హోటల్‌కి వెళ్తున్నట్లు గొప్పగా బట్టలు వేసుకుంది. ఆ బట్ట నలగకుండా నిద్రపోకుండా, జుట్టు చెరిగిపోకుండా తెల్లవార్లు అలాగే వుండిపోయింది పాపం!

ఐరోపా యాత్రలో నాబదులు నా సహాయకుడు హారీక్రోకర్‌ని తీసుకు వెళ్ళాడు. అతను ఇప్పుడు హార్స్ట్ కి సోషల్ కార్యదర్శిగా వుంటున్నాడు. నన్ను సర్ ఫిలిప్ సాశన్ (ఈయన నా స్నేహితుడు)కి పరిచయ లేఖ ఇమ్మన్నాడు. నేను అది ఇచ్చాను కూడా.

ఫిలిప్, హార్స్ట్ కి చాలా చక్కని ఆతిథ్యం ఇచ్చాడు. హార్స్ట్ చాలాకాలంగా బ్రిటన్‌కి వ్యతిరేక భావాలనే ఆయన పత్రికల్లో వ్యక్తపరుస్తున్నాడని తెలిసికూడా ఆయన చాలా బాగా మర్యాద చేశాడు. అంతేగాక 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్'తో సమావేశం కూడా ఏర్పాటు చేశాడు. ఫిలిప్ వాళ్ళిద్దర్నీ తన లైబ్రరీ గదిలో వదిలి ఆయన బైటకు వచ్చాడు. అక్కడ (తర్వాత ఫిలిప్ చెప్పినదాన్ని బట్టి) యువరాజు హార్స్ట్ ముఖం మీదే అడిగాడు. 'మీరు ఎందుకు ఇంగ్లాండుకు వ్యతిరేకంగా వున్నారు' అని. వాళ్లు రెండు గంటలు ఆ గదిలో వుండిపోయారు. ఆ తర్వాత హార్స్ట్ దృక్పథంలో చాలా మార్పు వచ్చింది కూడా!

నాకు ఎప్పుడూ హార్స్ట్ ఇంగ్లాండు వ్యతిరేకత అర్థం అయ్యేది కాదు. ఆయన జర్మనీని సమర్థించేవాడు. అది మొదటి ప్రపంచయుద్ధపు కాలంనుంచీ వుంది. అప్పుడు జర్మనీ దౌత్యవత్త బెర్న్‌స్టార్ఫ్‌తో స్నేహమే కారణమనుకుంటాను. అప్పుడే జర్మనీ దూతపై చెడ్డప్రచారం జరిగింది. చివరికి హార్స్ట్ సంపద, శక్తీ కూడా ఏమీ చేయలేకపోయింది.

అప్పుడు కూడా ఈయన విలేఖరి కార్ల్‌హోర్ ఎప్పుడూ జర్మనీకి అనుకూలంగానే రాస్తుండేవాడు. ఇది రెండో ప్రపంచ యుద్ధం మొదలయ్యే ముందు వరకూ జరిగింది.

సిటీలైట్స్

ఈయన ఐరోపా యాత్రలో జర్మనీ వెళ్ళాడు. హిట్లర్‌ని కలిశాడు. అప్పటికే వున్న హిట్లర్ దారుణమైన కాన్సన్ట్రేషన్ కాంపులు గురించి తెలియదు.

వాటిగురించి మొదటగా నా స్నేహితుడు కాల్విలియిస్ వాండర్ బిల్ట్ రాశాడు. ఆయన ప్రత్యక్షంగా వాటి గురించి తెలుసుకుని ప్రపంచానికి తెలియపరిచాడు. కాని వాటిని ఎవరూ నమ్మలేదు. అవి అంత దారుణంగా వున్నాయి. అప్పుడే వాండర్ బిల్ట్ నాకు చాలా ఫోటోలు పంపాడు. అవన్నీ హిట్లర్ ఉపన్యాసాలు ఇవ్వటం. హిట్లర్ ముఖాన్ని అప్పుడే పరీక్షగా చూశాను. అది చాలా అసహ్యమైన హాస్యం వెలిబుచ్చుతోంది. నా ముఖ కవళికలకు దగ్గరగా నా మీసాలు మాదిరిగా, చెదరిన జుట్టూ చిన్న మూతీ ఇవన్నీ నాకేమాత్రం నచ్చలేదు. నేను హిట్లర్‌ని పట్టించుకోలేదు. ఒక్కో పోస్ట్‌కార్డ్ ఒక్కోరకంగా వుండేది. ఒకసారి అతన్ని చేతులు గద్ద కాళ్లలాగా ఎదురుగా వున్న జనాన్ని ఒక్కసారే పట్టుకోవాలనే ఆత్రుత. ఒక్కోసారి క్రికెట్ ఆటగాడిలాగా బంతి వేసేవాడిలాగా. పిడికిలి బిగించి ఏదో బరువు ఎత్తుతున్నట్లు. అతని సాల్యూట్ కూడా చిత్రంగా వుండేది. చేయి ముందుకు చూపి (నాకు దాంట్లో ఎంగిలి పళ్లాలు పెట్టాలని అనిపించేది) ఇంకో చేయి భుజాలు మీదుగా – 'వీడు పిచ్చివాడు' అనుకునే వాడిని. కాని ఐన్‌స్టీన్‌నీ, థామస్ మాన్‌నీ జర్మన్ నుంచి పంపివేసినపుడు, ఇంక అతను హాస్యగాడు కాదు, దుర్మార్గుడు అనుకున్నాను.

నేను ఐన్‌స్టీన్‌ని 1926లో కలిశాను. ఆయన కాలిఫోర్నియా వచ్చాడు, ఉపన్యాసం ఇచ్చేందుకు. శాస్త్రకారులూ, తత్త్వవేత్తలూ చాలా కలల ప్రపంచంలో విహరిస్తారు అనుకునేవాడిని. ఎందుకంటే వాళ్ళ ఆలోచనలు అన్నీ వేరే దిక్కులో వెళ్తుంటాయి.

ఈ నా సిద్ధాంతం ఐన్‌స్టీన్ విషయంలో బాగా సరిపోయింది. అయన ఆల్బైన్ జర్మన్‌లా అలాగే వున్నాడు. చాలా స్నేహపూర్వకంగా సరదాగా.

పైకి చాలా సాదాసీదాగా వున్నా ఆయన చాలా ఉద్విగ్నభరితమైన మానసిక స్థితిలో వుండేవాడని అనిపించింది. ఆయన లోపలి శక్తి అనంతం.

యూనివర్సల్ స్టూడియో కార్ల్ లీమాల్ నాకు ఫోన్‌చేసి ఐన్‌స్టీన్ వస్తున్నట్లూ నన్ను కలవాలని ఇష్టపడుతున్నట్లూ చెప్పాడు. నాకు చాలా సంతోషం కలిగింది. అలా

యూనివర్సల్ స్టూడియోలో మధ్యాహ్న భోజన సమయంలో కలిసింది. ఐన్‌స్టీనూ, ఆయన కార్యదర్శీ భార్య అయిన హెలెన్ డూకాస్, ఆయన సహాయకుడు, వాల్టర్ మేయర్. ఐన్‌స్టీన్, చక్కగా ఇంగ్లీషు మాట్లాడుతున్నాడు. ఆయన భార్య, ఆమె గొప్ప వ్యక్తి భార్యనన్న సంగతి తెలిసే చాలా హుషారుగా వుంది.

భోజనాల తర్వాత కార్ల్ స్టూడియో అంతా చూపాడు. అప్పుడు ప్రొఫెసర్ భార్య నన్ను ప్రక్కకు పిలిచి, 'మీరు ప్రొఫెసర్‌ని మీ యింటికి ఆహ్వానించండి' అంది. 'మీతో వుండటం ఆయనకు చాలా సంతోషం' అంది.

నేను ఆయన్ను మా యింటికి విందుకు రావలసిందిగా ఆహ్వానించాను. ఇంకో ఇద్దరు స్నేహితుల్ని మాత్రమే పిలిచాను. డిన్నర్ దగ్గర ఆమె నాకు చెప్పింది. 'థియరీ ఆఫ్ రిలిటివిటీ' ఆయనకు మస్తిష్కంలోకి వచ్చిన వుదయం, ఆయన నైట్ గౌనుతో పైనుంచి గబగబా వచ్చారు. బ్రేక్‌ఫాస్ట్ దగ్గర ఏమీ ముట్టుకోలేదు. నేను ఆయనకు బాగోలేదనుకున్నాను. ఏమిటి మీ బాధ అన్నాను.

"డార్లింగ్, నాకు గొప్ప ఆలోచన వచ్చింది" అన్నారు. కొంచెం కాఫీ తాగి పియానో దగ్గరకు వెళ్లి కొంతసేపు మెట్లు నొక్కి, ఆహా చాలా గొప్ప ఆలోచన వచ్చింది" అని అన్నారు.

'మరి నాకు చెప్పండి – వెంటనే' అన్నాను: 'అది చాలా కష్టమైంది. ఇంకా దాని మీద పనిచేయాలి.' తర్వాత చాలాసేపు పియానో వాయిస్తూ కూర్చున్నాడనీ నోట్సు రాసుకుంటూ అరగంట పైగా వుండిపోయాడనీ, తర్వాత మేడమీదకు వెళ్ళి నన్ను ఎవరూ డిస్టర్బ్ చేయకండి – అనీ.

ప్రతిరోజూ పైకి భోజనం పంపించేదానిని. మధ్యలో కాసేపు నడిచి మళ్లీ పనిలో పడిపోయేవారు.

తర్వాత చాలా పాలిపోయి రెండు కాగితాలు బల్లమీద పెట్టి, అదే 'థియరీ ఆఫ్ రెలేటివిటీ' అంటే అన్నారు. డా॥ రెనాల్డ్స్‌ను పిలిచాను. ఆయన అడిగారు మీరు ఎప్పుడైనా డన్నే కాలంతో ప్రయోగం చదివారా? అని.

ఆయన తల వూపారు.

రెనాల్డ్స్, "ఆయనకు డైమన్షన్ మీద అభిప్రాయాలున్నాయి."

ఇంతలో ఐన్‌స్టీన్ నాతో ఎక్స్‌టెన్షన్ డైమెన్షన్ అయి వుంటుందని చెవిలో చెప్పారు.

తర్వాత రెనాల్డ్స్ "మీకు దెయ్యాలంటే నమ్మకముందా? ఆ 'పన్నెండుమంది నమ్మితే తర్వాత నేను నమ్ముతాను' అన్నారు.

అప్పుడు దెయ్యాలమీదా, ఆధ్యాత్మకత మీదా చర్చలూ, ఉపన్యాసాలూ జరిగేవి. నాకు వీటిమీద నమ్మకంలేక హాలీవుడ్ వెళ్లేవాడిని కాదు.

కానీ ఫన్నీ బ్రైస్ మాత్రం వీటిమీద చాలా ప్రచారం చేసేది. బల్లను పైకి లేపి గదిలో త్రిప్పేది. నేను ప్రొఫెసర్ని అడిగాను – 'అలాంటిదేమైనా సంభవమా' అని. ఆయన నవ్వి తల అడ్డంగా వూపాడు.

'మీ థియరీ న్యూటన్ థియరీకి వ్యతిరేకమా?' అని అడిగాను.

"కాదు – ఇది దానికి కొనసాగింపు" అన్నారు.

భోజనాల సమయంలో – నేను చెప్పాను "యూరోప్ వెళ్లే ఆలోచన వుందని." అయితే మీరు బెర్లిన్ రావాలి. మేముండేది చిన్న ప్రదేశమే" అన్నాను.

ప్రొఫెసర్ తన పనికి చాలా డబ్బు అవసరమైనా తీసుకోరు. రాక్‌ఫెల్లర్ మిలియన్ల డాలర్లు వుంచారు. కాని ఈయన ఇంతవరకు ముట్టుకోలేదు.

తర్వాత నేను బెర్లిన్ వెళ్ళినప్పుడు వాళ్ళింటికి వెళ్ళాను. అది బ్రాంక్స్‌లో ఇంటిలాగా వుంది. సిట్టింగ్ రూం – డైనింగ్ రూం ఒక సోఫా, పాత తివాచీలు చాలా చౌకబారు సామానులు – ఇదీ పరిస్థితి. నల్లని పియానో, దానిమీద ఈ నాలుగో కోణం గురించి రాసిన నోట్సు!

ఆ తర్వాత పియానో ఏమయిందా అని అనుకునేవాడిని. బహుశా స్మిత్‌సోనియాస్ మ్యూజియంలో వుందేమో. లేక నాజీలు చలికాచుకున్నారేమో?

జర్మనీని నాజీలు భయందోళనకు గురిచేసినప్పుడు ఐన్‌స్టీన్ అమెరికా వచ్చారు. అప్పుడు ఆయన భార్య ప్రొఫెసర్ ధనంమీద, ఆయన అజ్ఞానం గురించి చెప్పింది. ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం వారు పిలిచి దానిలో చేరమన్నారు. చేరేందుకు ఎంత కావాలని అడిగారు. ప్రొఫెసర్‌గారు చాలా తక్కువ మొత్తం రాశారు.

వారు, "మీరు అడిగిన మొత్తంతో అమెరికాలో బ్రతకటం కష్టమైపోతుంది. దీనికి కనీసం మూడు రెట్లు కావాలి" అన్నారు!

ఐన్‌స్టీన్ 1937లో కాలిఫోర్నియా వచ్చినపుడు మేము కలిశాం. నన్ను ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. 'నాతోపాటు ముగ్గురు సంగీతకారులు వస్తున్నారు జాగ్రత్త" అన్నాను.

'విందు తర్వాత మాకు మీరో గీతం వినిపించాలి' అన్నాను. ఆ సాయంత్రం ఐన్‌స్టీన్ మొజార్ట్ వాయించారు. ఆయనకు అందులో ప్రావీణ్యం లేకపోయినా చాలా ఉత్సాహంగా వాయించారు. తర్వాత ఆయనకు విశ్రాంతి, ఇచ్చి వచ్చిన ముగ్గురూ వారి సంగీతమే వారు వినిపించారు!

ఆయన విశ్రాంతిగా మాతో కూర్చుని విన్నారు. తర్వాత నా చెవిలో, 'తర్వాత ఎప్పుడు నన్ను సంగీతం వినిపించమంటారు?' అని అడిగారు.

వాళ్లు వెళ్లిపోయిన తర్వాత ఆయన భార్య 'వాళ్లకంటే మీ సంగీతమే బాగుంటుంది' అంది.

కొన్నాళ్ల తర్వాత ఐన్‌స్టీన్ మా యింటికి విందుకు వచ్చారు. అప్పుడు మేరీ పిక్‌ఫోర్‌ని పిలిచాను. డగ్లస్‌నీ, మేరియన్‌నీ, డబ్లు.ఆర్. హార్‌స్టీనీ, ఇంకో ఇద్దర్నీ పిలిచాను. మేరీ ఐన్‌స్టీన్ ప్రక్కనే కూర్చుంది. ఐన్‌స్టీన్ భార్య నా ప్రక్కనా, హార్‌స్ట్ ప్రక్కన మధ్యలో కూర్చుంది.

విందుకు ముందు అంతా బాగానే వుందనిపించింది. హార్‌స్ట్ చాలా ఉదాత్తంగా వున్నాడు. ఐన్‌స్టీన్ మర్యాదగా వున్నాడు.

ఎంతసేపటికీ వాళ్లిద్దరూ మట్లాడుకోవటం లేదు. ఆ డైనింగ్ గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అదీ భయంకరంగా భరించలేనంతగా.

అంతలో మేరియన్ అందరితో ఏవో జోకులు వేస్తూ, ఐన్‌స్టీన్‌ని తన చూపుడు వేలుతో తలమీద కొట్టి 'మీరు జుట్టు కత్తిరించుకోవచ్చుగా?' అంది. అంతే టెన్షన్ తగ్గింది. అందరం కాఫీ కోసం మరో గదిలోకి మారాం.

ఐన్‌స్టీన్ (రష్యన్ డైరక్టర్) హాలీవుడ్ వచ్చారు, తన ట్రూపుతో సహా. అందులో గ్రిగర్ అలెగ్జాండ్రియా కూడా వున్నాడు. వాళ్లతోపాటు అయివర్ మొంటాగు (ఇంగ్లీషాయన) కూడా వున్నాడు. వాళ్లు చాలా దరిద్రంగా టెన్నిస్ ఆడేవారు – మా కోర్టులో.

ఐన్‌స్టీన్ పారమౌంట్ కంపెనీకి చిత్రాన్ని తీయాలి. అప్పటికి ఆయనకు పోటెంకిన్, 'టెన్‌డేస్ థట్‌షుక్ ది వరల్డ్' వీటితో పేరు గడించాడు.

ఇప్పుడు చక్కని స్క్రిప్టు తెచ్చాడు స్వంతదే – 'సత్తర్ గోల్డ్' ఇది కాలిఫోర్నియాలో జరిగిన సంఘటనలే. ఆయనతో కమ్యూనిజము గురించి మాట్లాడుతూ–

"ఇప్పటి విద్యాధికులైన సాంకేతిక నిపుణుల మానసిక స్థితి మీ సాంస్కృతిక మూలవిరాట్టులైన సంపన్నులతో సమానంగా వుంటుందా?" అని అడిగాను.

ఈ నా అజ్ఞానానికి ఆశ్చర్యపోయాడు – "నేను మధ్యతరగతి కుటుంబంనుంచే వచ్చాను. అందరూ ఇంజనీర్లే, విద్యతో బుద్ధితో పాటు మానసిక స్థితి కూడా మారుతుంది. మంచి పంట భూమిలాగా" అన్నాడు. ఆయన చిత్రం 'ఇవాన్ ది టెర్రిబుల్' చాలా ఆలస్యంగా చూశాను. అది చారిత్రాత్మక చిత్రం. చరిత్రను కవితాత్మకంగా చూపాడు. గొప్పగా. కాని నిజానికి అవన్నీ నిజం కాదు. అన్నింటినీ వక్రీకరించి గ్లామరైజ్ చేశాడు. అసలు చరిత్రే అసత్యం. చిత్రం – అలాంటిది కళాత్మకంగా చూపితే చూడటానికి బాగుంటుంది. కానీ హిస్టరీ పుస్తకాలలోకంటే చూపవలసినవీ చూడదగినవీ ఎన్నో సంఘటనలూ, వ్యక్తులూ మన చుట్టూ జరుగుతున్నాయి. తిరుగుతున్నారు కదా!?

ఇరవయ్యొకటవ అధ్యాయం

టాకీలు

నేను న్యూయార్కులో వుండగా నా స్నేహితుడు, నేడు బొమ్మలతో శబ్దం కూడా సరిగ్గా నడవటానికి ఏర్పాటు జరుగుతున్నాయి. నేను చూశాను కూడా. ఇది త్వరలో 'సినిమా రూపు రేఖల్ని మార్చివేస్తుంది తప్పకుండా' అని అన్నాడు. దాన్ని గురించి చాలా కాలం నేను ఆలోచించలేదు. తర్వాత వార్నర్‌బ్రదర్స్ తమ తొలి టాకీ సీక్వెన్సు తీసినపుడు అది కార్టూన్సు చిత్రం. చాలా అందమైన యువతిని అద్భుతమైన అలంకారంతో చాలా ఉద్వేగంతో, చాలా విచారంగా, మాటల్తో పనిలేకుండా చూపించింది.

అలాంటప్పుడు ఒక్కసారిగా ఒక కొత్త విషయం సినిమాలోకి ప్రవేశించింది, అదేమిటంటే మన చెవుల దగ్గర శంఖం పెట్టుకుంటే ఎలా వుంటుందో అలాంటి శబ్దం!

అప్పుడు అందమైన పెదవులు పలికాయి, ఏదో ఇసకలో నుంచి మాటలు వస్తున్నట్లు.

'నేను గ్రిగరీనే చేసుకుంటాను. ఈ సింహాసనం పోయినా సరే' అదీ – నేను షాక్ తిన్నాను. అప్పటివరకూ ఆ యువరాణి అద్భుతంగా వుంది. ఒకసారి నోరు విప్పగానే ఘోరంగా వుంది శబ్దం. సినిమా ముందుకు సాగుతున్నకొలదీ ఇదంతా హాస్యాస్పదంగా తయారయింది.

తలుపు తీస్తే ట్రాక్టర్ మోత! తలుపు వేస్తే రెండు లారీలు గుద్దుకున్నట్లు. మామూలుగా భోజనాల దగ్గర శబ్దాలు – చాలా చౌకబారు హోటల్ మోతల కంటే

ఎక్కువగా. నేను బైటకు వచ్చేటప్పుడు ఈ శబ్దం చిత్రాలకు రోజులు తక్కువేనని అభిప్రాయంతోనే వచ్చాను. కాని తర్వాత నెలరోజులకే యమ్.జి.యమ్. ది 'బ్రాడ్‌వే మెలొడి' పేరుతో సంగీత ప్రధానమైన కథాచిత్రాన్ని తీసింది. ఇది ఎంత చౌకబారు నీరస సినిమా అయినా బాక్సాఫీస్ దగ్గర డబ్బు బాగా వసూలు చేసింది. అదీ మొదలు. రాత్రికి రాత్రి అన్ని థియేటర్లు స్పీకర్లు బిగించటం మొదలు పెట్టారు. అదే మూకీ చిత్రాలకు ఇక సంధ్యాసమయం! ఎంత దురదృష్టమంటే ఇప్పుడే మూకీ చిత్రాల నాణ్యత పెరుగుతోంది. అందులో భాషతో పనిలేదు. ప్రపంచంలో ఎక్కడైనా విడుదల చేయవచ్చు. కథాచిత్రాలు తీయటం ఇప్పుడే మొదలుపెట్టాము. మార్నేవ్ అనే జర్మన్ దర్శకుడు అద్భుతమైన చిత్రం తీశాడు. అమెరికన్ దర్శకులు కూడా మంచి చిత్రాలు తీస్తున్నారు. కాని దురదృష్టం అదంతా ఇప్పుడు శబ్దం చిత్రాలతో వెనకపడిపోతోంది.

కాని నేను మాత్రం మూకీ చిత్రాలే తీయాలని నిర్ణయించుకున్నాను. అంతేకాదు ప్రజలు అన్నిరకాల వినోదాలనూ ఆదరిస్తారని ఆశించేవాడిని. అంతేకాదు నేను సంభాషణలు లేకుండా కథ చెప్పగల సత్తా వున్నవాడిని. ఆ విద్యలో నాకు ఎదురు లేదని చెప్పగలను. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని నేను 'సిటీ లైట్స్' అనే చిత్రాన్ని మొదలుపెట్టాను. దీనిలో కథ ఏమిటంటే సర్కస్‌లో హాస్యగానికి ప్రమాదవశాత్తు చూపు పోతుంది. అతనికి చిన్న కూతురు వుంటుంది. డాక్టరు, 'నీకు కళ్లుపోయినట్లు అమ్మాయికి చెప్పకు. అది తట్టుకోలేదు' అని హెచ్చరిస్తాడు. అప్పుడు అతను కళ్లు పోయినట్లు నటిస్తూ పడుతూ లేస్తూ అమ్మాయిని నవ్విస్తాడు. ఇది నేను కొద్దిగా మార్చి ఈ సంఘటన పూలమ్మే అమ్మాయికి అన్వయించాను.

ఈ చిత్రాన్ని చాలాకాలం నుంచి ఆలోచిస్తున్నాను. నేను ఒకసారి క్లబ్బులో ఇద్దరు ధనవంతులు మాట్లాడుకోవటం విన్నాను. అదీ మనిషికి మతిమరపు వచ్చి తగ్గటం, మళ్లీ రావటం. ఇదొక జబ్బులాంటిది. నేను దీనిని 'ట్రాంప్' (నా మీద) ప్రయోగం చేద్దామని సాహసించాను. ట్రాంప్ నది పక్కన పడివుంటాడు. ధనవంతులు ఇద్దరు అతన్ని వాళ్ల పెద్ద బంగళాకు తీసుకు వెళ్తారు. అతనికి మద్యం మాంసం పెట్టి చాలా బాగా చూస్తారు. పెద్ద గదిలోపడుకోబెట్టి నిద్రపొమ్మంటాడు. ఈలోపు అతను ఫుల్లుగా తాగి అమ్మాయిలతో ఆడి నిద్రపోతాడు. అతన్ని మళ్లీ నదిప్రక్కన వదిలిపెడతారు. అతనికి తర్వాత మెలకువ వచ్చి జరిగింది కల అనుకుంటాడు.

ఇదే ఆలోచనలోంచి 'సిటీ లైట్స్' పుట్టింది. ఒక కోటీశ్వరుడు బాగా తాగి వున్నపుడు ట్రాంప్‌తో చాలా స్నేహంగా వుండి ఇంటికి తీసుకువెళ్లి అన్ని మర్యాదలూ చేస్తాడు. అతనికి మత్తు దిగగానే ఈ ట్రాంప్‌ని పట్టించుకోడు. ఈ విధంగానే ఆ గుడ్డిపిల్లకు ట్రాంప్ చాలా ధనవంతుణ్ణి అని నమ్మిస్తాడు. ఆ అమ్మాయి చూడలేదుకదా.

'సిటీ లైట్సు' మొదలు పెట్టాను. ఒకరోజు పని పూర్తిచేసి డగ్లస్ దగ్గరకు వెళ్లాను. అక్కడ స్టీమ్‌బాత్ చేసి కూర్చుండగా చాలామంది స్నేహితులు, దర్శకులు నా చుట్టు చేరి జిన్ తాగుతూ "నీకు చాలా ధైర్యం. ఇప్పుడు మూకీ తీస్తున్నావు" అని అన్నారు.

పూర్వం నేను సినిమా తీస్తుంటే నిర్మాతలూ, దర్శకులూ ఎంతో ఉత్సాహంతో నా పని గురించి అడుగుతుండేవారు. ఇప్పుడు అందరూ ఈ టాకీ సినిమాల గోలలో పడి ఎవర్నీ పట్టించుకోవటంలేదు. ఇప్పుడు ఇక్కడ నేను ఒంటరివాడుగా కనపడుతున్నాను!

జో షెంక్ కి ఈ టాకీలు ఏమాత్రం ఇష్టం లేదు. కాని ఇప్పుడు మారిపోయాడు. "చార్లీ, నీకు నాకూ ఇష్టమున్నా లేకపోయినా ఈ టాకీలు రాజ్యమేలతాయి" అన్నాడు. అంతేకాదు తీస్తేగీస్తే చాప్లిన్ ఒక్కడే మూకీ తీసి జెండా ఎగురవేయాలి. ఇది నాకు కాస్త వూరట! అంతేకాదు అన్ని పత్రికల్లో 'మూకీల పని అయిపోయింది' అనే రాస్తున్నాయి. 'చార్లీచాప్లిన్ పని అయిపోయినట్లే' అని కూడా అంటున్నాయి!

ఏది ఏమయినా నా దృష్టిలో 'సిటీ లైట్స్' మూకీ చిత్రంగానే తీయాలి. ఆ కథా కథనం అలాంటివే. అందుకని ఆ ప్రయత్నం మానుకోలేదు. కాని నాకు చాలా సమస్యలు చుట్టుముట్టాయి. అప్పటికే టాకీలు వచ్చి మూడేళ్లు అయింది. చాలామంది నటీనటులు మూకీ నటన మర్చిపోయారు. వాళ్ల నటన టైమింగ్ అంతా టాకీలకు అలవాటయిపోయింది. ఇంకో సమస్య గుడ్డిగా నటిస్తూ అందంగా వుండే అమ్మాయి దొరకటం. చాలామంది వచ్చినవాళ్లు కళ్లు పైకి పెట్టి తెల్ల గుడ్డు చూపిస్తున్నారు. ఇది చాలా నిరాశా జనకంగా వుంది. కాని అదృష్టం నన్నే వరించింది. నేను, శాంతామోనికా బీచ్‌లో ఒక సినిమా షూటింగ్ చూశాను. అక్కడ చాలామంది అందమైన అమ్మాయిలు బికినీల్లో వున్నారు. నన్ను గుర్తుపట్టి చేతులూపారు. అందులో ఒకరు 'వర్జీనియా చెర్రిల్.' అంతకుముందు నాకు పరిచయం వున్నదే. 'మీతో ఎప్పుడు పని చేయవచ్చు' అని అడిగింది. అప్పుడు చూసినపుడు ఈమె ఈ గుడ్డి పాత్రకు న్యాయం చేస్తుందని

అనుకోలేదు. కాని తర్వాత ఇద్దరితో రెండు మూడు సీనులు తీసిన తర్వాత చాలా నిరుత్సాహంతో చివరికి ఈమెకే కబురు చేశాను.

నాకు ఆశ్చర్యం – వర్జీనియ అచ్చం గుడ్డి అమ్మాయిలాగానే అనిపించింది. "చూడు – నీవు నావంకే చూస్తుండు, కాని నన్ను చూడకు. నీలోకి నీవు చూస్తున్నట్లుండాలి" అని చెప్పాను. వర్జీనియా చాలా ఫోటోజెనిక్ – చాలా అందగత్తె. కాని నటనానుభవం లేదు. ఒక్కసారి ఇదే మంచి అవకాశం. ముఖ్యంగా మూకీలకు. ఇక్కడ నటనకంటే సాంకేతిక విషయాలు ఎక్కువ ప్రాముఖ్యం కలిగించాయి. అనుభవం వున్న నటులైతే వీళ్లు అలవాటులో నుంచి బైటకు రాలేరు. అందుకని తక్కువ అనుభవంగలవారే బాగా ఇమిడిపోతారు.

ఒక సంఘటన చెప్తాను. ట్రాంప్ బాగా రద్దీ రహదారిలో దాటటానికి ఒక కారులో ఒక ప్రక్క ఎక్కి రెండో ప్రక్క నుంచి దిగుతాడు. గట్టిగా కారు తలుపు వేసినపుడు అమ్మాయి వింటుంది (చూడలేదు). 'ఇదిగో పూవు' అని ఇస్తుంది. ట్రాంప్ దగ్గర వున్న ఆఖరి నాణెం అమ్మాయి చేతిలో పెట్టి గుండీలో పెట్టె పూవు తీసుకుంటాడు. మనవాడి కంగారులో అది ఆమె చేతిలో నుంచి పడిపోతుంది. అమ్మాయి మోకాళ్ల మీద వంగి కింద వెతుకుతుంది. 'అదిగో అక్కడ' అని అంటాడు. పాపం ఆమె చూడలేదుకదా ఇంకోచోట చూస్తుంది. ఇతనికి విసుగు పుట్టి పూవు తీసి అమ్మాయి ముఖం దగ్గర పెడతాడు. అప్పుడు తెలుస్తుంది ఆమె చూడలేదని! చాలా బాధపడి క్షమాపణ అడుగుతాడు. మెల్లగా ఆమెను నుంచోపెడతాడు. ఇదంతా సినిమాలో 77 సెకండ్లు వస్తుంది. కాని మాకు అయిదు రోజులు పట్టింది మేము అనుకున్నట్లు తీయటానికి. దాంట్లో ఆమె తప్పు ఏమీ లేదు. నేనే బాగా రావాలి అనే ఒక పిచ్చితో మళ్లీ మళ్లీ తీసాను. ఈ 'సిటీ లైట్సు' సినిమా ఒక సంవత్సరకాలం తీశాను. అది మూకీ. ఈలోపు టాకీలు వంద విడుదల అయ్యాయి! ఈ సంవత్సరంలో స్టాక్ మార్కెట్టు పతనమైపోయింది. నేను ఇందులో భాగం కానందుకు దాని ప్రభావం మా యునైటెడ్ ఆర్టిస్ట్స్‌మీద పడలేదు.

అప్పుడే నేను మేజర్ డగ్లస్ వ్యాసం చదివాను. 'సోషల్ క్రెడిట్'. ఆయన దాంట్లో ఆర్థిక శాస్త్ర సూత్రాల్ని చక్కగా వివరించాడు.

లాభాలన్నీ జీతాల నుంచే వస్తాయని అందులో ఒకటి. ఇది నాకు బాగా నచ్చింది. ఆ సమయంలో అమెరికాలో నిరుద్యోగం బాగా పెరిగిపోయింది. అంటే జీతాలు

సిటీలైట్స్

లేవన్నమాట. అంటే లాభాలు రావన్నమాట. ఇప్పుడున్న డబ్బున్నవాడే మొనగాడు – నేను నా దగ్గరున్న (1928) మదుపు బాండ్లు అన్నీ అమ్మేసి నగదు రూపేణ వుంచాను. అప్పుడు అమెరికాలో 140 లక్షల మంది నిరుద్యోగులు రోడ్లమీద తిరుగుతున్నారు. జీతాలు లేక! స్టాక్‌మార్కెట్టు కూలిపోయేముందు రాత్రి నేను ఇర్వింగ్ బెర్లిన్ అనే ఆయనతో విందారగించాను. ఆయన స్టాక్‌మార్కెట్టు మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. "ఇప్పుడు మన భోజనం చేసే చోట ఒక సేవకురాలు 40 వేల డాలర్లు సంపాదించింది ఒక సంవత్సరంలో, స్టాక్స్ కొని" అన్నాడు. 'నాకు కూడా చాలా లక్షల డాలర్లు ఈక్విటీలో వున్నాయి. అవి నాకు పదిలక్షల డాలర్ల లాభం తెస్తాయి' అన్నాడు. 'మీకు స్టాక్ మార్కెట్టులో పెట్టుబడులున్నాయా?' అని అడిగారు. "నాకు నమ్మకంలేదు – అందులో 140 లక్షల మంది ఉద్యోగాలు పోయి తిరుగుతున్నారు" అన్నాను. ఆయనకి సలహా కూడా ఇచ్చాను 'త్వరగా నీ స్టాక్స్ సొమ్ముచేసుకో' అని. ఆయనకు చాలా కోపం వచ్చింది. మాకు ఈ విషయంలో వాగ్వివాదం జరిగింది. 'ఎందుకు అమెరికా ఆర్థిక వ్యవస్థ మీద నమ్మకంలేదు మీకు?' అన్నాడు. 'నీకు ఏ మాత్రం దేశభక్తిలేదు' అని కూడా నిందించాడు. ఆ మర్నాడు 50 పాయింట్లు పడిపోయింది. ఇర్వింగ్ లాభాలు కొట్టుకుపోయాయి. రెండురోజుల తర్వాత మా స్టూడియోకి వచ్చి 'చార్లీ' చాలా సారీ – కానీ నీకు ఈ విషయం ముందే ఎలా తెలుసు' అన్నాడు.

ఎలాగైతే 'సిటీ లైట్స్' పూర్తిచేశాను. ఇంకా సంగీతం ఒక్కటే కూర్చాలి. రికార్డు చేయాలి. నాకు ఈ శబ్ద ప్రపంచంలో ప్రవేశం వుంది. అందుకని సంగీతం నేనే కూర్చాను. దీనికి చాలా రమణీయమైన హాయిగా వుండే సంగీతాన్ని కూర్చాలి. ఎందుకంటే ట్రాంప్ చౌకబారుగా వుంటాడు. కొంచెం బికారిలాగా వుంటాడు. దీనికి వ్యతిరేకంగా వుండాలి. శ్రావ్యమైన రమణీయమైన సంగీతాన్ని సమకూర్చాను. చాలా ఉద్వేగభరితమైన కోణాన్ని ఆవిష్కరించాను. సంగీతకారులు దీనిని సరిగా అర్థం చేసుకునేవారు కాదు. వాళ్లు నా సినిమాల్లో సంగీతం హాస్యప్రధానంగా వుండాలని అనేవాళ్లు. నేను చెప్పేవాడిని 'నాకు పోటీవద్దు' అని. సంగీతం హాయిగా, శ్రావ్యంగా, ఉద్వేగంగా వుండాలని చెప్పేవాడిని. సెంటిమెంటు కూడా మిళితం కావాలని అన్నాను. ఇది లేకుండా హాజ్‌లిట్ అన్నట్లు, ఏ కళాకృతీ పూర్తి అవదుకదా! సంగీతం కూర్చేవాళ్లు మొదట్లో నాకు తెలియదు అన్నట్లు ప్రవర్తించేవాళ్లు. రెండు సినిమాల తర్వాత వాళ్లు అందించే సంగీతంలో ఎక్కడ ఏది ఎక్కువగా వుందో ఒక సామాన్యునిలా చెప్పేవాణ్ణి. 'చూడండి ఆ డ్రమ్ములు మోత

ఎక్కువైంది, ఇదిగో ఈ బూరల గరగర బాగోలేదు' ఇలా ఖచ్చితంగా చెప్పగలిగేవాడిని. అప్పటికి ఈ సంగీత దర్శకులు, కంపోజర్లు దారిలోకొచ్చారు.

అంతా అయిన తర్వాత ఈ 50, 60 వాయిద్యాల సమ్మేళాన్ని వినటం చాలా గొప్పగా వుండేది. ఈ సంగీత సమ్మేళనం 'సిటీ లైట్' ట్రాక్‌కి మేళవించినపుడు నాకు చాలా వత్తిడిగా వుండేది. పైగా థియేటర్లో మనుషులు లేకుండా మేమే చూసేవాళ్ళం. ప్రేక్షకుల స్పందన పసికట్టడం ఎలా సాధ్యం – పైగా ఇది హాస్యప్రధానమైన సెంటిమెంటల్. రొమాంటిక్ కామెడీ ట్రాజెడీ – ఇన్ని సుగుణా దుర్గుణాల మేళవింపుతో ఈ సంగీతమెలా లీనమవుతుంది? ఈ డ్రామాని ఎలా చూస్తారు?

ఒక ప్రీవ్యూ వేశాం. థియేటర్లో సగంమంది ప్రేక్షకులున్నారు. సగం సినిమా వరకూ వారికి అంతా గందరగోళంగా వుంది. అక్కడక్కడ నవ్వులు, అదీ నీరసంగా, సినిమా నడుస్తుండగా కొంతమంది బైటకు పోవడం కూడా చూశాను. వాళ్ళిళ్ళి పోతున్నారు. 'బహుశా టాయిలెట్‌కేమో?' వాళ్ళు తిరిగి రాలేదు. బహుశా రైలుకోసం వెళ్లిపోయారేమో?

ఇంక ఆ తరువాత నేను సినిమా మీద శ్రద్ధ పెట్టలేకపోయాను. రెండు సంవత్సరాల శ్రమ. 20 లక్షల డాలర్ల ఖర్చు. నేను బైటకు వచ్చినపుడు థియేటర్ మేనేజర్ 'చాలా బాగుంది, మీరు టాకీ తీస్తే చూడాలని వుంది' అని కూడా అన్నాడు. 'నేను కాదు ప్రపంచం మొత్తం ఎదురు చూస్తోంది' అన్నాడు.

నేను నవ్వటానికి ప్రయత్నించాను. మా సిబ్బంది అంతా చల్లగా జారుకున్నారు. బైట నడక బాటమీద నాకోసం చూస్తున్నారు. నేనుకూడా వాళ్ళతో కలిసి నా మేనేజరు 'రీల్స్' ఎప్పుడు గంభీరంగా వుంటాడు. నాతో అన్నాడు – 'చాలా బాగా వచ్చింది... కానీ.....' అతను పూర్తి చేయలేదు. నేను సరే చూద్దాం అన్నట్లు తలవూపాను.

'థియేటర్లో నిండా జనం వుంటే స్పందన బాగుంటుంది. బహుశా ఒకటి రెండు చోట్ల కత్తెర్లు పడేదేమో' అన్నాను.

అప్పుడు మాకు అసలు విషయం గుర్తుకు వచ్చింది. ఇంతవరకు ఈ సినిమా మార్కెట్టు అమ్మకం గురించి ఆలోచనే రాలేదా? దానిగురించి నాకంత దిగులు లేదు. ఇప్పుడు సమస్య థియేటర్లు దొరకటం! ఇంకా నాకు బాక్సాఫీస్ దగ్గర పేరుంది. జో

షేంక్ మా కంపెనీ ప్రెసిడెంటు, ప్రదర్శకులు ఇప్పుడు అన్ని మార్చివేస్తున్నారు. మన 'గోల్డ్ రష్'కి ఇచ్చినంత కూడా ఇవ్వరు అన్నాడు. ముఖ్యమైన ప్రదర్శన శాలలన్నీ వేరే టాకీలకు బుక్కు అయిపోయాయి. అందుకని వేచి చూద్దాం అనే ఆలోచనతో నేను తొందరపడలేదు.

ఇదివరకు నా కొత్త సినిమా అంటే ప్రదర్శకులు చాలా ఉత్సాహం చూపేవారు. ఇప్పుడు అది అంత ఉత్సాహంగా లేదు.

న్యూయార్కులో థియేటర్లు దొరకటంలేదు. అన్ని థియేటర్లు న్యూయార్కులో వేరే సినిమాలకు బుక్ అయిపోయినాయి అని వార్తలొస్తున్నాయి. అంటే నా వంతువరకు వేచి వుండాలన్నమాట! అప్పటికి న్యూయార్కులో జార్జ్ యమ్. కొహెన్ థియేటర్ ఒక్క 11 వందల యాభై కుర్చీలతో, అదీ ప్రక్క వీధిలో వుంది. దీనికి అంత మంచి పేరు లేకపోవటం అందులో సినిమా నిండాలంటే కష్టం. అదీ ఎక్కువ రోజులు నడవదు. అది పూర్తిగా సినిమాహాలు కూడా కాదు. దాన్ని అద్దెకు తీసుకోవాలంటే ఆ నాలుగు గోడలు! వారానికి వెయ్యి డాలర్లు పోయేవి! అదీ ఎనిమిది వారాలు నడపాలి. మిగతా అన్నీ నేనే సమకూర్చాలి. మేనేజరు, క్యాషియరు, సైన్‌బోర్డులు ఇంకా ప్రచారం కూడా. ఇప్పటికే నేను రెండు మిలియన్ డాలర్లు పెట్టివున్నాను. ఇప్పుడు ఇదికూడా పెట్టి జూదమాడాలి – చూద్దాం!

ఈలోపు 'రీల్స్' లాస్ ఏంజెలెస్‌లో ఒక కొత్త థియేటర్ మాట్లాడాడు. ఐన్‌స్టీన్ ఇంకా అక్కడే వున్నారు. వాళ్లు సినిమా మొదటి ఆటకు వెళ్తామని కోరిక వెలిబుచ్చారు. ఆ రాత్రి మా యింట్లో భోజనం అప్పుడు థియేటర్‌కు బయలుదేరాం. ఆశ్చర్యం చాలా బ్లాక్స్ ముందునుంచి జనంతో నిండిపోయింది. పోలీసులు – అంబులెన్సులు అక్కడ తొక్కిడిగా వుంది. ఎలాగో నేను ఐన్‌స్టీన్ థియేటర్లోకి వెళ్ళాము. చాలా బాగా కట్టాడు థియేటర్.

ఎలాగైతే సినిమా మొదలయ్యింది. మొదటి సీను దగ్గర్నుంచి నవ్వులు మొదలయ్యాయి. తర్వాత ఎక్కువైనాయి. మూడు రీళ్లు వాళ్లతోపాటు మేమూ నవ్వాము. ఇంతలో సినిమా ఆపేశారు. లైట్లు వెలిగాయి. 'ఇప్పుడు మీకు ఈ థియేటర్ గొప్పదనం చెప్తాను.' అని మొదలయింది. అంతే నా కోపం నషాలానికి అంటింది. 'ఎక్కడ మేనేజరు? చంపేస్తాను రాస్కేల్' అని గట్టిగా అరిచాను. నాతోపాటు ప్రేక్షకులు

గొడవచేశారు. ఎలాగైతే మళ్లీ సినిమా మొదలయింది. గొప్ప స్పందనను ఆస్వాదించాను. ఐన్‌స్టీన్ చివర్లో కళ్లు తుడుచుకోవటం చూశాను. ఎంతటి శాస్త్రవేత్తలయి నా మనుషులే కదా – సెంటిమెంట్ల విషయంలో!

ఆ మర్నాడు న్యూయార్క్‌కు బయలుదేరాను. ఇంక పత్రికల రివ్యూల కోసం ఆగలేదు. అప్పటికి నేను న్యూయార్క్‌కు చేరేసరికి ఇంకా నాలుగు రోజులే వుంది రిలీజ్‌కి. 'మన చార్లీ మళ్లీ మీ ముందుకు వస్తున్నాడు' ఇలా చప్పగా వుంది ప్రచారం. నేను అందర్నీ పిలిచి 'మీరు ఏమీ ఆలోచించవద్దు పూర్తి పబ్లిసిటీ ఇవ్వండి. మనం ఎక్కడో దూరంగా రిలీజ్ చేస్తున్నాం. అందరికీ తెలియాలి – ఊఁ తొందరగ జరగాలి' అని వాళ్లను పరిగెత్తించాను. పత్రికల్లో 1/2 పేజీ ప్రకటనలు ఇచ్చాను. ప్రకటనలతో అదరగొట్టాను. "చార్లీ చాప్లిన్ కోవాక్ థియేటర్లో రోజంతా డాలర్ 50 సెంట్లు టిక్కెట్టు 'సిటీ లైట్స్' చూడండి. అలా 30,000 డాలర్ల పత్రికలకీ ఖర్చుపెట్టాను. థియేటర్ ముందు పెద్ద కరెంటు బానర్ పెట్టాను. దీనికి 30,000 డాలర్లు అయింది.

ఆ రాత్రికి ప్రొజెక్షన్ సరి జూశాను. ఎక్కడా పొరపాటు జరగకూడదు.

ఆ మర్నాడు పత్రికలవాళ్లను కలిశాను. టికెట్లు ఎందుకు పెంచానో చెప్పాను. అందరూ 80 సెంట్లు టిక్కెట్టు ఖరీదు. నేను 1, 1/2 డాలరు పెట్టాను. వాళ్లు 30 సెంట్లు తగ్గిస్తారు. నేను అసలు తగ్గించను. నా నమ్మకం ఇది మూకీ సినిమా, జనానికి ఇదెలా వుంటుందో అని ఉత్సాహం వుంటుంది. టికెట్టు ఖరీదు ఎందుకు ఎక్కువ పెట్టారని మరీ ఉత్సాహపడతారు. ఈ విషయంలో నేను మొండిగానే వున్నాను. మొదటి ఆట బాగా జరిగింది. కాని ఇది కాదు అసలు పరీక్ష – నిజానికి జనం ఇంకా మూకీ సినిమా చూస్తారా? మనకెందుకు ఈ బాధ అని వదిలివేస్తారా? ఆ రాత్రి నిద్ర పోవటానికి చాలా కష్టపడ్డాను. నన్ను ప్రొద్దున్నే మా ప్రచారకుడు లేపాడు. 'ఓ ఎంత గొప్ప హిట్ – చివరకు సాధించారు. ఇప్పటికీ థియేటర్ చుట్టు క్యూలో జనం వేచి వున్నారు. లోపలికి వెళ్లటానికి కొట్టుకుంటున్నారు. థియేటర్లో వాళ్ల అరుపులు మీరు వినాలి' అన్నాడు. అంతే చాలా సంతోషంతో కూడిన విశ్రాంతి నన్ను కమ్మివేసింది. ఫలహారం తెమ్మన్నాను. ఫలహారం తీసుకుని బట్టలు వేసుకున్నాను. "ఎక్కడ ఎక్కువగా నవ్వుతున్నారు? అన్నాను – అతను ఒక నిమిషంపాటు సీను చెప్పి పొట్టపగిలేలా నవ్వి గోల చేశాడు. మీరే చూడండి, అది మీ ఆరోగ్యానికి మంచిది కూడా' అన్నాడు.

నేను వెళ్ళలేదు. ఎందుకంటే ఏదీ మనం ఆలోచించినట్లు వుండకపోవచ్చు!

ఏమైనా ఒక అరగంట చూశాను. కుర్చీలు లేక వెనక నిలబడి. మధ్య మధ్యలో నవ్వులతో నా టెన్షన్ అంతా పూర్తిగా సర్దుకుంది. చాలు. ఇది చాలు. అని తృప్తిగా బైటకు వచ్చాను. ఆ ఫీలింగుతోనే న్యూయార్కు వీధులన్నీ నాలుగు గంటలు తిరిగాను నడిచి. మధ్యలో ఇంటర్వెల్ సమయానికి జనంతో కలిసి టికెట్లకోసం వేచి వున్నవాళ్లను చూసి తృప్తి పడేవాడిని. సినిమాకు అద్భుతమైన సమీక్షలు రాశారు అందరూ. వారానికి 80,000 వేల చొప్పున 3 వారాలు పూర్తి గావచ్చింది. యమ్.జి.యమ్. సినిమాకు సీట్లన్నీ నిండితే థియేటర్లో 38,000 వేలు వచ్చింది. 'సిటీ లైట్స్' పన్నెండు వారాలు ఆడింది. అన్ని ఖర్చులూ పోయి 4 లక్షల డాలర్లు వచ్చింది. ఒక్క థియేటర్లో, ఇంకా లాభాలతో నడుస్తున్నా సినిమాను తీసివేశారు. న్యూయార్కు థియేటర్లన్నీ ఈ సినిమాకోసం వేచి, మంచి ఖరీదుకే బుక్ చేసుకున్నాయి.

నేను న్యూయార్కులో వున్నప్పుడు నా స్నేహితుడు రాల్ఫ్ చార్టర్‌ని చాలాసార్లు కలిశాను. ఆయన ది న్యూయార్కర్ పత్రికా సంపాదకుడు – అప్పుడే కొత్త శీర్షిక 'బాల్‌జోక్ డ్రోల్ స్టోరీస్' మొదలుపెట్టాడు. ఆయనకు 37 సంవత్సరాలు. చాలా సంస్కారం కలవాడు. అప్పటికి అయిదుసార్లు పెళ్లి చేసుకుని కష్టాల్లో వున్నాడు. చాలా దిగులుగా వున్నాడు. ఆత్మహత్యకు కూడా ప్రయత్నించాడు. అప్పుడు నేను మాట్లాడి నాతో లండన్ రమ్మన్నాను. ఇద్దరం అంతకుముందు నేను ప్రయాణం చేసిన ఒలింపిక్ నౌకలోనే ఇంగ్లాండు యాత్రకు బయలుదేరాం.

ఇరవైరెండవ అధ్యాయం

పదేళ్ళ తర్వాత లండన్‌కు

మళ్లీ పదేళ్ల తర్వాత ఇంగ్లాండు వస్తున్నాను. నా రాకకు ఎలాంటి స్వాగతం లభిస్తుందో – నిజానికి ఏమీ గొడవ లేకుండా ఎవరికీ తెలియకుండా చేరే పనే – కాని నేను వచ్చింది 'సిటీ లైట్స్' ప్రీమియర్ షోకి ప్రచారం లేకుండా ఎలా వుంటుంది?

ఏది ఏమైనా నాకోసం వచ్చిన తక్కువ మంది జనాలను చూసి చాలా నిరుత్సాహపడ్డాను. ఈసారి కారల్‌టన్ హోటల్‌లో వున్నాను. ఇది రిట్జ్‌కంటే పురాతనమైన గొప్ప హోటల్, నాకు లండన్ ఎంత పాత ప్రదేశమో పరిచయం చేస్తుంది! – ఈ విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడటం, ఎంత కష్టమైన విషయమో తెలుస్తోంది.

ప్రతిరోజు కారల్‌టన్ హోటల్ లాబీలోకి ఏదో బంగారు కోటలో అడుగుడిన్నట్లుండేది.

లండన్‌లో సంపన్నుడుగా వుండడం గొప్ప సాహసం! అంతా వినోద ప్రపంచమే కదా! అది మొదటిరోజునే మొదలయ్యింది. అక్కడ ఒక బానర్ రాసి వుంది. 'చార్లీ మా డార్లింగ్' అని. ఇక్కడ పత్రికలు నన్ను ఎంతో ప్రేమగా చూస్తాయి. నన్ను మాట్లాడమన్నప్పుడు ఒకరు అడిగారు. 'మీరు ఎల్స్‌ట్రీ చూస్తారా?' నేను 'అదెక్కడ?' అన్నాను. వాళ్లు చాలా ఓర్పుగా అది ఇంగ్లీషు సినిమా కేంద్రం అన్నారు. నా అమాయకత్వాన్ని వాళ్లు అర్థం చేసుకున్నారు.

ఈ రెండో యాత్ర నిజంగా నాకెంతో ఆత్మీయంగా మానసోల్లాసాన్ని కలిగించే విధంగా జరిగింది. సర్ ఫిలిప్ ఫోన్ చేశారు. రాల్ఫ్‌నీ, నన్నూ ఆయన పార్క్‌లేన్ ఇంటికి ఆహ్వానించాడు. తర్వాత లింప్నె భవనానికి కూడా.

ఆయనతోపాటు హౌస్ ఆఫ్ కామన్స్‌లో భోజనం చేశాము. అక్కడే లేడీ ఆస్టర్‌ని కలిశాము. ఆమె మమ్మల్ని సెయింట్ జేమ్స్ స్క్వేర్‌లో ఆమెతో విందుకు రమ్మంది.

అక్కడ స్వాగతం చెప్పేచోటు మేడమ్ టస్సాడ్‌కి సంబంధించిన హాల్ ఆఫ్ ఫేమ్‌లా అనిపించింది. అక్కడ బెర్నాడ్‌షా, బాడ్ కునాల్డ్ కీన్స్, లాయిడ్ జార్జి ఇంకా కొందరు మాకోసం ఎదురు చూస్తున్నారు.

లేడీ ఆస్టర్ ఎంతో చక్కగా సంభాషిస్తుంది. ఆమె సంస్కార సంపత్తి అద్భుతం. అంతలో ఆమెకు కబురు వచ్చింది. ఆమె వెళ్లగానే బెర్నాడ్‌షా సంభాషణ సాగించారు. ఆయన డీన్‌ఇన్‌గె గురించి చక్కని సంఘటన చెప్పారు.

డీన్‌ఇన్‌గె సెయింట్ పాల్‌ని తలకిందులుగా శిలువ వేయించాడు! దీనిలో దయ వుందీ, హాస్యం వుంది. అదీ బెర్నార్డ్‌షా!

మధ్యాహ్నం భోజనాల సమయంలో, కీన్సుతో మాట్లాడాను. ఈ మధ్యనే ఆంగ్ల పత్రికలో చదివాను బాంక్ ఆఫ్ ఇంగ్లాండు (అప్పుడు ఇది ప్రైవేటు బ్యాంకు) యుద్ధ సమయంలో అందులో వున్న అన్ని వనరులూ (బంగారం) అయిపోయినాయి. కేవలం 4000 లక్షల ఇతర దేశాల సెక్యూరిటీలు మాత్రం మిగిలాయి. అప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం 500 లక్షల పౌండ్లు అప్పు కావాలని అడిగింది! కానీ బాంకు ఏమి చేయగలదు? ఒకసారి ఇతర దేశాల సెక్యూరిటీలు (4000 లక్షల పౌండ్లు) చూసి, అవి లాకర్‌లో పెట్టి, బ్రిటీష్ ప్రభుత్వానికి అప్పు ఇస్తానని చెప్పింది. ఇలాగే చాలాసార్లు చేసింది!!

అప్పుడు కీన్సు చెప్పాడు, 'అవును దీనిలో చాలా నిజం వుంది.'

నాకు అర్థం కాలేదు. 'కాని ఈ అప్పు ఎలా తీరింది?' అని అడిగాను.

ఆయన నవ్వి, అదే 'ఊహాత్మకమైన సొమ్ముతోనే' అన్నాడు.

భోజనాలు ముగుస్తుండగా, లేడీ ఆస్టర్ ఆమె పెట్టుడు పళ్లు పెట్టుకుని విక్టోరియన్ యువతిలాగా మాట్లాడి హాస్యం పండించింది. అదీ గుర్రాల సర్కస్‌లో మాట్లాడినట్లు!! ఆ పెట్టుడు పళ్లతో ఆమె ముఖాన్ని ముప్ఫయి వంకర్లు తిప్పి చాలా గమ్మత్తు కల్పించింది! అప్పుడు ఆమె "మా రోజుల్లో బ్రిటీష్ యువతులు అన్ని విషయాల్లో ఆడవాళ్ల మాదిరిగా వుండేవాళ్ళం. ఇప్పుడు అమెరికా అమ్మాయిల్లాగా కాళ్లు చాపుకుంటూ ఊపుకుంటూ ఎగబడే వాళ్లం కాదు. మేము ఎప్పుడూ ప్రక్కప్రక్కనే గంభీరంగ ఆడతనంతో నవ్వుతూ

వుండేవాళ్ళం తెలుసా?!" అంది. నాకనిపించింది ఈమె గొప్ప నటిగా రాణించేది అని.

భోజనాలు ముగించి అందరూ వెళ్లిపోతున్నారు. అప్పుడు ఆమె మమ్మల్ని ముస్సింగ్స్ వేసిన బొమ్మ దగ్గరకు తీసుకు వెళ్ళింది. అప్పుడు మమ్మల్ని ముస్సింగ్స్ లోపలికి రానివ్వటానికి ఇష్టపడలేదు. కాని లార్డ్ ఆస్టర్ ఆయన్ను ఒప్పించాడు. ఆ బొమ్మ అద్భుతంగా వుంది. లార్డ్ ఆస్ట్టర్ వేట దుస్తుల్లో, చుట్టూ వేటకుక్కలతో ఆ చిత్రం అప్పుడే పూర్తవుతోంది. 'ఆహా! దీనిలో కదలికలు సంగీతాన్ని వినిపిస్తున్నాయి' అన్నాను. దానితో ముస్సింగ్స్ చాలా సంతోషించి, ఆయన మిగతా బొమ్మలుకూడా చూపించాడు!!

ఆ తర్వాత రెండు రోజులకు బెర్నార్డ్‌షా ఇంటికి భోజనానికి వెళ్లాం! తర్వాత ఆయన నన్ను తన లైబ్రరీలోకి తీసుకు వెళ్ళాడు. మేమిద్దరమే వున్నాము. మిగతావాళ్ళంతా లివింగ్ రూంలోనే వుండిపోయారు. ఆ గ్రంథాలయం చాలా వెల్తురులో వెలిగిపోతోంది. అక్కడ నుంచి ధేమ్స్ నదిని చక్కగా చూడవచ్చు. అంతలో అక్కడ షా పుస్తకాలు కనిపించాయి. నేను ఒక్కసారిగా (అప్పటికి నేను షాని చదవలేదు) 'మీ పుస్తకాలు!' అన్నాను. అప్పుడు నాకు అనుమానం వచ్చింది. నన్ను ఆయన పుస్తకాల గురించి అడిగితే ఏమి చెప్పాలి? అని. నేను ఎంతగా కోరుకున్నానో మిగతా అతిథులు కూడా వస్తే బాగుండునని, కాని మా మధ్య పెద్దగా మాటలు జరగలేదు. నేను 'మీ గది చాలా బాగుంది' అంటూ మిగతా అతిథుల్ని కలిశా!

ఆ తర్వాత నేను చాలాసార్లు షా భార్యను కలిశాను. ఆమెతో షా నాటకం 'ది ఆపిల్ కార్ట్' గురించి మాట్లాడాను. దీనికి పెద్దగా పేరు రాలేదు అంది. ఆమెకు చాలా కోపం వచ్చింది కూడా. "నేను జి.బి.తో చెప్పాను – మీరు నాటకాలు రాయటం మానివేయండి. మీ నాటకాలు చదివే అర్హత ఈ జనాలకు లేదు' అని."

తర్వాత మూడువారాలు చాలా హడావుడిగా గడిచిపోయింది. రోజూ విందులూ వినోదాలే. ఒకసారి ప్రధానమంత్రి రామ్‌సే మరోసారి చర్చిల్‌తో మరొకసారి మాక్ డొనాల్డ్‌తో, లేడీ ఆస్టర్‌తో, ఇలాగే అవి రాచరికపు అధికార గణాలతో గడిచిపోయింది.

మొదటిసారి చర్చిల్‌ని, మేరియన్ డౌవాన్ బీచ్‌లో బాల్‌రూంలో 50 మంది అతిథుల సమక్షంలో కలిశాను. అప్పుడు నా స్నేహితుడు హార్ట్స్‌తోపాటు వచ్చాడు. ఆ గుమ్మంలో

నెపోలియన్ లాగా నిలబడ్డాడు! అక్కడ జరిగే నృత్యం చూస్తూ, కోటు జేబులో చేయి పెట్టుకుని నిలబడ్డాడు. ఆయనకు ఇక్కడ స్థానం లేనట్లే అన్పించింది. నన్నుచూసి దగ్గరకు రమ్మని పిలిచాడు. ఆయన ప్రవర్తన ఆత్మీయంగా వున్నా అన్నీ హఠాత్తుగా చేస్తున్నట్లుంది!

మా యిద్దర్నీ వదిలి అవతలికి హార్ట్స్ వెళ్ళాడు. మేమిద్దరం ఒకరి ఎదురుగా ఒకరం నిలబడ్డాం. మా చుట్టూ అతిథులు తిరుగుతున్నారు. నేను బ్రిటీష్ లేబర్ ప్రభుత్వం గురించి అడిగేవరకూ ఆయన ముఖంలో వెలుగు చూడలేదు.

"నాకర్థం కానిది ఇక్కడ ఎవరు గెలిచినా రాజూ, రాణీ గార్ల స్థానాలు మారవు కదా!" అన్నాను. అప్పుడు 'అవును అది నిజమే' అన్నాడు. చిన్నగా నవ్వుతూ, "నా వుద్దేశ్యంలో సోషలిస్ట్‌లకు ఈ రాజరికంమీద నమ్మకం లేనట్లుంది!" అన్నాను. ఆయన నవ్వాడు – "నీవు ఇంగ్లాండులో వుంటే నీ తల తెగిపడేది – ఈ మాటకు, తెలుసా?" అన్నాడు.

తర్వాత ఒకరోజు నన్ను సాయంత్రం భోజనానికి రమ్మన్నాడు. అదీ ఆయన బస చేస్తున్న హోటల్‌కి! ఇంకా ఇద్దరు అతిథులున్నారు. ఆయన కొడుకు రాండాల్ఫ్ కూడా. అప్పుడతనికి 16 ఏళ్లు. అందంగా వున్నాడు. అతనికి మా వాదనలు అంతగా రుచించటం లేదు. పైగా వయసుకు వుండాల్సిన అసహనం కూడా వుంది. చర్చిల్‌కి అతన్ని చూస్తే చాలా గర్వంగా వుండేది!

వారితో నాకు చాలా సరదా అయిన సాయంత్రం గడిచింది. తర్వాత చాలాసార్లు కలిశాం. తర్వాత రాండాల్ఫ్ తిరిగి వెళ్లిపోయాడు. ఆ తర్వాత నేనూ చర్చిల్ లండన్‌లో వుండిపోయాం. వారాంతానికి నన్ను, రాల్ఫ్‌నీ చార్ట్‌వెల్ రమ్మని ఆహ్వానించాడు. అక్కడికి వెళ్ళటం, చలిలో చాలా కష్టంగా చేరాం. అది చాలా పురాతనమైన బంగ్లా. చాలా బాగా మంచి అందంగా అలంకరించి వుంది. అదీ కుటుంబంతో వుండే వాతావరణమే. ఈ సమావేశం తర్వాతే నాకు చార్చిల్ అర్థమయ్యాడు. అప్పుడు ఆయన హౌస్ ఆఫ్ కామన్సులో చివర్లో కూర్చునేవాడు.

సర్ విన్‌స్టన్ చర్చిల్ మనందరికంటే జీవితంలో ఎక్కువ అనుభవం వున్నవాడు. జీవితంలో ఎన్నో పాత్రలు పోషించాడు. ధైర్యశాలిగా, ఉత్సాహకరంగా, ఉల్లాసంగా,

చాలా గొప్పగా జీవించాడు. ఎంతో అధికారంతో గడిపాడు. ప్రపంచంలోని సౌఖ్యాలూ అందరూ అన్ని చూశాడు. జీవితం ఆయనకు పూలబాటగా గడిచింది. అతనన్నీ గెలిచాడు. ఎంతో అధికారాన్ని అనుభవించినా, ఆ అధికారం ఆయన్ను చెడగొట్టలేదు. అంత బిజీ జీవితంలో కూడా ఆయన తన అలవాట్లను మార్చుకోలేదు. గుర్రాల స్వారీ, గోడలు కట్టటం, చిత్రాలు వేయటం అన్నీ చేశాడు. నేను భోజనానికి వెళ్లినప్పుడు అక్కడ చలిమంటపైన పెద్ద చిత్రం వుంది. నేను చూస్తుండగా 'నేనే వేశాను' అన్నాడు. 'చాలా బాగా వేశారే' అన్నాను. "అంత కష్టం ఏమీలేదు ఫ్రాంస్‌లో ఒకతను బొమ్మవేయటం చూశాను. నేనూ వేయగలను అని వేశాను!"

ఆ మర్నాడు చార్ట్‌వెల్ చూపించాడు. "ఈ గోడలన్నీ నేనే కట్టాను" అన్నాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది." చూసినంత తేలిక కాదు ఇటుకలు పేర్చటం. అయిదు నిమిషాల్లో చూపిస్తాను" అన్నాడు.

ఆ రోజు రాత్రికి విందుకు చాలామంది యువకులు పార్లమెంటు సభ్యులు వచ్చారు. వాళ్లందరూ ఆయన కాళ్ల దగ్గరే కూర్చున్నారు. ఆ రోజు బూత్‌బీ కూడా వచ్చాడు! ఇప్పుడు ఆయనే లార్డ్ బ్రెండెన్ బ్రేకన్ కూడా వచ్చారు. తర్వాత లార్డ్ బ్రేక్కెన్‌గా అయ్యాడు!

అపుడు చెప్పాను నేను గాంధీని కలుస్తాను అని – (అప్పుడు ఆయన లండన్‌లో వున్నాడు) "ఇప్పటివరకు ఈయనకు చాలా చేశాము. ఆయన నిరాహార దీక్ష చేసినా ఇంకేమీ చేసినా ఆయన్ను ముందు కారాగారంలో పెట్టాలి. అక్కడే వుంచాలి" ఉన్నాడు బ్రాకెన్. "లేదంటే మనకు ఇండియా పోయినట్లే."

"కారాగారంలో పెట్టడం చాలా చిన్న విషయం. అది ఎలా పనిచేస్తుంది?"

"మీరు ఒక గాంధీని కారాగారంలో పెడితే మరో గాంధీ వస్తాడు" అన్నాను. "ఆయన అక్కడి ప్రజలకు ప్రతినిధి. వాళ్ల ఆశలకు దీపం" అన్నాను. "ఒక గాంధీనుంచి మరో గాంధీ వస్తూనే వుంటారు" అన్నాను.

చర్చిల్ నా వంక చూసి మీరు మంచి లేబర్ సభ్యులుగా వుండదగినవారు" అన్నారు.

చర్చిల్ వ్యక్తిత్వంలోని గొప్ప విషయం – ఆయన ఓర్పు. ఎదుట వారిని గౌరవించే గుణం! ఆయన అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా, మిమ్మల్ని పూర్తిగా వింటారు.

గౌరవిస్తారు. ఇది చాలా మంచి గుణం. ఆ రాత్రి బూత్‌బీ, బ్రాకెన్ వెళ్లిపోయారు. మర్నాడు నేను చర్చిల్‌ని చాలా దగ్గరగా గమనించగలిగాను. అదీ ఆయన కుటుంబంతో. అప్పుడు ఇంగ్లాండులో రాజకీయంగా చాలా అనిశ్చితి నెలకొంది. మేము వుండగానే లార్డ్ బీవెర్ బ్రూక్, చర్చిల్ కోసం ఫోన్ చేశారు. భోజనం చేస్తుండగా కూడా అంతరాయం గలిగించారు. అప్పట్లో ఎన్నికల జరగబోతున్నాయి. ఇంగ్లాండు ఆర్థిక సంక్షోభంలో వున్నది కూడా.

నేను చాలా ఆశ్చర్యపోయాను. ఆయన భోజనం చేస్తుండగా ఎన్నోసార్లు ఫోన్ వచ్చేది. విసుగు లేకుండా వెళ్లి మాట్లాడి వచ్చేవారు. మళ్లీ భోజనం కానిచ్చేవారు. మిగతా కుటుంబ సభ్యులకు ఇది మామూలు విషయంలాగానే అలవాటయిపోయింది.

"ఇప్పుడు మంత్రివర్గం దేశ ఆదాయ వ్యయాలను తయారు చేస్తుంది. అది ఒక పట్టాన తేలటంలేదని ఫోను చేస్తున్నారు." భోజనాల బల్ల దగ్గర కుటుంబ సభ్యులందర్ని కాస్త అనుమానంగా చూస్తూ అన్నారు. అప్పుడు నా వంక చూసి ఇంక ఇప్పుడు పన్నులు వేసే అవకాశం లేదు. ఖర్చులు తగ్గించే అవకాశం ముందే లేదు.

"అంటే మీరు టీ పొడిమీద పన్నువేస్తే ఈ బడ్జెటు సరిపోతుందా?" అని అడిగాను.

ఆయన 'అవును' అనే సమాధానం చెప్పారు. ఆయన వున్న కార్ట్‌వెల్ భవనం చాలా సాదాసీదాగా వుంది. ఆయన చదువుకునే గదీ పడకగదీ రెండూ ఒకటే. గదినిండా పుస్తకాలు గుట్టలుగా వున్నాయి. ఒక ప్రక్క పూర్తిగా పార్లమెంటు రిపోర్టులున్నాయి. నెపోలియన్ మీద కూడా చాలా పుస్తకాలున్నాయి. "అవును, నాకు నెపోలియన్ అంటే చాలా గౌరవం ఆరాధన" అన్నాడు.

అప్పుడు 'నీవు నెపోలియన్ సినిమా తీస్తున్నావని విన్నాను?' అడిగారు. అవును చెయ్యాలి చాలా హాస్యానికి ఆస్కారం వుంది అన్నాను.

తర్వాత చర్చిల్ ఆయన భార్యతోపాటు క్వాగ్లీనో హోటల్‌లో భోజనం చేస్తుండగా చూశాను. ఆ ముఖంలో చాలా అసహనం కనపడుతోంది. "ఏమిటి మీరు ఈ ప్రపంచంలోని కష్టాలన్నీ మింగి బాధపడుతున్నట్లున్నారు?" అడిగాను.

"అవును ఇప్పుడే పార్లమెంటునుంచి వస్తున్నాను. జర్మనీ గురించే చర్చ నాకేమీ నచ్చలేదు. అది చాలా తీవ్రమైన విషయం. అవును తీవ్ర పరిమాణాలు జరుగుతాయి.." అంటూ ఆలోచనలో పడిపోయాడు.

లండన్‌లో గాంధీతో చాప్లిన్

తర్వాత గాంధీని కలిశాను. నాకు గాంధీ అంటే చాలా ఆరాధనా, గౌరవం. ఆయన రాజకీయ చతురతకు మొక్కవోని ఆయన మనోధైర్యాన్ని మెచ్చుకుంటాను. కాని అప్పుడు ఆయన లండన్ రావటం పొరపాటు అనుకుంటాను. ఆయన విశిష్ట వ్యక్తిత్వం ప్రాముఖ్యత అప్పటి ఇంగ్లాండు అస్థిరత్వంలో కలిసిపోయింది. ఆవిరైపోయిందనవచ్చును. ఆయన ఆధ్యాత్మిక విధానంకూడా ఎవరూ పట్టించుకోలేదు.

అప్పటి చల్లటి చీకటి లండన్ వాతావావరణంలో గాంధీ కేవలం ఒక గుడ్డపీలిక మొలకు చుట్టుకుని, అదీ చిందరవందరగా చుట్టుకుని ఆయన అసంబద్ధంగా కనిపించాడు. ఈ అవతారం పత్రికలలో వేయటానికి పనికి వచ్చింది. అవును ఎవ్వరైనా అందులోనూ గొప్పవారు, దూరానికి చాలా గొప్పగా కనపడతారు. నన్ను చాలామంది అడిగారు. 'మీరు గాంధీని కలుస్తారా' అని. అవును 'తప్పకుండా, చాలా ఇష్టం' అన్నాను.

ఆయన్ను నేను ఈస్ట్ ఇండియా డాక్ రోడ్‌లో చిన్న చిన్న ఇళ్లు ఉండేచోట ఒక చిన్న ఇంట్లో కలిశాను. అప్పటికే గుంపులు గుంపులుగా జనం వున్నారు. పత్రికల వాళ్లూ ఫోటోలవాళ్లూ చాలామంది వచ్చారు. మా యిద్దరి కలయిక మొదటి అంతస్తు ముందు గది (చాలా చిన్నది)లో జరగాలి. అప్పటికి ఇంకా మహాత్మా రాలేదు. ఈయనతో ఏమి మాట్లాడాలి అని ఆలోచిస్తున్నాను. అప్పటికే ఆయన గురించి చాలా విన్నాను. ఆ స్వాతంత్ర్య పోరాటం, కారాగార వాసం, నిరాహార దీక్ష. అహింసావాది – ఇంకా ఆయన యంత్రాలను వ్యతిరేకించటం.

ఆయన రాగానే చాలా కోలాహలం జరిగింది. ఆయన టాక్సీ దిగుతుండగా ఆయన్ను చుట్టుముట్టిన వారంతా ఆయన కట్టిన మొలగుడ్డను తాకాలని ఎగబడుతున్నారు. అది ఆ చిన్న సందులో గుంపులమధ్య చాలా వింతగా వుంది. ఆ అపరిచిత వ్యక్తి, ఈ చిన్న ఇంటి గుమ్మంలోకి రావటం అందరికీ అభివాదం చేయటం, పైకి వచ్చి కిటికీ దగ్గరకు వెళ్లి కింద అందరికీ మళ్లీ కనపడి చేయి వూపి లోపలికి వచ్చి, సోఫాలో మేము కూర్చోబోతుండగా ఒక్కసారి కెమెరాల మెరుపులు మమ్మల్ని ముంచెత్తాయి. నేను మహాత్ముని కుడి ప్రక్కన కూర్చున్నాను. ఇప్పుడు నాకు పరీక్షా సమయం ఏమి మాట్లాడాలో తట్టటంలేదు. నాకు తెలియని విషయం మీద తెలివిగా మాట్లాడాలి. ఇది ఎలా సాధ్యం? నాకు కుడి ప్రక్కన ఒక యువతి కూర్చుని వుంది. ఆమె నాతో ఏదో చెప్తోంది నాకు సగం వినపడి సగం అర్థంకాక గందర గోళంగా

వుంది. నేను తల వూపుతూనే గాంధీతో ఏం మాట్లాడాలి అని ఆలోచనతో వున్నాను. నేనే మొదలుపెట్టాలని తెలుసు. అంతలో 'అమ్మాయి నువ్వు కాస్సేపు ఆపితే చాప్లిన్ గాంధీ మాట్లాడుకుంటారు కదా' అని అధికారికంగా ఒక గొంతు వినిపించింది.

అంతే జనంతో నిండిపోయి వున్న గదిలో ఒక్కసారి నిశ్శబ్దం నిండుకుంది. మహాత్ముని ముఖంలో ఏ భావం వ్యక్తం కావటంలేదు. అప్పుడనిపించింది మొత్తం భారతదేశం నా మాటలకోసం ఎదురు చూస్తున్నట్లు. నేను గొంతు సవరించుకుని–

"సహజంగానే నా సానుభూతి అంతా మీ స్వాతంత్ర్య పోరాటంతోనే వుంది. కాని మీరు ఈ యంత్రాలను వ్యతిరేకించటమే నాకు అవగాహనకు రావటంలేదు" అన్నాను. ఆయన చిన్నగా నవ్వారు. నేను "యంత్రాలను తెలివిగా వుపయోగించుకుంటే మనిషి పడే కష్టమూ అతని బానిసత్వమూ చాలవారకూ తొలగిపోతాయికదా" అన్నాను.

"నాకర్థమయింది కానీ ఇవన్నీ సాధించాలంటే ముందు బ్రిటిష్ వాళ్లు మమ్మల్ని వదలిపోవాలి. ఇప్పటి వరకూ మమ్మల్ని యంత్రాలతోనే పాలిస్తున్నారు. అందుకని ఆ పాలన వదిలించుకోవాలంటే యంత్రాలనూ యంత్రాలతో తయారయిన వస్తువులనూ వదిలించుకోవాలి కదా! అందుకని మేము ఆ విధానాన్ని ఒక బాధ్యతగా దేశభక్తిగా ప్రచారం చేస్తున్నాము. అలాగే ఎవరి బట్టలకు కావలసిన నూలు వాళ్లు వడుకుకోవాలి, మేము ఇంగ్లాండు వంటి శక్తివంతమైన దేశాన్ని ఈ విధంగానే ఎదుర్కొంటాము.

"మాకు ఇంకా ఇతర కారణాలు కూడా వున్నాయి. మా దేశ వాతావరణం ఇంగ్లాండు వాతావరణం చాలా వ్యత్యాసం వుంది. అలాగే అలవాట్లూ అవసరాలూ కూడా వేరు. ఇంగ్లాండులో వున్న చలికీ శీతల వాతావరణానికీ చాలా యంత్ర సహాయంకావాలి. చాలా ఆర్థిక వనరులు కావాలి. మీరు తినటానికి కత్తులూ గరిటలూ కావాలి. మేము చేతులూ వేళ్ళతో తింటాం. ఇలా చాలా చాలా వ్యత్యాసం మూలంగా మౌలికమైన విషయాలు చర్చకు వస్తాయి."

నేను మహాత్ముని ద్వారా చాలా స్పష్టమైన వివరమైన పాఠం నేర్చుకున్నాను. అది భారతదేశం తన స్వాతంత్ర్య పోరాటంలో ఒక వాస్తవ దృక్పథంగల, చాలా దృఢచిత్తుని, దార్శనికుని ద్వారా ఈ సంగ్రామం ఈ పోరాటం జరగటం అదీ అహింసా మార్గంలో, చాలా ప్రశంసనీయమైన విషయంగా తెలుసుకున్నాను. అంతే కాదు గాంధీ పూర్తి

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు చక్కని నిర్వచనం చెప్పారు. ప్రతీవ్యక్తి అనవసర వస్తు విషయాలను వర్జించటం, హింస చివరికి ఆత్మహననమే అని కూడా.

అప్పటికి ఆ చిన్న గది ఖాళీ అయింది. 'మీరు మాతో వుండి మా ప్రార్థన వింటారా' అని అడిగారు. అప్పుడు మహాత్ముడు పద్మాసనంలో నేలమీద కూర్చుని ఆయన చుట్టూ ఇంకా అయిదుగురు అలాగే కూర్చున్నారు.

అది చూడటానికి చాలా ఆశ్చర్యకరమైన దృశ్యం. ఆరుగురు ఒక వృత్తంలో కూర్చొని, అదీ లండన్ పేదరికపు పేటలో, చిన్న గదిలో, అప్పుడే అస్తమించబోతున్న కావిరంగు సూర్యుని వెలుతురులో వారిని చూస్తూ నేను సోఫాలో కూర్చోవటం, వారు ప్రార్థనతో మౌనంగా అంతర్ముఖులవటం – ఎంత విరుద్ధం విషయాలు ఒకచోట చేరి! ఈ వాస్తవవాదిది ఎంతో న్యాయబద్ధమైన బుద్ధితో, రాజకీయ సత్యదృష్టిగల వ్యక్తిత్వం. ఇవన్నీ ఈ చిన్న వినీవినపడని ప్రార్థనలో కరిగిపోతున్నట్లు అనిపించింది.

'సిటీ లైట్స్' ప్రారంభోత్సవంనాడు విపరీతంగా వర్షం పడింది. అయినా జనానికి కరువులేదు. సినిమా బాగా పోయింది. నేను బెర్నాడ్‌షాతో కూర్చొని సినిమా చూశాను. మమ్మల్ని చూసి అందరూ కరతాళ ధ్వనులు నవ్వులతో కలిపి విన్పించారు. మేము ముందుకు వంగి అభివాదం చేశాము. అది మళ్లీ నవ్వులు పుట్టించింది.

చర్చిల్ సినిమా చూసేందుకు వచ్చారు. తర్వాత విందుకు కూడా వున్నారు. అప్పుడే ఆయన చిన్న ఉపన్యాసం కూడా ఇచ్చారు. 'ఇంగ్లాండునుంచి చిన్న కుర్రవానిగా బ్రతుకు ప్రపంచంలో అడుగు పెట్టి, ఆ ప్రపంచపు ప్రేమను పొందగలిగిన చార్లీ చాప్లిన్' అని గంభీరంగా ముగించారు. ఇది నేను ఎదురు చూడని గౌరవం. నేను చాలా ఆనందపడిపోయాను. ముఖ్యంగా ఆయన 'మై లార్డ్స్ లేడీస్ అండ్ జెంటిల్‌మెన్' అని సంబోధించినప్పుడు నేను మరీ పొంగిపోయాను. నేను కూడా నా స్పందనతో 'మై లార్డ్స్ లేడీస్ అండ్ జెంటిల్‌మెన్', నా స్నేహితులు మాజీ చాన్సెలర్ అని అంతకంటే ముందుకు వెళ్లలేకపోయాను. "ఆఁ! బాగుంది. మాజీ మాజీ!" అన్నారు, చర్చిల్. నాకు ఎక్స్ ఛాన్స్‌లర్ ఆఫ్ ఎక్స్ చెకర్ అనటం బాగోలేదని అంటూ ముగించాను.

లేబర్ ప్రధానమంత్రి రామసే మాక్ డొనాల్డ్ కుమారుడు మాల్కోమ్ మాక్ డొనాల్డ్ నన్నూ, రాల్ఫ్‌ని ప్రధానమంత్రిని కలవటానికి పిలిచారు. అంతే కాదు ఆ రాత్రి చెకర్స్ దగ్గర గడపమని చెప్పారు.

లండన్‌లో గాంధీతో చాప్లిన్

మేము ప్రధానమంత్రిని కలిశాము. ఆయన అప్పుడు రాజ్యాంగ బద్ధమైన నడకలో, ఆయన మెడరుమాలు, టోపీ, నోటిలో వైపు, నాలుగోది చేతికర్ర – ఈ నాలుగూ ఆయనతోపాటే – చాలా పల్లెటూరి మోతుబరిలాగా నడుస్తున్నాడు. అంతేకాదు ఆయన లేబర్ పార్టీ నాయకుడంటే నమ్మలేము.

ఆయన్ను మొదటిసారి చూసినపుడు ఒక గొప్ప గౌరవప్రదమైన పెద్ద మనిషిలాగా, ప్రధాన మంత్రి బరువు బాధ్యతలు తెలిసిన వ్యక్తిలాగా, చిరునవ్వుతో వెలిగే ముఖవర్చస్సుతో మంచి అభిప్రాయం కలిగింది. ఆ సాయంత్రం మొదటిగా కొంచెం బెరుకు అన్పించింది, ప్రధానమంత్రితో గడపడం. ఆ తర్వాత చరిత్రాత్మకమైన లాంగ్ రూంలో కాఫీ తాగటానికి వచ్చినపుడు, అక్కడ క్రామ్‌వెల్ చావు ముసుగులూ ఇంకా ఇతర వస్తువులనూ చూసి కాఫీ తాగేప్పుడు మామూలుగా మాట్లాడే వీలు కలిగింది.

అప్పుడు నేను ఆయనతో "1921లో లండన్‌లో చాలా పేదరికం వుండేది. చాలా మంది వృద్ధులు థేమ్సు నదితీరాన చలిలో నిద్రించేవారు. ఇప్పుడు అలాంటి దృశ్యాలు ఏమీ లేవు. అన్ని షాపులూ వస్తువులతో కళకళలాడుతున్నాయి. ఇదంతా లేబర్ ప్రభుత్వం సాధించినదేకదా? ఇప్పుడు ఇంగ్లాండులో సగటు ఆదాయం కూడా పెరిగింది." ఇలా నేను చెప్తున్నప్పుడు ప్రధానమంత్రి నాకు అడ్డు తగలలేదు. ఇంకా "మీ లేబర్ ప్రభుత్వం అంటే సోషలిస్ట్ ప్రభుత్వమనే కదా. మీరు రాజ్యాంగాన్ని మార్పు చేయగలరా?" అని అడిగాను.

ఆయన కాస్త హాస్యం మేళవించి "చేయగలగాలి, కాని ఇక్కడ విపరీతమైన విషయం ఏమిటంటే, ఒక్కసారి అధికారంలోకి రాగానే ఆ పార్టీ ఇక శక్తి హీనమైపోతుంది. నేను ప్రధానమంత్రి పదవి చేపట్టగానే బకింగ్‌హాం పాలెస్ నుంచి కబురు వచ్చింది. నేను వెళ్లి రాజుగార్ని చూసి అభివాదం చేశాను. అప్పుడు రాజుగారు "మీ సోషలిస్టులు నన్నేమి చేయదలుచుకున్నారు?" అని అడిగారు. "ఏమీ లేదు ప్రభూ – మీకూ, ప్రజలకూ, దేశానికీ మా చేతనయినంత శక్తివంచన లేకుండా సేవ చేయటమే" అని చెప్పి వచ్చేశాను."

ఎన్నికలప్పుడు లేడీ ఆస్టర్ నన్నూ రాల్ఫ్‌నీ ఆ వారాంతాన్ని ప్లేమౌంట్‌లో ఆమె యింటిలో గడపటానికి రమ్మంది. అక్కడే టి.ఇ. లారెన్స్‌ని కలవవచ్చు ఆయన వస్తున్నారు అని కూడా చెప్పింది. కాని లారెన్సు రాలేదు. అయినా మమ్మల్ని ఆమె ఎన్నికల ప్రసంగం వినటానికి, అదీ ఒక రేవు ప్రక్కన వున్న బెస్తవారిని వుద్దేశించి చెప్పే ప్రసంగం. ఆమె

నియోజక వర్గంలోనిది అంతకుముందు నన్ను అడిగింది 'మీరేమైనా మాట్లాడతారా' అని. అప్పుడు చెప్పాను 'నేను లేబర్ పార్టీ సానుభూతిపరుడను అని. అందుకని మీకు ఎలా ప్రచారం చేస్తాను. నేను మాట్లాడలేకపోతేనే మంచిది' అని కూడా అన్నాను. అయినా పర్వాలేదు మాట్లాడమని అడిగింది. 'వాళ్లు మిమ్మల్ని చూస్తారు, మీ మాటలు వింటారు' అని కూడా అంది. అది బైట ఖాళీ ప్రదేశంలో పెట్టిన సభలాంటిది. మేము పెద్ద లారీ ఎక్కి మాట్లాడాము. అక్కడున్న బిషప్‌గారు కొంచెం కోపంగా వున్నట్లున్నారు. అయినా మాకు స్వాగతం చెప్పి లేడీఆస్టర్‌ను మాట్లాడమన్నారు. ఆమె పరిచయ వాక్యాలు పలికి నన్ను మాట్లాడమన్నారు.

నేను "స్నేహితులారా ఎలా వున్నారు?" అన్నాను. "మీతో ఇలా మాట్లాడడం మాకు చాలా బాగుంది. డబ్బున్నవాళ్లు మిమ్మల్ని ఓట్లు వేయమంటారు – కాని మా పరిస్థితులు చాలా వేరే విధంగా వుంటాయి." అంతలో బిషప్‌గారు 'బ్రేవో' అని అరిచారు. "మీకూ లేడీ ఆస్టర్‌కీ చాలా సామ్యముంది. అదేమిటో నాకంటే మీకే బాగా తెలుసు" అన్నాను. 'ఆహా బాగుబాగు' అన్నారు బిషప్. "ఇంతవరకు లేడీ ఆస్టర్ మీకెంతో సేవ చేసింది. అది మీకూ చాలా తృప్తి నిచ్చింది అనుకుంటాను" అని ముగించాను. బిషప్ ఎంతో సంతోషంగా నాచేతినందుకుని వూపాడు.

ఇంగ్లీషు చర్చి స్వాములు చాలా నిజాయితీగల వారు. అది ఇంగ్లీషు రక్తంలోనే వుంది. డా. హోల్వెట్ జాన్సన్, కెనాన్ కోలిమ్స్ ఇందుకు తార్కాణం! వారూ, ఇలాంటివారూ చర్చిని రక్షించారు!!

నా స్నేహితుడు రాల్ఫ్ – కొంచెం వింతగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. నా గదిలోని ఎలక్ట్రిక్ గడియారం ఆగిపోయింది. దాని వైర్లు కత్తిరించి వున్నాయి. నేను ఈ విషయం చెప్పినప్పుడు రాల్ఫ్ 'అవును నేనే కత్తిరించాను. ఆ గడియారం టిక్‌టిక్ వినలేక పోతున్నాను" అన్నాడు. నాకు కొంచెం ఆశ్చర్యంతోపాటు కంగారుకూడా పుట్టింది. అది రాల్ఫ్ పిచ్చి చేష్టలు క్రింద జమకట్ట అక్కడితో వదిలివేశాను. మేము న్యూయార్కు వదిలివచ్చిన దగ్గర్నుంచి అతను పూర్తిగా కోలుకున్నాడని అనుకున్నాను. ఇప్పుడు అతను అమెరికా వెళ్లిపోతానని అన్నాడు.

వెళ్లేముందు తనకూతుర్ని చూసి వెళ్తానని అన్నాడు. ఆమె కాథలిక్ కాన్వెంటులో హాక్నేలో వుంటోంది. ఈమె పెద్ద కూతురు మొదటి భార్యతో. కూతురు గురించి చాలాసార్లు

నా దగ్గర ప్రస్తావన తెచ్చారు. నాకు ఫోటోగ్రాఫ్ కూడా చూపించాడు. అమ్మాయికి 16 ఏళ్లుంటాయి. చాలా అందంగా వుంటుంది. రెండు పెద్ద కళ్లూ నిండైన పెదవులూ పలంకరించినట్లుండే నవ్వూ. ఇవన్నీ ఫోటోలోనే చూశాను. ఆమెను నన్‌ని కాకుండా వుండేందుకు చాలా ప్రయత్నం చేశారు. పారిస్ తీసుకు వెళ్లారు. అక్కడి రాత్రి డాన్సుల కాబెరేలు ఎన్నో సరదాలు చూపించారు కాని చివరికి ఆమె యోగినిగా మారటానికి మొగ్గుచూపింది. కాన్వెంటు చాలా చీకటిగా వుంది. హాక్నే అనేది చాలా బీద ప్రదేశం. కాన్వెంటు భవనం కూడా నల్లగా వుంది. మేము వెళ్ళినపుడు మదర్ సుపీరియర్ వచ్చి పలకరించింది. చిన్న పనికి రాని గదిలోకి తీసుకువెళ్లింది. అక్కడ కూర్చొని వేచి వున్నాము. అంతలో రాల్ఫ్ కూతురు వచ్చింది. నేను ఆమెను చూసి అదిరిపోయాను. బొమ్మలోకంటే కూడా అందంగా వుంది. నవ్వినపుడు రెండు ప్రక్కపళ్ళు లేవు.

మేము ముగ్గురం గదిలో మాటా పలులూ లేకుండా కూర్చున్నాము. రాల్ఫ్ చాలా చక్కటివాడు. పట్టణవాసి. కేవలం 37 సంవత్సరాల వయస్సు. కాలు మీద కాలు వేసుకుని సిగరెట్టు కాలుస్తున్నాడు. అతని కూతురు, 19 సంవత్సరాలు. యవ్వనంలో వుండి అందంగా వుండి మాముందే కూర్చుంది సన్యాసినిగా మారి. నేను వెంటనే అక్కడనుంచి వెళ్లిపోయి కారులో కూర్చుంటానని చెప్పాను. కాని ఎవ్వరూ వినలేదు. అమ్మాయి చాలా ప్రకాశమానంగా వుంది. పుష్టిగా కూడా వుంది. కాని జీవితం నుంచి వేరుపడినట్లుగానే కనపడుతోంది. అక్కడ స్కూలు టీచరుగా పనిచేస్తున్నానని కాస్త బెదురుగా చెప్పింది. "చిన్న పిల్లలకు చదువు చెప్పటం చాలా కష్టం" అంది. "కాని నాకు అలవాటయి పోతోంది" అంది.

రాల్ఫ్ చాలా గర్వంగా చూశాడు ఆమెవంక. సిగరెట్టు పీలుస్తూ ఇతను మూఢునిలాగా, అతని కూతురు యోగిని అయినందుకు గర్విస్తున్నాడు. ఇది దారుణంకదా. ఆమె నిజానికి తాత్వికమైన ఆలోచనలలోకి వెళ్లిపోయినట్లే వుంది. ఎంత అందంగా వుందో, అంత విచారంగా వుంది. ఎంత యౌవనంలో వుందో అంత యోగినిలా తయారయింది. "నేను, నాన్న భార్యల చిట్టా గుర్తుపెట్టుకోలేకపోయాను. ఒకరా ఇద్దరా అయిదుగురు కదా!" అంది. మేమిద్దరం నవ్వుకున్నాం. రాల్ఫ్ "నువ్విక్కడే వుండిపోతావా?" అన్నాడు.

"లేదు నన్ను సెంట్రల్ అమెరికా పంపవచ్చు. అయినా ఎప్పుడూ ముందుగా చెప్పరు" అంది.

"నువ్వు అమెరికా వస్తే మీ నాన్నకు తెలుపు" అన్నాను. "మేము ఎవ్వరికీ ఉత్తరాలు రాయకూడదు."

"నీ తల్లిదండ్రి కూడానా?"

'అవును' అంది.

మేము వెళ్ళవలసిన సమయం దగ్గరయ్యింది. ఆమె వాళ్ల నాన్న దగ్గరకు వచ్చి చేయి పట్టుకుంది. చాలా ఉద్వేగభరితమైన దృశ్యం. తర్వాత మేము అక్కడ నుంచి కదిలాం. రెండు వారాల తర్వాత రాల్ఫ్ న్యూయార్క్‌లో, అతని అపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు.

అప్పుడు, నేను, హెచ్.జి. వెల్స్‌ని తరచూ కలుస్తున్నాను. ఆయనకు బేకర్ వీధిలో ఒక ఇల్లు వుండేది. అక్కడ ఆయన్ను చూడటానికి వెళ్ళినప్పుడు ఆయనకు నలుగురూ ఆడ కార్యదర్శులుండేవారు. వాళ్లు పుస్తకాల్లో మునిగిపోయి, వివరాలకోసం వెతుకుతూ నిఘంటువుల లోతుపాతులు చూస్తూ, సాంకేతిక విషయాలను సేకరిస్తూ, అన్నీ కాగితాలమీద రాస్తూ, హడావిడిగా వున్నారు. అది 'ది ఎనాటమీ ఆఫ్ మనీ', కొత్త పుస్తకం కోసం పనిచేస్తున్నారు.

"మీకంటే వాళ్లే ఎక్కువ పనిచేస్తున్నట్లుంది?" నవ్వుతూనే అన్నాను. పెద్ద పెద్ద బిస్కెట్టు డబ్బాలున్నాయి. వాటిమీద, 'స్వీయకథ కాగితాలు' అనే ఉత్తరాలు అనీ, తత్వశాస్త్రమనీ, శాస్త్ర విషయాలు అనీ ఇలా ఎన్నో రాసి వున్నాయి. 'పెద్ద పరిశ్రమలాగానే వుంది' అన్నాను.

రాత్రి భోజనం తర్వాత కొంతమంది స్నేహితులు వచ్చారు. వాళ్లలో ప్రొఫెసర్ లాస్కి – ఈయన చాలా చిన్న వయసులో వున్నట్లే వుంది. హెరాల్డ్ చాలా బాగా మాట్లాడుతాడు. అతను అమెరికన్ బార్ అసోసియేషన్‌లో మాట్లాడటం విన్నాను కాలిఫోర్నియాలో. దాదాపు గంటసేపు ధారాళంగా ఉపన్యాసం ఇచ్చాడు. ఆ రోజురాత్రి, హెచ్.జి. వెల్స్ ఇంట్లో, హెరాల్డ్ నాతో ఇప్పుడు తత్వశాస్త్రంలో వచ్చిన కొత్త విషయాల గురించి చెప్పాడు. నిజ జీవితంలో కాస్త వేగం పెరిగితే దాని ప్రభావం అన్నింటిమీద ఎన్నోరకాలుగా వుంటుందని అన్నాడు. హెచ్.జి. వెల్స్ నిద్ర సమయం వరకూ, ఎంతో

చక్కగా అన్ని విషయాలూ మాట్లాడుకున్నాం. వెల్స్ ఎంతో సౌమ్యంగా మావంక చూసి, తర్వాత తన గడియారం వంకచూశాడు. అంతే మేమంతా మెల్లగా సర్దుకున్నాం!

1935లో కాలిఫోర్నియా వచ్చినపుడు హెచ్.జి. వెల్స్ నన్ను కలిశారు. నేను ఆయన్ను చాలా విసిగించాను. రష్యాను విమర్శించటంపై ఆయన రాసిన వ్యాసాలు చదివాను. రష్యాను విపరీతంగా విమర్శించి ఏకిపారేశాడు. ఇప్పుడుకూడా అదే అభిప్రాయంతో వున్నాడు. "అప్పుడే ఎలా చెప్పగలం? వాళ్ల సిద్ధాంతం సరైనదో, కాదో తెలియటానికి సమయం కావాలి కదా! వాళ్లకీ చాలా వ్యతిరేకత వుంది. ఇంటా బయటా ఇవన్నీ సర్దుకోవటానికి సమయం కావాలి." అన్నాను.

అప్పుడు వెల్స్ 'రూజ్‌వెల్ట్ న్యూ డీల్ ద్వారా సాధించింది చాలా ఎక్కువ' అని అన్నాడు. అమెరికాలో కూడా పెట్టుబడిదారీ విధానం అంతరించి అర్థసోషలిజమ్ రావటానికి ఎక్కువ అవకాశం వుంది. ఈయన ముఖ్యంగా స్టాలిన్‌ని విమర్శించేవాడు. ఆయన్ను హెచ్.జి. వెల్స్ కలిసి మాట్లాడాడు. ఆయన కఠినాత్మకమై నిరంకుశత్వాన్ని సహించలేనన్నాడు. "మీరు సోషలిస్టు అయితే ఒక విషయం నమ్మాలి, పెట్టుబడిదారీ విధానం అంతరిస్తుందని, సోషలిజమ్ కూడా పనిచేయకపోతే ఇంక రష్యా గతి ఏమిటి?" అన్నాను. "సోషలిజమ్ రష్యాలో విఫలమవదు ఎక్కడా విఫలమవదు. కాని దాన పర్యవసానం నిరంకుశత్వం కారాదు" అన్నాడు.

"అవును రష్యా తప్పులు చేసింది, మిగతా దేశాలలాగే ఇంక ముందుకూడా చేస్తుంది, అందులో ముఖ్యంగా ఇతర దేశాలకు ఇవ్వవలసిన సొమ్ము ఎగ్గొట్టటం! దానికి కారణం ఆ అప్పులతో ఇప్పటి ప్రభుత్వానికి సంబంధం లేదని – అవి జార్ ప్రభుత్వం చేసినవని నమ్మించ పూనటం. దీనిలో కొంత నిజమున్నా, ఇదే వాళ్లు చేసిన పెద్ద తప్పిదం. దీనితో ప్రపంచ దేశాలన్నీ కూడా శత్రువులయిపోయాయి. ఒకరకంగా వెలివేసినాయి. ఇంకా మిలిటరీ దళాలను పంపటానికి వెనకాడలేదు. కాలగతిలో ఇదంతా చాలా భారమై పోయింది. ఇంతకంటే ఆ అప్పులు తీర్చితే సరిపోయేది!!"

నేను చెప్పింది వినటానికి బాగుంది. కాని ఆచరణ సాధ్యం కాదన్నాడు. 'జార్ అప్పులు తీరిస్తే విప్లవంలో అసలు ఆత్మ పోయినట్లే, అప్పుడు జనాభా మొత్తం తిరుగుబాటు చేసుండేది' అన్నారు.

కానీ రష్యా అప్పులు మెల్లగా తీర్చివేసి ప్రపంచంలో మంచిపేరు తెచ్చుకుని వుంటే, అంతకు రెండింతలు సొమ్ము పుట్టేది. ఇప్పుడైతే ఎవ్వరూ నమ్మరు. అవును ఇప్పుడు చాలా ఆలస్యం అయిపోయింది.

హెచ్.జి. వెల్స్‌ను నేను ఎన్నో విధాలుగా చూశాను. ఆయన దక్షిణ ఫ్రాన్స్‌లో తన రష్యన్ భార్యకోసం ఒక బంగ్లా కట్టాడు. ఆమె కొంచెం తిక్కది. గోతిక్ అక్షరాలలో ఇలా రాసి వుంది – "ఇద్దరు ప్రేమికులు ఈ ఇంటిని కట్టారు" అని.

"అవును. మేము చాలాసార్లు ఈ ఇటుకలూ, కిటికీలూ పెట్టి మళ్లీ తీసివేశాము. మేము పోట్లాడుకున్నప్పుడు, నేనూ తాపీ మేస్త్రికి చెప్పేవాడిని. 'ఈ గోడలు తీసేయ్' అని "మళ్లీ మా యిద్దరికీ రాజీ కుదిరినపుడు, ఆ తాపీ వానికే కట్టమని చెప్పేవాణ్ణి. ఆ విధంగా ఇంటిని ఎన్నోసార్లు కట్టటం, తీసివేయటం–ఇలా జరిగేసరికి తాపీ మేస్త్రికి విసుగు పుట్టి మమ్మల్ని పట్టించుకోవటం మానివేసి, ఇలా పూర్తిచేసి వెళ్లిపోయాడు!" అన్నాడు నవ్వుతూనే.

1931లో వెల్స్, 'ది అనాటమీ ఆఫ్ మనీ' పూర్తిచేశాడు. రెండు సంవత్సరాలు పట్టింది. అలసిపోయినట్లు కనిపించాడు

'ఇప్పుడు ఏం చేయబోతున్నారు?' అడిగాను.

'ఇంకో పుస్తకం రాయాలి' అన్నాడు.

'ఏమిటి మరో పుస్తకమా? మీరు విశ్రాంతి తీసుకోరా? ఇంకో పనేమీ చేయరా?'

'ఏముంది చేయటానికి?' అన్నారు.

ఆయన ఎంత గొప్పవాడో, అంత ఒదిగివుంటారు. ఒక్కసారి చిన్న అక్షరాన్ని తప్పుగా వాడినందుకే చాలా సిగ్గుపడిపోతాడు. ఒకసారి నాతో, "మా అంకుల్ ఒకరున్నారు. ఆయన చాలా గొప్ప ఇంగ్లీషు పెద్దమనిషికి తోటమాలిగా పనిచేశాడు. ఆయనెప్పుడూ నన్ను మీరు నాలాగా సేవల విభాగంలో పనిచేయండి. చాలా పైకి వస్తారు అనేవాడు. నాకు తెలుసు, నాకున్న ప్రజ్ఞకు నేను రెండో వంటవానిగా వుండేవాడిని" అంటూండేవారు.

వెల్స్ నన్ను చాలాసార్లు అడిగారు – "మీకు సోషలిజమ్ ఎందుకు నచ్చింది?' అని.

నేను అమెరికా వచ్చి అష్టన్ సెన్‌క్లయిర్‌ని కలిసే వరకు నాకు తెలియదు అన్నాను. అప్పుడు మేము పాసూనాలోని ఆయన ఇంటికి భోజనానికి కారులో వెళ్తున్నాము. నన్ను చాలా సున్నితంగా అడిగాడు 'నీకు లాభం వ్యవస్థ'లో నమ్మకముందా అని. దానికి నేను 'సమాధానం చెప్పాలంటే లెక్కలు రాసేవాడు కావాలి' అన్నాను అది చాలా క్లిష్టమైన ప్రశ్న. అప్పటినుంచి దీని అంతు చూడాలని నిర్ణయించుకుని అప్పటినుంచి రాజకీయాలను చరిత్ర పుస్తకాలకు సంబంధించినది కాకుండా ఆర్థిక విషయాలకు సంబంధించినదిగా పరిగణించటం మొదలుపెట్టాను!

అప్పుడు ఒక సంఘటన చెప్పాను. నాకు చాలా సహజ ప్రతిభ వుంది. నేనూ టెన్నిస్ ఆటగాడు హెన్రీ – ఒక బార్‌కు వెళ్లాం. అక్కడ మూడు చక్రాలు తిరుగుతున్నాయి. అప్పుడు నేను చెప్పాను. మొదటిది– తొమ్మిది దగ్గర రెండోది– నాలుగు దగ్గర మూడోది ఏడు దగ్గర ఆగుతాయి అని. ఇది నా ఫిజికల్ పవర్ అని చెప్పాను. కొంత హాస్యంగానే. కాని అవి అలాగే ఆగాయి – దీనికి హేతువు ఏమిటి?

అప్పుడు వెల్స్, అది కేవలం కాకతాళీయమే 'కాని అదే మళ్లీ జరిగితే మాత్రం దానిని పరిశోధించాలి'.

అప్పుడు నేను నా చిన్నప్పుడు జరిగిన సంఘటన ఒకటి చెప్పాను.

"నేను ఒకసారి పచారికొట్టు ప్రక్కగా వెళ్తున్నాను. అదీ కాంబెర్‌వెల్ రోడ్‌లో. అక్కడ షట్టర్లన్నీ తెరిచి వున్నాయి. రోజూ అలా వుండవు. అప్పుడు నేను ఉత్సుకతతో కిటికీ ఎక్కి లోపలికి చూశాను. అంతా చీకటిగా వుంది. ఎవ్వరూ లేరు కూడా. అన్ని పచారీ సరుకులూ వున్నాయి. అక్కడ నేలమీద ఒక పెద్ద సామాను పెట్టె వుంది. అప్పుడు నేను కిటికీ నుంచి అసమంజసపు ఆలోచనతో కిందికి దూకి నా దారిన నేను వెళ్లిపోయాను. ఆ వెంటనే ఒక హత్య వెలుగులోకి వచ్చింది. ఎడ్గార్ ఎడ్వర్డ్ అనే ఆయన 65 సంవత్సరాలుంటాయి. సత్తా వున్నవాడే. అయిదు పచారుకొట్లు స్వాధీనం చేసుకున్నాడు. అయిదుగుర్ని హత్యచేసి! నేను కిటికీలోనుంచి చూసినపుడు కనపడిన సామానుపెట్టెలో ముగ్గురి శవాలు వున్నాయన్నమాట! నేను లోపలికి వెళ్లకుండా కిటికీనుంచి దూకి ఇంటికి వెళ్ళటం చాలా మంచిదయింది కదా" అన్నాను.

కాని వెల్స్ ఇదేమీ వినడు. ఇవన్నీ మామూలు మనుషులకు మామూలుగా జరిగే సంఘటనలే, ఇందులో వింత ఏమీ లేదు. అంతటితో ఆపివేశాను. కాని ఇంకో

సంఘటన చెప్పగలిగేవాడినే. ఒకసారి నేను మంగలిషాపు దగ్గర ఆగాను. అది లండన్ బ్రిడ్జిరోడ్. ఒక గ్లాసు మంచినీళ్లడిగాను. నల్లటి మీసాలాయన నాకు మంచినీళ్లందించాడు. ఎందుకనో నేను ఆ నీళ్లు తాగలేదు. అతను అటు తిరగ్గానే నేను ఆ గ్లాసు కిందపెట్టి వెళ్లిపోయాను. రెండువారాల తర్వాత జార్జ్ చాప్‌మన్ (ఈయనే 'క్రౌన్' యజమాని) అదే రోడ్డులోని, అయిదుగురు భార్యలకూ విషంపెట్టి చంపినందుకు కేసు పెట్టారు. అతని ఆఖరి బాధితురాలు ఆ మంగలిషాపు పైనే చావుబతుకుల్లో వుంది. ఆ రోజునే నేను ఆ గ్లాసు నీళ్లు తాగకుండా అక్కడ పెట్టి వచ్చేశాను. తర్వాత చాప్‌మన్ని, నాకు మంచినీళ్లిచ్చిన ఎడ్వర్డ్‌ని ఉరితీశారు.

నేను బెవెర్లీహిల్స్‌లో బంగ్లా కట్టిన తర్వాత సంవత్సరానికి ఒక ఉత్తరం వచ్చింది. దానిలో ఒక మంత్రగాడి వంటవాడు ఒక కల గన్నాడు. అతను కలలో నేను కట్టిన ఇల్లులాంటిదే, అదీ ఒక బోటు మాదిరి వుంటుందని దానిలో ఎప్పుడూ వెలుతురు వుండాలనీ నేను ఒంటరిగా వుండకూడదనీ – ఎందుకంటే అక్కడే పూర్వకాలంలో రెండువేల ఏండ్ల కిందట రెడ్ ఇండియన్లు బలులు ఇచ్చేవారనీ అప్పటినుంచీ అక్కడ ప్రేతాత్మలు తిరుగుతున్నాయనీ జాగ్రత్తగా వుండాలనీ రాశాడు. వెలుతురుతో మనుష్యులతో వున్నంతకాలం అక్కడికి దెయ్యాలు రావనీ రాశాడు.

నేను అప్పుడు ఆ వుత్తరాన్ని పట్టించుకోలేదు. ఎవరో పిచ్చివాడి పని అని. తర్వాత రెండు సంవత్సరాలకు ఎందుకో సొరుగు తీస్తే అందులో ఆ వుత్తరం అలాగే వుంది. మళ్లీ చదివాను. అచ్చంగా ఇంటి నమూనా అలాగేవుంది. ముందు లాన్, తోట అంతా అతను వర్ణించినట్లే వుంది. అందులో రాసినట్లే కిటికీలు సరిగ్గా 40 వున్నాయి (తర్వాత నేను లెక్కపెట్టాను).

నాకు దయ్యాలంటే నమ్మకం లేకపోయినా, నేను దీని సంగతేమిటో చూద్దామనుకున్నాను. బుధవారం అందరికీ శలవు ఇచ్చాను. ఇల్లంతా ఖాళీగా వుంది. నేను బైట భోజనం చేసి వచ్చాను. ఇంటికి రాగానే ఆర్గాన్ గదిలోకి వెళ్లాను – అది సన్నగా చర్చి హాలులాగా వుంది. అన్ని తలుపులు మూసి దీపాలన్నీ ఆర్పేశాను. అప్పుడు చీకటిలో వెతుక్కుంటూ వెళ్లి నా కుర్చీలో కూర్చున్నాను. అలా పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచింది. ఆనాకారమైన ఆకారాలు నా కళ్ళముందు కదులుతున్నాయి. కాని నేను సరిగా చూస్తే అది తెరల్లో నుంచి వస్తూన్న వెన్నెల చారికలు. నేను తెరలు పూర్తిగా

మూశాను. అంతే ఆకారాలు అదృశ్యమైపోయాయి. మళ్లీ అయిదు నిమిషాలు గడిచింది. చీకటి అలాగే వుంది. ఏమీ జరగలేదు.

అప్పుడే నేను గట్టిగా 'ఇక్కడ దెయ్యాలు వుంటే కనపడవచ్చు' అన్నాను. ఏమీ జరగలేదు. "ఏమిటి మీతో మాట్లాడడానికి వీలుపడదా?" ఏదైనా శబ్దం – ఏదైనా గాలి? లేక నా తలలో ఏదైనా ఆలోచన?" ఇలా అని అయిదు నిమిషాలు చూశాను.

ఏ కదలికా లేదు. ఎటువంటి శబ్దమూ లేదు. దెయ్యాల అలికిడి అస్సలే లేదు. నిశ్శబ్దం భరించలేక లేచి భోజనాల గదిలోకి వెళ్లి దీపం వెలిగించాను. అక్కడ తెరలు మూయలేదు. వెన్నెల కాంతిలో పియానో నీడలాగా కనపడుతోంది.

అక్కడ కూర్చుని పియానో మెట్లమీద వాయించటం మొదలుపెట్టాను. అప్పుడు ఒక శబ్దం నన్ను ఆకర్షించింది. దానినే మళ్లీ మళ్లీ మోగించాను. ఆ శబ్దంతో గది అంతా నిండిపోయింది. ఈ పని ఎందుకు చేస్తున్నాను? అంతలో ఒక తెల్లని చేయి నా నడుంచుట్టూ చుట్టుకుంది. ఒక్కసారిగా లేచిపోయాను. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది.

కోలుకున్న తర్వాత దీనికి కారణమేంటి అని ఆలోచించాను. అప్పుడు ఆ పియానో ఆ కిటికీ వంపులో వుంది. కొండమీద నించి వస్తున్న కారు లైటు కిటికీలోనుంచి వచ్చి వుండాలనుకున్నాను.

అయినా మళ్లీ నేను పియానో దగ్గర కూర్చున్నాను. మళ్లీ మళ్లీ అదే పియానో మెట్లు నొక్కి కారు శబ్దం వింటున్నాను. నా కంటి చివర నుంచి భోజనాల గది తలుపు తీసి వుండటం చూశాను. ఎవరో అటుగా వెళ్లినట్లు అనిపించింది. పొట్టి గూని ఆకారం ఒకటి. అదీ సర్కస్ హాస్యగానిలాగా కళ్ళచుట్టూ గుండ్రాలు పెట్టుకుని ఆర్గాన్ గదిలోకి కదలటం చూశాను. చాలా భయం వేసినా లేచి దానివెంట వెళ్లటానికి ప్రయత్నించాను. కాని అంతలోనే అది మాయమైపోయింది. అప్పటికీ నేను నమ్మలేదు. నా కళ్ల రెప్పలమీద వెంట్రుకలు ఆ విధంగా భ్రమ కలిగించి వుండాలనుకున్నాను. పియానో గదిలోకి వెళ్లా – ఏమీ జరగలేదు – అని నిర్ధారించుకుని పడక గదిలోకి వెళ్లి అదిగో స్నానాల గదిలోకి వెళ్లాను. నేను లైటు వేయగానే అదిగో బాత్‌టబ్‌లో కూర్చుని వున్నాడు – అంతే ఒక్క గెంతులో బైటకు వచ్చాను. వాడే ఇప్పుడు ఇంకా పెద్దగా వున్నాడు! అది స్కంక్ పెద్ద నలుపు తెలుపు మచ్చల కంపుకొట్టే పిల్లజాతి జంతువు.

ప్రొద్దున్నే మా వంటవాడు దానిని పట్టుకుని ఇనుప పంజరంలో పెట్టాడు. తర్వాత అది మాకు అలవాటయిపోయింది. కొంతకాలం తర్వాత కనపడకుండాపోయింది!! అదే దెయ్యం కథ!!

నేను లండను నుంచి అమెరికా వెళ్లేముందు డ్యూకూ, డచెస్ ఆఫ్ యార్కూ నన్ను విందుకు ఆహ్వానించారు. ఆ విందు ఎంతో ఆత్మీయంగా జరిగింది. డ్యూక్, డచెస్, ఆమె నాన్నగారూ, అమ్మగారూ, సోదరుడూ (13 ఏళ్లు) అంతే.

తర్వాత సర్ ఫిలిప్ కబురు చేశారు. ఆయనకు ఆ కుర్రవాణ్ణి ఈటన్‌లో వదిలే బాధ్యత అప్పగించారని. ఆ కుర్రవాడు చాలా వినయంగలవాడు సర్ ఫిలిప్‌తో బాటే వున్నాడు. మాకు అతని స్కూలు అంతా చూపించారు. అక్కడ వున్నవాళ్లు మమ్మల్ని టీకి ఆహ్వానించారు!

అప్పుడు సర్ ఫిలిప్ నాతో రహస్యంగా "ఈ ఖర్చు వాళ్లకు అదనమే పాపం! కాని మనం ఏమీ చేయలేముకదా!"

అయినా వాళ్లు మాకోసం ఒక టీ పాట్ తెప్పించారు. మేము కాస్త త్వరగానే ఆ తంతు ముగించాము.

ఎప్పుడైనా స్కూలు బెల్లు మోగవచ్చు! ఒక్క నిమిషం మాత్రమే సమయం వుంది. అందరూ ఒక్కసారే స్కూలు గేటు నుంచి లోపలకు వెళ్లారు. లోపల మాకు హెడ్‌మాస్టరు స్వాగతం చెప్పారు. ఆయనే మాకు షెల్లీ ఇంకా గొప్పవాళ్లు వాళ్ల పేర్లు రాశారని చెప్పారు. చివరికి మాకు షెల్లీ వున్న గది కూడా చూపించారు. అప్పుడు మాతో వచ్చిన చిన్నవాడు బైటనే వుండిపోవాల్సి వచ్చింది. అంతలో మాకు స్కూలు చూపించిన సీనియర్ అతన్ని 'నీకేంకావాలి?' అని అడిగాడు. అప్పుడు మేము, మేమే అతన్ని లండన్ నుంచి తీసుకు వచ్చాము అని అన్నాడు. 'ఓ అలాగా' 'అయితే లోపలికి రా' అని మా 13 ఏళ్ల లూయిన్‌ని లోనికి రానిచ్చాడు.

అప్పుడు ఫిలిప్ అన్నాడు– "చూశారా ఇక్కడ ఎంత కఠినంగా వుంటారో – చిన్న పిల్లలు అటువంటి పవిత్రమైన స్థలాలు చూడటానికి రాకూడదన్నమాట!" అని.

తర్వాత ఒకసారి లేడీఆస్టర్‌తో ఈటన్ వచ్చినప్పుడు నాకు అక్కడి క్రమశిక్షణలోని కాఠిన్యం అర్థం అయింది. అది చాలా చలిరోజులు. మేము హాస్టలు గదులు వెతుక్కుంటూ

వెళ్లాం లేడీ ఆస్టర్ కొడుకును చూడటానికి. చివరికి అతని గదిని గుర్తుపట్టి తలుపు తట్టాము. ముఖం పాలిపోయి చలికి వణికిపోతున్న ఆమె కొడుకు తలుపు తీశాడు. లోపల ఇంకా ముగ్గురున్నారు. బొగ్గులు మండుతుంటే చేతులు వెచ్చపెట్టుకుంటూ!

నిన్ను ఈ వారాంతానికి తీసుకు వెళ్ళటానికి వచ్చాను అంది లేడీ ఆస్టర్. మేము మాట్లాడుతున్నాం అంతలో తలుపు మీద చప్పుడైంది. 'లోపలికి రండి' అన్నాం. హౌస్ మాస్టారు వచ్చాడు. అతను చాలా బాగున్నాడు చిన్నవాడే. లేడీ ఆస్టర్‌కి 'నమస్కారం' అన్నాడు కాస్త కరుకుగానే.

అతను ఆమెను ఏమీ లెక్కచేయకుండా నిలబడ్డాడు. ఆమె చివరకు 'అదీ మావాడిని వారాంతానికి తీసుకువెళ్ళవచ్చా అని అడగటానికి వచ్చా' అంది.

"చాలా కష్టం – మీరు అలా చేయకూడదు" అన్నాడు.

అప్పుడు లేడీ ఆస్టర్ "అదేమిటి? ఏముంది దీనికి అలా పెడసరంగా మాట్లాడతారు?" అంది.

"లేదండీ వున్నవిషయం చెప్తున్నాను" అన్నాడు.

"మా అబ్బాయి చాలా పాలిపోయి వున్నాడు" అంది.

"అలాంటిదేమీ లేదు – అతను బాగానే వున్నాడు" అన్నాడు.

అప్పుడు ఆమె అతని దగ్గరకు వెళ్లి "ఏమిటయ్యా దీనికే" అని అతనికి ఒక చిన్న కుదుపు ఇచ్చింది ప్రేమగానే.

అతను "సారీ, మీరు మనుష్యుల్ని పడవేసే అలవాటు మానుకోవాలి" అన్నాడు.

అంతే లేడీ ఆస్టర్ చాలా చిరాకుపడింది. దానితో ఏదో రాజకీయాలు చెప్పబోయింది. అప్పుడు అతను "ఇంగ్లాండు రాజకీయాలు ఆడవాళ్ల ప్రమేయంతో భ్రష్టుపట్టిపోయాయి" అన్నాడు.

"గుడ్‌నైట్' అని కూడా అన్నాడు.

"ఎంత చిరాకు మనిషి" అంది బయటకు వచ్చిన తర్వాత.

"అతను చాలా మంచివాడు అమ్మా" అన్నాడు వాళ్లబ్బాయి.

అంతే నేను మాస్టర్‌ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. ఎంత సీరియస్‌గా వున్నాడో అంత క్రమశిక్షణతో వున్నాడు.

నేను, అన్న సిడ్నీని చూసి సంవత్సరాలయిపోయింది. అందుకని ఇంగ్లాండు వదలి నైస్‌కి వెళ్లాను. అన్న చెప్పేవాడు 2,50,000 డాలర్లు పొదుపు చేసిన రోజునే, నేను విశ్రాంతి తీసుకుంటాను అని అంతకంటే ఎక్కువే పొదుపుచేసి వుంటాడు. కాని చాలా గట్టి వ్యాపార దృష్టిగలవాడు. అంతేకాదు మంచి సినిమాలు కూడా చేశాడు. సబ్లైయమ్ ఫైలట్, ది బెటర్ ఓల్, మాన్ ఇన్ బాక్స్, చార్లీస్, ఆంట్ ఇంతేగాక ఇంకా మరికొన్ని కూడా చేశాడు. ఇప్పుడు పూర్తిగా విశ్రాంతిలో వున్నాడు. నైస్‌లో భార్యతో సహా.

నేను నైస్ వస్తున్నానని తెలిసి ఫ్రాంక్ గిల్డ్ (ఈయనా నైస్‌లోనే వుంటారు) ఆయనతో వుండటానికి రమ్మని కోరాడు.

నైస్ వెళ్లకముందు పారిస్‌లో రెండురోజులు ఆగాను. ఆల్‌ఫ్రెడ్ జాక్‌సన్‌ను కలవటానికి ఫోలిస్ బెర్జెర్‌కి వెళ్ళాను. ఇప్పుడు జాక్సన్ బాగా సంపన్నుడయ్యాడు. ఆయనకు ఎనిమిది ట్రూపులున్నాయి. అన్నీ డాన్సింగ్ గరల్స్ ట్రూపులే. జాక్సన్ నాన్నకూడా బ్రతికే వున్నాడు. షోలిస్ బెర్జెర్ కి వస్తే వాళ్ల రిహార్సల్ కూడా చూడవచ్చు అన్నాడు. "అప్పటికీ ఆయనకు ఎనభైఏళ్లు. ఆరోగ్యంగా వున్నాడు. "చార్లీ ఎలా వున్నావు – నీకు తెలుసా నీ మంచితనం నాకెప్పుడూ గుర్తే" అన్నాడు.

అభిమానుల ఆరాధన ఎంతకాలం వుంటుంది? మనం అదే శాశ్వతమని ఎక్కువకాలం వాళ్ల మధ్యలోనే గడిపితే అది త్వరలోనే ఆవిరయిపోతుంది.

ఇప్పటి నా యాత్ర తాలూకూ స్వాగత సత్కారాల పొంగు తగ్గి పోవటం గమనించాను. దీనికి మొదటి సంకేతం పత్రికలనుంచే వచ్చింది. అవీ చాలా చెప్పుకోదగిన రాతలే.

లండన్ – పారిస్ యాత్రలన్నీ చాలా శ్రమ కలిగించాయి. నేను కొంత విశ్రాంతి కోరుకుంటున్నాను. ఆ విశ్రాంతిలో భాగంగానే నేను గౌల్ ఆతిథ్యం స్వీకరిస్తున్నపుడు నాకు ఒక ఆహ్వానం అందింది. అది లండన్ పెలాడియంలో ఒక ప్రదర్శనకు రమ్మని! నేను విశ్రాంతిలో వున్నానని 200 పౌండ్లు పంపించాను. దానితో పేచీ వచ్చింది. నేను

ఆ దేశ రాజ్యాధికారి అయిన రాజును అవమాన పరిచాననీ, రాజ్య సైన్యాన్ని చిన్నబుచ్చాననీ – పల్లేడియమ్ మేనేజర్‌ని నిర్లక్ష్యం చేశాననీ ఇవీ విమర్శలు. అంతేకాక నేను ఏదీ వెంటనే చేయలేనని కూడా రాశాయి.

తర్వాత విమర్శ ఒక వారానికే వచ్చింది. నేను టెన్నిస్ కోర్టులో నాతోపాటు ఆడవల్సిన వ్యక్తికోసం చూస్తున్నాను. అంతలో ఒక యువకుడు వచ్చి పరిచయం చేసుకున్నాడు. అతను అదీ ఇదీ మాట్లాడి చాలా చక్కని అభిప్రాయాలు వెలుబుచ్చుతున్నాడు. అతనితో చాలా విషయాలు బాహాటంగా చెప్పాను. ప్రస్తుత పరిస్థితులపైన నా అభిప్రాయాలు విపులంగా వివరించాను. కొంత నిరాశా జనకంగా ఇప్పుడు ఐరోపాలో వున్న స్థితులు మరొక యుద్ధాన్ని తెస్తాయనటంలో ఆశ్చర్యం లేదన్నాను. 'బహుశా వచ్చే యుద్ధంలో నేను పోరాడవలసి రాకపోవచ్చు' అన్నాడు. "దానిలో నీ తప్పు ఏమీ వుండదు. అస్సలు నాకు మనల్ని కష్టాలలోనికి లాగేవాళ్ళంటే గౌరవం లేదు." అన్నాను.

"వాణ్ణి చంపు – వీడికోసం చావు అని చెప్పేవాళ్ళు అస్సలు నాయకులు కారాదు. దీనికి దేశభక్తి అని పేరుపెట్టడం ఇంకా దారుణం."

ఇలా మాట్లాడుకుంటూ విడిపోయాము.

అతనిని మర్నాడు భోజనానికి రమ్మన్నాను కూడా. కాని తర్వాత ఆ ఆగంతకుడు మళ్లీ కనపడలేదు.

అప్పుడు నాకర్థమయింది. ఇప్పటివరకు నేను స్నేహితునితో మాట్లాడలేదు. ఒక పత్రికా విలేఖరితో మాట్లాడానని. అంతే పేపర్లన్నీ "చార్లీచాప్లిన్ దేశభక్తి లేనివాడు" అని గగ్గోలు పెట్టినాయి.

దీనిలో నిజం వుంది. కాని అప్పట్లో నా స్వంత అభిప్రాయాలు పత్రికల్లో రావటం నాకిష్టంలేదు. అసలు సత్యమేమంటే నాకు దేశభక్తి లేదు. ఎందుకు లేదంటే ఈ నైతిక విలువలపైన బౌద్ధికమైన హేతువులపైనా ఆధారపడి మాత్రమే. ఏది దేశభక్తి? 60 లక్షలమంది యూదుల్ని ఊచకోతకోస్తే? దీనికి దేశభక్తి అనే పేరు పెట్టారు. కొంతమంది ఇది జర్మనీలోగదా అంటారు. అని! ఇలాంటివి లేని దేశం ఒక్కటైనా చూపండి.

అలాగే దేశ గౌరవాన్ని తలెత్తుకోలేదు. ఎవ్వరైనా చక్కని కుటుంబ వ్యవస్థ నుంచి వచ్చి సంతోషకరమైన బాల్యం, మంచి ఇల్లు – పెద్ద మైదానం, అలాగే కుటుంబ



ఐన్‌స్టీన్‌తో

సంప్రదాయం ఉంటే పైన చెప్పినదానికి అర్థముండవచ్చు. కాని చిన్నతనంలో ఎలా వున్నానో, ఎలాంటి పేదరికం అనుభవించాను ఎవరికి తెలుసు? తిండికి లేక తిరిగిన రోజులు ఎటువంటి గౌరవాన్ని తెస్తాయి? నా దృష్టిలో దేశభక్తి స్థానిక అలవాట్ల మీద ఆధారపడి వుంటుందేమో? గుర్రపుస్వారీ వేట, అమెరికన్ హాంబెర్జర్స్. కోకోకోలా, కాని ఇవ్వాళ ఇవన్నీ ప్రపంచ వ్యాప్తం అయిపోయినాయి కదా. అందుకని నేను నివసించే దేశం దాడికి గురయితే (ఇవ్వాళ అదే జరుగుతోందికదా!) అప్పుడు నేను చేయవలసిన గొప్ప త్యాగం ఏమిటి? నాకు దేశభక్తి లేకపోతే ప్రేమ లేకపోతే, అప్పుడు నాజీల వంక చూడాలా? కాని ఇలాంటి నాజీ కారాగారాలు అన్నిదేశాల్లో త్వరలోనే తెరుస్తారు!

అందుకని రాజకీయ అవసరాలకోసం నేను ఎటువంటి త్యాగాలు చేయలేదు. అదీ నేను పూర్తిగా నమ్మతేనే. నేను ఎటువంటి దేశభక్తి సంబంధమైన త్యాగమూర్తినీ కాలేను. లేదా ఒక అధ్యక్షునికోసం చావటానికి సిద్ధంగా లేను. ప్రధానమంత్రి నిరంకుశుడైనా సరే!

ఆ తర్వాత ఒకటి రెండు రోజులకు సర్ ఫిలిప్, వాండర్ బిల్ట్ బాల్సెన్ ఇంటికి భోజనానికి తీసుకువెళ్ళాడు. అది చాలా అందమైన ప్రదేశం. ఫ్రాన్స్‌కి దక్షిణంగా వుంది! అక్కడ ఒక అతిథి ప్రముఖంగా కనపడుతున్నాడు. ఎత్తుగా సన్నగా నల్లజుట్టువాడు. మీసాలు చక్కగా ట్రిమ్ చేయబడి వున్నాయి. చూడటానికి చాలా చక్కగా వున్నాడు. భోజన సమయంలో అతనితోనే ఎక్కువసేపు మాట్లాడుతున్నాను. మేజర్ డగ్లస్ పుస్తకం 'ఎకనామిక్ డెమొక్రసీ' గురించి. ఈ క్రెడిట్ సిద్ధాంతం ఎలా పని చేస్తుందో ఇప్పటి సంక్లిష్టతని ఎలా తొలగించగలదో చెప్పాను.

కాన్సూల్ బాల్సన్ ఇలా అన్నాడు: "చాప్లిన్ అభిప్రాయాలన్నీ సోషలిస్ట్ అభివ్యక్తంగానే వున్నాయ్" అన్నాడు. నేను చెప్పింది ఆ పొడవాటి వ్యక్తికి బాగా నాటుకున్నట్లుంది. ఆయన ముఖంలో వెలుగు కనిపిస్తోంది. అతని కళ్లు కూడా బాగా విప్పారాయి. నేను చెప్పినవన్నీ అతను అంగీకరిస్తున్నట్లే అనిపించింది. చివరికి నేను చెప్పింది ఆయనకు నచ్చినట్లు లేదు. చాలా నిరాశ చెందినట్లు కనిపించేవాడు.

అప్పటివరకు నేను మాట్లాడింది సర్ ఆస్వాల్డ్ మోర్లేతో. ఈయనే భవిష్యత్తు బ్లాక్ షర్ట్స్ ఆఫ్ ఇంగ్లాండుకి నాయకుడవుతాడని తెలియక! అతని ముఖ కవళికలు చాలా

వింతగా వున్నాయి. తెల్లని గుడ్లు ఆయన ముఖంలో కనపడే భావం కొంచెం భయం కొలిపినాయి!

దక్షిణ ఫ్రాన్స్‌లోనే ఎమిల్ లుడ్విగ్‌ని కలిశాను. ఈయనే నెపోలియన్ జీవిత చరిత్ర చాలా విపులంగా వ్రాసాడు. బిస్‌మార్క్ గురించీ, బెల్జియావాళ్ల గురించీ కూడా. నెపోలియన్ గురించి చాలా ప్రోత్సాహంగా వ్రాశాడు. దానికి ఎక్కువగా సైకో ఎనాలిస్ జోడించాడు. అది ఎంత వరకూ వెళ్లిందంటే చివరికి కథనాన్ని మింగేసింది!

ఆయన నాకు ఒక తంతి పంపాడు. "నేను 'సిటీలైట్స్' చూశాను. చాలా బాగా నచ్చింది. మిమ్మల్ని కలవాలని వుంది" అని. నే వూహించినదానికంటే పూర్తిగా భిన్నంగా వున్నాడు. ఆస్కార్ వైల్డ్ తమ్ముడిలాగా పొడవాటి జుట్టు, నిండైన వంపైన పెదవులు. మేము ఒక హోటల్‌లో కలిశాం. ఆయన చాలా నాటకీయంగా నాకు ఒక ఆలివ్ ఆకు ఇచ్చాడు. "రోమ్‌లో వీరులకు విజేతలకు ఈ ఆకుల కిరీటాన్ని పెడతారు" అన్నాడు. నాకు ఈ పొగడ్తలోనుంచి బైట పడటానికి కొంతసమయం పట్టింది. అప్పుడు అర్థమైంది ఆయన చాలా సిగ్గరి. అది దాచుకోవటానికే ఈ నాటకం అని! ఆయన ఆ సిగ్గు తెరలోనుంచి బైటపడిన తర్వాతగాని నాకు ఆయన తెలివితేటలూ, శక్తి సామర్థ్యాలూ అర్థం కాలేదు. అప్పుడే అడిగాను జీవిత చరిత్రలు రాయాలంటే ముఖ్యమైన అంశం ఏదని. అతను జీవిత చరిత్రల్లో మూడొంతులే నిజాలు వుంటాయి. చాలావరకు బైటపెట్టరు. ఎందుకంటే మిగతాదంతా ఇతరుల జీవితాల గురించి వుంటుంది అన్నాడు.

విందులో అడిగాడు మీరు చూసిన అందమైన దృశ్యాలు ఏవి అని. నేను చాలా మామూలుగా 'హెలెన్ విల్స్ టెన్నిస్ ఆడేటప్పుడు కదలటం!' అన్నాను. దానిలో గొప్ప సొగసు, కదలికలో భావుకత, సింగార రమణీయంగా వుంటుందన్నాను. మరొకటి ఒక రైతు పొలం దున్నటం. అదీ పొలంలో వేలమంది చనిపోయిన తర్వాత కొంతకాలానికి అన్నాను. లుడ్విగ్ అప్పుడు ఫ్లోరిడాలో సూర్యాస్తమయం వర్ణించాడు. అక్కడ ఓపెన్‌టాప్ కారులో బద్ధకంగా అమ్మాయిలతో నిండి బీచ్‌లో వెళ్తుంటే, వెనక బంపర్‌మీద కూర్చుని కాళ్లు ఇసకలో గీత గీస్తూ వెళ్ళటం అని చెప్పాడు.

ఆ తర్వాత నేను ఫ్లోరిన్సులో పియాజా డెల్లా సినోరాలో అన్నాను! అది రాత్రి దీపాలకాంతి అక్కడ మైకెలేంజ్‌లో శిల్పం, డేవిడ్ చూద్దామని వెళ్లాను. కాని 'పెర్సియస్'

నన్ను బాగా ఆకర్షించింది. దాని అందం ముందు అన్నీ వెనక్కు వెళ్లిపోయాయి. 'మెడూసా' తలను పైకి ఎత్తి పట్టుకుని, విచారంతో మెలితిరిగి పోయిన తన శరీరాన్ని అతని పాదాల చెంత చేర్చి విషాదాన్ని రూపకట్టించిన 'పెర్సియస్' అందాన్ని చూసి మూర్ఛపోయాను! అప్పుడే నాకు ఆస్కార్ వైల్డ్ రాసిన మార్మికమైన వాక్యం గుర్తుకు వచ్చింది.

"అవును ప్రతివాడు తను ప్రేమించిన దాన్ని చంపివేస్తాడు." మంచికో చెడుకో జరిగే ఈ అనంతమైన సంఘర్షణలోని మార్మికతలో అతని కార్యం అంతరించిపోతుంది.

డ్యూక్ ఆఫ్ ఆల్బా నాకు తంతి పంపించారు – స్పెయిన్ రమ్మని. ఆ మర్నాడు వార్తాపత్రికలన్నీ పెద్ద పెద్ద శీర్షికలు పెట్టాయి. 'స్పెయిన్‌లో తిరుగుబాటు' అని. అందుకని ఆ ప్రయాణం మానుకుని వియాన్నా వెళ్ళాను. దిగులుగా మరీ దిగంబరంగా కనిపించే వియన్నా వెళ్ళాను. ఇప్పటికీ నా జ్ఞాపకాల పొదిలో నిలిచిపోయినది అక్కడ నాకు పరిచయమయిన అందాల రాశి. ఆమెతో నా శృంగార యాత్ర! విక్టోరియా కాలపు పుస్తకంలో చివరి అధ్యాయంలోలాగా మేమిద్దరం చాలా అనురాగ పూరితంగా వాగ్దానాలు చేసుకున్నాం. మళ్ళీ కలుద్దామని, అలా జరగదని తెలిసికూడా!

వియన్నా తరువాత వెనిస్ వెళ్ళాను. అది ఆకు రాలు కాలం. అసలు యాత్రికులు లేరు. వెనిస్ యాత్రికులతో నిండి వుంటే బాగుంటుంది – వాళ్లు చైతన్యాన్నీ, వెచ్చదనాన్నీ ఇస్తారు. వారే లేకపోతే స్మశానంలాగానే అనిపిస్తుంది. నిజానికి యాత్రికులు ఇలా ప్రదేశాలు చూడటానికి శెలవల్లో వచ్చినపుడే హాయిగా ఫ్రీగా వుంటారు. మామూలు రోజుల్లో ఆఫీసుల్లో పనికి వెళ్తూ పరుగులు పెడతారు.

వెనీస్ అందంగానూ మందంగానూ వున్నా అక్కడ రెండు రాత్రులున్నాను. ముస్సోలిని అక్కడ నృత్యాలూ సంగీతమూ నిషేధించినా, ఏవో రికార్డులు వింటూ గడిపాను. మళ్లీ వియాన్నా వెళ్ళి నా ప్రేమ వ్యవహారం కొనసాగిద్దామనుకున్నాను. కాని పారిస్‌లో 'అరిస్టాటిల్ బ్రియాండ్'ను కలుస్తానని చెప్పాను. ఈయనే ఐరోపా సంయుక్త దేశాల రాజ్యాన్ని స్థాపించాలని ప్రణాళికలు రచించాడు.

అప్పటికే ఆయన ఆరోగ్యం క్షీణించింది. మా మధ్యాహ్న భోజనాలు 'లా ఇంట్రో సిజెంటో' ప్రచురణకర్త అయిన బల్బి ఇంట్లో జరిగింది. బ్రియాండ్ తన కల నిజం

కావటంలేదని నిరాశా నిస్పృహలతో వున్నాడు. నాకు ఫ్రెంచ్ పెద్దగా రాకపోయినా బల్బితో మాట్లాడటం చాలా సరదాగా వుంది. ఇంకో అతిథి నోవాలీస్ యువరాణి – ఎంతో తేలికగా పావురంలా వుంది! చాలా సరదాగా, అందంగా మాట్లాడుతోంది – ఆమెతో బ్రియాండ్, 'ఈ మధ్య మీరు కనపడటంలేదు యువరాణీ! మర్చిపోయిన ప్రియురాలివలే చూపే కరువైంది కదా' అన్నాడు సరదాగా.

భోజనాల తర్వాత నన్ను ఎలిసీకి తీసుకు వెళ్ళారు. అక్కడ నాకు 'షేవలీర్ ఆఫ్ లీజియన్' ఆనర్ చేశారు!

తర్వాత బెర్లిన్ వెళ్లాను. అక్కడ నాకు లభించిన స్వాగతం – అభిమానుల కోలాహలం వర్ణించనలవికానిది. ఇది నాకు డగ్లస్, మేరీ వాళ్లు ఇవన్నీ తిరిగినపుడు ఒక లఘు చిత్రాన్ని తీసి నాకుచూపించారు. వాళ్లు లండన్ రావటం, పారిస్ రావటం మాస్కో రావటం వియాన్నా, బుడాపెస్ట్‌లన్ని రైల్వేస్టేషన్స్ అభిమానులు ఇలా చూపిస్తుండగా "ఏమిటి స్టేషన్లు, హోటళ్లు గాక వూరేమీ చూపించరా అన్నాను." వాళ్ళు పెద్దగా నవ్వారు.

కాని ఇప్పుడు నాకు అదే జరుగుతోంది. స్టేషన్, జనం – హోటల్ – జనం – ఇలా లోపలికి వెళ్లే అవకాశమే రావడం లేదు.

బెర్లిన్‌లో డెమోక్రటిక్ ప్రభుత్వం నాకు ఆతిథ్యమిచ్చింది. కౌంటిస్ యార్క్ అనే అందమైన యువతిని నాకు సహాయంగా వుంచారు. ఆమె జర్మన్ యువతి. అది 1931 నాజిలు అధికారంలోకి వచ్చారు రైచ్‌స్టాన్‌లో. అప్పటికే సగంపైగా పత్రికలు నాకు వ్యతిరేకంగా రాస్తున్నాయి. నేను విదేశస్తువన్నట్లు, నాకు ఈ స్వాగత సత్కారాలు ఇవ్వకూడదన్నట్లు! అది నాజీ పత్రికల గోల! కాని ఇదంతా నాకు తెలియదు. అందుకని నా యాత్రను పూర్తిగా ఆస్వాదించాను.

కైజర్‌కి కజిన్ నాకు చాలా శ్రద్ధగా పోట్స్‌డామ్, శాన్‌సౌదీ పట్టణాలు చూపించాడు. అందలి భవనాలూ అవన్నీ నాకు ఒకేరకంగా వున్నాయి. కట్టిన వాళ్ల అహానికీ, అధికారానికీ, సంపదకూ చిహ్నాలుగానే అనిపించాయి. వీటికి ఎంత చారిత్రక ప్రాముఖ్యత వున్నాకూడా.

నేను బెర్లిన్ పోలీసు మ్యూజియం చూడటానికి వెళ్లి చాలా భయకంపితుడ నయ్యాను. అక్కడి ఫోటోగ్రాఫ్‌లు, ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్లూ ఆత్మహత్యలు చేసుకున్నవాళ్లూ

మానవ మానసిక క్షోభలూ అన్ని విధాలుగా చూపించిన ఆ మ్యూజియంలో నుంచి బయటపడి హాయిగా గాలి పీల్చుకున్నాను.

'ది మిరాకిల్' రాసిన డా. వాన్‌ఫుల్ ముల్లర్ నన్ను వాళ్ళింటికి తీసుకు వెళ్ళి చక్కని విందు ఇచ్చాడు. అక్కడే జర్మనీకి చెందిన కళాకారులనూ, చిత్రకారులనూ, ఇంకా నటీనటులనూ కలిశాను.

ఒక సాయంత్రం ఐన్‌స్టీన్స్ దంపతులతో గడిపాను. వాళ్లు చిన్నీ ఇంట్లో చాలా సాదాసీదాగా వుంటున్నారు. జనెరల్ హిండెన్‌బర్గ్‌తో సమావేశం ఏర్పాటు చేశారుగానీ, ఆయనకు ఒంట్లో బాగోక అది కుదరలేదు. అక్కడనుంచి మళ్లీ దక్షిణ ఫ్రాన్స్ బయలుదేరాను.

మీకు ఇంతకుముందు ఒకసారి చెప్పాను. శృంగారం, గురించీ, స్నేహమాధుర్యం గురించీ కూడా చెప్పాను. ఇప్పుడు ఆ విషయం మరింత ముందుకు తీసుకువెళ్లే ఆలోచన లేదు. కాని ప్రకృతిలో పునరుత్పత్తికి ఈ శృంగారం అవసరం ఇలా వుందని మనకు తెలిసిన విషయమే. ఆ విధంగానే ఆ ప్రక్రియలోనే ప్రతి మగవాడూ, యువకుడైనా, వృద్ధుడైనా, ఎవరైనా స్త్రీ కలిసినప్పుడు వారిద్దరికీ ఈ శృంగారానికి ఎంతవరకూ అవకాశముందనే ఆలోచనరావటం చాలా సహజం! ఈ విషయంలో నేను మినహాయింపు కాదు.

పనిలో మునిగి ఉన్నప్పుడు ఈ శృంగారపు ఆలోచనలు నాకస్సలు రావు. ఆడవాళ్లను పనిలో భాగంగానే చూస్తాను. ఒక సినిమాకూ మరొక సినిమాకూ మధ్యలో వుండే ఖాళీ సమయంలోనే ఈ వ్యాపకానికి అవకాశమూ అవసరమూ వుంటుంది. అందువలనే ఈ విషయంలో నేను బలహీనుడనే. హెచ్.జి. వెల్స్ ఒకసారి అన్నారు "రోజులో ఒక సమయం వస్తుంది – ఆ రోజు రాయవలసింది రాసిన తర్వాత, ఉత్తరాలకు సమాధానాలు పంపిన తర్వాత భోజనం విశ్రాంతి తర్వాత ఇంకా ఏముంటుంది చేయటానికి. అదే సమయం శృంగారానికి!"అని.

ఆ విధంగా యాత్రలో కోటి-డి-అజూర్‌లో నాకు చాలా అందమైన అమ్మాయి పరిచయమయింది. ఆ యువతికి ఎదుటివారి విసుగు విరామాలను పూర్తిగా అర్థం చేసుకుని, ఉత్తేజ పరచగల శక్తియుక్తులున్నాయి. ఆమె నాలాగే, ఖాళీగా తిరుగుతోంది.

అందుకని మేము వెంటనే దగ్గరయ్యాము. ఆమె నాతో పొరపొచ్చాలు లేకుండా తాను ఇప్పుడే ఒక ఈజిప్షియన్ యువకునితో ప్రేమ వ్యవహారంలో నుంచి బైట పడి కోలుకుంటున్నానని చెప్పింది. మా తాత్కాలిక బంధాన్ని మేము బాహాటంగా చర్చించకపోయినా మా యిద్దరికీ పూర్తి అవగాహన వుంది. నేను ఆమెకు వారానికి 'అలవెన్సు' ఇచ్చాను. మేమిద్దరం విచ్చలవిడిగా హోటళ్ళూ, కాసినోలూ, కాబెరేలూ, టాంగో డాన్సులూ ఇలా అన్నిరకాల సరదాలూ గడిపాము. కాని సామీప్యం సందర్భాలు నన్ను ఆమె అందాల వలలో ఇరికించింది. జరగరానిదీ జరిగిపోయింది. నేను ఆమెతో ప్రేమలో చిక్కుకున్నానని అనుకున్నాను. అప్పటికే అమెరికా తిరిగి వెళ్లే ఆలోచనలో వున్నాను. ఈమెను ఎలా వదిలి వెళ్లాలి అని సంఘర్షణ మొదలయింది. ఆమెను వదిలి వెళ్ళాలనే ఆలోచనే నన్ను దయనీయంగా తయారుచేసింది. ఆమె ఎంతో అందంగా, ఆకర్షణీయంగా నామీద అనురాగంతో పూర్తిగా అర్థం చేసుకున్నట్లే ప్రవర్తించింది. ఇంత జరిగినా నేను ఆమెను పూర్తిగా నమ్మలేని క్షణాలు వున్నాయి.

ఒక మధ్యాహ్నం ఎక్కడో దూరంగా ఒక కాసినోలో మేము కాలక్షేపం చేస్తుండగా ఒక్కసారిగా నా చేయి గట్టిగా పట్టుకుంది. అక్కడే ఆమె మాజీ ప్రియుడు ఈజిప్షియన్ కనిపించాడు. అంతకుముందు నాకు అతని గురించి చాలా చెప్పింది. నాకు ఇబ్బందిగానే వుంది. తర్వాత కొంతసేపటికే మేమిద్దరం అక్కడ నుంచి బైటకు వెళ్లిపోయాం. మా హోటల్ దగ్గరకు వచ్చే సమయంలో ఆమె చేతి తొడుగులు మర్చిపోయినట్లు గుర్తువచ్చింది. వాటికోసం వెళ్తానని వెళ్ళింది. నన్ను హోటల్‌కి వెళ్ళమని చెప్పింది. ఆమె చెప్పిన వంక నాకు అర్థమవుతూనే వుంది. అందుకని నేను ఏమాత్రం వ్యతిరేకత తెలుపలేదు. నా దారిని నేను హోటల్‌కు చేరాను. తర్వాత రెండు గంటల వరకూ ఆమె తిరిగి రాలేదు. అప్పటికి నేను చేతి తొడుగులకంటే బలమైన కారణమే వుందని అనుకున్నాను.

ఆ సాయంత్రం కొంతమంది అతిథులను విందుకు ఆహ్వానించాను. ఆ విషయాలు ఆమెకు తెలుసుకూడా. సమయం దగ్గర పడుతున్నా ఆమె తిరిగి వస్తున్న సూచనలేమీ లేవు. చివరకు నేను ఆ విందుకోసం బట్టలు వేసుకుని గది వదిలి వెళ్లే సమయానికి ప్రత్యక్షమైంది. చాలా చిందరవందరగా, పూర్తిగా పాలిపోయి వుంది. "ఇప్పటికే చాలా ఆలస్యమైంది. నీవు వెళ్ళి వెచ్చగా పడుకో..." అన్నాను.

కాని ఆమె వినలేదు. బ్రతిమాలింది, తిట్టింది, కాని సరైన కారణమేమీ చెప్పలేదు, ఆమె ఆలస్యానికి. అప్పటికీ నేను పూర్తిగా నమ్మ లేదు. ఈమె తన మాజీ ప్రియునితో గడిపి వచ్చింది. కొంత గొడవ తర్వాత ఆమెను వదిలి నేను నా అతిథుల దగ్గరకు వెళ్ళిపోయాను.

అక్కడి నైట్‌క్లబ్‌లో ఏడుపుగొట్టు సాక్సాఫోను మోతలో, డ్రమ్ముల మోతలో ఎవరికైనా ఒంటరితనం చాలా విచారకరంగా వుంటుంది. అందరికీ ఆతిథ్యం ఇస్తూ కూర్చుంటాము. కాని లోలోపల మనను బాధ తొలిచివేస్తుంటుంది కదా? చివరికి హోటల్ గదికి చేరాను. ఆమె అక్కడ లేదు! ఇంక నా కోపానికి అంతులేకపోయింది. మళ్లీ వెళ్ళిపోయిందా, ఇంత త్వరగా తన ప్రియుడి దగ్గరకి, ఎంత దారుణం! అని ఆమె గదిలోకి వెళ్లాను. ఆమె బట్టలూ పెట్టెలూ ఇక్కడే వున్నాయి. ఇది కొంతవరకు ఊరటే. ఆ తర్వాత పది నిమిషాలకే తిరిగి వచ్చింది. చాలా ఉత్సాహంగా వెలిగిపోతూ 'ఇప్పుడే సినిమా చూసి వచ్చాను' అంది. నేను చాలా చల్లగా రేపు పారిస్ వెళ్లిపోతున్నట్లు చెప్పాను. అందుకని లెక్కలు చూసి అకౌంటు పూర్తి చేస్తానని చెప్పాను. ఇక ఇంతటితో మన స్నేహం ముగిసింది అని కూడా చెప్పాను. అంతా విని – కాని తన మాజీ ప్రియుణ్ణి కలిసినట్లు మాత్రం ఒప్పుకోలేదు! అప్పుడు నేను చిన్ని అబద్ధం ఆడాను. 'నిన్న నీ వెనుక మనిషిని పంపాను, నీవు కారులో నీ మాజీ ప్రియుని గదికి వెళ్ళావు' అన్నాను. నేను ఆశ్చర్యపోయాను. ఆమె ఒప్పుకుంది. అది నిజమేనని! కాని ఇక ముందు ఎప్పుడూ అతని ముఖం చూడనని ఒట్టువేసింది.

మర్నాడు ప్రొద్దున్న నేను పెట్టె సర్దుకున్నాను. పారిస్‌కి బయలుదేరటానికి సిద్ధమైపోయాను. ఆమె నిశ్శబ్దంగా ఏడవటం మొదలుపెట్టింది. నేను నా స్నేహితుని కారులో పారిస్ వెళ్లటానికి ఏర్పాటు చేసుకున్నాను. అంతలోనే కారు వచ్చినట్లు కబురు వచ్చింది. అప్పుడు ఆమె వేళ్లు కొరుక్కుంటూ "నన్ను వదిలి వెళ్లకండి – మీతో పారిస్ తీసుకుపోండి" అని గొడవగా ఏడ్చింది.

'ఇప్పుడు నన్నేం చేయమంటావు' అన్నాను. "నన్ను పారిస్ వరకూ తీసుకు వెళ్ళండి – ఆ తర్వాత మిమ్మల్ని ఇబ్బంది పెట్టను – ఒట్టు!" అంది.

ఆమెను చూస్తే చాలా జాలివేసింది. నేను మెత్తబడిపోయాను. కాని ఈ ప్రయాణం ఏమీ సుఖంగా వుండదు. దీనికేమీ అర్థం కూడా వుండదు. ఎందుకంటే పారిస్ చేరగానే

మనం ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోవాలి అన్నాను. అన్నింటికీ ఒప్పుకుంది. మొదటిలో చాలా సాదాగానే ప్రయాణం సాగింది. ఆమె చాలా ఒదిగి, నిశ్శబ్దంగా కూర్చుండి పోయింది. నేను నిర్లిప్తంగా వుండిపోయాను. కాని ఇలా ఎక్కువసేపు సాగలేదు. మా యిద్దరికీ పరస్పరమైన ఆకర్షణ బైట కనపడే వాటి గురించి సంభాషణ అలా సాగింది ప్రయాణం. మేము సరాసరి ఆమె హోటల్‌కి వెళ్ళి, ఆమెకు వీడ్కోలు చెప్పాము. ఆమె కూడా ఇదే తుది వీడ్కోలు అన్నట్లు చాలా విచారకరంగా వుండిపోయింది. నన్ను ఎంతో కృతజ్ఞతలతో ముంచింది. ఇప్పటి వరకూ ఆమెను చూసిన ఆప్యాయతకూ మర్యాదకూ ఇంకా అన్ని విషయాలకూ నా చేతిని తీసుకుని వీడ్కోలు చెప్పి, అంతే నాటకీయంగా హోటల్లోకి వెళ్ళిపోయింది!!

మర్నాడు నాకు ఫోన్ చేసింది. మధ్యాహ్నం భోజనానికి తీసుకెళ్తారా అని అడిగింది. నేనైతే కుదరదు అన్నాను. కాని నేను నా స్నేహితునితో క్రిందికి వచ్చే సమయానికి పూర్తిగా ఫర్‌కోటు వేసుకుని చక్కగా తయారయ్యి మాకోసం ఎదురు చూస్తోంది! మేము ముగ్గురం భోజనం పూర్తిచేసి పారిస్‌లో మాల్‌మేసన్ చూశాము. ఇదే ప్రదేశంలో, నెపోలియన్ వదిలివేసిన తర్వాత, జోసెఫెన్ నివసించి తనువు చాలించింది. అది ఎంతో అందమైన ఇల్లు. ఇక్కడ జోసెఫెన్ తన కన్నీళ్లన్ని విచారంలో ఒలకబోసుకుంది. ముఖ్యంగా ఈరోజు మబ్బుగా వుండి ఆ మూడ్‌కి సరిపోయింది. అక్కడ అంత విచారం పరచుకుని వుంది. అంతలోనే నాతో వచ్చిన ఈమె కనిపించకుండా పోయింది. తర్వాత అక్కడి తోటలో కూర్చొని, అదీ రాతి కుర్చీలో కన్నీళ్లల్లో మునిగిపోయింది. బహుశా ఇక్కడి వాతావరణం జోసెఫెన్ జీవితం ఇవన్నీ ఈమెను విచారంలో ముంచి వుండాలి.

ఈ చివరి సంఘటనతో నా బలహీనమైన హృదయం కరిగిపోయి వుండేది. కాని నేను గట్టిగానే వున్నాను. నాకు ఆమె ఈజిప్షియన్ ప్రేమికుడే గుర్తు వస్తున్నాడు.

ఆ విధంగా పారిస్‌లో విడిపోయాము. నేను లండన్ వెళ్ళిపోయాను.

లండన్ వచ్చిన తర్వాత ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌ని చాలాసార్లు కలిశాను. మొదటిసారి Biarritz లో. అక్కడే లేడీ ఫర్నెస్‌తోపాటు కలిశాం. కోచెట్ అనే టెన్నిస్ ఆటగాడు, ఇంకా ఇద్దరు స్నేహితులతో కలిసి చాలా మంది రెస్టారెంటులో వుండగా ప్రిన్స్, లేడీ ఫర్నెస్ వచ్చారు. మేము కూర్చున్న దగ్గరకు లేడీ ఫర్నెస్ చిన్న చీటీ పంపింది. 'మాతో కలవ వచ్చా అని.' అదీ రష్యన్ క్లబ్‌లో.

అది చాలా సాధారణ సమావేశం – మా పరిచయాలు అయిన తర్వాత రాజకుమారుడే మధువు తెప్పించాడు. అప్పుడు లేచి లేడీ ఫర్నెస్‌తో కాస్సేపు డాన్స్ చేశాడు. తర్వాత వచ్చి నా ప్రక్కనే కూర్చున్నాడు. 'మీరు అమెరికన్ కదూ' అన్నారు. 'లేదు నేను ఇంగ్లీషువాడినే' అన్నాను. ఆయనకు ఆశ్చర్యం వేసింది. 'ఎన్నాళ్లనుంచి అమెరికాలో వున్నారు?' '1910 నుంచి' అన్నాడు. 'యుద్ధానికి ముందే' అన్నాడు. 'కావచ్చు' అన్నాను. ఆయన నవ్వాడు. ఆ రాత్రి నేను చెప్పాను చాలియాపిన్ నా గౌరవార్థం విందు ఇస్తున్నారు అని.

అప్పుడు యువరాజు 'నేనుకూడా వస్తాను' అన్నాడు. 'తప్పనిసరిగా సర్, చాలియాపిన్ చాలా సంతోషిస్తారు' అన్నాను.

అప్పటినుంచీ ప్రిన్స్ అంటే నాకు చాలా ఇష్టం కలిగింది.

చాలియాపిన్ పార్టీలో ప్రిన్స్ 80 ఏళ్ల వయసుగల చాలియాపిన్ అమ్మ ప్రక్కన కూర్చున్నాడు. తర్వాత ఆమె వెళ్ళిపోయిన తర్వాత మా అందరితో కలిసి చాలా సరదాగా గడిపాడు.

ఇప్పుడు ప్రిన్స్ ఆఫ్ వేల్స్ – లండన్‌లో వున్నారు. నన్ను పోర్ట్ బెల్గిడిర్‌కి రమ్మని ఆహ్వానించారు! అది ఆయన కంట్రీ నివాసం! అది చాలా పురాతనమైన 'కాజిల్ 'ఇప్పుడు బాగు చేయించి కొత్తగా సామాను పెట్టించారు. అది మామూలుగానే వుంది. కాని భోజనాల విందు చాలా బాగుంది. యువరాజు నాకు నివాసమంతా చూపాడు. ఆయన పడక గది చాలా సాదాగా వుంది. సిల్కు దుప్పట్ల తెరలలో తర్వాత మరొక పడక గది చూపారు అది అచ్చంగా రాజరికపు పోకడలతో వుంది. తలవైపు పెద్ద ఈకలు మూడు వున్నాయి. అంతా గులాబి–తెలుపు రంగుతో అతికించారు.

బహుశా ఈ ఈకలే ప్రిన్స్ రాయల్ కోటులో పెడతారనుకుంటా.

ఆ రోజు సాయంత్రం ఎవరో కొత్త ఆట ఒకటి మొదలు పెట్టారు. అమెరికా నుంచి దిగుమతి చేసి. దానిపేరు ఫ్రాంక్ ఎస్టిమేషన్. అతిథులందరికీ కార్డులిచ్చారు. అందులో 10 విషయాలు వరసలో వుంటాయి. సొగసు, తెలివితేటలు, వ్యక్తిత్వం, శృంగార విషయం, అందం, నిజాయితీ, హాస్యదృష్టి, ఓర్పు, ఇలా మరికొన్ని.

ఒక్కో అతిథి పది వరసలోపెట్టి (1–10 వరకూ గుర్తుపెట్టాలి – కార్డు ఇవ్వాలి.

ఉదాహరణకు నేను హాస్యానికి 7 పాయింట్లు, శృంగారానికి ఆరు, అందానికి ఆరు, ఓర్పుకు ఎనిమిది, నిజాయితీకి నాలుగు, ఈ విధంగా పెట్టాను.

మధ్యలో వెళ్ళిపోయిన అతిథులకు మిగతావారు వాళ్ళ అభిప్రాయాలు వాళ్ల కార్డు మీద గుర్తుపెట్టిన వాటితో పోల్చి చూశారు.

ఈలోగా అతిథి వచ్చి రెండు చూసి పోల్చి చదివేవారు.

చివరికి ప్రిన్స్‌కి, శృంగారానికి 3, అతిథులు ఆయనకు ఎక్కువ పాయింట్లు ఇచ్చారు. నేను 5 ఇచ్చాను. అందానికి ప్రిన్స్ 6 ఇచ్చారు. మిగతావారు ఆయనకు 8 ఇచ్చారు. నేను 7 మాత్రం ఇచ్చాను. సొగసుకి ఆయన 6 అతిథులు 8, నేను 8 ఇచ్చాను.

నిజాయితీకి ప్రిన్స్ 10, అతిథులు 3/2 నేను మాత్రం 4 ఇచ్చాను. దీనితో ఆయనకు చాలా కోపం వచ్చింది.

'నాకు నిజాయితీ ముఖ్యం – అదే వుందనుకుంటాను' అన్నారు. కాస్త గట్టిగానే.

చిన్నప్పుడు మాన్చెష్టర్‌లో కొన్నాళ్లున్నాను. ఇప్పుడు పెద్దగా చేసే పని లేక ఒకసారి వెళ్ళి చూద్దామనుకున్నాను. మాన్చెష్టర్ వాతావరణం చాలా కఠినంగా వుంటుంది. కాని చాలా శృంగారమయంగా కూడా వుంది.

అక్కడ వర్షం పొగమంచు ఈ వాతావరణం చాలా రొమాంటిక్‌గా వుంటుంది. అక్కడ నాకు జ్ఞాపకం లాంక్‌షెర్ వంటింటి చలిమంట చాలా అద్భుతంగా వుంటుంది. అది అక్కడ ప్రజల జీవనశక్తి. అక్కడ నుంచి కారు అద్దెకు తీసుకు ఉత్తరానికి వెళ్ళాను. దారిలో స్ట్రాట్ ఫోర్డ్ ఆన్ ఏవన్ ఇది నేను ఎప్పుడూ చూడలేదు. నేను వెళ్ళింది శనివారం రాత్రి. చీకటి రాత్రి. అక్కడ ఆపి షేక్‌స్పియర్ కాటేజ్ చూడాలని బయలుదేరాను కాలినడకన. రాత్రి చీకటిలో మునిగి వుంది. నేను సహజ సిద్ధంగా ఒక సందులోకి తిరిగాను. ఒక ఇంటి బయట లైటర్ వెలిగించి చూశాను. 'షేక్‌స్పియర్ కాటేజ్' అని వుంది. నాకు అనుమానం లేదు. ఏ షేక్స్పియర్ దెయ్యమో నన్ను నడిపించింది. బహుశా 'బాల్డ్' అయి వుంటుంది.

మర్నాడు ప్రొద్దున్నే సర్ ఆర్చి బాల్డ్ ఫ్లవర్ ఈయన స్టార్ట్ ఫోర్డ్‌కి మేయర్ అన్నమాట, నేనున్న హోటల్‌కి వచ్చారు. అప్పుడు షేక్స్పియర్ కాటేజీకి తీసుకు వెళ్ళి చూపించారు. ఇప్పుడు దీనికీ బార్డ్‌కీ సంబంధాన్ని చెప్పవచ్చు.

నిజానికి షేక్స్పియర్ నివాసాన్ని ఆయన బరువుని దృష్టిలో పెట్టుకుంటే ఆయన నాటకాలూ కవిత్వం ఒక వ్యవసాయ దారుని కొడుకు ఎలా రాయగలడు? లండన్ వచ్చి, పైగా ఈయన విదేశీ చరిత్రల, కోటల అంతఃపురాల జ్ఞానం ఎలా వచ్చింది? ఇవన్నీ నాకు అర్థం కాని విషయాలు. రాజులు, యువరాజులు, రాణులు, దెయ్యాలు ఇవన్నీ వీటి తెలివిడి – అంత గొప్పగా ఎలా రాయగలగడం కూడా నాకు ఆశ్చర్యమే!

నాకు షేక్స్పియర్ రాతలన్నీ ఎవరు రాసినా అంతగా పట్టింపులేదు. అదీ బేకన్, సౌత్ ఆమ్టెన్ లేక రిచ్‌మండ్–కా స్టార్ట్‌ఫార్డ్ కుర్రవాడు అవటానికి వీలు లేదు. అతనికి గ్రామం మీద గౌరవం లేదు. అలాంటి గుణం ఒక్క రాజరికంలోనే వుంటుంది. ఎంతో ప్రతిభగల బుద్ధి వుంటుంది. నేను ఇప్పుడు ఇక్కడ చూసిన ఆ నివాసం, విన్న చిన్న స్థానికమైన కథలూ – అదీ ఆయన చిన్ననాటి అల్లరి–చిల్లరి బాల్యం.

నిర్లక్ష్యం చేయబడిన చదువు, ఆయన వేటాడిన రోజులూ అతని పల్లెటూరి (Bumpkin) దృష్టీ ఇవన్నీ – నేనెలా నమ్మను? ఒక్కసారిగా అంతటి బౌద్ధకమైన మార్పు రాత్రికి రాత్రి వస్తుందా?

కవులందరిలో గొప్ప కవిగా వెలిగాడు – ఎంత గొప్ప విషయాలోలైనా ఒకనాటి మొదళ్ళు తెలియవా? అలాంటిదేమీ షేక్స్పియర్ రచనల్లో కనపడలేదే?

అక్కడ చూసి మాంచెస్టర్ వచ్చి సాయంత్రం మూడు గంటలకు చేరాను. అది ఆదివారం మంచిస్టర్ మొత్తం నిద్రపోతున్నట్లు ఎక్కడా కదలికలు లేవు. అక్కడ కారెక్కి బ్లాక్ బర్న్‌కి బయలుదేరాను. చిన్న కుర్రవానిగా షర్లాక్‌హామ్స్‌లో నటించాను. బ్లాక్ బర్న్ చాలా నచ్చిన వూరు. ఇక్కడి చిన్న పబ్‌లో వుండేవాడిని. వారానికి 14 షిల్లింగ్‌లిచ్చి భోజనం, ఉండటానికి. నాటకం లేనపుడు బిలియార్డ్ ఆడేవాళ్ళం! బిల్లింగ్‌టన్, ఈయన ఉరితీసే ఉద్యోం చేస్తాడు. ఈయనతో బిల్లియార్డ్ ఆడానని గర్వంగా చెప్పగలను!

అప్పటికి 5 గం॥లు అయ్యింది. కాని బాగా చీకటిపడిపోయింది. ఒక పబ్‌లోకి వెళ్లి మద్యం తీసుకున్నాను. అక్కడ నన్నెవరూ గుర్తు పట్టలేదు. ఈ పబ్ అప్పటికే చేతులు మారింది. కాని బిలియార్డ్ టేబుల్ అక్కడే వుంది!

తర్వాత మార్కెట్ స్థలానికి వెళ్ళాను. అది మూడు ఎకరాలు వుంటుంది. నాలుగో అయిదో వీధి దీపాలున్నాయి. అక్కడ రాజకీయాలు ఉపన్యాసాలు జరుగుతున్నాయి. అప్పుడు ఇంగ్లాండు బాగా ఆర్థిక ఇబ్బందుల్లో వుంది. నేను ఒక గుంపు దగ్గర్నుంచి మరొక గుంపు చేరాను. వారి ఉపన్యాసాలు విన్నాను. కొంతమంది చాలా నిశితంగా విమర్శిస్తున్నాను. మరొకరు కమ్యూనిజం గురించి మాట్లాడుతున్నారు. మరొకరు డగ్లస్ ప్రణాళిక గురించి – ఇది సాధారణ కార్మికునికి అర్థం అయ్యేది కాదు. చిన్నచిన్న గుంపుల మాటలు విని అక్కడ ఒక విక్టోరియన్ మితవాది ఆయన దృక్పథాన్ని చెప్తున్నారు. 'మనం (ఇంగ్లాండు) ఇప్పటివరకూ మన కొవ్వు కరిగించుకుని బ్రతుకుతున్నాము. ఈ బద్ధకం ఇంగ్లాండును నాశనం చేస్తుంది.' అది వినగానే నేను 'ఆహా వినండి–వినండి!' అన్నాను. 'ఈ బద్ధకం లేకుండా ఇంగ్లాండ్ లేదు' అన్నాను. నన్ను బలపరిచేవారు. 'ఆహా వినండి' అన్నారు. రాజకీయ దృక్పథమే నిరాశా జనకం. ఇప్పటికి ఇంగ్లాండులో 40 లక్షల మంది నిరుద్యోగులున్నారు. ఇది ఇంకా పెరుగుతోంది. ఇప్పటి లేబర్ పార్టీ దీనికేమీ పరిష్కారం చూపలేదు. అదీ కన్సర్‌వేటివ్ పార్టీ చేయలేనిది! అంటే పార్టీ ఏదైనా ప్రజల కష్టాలు ఎప్పుడూ తీరేవికావు!

అక్కడ నుంచి వూల్‌విచ్ వెళ్ళాను. అక్కడ ఎన్నికల ఉపన్యాసం విన్నాను. కన్నింగ్‌హోం రీడ్ ఉపన్యాసం. అది లిబరల్ పోటీదారుడు. చాలాబాగా రాజకీయాలు మాట్లాడినా అవేవీ వినేవారికి మంచి అభిప్రాయాన్ని కలిగించినట్లు లేదు.

నా ప్రక్కన కూర్చున్న అమ్మాయి ఇలా అంది: "ఇవన్నీ చాలా విన్నాము, ఇప్పటి నిరుద్యోగులకు ఎలా వుద్యోగాలు ఇస్తారో చెప్పండి" అంది.

ఇదే నిజంగా రాజకీయానికి ఉదాహరణ అయితే, ఇప్పుడు లేబర్ పార్టీ గెలవటానికి అవకాశం వుంది. కాని నా అంచనా తప్పు. ఆ ఎన్నికల్లో మితవాదులే గెలిచారు. ఆ విధంగా కన్సర్ వేటివ్ ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ఉన్న వాతావరణంలో నేను ఇంగ్లాండు వదలి అమెరికా చేరాను. ఇక్కడ కన్సర్‌వేటివ్ ప్రభుత్వం అధికారంలోనుంచి తప్పుకోబోతోంది!

ఈ హాలిడే విహారయాత్ర – అది ఒక ఖాళీ అన్వేషణే – నేను ఇప్పటివరకూ ఇంగ్లాండులోని హోటళ్ళ రిసార్ట్‌లలో చాలాకాలం విందులూ వినోదాలలో గడిపాను. ఇది ఎందుకో నాకు తెలుసుకూడా! ఇప్పటివరకు నాకు ఒక లక్ష్యం లేదు. పైగా ఇప్పటి టాకీలతో పెద్ద అవరోధం కలిగినట్లు అభిప్రాయంలో వున్నాను.

ఇంతవరకూ నా భవిష్య ప్రణాళికలు రచించుకోలేదు. సిటీ లైట్సు ఎంతో జయాన్ని సాధించినా, ఇప్పటివరకూ ఏ టాకీకి రాని డబ్బు ఈ సినిమాకు వచ్చినా, మరో మూకీ చిత్రం తీయటం చాలా మూర్ఖం అనిపించింది. అంతే కాదు నన్ను పాతతరంలోకి నెట్టివేస్తారని ఒక భయంకూడా పీడిస్తోంది.

మంచి మూకీ చాలా కళాత్మకంగా వుంటుంది. కాని టాకీలలో శబ్దం పాత్రలకు మరింత ప్రాణం ఇస్తుందని ఒప్పుకోవాలి!

టాకీ తీయాలనే ఆలోచన రాకపోలేదు. కాని ఆ ఆలోచనే నన్ను నీరసంగా చేసేది. నేను నా మూకీ చిత్రాలలో సాధించింది ఈ టాకీల ద్వారా సాధించటం చాలా కష్టం. ఇక ట్రాంప్‌తో పని ఏముంది? ట్రాంప్ మాట్లాడితే ఎవరు వింటారు? అతను మాట్లాడడం మొదలు పెడితే ఇక అతను మరొక మనిషిగా మారిపోతాడు. పైగా అతను పుట్టింది, నిశ్శబ్దంలోనే. అతను ధరించిన చిరుగు కోటు మాదిరిగానే.

ఈ ఆలోచనలే నన్ను ఇంతకాలం యాత్రలలో తిరిగేట్లు చేశాయి. కాని నా లోపలి వాణి మాత్రం 'హాలీవుడ్ వెళ్లు – పని మొదలుపెట్టు' అని పోరుతూనే వుంది! నార్త్ ఇంగ్లాండు తిరిగి వచ్చిన తర్వాత లండన్‌లోని కార్ల్‌టన్‌కి తిరిగి వచ్చాను. అక్కడ నుంచి తిరుగు ప్రయాణానికి న్యూయార్క్ వెళ్లి కాలిఫోర్నియా వెళ్దామని.

కాని అక్కడ డగ్లస్ ఫెయిర్ బ్యాంక్స్ St. మోర్టిజ్‌లో ప్రణాళికను మార్చినట్లు తంతి పంపాడు. St. మోర్టిజ్‌కి వచ్చేడు. 'నీకోసం తాజా మంచును పురమాయిస్తాము. నీకోసం ఎదురు చూస్తున్నాము.' ప్రేమతో డగ్లస్.

అది అందుకున్నానో లేదో తలుపు తట్టారు. 'లోపలికి రండి' అన్నాను. వెయిటర్ అనుకుని. కాని నా స్నేహితురాలు నేను ఫ్రాన్స్‌లో వదిలి వచ్చినామె లోపలికి తొంగి చూసింది. నాకు చాలా కోపం వచ్చింది. కాని లోనికి రానిచ్చాను.

తర్వాత హోర్రర్ స్టోర్‌కి వెళ్లి స్కేటింగ్‌కి పనికివచ్చే దస్తులు కొన్నాము. తర్వాత బాండ్ వీధికి వెళ్లి ఆమెకు బ్రాస్‌లెట్ కొన్నాను. చాలా సంతోషించింది. తర్వాత రెండు రోజులకు St. మోర్టిజ్ చేరాము. అక్కడ డగ్లస్‌ను చూసిన తర్వాత నాకు అంతులేని సంతోషం కలిగింది. ఆయన నాలాగా భవిష్యత్తు తేలక డోలాయమానంగా వున్నాడు. కాని ఆ విషయాలు అస్సలు మాట్లాడలేదు మేమిద్దరం. అప్పటికే 'మేరీ'తో

విడిపోయినట్లున్నాడు. ఏది ఏమయినా స్విట్జ్‌ర్లాండ్‌లోని మంచు పర్వతాలలో మా విచారం అంతా కరిగిపోతుందని అనుకున్నాము. కానీ స్కింగ్ నేర్చుకున్నాం.

జర్మనీ మాజీ రాజకుమారుడు కైజర్ కొడుకు, మేమున్న హోటల్‌లోనే వున్నాడు. నేను ఎప్పుడూ కలవలేదు. ఒకసారి ఇద్దరం ఒకే ఎలివేటర్‌లో వున్నాం నవ్వుకున్నాం. నేను షోల్డర్స్ ఆర్మ్స్‌లో ఈయన్ని కామెడీగా చూపించాను.

సెయింట్ మోర్టిజ్‌లో వుండగా సిడ్నీని రమ్మన్నాను. బెవర్లీహిల్స్‌కి పరుగెత్తాల్సిన అవసరం లేదని కాలిఫోర్నియాకి తూర్పు దారిలో వెళ్దాం అని నిర్ణయించుకున్నాను. సిడ్నీ జపాన్ వరకూ వస్తానని అన్నాడు.

అక్కడి నుంచి నేపుల్స్ వెళ్ళాం. అక్కడ నా స్నేహితురాలికి వీడ్కోలు చెప్పాను. ఇప్పుడు మాత్రం చాలా సంతోషంగా వుంది. ఇంక కన్నీళ్ళు లేవు. ఇప్పటి కొంత నిర్లిప్తత అలవాటయి వుంటుంది. కొంత (రిలీఫ్) కూడా వచ్చుంటుంది. స్విట్జర్లాండ్ తర్వాత మా యిద్దరిమధ్యా ఆకర్షణ తగ్గినట్లు ఇద్దరం గుర్తించాము. అలాగా ఇద్దరం మంచి స్నేహితుల్లా విడిపోయాము.

నా నౌక బయలు దేరుతుంటే ఆమె ఒడ్డున నా ట్రాంప్ నడక అనుకరిస్తూ వెళ్ళిపోయింది. ఆ తరువాత ఆమె నాకు కనిపించలేదు!

ఇరవైమూడవ అధ్యాయం

తూర్పుదేశాల యాత్ర (బాలి-జపాన్)

తూర్పుదేశాల గురించి చాలా పుస్తకాలు వచ్చాయి. ఇప్పుడు మరిన్ని వివరాలు రాసి పాఠకుణ్ణి విసిగించటం నా వుద్దేశ్యం కాదు. కాని నేను చెప్పబోయేదానికి ఒక కారణం వుంది. అక్కడ నాకెదురైన పరిస్థితులూ నేను ఇరుక్కుపోయిన సంఘటనలూ మీరు తప్పనిసరిగా తెలుసుకోవాలి.

జపాన్ బయలుదేరక ముందు లఫ్‌కాడియో హెరాన్ వ్రాసిన జపాన్ సంస్కృతి గూర్చిన పుస్తకం చదివాను. ఒకరకంగా ఆ పుస్తకమే అప్పటి నా ప్రయాణానికి ప్రేరణ!

మేము బయలుదేరింది జపాన్ నౌకలోనే 'జనవరి చలి-మంచు గాలులు వదలి ఎండలో మెరిసిపోయే సూయెజ్ కాలువలో ప్రవేశించాము. అలగ్జాండ్రియాలో అరబ్బులూ, భారతీయులూ బోటులో ఎక్కారు. నిజానికి అది వేరే ప్రపంచమే! సూర్యాస్తమయ సమయానికి నౌకపైన చాపలు పరచి మెక్కావైపు తిరిగి అరబ్బులు ప్రార్థనలు చేయటం చూసాను.

మర్నాడు మేము ఎర్ర సముద్రంలో ప్రవేశించాము. అంతే మా సూటులూ బూటులూ అన్ని తీసివేసి నిక్కర్లూ సిల్కు చొక్కాలూ పల్చటివి వేసుకున్నాము. అన్నిరకాల పండ్లూ ఎండు ఖర్జురాలూ ఫలహారంగా తీసుకున్నాం. అలెగ్జాండ్రియాలో తీసుకున్న కొబ్బరి బొండాలు-గుజ్జు కూడా ఆరగించాము. వాటితోపాటు మామిడిపండ్లు కూడా! ఒకరాత్రి మేము జపాన్ భోజనాలు చేశాము.

నౌకాధికారి ఒకాయన అన్నం మీద కొద్దిగా టీ చిలకరించమన్నాడు! అది ఒక కొత్త రకం పరిమళం ఇస్తుందనీ చెప్పాడు. ఇంకా దక్షిణంగా ప్రయాణం సాగేకొలదీ మా ఉత్సాహం రెట్టింపయ్యింది. మా నౌక కెప్టెన్ మర్నాడు సిలోన్ (శ్రీలంక) చేరతామని చెప్పాడు!

సిలోన్ చాలా అందమయిన ప్రదేశమయినా అక్కడ ఆగే సమయం కానీ, ప్రణాళిక గానీ మాకు లేవు. మా దృష్టంతా బాలి, జపాన్ మీదేవుంది.

సిలోన్ తర్వాత సింగపూర్ చేరాము. అక్కడ సముద్రంలోనుంచి పైకి పెరిగిన రావిచెట్టును చూశాము. అదీ ఒక పల్లెంలాగా కనిపించింది.

నా సింగపూరు జ్ఞాపకాల్లో నిలిచిపోయింది, చైనా నటీనటులు ప్రదర్శించిన గొప్ప నృత్య నాటకం – అదీ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో. అందులో చిన్న పిల్లలు ఎంతో నైపుణ్యంతో చక్కని వాచకంతో విశిష్టమైన చైనా కథల్ని, కవిత్వాన్నీ వినిపించారు.

ఒక పగోడాలో సంప్రదాయ బద్ధంగా నటించారు. నేను చూసిన నాటకం మూడు రాత్రులు నడిచింది. అందులో ముఖ్య పాత్రధారి 15 సంవత్సరాల బాలిక. ఎంతో ఉన్నత స్థాయిలో, మోటు గొంతుతో పాడింది. మూడోరాత్రి తారాస్థాయికి చేరిన నాటకం ఒక్కోసారి భాష తెలియక పోవటమే మనకు అనుకూలంగా వుంటుంది. ఆ ప్రదర్శనలోని ఉద్వేగాన్ని అర్థం చేసుకోవటానికి. ఆ నాటకంలోని చివరి అంకం నన్ను ఎంతగానో కదిలించివేసింది. అందులోని సంగీతం–అది నిరుద్ధం. ఆ తంత్రుల వణుకు ఉరుముల లాంటి అక్కడి గాంగ్ మోతలు, అందులో నుంచి చెవులు చిల్లులుపడేట్లు సన్నగా శోకిస్తున్న ఆ రాజ కుమారుని శోకం, అతను నిష్క్రమిస్తున్న శూన్యగోళాలు, ఓ – ఎలాంటి ప్రదర్శన!!

తర్వాత సిడ్నీ కోరిక ప్రకారం బాలి దీవులు చూశాము. బాలిలోని సంస్కృతీ, తరతరాల సంప్రదాయమూ లెక్కలేనన్నీ దేవాలయాలు అక్కడి స్త్రీలూ, వారి వక్షోజాల ప్రదర్శనా ఇవన్నీ చెప్పాడు.

బాలి, మా దృష్టిలో సముద్రంలో తేలుతున్న దీవుల సమూహంలా అనిపించింది. ఉదయాన తెల్లని మబ్బులు ఆ కొండ కోనలమీద తేలుతున్నాయి.

ఆ రోజుల్లో అక్కడ నౌకాశ్రయం లేదు. విమానాశ్రయం లేదు. అక్కడకు వెళ్ళాలంటే చిన్న పడవల్లో చెక్క రేవు దగ్గరకు చేరాలి!

బాలిలో మేము చూసినవి ఎంతో అందంగా కట్టిన ప్రహరీలు. ఇంకా అందమైన ద్వారాలు. ఒక్కో ప్రదేశంలో 20, 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇంకా లోపలికి వెళ్లిన కొలదీ ఆ ప్రదేశపు సౌందర్యాన్ని ఆస్వాదించటం గొప్ప అనుభూతి. కొండ చరియల్లో వరి చేలు – మెట్ల మాదిరిగా పచ్చని మెట్లు మాదిరిగా కనపడతాయి. ఒక్కసారిగా సిడ్నీ నన్ను కుదిపాడు.

ఆ రహదారి ప్రక్కనే గొప్పింటి స్త్రీలు వరసనే వున్నారు. వాళ్లు నడుం వరకూ బాతిక్ లంగాల లాంటివి ధరించారు. ఆ పైన ఏ ఆచ్ఛాదన లేదు! వారు ఏవో బుట్టలు తీసుకు వెళ్తున్నారు. అందులో పళ్లూ ఆకులూ వున్నాయి. అది మొదలు మాకు ఇలాంటి దృశ్యాలు కనపడతూనే వున్నాయి. కొందరు చాలా అందంగా వున్నారు. మేము ఎంతో ఆస్వాదించాము.

మేము దిగిన హోటల్ డెన్‌పోసర్ కొత్తగా కట్టింది. ప్రతి గదికి వరండా వుంది. చాలా పరిశుభ్రం. హాయిగా వుంది.

హిర్స్‌ఫెల్డ్ అనే ఈయన అమెరికన్. నీటి రంగుల కళాకారుడు. ఆయన భార్యా బాలిలోనే నివసిస్తోంది. రెండు నెలలుగా. మమ్మల్ని వాళ్ల ఇంటికి ఆహ్వానించింది. అదే ఇంటిలో (మెక్సికన్) కళాకారుడు మిగుల్ కూడా వుండేవాడు. కేవలం వారానికి 15 డాలర్లకు ఇక్కడ ఈ చిత్రకారులు గొప్పగా కాలం గడుపుతున్నారు! ఆ రోజు విందు తర్వాత మేము నడవటానికి వెళ్ళాం. ఆ రాత్రి చీకటిగా వుంది. పైగా చాలా ఉక్కగా కూడా వుంది. ఎక్కడా ఆకు కదలడం లేదు.

ఒక్కసారిగా మిణుగురులు గుంపులుగా వైశాల్యంలో ఎగురుతున్నాయి. అవి అక్కడి వీరి పొలాలపై నీలిరంగు అలల్లాగా కదులుతున్నాయి! మరోప్రక్క నుంచి జే గంటలమోత చాలా శ్రావ్యంగా వినపడుతోంది. ఎక్కడో నృత్యాలు సాగుతున్నాయి అంది, మా అభ్యాగతి. 'వెళ్దాం' అన్నాము.

రెండువందల గజాల దూరంలోనే అక్కడి స్థానికులు చుట్టూ నిలబడి కూర్చుని వున్నారు. యువతులు బట్టల్లో అన్నిరకాల ఫలాలనూ అమ్ముతున్నారు. మేము వారిని దాటుకుంటూ ముందుకు వెళ్ళాం.

ఇద్దరు పదేళ్ళ వయసు బాలికలు చక్కని ఎంబ్రాయిడరీ సారంగులు వేసుకుని, తలమీద బంగారు రంగు కిరీటాలులాంటివి ధరించి, నృత్యం చేస్తున్నారు. అక్కడి

సంగీతం ఎంతో తారా స్థాయిలో వుంది. ఇంకో ప్రక్క మంద్ర స్థాయిలో పెద్దపెద్ద గాంగ్‌లు మ్రోగుతున్నాయి. వీళ్ళ తలలు వూగుతున్నాయి. కళ్లు మెరుస్తున్నాయి. వేళ్లు వణుకుతున్నాయి. ఈ సంగీతం ఒకరకమైన జ్వరం వచ్చినట్లు చేస్తుంది. అది తారాస్థాయికి ఏదో తుఫాను వస్తున్నట్లు పెరిగి పెరిగి చివరికి నదీ ప్రవాహంలా నెమ్మదించింది! దీని ముగింపు ఒక్కసారే జరిగింది. మరి నృత్యం ఒక్కసారిగా ఆపివేశారు. తర్వాత గుంపులో కలిసిపోయారు! ఎవరూ కరతాళ ధ్వనులు చేయలేదు. బాలీ వారు ఎప్పుడూ ఆ పనిచేయరు. వాళ్ల భాషలో 'ప్రేమ' థాంక్యూ మాటలుకూడా లేవు!

మా హోటల్‌కి వాల్‌టర్ స్నైస్ – సంగీతకారుడూ, చిత్రకారుడూ – వచ్చి మమ్మల్ని కలిశారు. ఈయన ఇక్కడే పదిహేను సంవత్సరాలుగా జీవిస్తున్నాడు. బాలి భాష కూడా నేర్చుకున్నాడు.

వారి సంగీతాన్ని పాటల్ని పియానో స్వరాలుగా మార్చగలిగాడు. మాకోసం విన్పించాడు కూడా. అది బాష్ వాద్య సమ్మేళనంలాగా అన్పించింది. బాలీ వాళ్ళ సంగీత జ్ఞానం చాలా గొప్పది. విశిష్టమైనది కూడా. మనకు తెలిసిన జాజ్‌ను, వాళ్లు చాలా నేలబారు సంగీతంగా పరిగణిస్తారు. మోజర్ట్ చాలా సెంటిమెంటల్ అంటారు. ఒక్క 'బాష్' సంగీతానికి వీళ్లకి కొంచెం ఉత్సాహం చూపిస్తారు. అవి వీళ్ళ రిథమ్‌తో దగ్గరగా వుంటాయి అని.

నాకు వీరి సంగీతం చాలా 'చల్ల'గా కర్కశంగా ఇంకా కదిలించేదిగా వుందనిపించింది. ఏదో ఆకలితో అలసిపోయిన జంతువు ఆవులించినట్లు!

భోజనం తర్వాత స్నైస్ మమ్మల్ని అడవిలోకి తీసుకు వెళ్ళాడు. అక్కడ ఒక పండగ జరుగుతోంది. అది ఫ్లాజెలేషన్ (మతమౌఢ్యంతో శరీరాన్ని కొండలతో హింసించుకునే పండగ). మేము లోపలికి నాలుగు మైళ్ళు నడిచాము. మేము అక్కడికి చేరే సమయానికి జనం గుంపుగా చేరుకున్నారు. ఒక స్తంభం–బల్లా వున్నాయి. దాని చుట్టు చేరాము. వయసులో వున్న యువతులు తలమీద సుట్టలతో (పళ్లు పూలు వున్న) నడుము వరకే సారంగులు వేసుకుని పైన ఏమీ ఆచ్ఛాదన లేకుండా వచ్చి, అక్కడి పూజారికి ఆ బుట్టలలోని పళ్ళూ, పూలూ సమర్పిస్తున్నారు. ఆయన వాళ్లని ఆశీర్వదించి పంపిస్తున్నాడు. పొడవాటి జుట్టుతో మాంత్రికుడిలా వున్నాడు. తర్వాత అందరూ ఒక్కసారిగా బల్లమీది పళ్లకోసం ఎగబడతారు. అతను కొరడాతో కొడతాడు – వారి పాపాలు పోతాయి!

మనిషి అజ్ఞానానికీ మూఢనమ్మకాలకూ అంతేముంది! అది వింతవింత బట్టలు వేసుకుని కారుల్లో-జీపుల్లో మోటరు సైకిళ్ళ మీద, నడిచి అరుస్తూ, కేకలు పెడుతూ కదులుతుంటుంది! విదేశాల నుంచి కూడా దిగుమతి అవుతుంటుంది!

అక్కడ నుంచి మేము బయటపడి కోళ్లపందాలు చూశాము. అక్కడి అన్నిరకాల పండగలు చూశాము. అవి రాత్రీ పగలూ జరుగుతాయి. మేము తెల్లవారు ఝామున 5 గంటలకు హోటల్‌కు చేరాము.

వాళ్ల దేవుళ్లు ఆనందాన్ని ఆస్వాదిస్తారు. బాలి ప్రజలు వాళ్లని భయంతో కాదు, ప్రేమతో కొలుస్తారు!!

ఒక రాత్రి స్పెసూ, నేనూ పొడవాటి ఆమ్ష్టఫన్ దేశపు యువతిని చూశాం. ఆమె అప్పుడు టార్చీలైటులో నృత్యం చేస్తోంది. ప్రక్కనే ఆమె కొడుకు ఆమెను అనుకరిస్తున్నాడు. అక్కడ ఒక యువకుడు వున్నాడు. అతనే ఆ నృత్యాన్ని దర్శకత్వం చేస్తున్నాడు. అతన్ని స్పెస్ అడిగాడు, 'నీ వయస్సెంత' అని. 'ఇక్కడ భూకంపం ఎప్పుడు వచ్చింది?' అన్నాడు. 'పన్నెండేళ్ళయింది.' 'అప్పటికి నాకు ముగ్గురు పెళ్లయిన కొడుకులున్నారు' అన్నాడు. అంతేకాదు. 'నేను రెండువేల డాలర్ల వయస్సున్నవాడిని' అన్నాడు. అంటే ఇప్పటికి అంత డబ్బు ఖర్చు చేశాడన్నమాట తన జీవితంలో! చాలా కుటుంబాలకు పెద్ద పెద్ద కారులున్నాయి. అవన్నీ కోళ్ల గంపలుగా వాడుతున్నారు! స్పెస్‌ని అడిగాను ఏమిటి కారణమని!

దీనికి పెద్ద కథే వుంది. వీరివన్నీ ఉమ్మడి కుటుంబాలే కదా. నెలంతా కష్టపడి చాలా పొదుపు చేస్తారు. వీళ్ళు కోళ్ళనూ, పశువులనూ ఎగుమతి చేస్తారు. అలా చాలా సంవత్సరాలు పొదుపు చేశారు. ఖర్చులేమీ వుండవుకదా. ఒకసారి కాడిలాక్ అమ్మకాల మాయగాడు వచ్చి, వీళ్లను ఒప్పించి, కాడిలాక్ కారులు దిగుమతి చేసి వీళ్ల సొమ్ము తీసుకుపోయాడు. వీళ్ళంతా ఒక నెలరోజులు వాటిల్లో తిరిగి పెట్రోలు అయిపోగానే మూలపడేశారు. ఒక్కరోజు కారులో తిరగాలంటే నెలరోజులు పొదుపు చేయాలని అప్పుడు అర్థమయ్యింది. అంతే అన్నీ దొడ్లలో పెట్టి కోళ్ళ గంపల్లా వాడుతున్నారు.

బాలి హాస్యం కూడా మన హాస్యంలాగే శృంగారం చుట్టూ తిరుగుతుంది. నిజం చుట్టూ మాటల గారడీ చేస్తుంటారు.

ఒకసారి మా హోటల్‌లో మాకు సేవచేస్తున్న కుర్రవాడిని అడిగాను "కోడి రోడ్డు ఎందుకు దాటుతుంది?" అని. 'అది అందరికీ తెలిసిన విషయమేగా' అన్నాడు. అలాగా, అయితే 'గుడ్డు ముందా – పెట్ట ముందా' అన్నాను. అతను 'పెట్టే కదా – లేదు గుడ్డు' సంశయంలో పడిపోయాడు... అయినా కాస్సేపు ఆలోచించి 'గుడ్డే' అన్నాడు. 'అయితే గుడ్డెవరు పెట్టారు' 'గుడ్లన్నీ తాబేళ్ళు పెడతాయి' అన్నాడు.

అప్పుడు బాలి స్వర్గం! స్థానికులు సంవత్సరంలో నాలుగు నెలలు వరి పొలాల్లో పనిచేసేవారు. మిగతా ఎనిమిది నెలలు కళలకూ, సంగీతానికీ, నృత్యాలకూ గడిపేవారు. అక్కడ అన్ని దీవుల్లో ఆనందం వెల్లివిరుస్తుండేది. కాని ఆ స్వర్గం ఇప్పుడు నిర్గమిస్తోంది. ఇప్పుడు అన్నిరకాల రుగ్మతలూ చుట్టుముడుతున్నాయి.

అక్కడినుంచి జపాన్ బయలుదేరే ముందు నా జపాన్ కార్యదర్శి కోనో, మాకంటే ముందువెళ్ళి అన్ని ఏర్పాట్లు చేస్తానని చెప్పాడు.

మాకు జపాన్ ప్రభుత్వ స్వాగత సత్కారాలు అందుతాయని చెప్పాడు.

మేము కోచి హార్బరు (రేవు) చేరగానే మాపైన చిన్న విమానాలు ఎగురుతున్నాయి. అందులో నుంచి మాకు స్వాగతం చెప్తూ చిన్నచిన్న కాగితాలు వదులుతున్నారు. రేవులో వేలమంది స్వాగతం పలికేందుకు వేచివున్నారు.

నేను చూశాను ఆ ఎండలో ఎర్రటి బంగారు–తెలుపు కిమోనో రంగులు అద్భుతంగా వున్నాయి. ఏమాత్రం సంకోచం లేకుండా బాహాటంగా ప్రదర్శించిన తీరు ఎంతో సంతోషంతో నిండిపోయింది. ఇంతవరకూ ఎందరో అభిమానులు ఎన్ని ప్రదేశాలలోనో స్వాగతం చెప్పారు. కాని జపాను స్వాగతం ఎంతో ప్రత్యేకం!!

అక్కడ ప్రభుత్వం మాకోసం ప్రత్యేకమైన రైలు ఏర్పాటు చేసింది. టోకియో చేరటానికి. ప్రతి స్టేషన్‌లో గుంపులుగా స్వాగతం చెప్పారు. అంతేకాదు అందమైన అమ్మాయిలు పూలు, బహుమతులతో మమ్మల్ని ముంచెత్తారు.

వాళ్లు ఆ కిమోనోల్లో మాకోసం వేచి వుండటంతో అది పూలవనంలా అన్పించింది.

టోకియోలో 50 వేలమంది స్టేషన్‌కు మాకు స్వాగతం చెప్పేందుకు వచ్చారు. ఈ హడావుడిలో సిడ్నీ పడిపోయాడు. వాళ్లు తొక్కేస్తారని కంగారు పడ్డాము.

నిజానికి ఈ తూర్పుదేశపు మార్మికత ఎంతో అద్భుతం. ఇన్నాళ్లూ మేము ఇవన్నీ ఎక్కువచేసి చూపుతున్నామని అనుకున్నాను. కాని మేము చెప్పేదానికీ ఇక్కడ వున్నదానికీ చాలా వ్యత్యాసముంది. ప్రేమతో చుట్టివేసింది.

హోటల్‌కి వెళ్ళేదారిలో మేము కొంత ప్రశాంతంగా వున్న దారిలోకి తిరిగాం. ఒక్కసారిగా మా కారు అక్కడి చక్రవర్తి పాలెస్ ముందు ఆగింది!

కోనో చాలా ఆతృతతో చూశాడు. 'మీరు దిగి ఇక్కడ పాలెస్ ముందు అభివాదం చేస్తారా?' అని. 'ఇది ఇక్కడి అలవాటా?' అని అడిగాను. అవునన్నాడు. 'తప్పకుండా చేద్దాం' మీరు 'వంగవలసిన అవసరం లేదు, కారులో నుంచి దిగండి చాలు' అన్నాడు. ఇది నాకు కొంచెం గందరగోళంగానే వుంది. ఇదే అలవాటయితే ఇక్కడి ఎంతో కొంత గుంపు చేరి వుండాలే! మా వెనక వచ్చిన కారులు కూడా రెండో మూడో అంతే.

అలాగే నేను కారులోనుంచి దిగాను. ముందుకు వంగి అభివాదం చేశాను చక్రవర్తికి! తిరిగి కారులో ఎక్కిన తర్వాత కోనో ముఖంలో చాలా నవ్వు కనిపించింది. సిడ్నీకి ఇది చాలా వింతగా అన్పించింది. కోనోకూడా వింతగా ప్రవర్తించాడని అనుకున్నాడు.

మేము హోటల్లో చాలా హాయిగా కుదురుకున్నాము.

మర్నాడు సిడ్నీ హడావుడిగా వచ్చాడు 'నా బాగ్‌లో అన్నీ వెతికి వున్నాయి. కాగితాలన్ని కెలికి వున్నాయి' అని గొడవ చేశాడు. ఇదంతా 'నీ కార్యదర్శి పనే' అన్నాడు. ఏదో జరుగుతోంది అన్నాడు.

మర్నాడు మాకు ప్రభుత్వం తరపున మనిషిని పెట్టారు. మేము ఎక్కడికి వెళ్లాలన్నా అతనికి చెప్తే అన్ని ఏర్పాట్లూ చేస్తానని చెప్పాడు. ఇప్పటికి కోనో ఆందోళన అర్థమయింది.

కోనో చెప్పాడు, 'ఒక వ్యాపారి కొన్ని అభ్యంతరకరమైన బొమ్మలు సేకరించాడు మిమ్ములను చూడటానికి రమ్మన్నాడు' అని. 'అలాంటిదేమీ వద్దు' అన్నాను.

'అయితే హోటల్‌కి తెమ్మని చెప్పనా' అన్నాడు.

'అవసరం లేదు' అన్నాను గట్టిగా. 'అతని సమయాన్ని వృథా చేసుకోవద్దని చెప్పండి.'

అప్పుడు వాళ్లు 'వద్దు' అన్న మాటలు అర్థం చేసుకోరు అన్నాడు.

'మీరేం మాట్లాడుతున్నారు?'

లేదండి నన్ను చాలా రోజులునుంచి భయపెడుతున్నారు. వాళ్ళ టోకియోలో, ఇది చాలా కష్టం' అంటూ నసిగాడు!

'ఏంటి గొడవంతా?' 'వాళ్లను పోలీసులకు అప్పగిద్దాం' అన్నాను.

మర్నాడు మేము ఒక ప్రైవేటు రెస్టారెంటులో భోజనం చేస్తున్నాము. అంతలో ఆరుగురు వచ్చారు. ఒకడు సిడ్నీ ప్రక్కనే కూర్చున్నాడు. మిగతావాళ్ళు దూరంగా వున్నారు. అతను ఏదో అంటున్నాడు. నా దగ్గర పిస్తోలు లేదు. కాని నేను జేబులో చెయిపెట్టి 'ఏమిటీ తీరు?' అన్నాను. 'మీరు వాళ్ళను అవమానించారని అంటున్నాడు.'

నేను ఒక్కసారిగా "ఏమిటి గోల! కోనో టాక్సీ పిలువు! సిడ్నీ లే వెళ్దాం" అని కోపంగా అన్నాను. మేము వీధిలోకి వచ్చి టాక్సీ ఎక్కాము. అంతా అయిపోయిం దనుకున్నాం. మర్నాడు మమ్మల్ని కెన్ ఇమూకాయ్ (ఈయన ప్రధానమంత్రి కొడుకు) కలిసి ఒక కుస్తీ పోటీలకు తీసుకువెళ్ళాడు. మేము కూర్చొన్న తర్వాత ఆయన భుజంమీద ఎవరో తట్టారు. ఆయన మా వంక చూసి, 'క్షమించండి' అని బైటకు వెళ్ళాడు. తాను వెంటనే వెళ్ళిపోవాలని అన్నాడు. కుస్తీ పోటీ చివర్లో వచ్చి – చాలా పాలిపోయి వున్నాడు.

'ఇప్పుడే మా నాన్నని ఎవరో హత్యచేశారు' అన్నాడు. ఆయన్ను నాతోపాటే నా గదికి తీసుకు వెళ్ళాం. కొద్దిగా మద్యం ఇచ్చాం. మాకు అప్పుడు జరిగింది చెప్పాడు. ఆరుగురు నౌకాధిపతులు ప్రధానమంత్రి పాలెస్ బైటవున్న గార్డులను చంపి, ఇంట్లోకి చొరబడ్డారని, అప్పుడు ప్రధానమంత్రి భార్యతోనూ, కూతురుతోనూ వున్నాడనీ, ఆరుగురు ఆయన్ను చంపటానికి సిద్ధపడ్డారనీ ఆయన ఎంత చెప్పినా వినలేదని, అప్పుడు నా కుటుంబాన్ని లోపలికి పంపండి అన్నాడనీ' వాళ్ళు అలాగే అని వాళ్ళని అవతలికి పంపి, ప్రధానమంత్రిని గదిలోకి తీసుకు వెళ్ళారనీ అక్కడ కూడా ఆయన వాళ్ళతో చాలాసేపు మాట్లాడినా ఉపయోగం లేకపోయిందనీ – తర్వాత తుపాకీ శబ్దాలు వినిపించాయని వాళ్ళమ్మ చెప్పినట్లు చెప్పాడు.

'నేను మీతో వుండబట్టి బ్రతికాను, లేదా నన్ను చంపేవారేమో' అన్నాడు.

నేను అతన్ని ఇంటికి తీసుకువెళ్ళాను. అక్కడ రెండు గంటల ముందు వాళ్ల నాన్నను చంపిన గదిని చూశాను. ఇంకా అక్కడ రక్తపు మరకలు పూర్తిగా ఆరలేదు. ఫోటోలు తీసేవారూ, పోలీసులూ, అయినవారూ నన్ను ఫోటోలు తీయలేదు. ఆ మర్యాద వాళ్లకు తెలుసు. 'మీరేమైనా చెప్తారా?' అని అడిగాడు. 'ఇది చాలా దురదృష్టం దేశానికి, వారి కుటుంబానికి' అన్నాను.

ఆ మర్నాడు నేను ప్రధాన మంత్రిని కలవాలి, కాని అది రద్దయినది.

తర్వాత చాలా కాలానికి గానీ, దీని లోతు నాకర్థం కాలేదు. అదీ హాగ్‌బ్యాస్ వ్రాసిన 'గవర్నమెంట్ బై అసోసియేషన్' అనే పుస్తకంలో దీని తాలూకు వివరాల్ని పొందుపరిచాడు.

ట్యూటనెంట్ నేషికాగో ఇతనే నౌకాధిపతి ఈ కుట్రకు మూలం అతనే కోర్టులో చెప్పాడు.

ముందు పార్లమెంటులో అందర్నీ చంపుదామనుకున్నాం (అప్పుడు 'బ్లాక్ డ్రాగన్' అనే ప్రభుత్వాన్ని వ్యతిరేకించే సంస్థ పని చేస్తోంది). అక్కడ చాలా తేలికగా ఈ పని నెరవేర్చుకోవచ్చు అని.

రెండోది – ప్రధానమంత్రి, చార్లీ చాప్లిన్‌కి విందు ఇస్తున్నారు.

అందులోకి చొరబడి ఇద్దర్నీ చంపేద్దాం అని.

అప్పుడు జడ్జి : చాప్లిన్‌ని ఎందుకు చంపటం?

కోగా : అతను చాలా పేరున్న కమెడియన్. అమెరికా పౌరుడు – ప్రధానమంత్రిని, చాప్లిన్‌ని చంపితే అమెరికా జపాన్‌తో యుద్ధం చేస్తుంది. ఒక్క రాయితో రెండు పిట్టల్ని చంపుదామనుకున్నాం!

జడ్జి : మరి ఎందుకు మానుకున్నారు?

కోగా : వార్తాపత్రికలు చాప్లిన్, ప్రధానమంత్రి సమావేశం ఇంకా అనుమానమే అని. రాశాయి.

జడ్జి : మరి ప్రధానమంత్రిపై ఇంటి దగ్గర ఎందుకు దాడి చేశారు?

కోగా : ప్రధానమంత్రి పార్టీకి ముఖ్యుడయిన వ్యక్తి. అతను ప్రభుత్వానికి కేంద్రం. అందుకని.

జడ్జి : ప్రధానిని చంపుదామనే వెళ్ళారా?

కోగా : అవును, నాకు ఆయనంటే వ్యక్తిగతమైన వ్యతిరేకత లేదు.

ఈ కోగానే చెప్పాడు చాప్లిన్‌ని చంపాలనే ప్రణాళిక తర్వాత మానుకున్నాం. ఆ కమెడియన్‌ని చంపితే ఉపయోగం వుంటుందో లేదో. దానితో అమెరికా యుద్ధానికి వస్తుందనే నమ్మకం ఏముంది. అందుకని మానుకున్నామని చెప్పాడు. కాని నేను అనుకున్నాను తీరా నన్ను చంపిన తర్వాత నేను అమెరికా పౌరుణ్ణి కాదని తెలిస్తే 'సారీ చాప్లిన్' అనేవాళ్ళేమో!

ఈ గొడవల మధ్య నా జపాన్ యాత్ర నాకు చాలా బాగా జరిగినట్లుగానే అనుకున్నాను.

'కబూకి' థియేటర్ చాలా గొప్పది. నేనూహించిన దానికంటే అద్భుతంగా వుంది.

అది సామాన్యమైన థియేటర్ కాదు. అది పాత కొత్తల మేలు కలయిక.

అక్కడ ఒక నటుడు కనపడే తీరు చాలా ముఖ్యం. నాటకం కేవలం అతను నటించేందుకు ఉపయోగపడేది.

పశ్చిమ దేశాల ప్రమాణాల ప్రకారం సాంకేతికకు చాలా పరిమితులుంటాయి. అక్కడ 'రియలిజంకు' వదిలివేస్తారు. దాన్ని సాధించ లేనపుడు.

ఉదాహరణకు: మేము కత్తి యుద్ధాలు నాటక రంగం మీద చూపించలేక పోయినప్పుడు కనీసం కత్తి ముట్టుకోకుండా, ఆ వాతావరణం తీసుకు రావటానికి ప్రయత్నం చేస్తాం.

జపాన్‌లో ఇటువంటి విషయాన్ని ఏమాత్రం దాయరు, ఒకరినుంచి మరొకరు కాస్త దూరంగానే వుండి కత్తులు తిప్పుతారు. చాలా వుధృతంగా ఎగురుతూ కత్తులతో కుత్తుకలు కోసుకుంటున్నట్లూ, కాళ్లు నరుక్కున్నట్లూ ఇద్దరు నటులు ఎవరి విన్యాసాలు వారు చేస్తూ, అది బాలే లాగా వుంటుంది. అక్కడ యుద్ధం జరుగుతున్నట్లే వుంటుంది.

ఎవరు గెలిచారో చక్కగా తెలియచేస్తూ ముగిస్తారు. ఈ ఇంప్రెషనిజమ్ నుంచి వాళ్లు నిజమయిన కళలోకి చివరికి మరణించేముందు ప్రేక్షకులకు కన్నీళ్లు తెప్పిస్తారు.

అస్సలు విరుద్ధం ఏమిటంటే వీళ్ల కథా కమామిషులోనే. నేను రోమియో జూలియెట్ లాంటిది చూశాను. ఇది ఇద్దరు యువజంట నటించిన డ్రామా. వీరి పెళ్లిని పెద్ద వాళ్లు ఇష్టపడరు. దీనిని తిరిగే రంగంమీద జూపించారు. ఇప్పటికి మూడొందల సంవత్సరాల నుంచీ వీళ్లు దాన్ని వాడుతున్నారు.

మొదటి రంగం అది పెళ్లికూతురూ పెళ్లికొడుకూ అప్పుడే పెళ్లి చేసుకున్న సమయం! వాళ్ళిద్దరూ వుండగా వాళ్ల పెద్దలు వస్తారు, ప్రేమికులు పెద్దల అంగీకారాల దొరుకుతుందనే ఆశతోనే వుంటారు. (సంప్రదాయం చాలా గట్టిది) వాళ్ల తల్లిదండ్రులు మొండిగానే వుంటారు. అప్పుడు ప్రేమికులు ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుంటారు. అదీ జపాన్ సాంప్రదాయంలోనే. వారు పూల పాన్పు తయారు చేసుకుంటారు. ముందు పెళ్ళికొడుకు పెళ్ళికూతురిని కత్తితో పొడిచి తరువాత అదే కత్తిమీద వాలిపోతూ అతను చనిపోవాలి!

ఇక్కడే వాళ్లు పూలపాన్పుకోసం పూలరేకులు జల్లేటప్పుడు అదీ మరణంకోసం సిద్ధమవుతూ వాళ్ల మాటలు చాలా హాస్యంతో నిండి వున్నాయి. నాకు తర్జుమా చేసి చెప్పాడు. అది వ్యంగ్యహాస్యం. 'మనం ఇంతగా ప్రేమించుకున్న రాత్రి తర్వాత బ్రతికి వుండటం ఏమీ బాగుండదు' ఇలా సాగుతాయి. ఇలా పదినిమిషాలు వీళ్లమాటలు సాగుతాయి. తర్వాత పెళ్లికూతురు మోకాళ్లమీద వంగి పూల పాన్పుమీదకు ఒరిగిపోతుంది. అప్పుడు ఆమె కంఠాన్ని పూర్తిగా చూపిస్తూ అతను కత్తితో కోయటానికి వీలుగా పడుకుంటుంది. అప్పుడు ప్రియుడు కత్తి దూస్తాడు. మెల్లగా నడిచి వస్తాడు. అప్పుడు తిరిగే రంగం కదులుతుంది. అతను, కత్తి ఆమె మెడమీద పెడుతుండగా ప్రేక్షకులకు కనపడకుండా వెళ్ళిపోతుంది. తర్వాత ఆ యిల్లు వెన్నెల్లో తడుస్తూ కనపడుతుంది. ప్రేక్షకులు అవాక్కయి కూర్చుండిపోతారు! తర్వాత ఏవో మాటలు వినపడతాయి. అది చనిపోయిన వారి స్నేహితులు, వాళ్లు తెచ్చిన వార్త చివరికి తలిదండ్రులు పెళ్లికి అంగీకరించారని! ఈ వార్త ఎవరు చెప్పాలని వాదించుకుంటారు. చివరికి వాళ్లను పిలుస్తారు. జవాబు లేకపోతే ఒకరు తలుపు కొడతారు. ఇంకొకరు ఎందుకు వాళ్లను డిస్టర్బ్ చేస్తారు – నిద్రపోతున్నారో – లేకపోతే చాలా పనిలో వున్నారో

– పదండి అనుకుంటూ వెళ్లిపోతారు. అంతే నాటకం అయిపోతుంది! తెర మెల్లగా ఒరిగిపోతుంది.

ఇంకా ఎంతకాలం జపాన్, పశ్చిమ నాగరకత నుండి దూరంగా వుంటుందో తెలియదు కాని, ప్రజలు జీవితంలోని చిన్నచిన్న సంఘటనలు ఎంతగా ఆనందిస్తున్నారో, అదే వారి నాగరకతా సంస్కృతీ. వెన్నెలను ఆస్వాదించటం, చెర్రీబ్లోసమ్‌లు చూడటానికి ఎక్కడికో వెళ్ళటం ప్రశాంతమైన ధ్యాన సమయం, అదీ టీ తాగేముందు – ఇలాంటివన్ని పశ్చిమ దేశాల వ్యాపార ధోరణులలో రూపుమాసి పోతాయేమో?!

నా శలవులు అయిపోయాయి – యాత్ర చివరకు వచ్చింది. ఈ తిరుగుడులో ఎన్నో విషయాలు ఆనందించినా కొన్ని చాలా నిరాశా జనకంగా ముగిశాయి.

నేను చూశాను – ఒకప్రక్క తినుబండారాలు కుళ్లిపోతుంటే, మరోప్రక్క తిండికిలేక ఆకలితో అలమటించేవారికి తక్కువ లేదు.

లక్షలమంది ఉద్యోగాలు లేక వీధుల్లో పడితే, వాళ్ల శక్తియుక్తులు నిరుపయోగంగా వృధా అయిపోతుంటే ఒకసారి విందులో ఒక పెద్దమనిషి అన్నాడు 'ఈ పరిస్థితి మారదు – ఇంకా బంగారం బైటకు తీయాలి' అని.

నేను యంత్రాల వలన, ఆటోమేషన్ వలన నిరుద్యోగులు ఎక్కువైపోతున్నారని అన్నాను. మరొకరు ఈ సమస్య అదే సమసిపోతుంది – ఎందుకంటే చివరికి 'మనిషి పని' చాలా చౌకగా దొరుకుతుంది – అది యంత్రాలతో పోటీ పడుతుందని!

అవును, ఈ ఆర్థిక మాంద్యం చాలా కర్కశమైంది?!

ఇరవైనాలుగవ అధ్యాయం

హాలీవుడ్ బెవర్లీ హిల్స్

బెవర్ల్ హిల్స్‌లో నా యింటికి ఎనిమిది నెలల యాత్రల తర్వాత వచ్చాను.

హాలులో మధ్యలో నిలబడ్డాను. అప్పటికే మధ్యాహ్నం దాటిపోయింది. అస్తమించబోతున్న సూర్యుని కిరణాలు బైట పచ్చికమీద పడుతున్నాయి బంగారు రంగులో. అదే వెలుతురు హాలులోకి కూడా వస్తోంది. నాకైతే అక్కడే కూర్చుని ఏడ్వాలని అనిపించింది. ఎనిమిది నెలల విశృంఖలమైన ప్రయాణాలూ పరిచయాలూ, సాహసాలూ తర్వాత తిరిగి రావటం నాకు ఆనందంగా వుందా? ఏ ప్రణాళికా లేకుండా, ఎవరూ ఎదురు చూసేవారు లేకుండా ఈ ఒంటరి తనంలోకి ఎలా అడుగు పెట్టాలి?

ఇన్నాళ్ళూ యాత్రల్లో నాకు ఎక్కడో చిన్ని ఆశ మిణుకుమంటుండేది. ఎవరైనా మనసుకు నచ్చిన వాళ్లు కలవకపోతారా, నన్ను అక్కున చేర్చుకోపోతారా? అని. కాని ఏమి జరిగింది? నేను కలిసినవాళ్ళకి, నేను కోరుకున్న లక్షణాలున్న వాళ్లకి ఆ కోరిక వుండాలి కదా. చివరికి ఇదిగో కాలిఫోర్నియాలో బెవర్లీ హిల్స్ ఇంటిలో ఈ సాయం సంధ్యలో నిలబడ్డాను. ఏ లక్ష్యం లేకుండా ఒంటరిగా!

ఇక్కడ డగ్లస్, మెరీ కూడా విడిపోయారు. నాకు వాళ్ల ప్రపంచం కూడా లేకుండా పోయింది!

ఈ రోజు సాయంత్రం ఒంటరిగా భోజనం చేయాలి. ఇది అస్సలు ఇష్టం వుండదు. ఎవరూ లేకుండా ఒంటరిగా తినటం. అందుకనే భోజనం వద్దని చెప్పాను. కారు తీసి హాలీవుడ్ వెళ్ళాను. బాలివార్డ్‌లో కారు దిగి నడక మొదలు పెట్టాను. అవే కొట్లు. ఒక అంతస్తు కొట్లు. అన్నిరకాల వస్తువులూ అమ్ముతూ. అవే మందుల షాపులు. నిజంగా నేను వీటికి దూరంగా వెళ్లానా? వీటిల్లో కొత్తదనం ఏముంది? ఇక్కడ ఏ మార్పూ లేదు. ఇది నాకింకా దిగులు పుట్టించింది.

అక్కడ నడుస్తూనే ఆలోచిస్తున్నాను. ఇక రిటైర్ అయిపోవాలని వున్నవన్నీ అమ్మి చైనా వెళ్లిపోదామని చాలాసార్లు అనుకున్నాను. ఇంకా ఇక్కడ వుండి ఏమి చేయాలి? హాలీవుడ్‌లో నేను చేయవలసినదేముంది – ఇక్కడ అంతా మారిపోయింది – టాకీలు వచ్చి మూకీలకు సంబంధించిన అన్నింటినీ చంపేశాయి. పైగా నేను ఈ జనం నుంచి దూరంగా వెళ్లిపోయాను. ఫోన్ చేసి ఎవరిని పిలవాలి? ఎవరితో మాట్లాడాలి? అయ్యో ఇదంతా ఎంత ఒంటరితనం. ఎవరూ మనసులోకి రాలేదు!

తిరిగి ఇంటికి వచ్చాను. అప్పటికి నా మేనేజర్ ఫోన్‌చేసి అంతా బాగుందని వార్త చెప్పాడు. ఇంకా ఎవరూ ఫోన్ చేయలేదు.

ఇదెలా వుందంటే – చల్లని నీళ్లలో దూకినట్లు స్టూడియోకి వెళ్లి అందరికీ కనపడాలి. అక్కడి వ్యాపారాన్ని చూడాలి. ఇవన్నీ తలనొప్పి విషయాలు. కానీ అక్కడ అంతా సంతోషంగానే వుంది. సిటీలైట్సు ఇప్పటికి మూడులక్షల డాలర్ల వరకే వచ్చింది. ఇంకా లక్షడాలర్ల చెక్కులు ప్రతీ నెలా వస్తునే వున్నాయి. రీల్స్ (నా మేనేజర్) హాలీవుడ్ బ్యాంక్‌కి వెళ్ళి రమ్మన్నాడు. కొత్త మేనేజర్ వచ్చాడు పరిచయం కోసం ఏడు సంవత్సరాల నుంచి బాంకు ముఖం చూడని వాడిని ఇప్పుడు వెళ్లాలా? అవసరం లేదని అన్నాను.

లూయీస్ ఫెర్డినార్డ్ – ఈయన కైజర్ మనవడు. నా స్టూడియోకి ఫోన్ చేశాడు. ఆ రాత్రి కలిసి భోజనం చేశాము, మా యింట్లోనే. ఈ యువరాజు చాలా తెలివిగలవాడు. అందగాడు కూడా. జర్మన్ తిరుగుబాటు పెద్ద జోక్ అన్నాడు. (మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత) ప్రిన్స్ బంధువులంతా రాజప్రసాదాలలో వున్నారనీ, పోస్ట్‌డామ్‌లో బైటకు రావటానికి చాలా భయపడినట్లు. కాని తిరుగుబాటు దారులు వీరికి కబురు చేశారని, మీకు రక్షణ కావాలంటే ఏర్పాటు చేస్తాము. మీకేం కావాలన్నా వాళ్లకి ఫోన్ చేయమని వుత్తరం పంపారని. ఇదంతా చూసి వాళ్లు నమ్మలేకపోయారని, తర్వాత ప్రభుత్వమే వాళ్ళను మీకు ఏమి కావాలో అన్ని సమకూరుస్తామని అనగానే బేరాలని మొదలు పెట్టినట్లు "రష్యా రక్తపు మడుగు అయ్యింది – జర్మనిలో అదే జోక్‌గా వుంది" అని ప్రిన్స్ వివరించాడు.

నేను అమెరికా తిరిగి వచ్చిన దగ్గరనుంచి ఇక్కడ ఏదో గొప్ప విషయం జరుగుతోంది. ఇక్కడ ఆర్థిక విషయాలు అన్నీ తిరగబడినాయి. వీరు తీసుకున్న నిర్ణయాలన్నీ చాలా కఠినమైనవే అయినా, ఇక్కడి ప్రజల సహకారం చాలా గొప్పది.

ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తున్నాడు. ఆయన గెలిస్తే అమెరికా పునాదులు కదిలిపోతాయి అని వింత వార్తలు ప్రచారం చేశారు. కాని రూజ్‌వెల్ట్ ప్రెసిడెంటుగా గెలిచి ఆఫీసులోకి వచ్చాడు. ఆయన ఉపన్యాసం 'ది ఫర్‌గాటెన్ మెన్' దేశాన్ని ఊపేసింది. అమెరికా చరిత్రను మార్చివేసింది. ప్రతి ఒక్కడూ లేచి నిలబడ్డాడు. నేను ఆ ఉపన్యాసం విన్నాను. నాతోబాటు యమ్.జి.యమ్ శామ్ విన్నాడు. చిల్‌పాలే విన్నాడు. జోషెనెక్, ఫ్రెడ్ ఆర్టయిస్, అందరం విన్నాము. ఆయన చివర్లో "ది ఓన్లీ ఫియర్ ఈజ్ ది ఫియర్ ఇట్ సెల్ఫ్" అన్నారు. దానిలో గొప్ప ఆనందం వుంది. కాని నాకు అది మరీ నమ్మశక్యం కాని నిజంలా అనిపించింది.

రూజ్‌వెల్ట్ అధికారంలోకి రాగానే ఎన్నో మార్పులు తీసుకు వచ్చాడు. మాటలతోపాటు ఆచరణ కూడా సాధించాడు. పదిరోజులు బాంకులు మూసివేశాడు. దివాలా తీయకుండా అమెరికా ప్రజలు చాలా ఉదారంగా వారిదగ్గరవన్ని అందరికీ అవసరమైన వారికి అప్పుగా ఇచ్చారు. చివరికి సినిమా టిక్కెట్లు అప్పుగా ఇచ్చారు. ఇప్పుడున్న వుద్యోగుల సమయం తగ్గించి కొత్త వుద్యోగాలు ఇచ్చారు. వీరి జీతాలు తగ్గించి కొత్తవారికి జీతాలు ఇచ్చారు. ఈ మార్పులు చాలా దూరం వెళ్తున్నాయి అని విమర్శలు మొదలయ్యాయి. అంతా సోషలిజం వచ్చేసిందని అన్నారు. కాని పెట్టుబడి దారీ విధానాన్ని రక్షించటానికి ఇదే దారి అని చెప్పారు. చూపించారు. ఆ విధంగా ప్రభుత్వమూ ప్రజలూ అమెరికాను రక్షించారు!

హాలీవుడ్ కూడా మారిపోయింది. అంతా టాకీలమయం అయిపోతోంది. మూకీలు మూలపడ్డాయి. పెద్దపెద్ద కెమెరాలు వచ్చాయి. శబ్ద గ్రహణానికి చాలా పెద్ద పెట్టెలు వచ్చాయి. అంతా తీగలమయం అయిపోయింది. పెద్దపెద్ద స్పీకర్లూ, నటులపై చేపలు పట్టే గాలం మాదిరి మైక్రోఫోన్ వేలాడటం – ఇవన్నీ నేను భరించలేకపోయాను! తర్వాత ఎవరో అన్నారు వీటి పరిమాణం తగ్గించవచ్చని – చేతితో తీసుకువెళ్ళే కెమెరాలు సౌండ్‌బాక్సులు అద్దెకు తెచ్చుకోవచ్చు అని.

ఇంకా నాకు అనుమానమే – ఈ టాకీలు నావల్ల కాదు. ఇది సృజనాత్మకమైన పనికాదు అని. లోలోపల ఇవన్నీ వదిలించకుని హాంగ్‌కాంగ్ లేదా చైనా వెళ్ళిపోవాలని ఆలోచనలోనే వున్నాను. అక్కడ నేను బాగా బ్రతకవచ్చు. సినిమాల సంగతి మర్చిపోవచ్చు. ఇక్కడ పండిన ద్రాక్షలాగా కుళ్లిపోవటం ఎందుకు?

మూడువారాలు ఇదే పనిగా ఆలోచించాను. అప్పుడు ఒకరోజు జోషెంక్ ఫోన్ చేశాడు. ఈ వారాంతం ఆయన బోటులో (అది చాలా బాగుంటుంది) పద్నాలుగురు అతిథులు ప్రయాణం చేయవచ్చు హాయిగా) జో మామూలుగా ఎంతో అందమైన అమ్మాయిల్ని కూడా ఆహ్వానిస్తుంటాడు. కాటలీనా చేపలు పట్టవచ్చు. నా ఒంటరితనంలో ఎవరైనా పరిచయం కాకపోతారా అనే ఆశతోనే వస్తానని చెప్పాను.

సరిగ్గా అదే జరిగింది. ఆ బోటులో పోలెట్టి గోదార్డ్‌ని కలిశాను. చాలా సరదాగా వుంది. అప్పుడే విడాకులు తీసుకుంది. '50 వేల డాలర్లు సినిమాలో పెట్టుబడి పెట్టగలను. ఇప్పుడే పత్రాలు రాస్తాన'ని అంది. నాకు చాలా కోపం వచ్చింది. నేను చాలా కోపగించి చెప్పాను. హేమాహేమీలు ఇక్కడ డబ్బు పోగొట్టుకున్నారు. అదీ సినిమాల్లో పెట్టుబడి పెట్టి. హియర్స్‌లాంటి తెలివిగలవాడు. 7 మిలియన్లు పోగొట్టుకున్నాడు. ఇంక మనమెంత? కాబట్టి ఆ ఆలోచన మానివేయి' అని ఎంతో చెప్పాను. ఆ విధంగా మేము దగ్గరయ్యాం.

పోలెట్టీ కీ నాకు మధ్య బంధం ఒంటరితనమే. ఆమె ఇప్పటికే న్యూయార్కు వదలి వచ్చింది. ఇక్కడ ఎవ్వరూ తెలియదు. ఎవరితోనూ పరిచయం లేదు. రాబిన్‌సన్ క్రూసో ఫ్రైడేని కనిపెట్టినట్లు వుంది మా యిద్దరి పరిస్థితి వుంది!

ఈ వారంలో మేము చేయాల్సింది ఎంతో వుంది. పోలెట్టి శామ్ గోల్డ్‌విన్ సినిమాలో నటిస్తోంది. నాకేమో ఎనిమిది నెలల వ్యాపార లావాదేవీలు చూడాల్సిన పని వుంది. కాని ఆదివారం దిక్కులేని రోజు అయిపోతోంది. ఆ నిరాశతోనే మేమిద్దరం దూరంగా కారులో వెళ్ళిపోయాం. కాలిఫోర్నియా సముద్ర తీరమంతా విపరీతంగా తిరిగాం. అన్నీ తిరగేశాం. అంతకంటే ఇంకా చేయవలసినదేమీ లేదనిపించింది.

సాన్‌పెడ్రో వేపుకు వెళ్ళే బోటులన్నీ చూశాము. ఆ బోటులు చాలా అందంగా సముద్ర యాత్రలకు వ్యక్తిగతంగా అతిథులతో వెళ్లటానికి అనుకూలంగా ఉంటాయి. వీటిని విహారనౌకలంటారు. అందులో నాకు నచ్చింది ఒక 55 అడుగుల మోటారు బోటు. అందులో 3 గొప్ప అతిథి గదులున్నాయి. ఒక హాలుంది. చాలా ఆకర్షణీయమైన 'వీల్ హౌస్' కూడా వుంది. అచ్చంగా ఇలాంటి బోటుకోసమే చూస్తున్నాను. పోలెట్టి "ఇలాంటి పడవ వుంటే ఆదివారాలు సరదాగా గడపవచ్చు. కాటలీనా వెళ్లి చేపలు పట్టవచ్చు.' అంది.

ఆ తర్వాత ఆ బోటు గురించి చాలా వాకబు చేశాను. దాని యజమాని మూవీ కెమెరాలు తయారు చేసే 'మిచెల్' అనే ఆయన. మాకు బోటంతా తిప్పి చూపించాడు. అలా ఆ వారంలో మూడుసార్లు ఆ పడవను శల్య పరీక్ష చేశాను. ఇంకోసారి వెళ్లాలంటే ఇక సిగ్గుగా వుందనిపించింది. పోలెట్టి మాత్రం 'ఈసారి నేను బోటులోకి రాను, నాకు చాలా ఇబ్బందిగా వుంటుంది' అంది. మిచెల్ మాత్రం 'అది అమ్ముడు పోయేవరకు మీరు ఎన్నిసార్లు వచ్చి వెళ్ళినా నాకు ఇబ్బంది లేదు' అని అన్నాడు.

తర్వాత పోలెట్టికి తెలియకుండా ఆ పడవను, నా కలల పడవను కొన్నాను. అందులో కాటలీనా యాత్రకు కావలసిన అన్ని సరుకులూ పెట్టించాను. మా యింటి వంటవానిని బోటులోకి పంపాను. ఆందీ ఆండర్‌సన్ (ఇతను నా పాత కీస్టోను కంపెనీ మిత్రుడు) బోటు కెప్టెన్‌గా తీసుకున్నాను. ఈ ఆదివారానికి అంతా సిద్ధం చేశాను. చాలా ప్రొద్దున్నే నేనూ పాలెట్టీ బయలుదేరాం. పాలెట్టి మామూలుగానే కారులో దూరంగా వెళ్తున్నామనుకుంది. అందుకనే కాఫీ తాగి, బయలుదేరాం. అల్పాహారం మరో చోట చేద్దామని. మళ్లీ సాన్ పెడ్రోకి వెళ్తున్నట్లు గుర్తించి 'ఏమిటి మళ్లీ బోటు చూడటానికా?' అంది. 'అవును ఈ ఒక్కసారి చూసి అప్పుడు నిర్ణయిద్దాం' అన్నాను. 'అయితే నేను కారులోనే కూర్చుంటాను' అని 'నాకు చాలా ఇబ్బందికరంగా వుంటోంది ఇన్ని మార్లు బోటు చూడడం' అంది. అంతలోనే రేవు దగ్గర ఆగాము. 'నేను కారులోనే వుంటాను' అని ఉండిపోయింది. 'తొందరగా వచ్చేయ్ – ఆకలిగా వుంది' అని కూడా అంది.

నేను రెండు నిమిషాలలో తిరిగి వచ్చి ఆమెను ఒప్పించి, మెల్లగా బోటులోకి తీసుకు వెళ్ళాను. కాబిన్ అంతా అలంకరించి వుంది. అదీ ఆమెకు ఇష్టమైన గులాబీ, నీలంరంగు తెరలతో. కప్పులూ సాసర్లూ పళ్లాలూ కూడా భోజనాల బల్లమీద అదే రంగుల్లో వున్నాయి. అక్కడ కిచెన్‌లో నుంచి కోడిగుడ్ల ఇగురూ, మాంసం వేపుడూ వాసన అద్భుతంగా వస్తోంది. "మనల్ని కాప్టెన్ బ్రేక్‌ఫాస్ట్‌కి రమ్మని ఆహ్వానించాడు" అన్నాను. "మనకోసం గోధుమ కేకులూ, మాంసం వేపుడూ, ఉడకబెట్టిన గుడ్లూ, రొట్టె ముక్కలూ, కాఫీ ఆహా అన్నీ సిద్ధంగా వున్నాయి" అన్నాను. అంతలో పాలెట్టి లోపలకు చూసి మా వంటవానిని గుర్తు పట్టింది. "అవును ఆదివారం ఎక్కడికైనా వెళ్దామని అన్నావు కదా. కాటలీనాకి వెళ్దాం ఫలహారం చేసిన తర్వాత. చేపలు పడదాం. ఈత కొడదాము" అని, అప్పుడు చెప్పాను 'ఈ బోటు కొనేశాం' అని!

మోడ్రన్ టైమ్స్, ఫీడింగ్ మెషిన్

ఆమె స్పందన చాలా ఫన్నిగా వుంది. "ఒక్కనిమిషం ఆగండి" అని బోటు దిగి, అక్కడ యాభై గజాలు పరుగు పెట్టింది. ముఖాన్ని చేతుల్లో దాచుకుని మెల్లగా తిరిగి వచ్చింది. "ఏయ్ రా, వచ్చి అల్పాహారం తిను. ఆరిపోతోంది" అని అరిచాను.

బోటులోకి వచ్చింది "నేను అలా పరుగు పెట్టి వెళ్లకపోతే ఈ ఆశ్చర్యం తట్టుకోలేను" అంటూ! అప్పుడు ఫ్రెడ్డీ మా జపాన్ వంటవాడు నవ్వుకుంటూ అల్పాహారం తీసుకుని వచ్చాడు. బోటు మెల్లగా బయలుదేరి రేవు దాటి పసిఫిక్ సముద్రంలోకి పయనించింది. తర్వాత కాటలీనావైపు వేగంగా....! అక్కడికి 22 మైళ్ళ దూరాన వున్న కాటలీనాలో 9 రోజులు లంగరు వేసుకుని హాలీవుడ్ మర్చిపోయాము!

ఇంకా అవసరమైన పనులూ ప్రణాళికలూ ఏమీ లేవు. పాలెట్టితో కలిసి విచ్చలవిడిగా తిరిగాను. గుర్రంప్పందాలకు వెళ్ళాము. అన్నిరకాల సభలకూ హాజరవుతున్నాము. రాత్రి నృత్యాలుకూ వెళ్ళాం. ఇదంతా కేవలం కాలం వెళ్లబుచ్చటానికే అని మాకు తెలుసు! అంతర్లీనంగా నాకు ఈ సుఖాలన్నీ అపరాధ భావనను కల్పిస్తూనే వున్నాయి. అరే నేనేమి చేస్తున్నాను? పని చేయకుండా ఇదంతా ఏమిటి? ఎందుకు నన్ను నేను మోసం చేసుకుంటున్నాను?

తర్వాత ఒక యువ విమర్శకుడు సిటీలైట్సు చూసి ఒక విశ్లేషణ రాశాడు. సినిమా బాగుంది. కాని ఇది సెంటిమెంటల్ అని నేను తీయబోయే సినిమాలు ఇంకా నిజాయితీగా నిబద్ధతతో వుండాలని సలహా ఇచ్చాడు! నాకిది నిజమే ననిపించింది. ఇప్పుడైతే ఇలా చెప్పి వుండేవాడిని. 'మీరు ఏదయితే నిజాయితీ రియలిజమ్ అంటున్నారో అదీ కృత్రిమమే. తెచ్చి పెట్టుకున్నదే. చాలా నీరసమైనది. కాని సినిమాకు కావలసింది ఇలాంటి రియలిజమ్ కాదు. మన ఊహాత్మకత ఏదయితే సృజిస్తుందో అదే కావలసింది.'

తమాషా ఏమిటంటే ఇలాంటి వాతావరణంలో, నేను ఏమాత్రం అనుకోకుండా కేవలం యాదృశ్ఛికంగానే మరొక మూకీ చిత్రాన్ని తీశాను.

నేనూ పాలెట్టీ టిజువానా గుర్రపు పందాలకు వెళ్ళాము మెక్సికోలో. అక్కడ కెంటకీ కప్ గెలిచిన వారికి, పాలెట్టీని వెండి ట్రోఫీని ఇవ్వమని అడిగారు. అప్పుడు ఆమెను ఆ జాకీకి కప్పు ఇచ్చిన తర్వాత దక్షిణ ప్రాంతపు యాసలో నాలుగు మాటలు చెప్పమన్నారు. పాలెట్టి చాలా సహజంగా, ఆమె బ్రూక్లిన్ నుంచి వచ్చినా, కెంటకీ

యాసలో అద్భుతంగా మాట్లాడి నన్ను ఆశ్చర్యపరిచింది. అప్పుడే అనుకున్నాను పాలెట్టితో సినిమా తీయాలని!

ఆమెను గామైన్‌గా ఊహించాను. ఆహా ట్రాంప్ gamine ని కలిస్తే అద్భుతంగా వుంటుందనుకున్నాను. ఇద్దరూ బాగా జనం వున్న బండిలో ఎక్కుతారు. ట్రాంప్ ఆమెకు కూర్చోవటానికి స్థలం ఇస్తాడు. ఇదే ప్రారంభంతో కథ సృష్టించాలి!

తర్వాత నాకు 'న్యూయార్క్ వరల్డ్' అనే పత్రికా విలేఖరి ప్రశ్నలు గుర్తుకు వచ్చినాయి. నేను డెట్రాయిట్ వెళ్తున్నానని తెలిసి నాతో చెప్పాడు కర్మాగారంలో బెల్టు పద్ధతిలో కార్లు బిగిస్తుంటారని. అది నిజంగా దారుణం – పెద్ద కర్మాగారం ఆరోగ్యంగా వున్న యువకులను డబ్బు ఎరతో ఆ బెల్టు కర్మాగారాలలో పనిచేయించటం (వీళ్లు హాయిగా పొలాల్లో పనిచేసుకుంటున్నారు) నాలుగు అయిదు సంవత్సరాల కాలంలో వీళ్ళు నరాల బలహీనతా ఇంకా మానసిక రుగ్మతలతో అనారోగ్యం పాలవుతున్నారు – ఎంత దారుణం!

అతనితో సంభాషణ నాకు మోడ్రన్ టైమ్స్ తీయటానికి పునాది. దీనితో నేను మధ్యాహ్న భోజన పథకంలాంటిది ఒక యంత్రంతో పెట్టాను. దీనివల్ల మధ్యాహ్న భోజనం సమయం బాగా తగ్గిపోతుంది. కాలం కలసి వస్తుందన్నమాట! ఆ విధంగా పనివాళ్లు ఆపకుండా పని చేయటానికి ఆస్కారం వుంటుంది.

చివరికి ట్రాంప్ అలాగే పనిచేసి పిచ్చివాడై పోతాడు.

అతనికి వైద్యం పూర్తయి కోలుకుంటాడు. ఆసుపత్రినుంచి బైటకు రాగానే పోలీసులు పట్టుకుంటారు. అదే సమయంలో బిచ్చగత్తె కూడా రొట్టి దొంగిలించి పోలీసులకు దొరికిపోతుంది. అక్కడనుంచి ఇప్పటి నిరుద్యోగంమీదా ఆర్థిక మాంద్యం మీదా సంఘటనలు నడుస్తాయి.

పాలెట్టీని చిరుగు బట్టల్లో తయారు చేశాము. ఆమె నిర్జీవంగా ఏడ్చింది. నేను ఆమె ముఖానికి మసి రాస్తు 'ఇదంతా నీ అందానికి మెరుగులు' అన్నాను.

ఏ నటినయినా అందంగా తయారు చేయడం, బట్టలు వేయటం తేలిక. సిటీ లైట్స్ పూలపిల్లను మామూలు దుస్తుల్లో అందంగా చూపించటం ఎంత కష్టం! గోల్డ్‌రష్‌లో

నాకు సమస్య లేదు కాని పాలెట్టిని మోడ్రన్ టైమ్స్‌లో అదుక్కునే అమ్మాయిలా చూపడం చాలా కష్టమైన పని. దీనికి పెద్ద కంపెనీ డిజైనర్లు కావాలి! అతుకుల బట్టలు సహజంగా లేకపోతే సినిమాలో చాలా కృత్రిమంగా కనపడి నవ్వులపాలవుతాం. పూలపిల్లను గానీ అదుక్కునే అమ్మాయిని గానీ చూడటానికి వీలుగా తయారు చేయటం ఆ దుస్తుల్లో చాలా చాలా మెలకువలతో చేయాల్సిన పని.

ఎలాగైతేనే మోడ్రన్ టైమ్స్‌ను జనంలోకి వదిలాము. దానికి ముందు ఒకరిద్దరు విమర్శకులు ఇది కమ్యూనిస్టు సినిమా అని రాశారు.

సినిమా విడుదల తర్వాత ఇది అదీ కాదు ఇదీ కాదు అని, మరికొంతమంది రాస్తూ చాప్లిన్ గోడమీద కూర్చున్నాడు అన్నారు.

మొదటివార్తలు చాలా ఉత్సాహంగా వున్నాయి. ఇది అన్ని రికార్డులూ బద్దలు కొట్టిందని. రెండోవారం కొద్దిగా తగ్గిందని. ఇక నేను ఈ వార్తలు వినతలచుకో లేదు. పాలెట్టిని వాళ్ళమ్మతో సహా తీసుకుని హొనలులు వెళ్లిపోయాను. మా ఆఫీసువాళ్లకి, నాకు ఎటువంటి వార్తలూ పంపవద్దని చెప్పి మరీ వెళ్లాను.

లాస్ ఎంజెలెస్‌లో బోటు ఎక్కి సాన్‌ఫ్రాన్సిస్కో చేరాం. అక్కడ బట్టలూ మిగతా అవసరాలకూ షాపింగ్ చేయటానికి సమయం ఉంది. కానీ విపరీతంగా వర్షం పడుతోంది. ఎంత వర్షమైన మా ఉత్సాహం నీరు కారిపోలేదు. ఆ రేవులో నుంచి బోటులోకి చేరే సమయంలో అక్కడ కొన్ని కంటైనర్లమీద చైనా అని రాసి వుంది. అంతే, 'పాలెట్టీ మనం చైనా వెళ్దాం' అన్నాను.

'ఏమిటి తమాషానా?'

'కాదు. ఇప్పుడు కాకపోతే మళ్లీ జీవితంలో చైనా వెళ్లలేం, పద' అన్నాను.

'అంతే నాకు బట్టలే లేవు'

'నీకేం కావాలంటే అవి హొనొలులులో కొనవచ్చు' అన్నాను.

అసలు నౌకలన్నిటినీ పెనాసియా అని పిలవాలి. ఎందుకంటే సముద్ర ప్రయాణంకంటే విశ్రాంతినీ శాంతినీ ఇచ్చేది మరొకటి లేదు, మీ బాధలన్నీ వాయిదా పడతాయి. మిమ్మల్ని ఆ నౌక దత్తత తీసుకున్నట్లే, మీ రోగాలన్నింటినీ నయం చేస్తుంది.

యాత్ర చివర్లో మళ్లీ రేవుకు వచ్చినపుడు అదే నౌక అయిష్టంగానే మిమ్మల్ని మళ్లీ గందరగోళ ప్రపంచంలోకి వదిలి పెడుతుంది!

తీరా హొనొలులు వచ్చేసరికి పెద్దపెద్ద పోస్టర్లు మోడ్రన్ టైమ్స్‌వి కనబడుతున్నాయి. పత్రికలవాళ్లు నన్ను మింగటానికి సిద్ధంగా వున్నారు. తప్పించుకునే మార్గం లేదు!

ఎలాగైతే టోకియో చేరాం. మా కెప్టెన్ నన్ను వేరే పేరుతో నౌకలో ప్రయాణం చేయటానికి అంగీకరించాడు. కాని టోకియోలో నా పాస్‌పోర్ట్ చూసి పెద్ద గొడవ చేశారు అధికారులు. 'మీరు వస్తున్నట్లు మాకు తెలియలేదే?' అని కోపగించారు. అంతకుముందు అక్కడ మిలిటరీ తిరుగుబాటు జరిగి చాలామంది చనిపోయారు. మేము టోకియోలో వున్నప్పుడు జపాన్‌లో తిరిగినపుడు మా ప్రక్కనే ఎప్పుడు ఒక అధికారి కాపలా వుండేవాడు! సాన్‌ఫ్రాన్సిస్కో నుంచీ, హాంగ్‌కాంగ్ వరకూ ఎవరితోనూ మాట్లాడలేదు. కాని హాంగ్‌కాంగ్ చేరగానే అంత బెట్టూ ఒక్కసారిగా సడలిపోయింది. హాంగ్‌కాంగ్‌లో మమ్మల్ని ఒక చర్చి ఫాదర్ గుర్తుపట్టాడు. 'ఓ చార్లీ!' అని ఒక పొడవాటి కాస్త మంచి బట్టల్లో వున్న వ్యాపారస్తుడు పలకరించి, 'మిమ్మల్ని అమెరికన్ ప్రీస్ట్‌కి పరిచయం చేయాలి. ఆయన కనెక్టికట్ నుంచి ఇక్కడకు వచ్చి దగ్గర్లోని దీవిలో 5 సంవత్సరాలుగా కుష్ఠు వాళ్లకు సేవ చేస్తున్నాడు' అన్నాడు. అది చాలా కఠినమైన పనే. అయినా ప్రతి శనివారం హాంగ్‌కాంగ్ వచ్చి అమెరికా నుంచి వచ్చే నౌకల దగ్గర అమెరికన్లను కలుస్తుంటాడు. అదే ఆయనకు ఊరట!

ఆ ప్రీస్టు పొడవుగా అందంగా బహుశా నలభైలోపు వయసులో వున్నాడు. ఆయన బుగ్గలు గులాబి రంగులో వున్నాయి ఆయన నవ్వు ఒక ఆర్ద్రతతో వుంది. ఆయనకు మద్యం కొని ఇచ్చాను. తర్వాత మరొక స్నేహితుడు ఇంకో గ్లాసు తెప్పించాడు. తర్వాత ఇంకొకరు. మరొకటి తర్వాత ఫాదర్ ఒకటి. ఇలా చుట్టు తిరిగి వస్తుంది. దాదాపు పాతిక మంది గుంపు క్రింద కూర్చున్నాము. తర్వాత ముప్పయి అయింది. కొంతమందిని బోటులోకి మోసుకు వెళ్లారు. నాలాంటి మొండి వాళ్లు నవ్వుతూనే వున్నాం. కానీ ఫాదర్ ఒక్క గ్లాసుకూడా వదలకుండా పూర్తిచేశాడు. ఏమాత్రం తొణకలేదు! చివరికి నేను లేచి 'శలవు తీసుకుంటాను' అన్నాను. ఆయన చేయి అందించాడు. నేను పరీక్షగా చూశాను. ఆయన అరచేయి చాలా మోటుగా వుంది. పగుళ్లు కూడా వున్నాయి. మధ్యలో

తెల్లని మచ్చ కనపడుతోంది. "ఇది కుష్టు కాదనుకుంటా' అన్నాను, కాస్త నవ్వుతూనే. ఆయన నవ్వి సమాధానం ఇవ్వలేదు.

తర్వాత సంవత్సరంలోపే కుష్టువ్యాధితోనే చనిపోయినట్లు తెలుసుకున్నాను.

మేము హాలీవుడ్‌కి అయిదు నెలలు దూరంగా వుండిపోయాం. ఈ యాత్రలోనే నేనూ, పాలెట్టి పెళ్ళి చేసుకున్నాం. తర్వాత అమెరికా తిరిగి వచ్చాం. ఒక జపాన్ బోటులో సింగపూరునుంచి. సింగపూర్‌లోనే నాకు ఒక చీటీ వచ్చింది. అది పంపినవాడు 'మనకు చాలామంది స్నేహితులు వున్నారు. కాని మనం ఇంతవరకూ కలవలేదు. మిమ్మల్ని కలవాలి. మీ కాబిన్‌కి (ఒక డ్రింక్ కోసం) రావచ్చా?' అని. పేరు, జీన్ కాక్టూ అని వుంది. నాకు అనుమానం. ఇతను పత్రిక వాడయి వుంటాడు అని. నా అనుమానం నిజమే. అతను ఫ్రెంచ్ వార్తాపత్రిక ఫిగారోకి సంబంధించినవాడే. అతనికి ఒక్కముక్కా ఇంగ్లీషు రాదు. నాకు ఫ్రెంచి రాదు. అతని కార్యదర్శి కాస్త ఇంగ్లీషు మాట్లాడుతున్నాడు. అలా మాకు సంభాషణలు గడిచాయి.

రాత్రి చాలా పొద్దుపోయేవరకూ కూర్చుని కబుర్లు చెప్పుకున్నాము. జీవితం గురించీ కళల గురించీ! కాక్టూ చాలా వేగంగా ఒక మెషిన్ గన్‌లా మాట్లాడేవాడు, చేతులు గుండెలమీద పెట్టుకుని. అతని కళ్లు మెరుస్తుండేవి. కాని మా దుబాసీ మెల్లగా ఏ భావమూ కనపడకుండా తర్జుమా చేసేవాడు.

కాక్టూ, అంటున్నారు 'మీరు ఒక కవి అని, అదీ వెలిగే పగలు కవి అని, తాను రాత్రి కవీ అని అంటున్నారు' అన్నాడు. అంతే కాక్టు నావంక తిరిగి తలవూపి మళ్లీ మొదలుపెట్టాడు. తర్వాత నేను చాలా తాత్విక విషయాల గురించీ, సంగీత నృత్య సంబంధాల గురించీ మాట్లాడేవాడిని. మా యిద్దరి అంగీకారం ఏ విషయంలోనైనా కుదిరితే లేచి కౌగిలించుకునేవాళ్లం. తర్జుమా చేసే అతను నిర్లిప్తంగా చేసేవాడు.

ఈ విధంగా తెల్లవారు ఝామున 4 గంటలవరకూ ఈ సంభాషణలు నడిచాయి. మర్నాడు భోజనానికి కలుద్దాం అని అనుకుని విడిపోయాం!

కాని మా ఉత్సాహం శిఖరాలు దాటింది. అన్నీ అయిపోయినట్లు అవతల ఏమీ లేనట్లూ అన్పించింది. ఆ మధ్యాహ్నం నేను చిన్న వుత్తరం పంపాను కలవలేనని. అతనూ పంపాడు, బహుశా ఈ వుత్తరాలు రెండు దారిలోనే దాటి వుంటాయి! అందులో

వున్న విషయం ఒక్కటే కలవలేకపోతున్నందుకు విచారం తెలుపుతూ. అంతే ఆ తర్వాత మేము తప్పించుకోవటానికే ఎక్కువ ప్రయత్నించాం!

మేము రాత్రి భోజనానికి వచ్చే సమయంలో కాక్టూ ఆ మూల కూర్చుని వున్నాడు. మాకు ఆయన వీపు మాత్రమే కనపడుతోంది. అతని కార్యదర్శి మమ్మల్ని చూసి ఒక బలహీనమైన సంకేతం ఇచ్చాడు. తర్వాత కాక్టూ మా వంక చూసి ఆశ్చర్యం నటించాడు. అతనికి పంపిన చీటీ గాలిలో వూపాడు. నేనూ అలాగే చేశాను. ఇద్దరు నవ్వుకున్నాం. మాకంటే ముందు భోజనం ముగించి మెల్లగా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

మర్నాడు పగలంతా మేము కలవకుండా వుండేందుకు తిప్పలు పడ్డాము. ఎందుకంటే నౌకాయానంలో ఎక్కడికి పోతాం? ఎలా దాక్కుంటాం? హాంగ్‌కాంగ్ చేరే సమయానికి మేము కలవటానికి ప్రయత్నించాం. ఇంకా నాలుగు రోజులు ప్రయాణం చేయాలి టోకియో చేరాలంటే!

ఈ యాత్రలోనే అతను నాకు ఒక కథ చెప్పాడు. చైనాలో అతను చూసిన విషయాలు. అక్కడ ఒక బుద్ధుణ్ణి చూశాననీ అతను ఒక నూనె జాడీలో కూర్చున్నాడనీ ఒక తలమాత్రం బైటకు వుందనీ. నూనెలో నాని నాని అతని శరీరం మెత్తబడి పోయిందనీ, మనం వేలితో ఒక ప్రక్కనుంచి మరోప్రక్కకు పొడిచి చూడవచ్చనీ. "కాని ఎక్కడ, చైనాలో ఏ భాగంలో చూసిందీ గుర్తులేదని చెప్పాడు. టొకియోలో మేమిద్దరం ఒకే నౌకలో అమెరికా ప్రయాణం చేస్తున్నామని తెలిసి ఇక కలవడం మానివేశాం!

టొకియోలో అతను ఒక గడ్డి పురుగుని చిన్న పెట్టెలో పెట్టి తెచ్చాడు. 'నేను మాట్లాడితే ఇది పాడుతుంది' అన్నాడు. తర్వాత దానిపేరు 'పీలూ' అని చెప్పాడు.

చివరికి శాన్‌ఫ్రాన్సిస్కో చేరాం. మీతోపాటు లాస్‌ఎంజెలెస్ కారులో రమ్మన్నాను. మాకోసం పెద్దకారు ఆగి వుంది. మాతోపాటు 'పీలూ'ని తీసుకు వచ్చాడు. దారిలో దానిని అద్దం దింపి వదిలివేశాడు. వదిలేముందు అది పాడటం మొదలు పెట్టింది. 'చూశారా దీనికి అమెరికా అంటే చాలా ఇష్టం' అన్నాడు వదిలేముందు. 'అరే ఎందుకు ఆ పని చేశారు' అన్నాను. 'దానికి స్వేచ్ఛ కావాలి కదా' అన్నాడు. 'ఇక్కడ భాష రాదుగదా' నవ్వుతో అన్నాను. "అది చాలా తెలివిగలది. వెంటనే నేర్చుకుంటుంది" అన్నాడు.

బెవర్లీ హిల్స్ చేరేసరికి మాకు అన్నీ మంచి వార్తలే వున్నాయి. మోడ్రన్ టైమ్స్ గొప్పగా విజయవంతం అయినట్లూ మంచి వసూళ్ళు చేసినట్లూ. మళ్లీ నాకు సమస్య! ఇప్పుడేం చేయాలి – మూకీలు ఇక తీయలేను. టాకీలు తీయటం ఇష్టంలేదు. ఇదీ సమస్య! ఇప్పుడు మూకీ తీయటం ఆత్మహత్య చేసుకోవడమే. మొత్తం హాలీవుడ్ అంతా టాకీలతో మునిగిపోతోంది. నేను ఒంటరిగా మిగిలిపోయాను. మూకీలకు కావలసిన ఆంగికాభినయం మూల పడిపోయింది. ఇవాళా రేపూ అలాంటి నవ్వే కనపడటం లేదు. ఇది చాలా నిరాశజనకమైన పరిస్థితి నాకు. ఇక నా పని అయిపోయినట్లే అనే ఆలోచనే దిగులుగా వుంది. ఇప్పుడు సినిమాలన్ని పెద్దవి అయిపోయినాయి. గంటా నలభై నిమిషాలు మూకీ తీయటం చాలా కష్టం. ప్రేక్షకులను కూర్చో పెట్టటం ఇంకా కష్టం.

ప్రతి ఇరవయి అడుగుల చిత్రంలో హాస్యాన్ని నటనలోకి మార్చటం – అలా ఎనిమిది వేల అడుగుల చిత్రాన్ని నడపటం కత్తిమీద సాము.

మరి అయితే టాకీ తీయాలా? అంటే ట్రాంప్ మాట్లాడాలా? ఎంత బాగా మాట్లాడినా నా మూకీ అభినయాన్ని మించి చేయలేనని నాకు తెలుసు. అదీ అసలు బాధ. ట్రాంప్‌కి ఏ గొంతు ఇవ్వాలి? చిన్నచిన్న మాటలా? అబ్బే లాభం లేదు. మాట్లాడడం మొదలు పెడితే నేను అందరు హాస్యగాళ్లలాగే తయారవుతాను. ఇవి ఇప్పుడు నన్ను తింటున్న సమస్యలు.

పాలెట్టీ నేనూ పెళ్ళి చేసుకుని సంవత్సరం అయిపోయింది. కొంత పగులు మా సంబంధంలో బీటలుబారటం మొదలయింది. అది కొంతవరకూ నా తప్పే. నా యీ సమస్యలతో నా పనిలో నేను మునిగి వుండటం. కాని పాలెట్టీకి మోడ్రన్ టైమ్స్ తర్వాత చాలా సినిమాలు వచ్చాయి. ఆ విధంగా పారమౌంట్‌తో ఒప్పందం చేసుకుంది. నేను పని చేయలేకపోతున్నాను. ఖాళీగా వుండలేకపోతున్నాను. ఈ విచారంతో పెబుల్ బీచ్‌కి వెళ్దాం అని టైమ్ డరోంట్‌ని రమ్మన్నాను. బహుశా అక్కడ పనిచేయటం కుదురుతుందేమో.

ఈ పెబుల్ బీచ్, శాన్‌ఫ్రాన్సిస్‌కి ఒక వంద మైళ్ల దక్షిణంగా వుంటుంది. ఆటవికంగా, అందంగా, వికారంగా కొద్దిగా వుంటుంది. ఇది బహుశా ప్రేతాత్మలు

సంచరించు ప్రదేశం అంటాను. దీన్నే 17 మైళ్ళ పొడవు దారి అంటారు. అక్కడ జింకలు తిరుగుతుంటాయి. చుట్టూ అడవి వుంది. చిన్న చిన్న ఇళ్ళు వున్నాయి అమ్మకానికి. అలా చెట్లు కూలిపోయి కుళ్ళిపోతున్నాయి. అక్కడ పొలాల్లో, పొదలు చాలా విషపూరితమైనవి.

సముద్రానికి దగ్గరల్లో చిన్న గుట్టమీద కొన్ని బంగ్లాలున్నాయి. అవన్నీ ధనికుల నివాసాలు. దానినే గోల్డ్ కాస్ట్ అంటారు.

నాకు టీమ్, టెన్నిస్ కోర్టులో కలిశాడు. అతను టెన్నిస్ చాలా బాగా ఆడతాడు. మేమిద్దరం ఎక్కువగా ఆడేవాళ్లం. అతను భార్యనుంచి విడిపోయాడు. ఆమె ఎఫ్.ఎఫ్. హట్టన్ కూతురు. అప్పుడు ఆ బాధ మర్చిపోవటానికి కాలిఫోర్నియా వచ్చాడన్నమాట!

తీరానికి ఒక అరమైలు దూరంలో ఇల్లు అద్దెకు తీసుకున్నాం. అది చాలా చెమ్మగా దరిద్రంగా వుంది. లోపలి చలిమంట వేడికి ఇల్లంతా పొగతో నిండిపోయింది. టీమ్‌కి ఇక్కడ చాలామంది తెలుసు. అతను వాళ్లను కలవటానికి వెళ్లేవాడు. నేను పని చేయటానికి ప్రయత్నించేవాడిని. రోజులతరబడీ నేను ఒంటరిగా పుస్తకాలు చూస్తూ గడిపేవాడిని. బైట తోటలో తిరిగేవాడిని. ఏదైనా ఒక ఆలోచన వస్తుందేమో అని. కాని ఏమాత్రం ఉపయోగం లేకుండాపోయింది.

చివరికి ఆ ప్రయత్నం మానుకుని, టిమ్‌తోపాటు ఇరుగు పొరుగువాళ్లను కలవటం మొదలుపెట్టాను. చిన్నచిన్న కథలు రాయటానికి మంచి అవకాశాలున్నాయి. అదే ముపాసా కథల్లాంటివి.

ఒక పెద్ద బంగ్లా వుంది. అదీ ఏదో తేడాగా దిగులుగా అన్పించింది చూస్తుంటే. దాని యజమాని సరదాగానే వున్నాడు. గట్టిగా మాట్లాడుతున్నాడు, ఆపకుండా! అతని భార్య ఒక్క మాటకూడా మాట్లాడకుండా కూర్చునేది. పాపం ఆమె చిన్న పాప చనిపోయింది. అయిదు సంవత్సరాలయింది. అప్పటి నుంచీ మాటలూ, నవ్వూ రెండు మానివేసింది. 'బాగున్నారా–నమస్తే' ఇవి రెండే!

కొండమీద మరొక ఇల్లుంది. అక్కడ నవలాకారుడు వుంటున్నాడు. అతని భార్య చనిపోయింది. తోటలో ఫోటోలు తీస్తూ తీస్తూ వెనక్కు వెళ్ళి కొండమీద నుంచి జారిపోయింది. అంతే తర్వాత ఆమె కనపించనే లేదు. కెమెరా స్టాండ్ మాత్రం వుంది!

విల్సన్ మిజ్నడ్ తన పొరుగు వాళ్లను భరించేది కాదు. వాళ్లు ఎప్పుడైనా టెన్నిస్ ఆడితే తన రోడ్లో పొగపెట్టేది.

ఫాగన్స్–వాళ్లు ముసలి దంపతులు. చాలా సంపన్నులు. ప్రతి ఆదివారం అందర్ని పిలిచి విందు ఇచ్చేవారు. అక్కడే నాజీ దౌత్యవేత్తను కలిశాను. అతను చాలా సౌమ్యుడు. ఎదుటవారిని గౌరవించటానికే ప్రయత్నించేవాడు. నేను అతన్ని ఎక్కువగా చూసేవాడిని.

వారాంతాలు జాన్ స్టీన్ బెక్స్ఇంటికి వెళ్ళేవాళ్ళం.

ఆయన ఒక సంధికాలంలో వున్నాడు కీర్తికోసం. తొర్టిల్లా ఫ్లాట్ అనే కథలు రాశాడు. జాన్ ప్రొద్దున్నే వ్రాసేవాడు. రోజుకు రెండువేల పదాలు రాసేవాడు. ఆయన చేతి వ్రాతచూసి నేను చాలా ఈర్ష్యపడేవాడిని. ఒక్క తప్పులేకుండా. అక్షరాలు చెక్కినట్లుండేవి.

ఆ సందర్భంగానే రచయితలు ఎలా రాస్తారు? రోజూ ఎలా పనిచేస్తారు – ఎన్ని మాటలు రాస్తారు? తెలుసుకున్నాను.

I Lomes Mann (మాన్) రోజూ నాలుగు వందల పదాలు రాసేవాడు. Lion Feuchtwarger రోజూ రెండువేల మాటలు చెప్పేవాడు. అది ఆరువందల రాసిన మాటలకు సమానం. సోమర్సెట్ మామ్ నాలుగు వందల పదాలు రాసేవాడు. హెచ్.జి. వెల్స్ వెయ్యి వరకూ రాసేవాడు. హన్నన్ స్వఫ్ఫర్ ఆంగ్ల పత్రికా విలేఖరి 4 నుంచి 5 వేల పదాలు రాసేవాడు. అమెరికన్ విమర్శకుడు అలెగ్జాండర్ వూల్కాట్ ఏడువందలు రాసేవాడు. అదీ 15 నిమిషాలలో! తర్వాత పోకర్ ఆటలో కూర్చునేవాడు. ఒకరోజు నేను అక్కడే వున్నానుకూడా! నా స్నేహితుడు హార్ట్స్ రెండువేల పదాలు రాసేవాడు, ప్రతిరోజూ సంపాదకీయానికి.

జార్జెస్ సిమోన్స్ ఒకనెలలో ఒక నవల రాశాడు. ఉదయాన్నే అయిదు గంటలకు నిద్రలేచేవాడు. ఆయన కాఫీ ఆయనే తయారు చేసుకునేవాడు. అప్పుడు తన బల్ల దగ్గర కూర్చుని ఒక బంగారు బంతి చేతిలో తిప్పుతూ (ఇది టెన్నిస్ బాలంత వుంటుంది) ఆలోచన మొదలు పెట్టేవాడు. ఆయన పెన్నుతో రాసేవాడు. నేను 'మీరింత చిన్నగా రాస్తారెందుకని' అడిగాను. అలా అయితే మణికట్టుమీద శ్రమ తక్కువ వుంటుంది.

ఇక నా సంగతి. నేను రోజూ వెయ్యి పదాలు చెప్పేవాడిని. అది మూడువందల రాతమాటలకు సరిపోతుంది! అలాగే నా సినిమాల సంభాషణలు కూడా.

స్టీన్ బెక్స్‌కు పనివాళ్లు లేరు. ఆమె ఇంటిపని అంతా చేసేది. ఆమె అంటే నాకు చాలా ఇష్టం!

మేము చాలా విషయాలు చర్చించాము. ముఖ్యంగా రష్యా గురించి. జాన్ 'రష్యాలో వ్యభిచారం లేకుండా చేశారు' అన్నాడు. 'అదే చివరి ప్రవేటు వ్యాపారం' అన్నాను.

కాని అది మంచిది కాదే.

'మీ డబ్బుకు పూర్తి విలువను ఇచ్చేది అదే కదా' అన్నాను. 'మీరు దానిని కార్మిక చట్టం క్రిందకు తీసుకు రావాల్సింది' అన్నాను.

అక్కడే ఒక వివాహిత అయిన ఆకర్షణీయమైన యువతి (ఈమె భర్త గాలి తిరుగుళ్లు తిరుగుతాడు) నా గౌరవార్థం Pas de deux* ఏర్పాటు చేసింది. ఆమె విశాలమైన బంగ్లాలో!

నేను అక్కడకు ఒక రకమైన కోరికతోనే వెళ్లాను. ఆమె కన్నీళ్లతో నాతో చెప్పింది. గత ఎనిమిది సంవత్సరాలలో ఆమె శృంగార క్రీడలో పాల్గొనలేదు. 'కాని ఇంకా నేను మా ఆయన్ని ప్రేమిస్తూనే వున్నాను' అంది. అంతటితో నా కోరిక పైన చన్నీళ్లు పోసినట్లయింది. ఆ తర్వాత ఆమెకు చాలా తాత్విక పరమైన సలహాలు ఇచ్చి భోజనం చేసి బైటపడ్డాను. అంతా మానసికమే కదా!

రాబిన్‌సన్ జెఫర్, ఈయన కవి, పెబుల్ బీచ్ దగ్గర్లోనే వుంటారు. నేను జిమ్ మొదటిసారి ఆయన్ను కలిసినపుడు ఆయన ఎక్కడో ఆలోచిస్తున్నాడు. మౌనంగా ఒంటరిగా వున్నాడు. నేను మామూలుగానే 'ఎండగా వుంది. ఉక్కగా వుంది' లాంటి మాటల్తో సంబాషణ మొదలు పెట్టాను. కాని ఆయన ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

తర్వాత చాలా ఇబ్బందికరంగా అనిపించి వచ్చేశాను. కేవలం నేను వాగుతున్నట్లు అనిపించింది. అతనికి నేను నచ్చలేదేమో? కాని వారం తర్వాత మమ్మల్ని టీకి పిలిచాడు.

రాబిన్‌సన్ చిన్న పాత రాతి కాజిల్‌లో (కోడ) వుండేవాడు. దానిపేరు టోర్. ఆయనే ఒక్కొక్క రాయీ కట్టాడని అంటారు అది కొండ మీద వుంది. ఎదురుగా పసిఫిక్ సముద్రం! అది ఒకరకమైన యువకులుండే డెన్‌లా అన్పించింది.

పెద్దగది (12×12) వుంటుంది. దగ్గర్లో ఒక రాతి ఒంటి స్తంభం మేడలాగా వుంది. 18 ఎత్తులో. 4 అడుగులు చోటు కొంత. మెట్లు ఇరుకుగా పైకి వెళ్తాయి. మధ్యలో చిన్నచిన్న కంతలున్నాయి. పైకి వెళ్లిం తర్వాత కూర్చునేందుకు కొంత స్థలం వుంది. అక్కడ కూర్చునే రాస్తానని చెప్పాడు.

రోన్ స్టాలియన్ ఇక్కడే రాశాడంట. అనేవాడు ఈయన టిమ్ మరణానికి కోరిక సూచిస్తాయి అని.

కాని రాబిన్‌సన్ ఆయన కుక్కతో సముద్రతీరంలో హాయిగా నడుస్తు కనిపించేవాడు. ఆయన ముఖంలో ఎంతో ప్రశాంతత కనిపించేది.

ఆయన కళ్లు ఎక్కడో చూస్తుండేవి. ఆయన, మరణాన్ని ఎలా కోరుకుంటాడు?

ఇరవై ఐదవ అధ్యాయం

మళ్లీ యుద్ధమా?

నాజీలు ముందుకురుకుతున్నారు. యుద్ధం తప్పని పరిస్థితిగా మారింది, ఐరోపాలో.

ఎంత తొందరగా మొదటి ప్రపంచ యుద్ధపు మారణకాండను మరిచిపోయాం! నాలుగు సంవత్సరాల నరకాన్ని అంతలోనే స్మృతిలోంచి తీసివేశాం. మానవ కళేబరాల కుళ్లు కంపునీ, చేతులు తెగిన, కాళ్లుపోయిన, గుడ్డివాళ్లయిన, ముఖాలు వంకర్లుపోయిన సైనికుల్నీ, సామాన్య జనాన్నీ అంతలోనే మరచిపోయాం. చనిపోకుండా, గాయాలవకుండా వుండికూడా మానసికంగా వికలాంగులైన లక్షలమందిని వెనకకు నెట్టేశాం. యువతను కర్కశంగా మింగేసిన భయంకరమైన యుద్ధాన్ని, మరిచిపోవటమేకాదు, అది చాలా గొప్ప చరిత్రగా చిత్రించి ప్రపంచాన్ని భ్రమలో పెడుతున్నాం.

కొందరు, యుద్ధం మంచిదే అంటారు. 'అది యంత్రాలను తయారు చేస్తుంది. ఉన్న యంత్రాలకు మెరుగులు పెడుతుంది. లక్షల మందికి ఉపాధినిస్తుంది. స్టాక్ మార్కెట్, పైకి ఉరుకుతుంది' అని అంటారు. 'అమెరికా ఉక్కు సామ్రాజ్యం అయిదు వందల రెట్లు పెరుగుతుంది' అన్నారు. కాని మదుపరులే నష్టపోయారు.

ఇంత జరిగినా మళ్లీ యుద్ధపు వాతావరణం ఐరోపాలో నల్లని మేఘాలమాదిరి కమ్ముకొస్తోంది. హిట్లర్‌లాంటి భయంకర నియంత దేశాన్ని మింగివేస్తుంటే, ఇక్కడ నేను ప్రేమకథలు ఎలా రాయను?

1937లో అలెగ్జాండర్ కోర్డ్ నాకు ఒక సలహా ఇచ్చాడు. "నువ్వు హిట్లర్ మీద సినిమా తీయి" అని. "ఎందుకంటే, నీ మీసాలు, నీ పర్సనాలిటీ అందుకు సరిపోతాయి." అని కూడా అన్నాడు.

నేను రెండు పాత్రలు చేయవచ్చు, ఇటు ట్రాంప్‌లా మాట్లాడకుండా అటు హిట్లర్‌లా పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇస్తూ. ఈ సినిమా ఇప్పటి వాతావరణానికి సరిపోతుంది. అవును. హిట్లర్‌లా పిచ్చికేకలు వేస్తూ జర్మన్‌లను నాజీలను ఉసిగొల్పవచ్చు. ట్రాంప్‌లా అణిగి మణిగి గొణుగుతుండవచ్చు. అలా మొదలయింది 'ది గ్రేట్ డిక్టేటర్.' ఇది రాయటానికీ తీయటానికీ నాకు రెండు సంవత్సరాలు పట్టింది.

పాలెట్టీకి ఈ సినిమాలో పాత్ర వుంది. గత రెండేళ్లుగా పారమౌంట్ కంపెనీకి మంచి సినిమాలే చేసింది. మా యిద్దరికీ మధ్య దూరం పెరిగినా, మంచి స్నేహితులుగానే వున్నాము. కాని ఒక్కోసారి ఏమి చేస్తుందో తనకే తెలియదు. ఒకరోజు నేను స్టూడియోలో స్క్రిప్ట్‌తో కుస్తీ పడుతుండగా పాలెట్టి వచ్చింది. ఆమెతోపాటు మంచి సూటు వేసుకున్న యువకుడు కూడా వున్నాడు. సరాసరి నా గదిలోకి వచ్చి 'మనం వెంటనే మాట్లాడాలి చాలా ముఖ్యం' అంది.

'ఇదిగో ఇతను నా కార్యదర్శి' అని యువకుణ్ణి పరిచయం చేసింది. తను కూర్చుంటూ అతనికి కుర్చీవేసి, ఆ తర్వాత 'నువ్వు మాట్లాడు' అన్నట్లు అతని వంక చూసింది. "చాప్లిన్ గారు మీకు తెలుసు మోడ్రన్ టైమ్స్ సినిమా నుంచి మీరు ఈమెకు వారానికి 2 1/2 వేల డాలర్లు ఇస్తున్నారు. ఈ విషయం మనం చర్చించాలి" అంటున్నాడు. "వాల్ పోస్టర్లులో ఆమె బొమ్మ కూడా చిన్నది..." "ఏమిటి చెత్తవాగుడు? ఆమెకు ఎంత ఇవ్వాలో పోస్టర్లలో ఎలా వేయాలో నువ్వెవరు చెప్పటానికి? వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళిపో....." అని గట్టిగా అరిచాను.

డిక్టేటర్ తీసే సమయంలో చాలా ఆందోళన కరమైన వార్తలు వస్తుండేవి యునైటెడ్ ఆర్టిస్ట్ మా కంపెనీ నుంచి. నాకు సెన్సార్ నుంచి సమస్యలు వస్తాయి. జాగ్రత్త అని. అయినా నేను లెక్కచేయలేదు.

అలాగే ఇంగ్లాండు నుంచి హిట్లర్‌కి వ్యతిరేకంగా సినిమా తీయటం మంచిది కాదు అని సంకేతాలు వచ్చినాయి. అయినా నేను ఆపలేదు. నిజానికి నాకు హిట్లర్ హింసలు ఇంకా బాగా తెలిసి వుంటే ఈ డిక్టేటర్‌ని హాస్యాస్పదంగా తీసేవాడిని కాదు. నాజీల పిచ్చి హింసను నవ్వులపాలు చేయలేం. అవి దారుణమైనవి కదా. పైగా జర్మన్ జాతి, స్వచ్ఛమైన జాతిగా బాజాలు కొట్టుకుంటున్నారు. ఈ భూమిమీద ఆస్ట్రేలియాలోని ఆదిమజాతి తప్ప ఇంకెవ్వరూ సంపర్కం కాకుండా లేరుకదా.

నేను డిక్టేటర్ తీస్తున్నప్పుడే సర్ స్టాఫోర్డ్ క్రిప్స్ రష్యా పర్యటించి కాలిఫోర్నియా వచ్చారు. ఆయన మా యింటికి విందుకు వచ్చారు. ఆయనతోపాటు అప్పుడే ఆక్స్‌పర్డు నుంచి బైటకు వచ్చిన ఒక యువకుడు వున్నాడు. ఇప్పుడైతే అతని పేరు గుర్తులేదు కాని అతను చేసిన వ్యాఖ్య గుర్తుంది. "ఇప్పుడు జర్మనీలో గానీ, ప్రపంచంలో మరోచోటగానీ జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే ఇంకో అయిదు సంవత్సరాలకంటే ఎక్కువ జీవించటం కష్టమనిపిస్తోంది" అన్నాడు. సర్ స్టాఫోర్డ్ రష్యా వెళ్లింది అక్కడ ఏమి జరుగుతోందో తెలుసుకోవటానికి. "వాళ్ళు చాలా కష్టపడుతున్నారు" అన్నారు. "అయినా చాలా సమస్యలున్నాయి. ఈ యుద్ధాన్ని తప్పించలేము" అన్నాడు.

న్యూయార్క్‌నుంచి మళ్లీ వుత్తరాలు వచ్చాయి. ఈ సినిమాను అమెరికాలో ఇంగ్లాండులో చూపించలేరు అని. కాని నా పనిలో మార్పులేదు. సినిమా పూర్తిచేసి అవసరమయితే హాళ్లు అద్దెకు తీసుకుని విడుదల చేద్దామనే నిర్ణయించుకున్నాను.

నేను డిక్టేటర్‌ను పూర్తి చేయక మునుపే ఇంగ్లాండు నాజీలమీద యుద్ధం ప్రకటించింది. వారాంతానికి కాటలీనాలో చేపలు పడుతున్నాను, ఈ వార్త వచ్చేసరికి ఇది చాలా విచారకరమైన వార్త. అయినా జర్మనీ మాగినోట్ లైన్ దాటి రాలేరు అనే ధీమా వుంది అందరికీ.

కాని తర్వాతే నరకం బద్దలయింది. బెల్జియం మాగినోట్ రేఖ రెండూ అయిపోయాయి. ఫ్రాన్స్, కూడా నాజీలు ఆక్రమించారు. వార్తలు చాలా నిరాశాజనకంగా జర్మనీ విజయాలనే మోసుకొస్తున్నాయి. ఇంగ్లాండు చావు బతుకుల్లో యుద్ధం చేస్తోంది.

మా న్యూయార్క్ ఆఫీసు, 'సినిమా త్వరగా పూర్తి చేయండి. అందరూ దానికోసం ఎదురు చూస్తున్నారు' అని కబురు పంపుతున్నారు!

ఈ డిక్టేటర్ సినిమా చాలా కష్టమైన పనిగా వుంది. అన్ని చిన్నచిన్న నమూనాలు చేసి సెట్లుమీదకు వెళ్లాల్సివచ్చింది. అప్పటికి 5 లక్షల డాలర్లు ఖర్చుపెట్టాను. పూర్తి సెట్లు వేయాలంటే 5 రెట్లు ఎక్కువ పెట్టాలి.

అప్పుడు హిట్లర్ రష్యాను ఆక్రమించడానికి నిర్ణయించాడు. దీనికంటే అతని పిచ్చికి నిదర్శనమేముంటుంది? యుద్ధం ఐరోపా అంతా వ్యాపించింది. అమెరికా ఇంకా యుద్ధంలోకి దిగలేదు.

డిక్టేటర్ చివరి దశలోకి వస్తున్నపుడు నా స్నేహితుడు డగ్లసూ, ఆయన భార్యా సిల్వియా (మెరీయాతో విడిపోయిన తర్వాత) లొకేషన్‌కి వచ్చారు. డగ్లస్ అయిదు సంవత్సరాల నుంచీ విశ్రాంతిలోనే వున్నాడు. కొద్దిగా లావెక్కాడు. ఇంగ్లాండుకూ ఇక్కడకూ తిరుగుతున్నాడు. డగ్లస్ నాకు చాలా ప్రియమైన మిత్రుడు. అదే ఉత్సాహం, అదే ప్రేమ. ఒకటి రెండు సీన్లు చూశాడు. నవ్వు ఆపుకోలేక "అబ్బా ఎప్పుడు పూర్తవుతుంది? అన్నాళ్లు వేచి వుండటం కష్టం" అన్నాడు నవ్వుతూనే.

ఒక గంటపైన వున్నాడు. ఆయన వెళ్లిపోతుంటే అటే చూస్తు వుండిపోయాను. అతని భార్యకు చేయి అందించి నడిపిస్తున్నాడు. అలా చూస్తూనే వుండిపోయాను. ఒక్కసారి వెనక్కు చూశాడు. నేను చేయి వూపాను. తనూ చేయి వూపాడు. అదే ఆయన్ను ఆఖరిసారి చూడటం.

తర్వాత నెలకే ఒక రాత్రి గుండె పోటుతో కన్నుమూశాడని వాళ్లబ్బాయి కబురు చేశాడు.

నేను చాలా దుఃఖించాను. నాకు జీవిత కాల స్నేహితుడు. ఎప్పుడూ నా మేలు కోరినవాడు. ప్రతీ ఆదివారం ఫోన్‌చేసి 'చార్లీ భోజనానికి వచ్చేయ్. తర్వాత ఈత కొడదాం. తర్వాత టీ తాగుదాం. రాత్రికి మందు తర్వాత సినిమా చూద్దాం." ఇలా ఆహ్వానించేవాడు. ఆయన స్నేహం మరపులేనిది. నటుల్లో డగ్లస్ ఒక్కడే నా స్నేహితుడు. ఎన్ని విందులూ, విన్యాసాలూ హాలీవుడ్‌లో హాజరయినా నాకు అంతగా రుచించేవి కావు. అక్కడ గుంపులు ఎక్కువగా వుండేవి. స్నేహానికి ఎవరుంటారు? ఎలాంటి వారితో కలవాలి? తారల్నీ-నిర్మాతల్నీ కలుస్తాము. కాని తారలకు తారలు ఆనరు కదా. ఎప్పుడు బఫే పూర్తి చేసుకుని బైటపడటమే అయ్యేది. హాలీవుడ్‌లో నాకు డగ్లస్ ఒక్కడే స్నేహితుడు!

రచయితలు మంచివారే. కాని వారు ఏదీ ఎదుటవారితో పంచుకోరు. వారికి తెలిసింది పుస్తకాల్లోనే భద్రపరుస్తారేమో!

శాస్త్రవేత్తలు చాలామంచి కంపెనీ ఇస్తారు. కాని వారి ఎదురుగా కూర్చుని మనం మాట్లాడలేం. వారి విజ్ఞానం మనల్ని చిన్నవారిగా చేస్తుంది. చిత్రకారులు పెద్దవారు. వాళ్లంతా పెద్ద తత్వవేత్తలమనుకుంటారు.

ఇంక కవులు అనుమానం లేకుండా గొప్పవారే. వ్యక్తులుగా చాలా సంతోషంగా వుంటారు. చాలా ఓర్పుగలవారు కూడా. మంచి కంపెనీ ఇస్తారు. సంగీతకారులు అందరికంటే సహకారంగా వుంటారు. నిజానికి సింఫనీ ఆర్కెస్ట్రాని చూడటంలో వున్న హాయి ఇంకెందులోనూ వుండదు. వాళ్లు శ్రుతి చేసుకుంటూ నలభై ఏభయిమంది గుసగుసలాడుతూ ఒక్కసారిగా కండక్టర్ రాగానే నిశ్శబ్దంగా మారిపోతారు.

ఇంతకంటే సహకారం ఏం కావాలి? అది చాలా రమణీయంగా వుంటుంది కదా! ఒకసారి హెూరావిడ్జ్ పియోనో విద్వాంసుడు మాయింటికి విందుకు వచ్చారు. అతిథులంతా ఏదో ఏదో మాట్లాడుతున్నారు. ఆయన ఒక్కసారి లేచి నేను పియోనా వాయిస్తాను అని Schumann's Soneta No.2. ఎంతో హాయిగా శ్రావ్యంగా వినిపించారు. అలాంటిది మళ్లీ వినలేదు.

యుద్ధానికి ముందు ఆయనతో వాళ్లింటిలోనే విందుకు వెళ్లాను. ఆయన భార్యా, కూతురూ వున్నారు. అది చాలా ఆత్మీయంగా జరిగిన సమావేశం.

ఏ విందులోగానీ, సమావేశంలోగానీ 'కళ' గురించి చర్చ వచ్చినపుడు ఎన్నోరకాల వివరణలు ఇచ్చాను. ఆ విందులో కళ అంటే నైపుణ్యానికి భావావేశాన్ని మిళితం చేసి జోడించటం అని అన్నాను. ఎవరో మతప్రసక్తి తెచ్చారు. అప్పుడు చెప్పాను, నేను మతవిశ్వాసం లేనివాడిని అని. అప్పుడు Rachmanif roft అన్నారు. "మతం లేకుండా కళ ఎలా వుంటుంది?" అని. నేను అవాక్కయ్యాను.

'నా వుద్దేశ్యం మతం అంటే మూఢచారమనే. కళ అలాంటిదానికి అతీతమైంది' అన్నాను.

'మతం కూడా అంతే' అన్నాడాయన. అక్కడితో నోరు మూసుకున్నాను.

ఒకసారి స్ట్రావిన్స్కి 'మనిద్దరం కలిసి సినిమా తీద్దామ'న్నారు. నేనొక కథ కల్పించాను. అది కాస్త అధివాస్తవికంగా వుంటుంది.

వ్యాపారంలేని నైట్‌క్లబ్ – అక్కడ డాన్స్ ఫ్లోర్ చుట్టూ బల్లలు వేసి వుంటాయి. అన్ని బల్లల దగ్గరా ప్రపంచంలో వున్న అన్ని రకాల వాళ్ళూ కూర్చుని తాగుతుంటారు. గుంపులుగా ఇద్దరిద్దరుగా కొందరు వ్యాపారం మాట్లాడతారు. కొందరు వారి లోభాన్ని

ది గ్రేట్ డిక్టేటర్

బైట పెడుతుంటారు. కొందరు లోపల ఒకటి బైటకి ఒకటీ చెప్తుంటారు. మరికొందరు వాళ్ల అసహ్యమైన ప్రణాళికలు రచిస్తుంటారు. ఇంతకీ డాన్సుఫ్లోరు దగ్గర జరిగేది క్రీస్తుని సిలువ వేయటం. ఆ ప్రక్రియ అక్కడ జరుగుతుండగానే తిండికోసం, తాగుడుకోసం, ధనంకోసం, కీర్తికోసం కొట్లాడుకుంటూ క్రీస్తు బోధను ఎవరూ పట్టించుకోరు. అది వాళ్లకు ఒక వినోదంగానే వుంటుంది. అందులో ఒకడు బాగా తాగి 'అయ్యో క్రీస్తుని సిలువ వేస్తున్నారు ఎవరూ పట్టించుకోరే' అని అరుస్తుంటాడు. అతన్ని ఆ క్లబ్‌గార్డులు బైటకు మోసుకుపోతారు.

ఒకడు సిగరెట్టు పీలుస్తూ పొగ వదుల్తుంటాడు. మరొకడు 'పెద్ద వ్యాపారం వచ్చింది' అని అరుస్తుంటాడు.

మరొక దంపతులు తిండికోసం చాలా ఉత్సాహంగా తమకు కావలసినవన్నీ చేస్తుంటారు. అందులో ఆమె అంటుంది "ఏమిటి ఇది పాపం కదా" అని. 'కాదు. ఎప్పుడూ చర్చికి వెళ్లనివాళ్లు కూడా క్రీస్తుకు జరిగింది తెలుసుకుంటారు' అని అంటాడు భర్త. తాగుబోతు 'అయ్యో ఎవరూ పట్టించుకోరే' అని బైటనుంచి అరుస్తుంటాడు.

బహుశా ఈ 'మతం మతం' అనేవాళ్లు షోని పాడు చేస్తున్నాడని అతన్ని బైటకు తోశారు. ప్రపంచానికి కావలసింది వారి స్వార్థమే.

ఇదంతా విని ఆ సంగీత దర్శకుడు 'ఇది పాపం, ఇలాంటిది చూపించకూడదు' అన్నాడు. నా వుద్దేశ్యం కూడా అదే – ఈ ప్రపంచం చెప్పేది ఒకటి – చర్చిలో అంతా వ్యతిరేకము' అన్నాను. కాని 'ఇది పాపం' అని అన్నాడు. అక్కడితో ఆ కథ ఆపేశాను.

Hanns Eister, Schonberg అనే సంగీత దర్శకుణ్ణి న్యూయార్క్‌కి తీసుకువచ్చాడు. ఈయన మోడ్రన్ టైమ్స్ చూసి మీ సంగీతం బాగోలేదని అన్నాడు. నేను అంగీకరించాను. సంగీతం గురించి మాట్లాడుతూ ఆయన ఇలా అన్నారు.

'నాకు శబ్దాలు అంటే ఇష్టం – అందమైన శబ్దాలు, మధురమైన శబ్దాలు అంటే ఇష్టం' అన్నాడు. ఈయన గురించి హాన్స్ ఒక కథ చెప్పాడు. ప్రతి ఉదయం అయిదుమైళ్లు మంచుతో నడిచి గురువు ఇంటికి వెళ్లి సంగీతం నేర్చుకునేవాడని. ఒకసారి అలా వెళ్లి గురువు వెనకాల నిలబడ్డాడట. ఆయనకు బట్టతల. పియోనో దగ్గర కూర్చుని నేర్పుతున్నాడు. ఈయన పాపం అయిదు మైళ్లు మంచులో వెళ్లి వెనకాల

నుంచుని ఊపిరి వదుల్తుంటే 'బాబూ కొంచెం దూరం వుంటావా – నీ చల్లని శ్వాస నా బట్టతలను మరీ చల్లబరుస్తోంది' అని ఆయన గురువు అన్నాడని చెప్పాడు.

డిక్టేటర్ తీస్తున్నంతకాలం నాకు బెదిరింపు వుత్తరాలు వస్తూనే వున్నాయి. ఇప్పుడు పూర్తయింది. ఇంకా ఎక్కువ వుత్తరాలు వస్తున్నాయి. 'విడుదల చేస్తే ఊరుకోం – రచ్చ చేస్తాం – థియేటర్లలో బాంబులు వేస్తాం' అని కూడా వచ్చారు. ముందు ఈ విషయం పోలీసులకు చెప్పాలనుకున్నాను. కాని ఈ రకమైన ప్రచారం ప్రేక్షకులు రాకుండా చేస్తుంది. అందుకని హెర్రీ బ్రిడ్జెస్ అని కార్మిక నాయకుడు ఒకాయన వున్నాడు. ఆయన్ని కలిస్తే వుపయోగం వుండవచ్చని సలహా ఇచ్చారు. ఆయన్ను విందుకు పిలిచి, అసలు విషయం చెప్పాను. బ్రిడ్జ్ కూడా నాజీలకు వ్యతిరేకమే. నేను మీ వాళ్లని 25 మందిని పంపండి విడుదలకు వాళ్లు ఏమైనా గొడవచేస్తే వాళ్లు కాళ్లు తొక్కవచ్చు' అని అన్నాను. ఆయన నవ్వి "చార్లీ మీ భయాలన్ని అనవసరం. అది అంతవరకూ రాదు. నాజీలు ఎప్పుడూ పగలు కనపడరు' అన్నాడు.

ఆ రాత్రి నాకు ఆయన సాన్‌ఫ్రాన్సిస్కో సమ్మెగురించి చాలా చెప్పాడు. ఆ సమ్మె ఈయనే సారధ్యం వహించాడని అవసరమైనవి మాత్రం మినహాయింపు ఇచ్చి నిత్యావసరాలు మందులు అలాంటివి – మిగతా మొత్తం సమ్మె చేయించమని. "మీరు చేసేది సరైన అవసరానికైతే ప్రజలే మద్దతు ఇస్తారు. అలా కాకపోతే వారికి ఉన్న విషయం చెప్పాలి. వారే నిర్ణయించుకుంటారు మంచి–చెడులు."

'నేను మా వాళ్లకి చెప్తాను. సమ్మె చేయటానికి నిర్ణయించుకుంటే నేను ముందు నిలబడతాను కాని సమ్మె ఫలితం ఎప్పుడూ చెప్పలేం' అని. అది అలా ముగిసింది.

ది గ్రేట్ డిక్టేటర్ చివరికి న్యూయార్క్‌లో రెండు థియేటర్లలో విడుదల అయింది. ఆస్టర్, కాపిటల్. "ఇది గొప్ప సినిమా" అని హెర్రీ (ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్‌కి సలహాదారు) అన్నారు. 'చాలా కష్టపడి తీశారు,' 'కాని దీనికి సొమ్ము రాదేమో' అని అనుమానం వ్యక్తం చేశారు.

20 లక్షల డాలర్లూ, రెండు సంవత్సరాల శ్రమ! ఆయన అనుమానాలు నన్ను ఏమీ కంగారు పెట్టలేదు. కాని అవి తప్పని ఆరోజే తేలిపోయింది. డిక్టేటర్‌కి విపరీతమైన రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు వచ్చినాయి.

కాని పత్రికల వాళ్ళ రివ్యూలు మాత్రం రెండు రకాలుగా వున్నాయి. అందులో నా చివరి ఉపన్యాసం చాలా విమర్శలను రేకెత్తించింది. నన్ను కమ్యూనిస్టుగా కూడా ముద్రవేశారు. కాని నాకు వచ్చిన వుత్తరాలు ప్రశంసలు నన్ను ఆనందంలో ముంచాయి.

Archise L. Masyo ఈయన హాలీవుడ్ గొప్ప దర్శకులలో ఒకరు. నా ప్రసంగాన్ని నా అనుమతితో క్రిస్టమస్ కార్డుమీద ఇలా ముద్రించి పంచాడు. దానికి ఈ పరిచయ వాక్యాలు కూడా కలిపాడు.

నేను లింకన్ కాలంలో వుండి వుంటే అబ్రహాం లింకన్ గెట్టాన్‌బర్గ్‌లో చేసిన ప్రసంగం పంపించి వుండేవాడిని. ఆ రోజుల్లో అది చాలా ఉత్తేజ పూర్వకమైన ప్రసంగం అని పేరుగడించింది. ఈరోజు మనం ఎదుర్కునే సమస్యలు కొత్తవి. మరొక నిజాయితీ, బాధ్యతాగల వ్యక్తి ఈక్రింది ప్రసంగాన్ని ఆయన గుండె లోతుల్లోంచి పలికాడు. ఆయన నాకు కాస్త పరిచయమే అయినా, ఈ వాక్యాలు నన్ను ఎంతగానో కదిపివేశాయి. ఈ ప్రసంగం పూర్తి పాఠం చార్లీ చాప్లిన్ వ్రాసింది. మీకు పంపుతున్నాను. మీరు కూడా ఈ విశ్వాసాన్ని పంచుకుంటారనే ఆశతోనే..

మీ

మేస్కో

డిక్టేటర్ చేసిన చివరి ప్రసంగం:

నాకు చక్రవర్తిని కావాలనే కోరికలేదు. అది నా వుద్దేశ్యమూ కాదు. నేను ఎవ్వరినీ పాలించాలనీ, గెలవాలనీ అనుకోటం లేదు. అందరికీ సహాయం చేయాలనే అనుకుంటున్నాను. అదీ అవకాశం ఉంటేనే రంగూ జాతికీ అతీతంగా.

మనందరం పరస్పరం సహాయం చేసుకుంటాం. మానవజాతి నైజమే అంత. పరస్పర సంతోష సమయాలను పంచుకోవాలని కోరుకుంటాము. అంతేగాని మరొకరికి దుఃఖాన్ని కలిగించాలని అనుకోము. ఒకరినొకరు ద్వేషించుకోవాలనీ అంతం చేయాలనీ అనుకోం. ఈ భూమిమీద అందరికీ జాగా వుంది. ఈ చల్లని తల్లి ఒడిలో అందరికీ సరిపడిన సంపదా వుంది.

మన జీవితాలు స్వేచ్ఛగా సుందరంగా ప్రయాణం చేయవచ్చు. కాని మనం ఆ దారి తప్పాము. లోభం మనల్ని విషపూరితం చేసింది. పరస్పర ద్వేషంతో గోడలు కట్టింది. మనల్ని దుఃఖాగ్నిలోకి తోసి రక్తసిక్తం కావించింది.

మనం వేగాన్ని అందుకున్నాం. కాని అందుకు ఉపయోగించే పెట్టెలోనే బందీ అయిపోయాము. మనకు సహాయం చేయవలసిన యంత్రాలు మనల్ని వాడుతున్నాయి. మన విజ్ఞానం మనల్ని మూర్ఖులుగా మార్చింది.

మన తెలివితేటలు కాఠిన్యాన్నీ నిర్దయనూ పెంచాయి.

మనం ఎంతో ఎక్కువ ఆలోచిస్తాం – ఏమీ మనసుకు తీసుకోము.

మనకు యంత్రాలకంటే మానవత్వం కావాలి. మనకు తెలివి తేటలకంటే మనకు దయ, మంచితనం కావాలి. ఇవన్నీ లేకపోతే మన జీవితాలు దారుణంగా హింసాత్మకంగా మారతాయి.

విమానాలూ, రేడియోలూ మనల్ని దగ్గర చేశాయి. వీటి వుద్దేశ్యమే మానవజాతిని ఒకటి చేయాలని విశ్వమానవ సౌభ్రాత్రుత్వాన్ని కోరుకుంటాయి. ఇప్పటికిప్పుడు నా గొంతు లక్షలమంది వింటున్నారు ప్రపంచమంతా. లక్షలమంది దిక్కులేనివారు ఆడ, మగ, చిన్నారులు, అమాయికులు దరిద్రపు వ్యవస్థలో నరకాన్ని అనుభవిస్తున్నారు. వింటున్నారు. నా మాటలు వినేవారికి నేను చెప్పేది: నిరాశ చెందకండి! ఇప్పటి కష్టం, అది త్వరలోనే అంతరించిపోతుంది. ఈ లోభత్వం నుంచి అంకురించిన ఈ దుఃఖం నిలిచేది కాదు. మానవజాతి ఎదుగుదలకు భయపడే ఏ కొద్దిమందివలనో ఇది సంభవించింది. ఈ ద్వేషం నశించి పోతుంది. నియంతలు నాశనమైపోతారు. వాళ్లు చేపట్టిన అధికారం తిరిగి ప్రజలకే దక్కుతుంది. మనుష్యులు మరణించనంతకాలం స్వేచ్ఛ బ్రతికే వుంటుంది.

సైనికులారా! మీరు ఆ మూర్ఖులు చెప్పే మాటలు వినకండి. మిమ్మల్ని బానిసలుగా మార్చినవారి మాటలు – మిమ్మల్ని గొర్రెల మందలుగా నిలిపిన వారి సూక్తులను వినకండి. వారికే మీ వాణిని వినిపించాలి. మీకు ఏమీ కావాలో – మీరు ఏమి అనుకుంటున్నారో వినపించండి! మిమ్మల్ని కవాతు చేయించి ఇంత కబళంవేసి పశువుల్లా చూసే అధికారులు మిమ్మల్ని ఫిరంగుల్లా వాడుకుంటున్నారు. మిమ్మల్ని మీరు అలాంటి అసహ్యమైన జీవుల మరమనుషుల (వారికి బుద్ధియంత్రం, మనసు యంత్రమే) చేతుల్లో పడిపోకండి. మీరు యంత్రాలు కాదు. మీరు మనుష్యులు – ప్రేమించే శక్తి వున్న ప్రేమించే హృదయం వున్న మనుష్యులు. అందుకని ద్వేషించకండి. ప్రేమించటం తెలియనివారే ద్వేషిస్తారు.

అంటే అసహజమైన వారు. వారు కృత్రిమమైనవారు. సైనికులారా, బానిసత్వం కోసం పోరాడకండి. స్వేచ్ఛకోసం విముక్తికోసం పోరాడండి.

సెయింట్ లూక్ 17వ చాప్టర్‌లో దేవుని సామ్రాజ్యం మనిషిలోనే వుందని రాసి వుంది.

మీలోనే ప్రజల్లోనే శక్తి వుంది. యంత్రాలను తయారుచేసే శక్తి, మన బ్రతుకుల్ని అందంగా మలిచే శక్తి, మనకు స్వేచ్ఛను ప్రసాదించే శక్తి మీలోనేవుంది.

అందుకని, ప్రజాస్వామ్యం పేరుతో ఆ శక్తిని మన ఐక్యత కోసం వుపయోగించుకుందాం. మనం ఒక కొత్త ప్రపంచంకోసం పోరాడుదాం. అది యోగ్యమైన ప్రపంచం. అందరికీ సమాన అవకాశాలను అందించే ప్రపంచం యువతకు బంగారు భవిష్యత్తునూ, ముసలివారికి భద్రతనూ కల్పించే ప్రపంచంకోసం ఉపయోగించుదాం. కలిసి కదలండి!

ఇలాంటి వాగ్దానాలు పలికే క్రూరులు, దుష్టులు, అధికారంలోకి వచ్చారు. కాని వారివి అబద్ధాలు. వారు ఏ వాగ్దానాన్నీ నెరవేర్చలేదు. నియంతలు వారు స్వేచ్ఛగా వుంటారు. ప్రజలను బానిసలుగా వుంచుతారు. ఇప్పుడు మనం ప్రపంచాన్ని దాస్య విముక్త చేద్దాం. పోరాడండి. ఈ దేశాల సరిహద్దుల్ని చెరిపివేయండి. ఈ లోభత్వాన్ని తరిమివేయండి. ద్వేషానిఃన్నీ, అసహనాన్నీ వదిలివేయండి. ఇప్పుడు మనం హేతుబద్ధమైన మనుగడకోసం పోరాడుదాం. విజ్ఞానం, అభివృద్ధి ఇవే సంతోషాన్ని తెచ్చిపెడతాయి.

సైనికుల్లారా, ప్రజాస్వామ్యంకై, ప్రజాశ్రేయస్సుకై పోరాడండి. సైనికులారా సమైక్యత వర్ధిల్లాలి.

హన్నా! వినపడుతోందా? నువ్వెక్కడున్నాసరే ఇటుచూడు. మబ్బులన్నీ విడిపోతున్నాయి. సూర్యోదయం అవుతోంది. చీకట్లన్నీ తొలగిపోతున్నాయి. వెలుగులోకి వస్తున్నాము. కొత్త ప్రపంచంలోకి వస్తున్నాము. దయా క్షమా గల ప్రంచంలోకి వస్తున్నాము. ఇక్కడ లోభానికి తావులేదు. ద్వేషానికి కాఠిన్యానికీ ఆస్కారం లేదు. చూడు హన్నా! మనిషి మనసుకు రెక్కలు వచ్చాయి. అతను ఎగర గలుగుతున్నాడు. అతను ఇంద్ర ధనస్సులోకి జ్యోతివైపు ఎగర గలుగుతున్నాడు. చూడు హన్నా! చూడు!

'డిక్టేటర్' విడుదల తర్వాత నన్ను మధ్యాహ్న భోజనానికి ఆహ్వానించాడు ఆర్థర్ సల్జ్‌బెర్గర్. ఈయన 'న్యూయార్క్ టైమ్స్' అధిపతి. నేను అక్కడి అదే టైమ్స్ బిల్డింగ్ చేరిన తర్వాత నన్ను ఆ భవనం చివరి అంతస్తుకు తీసుకు వెళ్ళారు. అక్కడ నివాసం వుండే స్వీటులోకి ఆహ్వానించారు. అక్కడ అతిథులు కూర్చునే స్థలంలో చిత్రాలూ, ఫోటోలూ వేలాడతీసి వున్నాయి. అలాగే మంచి ఖరీదయిన సోఫాలున్నాయి. అక్కడా వున్న చలిమంట గూటి దగ్గర అమెరికా మాజీ అధ్యక్షుడు హెర్బెర్ట్ హూవర్ చాలా ఎత్తైన విగ్రహం, ఒక మునిలాగా చిన్న కళ్లతో చూస్తున్నాడు. నన్ను 'అధ్యక్షుల వారికి పరిచయం చేసాడు. సల్జ్‌బర్జర్. ఆయన ముడతల ముఖంలో నవ్వు విరిసింది." "అవును, మేము చాలా సంవత్సరాల క్రితం కలిశాం" అన్నాడు.

ఆశ్చర్యపోవటం నా వంతు అయింది. ఆయనకు ఇంకా ఎలా గుర్తుంది? వైట్‌హౌస్‌లో అధ్యక్షుని హోదాలో ఎంతో పని వత్తిడిలో వున్న ఆయన, ఆస్టర్ హౌటల్‌లో పత్రికల వాళ్ళ విందులో పాల్గొనటానికి వచ్చారు. అక్కడికి నన్ను ఏదో సత్రకాయలా ఒక సభ్యుడు తీసుకు వచ్చాడు. అప్పటికింకా అధ్యక్షుని ప్రసంగం ప్రారంభం కాలేదు. అప్పుడు నేనేమో విడాకుల గొడవలో వున్నాను. ఆయనతో ఏదో గొణిగి వుంటాను. ఏదో రాజకీయ పరిస్థితుల తెలిసినట్లు (నిజానికి నా పరిస్థితే నాకు అయోమయంగా వుంది!) ఇలా రెండు నిమిషాలు మాట్లాడి కూర్చున్నాను. తర్వాత అధ్యక్షుల వారికి నన్ను పరిచయం చేశారు. నేను 'ఎలా వున్నారు అధ్యక్షా' అని మాత్రం అన్నాను. తర్వాత ఆయన మాట్లాడాడు. అదీ చిందరవందరగా వున్న రాత కాగితాలు పట్టుకుని. పేజీ తర్వాత పేజీ తీస్తూ గంటన్నర మాట్లాడాడు. అందరూ ఆ కాగితాలవంకే చూస్తున్నారు. రెండుగంటల తర్వాత ఆ కాగితాలు విడివిడిగా పడివున్నాయి. అవి నిజంగా ఎంతో విలువైన క్షణాలు. జీవితంలో ఏదీ శాశ్వతం కానట్లే అధ్యక్షులవారి ప్రసంగం కూడా ముగిసింది! చాలా అద్భుతంగా ప్రసంగాన్ని ముగించాడు. నేను వెళ్లి అభినందనలు చెప్పాలనుకున్నాను. కాని ఆయన హడావుడిగా వెళ్లిపోయారు.

ఇప్పుడు ఇన్నేళ్ళ తర్వాత నన్ను గుర్తించి పలకరించడం ఆయన గొప్పతనానికి తార్కాణం.

తర్వాత భోజనానికి కూర్చున్నాం. కేవలం పన్నెండుమందిమి. అప్పటికే నాకు చెప్పారు ఇలాంటి విందులు కేవలం అతి ముఖ్యులకేనని!

ఇక్కడి అమెరికన్ అధికారులు నన్ను చాలా చిన్నబుచ్చినట్లుంటారు. ఎందుకంటే వాళ్లేమో అక్కడి ఆకాశ హార్మ్యాలలాగా ఎత్తుగా వుంటారు. ఖరీదయిన సూట్లు వేస్తారు. ఇక వారి భాష అది మనకు అర్థం కాదు. వారు మానవ సంబంధాలు కూడా వ్యాపార ధోరణిలో ప్రపంచ గణిత శాస్త్ర వివరాలతో ముడిపెడతారు. అదిగో అలాంటి వారే నా చుట్టూ కూర్చున్నారు. అక్కడవున్న ఒకే ఒక మానవ మాత్రురాలు యాన్ డీ హారే ఆమె ఆ పత్రిక రాజకీయ విలేఖరి!

భోజనాల దగ్గర అంతా మామూలుగానే వుంది వ్యవహారం. మా సంభాషణ చాలా కష్టంగా వుంది. అందరూ ఆయన్ను మాటిమాటికి 'అధ్యక్షా' అని అంటున్నారు (ఆయన మాజీ కదా, ఇది అవసరమా?).

అప్పుడు నాకు తట్టింది. ఇక్కడకు నన్ను ఊరకే ఆహ్వానించలేదు. విషయం వుంటుంది అని.

అప్పుడు సుల్జ్‌బర్గర్ 'అధ్యక్షా! మాకు మీ ప్రణాళిక వివరిస్తారా?' అని అడిగాడు. "అదీ ఐరోపా చేయవలసిన వ్యవహారం' అని కూడా అందించాడు.

అప్పుడు హూవర్స్ చేతిలోని కత్తి, ఫోర్కు పళ్లంలో పెట్టి ఆలోచనతో, నోటిలో వున్నది మింగి, మనసులో వున్నది చెప్పటం మొదలుపెట్టారు. ఆయన పళ్లెంలోనే మాటలు వదులుతున్నారు.

"మనందరికీ తెలుసు ఇప్పుడు ఐరోపాలో పరిస్థితి ఎలావుందో. అక్కడ యుద్ధం మూలంగా కరువు కమ్ముకుంది. నేను వాషింగ్టన్‌తో చెప్పాను (అంటే రూజ్‌వెల్ట్ అనుకోవాలి). అక్కడ కరువు కోరల్లో ఎన్ని లక్షలమంది ఇరుక్కుపోయారో గణాంక వివరాలు ఇచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధపు రోజుల్లో ఐరోపాన్నంతా మేము పోషించాము. ఇటువంటి వ్యవహారం కేవలం మానవత్వం కోసమే కాని ఎటువంటి రాజకీయ వుద్దేశాలు వుండవు.' అన్నాడు. నేను తల వూపాను. అప్పుడు సుల్జ్‌బర్గర్ 'మీరు ఎప్పుడు మొదలు పెడదామనుకుంటున్నారు అధ్యక్షా!' అన్నాడు.

'వాషింగ్టన్ నుంచి అంగీకారం రాగానే' అన్నాడు. 'దీనికి బాగా పేరున్న వ్యక్తులు అవసరం వుంటుంది' ఇప్పుడు 'ఫ్రాన్సు హిట్లర్ చేతిలో వుంది. లక్షలమందికి తిండి లేదు. మందులు లేవు. నార్వే, డెన్మార్క్, హాలాండ్, బెల్జియం ఒకటేమిటి ఐరోపా అంతా కరవు తాండవం చేస్తుంది."

ఆ తర్వాత నిశ్శబ్దం ఆవరించింది. నేను గొంతు సవరించుకుని "అవును మొదటి యుద్ధంలాగా లేదు. ఇప్పుడు అంతటా నాజీలు ఆక్రమించారు. మనం చేసే సహాయం వాళ్ళ చేతుల్లో పడకూడదు కదా?" అన్నాను.

టేబుల్ చుట్టూ కదలిక వచ్చింది. హువర్ కాస్త చిరాకు పడినట్లున్నారు. ఆయనతో అందరూ పడ్డారు.

"మన జాగ్రత్త మనం పడాలి. అమెరికన్ రెడ్‌క్రాస్ సహాయం తీసుకుందాం. Hague ఒప్పందం, 27 పేరా, సెక్షన్ 43 ప్రకారం. 'కమీషన్ ఆఫ్ మేరీ' అన్ని రకాల బాధితులకు సహాయం అందాలని చెప్తుంది."

"మీరు చెప్పిన దానికి పూర్తిగా అంగీకరిస్తున్నాను. కాని ఆహార పదార్థాలు నాజీల చేతుల్లో పడకూడదు" అన్నాను. మళ్లీ కదలిక కలిగింది టేబుల్ చుట్టూ! 'ఇలాంటివి ఇదివరకు చేశాం' అని అన్నారు. తర్వాత మిగతావారు. 'అవును అధ్యక్షులు ఇటువంటివి జాగ్రత్తగా చేయగలరు' అని కలిపారు. చాలామంచి ఆలోచన" అని సుల్జ్‌బర్గర్ అన్నారు.

'నేను ఒప్పుకుంటున్నాను. నూటికి నూరుపాళ్లు! ఇదంతా యూదులు చేస్తేనే బాగుంటుంది' అన్నాను. 'అదెలా సాధ్యం?' అని అధ్యక్షులు ముగించాడు! న్యూయార్క్ నిండా నాజీలు వున్నారు! చిన్నచిన్న గుంపులుగా వారు హిట్లర్ చేస్తున్న కిరాతకాన్ని సమర్థిస్తున్నారు. "హిట్లర్ చెప్పేది సరైనది. ఇది యంత్ర యుగం. ఇక్కడ మధ్యవర్తులతో పనిలేదు. అలాగే యూదులతోకూడా' అన్నారెవరో. అక్కడ వున్న స్త్రీ "ఏమంటున్నారు – ఇది అమెరికా. ఎక్కడున్నారు మీరు?' అని గద్దించింది. 'నేను అమెరికాలోనే వున్నాను. నేను ఇక్కడిపౌరుణ్ణి' అన్నాడు ఆ యువకుడు.

నేను మెల్లగా వచ్చేశాను.

రెండురోజుల తర్వాత ఒక ఫ్రెంచ్ ఆసామి ఇంటికి వెళ్లాను. ఆయన Pierre Laval కూతురుకు మొగుడు. నన్ను బలవంతాన లంచ్‌కి వుంచారు. ఆయన డిక్టేటర్ చూశాడట. "మీరు బ్రహ్మాండంగా తీశారు. మీతో ఏకీభవించాలని లేదుగా.'

'అవును అది కామెడియేగా' అన్నాను.

కానీ నాకు నాజీల దుకాణాలూ, హత్యలూ, హింసలూ తెలిసివుంటే అలా కామెడీగా తీసేవాణ్ణి కాదు. అక్కడ ఒక 50 మంది వున్నారు. ఒకో టేబుల్‌కీ నలుగురు – నన్ను

రాజకీయాలలోకి లాగాలని చూశారు. కాని 'నేను మంచి ఆహారం బాగుంటుంది ఆ మాటలకంటే' – అని గ్లాసు పైకి ఎత్తాను' అంతలో రెండో టేబుల్ దగ్గర ఇద్దరు ఆడవాళ్లు తగువులాడుతున్నారు. "నువ్వు చెప్పేది నేను వినను, నువ్వు నాజీవి." అంది అందులో ఒకటి.

నన్ను అడిగారు 'మీరు ఎందుకు యాంటీ నాజీ' అని. వాళ్లు ప్రజాద్రోహులు అందుకని."

'మీరు యూదులా' అన్నాడు.

"ప్రజాద్రోహుల్ని విమర్శించటానికి యూదులు కావలసిన పనిలేదు' అన్నాను. అంతటితో అది ముగిసింది.

ఆ తర్వాత ఒకటి–రెండు రోజులకు 'అమెరికన్ తిరుగుబాటుదారులు సభామంటపానికి వెళ్లవలసి వుంది. అక్కడ డిక్టేటర్ చివరి ఉపన్యాసం రేడియోలో చదవాలి.

అంతకు ముందుగానే అధ్యక్షుడు రూజ్‌వెల్ట్‌ను కలిసేందుకు రమ్మన్నాడు. వారు అడిగినమీదటే 'డిక్టేటర్' వైట్‌హౌస్‌కు పంపాము.

నన్ను అధ్యక్షుని ఆంతరంగిక కార్యాలయంలోకి తీసుకువెళ్లారు. అక్కడ అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ నన్ను చూసి, "రండి, కూర్చోండి చార్లీ. మీ సినిమా మాకు అర్జెంటీనాలో చాలా సమస్య తెచ్చిపెడుతోంది" అన్నారు. అంతవరకే.

నా స్నేహితుడు తర్వాత నాతో అన్నాడు – నిన్ను వైట్‌హౌస్‌కి రమ్మన్నారు, అక్కడ నిన్నెవరూ కౌగిలించుకోలేదుగా అని.

అధ్యక్షునితో నలభై నిమిషాలు కూర్చున్నాను. ఆ సమయంలోనే ఆయన నాకు రెండు మూడు గ్లాసులు జిన్ ఇచ్చారు. నేను నా సిగ్గు దాచుకుంటానికీ అవి తాగేశాను. ఇక నేను వెళ్లే సమయం రాగానే నన్ను బైటకు నడిపించుకుంటూ వచ్చినట్లు గుర్తు.... అప్పుడు ఒక్కసారిగా నేను రేడియోలో మాట్లాడాలిసిన విషయం జ్ఞాపకం వచ్చింది. అదీ దేశమంతా వింటుంది! ఆరు కోట్లమంది శ్రోతలు! అంతే గదికి వెళ్లి తలంటు చల్లనీళ్లతో రెండుసార్లు చేసి, కాస్త తేరుకున్నాను. పాలు లేకుండా కాఫీ తాగాను. రేడియోకోసం నన్ను నేను సిద్ధం చేసుకున్నాను.

అప్పటికింకా అమెరికా యుద్ధంలో పాల్గొనలేదు. నేను వెళ్లే సభలో చాలామంది నాజీలు వుంటారు, ఉన్నారు కూడా. నేను ఉపన్యాసం మొదలు పెట్టగానే – దగ్గులు వినపడ్డాయి. అవి కృత్రిమమైనవి కాబట్టి గట్టిగా వినబడ్డాయి. అంతే నాకు గొంతు వణకటం మొదలయింది. తడారిపోయింది కూడా! నా నాలుక అంటుకుపోతున్నట్లుంది. మొత్తం ప్రసంగం ఆరు నిమిషాలు. అతి కష్టంమీద మూడు నిమిషాలు చదివాను. ఇంక నా వల్లకాలేదు. ఆపి మంచి నీళ్లు కావాలన్నాను. అది ప్రత్యక్ష ప్రసారం! దగ్గర్లో నీళ్లున్నట్లు లేదు. రెండు నిమిషాలకుగాని రాలేదు. ఈ రెండు నిమిషాలు 6 కోట్లమంది నిశ్శబ్దాన్ని వింటూనే వున్నారు! నీళ్లుతాగి, క్షమించమని అడిగి, ఎట్లాగో మిగతా మూడు నిమిషాల ఉపన్యాసాన్ని ముగించాను!

విరవై ఆరవ అధ్యాయం

మళ్లీ విడాకులు

ఇక నేనూ పాలెట్టీ విడిపోక తప్పదు. ఇది మాకు ఈ 'డిక్టేటర్' సినిమా విడుదలకు ముందే తెలుసు. ఇక ఇప్పుడు ఒక నిర్ణయానికి రావలసిన సమయం వచ్చింది. పాలెట్టి నాకు ఒక కబురు పంపింది. కాలిఫోర్నియా వెళ్లి పారమౌంటుకి మరో సినిమా చేస్తున్నట్లు. అందుకని నేను న్యూయార్క్‌లోనే కాలం గడుపుతున్నాను. నాకు బెవర్లీ హిల్స్ ఇంటినుంచి ఫ్రాంక్ (నా బట్లరు) ఫోనుచేసి, పాలెట్టి మేడమ్ వచ్చి వెంటనే సామానుతో వెళ్లిపోయారని చెప్పాడు.

నేను తిరిగి వచ్చిన తర్వాత తెలిసింది పాలెట్టి మెక్సికో వెళ్లి విడాకుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు.

బెవర్లీ హిల్స్‌లో నా యింటిలో ఒకరకమైన విషాదం అలుముకుంది. ఎనిమిది సంవత్సరాల బంధం తెంపుతుంటే గాయాలకేమీ కరువుండదు కదా!

ఈ 'డిక్టేటర్' సినిమా అమెరికాలో చాలా ప్రాచుర్యం పొందినా, అది నాకు చాలా వ్యతిరేకత సంపాదించి పెట్టింది. దీని సూచనలు పత్రికల్లో, పత్రికా విలేకరుల్లో ప్రస్ఫుటంగా వుంది. ఆ రోజు విలేకరుల సమావేశంలో వచ్చిన వాళ్లంతా ఏమీ స్నేహపూర్వకంగా లేరు. నేను అందరికీ 'డ్రింక్' తీసుకోమని చెప్పాను. వాళ్లు వద్దన్నారు. మామూలుగా ఎప్పుడూ వద్దు అనరు పత్రికలవాళ్లు.

'మీ మనసులో ఏముంది, చార్లీ!' అన్నాడు ఒకాయన అందరి తరుపునా.

'ఏదో కొంత ప్రచారం వస్తుందికదా!' అన్నాను నవ్వుతూనే. నేను అధ్యక్షునితో సంభాషణ, అర్జెంటీనాలో సమస్య గురించీ చెప్పాను. అయినా వాళ్లేమీ మెత్తపడలేదు.

'ఇది మీకేమీ నచ్చినట్లు లేదు?' అన్నాను.

"అవును ఏమీ నచ్చలేదు. మీకు ప్రజలతో సత్సంబంధాలున్నట్లు లేదు?" అన్నాడు.

"అంతేకాదు మీరు పత్రికలను కూడా చిన్నచూపు చూస్తున్నారు" అన్నాడు. 'ఇది మాకు నచ్చలేదు' అని కలిపాడు.

అసలు నాకు ఎప్పుడూ పత్రికల వాళ్ళతో సరైన సంబంధాలు వున్నట్లుగా గుర్తించలేదు. అదీ ముఖ్యంగా హాలీవుడ్‌లో! అందుకనే నేను 'డిక్టేటర్' విడుదల ముందు వీళ్లను కలవలేదు. అంత ప్రయోజనం ఆశించలేదు కాబట్టే 20 లక్షల డాలర్లు పెట్టుబడి గాలికి వదిలేయలేక!

"అవును. ఇది యాంటి నాజీ, దీనికి అమెరికాలో కూడా చాలామంది శత్రువులుంటారనే. చివరి వరకూ పత్రికలకు చూపలేదు. ముందు ప్రజల్లోకి తీసుకు వెళ్లాను" అన్నాను.

నేను ఏది చెప్పినా వాళ్లకు ఎక్కలేదు. తర్వాత పత్రికల్లో చాలా వ్యతిరేకంగా నన్నూ, నా వ్యక్తిగత జీవితాన్నీ ఎత్తి చూపటం మొదలయ్యింది. ఇంత జరిగినా 'డిక్టేటర్' సినిమా అమెరికాలోనూ ఇంగ్లాండులోనూ బ్రహ్మాండంగా వసూలు చేసింది.

ఇంకా అమెరికా, యుద్ధంలో దిగకపోయినా రూజ్‌వెల్ట్ హిట్లర్‌తో ప్రచ్ఛన్నయుద్ధం నడుపుతున్నాడు. దీనివల్ల అధ్యక్షునికి చాలా ఇబ్బందులు వచ్చినాయి. నాజీలు అమెరికాలోకి యధేచ్ఛగా చొరబడ్డారు. అన్నిరకాల వ్యాపారాల్లో, పరిశ్రమల కార్యాలయాల్లో చేరి ఇబ్బందులు కలిగిస్తున్నారు.

అప్పుడు హఠాత్తుగా వచ్చిన వార్త జపాన్ పెరల్ హార్బర్ పై దాడి చేసినట్లు. అమెరికా నిశ్చేష్టురాలై అంతలోనే యుద్ధానికి సన్నద్ధమై తన సైనికుల్ని అన్ని ప్రాంతాలకూ పంపింది. ఇదే సమయంలో రష్యా, హిట్లర్ సైన్యాన్ని మాస్కోవైట నిలువరిస్తోంది. అంతేకాదు సహాయంకోసం ఐరోపాకూ అమెరికాకూ సంకేతాలు పంపింది. రూజ్‌వెల్ట్ వెంటనే అంగీకరించాడు. అంతే అమెరికాలో నాజీలంతా నేల మాళిగల్లోకి చేరినా, వాళ్లు వదిలిన విషం దారిలోనే వుంది! అన్నిరకాల విధానాలను ప్రయోగించారు. అమెరికాను రష్యాకు సహాయం అందించకుండా ఆపటానికి.

అప్పుడు ప్రచారం 'వాళ్లిద్దర్నీ (హిట్లర్–రష్యా) రక్తంపోయేవరకూ పోరాడనివ్వండి. చివర్లో వెళ్లి చావుదెబ్బ కొడదాం' అని. ఇది చాలా బలంగా జరిగింది.

రష్యా ఎంతగా పోరాడినా హిట్లరు సైన్యాలు మాస్కో బైటనే కాపలా కాశాయి. రోజులు, వారాలయి నెలలు గడిచిపోయాయి.

సరిగ్గా ఇదే సమయంలో నాకు సమస్యలు మొదలయినాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలో 'రష్యన్ వార్ రిలీఫ్' కమిటీ వుందని అక్కడనుంచి నాకు ఫోన్ వచ్చింది. దాని సారాంశం: ఇంతకు పూర్వపు రష్యాలో అమెరికా అంబాసిండర్ జోసేఫ్ ఇ. డేవీస్. ఈయన ప్రసంగించ వలసిన సభలో నన్ను మాట్లాడమని. (డేవీస్ గొంతు లారెంగై టీస్‌తో మూగపోయింది తాత్కాలికంగా) నాకు కొద్దిగంటల సమయం కూడా లేదు, అయినా అంగీకరించాను. ఆ మర్నాడు సభ జరగాలి. లాస్‌ఏంజెలెస్ నుంచి సాయంత్రం రైలు ఎక్కి మర్నాడు వుదయం ఎనిమిది గంటలకు ఫ్రిస్కోలో దిగాను.

అక్కడ నాకు మధ్యాహ్న భోజనం, రాత్రి విందు, మధ్యలో సభ, ఇలా హడావుడిగా చేశారు. అందుకని ఏమి మాట్లాడాలో ముందుగా సిద్ధం చేసుకోలేకపోయాను. నేనే ముఖ్యమైన ప్రసంగం చేయాలి. రాత్రి విందులో రెండు గ్లాసుల మద్యం కూడా సేవించాను. ఆ హాలులో పదివేలమంది కూర్చోవచ్చు. అప్పటికే కిక్కిరిసి వుంది. పైన వేదిక మీద అమెరికన్ అడ్మిరల్స్, జనరల్స్ వున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో మేయరు రోసి వున్నారు. "మనం ఒక్క విషయం గుర్తించాలి. మనకు రష్యా నేస్తమ"ని మేయరు అన్నారు. ఆయన రష్యాలో ఏమి జరుగుతోందో గట్టిగా చెప్పలేదు. అలాగే వాళ్లు నాజీల చేతుల్లో చనిపోతున్నారు అనికూడా ఆయన చెప్పలేదు. మన నేస్తాలు అంతే.

నన్ను వీలయితే ఒక గంట మాట్లాడమన్నారు. ఇది నాకు కంగారు పుట్టించింది. 4 నిమిషాలు అనుకున్నాను. కాని మేయరు చెప్పిన పేలవమయిన కారణాలు నాకు కోపం తెప్పించినాయి. నేను 4 విషయాలు రాసుకున్నాను. అదీ అక్కడ వున్న చిన్న కాగితం మీద. వేదిక వెనక చాలా ఆందోళనలో తిరుగుతూ నన్ను ఎప్పుడు పిలుస్తారో అని టెన్షన్‌లో వున్నాను. అప్పుడు వినపడింది – నా పరిచయ వాక్యాలు వినపడినాయి. నేను డిన్నర్ జాకెట్టు – నల్లని టై కట్టుకున్నాను. అంతలో చప్పట్లు మోగినాయి. ఇది నాకు కొంత ప్రోత్సాహమే. నేను మైకు తీసుకుని 'కామ్రేడ్స్' అన్నాను. అంతే అంతా నవ్వుల్తో మార్మోగిపోయింది. అవును 'కామ్రేడ్స్' మళ్లీ చప్పట్లు! "ఇక్కడ చాలామంది

రష్యన్లు వున్నారని అనుకుంటాను. మీ దేశంలో మీరు చేసే యుద్ధం – మీరు చూపే ధైర్యం తెలిసే 'కామ్రేడ్స్' అంటున్నాను. అంతే మళ్లీ నిలబడి చప్పట్లు!

ఇప్పుడు నాకు గుర్తువచ్చింది. (వాళ్లిద్దర్ని రక్తం పోయేట్లు...?) 'నేను కమ్యూనిస్టును కాదు (నేను ఇంకా గట్టిగా చెప్పాలనుకున్నాను కాని నాలో గొంతు వద్దంది) నేను మానవ మాతృణ్ణి. మనుష్యుల బాధలు దుఃఖం తెలుసనే అనుకుంటాను. అలాగే కమ్యూనిస్టులు కూడా మనుష్యులే. వాళ్లకీ చేయి తెగినా, కాలు తెగినా బాధ కలుగుతుంది.

అలాగే కమ్యూనిస్టు తల్లి అందరి తల్లిలాంటిదే. ఆమెకు కొడుకు చనిపోయాడంటే అందరిలాగానే బాధతో ఏడుస్తుంది, దుఃఖిస్తుంది. ఇది తెలుసుకోవటానికి కమ్యూనిస్టు కావలసిన పనిలేదు. ఇప్పుడు చాలామంది రష్యన్ తల్లులు ఎంతో దుఃఖంలో వున్నారు....

నేను ఇంకా 40 నిమిషాలు మాట్లాడాను. తర్వాత ఏమి వస్తుందో, ముందుగా ఆలోచించకుండానే. వాళ్లు నవ్వుతున్నారు. చప్పట్లు కొడుతున్నారు. అధ్యక్షుని స్పందన, (డిక్టేటర్ సినిమాపై) మొదటి ప్రపంచయుద్ధం రోజుల్లో నా దృఢత్వం, నేనేమీ తప్పు మాట్లాడలేదనే అనుకున్నాను.

"ఇప్పుడు ఈ యుద్ధం, ఇక్కడకు నన్ను రమ్మన్నది. 'రష్యన్ వార్ రిలీఫ్' కోసం. అవును సహాయం అందించాలంటే సొమ్ముకావాలి. డబ్బు అవసరం వుంటుంది. ఇప్పుడు మన సైనిక కూటమి 20 లక్షల మంది సరైన తిండిలేక ఉత్తర ఇంగ్లాండులో వున్నారని విన్నాం. రష్యన్లు రెండువందల డివిజన్ల నాజీ సేనలను ఎదుర్కొంటున్నారు. రష్యన్లు మనకు స్నేహితులే. వాళ్లు పోరాడేది వారికోసమే కాదు. మన అమెరికన్లు కూడా వాళ్లలాగానే పోరాడగలరు. రూజ్‌వెల్ట్ ఇదే చెప్పారు. స్టాలిన్ అడిగింది ఇదే. అందుకనే రెండవ సైనిక ఫ్రంటుని ప్రారంభించాలి" అన్నాను. ఎంతో గట్టిగా అరిచి చప్పట్లు చరిచారు దాదాపు ఏడు నిమిషాలపాటు సాగింది.

నేను చెప్పిన మాటలు వాళ్ల మనసులో వున్నవే. అందుకే అంతగా స్పందించారు! వాళ్లు అలా రెచ్చిపోయి అరుస్తుంటే నేనుకూడా చాలా కోపంగా నన్ను నేనే ఎక్కువ మాట్లాడానా అనవసరంగా వాగానా? అనుకుంటూనే మీరు నేను చెప్పింది సరైందే అనుకుంటే ప్రతిఒక్కరూ అధ్యక్షునికి టెలిగ్రామ్ పంపండి. రేపు వుదయానికి ఆయనకు పదివేల టెలిగ్రాంలు వెళ్లాలి. రెండో సైనిక ఫ్రంటు ప్రారంభానికి..."

అంతే మీటింగ్ అయిపోయింది. తర్వాత అక్కడి వాతావరణం మారిపోయింది. అంతా ఆదుర్దా ఆందోళనా కనపడింది. డూడ్లీ మలోని, జాన్‌గార్‌ఫీల్డు, నేనూ ముగ్గురం ఎక్కడికో భోజనానికి వెళ్లాము.

"నీకు చాలా ధైర్యం వుంది." అన్నాడు గార్‌ఫీల్డ్. ఇది నన్ను కంగారు పెట్టింది. నేను ఈ రాజకీయాల రొచ్చులో రొంపిలో దిగాలని అనుకోవటంలేదు. అలాంటి కీర్తి నాకు అవసం లేదు. కాని నేను మాట్లాడింది మనస్ఫూర్తిగానే. కాని గార్‌పీల్డ్ అలా అన్న తరువాత నాకు మనశ్శాంతి లేకుండా పోయింది. మర్నాడు బెవర్లీహిల్స్ ఇంటికి వెళ్లిపోయాను. అంతా బాగానే వుంది.

కొన్నివారాల తర్వాత మాడిసన్ స్వేర్‌లో మాట్లాడమని టెలిఫోన్ చేశారు. ఇదే కారణంగా అంగీకరించాను. అది ఏర్పాటు చేసింది చాలా గౌరవనీయులైన కౌన్సిల్. పారిశ్రామిక వర్గాలు. వాళ్లే ఈ క్రింది చిన్న పుస్తకాలు అచ్చు వేయించారు.

ప్రసంగం: రష్యన్ యుద్ధరంగంలో మన ప్రజాస్వామ్యం వుంటుందా... పోతుందా?

ఇదే మాట్లాడాలి. ముందుగానే మధ్యలో అంతరాయం కలిగించవద్దని చెప్పారు. ఆ విధంగా 14 నిమిషాలు మాట్లాడాను. అదీ హాలీవుడ్ నుంచి టెలిఫోన్ ద్వారా. రికార్డు చేశారు. 1942 జులై 22 సాయంత్రం మాడిసన్ సెంటర్లో 60 వేలమంది పోగయ్యారు. కార్మికులు న్యూయార్క్ పౌరులు, హెర్డావాళ్లు మాజీ సైనికులు, సంఘాలవాళ్లు, చర్చికి చెందిన వారు వారందరూ రూజ్‌వెల్ట్‌కు మద్దతు ఇస్తూ రెండో సైనిక ఫ్రంటు ప్రారంభించాలి, రష్యన్‌లకు సహాయం అందించటానికి అని వాళ్ల గొంతు వినిపించటానికి. ఈ విధంగా హిట్లర్‌ని ఓడించాలి అని. ఇది ఏర్పాటు చేసిన వాళ్లు 250 కార్మిక సంఘాలు. ఇది గ్రేటర్ న్యూయార్క్ (Newyork) పారిశ్రామిక సంఘం కౌన్సిల్ (cio). Wendel L. Weillkie, Philip Murray, Sidney Hillman ఇంకా చాలా అమెరికా ప్రముఖులు!

ఆకాశం నిర్మలంగా వుంది. మిత్రరాజ్యాల జెండాలన్ని రెపరెపలాడు తున్నాయి. అన్నివిధాల సందేశాలతో వీధులన్నీ నిండిపోయాయి. అధ్యక్షునికి మద్దతుగా అక్కడ సభా ప్రాంగణంలో సందేశాలు పెట్టారు. లూసీమన్రో దేశభక్తి గీతం పాడింది. అమెరికన్ థియేటర్‌వాళ్లు ప్రదర్శనలు ఇచ్చారు. పార్లమెంటు సభ్యులు జేమ్సు M. మిడ్, క్లాడీపెపుర్,

కౌయిర్ గార్డియా, LT. గవర్నరు చార్లెస్ పోలెట్టి, VITO మర్కాంన్‌టోనియో. మైకేక్ క్విక్, జోసెఫ్ కర్రెన్, న్యూయార్క్ (CIO) అధ్యక్షులు అందరూ మాట్లాడారు. పార్లమెంటు సభ్యుడు మిడ్ 'ఈ యుద్ధం మనం గెలవాలంటే మనతోపాటు ఆసియావాసులూ కలవాలి. కలిసేట్లు మనం చేయాలి. ఐరోపా, ఆఫ్రికా, అందరూ తప్పనిసరిగా ఈ స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొనాలి' అన్నారు. అప్పుడు మరో సభ్యుడు పెప్పర్ "మన ప్రయత్నాలను అడ్డుకునేవారు, ఆగమని చెప్పేవాళ్లు మన రిపబ్లిక్కు శత్రువులే." మనకు సైన్యం వుంది. మనకు యుద్ధ సామాగ్రి వుంది. ఆయుధాలున్నాయి. మనకు ఎలా గెలవాలో తెలుసు. అది రెండో సైనిక ఫ్రంటు ప్రారంభించటమే" అన్నాడు.

'అధ్యక్షులు' అన్న ప్రతిసారీ జనం గోలగా అరిచారు (మంచిగానే).

అప్పుడు వచ్చింది చార్లీచాప్లిన్ టెలిఫోన్ ద్వారా పంపిన సందేశం.

అధ్యక్షునికి మద్దతుగా, రెండో సైనిక ఫ్రంటుకు మద్దతు.

మాడిసన్ స్క్వేర్ పార్క్ జూలై 22, 1942.

"రష్యా యుద్ధభూమిలో ప్రజాస్వామ్యం ఉంటుందా? ఊడుతుందా?"

శత్రు దేశాల మనుగడ ఇప్పుడు రష్యన్ల చేతిలో వుంది. రష్యా ఓడిపోతే ఆసియా ఖండంలో పెద్ద దేశం, బాగా ధనిక దేశం, ఇప్పుడు ఓడిపోతే అది నాజీల చేతిలోకి వెళ్లిపోతుంది. అప్పుడు తూర్పుదేశాలు జపాన్ చేతిలో నాజీల చేతిలో పడిపోతాయి. అంతే ప్రపంచంలో అన్ని యుద్ధ సామాగ్రివాళ్ల అధీనంలోకి వచ్చేస్తాయి. అప్పుడు మనం హిట్లర్ను ఎలా ఓడించగలము? "ప్రయాణ సాధనాలు లేకుండా, మన సమాచార సాధనాలు కుంటుపడి వేలమైళ్ల వరకూ, ఉక్కు, ఆవిరి యంత్రాలు, రబ్బరు ఇవన్నీ అందుబాటులో లేకుండా? హిట్లర్ ప్రణాళిక: విభజించి పాలించు అని కదా. అందుకని రష్యా ఓడిపోతే మన పరిస్థితి ఎంత దారుణమైన స్థితిలో పడుతుంది? కొంతమంది నిపుణులు ఈ యుద్ధం పది-ఇరవయి ఏళ్లు నడుస్తుందని అంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో అలాంటి బలమయిన శత్రువు ముందు మన భవిష్యత్తు అనిశ్చయమే.

మనం దేనికోసం ఎదురు చూస్తున్నాం?

రష్యన్లకు ఇప్పుడు సహాయం అవసరం వుంది. కావాలని అడుగుతున్నారు. మిత్రదేశాల మధ్య రెండో సైనిక ఫ్రంటు ప్రారంభించాలా అని కదా ఇప్పటి ఆలోచన.

మిత్రదేశాలకు సామాను సమకూర్చుకునే సామర్థ్యం రెండో సైనిక కూటమికి లేదని తెలుస్తోంది. మళ్లీ వుందని అంటున్నారు. ఈ రెండవ కూటమి వారికి ఇష్టం లేదనీ వింటున్నాము. ఓడిపోయేముందు ఈ రిస్కు తీసుకోవటం ఇష్టం లేనట్లు వింటున్నాము.

"కాని మనం వేచి చూడగలమా చివరి వరకూ? యుద్ధంలో రిస్కులేని ప్రణాళిక వుంటుందా? ఇప్పుడు జర్మనీ వాళ్లు కాకస్‌కి 35 మైళ్ల దూరంలో వున్నారు. కాకస్ వాళ్ల చేతిలో పడితే రష్యన్ల ఆయిల్ పోయినట్లే. వేలమంది లక్షలమంది చనిపోతుంటే మనం నిజాయితీగా ఆలోచించాలి. మన ప్రజలే అడుగుతున్నారు. ఐర్లండు సైన్యం గురించి వింటున్నాము. మన సైన్యాలన్నీ ఐరోపా జాగ్రత్తగా చేరుతున్నాయి. ఇంగ్లాండు సైనికులు సిద్ధంగా వున్నారు. ఇంకా మనం దేనికోసం ఎదురు చూడాలి? రష్యాలో పరిస్థితి అంత అధ్వాన్నంగా వుంటే ఇంకా ఆలస్యం దేనికి?

మనం ఎదుర్కోవచ్చు!

వాషింగ్టన్ అధికారులూ లండన్ సైనికాధికారులూ ఇది పరిమితులు కొలిచేందుకు సమయం కాదు. వారి గందరగోళ పరిస్థితిని తొలగించి, విశ్వాసం గలిగించమని అడుగుతున్నాము.

నాజీల పంజాని చూడండి!

నాజీల పంజా దెబ్బలు కాచుకోవాలి. జాగ్రత్త! వాళ్లు ముందు శాంతి మంత్రాలు ఇంపుగా పాడతారు. అది తెలిసేలోపు వాళ్ల సిద్ధాంతంలో పడిపోతాం! అప్పుడు మన బానిసత్వం మొదలవుతుంది. మన స్వేచ్ఛను హరించి ఇక బుద్ధిని వారి అధీనంలోకి తెచ్చుకుంటారు. అప్పుడు ప్రముఖాధిపతి Gestapo! వాళ్లు మనల్ని ఆకాశంలో నుంచి పరిపాలిస్తారు. ఇకముందు అధికారం అలాగే వుంటుంది. ఇప్పటికే వారు ఆకాశాన్ని అధీనంలోకి తెచ్చుకున్నారు. ఇంక వాళ్లకు ఎదురు తిరిగితే పేల్చివేస్తారు.

మానవజాతి అభివృద్ధి పూర్తిగా నాశనమైపోతోంది. ఇంక బలహీనులకు ఎలాంటి హక్కులూ వుండవు. కార్మికులకు పౌరహక్కులు అన్ని కాలరాస్తారు. ఒక్కసారి విజయం సాధించిన హిట్లర్‌తో సంధి చేసుకున్నామంటే ఇక ప్రపంచం అతని చేతుల్లోకి వెళ్లిపోయినట్లే!

మనం ఒక ఛాన్సు తీసుకోవచ్చు

ఒక వినాశం జరిగిన తర్వాత ఓదార్చేవాళ్లు వస్తారు. మనం వీళ్లనుంచి జాగ్రత్తపడాలి. మనం ముందు చూపుతోవుంటే మన విశ్వాసం మనల్ని నిర్భయంగా వుంచుతుంది. గుర్తుందా, నైతిక విశ్వాసమే ఇంగ్లాండును కాపాడింది. మనమూ మన మనోస్థైర్యాన్ని కోల్పోకుండా వుంటే విజయం మనదే.

హిట్లర్ చాలా ఛాన్సులు తీసుకున్నాడు. ఇప్పుడు అతని ప్రణాళిక రష్యాను ఆక్రమించటం. అతను కాకన్‌లు ఆక్రమించితే లేకపోతే శీతాకాలం మాసాల్లో దగ్గర్లో వుండటం అతనికి కష్టమైపోతుంది. అతను ఛాన్సు తీసుకున్నప్పుడు మనం తీసుకోలేమా? బెర్లిన్‌మీద ఎక్కువ బాంబులు వేయండి. ఇంకా సైన్యం కావాలి. జెన్ మార్టిన్ సముద్ర విమానాలు ఇవ్వండి. యుద్ధ సామాగ్రి చేరవేయటానికి. అన్నింటికీ మించి రెండో ఫ్రంటు ఇవ్వండి.

విజయం మనదే!

ఇప్పుడే విజయంకోసం మెదడు పెడదాం. ఫాక్టరీల్లోవారూ వ్యవసాయ భూముల్లోవారూ సైనికులూ పౌరులూ ప్రపంచ పౌరులూ అందరం కలిసి పనిచేద్దాం. వాషింగ్టన్ అధికారులూ లండన్ అధికారులూ. ఇదీ మన లక్ష్యం. విజయం వసంతంలోగానే వరిస్తుంది. మనం అసాధ్యమైనదానికోసం సాధన చేద్దాం. గుర్తించేవారికి చరిత్రలో ఎన్నో విజయాలు ముందు అసాధ్యంగానే కనిపిస్తాయి.

అప్పటికీ నా రోజులు బద్ధకంగా హాయిగానే గడుస్తున్నాయి. కాని ఇది తుఫాను ముందు ప్రశాంతత! ఈ దరిద్రపు కథకు దారితీసిన పరిస్థితులు చాలా అమాయకంగానే మొదలయినాయి. అది ఆదివారం. ఒక ఆట టెన్నిస్ ఆడాను. టీమ్ డూరాంట్ తనకి ఒక యువతితో డేట్ వుందని చెప్పాడు. ఆమె పేరు జాన్ బెర్రీ అని కూడా చెప్పాడు. ఆమెకు పాల్ గెట్టీ స్నేహితుడని. ఇప్పుడే మెక్సికోనుంచి వచ్చిందని బ్లూమెంతాక దగ్గర్నుంచి వుత్తరం కూడా తెచ్చిందని. టీమ్ చెప్పాడు ఆమెతోపాటు మరొక యువతి కూడా వుందని మీరు కూడా వస్తే మిస్ బారీ సంతోషిస్తుందని అన్నాడు. మేము పేరినో రెస్టారెంటులో కలిశాం. ఈ బారీ చాలా సంతోషంగా సందడిగా వుంది. ఆ సాయంత్రం ఎంతో ఆనందంగా గడిచిపోయింది. తర్వాత ఆమెను చూడాలని అనుకోలేదు.

కాని తర్వాత ఆదివారం, మా టెన్నిస్ కోర్టుకు ఎవరైనా రావచ్చు. టీమ్ ఆమెను కూడా తీసుకువచ్చాడు. ఆదివారం ఇంట్లో వంట చేయవద్దన్నాం. శలవు ఇచ్చేస్తాను. నేను భోజనం బైటచేస్తాను. అలా టీమ్‌నీ ఆమెనూ నాతో విందుకు రమ్మన్నాను. రోమనా రెస్టారెంటులో. విందు తర్వాత వాళ్లను ఇంటిదగ్గర దింపాను.

మర్నాడు బారీ ఫోన్‌చేసి లంచ్‌కి తీసుకు వెళ్లమంది. నేను శాంతాబార్బరా వెళు _న్నాను' అని చెప్పాను. 'అక్కడికి 90 మైళ్లు. మీరు ఖాళీగా వుంటే రావచ్చు. భోజనం తర్వాత అక్కడి ఆక్షన్‌కు వెళ్లవచ్చు' అని చెప్పాను. అలాగే లంచ్ చేసి ఆక్షన్‌లో ఒకటో రెండో కొని లాస్‌ఎంజెలెస్ తిరిగి వచ్చేశాను.

ఈ మిస్ బారీ చాలా అందకత్తె. 22 ఏళ్లుంటాయి. మంచి ఆరోగ్యంగా వుంటుంది. ఆమె స్తనాలు చాలా పెద్దవి. అవి కనపడేట్లు లోనెక్ గౌనులు వేస్తుంది. ఆ విధంగా తిరుగు ప్రయాణంలో నన్ను ఇక రెచ్చగొట్టిందని అనవచ్చు. తాను పాల్‌గెట్టాతో పోట్లాడి వచ్చేసినట్లు మర్నాటి రాత్రి, న్యూయార్కు వెళ్లిపోతున్నట్లు. కాని నేను వుండమంటే వుండిపోతానని చెప్పింది. కాని నాకు ఏదో అనుమానం పీడిస్తోంది. ఇంత హఠాత్తుగానా– ఇంత వింతగానా? ఇక నాకోసం ఉండాల్సిన అవసరం లేదు. తన ప్రణాళిక ప్రకారం వెళ్లిపోవచ్చు అని ఆమెను దింపేశాను. తర్వాత రెండురోజులకు ఫోన్ చేసి ఇక్కడే వున్నట్లు చెప్పింది. 'ఈ సాయంత్రం కలవవచ్చా' అని అడిగింది. ఏ పని అయినా వెంటపడితే అవకుండా వుంటుందా?

ఆ విధంగా ఆమె అనుకుంది సాధించిందనే చెప్పాలి! ఆ తర్వాత రోజులు ఆనందంగా లేవని చెప్పలేను. కాని అవేరోజులు వుండవలసిన తీరులో మాత్రం లేవు. ఫోనుకూడా చెయ్యకుండా ఒక్కసారిగా వచ్చేస్తుంది. అదీ అర్ధరాత్రీ అపరాత్రి. తర్వాత ఒక్కోసారి వారంవరకూ అంతుండదు. నేను ఒప్పుకోక పోయినా, ఇది నాకు ఏమాత్రం నచ్చలేదు. కాని కనపడిన రోజున మాత్రం నన్ను మాయ చేసేమంత్రం వల్లిస్తుంది! ఆ విధంగా నా అనుమానాలన్ని ఆవిరయిపోయాయి.

ఒకరోజు మధ్యాహ్నం సర్ సెడ్రిక్, సింక్లెయిర్ లూయిస్‌తో కలిసి భోజనంచేసి మట్లాడుకుంటున్నాం. ఆ సందర్భంలో సెడ్రిక్, షాడో అండ్ సబ్‌స్టెన్స్ అనే నాటకం గురించి చెప్పారు. అందులో ఆయన నటిస్తున్నారు. ఆయన పాత్ర అది ఆధునిక జోన్

ఆఫ్ ఆర్క్ లాంటిది అని చెప్పాడు. అది సినిమాకి బాగా పనికి వస్తుందని చెప్పాడు. నేను ఉత్సాహం చూపించి, చదువుతానని చెప్పాను. ఆయన ఆ నాటకం ప్రతిని పంపారు.

ఆ తర్వాత రాత్రి బారీ ఎందుకు వచ్చింది? నేను నాటకాన్ని గురించి చెప్పాను. తాను చూసినట్లు చెప్పింది. అందులో అమ్మాయి పాత్ర నటించాలని వుంది అని కూడా చెప్పింది. నాకు అంత నమ్మకం కలగలేదు. కాని ఆమె నాటకాన్ని చదివి విన్పించింది. నేను నిజంగా ఆశ్చర్యపోయాను! అంత బాగా చదివింది. ఆమె ఐరిష్ యాసలోకూడా! నాకు ఎంత ఉత్సాహం వచ్చిందంటే నేను ఆమెకు తెలియకుండా కెమెరా పరీక్ష కూడా చేయించాను. ఆమె కెమెరాకు బాగానే సరిపోయింది. ఇప్పటి వరకూ నాకున్న అనుమానాలన్నీ వదిలి ఆమెను ఒకరకంగా నమ్మి, ఆమెను డ్రామా స్కూలుకు పంపాను. సినిమా సాంకేతిక పరిజ్ఞానంకోసం. నేను ఆమెను కలవటం మానేశాను, అక్కడ చాలా పనిలో వుంటుందని. నేనంతవరకూ ఆ నాటకాన్ని సినిమా తీయటానికి హక్కులు కొనలేదు. అప్పుడు సెడ్రిక్ సహాయంతో 25 వేల డాలర్లు ఇచ్చి హక్కులు తీసుకున్నాను. తర్వాత బారీకి వారానికి 250 డాలర్లు ఇస్తున్నాను – ఒప్పందం చేసుకుని!

కొంతమంది మార్మిక వాదులు మన మనుగడ సగం కల అనీ, ఆ కల ఎప్పుడు అంతం అవుతుందో చెప్పలేమనీ, అసలు సత్యం ఎప్పుడు మొదలవుతుందో తెలియదని విశ్వసిస్తారు! ఇది నా విషయంలో నిజమనే చెప్పాలి. చాలా మాసాలు ఈ సినిమా స్క్రిప్ట్ రాయటంలో మునిగిపోయాను. ఆ తర్వాత చాలా వింత సంగతులూ సంఘటనలూ జరగటం మొదలయినాయి. బారీ ఒక్కోసారి తన కాడిలాక్ కారులో అర్ధరాత్రి వచ్చేది – అప్పటికే తాగి తూలుతుండేది. అప్పుడు నా డ్రైవర్ను లేపి, ఆమెను ఇంటికి పంపవలసి వచ్చేది. అక్కడే వదిలితే ఇంట్లోకి వచ్చి పడేది. ఇప్పుడు ఆమెపేరు చాప్లిన్ స్టూడియోతో ముడిపడి వుంది కదా. అందుకని ఆమెను ఎక్కడ పోలీసులు పట్టుకుని అల్లరి చేస్తారోననీ అది పత్రికల్లో ప్రచారంకోసం వాడతారని ఆందోళన పడ్డాను.

ఎప్పుడైనా తెల్లవారు సమయంలోగాని అర్ధరాత్రి దాటిన తర్వాతగాని ఆమె ఫోను చేస్తే నేను మాట్లాడేవాడిని కాదు. అప్పుడు సరాసరి ఇంటికి వచ్చి కిటికీలు పగలకొట్టేది. అప్పుడే తెలిసింది ఈమె డ్రామా స్కూలుకు కూడా వెళ్లటం లేదని. ఈ విషయంలో ఆమెను నిలదీశాను. అప్పుడు 'నాకసలు నటించాలని లేదు. నాకూ అమ్మకూ న్యూయార్కు వెళ్లటానికి ఖర్చులు అయిదువేల డాలర్లు ఇస్తే నిన్ను వదలి వెళ్లిపోతా'నంది, ఒప్పందం

కూడా రద్దు చేసుకుని. నేను దీనికి సంతోషంగా అంగీకరించి ఆమెను వదలించుకున్నాను!

ఈ బారీ కథ ఇలా కంచికెళ్లిందిగానీ, నేను కొన్న షాడో అండ్ సబ్‌స్టాన్సు. ప్రిష్ఠ పూర్తి చేశాను. అది చాలా బాగా వచ్చిందని అనుకున్నాను. అప్పటికి సాన్‌ఫ్రాన్సిస్కో సభ జరిగి చాలా నెలలు గడిచిపోయాయి. రష్యావాళ్లు ఇంకా అమెరికా సహాయం కోసం కేకలు పెడుతూనే వున్నారు. ఆ సమయంలో నాకు న్యూయార్కు నుంచి పిలుపు వచ్చింది. కార్నీజ్ హాలులో మాట్లాడటానికి రమ్మని. నేను మధనపడ్డాను ఏదీ తేల్చుకోలేక. ఆ తర్వాత జాక్‌వార్నర్‌తో టెన్నిస్ ఆడుతూ ఈ విషయం చెప్పాను. ఆయన 'వద్దు, వెళ్ళవద్దు' అన్నాడు. 'ఎందుకని వెళ్లకూడదు?' అన్నాను. 'నా మాట విను – వెళ్లటం మంచిది కాదు.' అని గట్టిగా చెప్పాడు. ఇది నా మీద ఇంకోరకంగా పనిచేసింది. ఇది ఒక ఛాలెంజ్‌క్రింద తీసుకున్నాను. పైగా అమెరికా ప్రజలంతా చాలా సానుభూతితో వున్నారు. 'హిట్లరును ఎదిరించాలి, ఓడించాలి' అని. అప్పటికి రష్యా స్టాలిన్ గ్రాడ్‌లో విజయం సాధించింది.

నేను నాతో టిమ్ డూరాంట్‌ని తీసుకుని న్యూయార్క్ వెళ్లాను. అక్కడ పెరల్‌బెక్ రాక్‌వెల్ కెంట్, ఆర్సన్ వెల్స్ ఇంకా చాలా పేరున్నవాళ్లు వున్నారు. అప్పుడు ఆర్సన్‌వెల్స్ మాట్లాడాలి. ఆయన చాలా తెలివిగా 'అవును రష్యా మనకు ఈ విషయంలో భాగస్వామి. మనం తప్పని సరిగా సహాయం అందించాలి' అని వుప్పులేని భోజనం లాగా చప్పగా మాట్లాడి కూర్చున్నాడు. ఇది నన్ను ఇంకా రెచ్చగొట్టిందని చెప్పాలి. నా మొదటి వాక్యం "నన్ను ఒక విలేకరి అడిగాడు 'మీరు యుద్ధం నడిపిస్తారా' అని. కాని ఆయన ధోరణీ, ఆందోళన చూస్తే నన్ను చూసి అసూయపడుతున్నాడని అనుకున్నాను. ఈ యుద్ధాన్ని ఆయనే నడపాలని అనుకుంటున్నాడని కూడా అనిపించింది. కానీ మా యిద్దరికీ ఒకటే భేదం. ఆయనకు ఈ రెండో సైనిక పటాలం మీద నమ్మకం లేదు. కాని నేను పూర్తిగా నమ్ముతున్నాను" అని ముగించాను! మర్నాడు 'డైలీ వర్కర్'లో 'ఈ సభ చార్లీకీ – ప్రేక్షకులకూ ఒక మంచి విందు' అని వ్రాసింది. కాని నా అనుమానాలు నాకు పెరిగిపోతున్నాయి. ఆ సభ తర్వాత నేను, కాన్‌స్టాన్సు కోలియర్‌తో విందుకు వెళ్లాను. ఆమె సభలో వుంది. చాలా ఉద్వేగంతో కదలిపోయింది. ఆమె ఎప్పటికీ రష్యాను సమర్థించదు. కానీ నాతో ఏకీభవించింది.

మేము హోటల్‌కి తిరిగి చేరే సమయానికి చాలా ఫోన్లు వచ్చినట్లు. అదీ బారీ నుంచి. సందేశాలున్నాయి. నాకు చాలా చిరాకు వేసింది. ఆపరేటర్‌తో నాకు ఏ ఫోనూ కలపవద్దు అని చెప్పాను. కాని టీమ్, 'మాట్లాడండి, లేకపోతే ఆమె రావచ్చు' అన్నాడు. అందుకని తర్వాత ఫోను మాట్లాడాను. మామూలుగానే వున్నట్లుంది. 'ఊరికే మీరు న్యూయార్కులో వున్నారని ఫోన్ చేశాను' అంది. 'వచ్చి చూస్తాను' అని కూడా అంది. నేను టిమ్‌తో చెప్పాను నన్ను ఆమెతో వదిలి వెళ్లవద్దని. ఆ సాయంత్రం చెప్పింది న్యూయార్కు వచ్చిన దగ్గర్నుంచి పాల్ గెట్టీతో వుంటున్నాని. పియరో హోటల్లో. దాని యజమాని పాల్‌గెట్టీ. తనని బయటవరకూ వచ్చి సాగనంపమంది. కాని నేను అక్కడితో గుడ్‌బై చెప్పి పంపించాను.

నా ఉపన్యాసాల పుణ్యమా అని నాకు న్యూయార్కులో స్నేహితులు దూరమైపోయారు. ఎవరూ ఫోన్ చేయటంలేదు. ఎవరూ వారాంతానికి వాళ్లు ఊరి బయట ఇళ్లకి రమ్మని పిలవటంలేదు. కార్నిజీ హాలు సభ తర్వాత కొలంబియా రేడియో విలేకరి క్లిఫ్‌టన్ ఫాడిమన్ నాకోసం హోటల్‌కి వచ్చాడు. 'మీరు అంతర్జాతీయంగా రేడియోలో మాట్లాడతారా? 7 నిమిషాల సమయం కేటాయిస్తాం' అన్నాడు. కాని 'ఏ పబ్బు కోసమో వచ్చే ప్రకటన మధ్యలో నేను మాట్లాడను' అన్నాను. అంతే ఆయన్ను అవమానపరిచే వుద్దేశం లేదు. ఆయన చాలా సిగ్గు పడ్డాడు. నేను ఎందుకు ఇలా అన్నానా అని మధనపడ్డాను.

తర్వాత నాకు చాలా ఆహ్వానాలు వచ్చాయి. ఈ రెండో ఫ్రంటు విషయంలో చర్చించటానికి రమ్మని Gerald C.k. స్మిత్, కబురు. మరొకరు ప్రసంగం ఇవ్వమని, మరొకరు ఇంకోదానికి.

ఒక్కసారిగా నాకు అర్థమయ్యింది. నేను నాకిష్టంలేని రాజకీయ దుమారంలో చిక్కుకున్నాను అని. అప్పుడు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అసలు నీ విషయం ఏమిటి? నీలోని నటుడు నిన్ను నడిపిస్తున్నాడా? 'డిక్టేటర్' అదే యాంటినాజీ సినిమాలో లేకపోతే ఈ గోలంతా వుండేది కాదు కదా? అసలు నీకు ఈ టాకీల మీద వున్న కోపమా ఇదంతా? అవును ఇవన్నీ కారణాలే అన్పిస్తోంది. వీటన్నిటికంటే నాకు నాజీలంటే వున్న ద్వేషము–అసహ్యం! ముఖ్యకారణం!

ఇరవై ఏడవ అధ్యాయం

ఊనా

బెవర్లీహిల్స్ తిరిగివచ్చి షాడో & సబ్‌స్టాన్స్ స్క్రిప్టు చూస్తున్నాను. అప్పుడు ఆర్సెన్ వెల్స్ వచ్చారు. నాతో 'నేను డాక్యుమెంటరీలు తీద్దామని అనుకుంటున్నాను. అది నిజ జీవిత సంఘటనలపై ఆధారపడినవి' అని అన్నారు. తర్వాత మొదటగా ఫ్రెంచ్ హంతకుడు బ్లూబియర్డ్ లాండ్రూ కథ – దీనిలో గొప్ప డ్రామా సస్పెన్సు వున్నాయని అన్నారు. ఈ పాత్ర నీకు బాగా వుంటుంది. ఆలోచించమన్నాడు.

ఇది నాకు ఒకందుకు నచ్చింది. ఎప్పుడూ వేసే హాస్యగాని వేషంలోనుంచి కాస్త బైటకు రావచ్చుగదా. పైగా నేను, రాయవలసిన, దర్శకత్వం వహించవలసిన అవసరంలేదు. కేవలం నటించటమే అనుకున్నాను. స్క్రిప్టు పంపమన్నాను. "అదా – ఇంకా రాయనేలేదు. మనం చేయవలసిందల్లా – లాండ్రూ కేసు రికార్డు తీసుకోవటమే." అన్నారు. "స్క్రిప్టు రాయటంలో మీ సహాయం వుంటుందనుకుంటా" అనికూడా అన్నారు. నాకు చాలా నిరాశ కలిగింది. 'ఇదంతా రాయాల్సివస్తే నాకేమాత్రం ఇష్టంలేదు' అని తెగేసి చెప్పాను. అక్కడితో ఆ విషయం ఆగిపోయింది.

రెండురోజుల తర్వాత ఈ లాండ్రూ వ్యవహారంలో చాలా అవకాశం సినిమాకు వున్నట్లు అనిపించింది. దీనిని మంచి వ్యంగ్య చిత్రంగా తీయవచ్చనిపించింది. అప్పుడు ఆర్సన్ వెల్స్‌కి ఫోన్ చేసి "చూడండి, మీరు చెప్పిన లాండ్రూ డాక్యుమెంటరీ నాకు పనికి వస్తుందనిపిస్తోంది. కాని లాండ్రూ జీవితంతో ఏమాత్రం సంబంధం వుండదు. నాకు అతని రికార్డు కూడా అవసరంలేదు. కాని ఈ ఆలోచన మీరు చెప్పారు కాబట్టి మీకు ఈ వ్యవహారంతో ఇకముందు ఏ సంబంధం లేకుండా వుండటానికి 5 వేల డాలర్లు ఇస్తాను." అన్నాను. ఆయన ఏదో మూలిగి, గొణిగాడు. "వినండి – ఈ

లాంఢ్రూ పబ్లిక్ కథ. మీదికాదు – నాదికాదు" అంతే ఆయన 'అయితే నా మేనేజర్‌తో మాట్లాడండి' అన్నాడు. ఆ రకంగా ఆయనకు 5 వేల డాలర్లు ఇచ్చి కాగితం రాయించుకున్నాను. చివర్లో ఆయన చిన్న మెలిక పెట్టారు. సినిమా టైటిల్స్‌లో ఈ విషయం రాయాలని. అప్పుడు దాని గురించి నేను ఎక్కువ ఆలోచించలేదు. 'సరే' అని ఆ విషయాన్ని పూర్తిచేశాము. ఆయన దీనిలోంచి పొందిన పేరు ప్రఖ్యాతుల గురించి ఆలోచించివుంటే నేను వద్దు అని చెప్పివుండేవాడినే.

ఇప్పుడు షాడోని ప్రక్కనపెట్టి మిస్టర్ వెర్డో అని పేరు పెట్టి (ఇది ఫ్రెంచి పేరు) కథ రాయటం మొదలుపెట్టాను. ఇలా మూడు నెలలు ఇదే పనిలో వున్నాను. అప్పుడు మళ్లీ బారీ హాలీవుడ్ వచ్చిపడింది. ఎట్టి పరిస్థితుల్లో నేనూ కలవనని చెప్పాను. ఇంటికివచ్చి నానా గొడవ చేసింది. చివరికి పోలీసుని పిలవాల్సిన అవసరం కూడా కల్పించింది. పోలీసువారు ఎంతో సహకరించారు. ఈ విషయంలో అల్లరి చేయకుండా ఆమెను చార్జీలు ఇచ్చి న్యూయార్కు పంపేయమన్నారు. మరోసారి ఇలా చేస్తే కారాగారమే అని హెచ్చరించి పంపించారు.

అసలు కొన్ని విషయాలు ఎంత వింతగా వుంటాయో అనిపిస్తుంది. పైన చెప్పిన సంఘటన ఎంత విచారకరమైనది. కాని దాని తర్వాత నా జీవితంలో ఎంతో సంతోషకరమైన మలుపు సంభవించింది అనవచ్చు.

కాని నీడలు రాత్రిలో కలిసిపోతాయి. ఉదయపుటాకాశంలో సూర్యుడుదయిస్తాడు.

తర్వాత నెలలో హాలీవుడ్ సినిమా ఏజంటు మిన్నావాల్లీస్ ఫోన్ చేసింది. న్యూయార్కు నుంచి తన క్లయింట్ ఒకామె వచ్చిందని – ఈ నేను తీద్దామనుకున్న షాడోలోని ప్రధానపాత్ర 'బ్రిడ్‌గెట్'కి సరిగ్గా సరిపోతుందని చెప్పింది.

ఈ సమయంలోనే నేను మిస్టర్ వెర్డో రాయటంలో చాలా సమస్యను ఎదుర్కొంటున్నాను. అందుకని మళ్లీ నా దృష్టి షాడో మీద పెట్టాను! అందుకని వాల్లీస్ సందేశాన్ని శుభసంకేతంగా తీసుకుని ఇంకా వివరాలు చెప్పమన్నాను. ఆమె పేరు ఊనా ఓనీల్ అని – ఆమె యూజిన్ ఓనిల్ కూతురని చెప్పింది. ఈయన నోబుల్ బహుమతి పొందిన వ్యక్తి. కాని ఆయన నాటకాలు నేను చదివాను. అప్పటికే ఆయనంటే నాకు చాలా గౌరవం! ఆయన కూతురు ఎలా వుంటుందో నా మనసులో ఒక రూపం కూడా వుంది. "వాల్లీస్ ఈమె నటించగలదా?" అన్నాను కాస్త హాస్యంగానే.

"ఏదో కొద్దిపాటి రంగస్థల అనుభవం వుంది. మీరు స్క్రీన్ పరీక్ష చేయండి" అన్నది "లేదా అంతదూరం వద్దనుకుంటే మా యింటికి రాత్రికి విందుకు రండి చూపిస్తాను."

ఆ రాత్రి నేను కాస్త ముందుగానే వాల్లీస్ ఇంటికివెళ్ళి ఆమె కోసం చూస్తుండగా అక్కడ చలిమంట గూటి దగ్గర ఒక ముగ్ధ కూర్చుని వుంది – ఒంటరిగా. నేనే పలకరించాను. ఆమె నవ్వింది. అంతకు ముందు నేనూహించినట్లు కాకుండా ఈమె అందం మొగ్గలో దాగిన పువ్వులా ఎంతో వింతగా వెలుగుతోంది. ఆమె సొగసు ఎంతో సౌమ్యంగా ఆకర్షణీయంగా వుంది. మేము వాల్లీస్ కోసం వేచి చూస్తూ మాట్లాడుకున్నాం. తర్వాత వాల్లీస్ వచ్చి మాకు పరస్పరం పరిచయం చేసింది. రాత్రి విందులో నలుగురమే వున్నాం. వాల్లీస్ ఊనా నేనూ టిమ్. అప్పుడు చెప్పింది ఆమె వయస్సు 17 సంవత్సరాలేనని. నేను చాలా నిరాశ చెందాను. బ్రిడ్జెట్ పాత్రకు చిన్నవయసు యువతి కావాలి కాని – అది చాలా కష్టమైన పాత్ర. ఈమె చేయగలదా? అక్కడితో ఆ విషయాన్ని ప్రక్కన పెట్టానని చెప్పవచ్చు.

తర్వాత కొన్నిరోజులకే మళ్లీ వాల్లీస్ ఫోన్ చేసింది. 'మీరు ఊనా విషయం ఆలోచించారా?' అని. 'ఫాక్స్ పిక్చర్స్‌వారు అడుగుతున్నారు' అని కూడా అంది. అంతే అప్పుడే అక్కడే ఊనాతో ఒప్పందం కుదుర్చుకుని తర్వాత నా అదృష్టాన్నీ సంతోషాన్నీ ఇరవయి సంవత్సరాలపాటు ఆమె సన్నిధిలో గడిపానని చెప్పగలను!

ఊనా గురించి తెలిసిన కొలదీ ఆమె హాస్యస్వభావం – సహన స్వభావం నన్ను ఆశ్చర్యపరిచేవి. ఆమె ఎప్పుడూ ఎదుటివారి దృష్టితో పరిస్థితినీ, సమస్యనూ అర్థం చేసుకునేది. ఇదే కారణంతో ఇంకా అనేకానేక అవగాహనలతోనే నేను ఆమెను ప్రేమించాను. అప్పుడే ఆమెకు 18 ఏళ్ల వయసు వచ్చింది. కాని నా నమ్మకం ఆమె, వయసు వలలో చిక్కుకుని లేదని. ఊనా ఇలాంటి సంకుచిత ఆలోచనలకు అతీతమనే చెప్పాలి. మొదట్లో నేను మా వయసు వ్యత్యాసంతో కొంత భయపడిన విషయం నిజమే. కాని ఊనాకి ఈ విషయంలో ఎటువంటి అభ్యంతరమూ లేదు. ఆమె అప్పటికే ఒక దృఢమైన నిర్ణయానికి వచ్చినట్లు ఒక జీవిత సత్యాన్ని గుర్తించినట్లు! అదిగో అదే నిర్ణయంతో మేము పెళ్లి చేసుకుందామని అనుకున్నాము – అదీ 'షాడో – సబ్‌స్టాన్స్' సినిమా పూర్తవగానే!

ఈ సినిమా స్క్రిప్టు మొదటిప్రతి పూర్తి చేసి ఇక నిర్మాణ కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని నిర్ణయించాను. నేను ఊనాలో దాగివున్న సొగసు సోయగాల వెలుగును సెల్యులాయిడ్‌మీద చూపగలిగితే ఇక విజయం నాదే!

సరిగ్గా ఇదే సమయంలో బారీ మళ్లీ హాలీవుడ్‌లో తుఫాన్‌లా వచ్చిపడింది. నా వంటవానికి ఫోన్‌చేసి, తాను మూడునెలల కడుపుతో వున్నట్లు చెప్పింది! కాని దానికి కారణమెవరో మాత్రం చెప్పలేదు. ఎవర్నీ నిందించలేదు. అసలు దానికి నాకూ సంబంధం లేదు. అందుకని నా వంటవానికి గట్టిగా చెప్పాను ఈ సారి ఆమె ఎటువంటి అల్లరి చేసినా పోలీసులకు అప్పగిస్తానని. కాని ఆ మర్నాడు మా యింటి ముందు ప్రత్యక్షమైంది – చాలా సంతోషంగా వెలిగిపోతూ! ఇంటి చుట్టూ తోటచుట్టూ దర్జాగా తిరుగుతూ కనపడింది. బహుశా ఏదో ప్లానుతోనే వచ్చి వుండాలి! అప్పుడు చెప్పింది. ఒక పత్రికా విలేఖరి ఆమెకు సలహా ఇచ్చింది. 'చార్లీ ఇంటికి వెళ్లి అరెస్టు అయితే నీకు చాలా మేలు జరుగుతుందని."

'నాకు వళ్లుమండి ఇప్పుడు నీవు ఇక్కడనుంచి వెళ్లకపోతే అదే జరుగుతుంది' అని హెచ్చరించాను. కాని ఆమె నవ్వింది. అంతే! ఇలాంటి బ్లాక్‌మెయిల్ తలనొప్పి వ్యవహారం ఇక భరించలేక పోలీసుకు ఫోన్ చెయ్యమని చెప్పాను.

ఒక గంట తర్వాత పత్రికలన్నీ నల్లని అక్షరాలతో నా మీద ఇష్టం వచ్చినట్లు రాశాయి. 'చాప్లిన్ ఇంకా పుట్టని బిడ్డకు తండ్రి!' 'ప్రియురాలిని పోలీసులకు అప్పగించాడు' 'ఆమెను అనాథను చేశాడు' ఇదీ వరస! ఒక వారం తర్వాత నామీద బారీ 'తండ్రిగా' వుండాల్సిన దావా వేశారు. ఇవన్ని దృష్టిలో పెట్టుకుని, నా లాయరు లాయిడ్ రైట్‌తో దానికి నాకు ఎటువంటి సంబంధం లేదనీ రెండు సంవత్సరాలుగా నాకూ బారీకి ఎటువంటి రాకపోకలూ లేవనీ చెప్పించాను.

ఇప్పుడు నేను 'షాడో సబ్‌స్టాన్స్' నిర్మాణంలోకి వెళ్తున్నానని తెలిసి లాయరు ఆ ప్రయత్నం మానుకోవటం మంచిదని సలహా ఇచ్చాడు! అంతే ఊనాని న్యూయార్కు పంపివేయమన్నాడు. దీనికి మేము అంగీకరించలేదు. ఇట్లాంటి అబద్ధపు ప్రచారం దావాలతో మేము భయపడమని తెగేసి చెప్పాం. పత్రికల పనికిరాని వార్తలు కూడా పట్టించుకోమని చెప్పాం. ఊనా నేనూ పెళ్లి విషయంలో దృఢ నిశ్చయానికివచ్చాం. నా స్నేహితుడు హారీ క్రోకర్ దీనికి కావలసిన ప్రాథమిక అవసరాలన్నీ సమకూర్చాడు.

అప్పుడు హారీ క్రోకర్, నా స్నేహితుడు పత్రికాధిపతి అయిన హార్స్ట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆ పెళ్లి ఫోటోలు అవసరమైనవే తీస్తానని వాగ్దానం చేశాడు. దీని గురించి హార్స్ట్ ప్రత్యేక కథనం రాసి లోవెల్లా పార్సన్స్ మా గురించి వివరంగా వ్రాసి, మిగతా పత్రికల నోళ్లు మూయించవచ్చని చెప్పాడు.

శాంత బార్బరాకి 15 మైళ్ల దూరంలో వున్న కార్పిన్‌టీరియా అనే చిన్న వూళ్లో ప్రశాంతంగా ఈ పెళ్లి పూర్తి చేసుకుని వెంటనే పెళ్లి ధృవపత్రం తీసుకోవచ్చని చెప్పాడు. దానికి ముందు శాంత బార్బరాలో నమోదు చేసుకోవాలి! ఉదయం ఎనిమిది గంటలకు దాదాపు వూరంతా ఇంకా నిద్ర లేవలేదు. టౌన్‌హాలుకు వెళ్లాం. నన్ను బైట వుంచి ఊనాను మాత్రం లోపలికి తీసుకువెళ్లాడు హారీ. అక్కడ గుమస్తాకి ఒక వింత అలవాటు వుంది. పెళ్లి చేసుకునే వాళ్లలో ఎవరైనా బాగా పేరున్నవాళ్లు వుంటే అతని బల్లకింద ఒక స్విచ్ నొక్కుతాడు. అంతే ఆ వూరిలో పత్రికల వాళ్లంతా పావుగంటలో అక్కడి కెమెరాలతో సహా చేరిపోతారు! ఈ విషయం హారీకి బాగా తెలుసు! అందుకని నన్ను బైట నిలబెట్టి ఊనాతో నమోదు కార్యక్రమం పూర్తి చేశాడు. అప్పుడు ఆ గుమస్తా "ఏదీ పెళ్లికొడుకును చూపించరా?' అన్నాడు నవ్వుతూ. అప్పుడు నేను లోపలికి వెళ్లాను. "ఆఁ ఎంత సంతోషం!" అంటూనే గుమాస్తా చేయి బల్లకిందికి వెళ్లింది. అంతే హారీ తొందరపెట్టాడు. ఏ మాత్రం సమయంలేదు, నమోదు కాగితం ఇవ్వమని. అతను అయిష్టంగానే అందచేశాడు. మేము బైటకు వచ్చి కారులో ఎక్కుతుండగానే పత్రికల గుంపు రావటం చూశాము! అక్కడనుంచి వాళ్లకు అందకుండా తప్పించుకోవటానికి నానా తిప్పలూ పడి చివరికి ఒక చిన్నసందులో మా కారు కనపడకుండా జాగ్రత్తపడ్డాం. వాళ్లు చివరికి నిరాశతోనే వెళ్లిపోయారు. తర్వాత తీరుబడిగా కార్పెంటీరియా చేరుకుని ప్రశాంతంగా పెళ్లి చేసుకున్నాం!!

శాంత బర్బరాలోనే రెండు నెలలు ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాం. మా కోసం వెతుకుతున్న పత్రికలూ కెమెరాల కళ్లూ కప్పి మేము అక్కడ ఎంతో ప్రశాంతంగా రోజులు గడిపాం. కాని ఎప్పుడు తలుపు కొట్టడం వినపడినా మేము కంగారు పడేవాళ్లం, ఏ పత్రికవాడో వచ్చాడని.

సాయంత్రాలు అక్కడి ప్రాంతాలలో నడుస్తూ తిరిగేవాళ్లం ఎవరూ గుర్తుపట్టకుండా జాగ్రత్తపడుతూనే. ఒక్కోసారి నేను చాలా నిరాశలో మునిగిపోయేవాడిని. ఏమిటిదంతా

మొత్తం దేశమంతా నన్ను ద్వేషిస్తోంది – నా సినిమా జీవితం అంతమై పోయింది. నేను చేసిన తప్పేముంది? అని విచారిస్తు కూర్చుండేవాడిని. అప్పుడే ఊనా నాకు ఎంతో నైతిక బలాన్నిచ్చేది. అలాంటి సమయంలో ట్రిల్బీ చదివేది. అది విక్టోరియన్, చాలా హాస్యంగా వుండేది. ముఖ్యంగా రచయిత ట్రిల్బీ త్యాగాన్ని వర్ణించే ఘట్టాలను చదివే సమయంలో చలిమంట గూటి దగ్గర ముడుచుకుని కుర్చీలో కూర్చొని ఊనా చదవటం నాకెంతో ఉత్సాహాన్నిచ్చేది. ఆ విధంగా నా విచారాన్నీ నిరాశనూ అధిగమిస్తూ ఎంతో సరసంగా సంతోషంగా అక్కడ రెండు మాసాలు గడిపాం!! లాస్ ఏంజెలిస్ తిరిగి వచ్చాం. నాకోసం చాలా ఆందోళన కలిగించిన వార్త ఎదురు చూస్తున్నదని చెప్పవచ్చు.

నా స్నేహితుడైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి మర్ఫీ చెప్పాడు. ఆయన పాల్గొన్న ఒక విందులో చాలా పరపతి వున్న రాజకీయ నాయకులు చాలా పట్టుదలతో వున్నారని 'చాప్లిన్‌ని వదలకూడదు' 'ఇరికించండి' ఇదీ వాళ్ల నిర్ణయం. ఆయన నాకు సలహా ఇచ్చాడు. 'ఒకవేళ నువ్వు చిక్కులో పడితే చిన్న లాయర్ను పెట్టుకో' అని. అంతగా పేరు లేని లాయర్ని అంతగా ఖరీదు కానివాడిని పెట్టుకో' అని చెప్పారు.

ఆ తర్వాత కొంత కాలానికే కేంద్ర ప్రభుత్వం తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వారికి పత్రికల మద్దతు పూర్తిగా వుంది కదా! వీరి దృష్టిలో నా అంత విలన్ (దుష్టుడు) మరొకరు వుండరేమో.

ఈలోగా నా మీద పడిన 'తండ్రి దావా.' 'ఇది సివిల్ దావా' అందుకని దీనిలో ప్రభుత్వ పాత్ర ఏమీ వుండదు. నా లాయరు లాయిడ్ రైట్ "రక్త పరీక్ష చేయించుదాము. మనం తప్పని సరిగా గెలుస్తాం" అన్నాడు. దీనికి మేము బారీకి 25 వేల డాలర్లు ఇస్తే ఆమెకూడా అంగీకరిస్తుంది – అంటే ఆమె ప్రసవించేవరకూ ఈ కేసు ముందుకు వెళ్ళదు. తర్వాత రక్తపరీక్షతో తేలిపోతుంది. దానికి నేను వెంటనే ఒప్పుకున్నాను.

ఆమె ప్రసవించిన తర్వాత అప్పుడు ప్రభుత్వం బారీని ప్రశ్నించటానికి గ్రాండ్ జూరీ విచారణ మొదలుపెట్టింది. ఇందులో రహస్యం నన్ను క్రిమినల్ కేసులో ఇరికించటమే. ఇది నా స్నేహితులను కంగారు పెట్టింది. వారు అప్పుడు బాగా పేరున్న క్రిమినల్ లాయర్నీ గీస్లర్‌ని పెట్టుకోమని సలహా ఇచ్చారు. నేను అదే పనిచేశాను. సుప్రీం కోర్టు న్యాయమూర్తి చెప్పిన విషయం మరుగున పెట్టి, ఇదే ఒక తప్పు –

ఎందుకంటే అంత పెద్ద క్రిమినల్ లాయర్ని పెట్టుకున్నాను అంటే – నేను చాలా పెద్ద సమస్యలో వున్నట్లు సంకేతాలు వెళ్లినట్లే – అదీ పత్రికలు రాశాయి!

అప్పుడు లాయిడ్ రైట్ గీస్లర్‌తో సమావేశం ఏర్పాటు చేశారు, ఏ ఏ కారణాలు లేకపోతే సెక్షన్ల క్రింద ఈ కేసు రావటానికి అవకాశాలుంటాయో చర్చించేందుకు.

అప్పుడు తెలిసింది మ్యూన్‌యాక్ట్ అనే చట్టాన్ని వ్యతిరేకించినందుకు ఈ విచారణ అని. కేంద్ర ప్రభుత్వం ఈ తుప్పుపట్టిన లేదా దుమ్ముపట్టిన చట్టాన్ని తనకి శత్రువు అనుకున్నవాడిని ఇరికించటానికి వాడుతుంది అనికూడా తెలిసింది.

ఈ చట్టం కింద ఆడవాళ్లను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి చేరవేయటం. అదీ వ్యభిచార నిమిత్తం!

తర్వాత ఈ చట్టానికి న్యాయపరమైన స్థితి లేకుండా పోయింది. అసలు వ్యభిచార ప్రదేశాలను నిషేధించారు అందుకని. ఈ చట్టంకింద అయిదు సంవత్సరాల కారాగార వాసం వుంటుంది. ఇదిగో ఈ బోగస్ అవకాశాన్ని వాడుకుని నన్ను కారాగారానికి పంపాలని ప్రభుత్వం నిశ్చయంగా వుంది! ఇది కాక మరొక కేసుకూడా నా మీద పట్టే ఆలోచనలో వుందని తెలిసింది. నా లాయర్లు ఇద్దరు ఇవి నిలిచేవి కావు అని ధీమాతో వున్నారు.

ఇక ఇప్పుడు ఈ గ్రాండ్ జూరీ విచారణ మొదలయింది. ఈ బారీ న్యూయార్క్ లాస్‌ఏంజెన్‌లు చాలాసార్లు తిరిగింది. అప్పుడు తల్లితోనే వుండేది. తర్వాత కొన్నిరోజులకు గీస్లర్ ఫోన్‌చేసి "చార్లీ – నిన్ను అన్ని రకాలుగా ఇరికించారు" అని. "తర్వాత ఈ వివరాలన్ని సంపాదించవచ్చు. ఈలోపు నీకు దీని విచారణ తేదీలు అన్నీ తెలియజేస్తాను" అని కూడా అన్నాడు.

ఆ తర్వాత వారాలు నా జీవితంలో కాఫ్కా కథలా నడిచింది. నా స్వేచ్ఛకోసం ఎవరితో ఎందుకు ఎక్కడ పోరాడాలో అందుకు అవసరమైన ఆయుధాలు ఏమిటో ఇవన్నీ అస్పష్టమే! ఒకవేళ ఇవి నాకు వ్యతిరేకంగా జరిగితే ఇరవయి సంవత్సరాలు కారాగారంలో గడపాలి!

మొదటి విచారణ తర్వాత పత్రికలవాళ్లకీ ఫోటోల వాళ్లకీ పండగే! వాళ్ళూ కోర్టు ఆవరణలోకి చొచ్చుకు వచ్చేశారు. నా వేలిముద్రలు తీస్తుండగా ఫోటోలు తీశారు. నేను అక్కడి అధికారిని అడిగాను – 'వీళ్లు ఇలా రావచ్చా' అని. ఆయన 'రాకూడదు'

అయినా 'ఆపలేము' అన్నాడు నవ్వుతూ! ఇప్పటికి బారీ సంతానానికి రక్తపరీక్షకు సరిపడా వయసు వచ్చింది. మా లాయర్లు ఇద్దరికీ అంగీకారమైన పరీక్షా కేంద్రంలో ఈ తంతు పూర్తి చేశారు. ఈ రక్తపరీక్ష ఫలితం వచ్చిందనీ, నన్ను నిర్దోషిగా తేల్చారనీ మా లాయరు సంతోషంగా చెప్పాడు. ఈ వార్త పత్రికల్లో బాగానే ప్రచురించారు! 'చార్లీకి రక్తపరీక్షలో విజయం లభించింది.'

ఈ రక్తపరీక్ష, కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది. అయినా వాళ్లు నా కేసుని ముందుకు తీసుకు పోవటానికే నిర్ణయించారు.

ఇది జరుగుతుండగా సాయంత్రాలు గీస్లర్ ఇంటిదగ్గర, నేను బారీతో గడిపిన సమయాలన్నీ గుర్తుకు తెచ్చుకుని చెప్పాల్సి వచ్చేది. అప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఒక చర్చి ఫాదర్, మాకు కొంత సమాచారం పంపారు. బారీని ఎవరో అదృశ్య హస్తం నడుపుతోంది. అది ఫాసిస్ట్ ఆర్గనైజేషన్ అని కూడా తెలిపాడు. అది ఉత్తరాల ద్వారా తెలిపాడు. కావాలంటే శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి లాస్ ఏంజెలెస్ వచ్చి సాక్ష్యం చెప్తానని అన్నాడు. నా లాయరు గీస్లర్ దీనివల్ల వుపయోగం వుండదని కొట్టిపారేశాడు. చాలా వ్యతిరేక సాక్ష్యధారాల తరువాత బారీ గురించి చాలా సంపాదించారు. కాని దీనికి కూడా గీస్లర్ ఒప్పుకోలేదు. ఇదంతా చాలా పాత పద్ధతి. ఇప్పుడు అవసరం వుండదని అన్నాడు. ఇలాంటి కేసే ఎరల్‌ఫ్లిన్ విచారణలో ఉపయోగపడిందని ఇప్పుడు అవసరం వుండదని అన్నాడు.

'మనం ఇదంతా లేకుండానే ఈ కేసు గెలుస్తాం.' అన్నాడు. కాని ఆయనకు ఇదంతా చెత్తగా అనిపించినా బారీ ఎలా ఇబ్బంది పెట్టింది, క్షమించమని అడుగుతూ రాసినవి కనీసం ఈ వుత్తరాలు అమెరికా ప్రజలయినా నమ్ముతారు కదా! నా మీద పత్రికల వాళ్లు రాసిన అబద్ధాలన్నీ బారీ రాసిన వుత్తరాలు – నేను చేసిన సహాయం, నా మంచి తనం అన్ని అంగీకరిస్తూ, తెలియచేస్తూ వున్నాయి. ఈ ఉత్తరాలు అన్నీ వీటిలోని విషయాలు పత్రికలు చేసిన దుష్ప్రచారాన్ని ఎదుర్కోవటానికి పనికివస్తాయని అనుకున్నాను. ఆ రకంగా అమెరికా ప్రజలు నిజం తెలుసుకుంటారని ఆశించాను. ఈ సందర్భంగా నేను మీకు ఎడ్గర్ గురించి కొంత చెప్పాలి. ఇది కేంద్ర ప్రభుత్వ దావా కాబట్టి FBI కేసు పెట్టింది కాబట్టి ఆ సంస్థే నాకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు పోగుచేస్తుంది. ఎడ్గర్ హూవర్‌ని ఇదివరకు నేను కలిశాను. ఆయన వికారపు ముఖం వెనక చాలా ఆమోద యోగ్యమైన వ్యక్తి వున్నాడు. నాతో చాలా ఉత్సాహంగా మాట్లాడాడు.

తాను ఎప్పుడూ కొత్తవాళ్లను తన లా కంపెనీలోకి తీసుకుంటాననీ చాలామంది లా విద్యార్థులను కూడా తర్వీదు ఇస్తాననీ చెప్పాడు.

ఇప్పుడు హూవర్, చేజెన్ రెస్టారెంటులో విందారగిస్తూ మాకు మూడు బల్లల అవతల కూర్చున్నాడు. ఆయనతో FBI వాళ్లు టిప్పేగ్రే అనే హాలీవుడ్ వ్యక్తి (ఈయన నాకు 1918 నుంచి అప్పుడప్పుడు కలుస్తున్నాడు) వున్నారు. చాలా వ్యతిరేక స్వభావంగలవాడు. హాలీవుడ్ పార్టీలకూ విందులకూ వస్తుంటాడు. ఎప్పుడూ నన్ను అదోరకంగా చూస్తుంటాడు. ఇప్పుడు అతను కూడా వీళ్లతో వున్నాడు. అతనికి ఇక్కడేమి పనో అర్థం కాలేదు.

నేనూ – ఊనా లేచి వెళ్లిపోవటానికి సిద్ధపడ్డాం. అప్పుడు నేను టిప్పేగ్రేను చూశాను. అదోరకమైన వంకర నవ్వుతో చూస్తున్నాడు. అప్పుడే అనుకున్నాను అతను నాకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు అని.

చివరికి ఆ దురదృష్టపు రోజు రానే వచ్చింది. గీస్లర్ తనని కోర్టు బైట పదినిమషాల ముందుగా కలవమన్నాడు. అప్పుడు కోర్టులోకి కలిసి వెళ్లవచ్చు అని చెప్పాడు.

ఆ కోర్టు గది రెండో అంతస్థులో వుంది. మేము లోపలికి వచ్చే సమయానికి – అక్కడ పెద్దగా హడావుడి లేదు. అప్పుడు పత్రికల వాళ్లు నన్ను పట్టించుకోవటం మానివేశారు. వాళ్లకు ఈ కోర్టు వ్యవహారంలోనే, చాలా విషయం దొరుకుతుంది కదా. గీస్లర్ నన్ను ఒక కుర్చీలో కూర్చోబెట్టాడు. తర్వాత కోర్టు లోపల అందర్నీ కలుస్తూ తిరిగాడు. నాకు తప్ప ఈ కేసుతో అందరికీ సంబంధమున్నట్లుగా అనిపిస్తోంది! నేను ప్రభుత్వ లాయరువంక చూశాను. ఆయన ఏవో కాగితాలు చూస్తున్నాడు. చాలా విశ్వాసంతో వాళ్ల మనుష్యులతో మాట్లాడుతూ నవ్వుతున్నాడు. టిప్పీగ్రీ అతనితోనే వున్నాడు. అతని వంకర నవ్వులో మార్పు లేదు. గీస్లర్ అక్కడ ఒక కాగితం పెన్సిల్ వదిలివెళ్లాడు. విచారణ జరిగే సమయంలో రాసుకోవటానికి. నేను ఖాళీగా వున్నాను కదా అందుకని ఆ కాగితం మీద బొమ్మ వేయటం మొదలుపెట్టాను. అది చూసి గీస్లరు వెంటనే లాగివేసుకున్నాడు. "పత్రికల వాళ్లు ఇది చూస్తే నీకు వ్యతిరేకంగా వాడుకోవచ్చు" అని దాన్ని ముక్కలు చేశాడు. నేను గీసిన బొమ్మ ఒక నదీ, దానిమీద ఒక పాత వంతెనా.

అప్పుడు జడ్జిగారు వస్తున్నట్లు మూడుసార్లు బల్ల మోగించాడు గుమస్తా. అంతే విచారణ మొదలయింది. నామీద నాలుగు అభియోగాలు పెట్టారు. రెండు మ్యూన్‌యాక్ట్ క్రింద. మరొక రెండు ఎవరూ వినని ఒక పాత చట్టం క్రింద. అదీ ఒక వ్యక్తి స్వాతంత్ర్యాన్ని హరించానని. ముందు ఈ కేసు అంతా బోగసు అని మొత్తం ఎత్తివేయాలని గట్టిగా చూశాడు – గీస్లర్. కాని అదెలా సాధ్యం – సర్కస్ టిక్కెట్లు అమ్మిన తర్వాత జనాన్ని లోపలికి రాకుండా చేయగలమా?

జూరీని ఎంచుకోవటానికి రెండు రోజుల సమయం పట్టింది. మొత్తం 24 మందిలో 12 మందిని ఎంచుకోవాలి. ఇరుపక్షాల వారికీ వారిలో ఆరుగురిని తమకు అభ్యంతరాలున్నవని వద్దనవచ్చు. మళ్లీ మరో ఆరుగురిని ఎంచుకోవాల్సి వుంటుంది. ఇరుపక్షాల వారు జూరీ సభ్యులను చాలా నిశితంగా పరిశీలించి ప్రశ్నిస్తారు. ఇది చాలా ప్రజాస్వామిక ప్రక్రియ. జడ్జీ ఇరుపక్షాల లాయర్లూ ఒక్కో సభ్యుని విడివిడిగా కూర్చోబెట్టి ప్రశ్నిస్తారు. మీకున్న అర్హత ఏమిటి? ఈ కేసుకు నిష్పక్షపాతంగా తీర్పుఇవ్వగలరా? మీరు రోజూ అన్ని పత్రికలూ చదువుతారా? ఆ వార్తల మూలంగా మీరు ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోలేదని ప్రమాణం ఏమిటి? 'మీకు ఈ కేసుతో సంబంధం వున్న వ్యక్తులెవ్వరితోనైనా సంబంధం వుందా?

నాకు వ్యతిరేకంగా 14 నెలలుగా పత్రికలు కథనాలు ప్రచారం చేస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో పత్రికలవల్ల ప్రభావం పొందనీ, వార్తలు చదవనీ వ్యక్తి మాకు ఎలా దొరుకుతాడు? అదీ మేము అరగంట సమయంలోనే సభ్యుడిని ఎంచుకోవాలి! ఈ అరగంటలోనే ఇరుపక్షాల లాయర్లూ వాళ్ల పరిశోధకులను పరిగెత్తించి ఆ సభ్యుని భాగోతం పుట్టుపూర్వోత్తరాలు కూపీలాగి తిరిగివచ్చి లాయరుకు చిన్న చీటీ ఇచ్చేవారు. ఇలా 'ఒక్కో జూరీ సభ్యుని ఎంపిక జరిగే సమయంలో మా లాయరు గీస్లర్ నోట్సు తయారుచేసి తన సహాయ శోధకులను పరిగెత్తించేవాడు. అంతే వాళ్లు మాయమయి పోయేవారు. పదినిమిషాల తర్వాత పరుగులతోవచ్చి గీస్లర్‌కి నోట్సు ఇచ్చేవారు. వారి పరిశోధనను! "ఈయన ఒక దుకాణంలో గుమాస్తా. భార్యా, ఇద్దరు పిల్లలు – ఎప్పుడూ సినిమాలు చూడరు! ఇది విషయం. "అయితే ఇతన్ని కాస్సేపు వుంచుదాం" అనేవాడు గీస్లరు. ఈ విధంగా ఈ ఎంపిక నడిచింది. ఇరుపక్షాలవాళ్ళూ సభ్యులను అంగీకరించటం వద్దనటం, ప్రతిసారీ ప్రభుత్వ లాయరు తన సహాయకులతో గుసగుసలాడటం అప్పుడే టప్పీగ్రీ నా వంక వంకర నవ్వు విసరటం! ఇదీ వరస.

అప్పటికి ఎనిమిది మంది జూరీ సభ్యులను ఎంపిక చేశారు. అప్పుడు ఒక స్త్రీ ప్రవేశించింది – జూరీ బాక్స్‌లోకి. వెంటనే గీస్లర్ "ఈమె నాకు నచ్చలేదు" "ఈమె నాకు నచ్చలేదు – ఎందుకో" అని అంటూనే వున్నాడు – అప్పటికి ఆమెను ప్రశ్నిస్తుండగానే గీస్లర్ సహాయకులు చీటీ అందించారు. "ఇదిగో నా అనుమానం సరైనదే!" ఈమె లాస్‌ఎంజెలెస్ టైమ్స్ పత్రికలో పనిచేస్తోంది. ఈమెను వద్దని చెప్పాలి." నేను ఆమెను అంచనా వేయటానికి ప్రయత్నించాను. సరిగ్గా కనపడక కళ్లద్దాలను పెట్టుకుందామని తీశాను. గీస్లర్ "వద్దు – కళ్ళద్దాలు పెట్టుకోవద్దు" అని నా చేయి పట్టుకున్నాడు. ఇదంతా ఆమె చూడటంలేదు. కాని అద్దాలు లేకపోతే అంతా అస్పష్టంగానే వుంది." గ్లీసర్ "మనకి ఇంకా రెండు అభ్యంతరాలే మిగిలి వున్నాయి – ప్రస్తుతానికి ఈమెను వుంచుదాము" అన్నాడు. తర్వాత జరిగిన తంతులో ఇద్దరి సభ్యులను వద్దని చెప్పవలసి వచ్చింది. వాళ్లు నా మీద వ్యతిరేక భావంతో వున్నారని ఆధారాలున్నాయి. అందుకని ఇష్టంలేక పోయినా ఈ ఆడ రిపోర్టర్‌ను జూరీలో వుంచాల్సి వచ్చింది.

తర్వాత ఇద్దరి లాయర్లు అబ్రకదబ్ర వినీవినీ నాకు వాళ్లు ఏదో ఆట ఆడుతున్నట్లు అనిపించింది. ఇది ఎంత బోగస్ కేసు అయినా నాకు ఎక్కడో ఒక అనుమానం పీడిస్తోంది. ఈ కేసు మూలంగా నా జీవితం దుర్భరంగా మారబోతోంది. నా సినిమా వృత్తి అయిపోయినట్లే. అంతా అయోమయంగానే ఎక్కడో సుదూర ప్రాంతంలో నా అదృష్టం కనపడటంలేదని అనుకున్నాను. ఈ విషయాలన్ని ప్రక్కనపెట్టి ఆలోచించటం మానుకున్నాను. ఒక్క సమయంలో ఒక్క విషయం గురించే ఆలోచించగలను.

ఎంత కష్టం వున్నా ఎంతసేపూ బాధలోనే వుండలేం. ఈ కేసు జరుగుతుండగా ఒక సాంకేతిక విషయం చర్చించే మిషతో కోర్టు కొంచెంసేపు వాయిదాపడింది. జూరీ సభ్యులు లోపలికి వెళ్లారు. జడ్జి లాయర్లు మరో గదిలోకి వెళ్లారు. అప్పుడు కోర్టు హాలులో నేనూ, కొంతమంది ప్రేక్షకులూ ఒక ఫోటో గ్రాఫరూ వున్నాం. అతను నన్ను ఏదో అకస్మాత్తుగా అసహజంగా ఫోటోలో బంధించాలని వేచివున్నాడు.

నేను చదువుకుందామని కళ్లజోడు పెట్టుకున్నాను. అతను ఫ్లాష్ తీశాడు. నేను వెంటనే కళ్లజోడు తీశాను. అతను ఫ్లాష్ కిందపెట్టాడు. నేను కళ్లజోడు పెట్టుకున్నాను. మళ్లీ అతను ఫ్లాష్ తీశాడు. ఇదంతా చూస్తున్న ప్రేక్షకులు నవ్వు ఆపుకోలేకపోయారు. ఇలా కొంతసేపే సరదాగానే నడిచింది. అంతలో మళ్లీ కోర్టు సమావేశం అయింది. నేను గంభీరంగా మారిపోయాను!



ఈ విచారణ చాలా రోజులు నడిచింది. ఇది ప్రభుత్వ సంబంధమైన కేసు మూలంగా బారీ స్నేహితుడు పాల్‌గెట్టి వచ్చి సాక్ష్యం చెప్పాల్సి వచ్చింది. ఇంకా ఇద్దరు జర్మన్ యువకులు కూడా వచ్చారు. గెట్టి చెప్పాడు "ఈమె నాకు స్నేహితురాలు. మాకు అన్ని రకాల సంబంధాలున్నాయి. సొమ్ముకూడా ఇచ్చేవాడిని" అని. ఈ సందర్భంలోనే నాకు ఆమె రాసిన వుత్తరాలన్ని కోర్టుకు ఇవ్వాలని సూచించాను. గీస్లర్ గట్టిగా ప్రయత్నించి వుంటే అవి సాక్ష్యంగా మారేవి. కానీ కోర్టు అందుకు అంగీకరించలేదు. చివరగా ఈ విచారణలో సాక్ష్యాధారం ఒకటే – ఈ నా యింటికి రాకపూర్వం ఆ రాత్రి ఒక జర్మన్ యువకునితో అపార్ట్‌మెంటులో వుందని. అతను వచ్చి నిజం ఒప్పుకున్నాడు.

ఇలా ఈ కష్టమైన పరీక్షకు గురికావటం – అదీ ప్రజల సమక్షంలో కోర్టు హాలులో ఇదంతా ఎలా వుందంటే నన్ను పబ్లిక్ స్టాక్‌లో పెట్టినట్లనిపించింది. కాని కోర్టు హాలు వదలగానే ఇదంతా మరిచిపోయి ఇంటికి చేరి ఊనా సమక్షంలో భోజనంచేసి అలసి నిద్రపోయేవాడిని. ఈ ఆందోళనకరమైన విచారణ సమయంలో పడిన శ్రమయేకాక, ప్రతిరోజూ ఉదయాన్నే ఏడుగంటలకు నిద్రలేవటం, కాస్త ఆహారం తీసుకుని కోర్టుకు పరుగుపెట్టటం, అదే కాలంలో లాస్‌ఏంజెలెస్ రద్దీలో గంటకుపైగా ప్రయాణం (తప్పనిసరిగా కోర్టు హాలులో పదినిమిషాల ముందుగా సిద్ధంగా వుండాలి)

ఎలాగైతే ఈ విచారణ చివరకు వచ్చింది. ఇద్దరు లాయర్లూ చెరొక రెండున్నరగంటలు తమ వాదన వినిపించటానికి అంగీకరించారు! అయిదుగంటలు వీరు దేనిగురించి మాట్లాడతారో నాకింతకూడా అంతుబట్టలేదు! నాకైతే ఇది ఎంత తేటతెల్లంగా వుందంటే ఈ ప్రభుత్వం కేసు గాలికి ఎగిరినట్లే అని నమ్మాను. అంతేకాదు ఈ కేసులో నాకు ఇరవయి సంవత్సరాల కారాగార శిక్షపడే అవకాశం ఏ మాత్రం లేదని నమ్మాను. ఈ విధంగానే జడ్జి కూడా అనుకున్నాడనే విశ్వసించాను. జూరీలోని సభ్యులను ముఖ్యంగా స్త్రీ విలేఖరి ఆలోచనలు ఏమిటో ఎలా తెలుస్తాయి?

చివరికి జూరీ సభ్యులను తమ నిర్ణయాన్ని చెప్పవలసిందిగా జడ్జి కోరారు. అందుకుగాను వారు లేచి ప్రక్కహాలులో సమావేశమైనారు. మేము కోర్టు హాలు నుంచి వరండాలోకి వచ్చాము. గీస్లర్ "మనం ఈ తీర్పు వచ్చేవరకు ఇక్కడనుంచి వెళ్లకూడ"దన్నాడు. 'మనం ఆ పచ్చికలో రాతి బెంచి మీద కూర్చోవచ్చు' 'కాస్త ఎండలో' అన్నాడు.

ఈ మర్మం నాకు చాలా బాధ కలిగించింది. ఒకవేళ విధి నామీద తన వలను బిగిస్తోందా? ఇప్పుడు నేను చట్టానికి సంబంధించిన ఆస్థినికదా?

అప్పటికి మధ్యాహ్నం ఒక గంట దాటి అరగంటయ్యింది. నిర్ణయం రావటానికి ఇరవయి నిమిషాలు పట్టవచ్చన్నారు. ఊనాకు ఫోన్ చేయనా? కాని గంట గడిచిపోయింది. అప్పుడు ఫోన్ చేశాను జూరీ ఇంకా నిర్ణయం చెప్పలేదు అని. మళ్లీ ఫోన్ చేస్తానని.

మరొక గంట గడిచింది. అంతవరకూ ఏ నిర్ణయం బైటకు రాలేదు. ఎందుకు అంత ఆలస్యం? ఆ వ్యవహారం పది నిమిషాలలో తేలిపోవలసిందే? నేను నిర్దోషిననేగా వీళ్లు చెప్పేది. దీనికి అంత ఆలస్యం ఎందుకు?

నేనూ, గీస్లరూ ఆ రాతి బెంచిమీదనే కూర్చున్నాం. ఇద్దరం ఆ ఆలస్యానికి కారణమేమిటా అని వ్యాఖ్యానం చేయకుండానే మౌనంగా వున్నాం. అప్పుడు గీస్లరు తన గడియారం వంక చూసి "అరె అప్పుడే 4 గంటలయింది. ఎందుకు ఆలస్యం చేస్తున్నారు?" అప్పుడు ఏ విషయమై ఆలస్యం కావటానికి అవకాశం వుందా అని చర్చించాము.

పావు తక్కువ అయిదింటికి కోర్టు గంట మోగింది! అంతే జూరీ సభ్యుల నిర్ణయం అయిపోయిందన్నమాట. నా గుండె దడదడలాడింది. మేము భవనంలోకి వెళ్లుతుండగా "వీళ్ల నిర్ణయమేమైనా నువ్వు ఎటువంటి భావోద్వేగాన్ని ప్రదర్శించుకు" అన్నాడు గ్లీసర్. మమ్మల్ని దాటుకుని పరుగున వెళ్తున్నాడు ప్రభుత్వ న్యాయవాది. అతని సహాయకులు చాలా ఉత్సాహంగా నవ్వుతూ పరుగు పెడుతున్నారు. వాళ్ళ వెనకాలే టిప్పీగ్రే వెళ్తు వెనక్కి తిరిగి నా వంక చూశాడు.

కోర్టుహాలు త్వరలో నిండిపోయింది. అంతేగాదు ఎంతో వత్తిడితో బిగిసిపోయింది. కారణమేమైనా నేను చాలా నెమ్మదిగానే వున్నాను. కాని గుండె గొంతులో కొట్టుకుంటోంది.

మూడుసార్లు సుత్తిదెబ్బలు కొట్టాడు గుమాస్తా. అంటే జడ్జి వస్తున్నట్లు. మేమంతా లేచి నిలబడ్డాం. అప్పుడు జూరీ సభ్యులు వచ్చి వాళ్ల బాక్సులో కూర్చున్నారు. అక్కడ వున్న ఫోర్‌మన్ ఒక కాగితం తెచ్చి కోర్టు గుమాస్తాకు ఇచ్చాడు.

గీస్లరు తల దింపి కూర్చున్నాడు. "ఆ నిర్ణయం నువ్వు దోషివని తెలిస్తే – అంతకంటే చరిత్రలో అన్యాయం మరొకటి వుండదు" అని గొణిగాడు. "అవును ఇంతకంటే అన్యాయం ఎక్కడా వుండదు" అని మళ్లీ గొణిగాడు.

ఇప్పుడు గుమాస్తా ఆ కాగితం చదవటానికి లేచి మూడుసార్లు సుత్తిబల్లమీద కొట్టాడు.

"చార్లెచాప్లిన్ కేసు నంబరు 337068, క్రిమినల్.... మొదటి అభియోగం. దోషి కాదు" ఒక్కసారిగా కోర్టుహాలులో కేకలు విన్పించాయి.

మళ్లీ నిశ్శబ్దం..

"రెండో అభియోగం.... నిర్దోషి..."

అంతే హాలులో ఒక్కసారిగా గందరగోళం గోల. అరె నాకు ఇంతమంది శ్రేయోభిలాషులున్నారా? అని ఆశ్చర్యపోయాను! కొంతమంది నా దగ్గరకు వచ్చి కౌగిలించుకుని బుగ్గమీద ముద్దులు పెట్టారు. టిపీగ్రే వాడి ముఖంలో కళ తప్పింది. అప్పుడు జడ్జి నన్ను ఉద్దేశించి "మిస్టర్ చాప్లిన్, మీరిక వెళ్లవచ్చు – మీరిప్పుడు స్వతంత్రులు" అంటూ నాతో కరచలనం చేశారు. అభినందనలు తెల్పారు. అలాగే ప్రభుత్వ లాయరు కూడా.

అప్పుడు గీస్లర్ నా చెవిలో "ఇప్పుడు వెళ్లి జూరీ సభ్యులతో కరచాలనం చేయి" అన్నాడు.

నేను వాళ్ల దగ్గరకు వెళ్లినప్పుడు ఆ ఆడ రిపోర్టరు లేచి "అంతా మంచిదే చార్లీ – ఇది ఇంకా స్వేచ్ఛాదేశమే" అంది. నేను అవాక్కయ్యాను. ఆమె మాటలు నన్ను పూర్తిగా దెబ్బతినేలా చేసినాయి. నేను తలవూపి నవ్వాను. "మిమ్మల్ని కిటికీలోనుంచి చూశాను. మీరు ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతున్నారు. వచ్చి ఏమీప్రమాదం లేదు అని చెప్పాలనుకున్నాను. ఈ ఆలస్యానికి కారణం ఒక్కరే లేకపోతే పదినిమిషాలతో మా నిర్ణయం చెప్పేవాళ్లం."

నా దుఃఖాన్ని ఆపుకోవటానికి చాలా ప్రయత్నం చేశాను. ఆమెకు కృతజ్ఞతలు తెలిపి నవ్వాము. తర్వాత మిగతా పదకొండుమందికీ చేయి కలపటానికి తిరిగాను. అందరూ సంతోషంగా కరచాలనం చేశారు. ఒక్క పెద్దావిడ బిగుసుకుపోయింది. అప్పుడు

విలేఖరి "రండి" అంటూ "రిలాక్సయి కరచాలనం చేయండి" అంది. ఆమె అయిష్టంగానే నా చేయి అందుకుంది చల్లగా – నేను థ్యాంక్స్ చెప్పాను.

అప్పుడు ఊనా నాలుగు నెలల గర్భవతి. నేను వెళ్లేసరికి 'ఇంటి బైట పచ్చికలో కూర్చుంది. ఒంటరిగానే – ఇదంతా విని నా చేతుల్లో మూర్ఛపోయింది పాపం!

ఆ రాత్రి మేమిద్దరమే ఇంటి దగ్గర భోజనం చేశాము ప్రశాంతంగా. పత్రికలు వద్దు ఫోన్ సందేశాలు వద్దు ఎవరితో మాట్లాడదలచలేదు. కలవటం ఇష్టంలేదు. నేను శూన్యంగా అయిపోయాను. గాయపడ్డాను, నా వ్యక్తిత్వం చిన్నబోయింది. చివరికి నా పనివాళ్ల కళ్లల్లోకి కూడా చూడలేకపోయాను.

భోజనం తర్వాత ఊనా నాకు జిన్, టానిక్ కలిపి ఇచ్చింది. చలిమంట గూటి దగ్గర కూర్చున్నపుడు అన్ని వివరాలూ చెప్పాను. స్త్రీ విలేఖరి అన్న మాటలు కూడా చెప్పాను. ఇది 'స్వేచ్ఛా ప్రపంచం' అన్న విషయం.

ఇన్ని వారాల టెన్షన్ తర్వాత ఇప్పుడు కాస్త ప్రశాంతంగా వుంది. రాత్రి చాలా తొందరగా నిద్రపోయాను. ఉదయాన్నే ఏడుగంటలకు లేవవలసిన అవసరం లేదుగా!

రెండు రోజుల తర్వాత లాయన్ ఫీష్‌వాంగర్ అన్నాడు: "నీవొక్కడవే నటుడివి. మొత్తం దేశపు వ్యతిరేకతను అదీ రాజకీయం పరంగా నిద్రలేపినవాడివి" అని కాస్త హాస్యంగానే అన్నాడు.

ఇక ఇప్పుడు 'తండ్రి దావా' వుంది. అది రక్తపరీక్షతో అయిపోయిం దనుకున్నాను. కాని అడ్రాయిట్ ఫినాగ్‌లింగ్‌తో మరొక నోరుగల న్యాయవాది దీన్ని మళ్లీ తెరిపించాడు.

అతను ఆ బిడ్డని కోర్టుకు అప్పగించాలి. సంరక్షణ బాధ్యత అని తల్లికి 25 వేల డాలర్లు తీసుకోవచ్చు అని కూడా పెట్టాడు.

అంటే ఈ బిడ్డ సంరక్షణ బాధ్యత నా నెత్తిన కోర్టు ద్వారా పెట్టించాలని అతని ప్రణాళిక.

మొదట విచారణలో జూరి అంగీకారం కుదరలేదు. రెండో విచారణలో నా రక్తపరీక్ష విజయాన్ని కాదని నాకు వ్యతిరేకంగా జూరీ నిర్ణయం వచ్చింది.

అప్పుడు ఊనా, నేనూ ఈ గోలనుంచి బైటపడాలని తాపత్రయపడ్డాం. పెళ్లయిన సంవత్సరంలోనే మమ్మల్ని కైమా కొట్టినట్లు ఈ సంఘటనలన్నీ జరిగినాయి. ఇప్పుడు

విశ్రాంతి కోసం చూస్తున్నాము. చిన్న పిల్లిని వెంటబెట్టుకొని న్యూయార్కు రైలెక్కాము. అక్కడ నుంచి Nyaek వెళ్లాం. ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాము. అది అన్నింటికీ దూరంగా రాళ్ల మధ్యలో వుంది.

Nyaekలో గడిపిన రోజులు బద్ధకంగా ఒంటరిగానే గడిచినాయి. మేము ఎవ్వరినీ చూడదల్చుకోలేదు. ఇంకా ఈ కేసుల గొడవనుంచి నేను పూర్తిగా కోలుకోలేదు.

ఈ సంఘర్షణ నా సృజనాశక్తిని కుంటుపరిచింది. అయినా మిష్టర్ వెర్డో స్క్రిప్టు పూర్తి చేశాను. ఈ తూర్పుప్రాంతంలోనే 6 నెలలు వుండాలని ప్రణాళిక వేసుకున్నాము. ఊనా ప్రసవం ఇక్కడే జరగాలని అనుకున్నాం. కాని Nyaekలో ఎలా పనిచేసేది? అయిదువారాల తర్వాత కాలిఫోర్నియా తిరిగి వచ్చేశాము.

మా పెళ్లయిన తర్వాత తనకు నటన మీద అంత ఇచ్ఛలేదని చెప్పింది ఊనా. నేను చాలా సంతోషించాను. ఇంత కాలానికి నాకు ఒక భార్య సినిమాకు సంబంధం లేని భార్యా, కుటుంబం ఏర్పడిందని. అప్పుడే షాడోని ప్రక్కనపెట్టి 'వెర్డో'ని తీశాను బైటకు. నా పనిని ఈ ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసింది ఇన్నాళ్లుగా. అప్పుడప్పుడు అనుకుంటాను – ఈ సినిమా ప్రపంచం చక్కటి హాస్యాన్ని కోల్పోయింది ఊనా దానిలోకి రాకపోవటంవలన అని. ఎందుకంటే ఊనాలో హాస్యచతురత చాలా ఎక్కువ!

ఇప్పుడే నాకు ఒక సంఘటన గుర్తు వస్తోంది. ఆ కోర్టు వ్యవహారం మొదలవక పూర్వం మేమిద్దరం ఒక నగల కొట్టుకు వెళ్లాం. బెవర్లీహిల్స్‌లో. అది కూడా ఆమె వానిటీ బాగ్ బాగు చేయించటానికి. అక్కడ ఒక బ్రాస్‌లెట్ అదీ వజ్రాలు కెంపులతో వున్నది ఆమెకు బాగా నచ్చింది. తీరా ఖరీదు ఎక్కువని వద్దంది! అక్కడ పని అయినపోయిన తర్వాత ఇద్దరం కారుదగ్గరకు వెళ్లాం. "త్వరగా ఎక్కు అని పోనీ కారు" అని చూడు ఈ బ్రాస్‌లెట్ కోట్టేశాను – అని చూపించాను. ఆమె ముఖం పాలిపోయింది. కారుని ఒక చోట ఆపి 'ఈ పని చేయకుండా వుండవలసింది' అని నీరసంగా అంది. 'అయితే ఇది మళ్లీ పెట్టిరావటం కుదరదుకదా?' అన్నాను. ఇక నవ్వు ఆపుకోలేకపోయాను – అప్పుడు ఈ ప్రాక్టికల్ జోక్ అర్థమయింది. 'నేను దొంగిలించాననుకున్నావా?'

'నీకు ఎటువంటి సమస్యా రావటం నాకిష్టం లేదు' అంది.

ఇరవై ఎనిమిదవ అధ్యాయం

సెన్సార్ సమస్య

విచారణ కాలంలో నాకూ ఊనాకు తోడుగా చాలామంది స్నేహితులూ శ్రేయోభిలాషులూ వున్నారు. వీళ్లంతా నాకు ఎంతో ప్రియమైనవారు. మాకు సహాయంగా, సానుభూతితో మమ్మల్ని కాపాడారు. సల్కావీర్టెల్, క్లిటార్డ్ ఓడెట్సు దంపతులు, హాన్స్‌ఈర్లెస్ దంపతులు, ఇంకా షాప్ వాంగర్ దంపతులు, ఇలా ఎంతోమంది మా చుట్టూ వున్నారు.

సల్కా (ఈమె పోలిష్ నటి) సాంతామోనికాలో చక్కని సప్పర్ విందులు ఇచ్చేది. సల్కా ఇంటికి నటీనటులే కాదు రచయితలూ, రచయిత్రులూ కూడా వస్తుండేవారు. థామస్‌మాక్, స్టీఫెన్ స్పెండర్ సిసిల్ కన్నోలీ ఇంకా ఎంతోమంది వచ్చేవారు. సల్కా ఎక్కడవున్నా గూటి పక్షిలాగా వుండేది.

హాన్స్ ఇంటిదగ్గర బెల్ట్‌ల్ప్ బ్రెష్టెను కలిసే వాళ్లం. ఆయన గుండులాంటి తలతో ఎంతో ఆత్మవిశ్వాసంతో కనపడేవాడు. ఎప్పుడూ సిగార్ నోటిలో వుండేది. తర్వాత కొన్నాళ్లకు మిస్టర్ వెర్డో స్క్రిప్ట్ చూపించాను. 'అరె నీవు చైనా వాళ్లలాగా స్క్రిప్ట్ రాస్తావే' అన్నాడు.

నేను లయన్‌ను అడిగాను ఇప్పుడు దేశంలో రాజకీయ వాతావరణం ఎలా వుంది. అని. ఆయన "నేను బెర్లిన్‌లో ఇల్లు పూర్తిచేసే సమయానికి హిట్లర్ అధికారంలోకి వచ్చాడు. బెర్లిన్ వదిలి పారిస్ వచ్చాను. అక్కడ ఒక ఫ్లాట్‌కొని సామాను పెడుతున్నాము. అక్కడికి నాజీలు వచ్చేశారు. ఇప్పుడు అమెరికాలో సాంతా మోనికాలో ఇల్లు కొన్నాను. ఇక్కడ ఏమవుతుందో మరి" అని భుజాలు ఎగరవేశాడు!

అప్పుడప్పుడు ఆల్డోస్ హక్స్‌లేను కలిసేవాళ్లం. ఆయన అప్పుడు ఎక్కువగా మార్మిక వాదంలో మునిగిపోయాడు. ఆయన వయసులో వున్నపుడు నిరాశావాదిగానే నాకిష్టంగా వుండేది.

ఒకరోజు మా స్నేహితుడు ఫ్రాంక్ టేలర్ ఫోన్ చేశాడు గొప్పకవి డేలాన్ థామస్‌ను (ఈయన వెల్స్ కవి) తీసుకు వస్తున్నట్లు. 'మాకు చాలా ఆనందకరమైన విషయం చెప్పారు' అన్నాను. "అయితే – ఆయన మామూలుగా వుంటేనే....." అని నసిగాడు.

ఆ తర్వాత కొంతసేపటికి మా ఇంటి తలుపు గంటమోగింది. నేనే స్వయంగా వెళ్లి తలుపు తీశాను. అంతే డైలాన్ థామస్ లోపలకు 'పడ్డారు'! ఇదా మామూలుగా వుండడం అంటే?! ఇప్పుడే ఇలా వుంటే బాగా తాగినపుడు ఎలా వుంటారో అనుకున్నాను.

తర్వాత రెండురోజులకు రాత్రి విందుకు వచ్చారు. అప్పుడు సరిగానే మాట్లాడారు. ఆయన కవిత ఒకటి ఎంతో గంభీరమైన గొంతుతో వినిపించారు. అప్పటి దానిలోని పద చిత్రాన్ని గుర్తుంచుకోలేకపోయాను. కాని ఆయన వుపయోగించిన ఒక పదం 'Cellophone' నా కళ్లముందు మెరుపులు మెరిపించింది. అంతటి మాజిక్ వుండేది ఆయన కవితలో....

ఇంకా థియోడోర్ డ్రీజర్ – ఈయనంటే నాకెంతో ఇష్టం. ఈయన అందమైన భార్య హెరిన్ మా యింట్లో విందుకు వస్తుండేది. థియోడోర్ చాలా కోపిష్టి – లోపల కుతకుత వుడికి పోతుండేవాడు. కాని ఆయన మనసు చాలా సున్నితం – దయార్ద్ర హృదయుడు.

ఆయన చనిపోయినపుడు జాన్ హావర్డ్ లాసన్ నాటక రచయిత చివరి (అంతిమయాత్రలో) వాక్యాలు చదివాడు – నన్నుకూడా శవపేటిక మోయమన్నాడు. నేను వెంటనే అంగీకరించాను.

అప్పటికి కొంత సద్దుమణిగింది. ఈ కోర్టు వ్యవహారం, పత్రికల గోల – నా మీద వ్యతిరేకత – రాజకీయంగా కక్ష సాధింపు... ఇవన్నీ నన్ను కొన్నాళ్లు ఏ పనీ చేయనీయలేదు. కాని నా నమ్మకం ఏదైనా మంచి హాస్యచిత్రం తీస్తే ఈ చెడు అంతా కొట్టుకుపోవచ్చని! అలా అనుకునే మోన్సియర్ వెర్డాస్ పూర్తిచేశాను. ఇది దాదాపు రెండు సంవత్సరాలు పట్టింది రాయటానికి – కాని 12 వారాల్లో సినిమా పూర్తిచేశాను. ఇది ఒక రికార్డే – అప్పుడు సెన్సార్ ఆఫీసుకు (మిస్టర్. బ్రీన్ ఆఫీస్)కు స్క్రిప్ట్ పంపాను. నాకు దాదాపు వెంటనే వాళ్ల దగ్గర్నుంచి దాన్ని నిషేధిస్తున్నట్లు ఉత్తరం వచ్చింది!

మోషన్ పిక్చర్ అసోసియేషన్‌వారు ఈ స్వయం నియంత్రణ కార్యాలయాన్ని లెజియన్ ఆఫ్ డీసెన్సీ అంటారు – దాని శాఖ ఈ బ్రీన్ ఆఫీసు. ఇక్కడ సెన్సార్ చాలా అవసరం కాని దాన్ని ఆచరణలో పెట్టడం చాలా కష్టం. నేను ఈ విషయంలో చాలాసార్లు నా అభిప్రాయం చెప్పాను – ఈ నియంత్రణలో కొంత కొన్ని మినహాయింపులు తప్పనిసరి అని. మొండిగా వుండకూడదు. దానివల్ల ప్రేక్షకులకు స్వతంత్ర ఆలోచనలు చేరవు. ఎంత అభ్యంతకరమైన కథనైనా తేనెపూసి చూపిస్తే విడిచి పెడుతున్నారు – ఎంత అభ్యుదయకరమైన కథనైనా సూటిగా చెప్పితే ఆపివేస్తున్నారు.

ఇందులో హింసను – పచ్చిగా చూపిస్తున్నారు. కాస్త సరసం చూపిస్తే అదిగో అంటున్నారు. 'ప్రతి నాయకుణ్ణి గూబ పగల గొడితే మన సమస్యలు తీరిపోతాయా' అని బెర్నాడ్‌షా అన్నారు.

ఈ సెన్సార్ గొడవ చర్చించే ముందు మిస్టర్ వెర్డో కథ వినటం మంచిది. వెర్డో అనేవాడు మధ్యతరగతి జీవి. చిన్న బాంకు ఉద్యోగి – యుద్ధం తర్వాత వచ్చిన ఆర్థిక మాంద్యం దెబ్బలో ఉద్యోగం ఊడిపోతుంది. అతను డబ్బు సంపాదించటానికి ఒక ప్రణాళిక రచిస్తాడు. వయసు ముదిరిన పెళ్లికాని ఆడవాళ్లను వలలో వేసుకుని వాళ్లను పెళ్లి మిషతో అంతం చేస్తాడు. వాళ్ల దగ్గర వున్న డబ్బు దస్కం తీసుకుంటాడు! అతని భార్య అవిటిది. పల్లెటూరిలో నివసిస్తుంటుంది కొడుకుతో. కాని ఆమెకు భర్త చేసే దారుణాలు తెలియదు. ఒక హత్య తర్వాత అతను మామూలుగా ఉద్యోగం చేసే భర్తగానే ఇంటికి వెళ్తాడు. అతను వ్యతిరేక స్వభావాల సంగమం. మంచీ చెడూ కలబోసిన మనిషి. ఇంటి దగ్గర చక్కగా గులాబీ మొక్కలకు నీళ్లుపోస్తాడు. పురుగులను కూడా తొక్కుకుండా జాగ్రత్తపడతాడు. ఆ తోట చివరలోనే అతను హత్యచేసిన స్త్రీ భూమిలో కుళ్లిపోతుంటుంది! ఈ కథలో కారంతో కూడిన హాస్యం చేదు నిజాలు, సాంఘిక జీవన విధానంపై విమర్శ వుంది.

సెన్సారు వాళ్లు నాకు చాలా పెద్ద ఉత్తరం రాశారు, ఈ సినిమాను ఎందుకు నిషేధిస్తున్నారో వివరిస్తూ!

....ఈ క్రింద చెప్పిన విషయాలు మాకు అభ్యంతరకరమైన విధానం... అవి సంఘ వ్యతిరేకంగా వున్నాయి. ఇందులో వెర్డో పాత్ర ఇప్పటి సాంఘిక విధానాన్ని

పూర్తిగా నిరసిస్తుంది. ఈ వ్యవస్థనే మొత్తంగా అపహాస్యం చేస్తుంది. మీకు ఇంకా వివరంగా తెలియజేయటానికి – అది సెన్సార్‌కోడ్ ఎలా ఉల్లంఘించింది ఈ క్రింద ఇస్తున్నాము.

వెర్డో ఏమంటున్నాడు? నేను చేసే హత్యలను ఎలా విమర్శిస్తారు? అవి కేవలం నవ్వులాటకు చేసేవి. యుద్ధం పేరుతో వేలమందిని చంపుతున్నారు. వాటితో పోలిస్తే నేను చేసేవి అసలు లెక్కలోకి రావు. అన్నివేలమందిని చంపుతూ చివరకు ఒక బంగారు బిళ్ళతో సరిపెడుతున్నారు కదా. ఈ వ్యవస్థలో ఇది జరుగుతోంది. మనం ఇక్కడ యుద్ధంలో జరిగే మారణకాండ గురించి వాటి నైతికత గురించి చర్చించటంలేదు. అవి ఎలాంటివైనా వెర్డో చేసిన హత్యలు చట్టపరంగా హత్యలే!

రెండో విషయం... ఇందులో ఒక మగవాడు – ఎక్కువమంది ఆడవాళ్లను వలలో వేసుకుంటున్నాడు – అంటే మగవానికి ఆ సత్తావుందని, ఆ విధంగా అతని శృంగారం అనైతికమని చెప్పవచ్చు. ఇది మంచిదికాదు.

ఇలాగే చాలా వివరాలు ఇస్తూ వుత్తరం రాశారు. మీకు తెలియటానికి – నా స్క్రిప్టులోని రెండు పేజీలు ఇక్కడ ఇస్తాను. ఇక్కడ కథాసందర్భం – విడియా ఈమె వెర్డో అక్రమ భార్య. ఈమె వయసులో పెద్దది. ఆ రాత్రి ఆమెను హత్య చేయబోతున్నాడు.

విడియా ఆ మసక చీకటిగా వున్న హాలులోకి వచ్చి వెలుగుతున్న చిన్న దీపాన్ని ఆర్పి ఆమె పడక గదిలోకి వెళ్లిపోయింది. ఇప్పుడు వెర్డో మెల్లగా వస్తుంటాడు. అప్పుడు ఆ హాలులో కిటికీలోనుంచి వచ్చే వెన్నెల వెలుగు పడుతుంటుంది.

కిటికీ దగ్గరకు వెళ్ళి చంద్రుణ్ణి చూస్తాడు – వెన్నెలను చూస్తాడు. 'ఎంత అందంగా వుంది! ఈ పాలిపోతున్న వెన్నెల రాత్రి! ఎంత అసభ్యంగా వుంది!'

ఇతని గొంతు విని విడియా – పడక గదిలోనుంచి "ఏమిటి అంటున్నావు?"

వెర్డో! ఏదో మత్తులో వున్నట్లు Endymion, ప్రియా. ఈ వెన్నెల ఎంతగా వయసులో మెరిసిపోతోంది!

విడియా: సరే – అది వదిలి పక్కలోకి రా.

వెర్డో: అవును, డియర్ – మనపాదాలు పూలలా మెత్తగా వున్నాయి.

అతను విడియా పడక గదిలోకి వెళ్తాడు. హాలంతో ఖాళీగా వుంటుంది. వెన్నెల వెలుగు పడుతుంటుంది.

వెర్డో: చూడు చంద్రుడు ఎంతగా మెరిసిపోతున్నాడో – అసభ్యకరంగా!

విడియా: అసభ్యకరమైన చంద్రుడు! ఎంత పోకిరివి.

హా హా అసభ్యం! అసభ్యకరమైన చంద్రుడు! సిగ్గులేని జాబిల్లి హా హా!

అంతటితో నేపథ్య సంగీతం పెరిగి పెరిగి ఆ దృశ్యం అదృశ్యం అయి వుదయం వెల్తురు వస్తుంది. అదే హాలు ఇప్పుడు ఎండ వెల్తురుతో నిండిపోతుంది. వెర్డో విడియా పడకగదిలో నుంచి ఈల వేసుకుంటూ హాలులోకి వస్తాడు.

ఈ పై దృశ్యానికి సెన్సారువారు అభ్యంతరం: దయచేసి ఈ సంభాషణ మరో రకంగా రాయండి.

"సరే అది వదిలి – పక్కలో రా" ఇది ఇలా వుంటే బాగుంటుంది. 'వచ్చి నిద్రపో' అని. వాళ్లు శృంగారంలో పాల్గొనబోతున్నట్లు. ధ్వని రాకుండా వుండాలి.

'సిగ్గులేని జాబిల్లి' 'అసభ్యకరమై చంద్రుడు' ఇవి కూడా మార్చండి. అతను విడియా పడక గదిలోనుంచి ఈల వేస్తూ రావటం కూడా.

వారి మరొక అభ్యంతరం:

వెర్డో రాత్రి కలిసిన ఒక యువతి మాటలు. ఆమెను ఒక వ్యభిచారిణిగా చూపించారు. అది మార్చాలి.

సహజంగానే నా కథలో ఆ యువతి ఒక పడుపుగత్తె. ఆమె వెర్డో గదికి కేవలం బొమ్మలు చూడటానికి రాదుకదా! ఈ సందర్భంలో, వెర్డో ఆమెను తను ప్రయోగించబోతున్న విషాన్ని పరీక్షించటానికి తీసుకు వస్తాడు. అతను తన దగ్గరున్న విషాన్ని ఆమెకు వైన్‌లో కలిపి ఇవ్వాలి – తర్వాత గంటకు ఆమె చనిపోవాలి – ఇదీ ప్లాను.

ఇద్దరూ అతని పారిస్ అపార్టుమెంటులోకి వస్తారు. అప్పుడు చూస్తాడు. ఆమె రైనుకోటులో చిన్న పిల్లి పిల్లను దాచిందని.

వెర్డో : నీకు పిల్లి అంటే ఇష్టమా?

అమ్మాయి : అదేమీ లేదు. ఇది పాపం చలితో చచ్చిపోయేట్లు వుంది. నీ దగ్గర పాలున్నాయా? లేవేమో.

వెర్డో : ఆ లేకేమి – వున్నాయి. చూశావా పరిస్థితి మరీ విషమంగా లేదు!

అమ్మాయి : నా గొంతులో నిరాశ ధ్వనించింది?

వెర్డో : అవును. కాని నీవు అలాంటి దానివి కాదుగా.

అమ్మాయి : ఎందుకలా అనుకుంటున్నావు?

వెర్డో : ఇలాంటి రాత్రిలో ఒంటరిగా బైటకు వచ్చావంటే నీకు చాలా ధైర్యం వుండాలి.

అమ్మాయి : అలాంటి దేమీలేదు.

వెర్డో : నీ ధైర్యం కనపడుతూనే వుంది.

అమ్మాయి : నీ పరిశీలన బాగానే వుంది.

వెర్డో : ఎప్పటినుంచి ఈ పని?

అమ్మాయి : అదే మూడు నెలలు.

వెర్డో : నీలాంటి ఆకర్షణీయమైన అమ్మాయి ఇంకా బాగా వుండాలి.

అమ్మాయి : సరే సంతోషం.

వెర్డో : ఇప్పుడు నిజం చెప్పు. నీవు ఆసుపత్రినుంచి లేక జైలునుంచి బైటకు వచ్చి వుండాలి?

అమ్మాయి : తెలుసుకుని ఏమి చేస్తావు?

వెర్డో : నీకు సహాయం చేద్దామని.

అమ్మాయి : అహా – నువ్వు పరోపకారివా?

వెర్డో : అవును – నేనేమీ అడగను – ప్రతిఫలం.

అమ్మాయి : అలాగా శరణార్థ శిబిరం నడుపుతున్నావా?

వెర్డో : నువ్వు అలా అనుకుంటూ నీ దారిని నువ్వు వెళ్లిపోవచ్చు.

అమ్మాయి : నేను జైలు నుంచే వచ్చాను.

వెర్డో : అరె ఎందుకు?

అమ్మాయి : కారణం ఏదయినా – చిన్న టైపు రైటర్‌ను అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టాను!

వెర్డో : అరె అంతకంటే మంచిపని చేయలేవా? అయినా ఎంతకాలం?

అమ్మాం : మూడునెలలు!

వెర్డో : ఆకలిగా వుందా?

ఆమె : నవ్వి అవునని తల వూపుతుంది.

వెర్డో : నేను మనకు తినేందుకు ఏర్పాట్లు చెప్తాను. నీవు వంటింట్లో పిల్లి కూనకు ఏమైనా తీసుకు రా.

అలా కిచెన్‌లోకి వెళ్తారు. అతను గుడ్లు – రొట్టె తయారుగా వుంచి – అవన్నీ బల్లమీద పెట్టమని ట్రే యిస్తాడు. ఆమె అవన్నీ తీసుకుని కూర్చొనే చోటుకు వస్తుంది.

ఆమెను చూస్తూ అతను ఒక అల్మారాతీసి తాను తయారుచేసిన విషం తీసి, వైను సీసాలో కలిపి మూతపెడతాడు. ఆ సీసా, రెండు గ్లాసులు ట్రేలోపెట్టి ఆమె కూర్చునే చోటుకు వస్తాడు.

వెర్డో : ఇది నీకు సరిపోతుందో లేదో – గుడ్లు – వేడిచేసిన రొట్టె – వైను.

అమ్మాయి : అహా అద్భుతం – అప్పటి వరకూ చదువుతున్న పుస్తకం మూసి ఆమె వస్తూంది.

వెర్డో : నువ్వు బాగా అలసిపోయావు – నిన్ను హోటల్ దగ్గర దింపుతాను ఈ భోజనం తర్వాత (అంటూ వైను సీసా మూత తీస్తాడు).

అమ్మాయి : నీవు చాలా దయగలవాడివి – ఇదంతా నాకు ఎందుకు చేస్తున్నట్లు?

వెర్డో : ఎందుకు చెయ్యకూడదు (వైను గ్లాసులో పోస్తాడు) కాస్త దయకూడా కనపడటం లేదా జీవితంలో.

అమ్మాయి : అవును అలాగే అనుకోవటం మొదలుపెట్టాను.

వెర్డో : తానుకూడా అదే వైను గ్లాసులో పోసుకునే ముందు

అరె – రొట్టి మాడిపోతోంది అని – బాటిల్‌తో సహా వెళ్తాడు (వంటింట్లో) లోపల వైను సీసా మార్చి రొట్టె ముక్కలు తీసుకుని వస్తాడు. రొట్టెముక్కలు అక్కడ పెట్టి – వైన్ తన గ్లాసులో పోసుకుంటాడు.

అమ్మాయి : నువ్వు చాలా ఫన్నీగా వున్నావే.

వెర్డో : ఎందుకలా?

అమ్మాయి : నాకు తెలియదు.

వెర్డో : సరే నీకాకలిగా వుంది – తీసుకో.

అప్పుడు ఆమె గుడ్లు – రొట్టె తీసుకుంటుంది. అప్పుడు అక్కడి పుస్తకం చూస్తాడు.

వెర్డో : ఏమిటి చదువుతున్నావు?

అమ్మాయి : షోపెన్‌హార్.

వెర్డో : నీకు అతను ఇష్టమా?

అమ్మాయి : సో – సో

వెర్డో : అతను 'ఆత్మహత్య' గురించి రాసింది చదివావా?

అమ్మాయి : అది నాకిష్టం వుండదు.

వెర్డో : మరణం హాయిగా వుంటే? నీవు నిద్రపోయావనుకో – మెలకువ రాకముందే మరణంలోకి జారుకుంటే? ఈ పనికి రాని బ్రతుకు అంతం అయిపోతుంది కదా?

అమ్మాయి : ఏమో?

వెర్డో : మనం భయపడేది చావుకాదు – చావు రాక గురించి!

అమ్మాయి : అలాగా – పుట్టబోయే వాడికి – బ్రతుకు గురించి తెలిసినా అంతగా భయపడతారేమో?

వెర్డో : నవ్వుతూ – వైన్ తీసుకుంటాడు.

ఆమె కూడా గ్లాసు తీసుకుని – తాగబోతూ,

ఆమె : జీవితం అద్భుతమైనదే

వెర్డో : ఏమిటి దానిలో అద్భుతం?

ఆమె : అన్నీ, ఉదయం, వసంతం, వేసవి రాత్రి, సంగీతం, చిత్రాలు – ప్రేమ – అన్నీ అద్భుతం!

వెర్డో : (అసహ్యంగా) ప్రేమా?

అమ్మాయి : అవును అలాంటిది వుంది.

వెర్డో : నీకెలా తెలుసు?

అమ్మాయి : నేను ప్రేమించాను!

వెర్డో : ఏమిటి? నీకు ప్రేమ కలిగిందా – నిన్ను ప్రేమించారా?

అమ్మాయి : నీకు ఆడవాళ్లంటే పడదుకదా?

వెర్డో : కాదు నేను ఆడవాళ్లను ప్రేమిస్తాను కాని వాళ్లను నెత్తిన పెట్టుకోను.

అమ్మాయి : ఎందుకని?

వెర్డో : అమ్మాయి మగవాడిని మోసం చేసిందంటే ఇక అతన్ని నాశనం చేస్తుంది. అతను ఎంత మంచి వాడయినా స్థితిమంతుడైనా మరో సన్నాసికోసం వీడిని వదిలి వేస్తుంది. వాడు ఆమెకు నచ్చితే చాలు.

అమ్మాయి : నీకు ఆడవాళ్ల గురించి ఏమీ తెలియదు?

వెర్డో : నీకు ఆశ్చర్యంగా వుందా?

అమ్మాయి : అది ప్రేమకాదు.

వెర్డో : మరి ప్రేమంటే?

అమ్మాయి : ఇవ్వటం త్యాగం, అమ్మ తన బిడ్డ గురించి అనుకునేది ప్రేమ.

వెర్డో : నీవు అలాగే ప్రేమించావా?

అమ్మాయి : అవును.

వెర్డో : ఎవరిని?

అమ్మాయి : నా భర్తని.

వెర్డో : నీకు పెళ్లయిందా? (ఆశ్చర్యంగా)

అమ్మాయి : అవును – అతను – నేను జైలులో వుండగా చనిపోయాడు.

వెర్డో : ఇంకా అతని గురించి చెప్పు.

అమ్మాయి : అతను, అదీ చాలా పిచ్చి కథ ఆగి, అతను స్పెయిన్ అంతర్యుద్ధంలో గాయపడ్డాడు. కోలుకోలేని గాయాలు.

వెర్డో : ఏమిటి అవిటివాడా?

అమ్మాయి : అందుకే అతన్ని ప్రేమించాను. నా అవసరం అతనికి వుంది. నేనే ఆధారం. అతను చిన్న పిల్లవాడు. కాని అంతకంటే ఎక్కువ. నాకు అతనే మతం – నా వూపిరి. అతనికోసం హత్యకూడా చేయగలను.

అలా ఏడుస్తూ కన్నీళ్లు కారుస్తుంది. అప్పుడు గ్లాసుతో వైను తాగబోతుంది.

వెర్డో : ఒక్క క్షణం – దానిలో బిరడా వుందనుకుంటా – గ్లాసు మారుస్తాను ఇటివ్వు.

ఆ గ్లాసు తీసుకొని ఆ ప్రక్కనపెట్టి మరో గ్లాసు తీసుకుని దానిలో మంచి వైను పోస్తాడు. మౌనంగా ఇద్దరూ వైను తీసుకుంటారు. అప్పటికి వెర్డో కుర్చీలోనుంచి లేచి – ఇదిగో నీవు బాగా అలసిపోయావు. బాగా ఆలస్యం కూడా అయ్యింది. ఈ డబ్బు వుంచు – ఒకటి రెండు రోజులు ఇబ్బంది వుండదు.

అమ్మాయి : ఇది చాలా ఎక్కువ. నేనేమీ అనుకోలేదు (అంటూ చేతుల్లో ముఖం పెట్టుకుని ఏడుస్తుంది). నాకు అన్నింటిలో నమ్మకం పోతోంది. ఇలా జరగటం – ఇప్పుడు మళ్లి నమ్మకంగలుగుతోంది.

వెర్డో : ఎక్కువగా ఏదీ నమ్మకు. ఇది చాలా క్రూరమైన ప్రపంచం.

అమ్మాయి : అది నిజం కాదు. కాని ఇది తప్పుల ప్రపంచం. చాలా విచారకరమైనది. కాని కాస్త దయ, దాన్ని ఎంతో అందంగా చేయగలదు. (అలాగా తలుపు దగ్గరకు వెళ్ళి వెనక్కి తిరిగి అతన్ని చూసి నవ్వుతుంది. 'గుడ్‌నైట్' అని వెళ్లిపోయింది.

దీనికి సెన్సార్‌వాళ్ల అభ్యంతరాలు!

'ఇలాంటి రాత్రి బయటకు రావటం' 'నీవు ఆశావాదివే' 'ఈ ఆటలో ఎప్పటినుంచి వున్నావు' 'నీలాంటి అందగత్తె ఇంకా బాగా బతకవచ్చు' ఇవన్ని మార్చాలి. మీరు 'సాల్వేషన్ ఆర్మీ' అనటం అనేవాళ్లను బాధించటమే, నా స్క్రిప్టు చివరలో – వెర్డో చాలా సాహసాలు దారుణాలు తరువాత ఆ అమ్మాయిని మళ్లీ కలుస్తాడు. అప్పుడు ఆమె చాలా సంపన్నురాలుగా కనపడుతోంది. దానికీ సెన్సార్ వాళ్లు ఆమె సంపదకు అభ్యంతరం చెప్పారు!

ఒక రెస్టారెంటు బైట వెర్డో వార్తాపత్రిక చూస్తుంటాడు. యూరోప్‌తో యుద్ధం తప్పనిసరి పరిస్థితులు చదువుతాడు. తరువాత అక్కడి వీధి దాటుతుండగా – ఒక కొత్త కారు వచ్చి అతనికి తగులుతుంది. అది తప్పించటానికి కారు కాలిబాటను ఎక్కుతుంది. కారు డ్రైవరు కోపంగా హారను మోగిస్తుంటాడు. అంతలో కారు అద్దం దింపి ఒక గ్లోవ్ చేయి అతనిని పిలుస్తుంది. ఆశ్చర్యం!! అందులో ఆ అమ్మాయి వుంటుంది. అతన్ని చూసి నవ్వుతుంది. మంచి దుస్తుల్లో వుంటుంది.

అమ్మాయి : ఎలా వున్నారు లోకోపకారి?

వెర్డో : చాలా చిక్కుగా చూస్తాడు

అమ్మాయి : నన్ను గుర్తుపట్టలేదు. ఒక వానరాత్రి మీ గదికి తీసుకువెళ్లావు.

వెర్డో : నిజంగా?

అమ్మాయి : నా ఆకలి తీర్చి నాకు డబ్బుకూడా ఇచ్చావు? నన్ను మంచిగా పంపించావు?

వెర్డో : నేను వట్టి దద్దమ్మనయి వుంటాను!

అమ్మాయి : కాదు – నీవు చాలా మంచివాడవి చాలా దయ చూపావు! ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నావు?

వెర్డో : ఎక్కడికీ లేదు.

అమ్మాయి : అయితే కారెక్కు.

వెర్డో : కారులో కూర్చుంటాడు.

అమ్మాయి : డ్రైవరుతో లాఫార్గె కేఫ్‌కి పోనీ. మీరు ఇంకా నన్ను గుర్తించినట్లు లేదు. అయినా అవసరం ఏముంది?

వెర్డో : (ఆమెను మెచ్చుకుంటూ) నిన్ను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి!

అమ్మాయి : గుర్తురాలేదా? అప్పుడు నేను జైలునుంచి వచ్చాను..

వెర్డో : ష్... అని డ్రైవరు వంక చూస్తాడు – మధ్యలో గ్లాసు వుంటుంది! ఇప్పుడు ఫర్వాలేదు. అవును నువ్వు... ఇదంతా ఏమిటి? ఏమి జరిగింది?

అమ్మాయి : పాతకథే – పేదరికం నుంచి పెన్నిధిలోకి నువ్వు కలిసిన తర్వాత నా అదృష్టం మారింది. నేను చాలా ధనవంతుణ్ణి కలిశాను. ఆయుధాల వ్యాపారం చేస్తాడు.

వెర్డో : ఆ వ్యాపారంలో నేనుండాల్సింది. ఎలాంటివాడు?

అమ్మాయి : చాలా దయగలవాడు – వ్యాపారంలో చాలా గట్టివాడు.

వెర్డో : వ్యాపారం అంటేనే – దయ దాక్షిణ్యం వుండకూడనిది. నువ్వు అతన్ని ప్రేమించావా?

అమ్మాయి : లేదు – కాని అతను నా మీదే మరులుగొన్నాడు.

ఇక్కడ సెన్సార్‌వాళ్లు అడ్డుపడ్డారు.

'నన్ను మంచి పిల్లలాగా పంపించావు' ఇది మార్చాలి. 'నేను దద్దమ్మనయి వుంటాను' ఇదీ మారాలి. అమ్మాయి కలిసిన ఆయుధాల తయారీదారుని – ఆమెకు ప్రియునిగా చూపండి. లేకపోతే అమ్మాయి కేవలం ఉంపుడుకత్తె అయిపోతుంది!

ఎక్కడా వయసుమీరిన స్త్రీలను శారీరకంగా వర్ణించకండి. బట్టలు – ఇవి జాగ్రత్తగా చేయించండి. ఆడవాళ్లను హేళన చేస్తున్నట్లు వుండకూడదు.

ఎక్కడా బాత్‌రూంలో టాయిలెట్ సీటు చూపకండి. ఆమె 'ముడ్డి గిల్లాను' ఇలాంటి పదాలు వద్దు. వెర్డో మాటల్లో ఆమె చాలా 'భారీగా' వుందనేది వద్దు.

ఈ విధంగా ఉత్తరం రాసి మీరు వచ్చి ఇంకా వివరాలు మాతో ముఖాముఖి ప్రొడక్షన్ కోడ్ పరిధిలో చర్చించవచ్చు అని పూర్తిచేశారు.

అందుకని బ్రీన్ ఆఫీసు వెళ్లాను. నన్ను ఆయన ముందుకు తీసుకు వెళ్లారు. తర్వాత ఆయన సహాయకుడు వచ్చాడు. నాతో "మీకు కాథలిక్ చర్చి మీద కోపమెందుకు?" అన్నాడు. 'అలా ఎందుకు అడుగుతున్నారు?' అన్నాను.

అప్పుడు నా స్క్రిప్టులోని కాగితాలు కొన్ని అక్కడ బల్లమీద పడవేశాడు!

"చూడండి – మీ హీరో జైలుగదిలో వున్నపుడు – వెర్డో మతపెద్దతో ఏమంటున్నాడు – "ఏం పనిమీద వచ్చారు అయ్యా" ఇలా అనవచ్చా? అన్నాడు.

'ఏమి – అతను మంచి వాడు కాదా' అన్నాను.

'మీరు ఎగతాళిగా ధ్వనిస్తున్నారు.' మేము మతపెద్దను 'అయ్యా' అనం – 'ఫాదర్' అంటాం. సరే అలాగే 'ఫాదర్' అందాం అన్నాను. ఈ వాక్యం చూడండి – "నీకు దేవునితో శాంతిగా వుండడానికి నేను సహాయం చేస్తాను" అని ఫాదర్ అంటారు కదా. అప్పుడు వెర్డో 'నేనిప్పుడు దేవునితో బాగానే వున్నాను' అంటాడు. అదేకాదు 'నా ఘర్షణ మనిషితోనే' అన్నాడు కదా. ఇది ఎగతాళి చేయటమే కదా.

'మీకు ఎలా భావ స్వాతంత్ర్యం వుందో – అలాగే నాకు వుంటుంది కదా మరి' అన్నాను.

ఇది చూడండి – మత పెద్ద 'నీకు పాపం చేసినట్లు విచారం లేదా?' అని అడిగాడు.

వెర్డో: పాపమంటే ఏమిటి, ఎవరికి తెలుసు?

"అదీ స్వర్గం నుంచి దిగి వచ్చిన దేవతేకదా – ఎవరికి తెలుసు – దాని పర్యవసానం ఏమిటో ఆ దేవత ఏమి చేస్తుందో?" అని అడగటం ఎంత దారుణం! అన్నాడు.

పాపమనేది చాలా మార్మికమైనది – పుణ్యంలాగానే – అదే నేను అనుకునేది అన్నాను.

'ఇది చాలా మెట్ట వేదాంతం – ఇంకా వెర్డో ఇలా అంటాడు "మీరు రోజంతా పాపం చేయకుండా ఏమి చేస్తుంటారు?" అని – ఇది చాలా అభ్యంతరకరం.

'నేను అంగీకరిస్తాను, కాని నేను తీసింది కేవలం ఘాటైన హాస్యం కోసమే. మత పెద్దను అవమానపరచటం, అగౌరవపరచటం నా వుద్దేశ్యం కాదు' అన్నాను. కాని మీరు వెర్డోని ఫాదర్‌కంటే పై ఎత్తున చూపించారు. అంటే, ఫాదర్‌ని హాస్యంగానూ చూపాలా?

'కానే కాదు – కాని ఫాదర్ ఒక మంచి సమాధానం ఇవ్వలేడా?'

'చూడండి – ఈ హంతకుడు – చావబోతున్నాడు – అందుకని అతని మేకపోతు గాంభీర్యం ప్రదర్శన – మత పెద్ద తన పెద్దరికాన్ని నిలబెట్టుకుంటున్నాడు. ఆయన మాట్లాడింది చాలా హుందాగానే వుంది. ఏమయినా మీరు చెప్పినట్లు మళ్లీ ఆలోచిస్తాను.'

'ఇది చూడండి – 'ఆ దేవుడు నీకు, నీ ఆత్మకు శాంతినివ్వాలి.' అన్నప్పుడు 'తప్పకుండా – ఇది అతని సొత్తే కదా' అన్నాడు వెర్డో! ఇందులో తప్పేముంది? 'తప్పకుండా' ఇలా మత పెద్దతో మాట్లాడవచ్చా? అన్నాడు. అది అతనిలో అతను అనుకున్నట్లు – మీరు సినిమా చూసేవరకు ఆగండి – అన్నాను.

"అంతేనా – ఈ దేశం, ఈ సంఘం స్వచ్ఛమైనవి కావు – మనం కొద్దిగా విమర్శిస్తే పోయేది ఏముంది" అని ఆ చర్చ ముగించాను.

బ్రీన్ చాలా నిజాయితీగా వ్యవహరించారు. "మీరు ఆ అమ్మాయిని మరో వ్యభిచారిని చేయకండి – హాలీవుడ్ స్క్రిప్టులన్నింటిలో వ్యభిచారులున్నారు."

నేను తప్పనిసరిగా ఈ విషయం ఆలోచిస్తాను అని చెప్పాను. చివరికి సినిమా పూర్తిచేసి – ఈ సెన్సార్ సభ్యులు దాదాపు 30 మందికి చూపించాను. అన్నిరకాల గ్రూపుల వాళ్ళూ వచ్చారు – నేను చాలా ఒంటరిగా అయిపోయినట్లయింది.

సినిమా పూర్తిగా చూసి Mr. బ్రౌన్ 'ఒకే పాస్ చేయండి' అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు. మళ్లీ 'ఇందులో అభ్యంతరం ఏముంది. పోనివ్వండి' అని 'ఏమిటి మాట్లాడరు? 'ఓకే – కానివ్వండి' సరేనా?" అని ముగించాడు.

'చార్లీ, వెళ్ళి సినిమా విడుదల చెయ్యి' అన్నాడు. అప్పుడు నాకు కొంత గందరగోళం కలిగింది. వీళ్లు సినిమాను పాస్ చేయటం! ఎందుకంటే ముందు ఈ స్క్రిప్టు పూర్తిగా నిషేధించారు కదా – ఇప్పుడు సినిమా పాస్ చేయటం ఆశ్చర్యమే అనుకున్నాను. ఒకవేళ నా మీద మరో కుట్ర జరగటం లేదుకదా?

'వెర్డో'ని మళ్లీ ఎడిట్ చేస్తుండగా అమెరికా దేశపు మార్షల్ ఫోన్ చేశాడు. నాకు వాషింగ్టన్‌లో వున్న 'అమెరికా వ్యతిరేక కార్యకలాపాల కమిటీ' ముందు హాజరవ్వాలని సమ్మన్లు వున్నాయని! ఈ సమ్మన్లు మొత్తం పంతొమ్మిది మందికి పంపారు.

అప్పుడు ఫ్లోరిడా సెనేటర్ ఫెప్పర్ లాస్‌ఏంజెలెస్‌లో వున్నాడు. సలహాకోసం ఆయనను కలిస్తే మంచిదని అన్నారు. నేను వెళ్లలేదు. నా స్థితీ – పరిస్థితీ వేరు. ఎందుకని? నేను అమెరికా పౌరుణ్ణి కాదు – ఆ సమావేశంలో అందరూ తమ రాజ్యాంగ హక్కుల మీద ఆధారపడాలని నిర్ణయించారు! (ఇలా చేసినవాళ్లు తరువాత కోర్టు ధిక్కారం క్రింద ఒక సంవత్సరం కారాగారానికి వెళ్లారు!)

ఆ సమ్మన్లు – నాకు పదిరోజుల్లో తెలియపరుస్తాము. వాషింగ్టన్ ఎప్పుడు రావాలో అని. తర్వాత మరో పదిరోజులు వాయిదా వేసినట్లు తంతి పంపారు.

మూడోసారి వాయిదా తర్వాత నేను వాళ్లకు ఒక తంతి పంపాను. నేను చాలా పెద్ద సంస్థను పనిలేకుండా ఆపాను. ఇది నాకు చాలా నష్టం గలిగిస్తోంది. ఈ కమిటీ ఈ మధ్యనే హాలీవుడ్ వచ్చింది. నా స్నేహితుడు హాన్స్ ఈజ్లర్‌ని ప్రశ్నించింది. అప్పుడే నన్నుకూడా పిలిచి వుండవలసింది. ఆ విధంగా ప్రజా ధనం ఆదా చేసి వుండవచ్చుకదా – ఏమయినా, నేను చెప్పదలచుకుంది నేను కమ్యూనిస్టునీ కాదు. నేను ఎప్పుడూ ఏ రాజకీయ పార్టీలో సభ్యుడిని కాదు. నేను శాంతి కాముకుడినే – ఈ విధంగా చెప్తున్నందుకు మిమ్మల్ని బాధించడం లేదనుకుంటాను. నన్ను వాషింగ్టన్ ఎప్పుడు రమ్మంటారో ఖచ్చితంగా తెలియజేయండి." అని ముగించాను!

తర్వాత నాకు వచ్చిన సమాధానం చాలా మర్యాదగా వుంది. నేను రావలసిన అవసరం లేదనీ, ఇక ఈ విషయం గురించి ఆలోచించవలసిన పనేలేదనీ! ఇదీ ఆశ్చర్యకరమైన మర్యాద పూర్వకమైన సమాధానం!

ఇరవై తొమ్మిదవ అధ్యాయం

యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీ

ఇన్నాళ్ళూ నా సమస్యలతో యునైటెడ్ ఆర్టిస్ట్స్ కంపెనీ వ్యాపారం ఎలా జరుగుతోందో అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు నా లాయరు నన్ను హెచ్చరించాడు. కంపెనీ లక్ష డాలర్ల అప్పులో వుందనీ! కంపెనీ బాగా నడిచినపుడు సంవత్సరానికి 400, 500 లక్షల డాలర్ల వసూళ్లు వుండేవి. కాని నాకు రెండుసార్లు లాభాలు ఇచ్చినట్లు గుర్తు! ఆ సమయంలోనే అమెరికాలోని 400 థియేటర్లలో 25 శాతం వాటా ఇచ్చారు. మేము ఒక్క డాలరూ ఇవ్వకుండానే. ఎందుకంటే అలా అయితే మేము వారికి సినిమాలు ఇస్తుంటామని! ఇదే సమయంలో అమెరికా సినిమా కంపెనీలు బ్రిటీష్ సినిమా థియేటర్లలో చాలా మొత్తం చెల్లించి వాటాలు తీసుకున్నాయి. ఒక సమయంలో రాంక్ (రాంక్ ఆర్గనైజేషన్)లో మా వాటా 100 లక్షల డాలర్ల విలువ వుండేది!

కాని తరువాత మా కంపెనీ షేర్లున్నవాళ్లు వాళ్ల వాటాలన్నీ మెల్లగా కంపెనీకే అమ్మేశారు. నాకు తెలియకుండానే కంపెనీకి సగం అధిపతిని అయ్యాను. మరొకరు మేరీ పిక్‌ఫోర్డ్. ఆమె రాసింది – ఏ బాంకూ మనకు అప్పు ఇవ్వడం లేదని. కాని నాకేమీ కంగారు లేదు. ఒక మంచి సినిమా ఇదంతా సరిచేస్తుంది. ఇదివరకు ఇలాంటిది జరిగింది.

ఇప్పుడు నా చేతిలో 'వెర్డో' సినిమా సిద్ధంగా వుంది. ఇది తప్పని సరిగా పెద్ద విజయం సాధిస్తుంది. మా కంపెనీ మేధావులంతా ఇది 120 లక్షల డాలర్లు వసూలు చేస్తుందని ఆశించారు. ముఖ్యంగా ఆర్థర్ కెల్లీ. అప్పులుపోయి ఇంకా 110 లక్షల డాలర్లుంటాయి!

హాలీవుడ్‌లో ఈ సినిమాను నా స్నేహితులకు చూపించాను. చివర్లో థామస్ మాన్ లేచి నిలబడి ఒక నిమిషం సేపు అభినందించాడు. అది నాకు చాలా నమ్మకాన్ని గలిగించింది. అదే నమ్మకంతో న్యూయార్క్‌లో దిగాను. అప్పటికే నా మీద దాడి డైలీ న్యూస్ ప్రారంభించింది. మా కంపెనీ ప్రచారకర్తలు – పత్రికల వాళ్లని కలవటం ఎందుకన్నారు! కాని అంతకుముందు రోజు – నేను అంతర్జాతీయ ప్రెస్‌ని కలిసి సినిమా మంచీ చెడూ చెప్పాను. పైగా నన్నెవరూ అనవసరంగా ఖండిస్తే చూస్తు వూరుకోనుకదా. ఆ మర్నాడు హోటల్‌లో పెద్ద హాలులో అమెరికన్ పత్రికల వాళ్లను కలిసే ఏర్పాటు చేశారు మా కంపెనీ ప్రచార కర్తలు. ముందుగా పానీయాలు ఇవ్వటం అయిన తర్వాత నేను వాళ్లముందు వీలయినంత హుందాగా వచ్చి చూశాను. వాతావరణం స్నేహపూర్వకంగా లేకపోవటం గ్రహించాను.

స్నేహితులారా మీ ముందుకు వచ్చింది ఈ సినిమా గురించీ నా రాబోయే ప్రణాళికల గురించీ చెప్పటానికి అని మొదలుపెట్టాను. వాళ్లు మౌనంగానే వున్నారు. 'అందరూ ఒక్కసారే మాట్లాడకండి దయచేసి' అన్నాను. 'మీరు కమ్యూనిష్టా' అని ఒక స్త్రీ విలేఖరి అడిగింది. 'కాదు' – నేను కమ్యూనిష్టుని కాదు' అని గట్టిగా చెప్పాను. మరొక విలేఖరి (బహుశా డైలీ న్యూస్ అయ్యుండాలి) 'మీకు కాథలిక్ మతం పడదా?'

క్షమించండి – నేను ఇక్కడ మతం గురించి మాట్లాడడానికి రాలేదు.

"మీరు అమెరికా పౌరసత్వం ఎందుకు తీసుకోలేదు?"

నా పౌరసత్వం మార్చుకోవలసిన అవసరం కనిపించలేదు. 'నేను ప్రపంచ పౌరుడిని' అన్నాను.

"కాని మీరు అమెరికాలో డబ్బు సంపాదిస్తున్నారు?"

"నాది అంతర్జాతీయ వ్యాపారం. నాకు నూటికి 70 వంతులు ఇతర దేశాల నుంచి వసూలు అవుతుంది. కాని నేను నూటికి నూరుపాళ్ళూ ఇక్కడే పన్నులు చెల్లిస్తున్నాను." "ఆ విధంగా మంచి అతిథినే కదా" అన్నాను నవ్వుతూ – కాని వాళ్లు నవ్వటం లేదు.

'ఇప్పుడు ఫ్రాన్స్‌లో యుద్ధం చేసిన వాళ్లు – అమెరికా పౌరులు తెలుసా?'

'నా యిద్దరు కొడుకులు, అక్కడే ముందు వరసలో యుద్ధంలో వున్నారు – కాని మీలాగా ఆ విషయాన్ని రాజకీయం చేయటం లేదు' అన్నాను.

'మీకు హాన్సు ఈజ్లర్ తెలుసా?'

'ఆ బాగా తెలుసు'

'ఆయన కమ్యూనిస్టు అన్న సంగతి తెలుసా?'

"ఆ విషయం నాకనవసరం – ఆయన గొప్ప సంగీత దర్శకుడు."

"నా స్నేహాన్ని రాజకీయానికి వాడుకోవటం లేదు"

"మీకు కమ్యూనిష్టులంటే ఇష్టంలా అనిపిస్తోంది?"

"నేను ఎవరిని ఇష్టపడాలో ఎవరిని అయిష్టపడాలో మరొకరు చెప్పాల్సిన అవసరంలేదు."

ఇంతలో "ఒక కళాకారునిగా ప్రపంచాన్ని సంతోష పరుస్తూ, సామాన్య జనాన్ని ఎంతో అర్థం చేసుకుంటూ – వున్న మిమ్మల్ని అమెరికా పత్రికల వాళ్లు ఇంతగా ద్వేషించటాన్ని ఎలా జీర్ణించుకుంటున్నారు?"

"ఏమంటున్నారు – నాకేమీ అర్థం కావటం లేదు" అన్నాను. మా ప్రచారకుడు – నన్ను కుదిపి "అతను మీకు అనుకూలంగా మాట్లాడుతున్నాడు' అన్నాడు చెవిలో.

'మరొక్కసారి మీరేమంటున్నారో చెప్పండి దయచేసి' అని అడిగాను ఆ విలేఖరిని.

అతను అదే విషయాన్ని మళ్లీ చెప్పాడు.

"నేను చెప్పటానికి ఏమీ లేదు – అయినా మీ సానుభూతికి చాలా థ్యాంక్స్" అని. ఈ సానుభూతి వచనాలు నాలో వున్న పోరాట కోపాన్ని చల్లార్చాయి. "ఇక ఈ సమావేశాన్ని ముగిద్దాం" అని వీరి ద్వేషానికి కారణం తెలియక తికమక పడ్డాను.

ఇంతకుముందు 'డిక్టేటర్'ను మెచ్చుకుంటూ నాకు ఎన్నో వుత్తరాలు – టెలిగ్రామ్‌లు వచ్చాయి. దాని వసూళ్లు రికార్డు స్థాయిలోనే వున్నాయి.

ఈ 'వెర్డో' సినిమా మీద నాకు అపారమైన నమ్మకం వుంది. మా కంపెనీవారికీ ఆ విశ్వాసం వుంది. మేరీ పిక్‌ఫోర్డు – ఊనాతో విందుకు రండి ఈ సినిమా విడుదల సందర్భంగా అని ఫోన్‌చేసి "21" రెస్టారెంటు దగ్గర కలిశాం. మేరీ చాలా ప్రశాంతంగా

వుంది. మరోచోట పార్టీకి వెళ్లి వస్తున్నట్లు చెప్పింది. అక్కడ నుంచి సినిమా విడుదల థియేటర్ దగ్గరకు వెళ్లాం – జనం విపరీతంగా వున్నారు. మమ్మల్ని లోపల వరండాలోకి తీసుకు వెళ్లటానికి చాలా ఇబ్బంది పడ్డారు. అక్కడ మైకు ఇచ్చి మాట్లాడమన్నారు. మేరీ మైకు తీసుకుని. "రెండు వేల సం।।రాల క్రితం క్రీస్తు జన్మించాడు" అంటూ మొదలుపెట్టింది. తర్వాత జనం గొడవతో ఆగిపోయింది. నాకు ఇప్పటికీ ఆశ్చర్యమే ఆ తర్వాత ఏమి చెప్పబోయేదో అని! అక్కడితో ఆ తంతు ముగిసింది! సినిమా నడుస్తుండగా నేను ప్రేక్షకుల స్పందనను పరిశీలించాను. పెద్దగా నవ్వులు లేవు. కొంత సణుగుడు వినపడింది.

అరగంట తర్వాత 'ఊనా నేను బైటకు వెళ్తున్నాను. ఇక భరించలేను' అన్నాను. ఊనా ఓదార్పుగా చేయినొక్కింది. నా చేతిలో ప్రోగ్రాం కాగితం నలిగిపోయింది. అది అక్కడ పడవేసి బైట లాబీలోకి వచ్చి అటూ ఇటూ నడిచాను. నవ్వులు పెద్దగా వినపడటం లేదు. అలాగే బాల్కనీకి వెళ్లాను. అక్కడా అంతే – గంభీరంగానే నడుస్తున్నది! ఎంతసేపటికీ సినిమా అయ్యేట్లు లేదు. థియేటర్ బైట అక్కడ బజార్లో తిరిగి తిరిగి వచ్చాను. ఎట్లాగో సినిమా పూర్తయింది.

మొదటగా కలిసింది ఎరక్ విల్సన్ 'ఈయన సినిమా కాలమిస్టు – నాకు బాగా నచ్చింది' అన్నాడు 'నాకు' అని నొక్కి, తర్వాత ఆర్థర్ కెల్లీ 'మనం అనుకున్నట్లు 120 లక్షల డాలర్లు వసూలు చేయక పోవచ్చు' అన్నట్లు – 'కనీసం సగం వస్తుందేమో?' అన్నాను నవ్వుతూ.

తర్వాత 150 మందికి విందు ఇచ్చాము. అందులో పాత స్నేహితులు కొద్దిమందే. షాంపేన్ ఇచ్చాం – చాలా చర్చలు జరిగాయి. ఊనా త్వరగా వెళ్లింది హోటల్‌కు. తర్వాత మరో అరగంట వున్నాను. ఆ రాత్రి చాలామంది సినిమాను విమర్శించారు. డాన్ స్టీవర్ట్ 'చార్లీ వాళ్లు సినిమాను రాజకీయం చేస్తున్నారు. నాకు చాలా బాగా నచ్చింది. ప్రేక్షకులు గొప్పగా ఆనందించారు....." అన్నాడు.

ఇప్పటికి నాకు రెండు రకాల తిమ్మిరి ఎక్కింది. ఒకటి షాంపేన్ – రెండోది విమర్శలు వినీవినీ – నేను వెళ్లేసరికి ఊనా నిద్రపోయింది. డాన్ నన్ను నాతోపాటు నా గది దాకా వచ్చాడు 'ఇది ఎన్నో ఫ్లోరు?' అన్నాడు. '17' అన్నాను – 'ఆరి దేవుడా?

నీవు గుర్తించావా – ఈ గది? ఇక్కడేగా ఇంతకుముందు ఒక కుర్రవాడు పన్నెండు గంటలు కిటికీలో నిలబడి తర్వాత దూకి ఆత్మహత్య చేసుకున్నాడు?" అన్నాడు – ఈ రాత్రికి ఇది క్లైమాక్సు సీను!!

వార్తలు ఎలా వున్నా – నా నమ్మకం 'వెర్డో' ఇంతవరకు నేను తీసిన సినిమాలన్నింటిలో నాకు బాగా నచ్చిన సినిమా!

న్యూయార్కులో ఆరు వారాలు మంచి వసూళ్ళు చేసింది. తర్వాత ఒక్కసారిగా పడిపోయింది.

గ్రాడ్ సీర్స్ (మా కంపెనీ డైరక్టర్) మీకు "మంచి ఫాలోయింగ్ వుంది. అన్ని సినిమాలు (మీవి) మొదటి నాలుగయిదు వారాలు బాగానే పోతాయి – ఆ తరువాత సామాన్య జనం వస్తారు – వాళ్ళకి అంతగా పట్టవు."

'మీ వుద్దేశ్యం సామాన్య జనానికి హాస్యం తెలియదంటారా?' అన్నాను.

'మిమ్మల్ని పత్రికల వాళ్లు సంవత్సరకాలంగా చితక్కొడుతున్నారు. దాని ఫలితం మెల్లగానైనా వుంటుంది. ఇక్కడ చూడండి ఏమని రాశారో' డైలీ న్యూస్–

"ఈ విదేశీయుణ్ణి తన్ని తరిమేయండి"

"ఈ అతిథి చాలాకాలంగా వుంటున్నాడు."

"చాప్లిన్‌కి కమ్యూనిష్టులంటే సానుభూతి"

'చాప్లిన్‌ని రష్యా పంపండి" ఇలా వున్నాయి – దీనికి తోడు కాథలిక్ సానుభూతి పరులు థియేటర్ల దగ్గర పికెటింగ్ చేస్తున్నారు. యాజమాన్యాన్ని బెదరిస్తున్నారు సినిమా ప్రదర్శించవద్దని వీటన్నిటి పర్యవసానం మనం చూస్తున్నాం" అన్నాడు గ్రాడ్ సీర్స్.

ఇట్లాంటి నిరాశాజనకమైన మాటలు విన్నపుడు విచారం కలిగినపుడు – ఎవరైనా వేదాంతం మాట్లాడతాడు – లేదా హాస్యాన్ని ఆశ్రయిస్తాడు! గ్రాడ్ నాకు పికెటింగ్ చేస్తున్నవాళ్ళ ఫోటో చూపాడు. అక్కడ ప్రేక్షకులు ఎవరూ లేరు. "బహుశా ఉదయం అయిదు గంటలకు తీశారేమో" అన్నారు.

ఏది ఏమయినా 'వెర్డో' అంతరాయం లేకుండా ఆడింది. మామూలుకంటే ఎక్కువగానే వసూళ్లు చేసింది.

లైమ్‌లైట్ నాయిక

సినిమాను అన్ని సర్క్యూట్లూ బుక్ చేసుకున్నాయి, దేశవ్యాప్తంగా! కాని వాళ్ళకు బెదిరింపు సందేశాలు రాగానే రద్దు చేసుకున్నాయి. డెన్వర్‌లో ఒక థియేటర్ హౌస్‌ఫుల్‌గా నడుస్తోంది. అమెరికన్ లీజియన్ బెదిరింపుతో మర్నాడే తీసివేశారు.

ఈ న్యూయార్కు యాత్ర చాలా బాధాకరంగా జరిగిందని చెప్పవచ్చు – ప్రతీరోజు సినిమా ప్రదర్శన రద్దు చేసినట్లు ఏదో చోటు నుంచి వార్త వస్తుండేది. దీనికి తోడు నా మీద దేశద్రోహం దావా తెచ్చారు, ది గ్రేట్ డిక్టేటర్ సినిమా తీసినందుకు. ఇది నా మీద చాలా ద్వేషాన్ని పెంచింది అమెరికా ప్రజలలో – ఒక ప్రక్క పత్రికా ప్రపంచం – మరోప్రక్క జన సామాన్యం, ఇంకో వంక నలుగురు సెనేటర్లు పార్లమెంటుతో నామీద అభియోగాల మధ్యలో, ఈ దావాను వాయిదా వేయమన్నా మన్నించకుండా విచారణ జరిపారు.

ఈ విషయం ఇంకా చెప్పేముందు – మీకు మరికొన్ని వివరాలు ఇస్తాను. ఇంతవరకు నా సినిమాలకు కథలూ, స్క్రిప్టు పూర్తిగా నా బుర్రలో నుంచి వచ్చినవే. ఈ దావా ఇంకా విచారణలో వుండగా, న్యాయమూర్తి మమ్మల్ని ఇలా అభ్యర్థించారు. 'మా నాన్నగారు చివరిరోజుల్లో వున్నారు – మీరు ఏదో ఒక నిర్ణయానికి వస్తే, నేను ఈ కేసు పూర్తిచేసి, ఆయన దగ్గరకు వెళ్తాను' అని! దీనిలో వున్న సాంకేతిక అనుకూలతను దావా వేసినవారు వెంటనే దీనికి అంగీకరించారు. మామూలు రోజుల్లో అయితే నేను ఈ కేసులో పోరాటం జరిపే వాడినే, కాని పైన చెప్పినట్లు ఇప్పుడు నా మీద వున్న వ్యతిరేక ప్రచారంలో ఈ కోర్టు వ్యవహారంలో వచ్చే వత్తిడి భరించలేక నేనూ అంగీకరించి కేసు విషయంలో నిర్ణయానికి వచ్చాం.

'వెర్డో' సినిమా వసూలు చేస్తుందనుకున్న 120 లక్షల డాలర్ల ఆశా ఆవిరయిపోయింది. దాని ఖర్చులు దానికి వస్తే గొప్పే! ఈ పరిస్థితిలో మా కంపెనీ యునైటెడ్ ఆర్టిస్ట్స్ తీవ్రమైన చిక్కుల్లో ఇరుక్కుంది.

ఖర్చులు తగ్గించే మిషతో మేరీ, నా రిప్రెసెంటేటివ్‌ను (ఆర్థర్‌కెల్లీని) తీసివేస్తానంది. అప్పుడు నేను కంపెనీలో సగం భాగస్వామిని అన్నీ విషయం గుర్తుచేశాను. దానితో మండిపడింది. "నా రిప్‌ని తీసి వస్తే, నీ రిప్‌నూ తీసివేయాలి కదా?" అన్నాను. దానితో సమస్య మరీ క్లిష్టమైంది. 'ఇప్పుడు ఈ కంపెనీని నువ్వుగానీ, నేనుగానీ వాల్చుకుందాం – నీకు ఎంతకావాలో చెప్పు' అన్నాను. మేరీ కూడా మొండిగానే


CHARLES CHAPLIN
Limelight
"LES FEUX DE LA RAMPE"
CLAIRE BLOOM

వ్యవహరించి రేటు చెప్పలేదు. ఇలాంటి పరిస్థితిలో మాకు ఈస్టరన్ సర్కూట్ నుంచి చాలా మంచి ఆకర్షణీయమైన బేరం వచ్చింది. వాళ్లు మా కంపెనీని 120 లక్షల డాలర్లకు కొంటామని 70 లక్షల డాలర్లు నగదు ఇస్తామనీ, 50 లక్షలు మదుపు రూపంలో ఇస్తామనీ.

అప్పుడు "చూడు మేరీ – ఇది మనకు సువర్ణావకాశం. నాకు 50 లక్షల డాలర్ల నగదు ఇవ్వు – నీవు మిగతాది వుంచుకో!" (అంటే 20 లక్షల నగదు – 50 లక్షల స్టాకు) అని అన్నాను.

ఆమె దీనికి అంగీకరించింది – రెండు వారాలు కిందా మీదా పడి మా లాయర్లు దీనికి అవసరమైన డాక్యుమెంట్లు తయారు చేశారు. ఆ సమయంలో నా లాయరు ఫోన్ చేసి "చార్లీ మరో పదినిమిషాల్లో నీవు 50 లక్షల డాలర్లకు అధిపతివి అవుతావు" అన్నాడు.

ఆ పదినిమిషాల తర్వాత ఆయనే ఫోన్ చేశాడు. "చార్లీ – ఈ బేరం కుదరలేదు – మేరీ పెన్ను చేతిలో పట్టుకుని సంతకం పెట్టే ముందు '50 లక్షల డాలర్లు చార్లీకి ఎందుకివ్వాలి ఇప్పుడు?' అని. నేను రెండు సంవత్సరాలు ఆగడం ఏమిటి?' అంది. అప్పుడు మీకు 20 లక్షలు ఎక్కువ వస్తోంది కదా' అన్నాను. 'నాకు ఆదాయపు పన్ను బాధలు రావచ్చు' అని సంతకం పెట్టలేదు' అన్నాడు. అలా ఆ బంగారు అవకాశం చేజారిపోయింది. తర్వాత మేము తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది.

మేము కాలిఫోర్నియా తిరిగి వచ్చాము. నేను పూర్తిగా కోలుకున్నాను. ఇప్పుడు మళ్లీ కొత్త ఆలోచన, కొత్త సినిమా గురించి ఆలోచన మొదలు పెట్టాను. నాకు ఇంకా ఆశ వుంది, అమెరికా ప్రజలు నన్ను ఇంకా ప్రేమిస్తున్నారు అని.

వారిని నిరంతరం ఆనందపరిచే వ్యక్తిని – రాజకీయ దురుద్దేశంతో వదులుకోరు అనుకున్నాను. నా బుర్రలో ఒక ఆలోచన తొలుస్తోంది. ఏమయినా సరే ఈ సినిమా తీయాలని, దాని పర్యవసానం ఎలా వున్నా సరే అని అనుకున్నాను.

ప్రపంచంలో ఎంత ఆధునికంగా తయారయినా, ప్రేమకథను ప్రేమించకుండా పోదుకదా – హాజ్‌లిట్ చెప్పినట్లు – బుద్ధికంటే హృదయం ఎక్కువ స్పందిస్తుంది! అదే కళాసృష్టికి ఎక్కువ అవకాశం ఇస్తుంది కూడా!

లైమ్ నైట్ నాయికతో

నా ఆలోచన – ప్రేమకథ – అదీ పూర్తిగా 'వెర్డో' నిరాశకు వ్యతిరేకం – ప్రేమమయం. ఈ ఆలోచన నన్ను చాలా ఉత్సాహపరిచింది.

లైమ్ లైట్‌కి పద్దెనిమిది నెలలు పట్టింది, సిద్ధం చేయటానికే. దానిలో 12 నిమిషాల బాలే (Ballet) సంగీతం సమకూర్చాలి. ఈ కార్యం కూడా నేనే చూశాను. కాని ప్రతి కదలికనూ మనస్సులో ఊహించుకుని సంగీతాన్ని సమకూర్చాలి.

ఇంతకుపూర్వం సినిమాకు పూర్తయిన తర్వాతే సంగీతాన్ని సమకూర్చేవాడిని. అదీ సినిమా చూస్తూ చేయటానికి అవకాశం వుండేది.

ఏది ఏమయినా నా ఊహా ప్రపంచంలోనే ఈ బాలేకి సంగీతం కంపోజ్ చేశాను. అది పూర్తయిన తరువాత ఇది నిజానికి నృత్యానికీ నృత్య నాటకానికీ పనికి వస్తుందా అని అనుమానం వచ్చింది.

ఎందుకంటే దీనికి నృత్య విన్యాసాలు, నృత్యకారులే సమకూర్చుకోవాలి.

నాకు ఆండ్రే ఎంగ్లిచ్‌స్కీ బాలే దర్శకుడు అంటే చాలా గౌరవం. అందుకని ఆయనకోసం న్యూయార్కు ఫోన్ చేశాను. మీరు 'బ్లూ బర్డ్' బాలేని వేరే సంగీతానికి నృత్యం చేయగలరా, అందుకోసం ఎవరైనా బాలిరీనా పేరు చెప్పగలరా అని – దానికి, 'ఆయన ముందు సంగీతం వినాలికదా' అన్నారు.

అసలు బ్లూ బర్డ్ నృత్యం దీనికి సంగీతం సమకూర్చింది – చైకోవిస్కీ అది కేవలం 45 సెకండ్లు మాత్రమే వుంటుంది. అందుకోసం మరికొంత సంగీతాన్ని కంపోజ్ చేశాను.

ఈ పన్నెండు నిమిషాల నృత్య నాటికకూ చాలా నెలలుగా సంగీత సాధనచేసి 50 వాయిద్యాలతో రికార్డు చేశాం. ఇది వినిపించి నృత్యకారుల స్పందన ఎలావుందో తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నాను.

ఎలాగైతేనేం బాలిరీనా మొలీసా హెడెన్, ఆండ్రే ఎంగ్లిన్‌స్కీ న్యూయార్కు నుంచి విమానంలో వచ్చారు. వీరిద్దరూ కూర్చుని నా సంగీతం వింటుంటే చాలా ఆందోళనకూ, వత్తిడికి లోనయ్యారు. ఆశ్చర్యం ఇద్దరూ అది బాగుంది – బాలేకి సరిపోతుంది అని అంగీకరించారు!

ఇది నా సినిమా జీవితంలో చాలా అద్భుతమైన క్షణాలుగా అనుకుంటాను! అదే, ఆ సంగీతానికి వాళ్లు నృత్యం చేయటం చూడటం!

ఆ సంగీతానికి వారు నృత్యం ద్వారా ఇచ్చిన వ్యాఖ్యానం చాలా అద్భుతంగా వుంది. ఒక విశిష్టత తెచ్చిపెట్టింది! ఇందులో హీరోయిన్, దాని అసాధ్యాన్ని కోరాను.

అందం – సొగసు – ప్రతిభ – దానికితోడు ఎంతో ఆర్ద్రత – ఇవన్నీ కలగలసి వుండాలి! ఎన్నో నెలలుగా వెతికి వెతికి చాలా ప్రయత్నం తరువాత అదృష్టవశాత్తు క్లెయిర్ బ్లూమ్‌ను తీసుకున్నాము. ఈమెను నా స్నేహితుడు ఆర్థర్ లారెన్సు సిఫారసు చేశాడు.

మన ప్రకృతిలో ఏదో మాయ వుంటుంది. అనవసర విషయాలనూ ద్వేషాన్ని త్వరగా మరచిపోతాము.

కోర్టు విచారణ దాని దుష్ప్రభావం కేవలం మంచులా కరిగి ఆవిరయి పోయింది.

ఈ కాలంలోనే ఊనా నలుగురు సంతానాన్ని నాకు ప్రసాదించింది. గెరాల్డిన్, మైఖేల్, జోసి, విక్కో, నలుగురు పిల్లల్తో – ఊనాతో ఇప్పుడు బెవర్లీ హిల్స్ జీవితం చాలా ఆనందంగా వుంది!

మా యిల్లు ఆదివారాలు అందరికీ స్వాగతం పలుకుతుంది! ఆ రోజునే మా స్నేహితులు చాలామంది వస్తారు. జిమ్ ఆగా హాలీవుడ్ జాన్ హోస్టన్‌కి స్క్రిప్ట్ రాయటానికి వచ్చారు.

విల్‌డూరాంట్ – రచయిత, తత్త్వవేత్త. అప్పుడు హాలీవుడ్‌లో వున్నాడు. ఆయన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలు ఇవ్వటానికి వచ్చారు. విల్‌డూరాంట్ మాకు పాత మిత్రుడే, చాలా సందర్భాలలో మా యింటికి విందుకు వచ్చారు.

ఆ సాయంత్రాలు ఎంతో ఆహ్లాదకరంగా వుండేవి. విల్ చాలా ఉత్సాహవంతుడు – ఈ జీవితమే ప్రోత్సాహాన్నిస్తుంది. మరే ఇతర స్టిమ్యూలెంట్సు అవసరం లేదు అంటారు.

అలాంటి విల్ ఒకసారి నన్ను అడిగారు "అందానికి మీ నిర్వచనం ఏమిటి?" అని!

నేను అది అన్నిచోట్లా వుండేది. మరణంతో కలిసిన ప్రేమభావం. నవ్వే విచారం – మనం ప్రకృతిలో దర్శించేది. అన్నింటిలో కనిపించేది అది ఒక మార్మికమైన సంకేతం. కవులు లోనయ్యేది!

'అది ఒక వెలుతురు రేఖపడే చెత్తబుట్ట కావచ్చు – లేదా మురికి కాలువలో దొర్లే గులాబి కావచ్చు – ఎల్ గ్రేకో చూపిన అవర్ సేవర్ ఆన్ ది క్రాస్!' అన్నాను. మళ్లీ విల్‌ను, డగ్లస్ జూనియర్ ఇంట్లో కలిశాము. మెన్సుడేన్ క్లెమెన్స్, డెన్ క్లారి బూత్‌లూస్ అక్కడ వున్నారు. అంతకు ముందు క్లారిని న్యూయార్క్‌లో కలిశాను. అప్పుడు హార్స్ట్ పెట్టిన ఫాన్సీడ్రెస్ రాత్రి! ఆమె 18వ శతాబ్దపు బట్టలు ధరించి ఆ రాత్రి చాలా అందంగా వుంది! ఆ రాత్రి జార్జ్‌మూర్ నృత్యం చేసింది. అతన్ని అడిగింది 'నీవు డబ్బెలా సంపాదిస్తావు, అది మాయగానే అన్పిస్తుంది మాకు!' అని.

ఇది నిజంగా అన్యాయమే, అంతమందిలో అలా నిలదీయటం కానీ జార్జి చాలా చక్కగా సమాధానం ఇచ్చాడు.

'నేను బొగ్గు అమ్ముతానూ, కొంతసేపు పోలో ఆడతాను హిచ్‌కాక్‌తో' అప్పుడు నేను అటుగా వెళ్లాను 'ఇదిగో చార్లీ చాప్లెన్ నా స్నేహితుడు' అని ముగించాడు! క్లారీ అంటే నా అభిప్రాయం మారిపోయింది. తర్వాత ఆమె రాజకీయాల్లో చేరి అంబాసిడర్ అయ్యింది. అమెరికన్ రాజకీయాల్లో 'గ్లోబలోని' అనే ఒక తాత్విక ఎథోరిజాన్ని ప్రవేశ పెట్టింది.

ఆ రాత్రి ఆమె వాక్చాతుర్యాన్ని విన్నాను. తర్వాత మత విషయంలోకి మారింది చర్చ. (ఈమె కాథలిక్ చర్చిలో చేరింది) ఆ సమయంలోనే అన్నాను – ఎవ్వరూ మత చిహ్నాన్ని నుదుటిమీద అచ్చు వేయించుకోవలసిన అవసరం వుందని అనుకోను. అది – పుణ్యాత్మునికీ పాపికీ ఒకేలాగా వుంటుంది.

పవిత్రమైన దయ్యం అందరిలోనూ వుంటుంది.

ఆ రాత్రి మేము అపరిచితులమైపోయినట్లు విడిపోయాం!!

'లైమ్‌లైట్' పూర్తయిన తర్వాత దాని విజయం గురించి నాకెటువంటి సందేహం లేదు. స్నేహితులకోసం ప్రత్యేకంగా ప్రదర్శించాము. అందరూ చాలా ఉత్సాహంగా వున్నారు. మేము యూరోప్ వెళ్లాలని నిర్ణయించుకున్నాం – ఊనా పిల్లల్ని ఇంగ్లాండులో

చదివించాలని నిర్ణయించింది. హాలీవుడ్‌కి దూరంగా. అప్పటికి నేను మళ్లీ అమెరికా రావటానికి రీ ఎంట్రీ పర్మిట్ కోసం దరఖాస్తు పంపే వున్నాను మూడునెలల ముందే. ఇంతవరకు ఎటువంటి సమాధానం రాలేదు. ఏమయినా నా వ్యాపార లావా దేవీలన్ని పూర్తి చేయదల్చుకున్నాను. కట్టవలసిన పన్నులన్నీ చెల్లించాను. అన్నీ సక్రమంగానే వున్నాయనీ, రెవిన్యూవాళ్లు నేను యూరోప్ వెళ్తున్నానని తెలిసి అప్పుడు నేను ఇంకా పన్ను కట్టాలనీ అది రోజురోజుకు పెంచి చివరికి 20 లక్షల డాలర్లు కట్టాలనీ చెప్పారు! ఇది వారు మొదట్లో అడిగిన దానికంటే పదిరెట్లు ఎక్కువ! నేను కోర్టుకు వెళ్తున్నానని బెదిరించేసరికి చాలా తక్కువ మొత్తానికి పరిష్కరించారు!

ఇప్పుడు వాళ్లు నాకు అభ్యంతరం చెప్పటానికి అవకాశం లేదు. అందుకని మళ్లీ రీ ఎంట్రీకి దరఖాస్తు పంపాను. ఇప్పుడు కూడా సమాధానం లేదు. అప్పుడు వాషింగ్‌టన్‌కు ఒక వుత్తరం పంపాను. 'మీరు పర్మిట్ ఇచ్చినా ఇవ్వకపోయినా నేను దేశం వదిలిపెడుతున్నాను' అని.

ఆ తర్వాత వారానికి నాకు ఫోన్ వచ్చింది. 'మేము ఇమ్మిగ్రేషన్ శాఖనుంచి మిమ్మల్ని కొన్ని వివరాలు అడగాలి – ఇంటికి రావచ్చా?" అని. 'తప్పనిసరిగా రండి' అన్నాను.

ముగ్గురు మొగవాళ్ళూ – ఒక స్త్రీ వచ్చి టైప్, రికార్డుచేసే మిషన్‌తో నన్ను పలకరించారు!

నన్ను ప్రశ్నించిన ముఖ్యుడు పొడవుగా, 40 ఏళ్ళవాడు చాలా ఠీవీగా వున్నాడు. వాళ్లు నలుగురూ నేను ఒక్కడినీ లాయర్ను పిలవనా అనుకున్నాను. అయినా దాయటానికి ఏముంది అని వాళ్లను ఎండగా వున్న వరండాలోకి తీసుకు వెళ్లాను. ఆమె స్టెనోటైపు చిన్న బల్లమీద పెట్టుకుంది. మిగతా వాళ్లు రికార్డింగ్ మెషిన్ను ఒళ్లో పెట్టుకుని కూర్చున్నారు సోఫాలో.

నేను విడిగా కూర్చున్నాను – నా ఎదురుగా ఠీవిగా వున్న యువకుడు చిన్న పుస్తకం తెరిచి ఒక్కో కాగితం తీసి ప్రశ్నలు అడగటం మొదలుపెట్టాడు. మీ పేరు చార్లీచాప్లిన్ అవునా?

అవును.

కొంతమంది మీ పేరు (ఏదో చెప్పాడు) మీరు గాలీసియా నుంచి వచ్చారని అంటున్నారు?

లేదు. నా పేరు చార్లీ చాప్లిన్. నేను, మా నాన్నలాగా లండన్‌లో పుట్టాను. ఇంగ్లాండులో.

మీరు ఎప్పుడూ కమ్యూనిస్టు కాదని చెప్పారు?

ఎప్పుడూ కాదు. నేను ఏ రాజకీయ సంస్థలోనూ లేను.

మీరు ఒక ఉపన్యాసంలో 'కామ్రేడ్స్' అన్నారు. దాని అర్థం ఏమిటి?

దాని అర్థం డిక్షనరీలో వున్నదే. దానిమీద కమ్యూనిస్టులకు గుత్తాధికారం లేదు.

ఈ విధంగా ప్రశ్నల వర్షం కురిపిస్తూ ఒక్కసారిగా 'మీరు ఎప్పుడైనా ఇతరుల భార్యతో గడిపారా?' అన్నాడు. నాకు మండి "మీరు నన్ను సాంకేతికంగా, ఈ దేశం రాకుండా చేద్దామనుకుంటే ఆ విషయం చెప్పండి దాని ప్రకారం నేను నా ఏర్పాట్లు చేసుకుంటాను. ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడటం నాకిష్టం లేదు."

"ఈ ప్రశ్నలన్ని రీ ఎంట్రీ పర్మిట్‌లమీద వుంటుంది."

'అయితే ఈ 'ఎడల్ట్రీ' అంటే ఏమిటో చెప్పండి' అన్నాను. ఇద్దరం డిక్షనరీ చూశాము!

'అదే ఇంకొకరి భార్యతో రాత్రి గడపటం?' అని చూపాడు. 'నాకు తెలిసినంతవరకూ అలాంటిదేమీ జరగలేదు.'

"ఈ దేశంమీద దాడి జరిగితే – మీరు యుద్ధంలో పాల్గొంటారా?" "తప్పనిసరిగా – ఈ దేశాన్ని ప్రేమిస్తున్నాను. ఇదేనా ఇల్లు – ఇక్కడ నలభై ఏళ్లుగా వుంటున్నాను."

"కాని మీరు ఈ దేశ పౌరసత్వం తీసుకోలేదు?"

"తీసుకోవాలని ఏమయినా చట్టం వుందా? కాని నేను పన్నులన్నీ సక్రమంగా కడుతున్నానే?!"

మీరు 'పార్టీ లైన్' ఎందుకు అనుసరిస్తున్నారు?

అసలు 'పార్టీ లైన్' అంటే ఏమిటో చెప్పండి.

కాస్సేపు ఆగి అసలు మీకు తెలుసా నేను ఈ రొంపిలో ఎలా పడ్డానో?

తెలీదన్నట్లు తల వూపాడు.

మీ ప్రభుత్వాన్ని గౌరవించినందుకు–

అతను ఆశ్చర్యంగా చూశాడు.

మీ మాజీ రష్యా అంబాసిడర్ – జోసఫ్ డేవీస్ మాట్లాడవలసిన శాన్‌ఫ్రాన్సిస్కో సభలో అదీ రష్యన్ యుద్ధవీరుల సహాయ నిధికోసం – ఆయన గొంతుకు లారెంగైటిస్ వచ్చిందని నన్ను అభ్యర్థించారు. అప్పటినుంచీ ఈ పాకుడూ దేకుడూ మొదలయ్యింది! మూడుగంటలు ఇలా ప్రశ్నించారు. అప్పుడు వెళ్లారు.

తర్వాత వారానికి ఫోన్ చేశారు. ఇమ్మిగ్రేషన్ ఆఫీసుకు వెళ్లమని అక్కడ మధ్యవయస్కులు ఆ డిపార్ట్‌మెంటు అధికారి చాలా దయగా "రండి చార్లీ – మీకు ఇంత ఇబ్బంది కలిగించినందుకు క్షమించండి. మరొక్కప్రశ్న మీరు ఎన్నాళ్లు దేశం బయట వుంటారు?"

'ఆరునెలలు!' మేము హాలిడే విహారయాత్రకు వెళ్తున్నాము.

'మీరు అంతకంటే ఎక్కువకాలం వుండదలచుకుంటే దీనికి కొనసాగింపు తీసుకోవాలి' అని టేబుల్‌మీద కాగితం పెట్టాడు – అతను లోపలికి వెళ్ళాడు. నాతోవచ్చిన లాయరు 'అదే అదే పర్మిట్' అన్నాడు.

"అధికారి వచ్చి ఇక్కడ సంతకం చేయండి చార్లీ – మీరు నౌకా ప్రయాణానికి సంబంధించిన కాగితాలు తీసుకోవాలిగా."

నేను సంతకం చేసిన తర్వాత నన్ను ప్రేమగా భుజంమీద తట్టి – "ఇదిగో మీ పర్మిట్ హాయిగా సంతోషంగా హాలీడే యాత్ర గడిపి త్వరగా వచ్చేయండి!" అన్నాడు.

అది శనివారం. మేము ఆదివారం వుదయం న్యూయార్కు వెళ్లే రైలు ఎక్కాలి. నేను ఊనాని బాంకు లాకర్ తీయటానికి సంతకం చేయమని చెప్పాను. ఇట్లాంటి విషయాల్లో ఊనా అంత ఉత్సాహం చూపదు. ఒకవేళ నాకేమైనా జరిగితే? అందుకని ఇది లాస్‌ఎంజెలెస్‌లు చివరిరోజు, అదీ శనివారం. ఇంకో పదినిమిషాలలో బాంకులు మూసివేస్తారు. 'అరె పద – తొందరగా' అని హడావుడి చేశాను.

'మళ్లీ వచ్చిన తరువాత చెయ్యొచ్చుకదా – ఏమిటీ హడావుడి' అంది. కాని నేను వత్తిడి చేశాను. తీసుకువెళ్లి బాంకులో సంతకం చేయించాను. అలాకాకపోతే బ్రతికినంతకాలం కోర్టులచుట్టు తిరగాల్సి వచ్చేది – మా సొమ్ము దేశం బయటకు తీసుకు రావటానికి.

చాలా ఉద్విగ్నంగా వుంది. లాస్‌ఏంజెలెస్‌లో ఆ చివరి రోజు – ఊనా ఇంటి వ్యవహారాలన్నీ సర్దుబాటు చేసి అందరికీ జీతాలిచ్చి లాన్‌లో నిలబడి ఇంటిని చూస్తోంది. ఈ ఇంటిలోనే ఎన్నో జరిగినాయి. నాకు ఎంతో సంతోషం – ఎన్నో సందర్భాలు – ఎన్నో జరిగాయి. ఇప్పుడు ఈ లాన్ – ఈ తోట చాలా ప్రశాంతంగా కనపడుతున్నాయి. వదిలి వెళ్లాలంటే మనస్కరించడం లేదు.

హెలెన్ (మా సహాయకురాలు), బట్లర్ హెన్రీ వంట అమ్మాయి అన్నాకు చిన్న కౌగిలింతతో వీడ్కోలు చెప్పాను. ఇలాంటి విషయంలో నాకు చాలా మొహవాటం! సిగ్గు. అన్నా – లావుగా పొట్టిగా వుంటుంది. చాలా ఉద్వేగంతో ఆమెను చేతిమీద తట్టి 'వెళ్లొస్తాను' అని మాత్రం అనగలిగాను. ఊనా అందరికంటే చివరిగా ఇంటినుంచి బైటకు వచ్చింది. అందరూ కన్నీళ్ళు పెట్టుకున్నారు – అరే ఏమయింది?

రైల్వే స్టేషన్‌లో నా సహాయకుడు జెర్రీఎన్‌స్టీన్ వచ్చి వీడ్కోలు చెప్పాడు.

రైలు ప్రయాణం చాలా హాయిగా, ప్రశాంతంగా జరిగింది. న్యూయార్క్‌లో వారంరోజులు గడిపాము. చాలా బాగా వుంది అంతా అనుకుంటున్న సమయంలో మా లాయరు ష్వార్ట్జ్ ఫోన్ చేశాడు. మా కంపెనీలో పనిచేసి మానివేసిన వాడొకడు ఇప్పుడు కంపెనీమీద దావా తెస్తున్నాడు – ఇన్ని లక్షల డాలర్లు కావాలని! కాని – 'ఇది వట్టి చెత్త మాత్రమే – కావాలని నువ్వు ఏ నోటీసు తీసుకోవద్దు – తీసుకుంటే కోర్టుకు రావలసి వుంటుంది" అని ముగించాడు.

అదీ విషయం – అలా న్యూయార్క్‌లో చివరి నాలుగురోజులు గదిలోనే గడపవలసి వచ్చింది. కాని 'లైమ్ లైట్' ప్రీవ్యూకీ – పత్రికా సమావేశానికీ మాత్రం హాజరయ్యాను. నోటీసులు వచ్చినా రాకపోయినా.

క్రోకర్ – మా ప్రచారకర్త టైమ్, లైఫ్ పత్రికల సంపాదక వర్గంతో మాకు విందు ఏర్పాటు చేశాడు. ఇలా పత్రికల్లో ప్రచారం వస్తుందని అతనికి ఆశ.

ఆ మధ్యాహ్నం విందు వాళ్ళు తెల్లని వెల్లవేసిన గోడల మాదిరిగానే ఫ్రిజిడ్‌గానే జరిగింది.

వాళ్లతో స్నేహంగా వుండటానికి ప్రయత్నం చేశాను. టైమ్ స్టాఫ్ అందరూ రోదసి యాత్రికుల్లా చాలా గంభీరంగా డిప్ప కొట్టించుకుని ఎదురుగా కూర్చున్నారు. మాకు వచ్చిన ఆహారం కూడా అక్కడి వాతావరణం లాగానే వుంది. రుచీపచీలేని చికెను – బంక కారుతున్న పులుసు.

ఇవన్నీ అలా వుంచితే – ప్రచారం విషయంలో నా రాక, వాళ్లతో స్నేహంగా వుండే ప్రయత్నం – అక్కడ ఆహారం ఏదీ నాకు సహాయం చేయలేదు.

ఎందుకంటే ఈ టైమ్‌పత్రిక 'లైమ్‌లైట్'ను పచ్చడిక్రింద కొట్టి ఉతికి ఆరేసింది. ఎంత వ్యతిరేకత పత్రికలు చూపినా, తర్వాత సినిమా మీద వచ్చిన సమీక్షలు చాలా మంచివిగా వున్నాయి.

ముప్ఫయ్యవ అధ్యాయం

స్వదేశానికి పయనం?

ఉదయం అయిదు గంటలకు 'క్వీన్ ఎలిజబత్' నౌకలోకి ప్రవేశించాము. ఆ సమయం ఎంతో రొమాంటిక్‌గా వుండాల్సింది. కేవలం లాయరు నోటీసులు తప్పించుకోవటానికి మా లాయరు చెప్పినట్లు, ఎవ్వరికీ తెలియకుండా, నౌకలోకి చేరి నా కేబిన్‌లోనే కూర్చుండిపోయాను. మామూలుగా అయితే నౌక పైకి చేరి, అది హార్బర్‌లో నుంచి బయటకు రావటం వేరే ప్రపంచంలోనికి ప్రవేశించడం చూస్తూ ఆనందించేవాడిని. గత పది సంవత్సరాలుగా నేను పడిన ఇబ్బందుల ఫలితంగా, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళనతో మా లాయరు చెప్పినట్లే చేశాను. చివరికి కేబిన్‌లో నుంచి బైటకు చూసే అద్దంలో చూస్తూ కూర్చున్నాను.

తలుపు తట్టిన శబ్దం అయ్యింది. 'నేను ఊనాని' అంది. అప్పుడు తలుపు తీశాను.

'జిమ్ ఏజీ వచ్చాడు. మనకి వీడ్కోలు చెప్పటానికి. కింద డాక్ మీద నిలబడ్డాడు' అంది. 'నేను విషయం చెప్పాను. అదిగో అక్కడ చివర నిలబడి చేయి ఊపుతున్నాడు' అంది.

నేను జిమ్‌ను చూశాను. అతను మిగతా గుంపుకు దూరంగా ఎండలో నిలబడి నౌకవంకే చూస్తున్నాడు నాకోసం! నేను ఆ అద్దంలో నుంచి నా టోపీ తీసి వూపాను. ఊనా మరొక అద్దంలోనుంచి చూస్తూ "జిమ్ మిమ్మల్ని చూడలేదు' అంది.

అవును జిమ్ నన్ను తర్వాత కూడా చూడలేకపోయాడు. అదే జిమ్‌ని చివరగా చూడడం – అందరికీ దూరంగా నిలబడి మరో ప్రపంచం నుంచి చూస్తున్నట్లు నాకోసం వెతుకుతూ నిలబడ్డాడు. తర్వాత రెండు సంవత్సరాలకు గుండెపోటుతో చనిపోయాడు.

నౌకను హార్బరు బైటకు తీసుకువచ్చిన పైలట్ బోటు తప్పుకుంది. నేను కాబిన్ వదిలి బైటకు వచ్చి న్యూయార్కు నగరాన్ని చూశాను. దూరంగా, ఎంతో గొప్పగా నా నుంచి దూరంగా ఎండలో మెరిసిపోతూ కనపడింది! నా దృష్టిలో నుంచి ఆ నగరం, ఆ దేశం – ఆ ఖండం అలా అలా దూరంగా పొగమంచులో మాయమయిపోవడం – నాలో తెలియని ఉద్వేగాన్ని కలిగించింది.

నా కుటుంబంతో ఇంగ్లాండు వెళ్ళడం, లండన్‌ను దర్శించుకోవడం నాలో ఉత్సాహాన్ని కలిగించింది. చాలా ఆనందంగా రిలాక్స్ అయినట్లుంది. ఈ అట్లాంటిక్ మహా సముద్రం, అంతా పరిశుభ్రం చేస్తున్నట్లు వుంది.

నేను మరో మనిషిగా ఈ సినిమా ప్రపంచం నుంచి ఈ మాయా మిథ్య ప్రపంచంనుంచి దూరంగా ఒక మామూలు కుటుంబ వ్యక్తిగా, భార్యతో పిల్లలతో విహార యాత్రకు వెళ్తున్నట్లనిపించింది.

నౌకపైన వాళ్లు అంతా చక్కగా ఆడుకుంటున్నారు. నేనూ ఊనా వాలు కుర్చీల్లో కూర్చొని వాళ్లను చూస్తున్నాం – సరిగ్గా ఇదే సమయంలో నేను చాలా చాలా ఆనందంగా ఫీలయ్యాను. ఇది నాలోని విచారానికి చాలా దగ్గరగా కూడా వుంది!

మేము వదిలి వస్తున్న స్నేహితుల గురించీ, మా శ్రేయోభిలాషుల గురించీ మాట్లాడుకున్నాం. అంతేనా? ఇమ్మిగ్రేషన్ అధికారుల మర్యాద గురించి కూడా మాట్లాడుకున్నాం – ఔను – ఎవ్వరైనా ఇలాంటి చిన్న చిన్న మర్యాదలకు కరిగిపోతాం – శత్రుత్వాన్ని పెంచి పోషించలేము కదా?

ఊనా నేనూ ఈ యాత్రను చాలా దీర్ఘంగా గడపాలని ప్రణాళికలు తయారు చేసుకున్నాం. కేవలం ఆనందించటానికే కాకుండా లైమ్ లైట్ సినిమా విడుదల కూడా ఇందులో కలిసి వుండటంతో ఈ వినోదయాత్రలో వ్యాపారం కూడా వుండటంతో మరీ ఆనందంగా వుంది.

నౌకలో చాలా మందిని కలిశాను. ఆర్థర్ రూబిన్‌స్టీన్, అడాల్ఫ్‌గ్రన్ మొదలయిన వారున్నారు. భోజనాల సమయంలో హారీ క్రోకర్‌కి ఒక టెలిగ్రాం ఇచ్చారు నౌకా సిబ్బంది. అతను చూసి జేబులో పెట్టుకుంటుండగా 'వాళ్లు సమాధానం కోసం చూస్తున్నారు' అని అన్నారు సిబ్బంది.

అప్పుడు హారీ ముఖం రంగు మారింది. అది చూస్తూనే అక్కడ నుంచి హారీ వెళ్లాడు.

తర్వాత అతని కాబిన్‌లోకి పిలిచి నాకు చదివి వినిపించాడు. దాని సారాంశం నన్ను అమెరికా నుంచి వెలివేశారు. మళ్లీ ఈ దేశంలో అడుగు పెట్టాలంటే ఇమ్మిగేషన్ బోర్డు ముందు దోషిలా నిలబడి వాళ్లకు సమాధానం చెప్పాలి. నాపై వచ్చిన రాజకీయ అభియోగాల గురించీ, నా నైతిక వ్యవహారాల గురించీ, దీనిమీద మీరు ఏమైనా సమాధానం చెప్తారా అని యునైటెడ్ ప్రెస్ విలేఖరి పంపిన తంతి అది!

నాలో నరాలన్నీ బిగసుకుపోయాయి. నేను మళ్లీ తిరిగి ఈ దేశం వస్తానా రానా అన్నది ముఖ్యంకాదు. కాని నేను అమెరికా దేశపు అవమానాలను నైతిక డాంబికాన్నీ ద్వేషంతో నిండిన వాతావరణాన్నీ వదిలి పోతున్నందుకు చాలా ఆనందంగా వుందని చెప్పాలనుకున్నాను. కాని నా సంపద అంతా అమెరికాలోనే వుండిపోయింది. ఒకవేళ అదంతా వాళ్లు బలవంతంగా తీసుకున్నా నేను నిస్సహాయ స్థితిలో వున్నాను. ఇప్పుడు నోరు పారేసుకుని ఈ వ్యవహారాన్ని మరింత జటిలం చేయదల్చుకోలేదు. అందుకని మర్యాదగా 'అవును తిరిగివచ్చి వారి అభియోగాలన్నిటికీ సమాధానం చెప్పగలను' అని సమాధానం పంపాము. అంతేకాదు నాకిచ్చిన 'రి ఎంట్రీ పర్మిట్' ఒట్టి కాగితపు ముక్క కాదుకదా – అనికూడా – తర్వాత అమెరికా అంటే నాకు చాలాచాలా గౌరవం అనికూడా ఇచ్చాను.

ఇక తర్వాత నౌకలో నాకు సరైన విశ్రాంతి లేకుండాపోయింది. ఈ వార్త ప్రపంచం అంతా పాకినట్లుంది. అన్ని మూలల నుంచి నాకోసం దేశంకోసం తంతులు వస్తున్నాయి.

సౌత్ ఆంప్టన్ చేరకముందు షీర్‌బర్గ్ రేవులో ఆగాము. ఒక వందమంది విలేఖరులు నన్ను కలవటానికి సిద్ధంగా వున్నారు. వారికోసం బఫేరూంలో ఒక గంట కేటాయించాము. వారంతా నా మీద సానుభూతి చూపించినా ఈ తంతు నన్ను ఇబ్బంది పెట్టింది. సౌత్ ఆంప్టన్ నుంచి లండన్ ప్రయాణం నాలో ఒకరకమైన ఆత్రుతను లేపింది. అమెరికా నుంచి బహిష్కరణకంటే మొదటిసారిగా ఊనా పిల్లలూ ఈ ఇంగ్లాండు పరిసరాలకు ఎలా స్పందిస్తారో అని ఆందోళన చెందాను.

నా చిన్నతనం నుంచి ఈ పరిసరాల అద్భుత సౌందర్యాన్ని ఆస్వాదిస్తూనే వున్నాను. డిరోక్‌షైర్, కారల్‌వాక్ దాటి ఇటుకలతో కట్టిన ఎర్రటి ఇళ్ల వరసలను దాటుతున్నాను. ఊనా 'ఇవన్నీ ఒకే మాదిరిగా వున్నాయి!' అంది.

'అరె కాస్త ఓపిక పట్టు, మనం సౌత్ ఆంప్టన్ బైటనే వున్నాము' అన్నాను. తర్వాత ప్రయాణం అందమైన పచ్చికబయళ్ళ మీదుగా సాగింది.

లండన్ వాటర్‌లూ స్టేషన్ దగ్గరకు చేరాం. నా కోసం వచ్చిన అభిమానులంతా (ఇంతకుపూర్వంలాగానే) వేచివున్నారు. అంత ఉత్సాహంగానూ కేకలు పెడుతున్నారు. మేము స్టేషన్ వదిలిపెడుతున్నప్పుడు ఒకరు 'చార్లీ వాళ్లకు బుద్ధి చెప్పు' అన్నాడు. ఇది నిజంగా నాకెంతో నచ్చింది!

చివరికి సవాయి హోటల్ అయిదో అంతస్తులోనుంచి ఊనా నేనూ కొత్త వంతెన చూశాము. ఇప్పుడు నాకంతగా ఏమీ అనిపించలేదు. కేవలం అక్కడ నుంచి నేను నా బాల్యం గడిపిన వీధిలోకి వెళ్లవచ్చా అని మాత్రమే అనుకున్నాను.

మేమిద్దరం మౌనంగా ఆ కిటికీలోనుంచి ఈ నగర సౌందర్యాన్ని ఈ ప్రపంచంలో వున్న ఒకే ఒక లండన్ నగర సౌందర్యాన్ని తనివితీరా చూశాము. నాకు పారిస్‌లోని కంకార్డ్ ప్లేస్, అందులోని రమణీయతా, సంజెవేళలో న్యూయార్కు ఆకాశ హర్మ్యాల అద్దాల అందాల మార్మికతా వీటన్నిటికంటే ఇప్పుడు నేను చూస్తున్న ఈ లండన్ నగర శాఖలో ఏదో మానవీయత నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఊనావైపు చూశాను. ఆమె కూడా ఈ శోభకూ దాని ప్రభావానికీ లోనయి చాలా ఆనందంగా చాలా చిన్నదానిలా అన్పించింది. నన్ను వివాహం చేసుకున్నప్పటినుంచి ఆమె చాలా ఇబ్బందులకు గురయ్యింది. ఆమె లండన్ నగరాన్ని తిలకిస్తుండగా ఆ ఎండ పొడ ఆమె నల్లని కురులపై నాట్యం చేస్తున్నది – మొదటిసారిగా ఒకటి రెండు తెల్లని దారాలు ఆమె కురుల్లో కనిపించాయి – నేను ఏమీ మాట్లడలేదు. ఆమె 'నాకు లండన్ బాగా నచ్చింది' అన్నపుడు నేను ఆమెకు దాసోహం అయిపోయాను!

మేమిద్దరం లీసెస్టర్ స్క్వేర్, పికాడిల్లీ ప్రాంతంలో తిరుగుతున్నప్పుడు, అవి ఇప్పుడు అమెరికా సంస్కృతితో ఎలా మారిపోయామో చూశాము. హాట్‌డాగ్స్ అమ్మే బడ్డీలూ, మిల్క్‌బార్ కౌంటర్లూ మిగతా చెత్తాచెదారంతో మచ్చలు పడినట్లనిపించింది. కుర్రవాళ్లు (టోపీలు లేకుండా) – అమ్మాయిలు బ్లూ జీనుపాంట్లతో తిరుగుతున్నారు. నాకు పాతరోజులు గుర్తుకు వచ్చాయి. చక్కగా బట్టలు వేసుకుని, పసుపచ్చ గ్లోవ్స్‌తో చేతిలో కర్రతో నడిచే పెద్ద మనుష్యులు గుర్తుకు వచ్చారు. ఇప్పుడు ఆ ప్రపంచం, ఆ రోజులూ పోయాయి. మార్పు వచ్చేసింది.

మన కళ్లు చూసేదివేరు, ఆ ప్రదేశాలు మరొకవిధంగా మారుతుంటాయి. మగవాళ్లు జాజ్ సంగీతంతో ఏడుస్తున్నారు. హింస ఇప్పుడు శృంగారమయంగా మారింది.

అవును కాలం ఎవరికోసమూ ఆగదు.

నం 3 పోనాల్ టెర్రేస్ చూడటానికి వెళ్లాం – ఆ ఇల్లు ఖాళీగా వుంది. ఎప్పుడైనా పడిపోవచ్చు. అక్కడ నుంచి, 287 కెన్నింగ్‌టన్ వీధిలోకి వచ్చాం. ఇక్కడేగా నేనూ సిడ్నీ నాన్నతోపాటు వున్నాం!

బెల్‌గ్రేవియా మీదుగా వెళ్లాం. ఒకప్పుడు నియోన్ దీపాల వెల్తురులో తడిసిన ఆ గదులు ఇప్పుడు పొడవాటి అద్దాల పిచ్చిక గూళ్లుగా మారిపోయాయి. ఇదంతా అభివృద్ధి పేరుతోనే.....

మాకు చాలా సమస్యలున్నాయి. మొదటిగా అమెరికానుంచి నా సొమ్ములన్నీ తెచ్చెయ్యాలి. అంటే ఊనా కాలిఫోర్నియా వెళ్లి నా సేఫ్ డిపాజిట్ తెరిచి డబ్బు బాండ్ల డాక్యుమెంట్లూ మిగతా రత్నాలూ కెంపులూ అన్ని తేవాలి. ఆ విధంగా ఊనాకు విమానంలో ప్రయాణపు ఏర్పాట్లు చేశాను. ఆమె పదిరోజుల తర్వాత తిరిగి వచ్చింది. అక్కడ ఏమి జరిగిందీ వివరంగా చెప్పింది.

ముందుగా బాంకుకు వెళ్లింది. ఆమె సంతకాలు సరిచూసి గుమస్తా తర్వాత ఆమెను పరీక్ష చేశాడంట. ఆ తర్వాత బాంకు మేనేజరుతో సుదీర్ఘంగా చర్చించాడు ఈలోగా ఊనాకు చాలా ఆందోళన కలిగిందని చివరకు డిపాజిట్ లాకరు తెరిచారని చెప్పింది.

బాంకులో పని అయిపోయిన తర్వాత బెవర్లీ హిల్స్ ఇంటికి వెళ్లిందట. అక్కడ అంతా ఎలా వదిలిపెట్టామో అలాగే వుందట. అక్కడ పూలూ పచ్చికా అంతా బాగానే వున్నాయట.

ఇంట్లో కాస్సేపు నిలబడి ఉద్విగ్నానికి లోనయిందట. తర్వాత మా బట్లరు హెన్రీ కలిశాడట. మేము వచ్చిన తర్వాత ఎఫ్.బి.ఐ. వాళ్లు రెండుసార్లు ఫోన్ చేశారట. హెన్రీని ప్రశ్నలతో విసిగించారట. నా గురించి అన్నీ కూపీలాగటానికి ప్రయత్నించారట. ఎప్పుడైనా నగ్నసుందరమణులతో పెద్దపెద్ద పార్టీలు ఇచ్చానా? అని – ఈ ఇంట్లో

ఏమి జరిగేదీ అని? హెన్రీ చెప్పాడట, 'ఆయన భార్యాపిల్లలతో హాయిగా వుండేవారు' అని. అతని జాతీయత ఏమిటని. అతని పాస్‌పోర్టు చూపించమని. ఈ దేశంలో ఎన్నాళ్ళ నుంచి వుంటున్నారని.

ఊనా ఇదంతా విన్నతరవాత విరక్తిచెందింది – అంతకుముందు వున్న ఉద్విగ్నత ద్వేషంగా మారిందనుకుందట.

తర్వాత హెలెన్ (మా కుక్) ఊనాని పట్టుకుని కళ్ల నీళ్లు పెట్టుకుందట – ఆ కన్నీళ్లు కూడా ఊనాను అక్కడ ఆపలేకపోయాయి. వెంటనే తిరుగు ప్రయాణం చేసింది – ఇదీ సంగతి.

నా స్నేహితులు అడుగుతారు. అసలు ఈ అమెరికా విద్వేషం ఎలా మొదలయింది, ఎందుకు నన్ను ఈ విధంగా ఇబ్బందిపాలు చేశారు? అని.

నేను చేసిన పాపం నేను ఏ సిద్ధాంతానికీ కట్టుబడి వుండక పోవడం. నేను కమ్యూనిస్టుని కాకపోయినా, వాళ్లలాగా కమ్యూనిస్టులను ద్వేషించటాన్ని వాళ్లతో కలవలేదు. ఇది ముఖ్యంగా వాళ్ల అహాన్ని దెబ్బకొట్టింది. ముఖ్యం అమెరికన్ లీజియన్. వాళ్లు నిజానికి చాలా మంచి పనులు చేశారు. మాజీ సైనికులకోసం. జి.ఐ. బిల్లు తెచ్చారు. వాళ్ల పిల్లలకు అన్ని సౌకర్యాలూ కలిగించారు. ఇదంతా మానవతా దృక్పథంతో చేసిందే. కాని వాళ్లవాళ్లు పరిమితులు మించి వారి హక్కులను మించి ప్రవర్తించటం – అదీ దేశభక్తి ముసుగులో ఇతరుల స్వాతంత్ర్యాన్ని హరించటానికి ప్రయత్నించటం – అమెరికా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టటమే. ఇలాంటి అత్యుత్సాహవంతులు అమెరికాను శాడిస్టు దేశంగా మార్చే ప్రమాదం వుంది. రెండోది: వాళ్లు పెట్టిన అన్–అమెరికన్ కమిటీని నేను వ్యతిరేకించటం. అసలు ఆ మాటే సరి అయినదికాదు. ఇలాంటివే సాగదీసి ఎవరైనా తన అభిప్రాయాన్ని తెలిపేందుకు గొంతు విప్పితే ఆ గొంతు నొక్కేస్తారు.

మూడోది: నేను ఎప్పుడూ అమెరికన్ జాతీయత తీసుకోవటానికి ప్రయత్నించలేదు. అలాగే ఎన్నో వేలమంది అమెరికన్‌లు ఇంగ్లాండులో ఉద్యోగం వ్యాపారరీత్యా ఉంటున్నారు. వీలైనప్పుడు ఇంగ్లీషు జాతీయతకోసం దరఖాస్తు పెట్టుకోలేదు. యమ్.జి.యమ్ కంపెనీ కార్యదర్శి వారానికి వేలల్లో సంపాదించేవాడు. ఇప్పటికీ 35 ఏళ్లుగా లండన్‌లో వుంటున్నాడు – ఎప్పుడూ బ్రిటీష్ జాతీయుడుగా మారాలనుకోలేదు. ఇక్కడ ప్రభుత్వం ఎప్పుడూ ఆ విషయంలో కలగచేసుకోలేదు.

ఇలా చెప్తున్నానని నేను క్షమాపణలు అడగటంలేదు. ఈ సొంతకథ రాసేముందు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అసలు ఎందుకు రాయాలి అని. నాకు చాలా అవసరాలు కనిపించాయి. కాని క్షమాపణ ఆలోచనే రాలేదు. కాని నా పరిస్థితిని పూర్తిగా అందరికీ తెలియజేయాలికదా. కాని ఒక్క విషయం: అధికారంకల కనిపించని ప్రభుత్వాలు, వీటిమూలంగానే నేను ఒక దేశపు ద్వేషాన్ని లేదా వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. ఆ విధంగా అమెరికా పౌరుల ప్రేమకు దూరం కావలసి వచ్చింది!

'లైమ్‌లైట్' లండన్‌లో ఓడియన్ థియేటర్‌లో ప్రదర్శనకు బుక్ అయ్యింది. నేను చాలా ఆందోళనకు గురయ్యాను. ఇది మామూలు చాప్లిన్ హాస్య చిత్రం కాదు. ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో? ఈ ప్రదర్శనకు ముందు పత్రికలవాళ్లకు ప్రదర్శన (షో) ఏర్పాటు చేశాము. ఈ మధ్య జరిగిపోయిన కాలం నన్ను ఆ సినిమాకు దూరంచేసింది. కాని ఈ షో చూసిన తర్వాత నేను చాలా కదిలిపోయాను. ఇది నా గొప్పకోసం చెప్పడంలేదు.

ఎప్పుడైనా నా సినిమాలో కొన్ని సన్నివేశాలు బాగా నచ్చుతాయి. కొన్నింటిని భరించలేనూ – కాని సినిమా చూస్తూ నేను ఎప్పుడూ ఏడ్వలేదు (ఇలా అని ఒక రిపోర్టర్ రాశాడు) ఒకవేళ రెండు కన్నీటిబొట్లు రాలిస్తే మటుకు అతనికి ఏమిటట? నా కల్పనకు నేనే కదలకపోతే సామాన్య జనం ఎలా తీసుకుంటారు?

నిజానికి నా కామెడీలు ప్రేక్షకులకంటే నాకే బాగా నచ్చుతాయి. ఈ సినిమా మొదటి ప్రదర్శన విరాళంకోసం వేశాము. ప్రిన్సెస్ మార్గరెట్ వచ్చింది. ఆ మర్నాడు ప్రేక్షకులకోసం విడుదల చేశాము. పత్రికలవాళ్ళు ఏమి చెప్పినా ఈ సినిమా ప్రపంచ రికార్డులన్ని అధిగమించింది. ఏ అమెరికా నన్ను బహిష్కరించిందో ఆ అమెరికాలో నా పూర్వపు అన్ని సినిమాలకంటే ఎక్కువ వసూలు చేసింది.

మేము పారిస్ వెళ్ళేముందు మమ్మల్ని లార్డ్ స్ట్రాబోల్లి హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో విందుకు పిలిచారు. నేను హెర్‌బర్ట్ మోరిసన్ ప్రక్కన కూర్చున్నాను. ఆయన అణ్వాయుధాలను సమర్థించటం నేను జీర్ణించుకోలేకపోయాను. మనం ఎన్ని అణ్వాయుధాలు తయారు చేసుకున్నా అసలు ముప్పు ఇంగ్లాండుకే. ఇది చిన్న దీవి – మనం నాశనం అయిన తర్వాత ఎన్ని బాంబులు ఎవరిమీద వేసినా ఉపయోగం ఏముంది?

ఇంగ్లాండు ఎప్పుడూ పూర్తిగా తటస్థంగా వుండడం మంచిది. అప్పుడు ఈ అణ్వాయుధాల భయంనుంచి బయట పడవచ్చు కాని ఈ అణ్వాయుధాలను చాలామంది తెలివిగలవాళ్లూ – రాజకీయ నాయకులూ సమర్థిస్తున్నారు.

లార్డ్ సాలిస్‌బరీ కూడా మారిసన్ దృక్పథాన్ని సమర్థిస్తున్నారు. నా అభిప్రాయాలు వాళ్లకు ఏమాత్రం రుచించలేదని తెలుసుకున్నాను.

ఈ సందర్భంగా ఇప్పటి ప్రపంచ పరిస్థితిని ఒక్కసారి చూద్దాం.

ఇప్పటి ఆధునిక జీవితంలోని సంక్లిష్టతలు – యంత్రీకరణ, ఇది 20వ శతాబ్దంలో పూర్తిగా మన జీవితాలను శాసిస్తోంది. వ్యక్తి స్వాతంత్ర్యం – పెద్దపెద్ద సంస్థలు, సంఘాలు, ఇవి సాంకేతికంగా, రాజకీయంగా, శాస్త్రపరంగా ఇంకా ఆర్థికంగానూ వ్యక్తిని ఆక్రమిస్తున్నాయి. ఈ సంస్థల, ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల కోసం మనం పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఈ గందరగోళానికి – మనల్ని మనమే గురిచేసుకుంటున్నాం. ఎందుకంటే మన సాంస్కృతిక దృష్టిని మరల్చుకోలేకపోవటమే. మనం అందానికి అంధులమైపోయాము. అనాకారాన్నీ, ఆక్రమణలనూ ఆహ్వానిస్తున్నాము. మన స్పందనలన్నీ మొద్దుబారిపోయాయి. ఎందుకు లాభార్జనలో పడి, అధికార దాహంతో, ఇంకా నియంతృత్వంతో మనం తెలిసి తెలిసి ఈ ప్రమాదకరమైన శక్తులను ఆహ్వానించి వాటికి బందీలమైపోయాము? దీనివల్ల అంతులేని అనర్థాలు తెచ్చుకుంటున్నాము?

శాస్త్రజ్ఞానం ఏమి చేస్తోంది? రాజకీయ నాయకులకు మిలిటరీకోసం ఊడిగం చేస్తోంది. వాళ్ల చేతుల్లో కీలుబొమ్మైపోయింది. వాళ్ల చేతుల్లోనే ఈ భూమ్మీద వున్న జీవరాసుల అదృష్టం ఆధారపడి వుంది.

ఈ అధికారం ఎవరి చేతుల్లోకి వెళ్తోంది? నైతికంగా అంత బలవంతులూ బాధ్యత లేని వాళ్ళూ మేధోపరంగా అధోగతితో వున్నవాళ్ళూ ఇలాంటివాళ్లు దేశాధిపతులయితే వీరి చేతుల్లోనేగా మానవజాతి ప్రాణాలు ఆరిపోయే దీపాలయ్యేది? కాని మనకు వేరే దారేది?

డా. జె. రాబర్ట ఓపెన్ హూమర్ ఒకసారి చెప్పాడు మనిషి తెలుసుకోవాలనే కోరికతో పరుగులు పెడతాడు. కాని దాని పర్యవసానం ఎప్పుడు తెలుస్తుంది? కొందరు శాస్త్రజ్ఞులు మతాధిపతుల్లా వ్యవహరిస్తారు. వాళ్లు తెలుసుకోవటానికి పరుగులు పెడతారు. వాళ్లు తెలుసుకున్నదంతా మంచికేనంటారు!

మనిషి ఎప్పటికీ సహజ లక్షణంతోనే, అదీ బ్రతకాలనే సహజ లక్షణంతోనే వుంటాడు. దీని పర్యవసానం? అందుకని అతని బుద్ధిముందు, అతని మనసు తర్వాత

– ఆ విధంగా ఈ శాస్త్రవిజ్ఞానం చాలాచాలా ముందుకు వెళ్ళింది. మానవుని నైతిక జీవనం చాలా వెనకబడి వుంది. నిబద్ధతా నిజాయితీ ఇవి చాలా మెల్లగా ప్రయాణం చేస్తాయి. అభివృద్ధిపథంలో దీనిది ఎప్పుడూ శాస్త్రవిజ్ఞానం వెనకే నడుస్తూ కుంటుతూ వస్తుంది. పరిస్థితుల ప్రభావంతోనే ఈ సర్వజన సమానత్వం ముందుకు రావటానికి ప్రయత్నిస్తుంది.

ప్రపంచంలో పేదరికం తగ్గించగలిగామా? ఇప్పుడు వున్న సేవా కార్యక్రమాల వలనగానీ, ప్రభుత్వాల వలన గానీ?

ఏమయినా జరిగితే హేతుబద్ధంగా, ఇతర శక్తులవలనే జరగాలి? కారలైల్ 'ఈ ప్రపంచానికి విముక్తి కేవలం ఆలోచనాపరుల వలననే వస్తుంది! ఇది జరగాలంటే పరిస్థితులు ప్రమాదకరంగా మారాలి!' అని అన్నాడు.

అణువును బద్దలుకొట్టటంతో జరిగిన అనర్థానికి మనిషి మూలకు వెళ్లి కూర్చుని ఆలోచించటం మొదలుపెట్టాడు! అంటే తనను తను నాశనం చేసుకోవచ్చు – లేదా బుద్ధిగా బ్రతకవచ్చు!

శాస్త్రవిజ్ఞానంలో జరిగే ఆవిష్కరణలు అతన్ని ఏదో నిర్ణయం తీసుకోవలసిన పరిస్థితులలోనికి నెట్టుతున్నాయి.

ఈ పరిస్థితులలో మానవుని మంచితనం వర్ధిల్లుతుందని అతని 'సర్వేజనా సుఖినోభవంతు' మంత్రం, బ్రతికి బట్ట కడుతుందని ఆశిద్దాం.

అమెరికా వదిలిపెట్టటం ఒక ఎత్తు. ఇప్పుడున్న జీవితం మరొక ఎత్తు:

పారిస్‌లో రోమ్‌లో మమ్మల్ని హీరోలలాగా ఆహ్వానించారు. ఫ్రాన్స్ అధ్యక్షులు విన్సెంటు ఆరియోల్ విందుకు పిలిచాడు. బ్రిటీష్ ఎంబసీవారు విందిచ్చారు. ఫ్రెంచి ప్రభుత్వం నన్ను 'వీజియన్ ఆఫ్ ఆనర్'తో గౌరవించి ఆఫీసర్ రాంకుకు ఎత్తారు! అదేరోజు 'డ్రమటిక్ ఆర్ట్ సొసైటీ'వారు గౌరవ సభ్యునిగా చేర్చుకుని అభినందిస్తూ, అధ్యక్షులు రోజర్ ఫెర్డినాన్డ్ ఉత్తరం రాశాడు. దాని సారాంశం:

ప్రియమైన చార్లీ,

మేము మిమ్మల్ని ఎందుకు ప్రేమిస్తున్నామో, ఎందుకు అభిమానిస్తున్నామో ఇక్కడకు మీ రాకను ప్రచారం చేసేవారికి తెలియకపోవచ్చు – వారికి మానవతా విలువల

అంచనాకూడా అంతగా అవగాహన వుండి వుండకపోవచ్చు. అంతేనా, మీరు గతనలభై సంవత్సరాలుగా మానవాళిపై కురిపిస్తున్న ఆశీస్సులను వారు లెక్కించలేరు కూడా. మీ సందేశాలనూ, మీరందించిన ఆనంద ఉద్వేగాలనూ విలువల గురించి కూడా వారికి తెలిసి వుండకపోవచ్చు – అది వారి విశ్వాస రాహిత్యమే అనుకోవాలేమో.

మీరు ప్రపంచంలోని ప్రముఖ వ్యక్తులలో ఒకరు. మీకు లభించిన కీర్తి ప్రతిష్ఠలు ఏ కొద్దిమందికో దక్కుతాయి.

ముందుగా, మీ మేధాసంపత్తి గురించి: ఈ మాట సరైన అర్థంలో వాడబడడం లేదు. కాని మీ విషయంలో, ఒక హాస్య నటునిగానే కాక, రచయితగా, సంగీత దర్శకునిగా, నిర్మాతగా, అన్నిటికీ మించి ఒక గొప్ప వ్యక్తిగా, ఈ మేధాసంపత్తి అనే మాట సరిగ్గా సరిపోతుంది, అర్థవంతంగా. ఎందుకంటే ఇవన్నీ మీరు సమర్థవంతంగా నిర్వహించారు. అంతేకాదు, మీ ఒదిగి వుండే స్వభావం – మీ వ్యక్తిత్వాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. దానికోసం ఏ మాత్రం శ్రమా, ప్రణాళికలూ లేకుండానే – అది ఈనాడు సామాన్యుల హృదయాలను వెచ్చగా తాకుతుంది. మీరు లోనయిన కష్టాలు – అనుభవించిన పేదరికం మీ హృదయాన్ని వేదనకు గురిచేసినవే –

కాని మేధ ఒక్కటే గౌరవం పొందటానికి సరిపోదు. అది ఇతరుల నుండి ప్రేమ పొందేందుకు చాలదు. కాని ప్రేమనే మాటకీ మీరు మీ భావనలో ప్రేరణ కలిగించారు.

మేము 'లైమ్ లైట్' చూసినపుడు నవ్వాము. చాలా హాయిగా, మేము దుఃఖించాము, నిజాయితీగానే. ఆ కన్నీళ్లు మీవే. ఎందుకంటే మీరే కన్నీళ్ల విలువ మాకు తెలియజేశారు!

నిజానికి, నిజమైన కీర్తిని మనం దొంగిలించలేం. తస్కరించలేము. ఆ కీర్తి అనేది ఒక భావన, ఒక విలువగలిగిన, కాలపరిమితితో వచ్చేది. అది మంచికే ఉపయోగపడాలి.

మీ విజయపరంపరలోని రహస్యం, అది ఏ నియమాలకూ లొంగక, తెలివిని ప్రదర్శించేది కాక, మీ స్వీయ జీవన యానంలోని ఒడిదుడుకులతో, ఆశా నిరాశలతో, పునీతమైనది. మన శక్తికి మించిన బాధల్లో మరొకరి దయకోసం ఎదురుచూపే, నిరంతరం వెచ్చని గూడుకోసం, ఆశపడుతూ, ఒక్కక్షణం వేదననంతా మరచిపోవాలని తపించేవారికి మీ హాస్యం ఒక ఓదార్పు.

మాకు తెలియకపోయినా, కనీసం ఊహించగలం – మమ్మల్ని నవ్వించి ఆనందపరచటానికి (అంతలోనే కన్నీళ్ళు) మీరు మీ జీవితంలో ఎంతగా కష్టాలను

చవిచూశారో. మమ్మల్ని ఎంతగానో కదిలించిన చిన్నచిన్న విషయాలు – అదీ ఎంతో వివరంగా, మీరు చూపేందుకు ఎంతగా ఎన్ని బాధలు అనుభవించారో మీ జీవితంలో మేము లీలామాత్రంగానైనా ఆలోచించగలము. అవన్ని మీ జీవన శకలాలే అనుకుంటాం.

మీ జ్ఞాపకశక్తి చాలా శక్తివంతమైనది. మీ చిన్ననాటి జ్ఞాపకాలన్నీ పదిలంగా గుర్తుంచుకోవటమేకాదు, ఆ స్మృతులను మీరు ఎంతగా గౌరవించారు! దానిలోని విచారాన్నీ శోకాన్నీ వాటినుంచి మాలాంటి వాళ్లను తప్పించాలని తపించారు. అందరికీ జీవితంపై ఆశగలిగేట్లు చేశారు. మీ కష్టాల కౌమారాన్ని ఎప్పుడు మరిచిపోలేదు. మీకు లభించిన కీర్తి ప్రతిష్టలు మీ గతాన్ని దూరంచేయలేక పోయాయి.

మీకున్న సంపత్తి – మీ స్మృతులే ననుకుంటాము. దీనివల్లే అభిమానులు మిమ్మల్ని ప్రేమిస్తారు. మీ నటనలోని చిలిపితనానికి స్పందిస్తారు. మీరు ఎప్పుడూ వారితో నేరుగా మాట్లాడుతున్నట్లు వుంటుంది. మీలో రచయిత – నటుడు, దర్శకుడు, ఈ మువ్వురు ముప్పేట పెనకేసుకుని పోయారు. ఆ బలమే మానవజాతి శ్రేయస్సుకుపయోగపడింది.

అందుకనే పనిలోనే పరమార్థముంది. దానిని ఏ సిద్ధాంతాలూ అడ్డుకోలేవు. అది అరుదుగానైనా – సాంకేతికంగా, అది ఎప్పటికీ ఒక ఒప్పుకోలు – ఒక నమ్మకం – ఒక ప్రార్థన!

ప్రతివ్యక్తీ మీకు సహచారుడే, ఎందుకంటే అతను మీతోనే మమేకమవుతున్నాడు.

కేవలం మీ ప్రజ్ఞాపాటవాలతోనే విమర్శకుల నోళ్లు మూయించారు. వారిని శాంతింపచేశారు. ఇది చాలా కష్టమైనదే. ఈ విమర్శకులు ఎప్పటికీ మిమ్మల్ని పాత మెలోడ్రామా వైభవంతోనే, ఫేడూ ఉత్సాహంతోనే చూస్తారు. కాని మీరు అంతకంటే సొగసుగా (మాకు మూసే (Musset) గుర్తువచ్చేట్లు) ఎవ్వరినీ అనుకరించకుండానే అలరించగలరు.

అదే మీ కీర్తి రహస్యం!

ఈరోజు మా సంఘం మిమ్మల్ని గౌరవించటంలో, మిమ్మల్ని స్వాగతించటంలోని ఆనందాన్ని పొందగలుగుతున్నాము. మేము మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నామో చెప్పటానికి తహతహలాడుతున్నాం. మాలో ఒకనిగా మిమ్మల్ని నిజాయితీగా ఆహ్వానిస్తున్నాం. మీ సినిమాల్లో కథ – చార్లీ రాస్తారు. అలాగే సంగీతం, దర్శకత్వమే ఆయనే చేస్తారు! వీటన్నిటికీ తోడు హాస్యనటుని వేషం! అదీ అద్భుతంగా!

మీకోసం ఇక్కడ ఫ్రాన్సు దేశపు రచయితలూ, సినిమా కథకులూ, నాటకాలు రాసేవారూ, సంగీత దర్శకులూ, నిర్మాతలూ అందరూ మీలాగే, వారి వారి వ్యాపకాల్లో ఆరితేరిన వాళ్లు – అందుకోసం త్యాగం చేసినవాళ్లు – వున్నారు. వీరంతా జనసామాన్యాన్ని ఆనందపరిచే పవిత్రకార్యంలో, వారికి కష్టాల పార్శ్వాన్ని పరిచయం చేసే పనిలో, భగ్నప్రేమ భయాన్ని, దురదృష్టవంతుల దీనత్వాన్ని ఇవన్నీ తెలియజేప్పే పవిత్ర కార్యంలో కంకణబద్ధులై, శాంతికాముకులై సహజీవనానికి చేతులు చాచి నిలబడ్డారు.

మీకు ధన్యవాదాలు

చాప్లిన్. మీ –రోజర్ ఫెర్డినాండ్!

'లైమ్‌లైట్' ప్రదర్శనకు పారిస్‌లో ప్రముఖులు చాలామంది విచ్చేశారు. వారిలో ఫ్రెంచి మంత్రివర్గ సభ్యులు, అన్నిదేశాల రాయబారులూ వున్నారు. కాని అమెరికా రాయబారి రాలేదు!

'ఫ్రెంచ్ కామెడీ' థియేటర్‌లో మోలియర్ ప్రదర్శన డాన్‌జాన్ సమయంలో మమ్మల్ని ప్రత్యేక అతిథులగా ఆహ్వానించారు. డాన్‌జాన్ ప్రదర్శన అద్భుతంగా ఫ్రెంచి నటీనటులూ అందరూ గొప్పవారి – ఆధ్వర్యంలో జరిగింది. ఆ రాత్రి రాజభవనం జలయంత్రాలన్ని రంగురంగు దీపాలతో అలంకరించారు. అక్కడ నన్నూ–ఊనానూ విద్యార్థులెందరో కలిశారు. వీరంతా 'ఫ్రెంచ్ కామెడీ' థియేటర్‌లో చదువుతున్నారు. అందరూ పద్ధెనిమిదవ శతాబ్దపు దుస్తుల్లో కొవ్వొత్తులు పట్టుకుని మమ్మల్ని 'గ్రాండ్ సర్కిల్' వరకూ అనుసరించారు. అక్కడ ఐరోపాలోని అందగత్తెలంతా వున్నారు.

ఇక రోమ్‌లోకూడా నా గౌరవార్థం అధ్యక్షులూ – మంత్రులూ నాకు ఆహ్వానం పలికారు.

ఈ సందర్భంలో 'లైమ్‌లైట్' ప్రదర్శనకు ఒక థియేటర్ దగ్గర లలిత కళల మంత్రిగారు నన్ను 'మీరు వెనకవైపుంచి రండి ఇటు చాలా పెద్ద గుంపు వుంది' అన్నారు. నేను 'వాళ్లు నన్ను చూడటానికే కదా వచ్చారు – కనపడితే ఏమి?' అన్నాను. 'మీ మంచికే చెప్తున్నాను' అన్నారు. నేను వినలేదు – నాకోసం కేటాయించిన పెద్ద కారులోంచి థియేటర్ ముందు దిగాను. రోడ్డుకు అవతల జనాన్ని అడ్డుగా తాడుకట్టి పోలీసు

ఆపుతున్నారు – నాకు ఉత్సాహం పెరిగి కారు దిగిన తరువాత వారికీ కారుకూ మధ్యలో నిలబడి రెండు చేతులూ ఎత్తి అభివాదం చేశాను (డీ–గాల్ ఇలాగే చేస్తారు) ఏమి జరుగుతుందో తెలిసేలోపు నా మీదకు టవోటాలూ, కాబేజీలూ వచ్చిపడుతున్నాయి. నా వెనకనే వున్న ఇటాలియన్ స్నేహితుడు "ఇలా జరుగుతుందని మాకు తెలుసు" అన్నాడు. నన్ను జాగ్రత్తగా లోపలికి తీసుకు వెళ్లి కూర్చోపెట్టాడు. అప్పుడు ఆ మొత్తం సంఘటనలలోని హాస్యం – నాకు వెలిగింది. విరగబడి నవ్వాను. నాతో ఇటాలియన్ స్నేహితుడూ నవ్వకుండా వుండలేకపోయాడు.

తర్వాత పోలీసు వచ్చి 'మీరు ఎవరిమీదైనా కేసు పెడ్తారా' అని అడిగాడు – 'అబ్బే, వాళ్లు చిన్నపిల్లలు – అంతా 14 ఏళ్లలోపు వాళ్లు' కేసు గీసూ వద్దండీ' అని ఆ విషయాన్ని అంతటితో ముగించాను.

రోమ్ రాకపూర్వం పారిస్‌లో, లూయీ ఆరగోన్ (లూయిన్ ఆర్గన్) ఈయన కవి, 'లెస్ లెటర్స్'కు సంపాదకుడు. నాకు ఫోన్‌చేసి జాన్‌పాల్ సాత్రే, పికాసో నన్ను కలవాలని అంటున్నారని చెప్పారు. వారిని నేనే విందుకు పిలిచాను. ప్రశాంతంగా వుండేందుకు నా హోటల్ గదులలోనే కూర్చున్నాము. హారీ (నా పబ్లిసిటీ కార్యదర్శి) 'మీరు వాళ్లను కలుస్తున్నారా? చాలా ప్రమాదం సుమా' అన్నాడు.

'ఇప్పటివరకు మనం చేసిన మంచి పనులన్నీ మట్టికొట్టుకుపోయినట్లే' అన్నాడు.

'హారీ ఇది ఐరోపా, అమెరికా కాదు' అన్నాను. వీరిద్దరూ ప్రపంచ ప్రముఖులయిన ముగ్గురులో ఇద్దరు తెలుసా' అన్నాను.

నేను ఇంతవరకూ ఎవరికీ నేను మళ్లీ అమెరికా వెళ్లే ఆలోచనే పెట్టుకోలేదని చెప్పలేదు. అక్కడ నేను అమ్మవలసిన ఆస్తులు చాలా వున్నాయి.

బహుశా హారీ, నేను సాత్రేనూ, పికాసోనూ కలిసి అమెరికా ప్రభుత్వాన్ని కూలదోస్తానని అనుకున్నాడేమో! కాని హారీ కూడా విందుకు వుంటానన్నాడు – అప్పుడు 'హారీ తర్వాత స్టాలిన్ వచ్చి చేరతారు' అన్నాను. అంతే హారీ ఇక ఆ చుట్టుపక్కల కనపడలేదు!

ఆ సాయంత్రం ఎలా గడుస్తుందోనని ఆందోళన పడ్డాను. ఆరగాన్ చాలా అందగాడు – పికాసో పెద్ద సమస్యలా కనపడతారు, ఒక సర్కస్ బఫూన్‌లా వుంటారు! ఆయన్ను చూసి ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడని ఎవ్వరూ అనలేరు. ఇక సాత్రే ఆయన

మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. ఆయన ముఖ కవళికలు చిత్రంగా వున్నా ఒక రకమైన అందం తెలివీ వెలుగుతుంటాయి.

విందు అయిన తర్వాత పికాసో ఆయన స్టూడియోకు (ఇది సీన్ నది ఎడమవైపు ఒడ్డున వుంది) చాలా పాతది. తీసుకువెళ్లారు. రెండు అంతస్తులు ఎక్కాము. అక్కడ "ఇది పికాసో స్టూడియో కాదు – మరో అంతస్తు పైకి వెళ్లండి" బోర్డు వుంది!

చివరికి ఆయన స్టూడియోలోకి వెళ్ళాం – అంత ఛండాలపు రేకుల షెడ్డు స్టూడియో ఎక్కడా చూడలేదు. (ఇలాంటిచోట 'లేడీ ఛాటర్‌టన్' కూడా చనిపోవటానికి ఇష్టపడదేమో) ఒక మేకుకు ఒక బల్బు వేలాడుతోంది. దాని వెల్తురులోనే ఒక మూల ఇనప మంచం ఒకటి వుంది, పనికిరాని పొయ్యి కూడా కనిపించింది.

అప్పుడు పికాసో 'సిజాన్' చిత్రాన్ని తీసి దుమ్ము దులిపారు. అంత అందమైన చిత్రాన్ని ఎప్పుడూ చూడలేదు. ఆ విధంగా ఒకదాని తర్వాత ఒకటి తీస్తూనే వున్నారు.

నాకు నోటివరకూ వచ్చింది – 'ఈ మొత్తం ఇచ్చేయండి – మీకు ఇంత మొత్తం ఇస్తాను' అని అందామని! ఆ విధంగానైనా ఈ స్టూడియోని శుభ్రంగా వుంచవచ్చు!

ఆ చీకటి గృహంలో ఒక బంగారు గని వుంది!

ముప్ఫై ఒకటవ అధ్యాయం

ఇంపుగా ముగింపు

ముందుగా ఆ ప్రదేశాన్ని చూసినప్పుడు – అది మాకు అందుబాటులో వుంటుందనుకోలేదు. మా ఆదాయం, అంత విశాలమైన నివాస స్థలాన్ని కొని ఉపయోగించటానికి సరిపోతుందనీ అనుకోలేదు.

కాని దాని యజమాని మాకు అతను ఆశించే ఖరీదు చెప్పినప్పుడు మాత్రమే మేము ఆ ఎస్టేటును తీసుకోవటానికి నిర్ణయించుకున్నాము.

ఆ విధంగా స్విట్జర్లాండ్‌లో కోర్సియర్ అనే వూరిలో నివసించటానికి ఏర్పాట్లు చేసుకున్నాను. ఆ వూరి జనాభా 1350 మాత్రమే!

తరువాత దాదాపు సంవత్సరకాలం పట్టింది – నా అమెరికన్ ఆస్తులన్నీ అమ్మి సొమ్ము చేసుకోవటానికి. ఈ లోపు పిల్లలు కోర్సియర్ వూరి బడిలోనే చదువు సాగించారు. మొదట్లో ఫ్రెంచి నేర్చుకోవటానికి కొంచెం ఇబ్బందిపడినా – తరువాత చాలా బాగా అలవాటుపడి ధారాళంగా మాట్లాడడం – చదవటం నేర్చారు. స్విస్ వాతావరణానికి, పరిసరాలకీ బాగా అలవాటుపడి సర్దుకుపోయాము.

అమెరికాతో వున్న అన్ని సంబంధాలూ మెల్లగా వదిలించుకోవాలని ప్రయత్నించి – నా రీ ఎంట్రీ పర్మిట్ అమెరికా కాన్సుల్ ఆఫీసులో ఇచ్చివేశాను. "ఏమిటి, మీరు తిరిగి అమెరికా వెళ్లరా చార్లీ?" అన్నాడు అధికారి. 'లేదండీ! మళ్లీ వెళ్లి, ఆ తతంగం అంతా నడిపే వయసు మీరిపోయింది!" అన్నాను.

'సరే – మీరెప్పుడైనా అమెరికా వెళ్లవచ్చు – మామూలు వీసాతో' అని ప్రోత్సాహించాడు – 'నేను స్విట్జర్లాండులోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాను' అన్నాను.

తరువాత ఊనా తన అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవటానికి నిర్ణయించుకుంది. దానికోసం లండన్‌లోని అమెరికన్ ఎంబసీకి వెళ్లాము. దాదాపు గంటపైగా పట్టవచ్చు అన్నారు. నాకు చాలా కోపం – (బహుశా ఇది చాలాకాలంగా నాలో అణిగివుందేమో) వచ్చింది.

"ఏమిటీ నాన్‌సెన్సు – ఊనా, పద నీతో నేను వస్తాను" అని గట్టిగా అన్నాను. ఇంతలో అక్కడి గది తలుపు తెరుచుకుంది. "హలో చార్లీ – లోపలికి రండి" అనిపిలిచాడు.

అప్పుడు ఆయన "అమెరికా పౌరసత్వం వదులుకునే వ్యక్తి సరైన మానసిక స్థితిలో వున్నారని మేము నిర్ధారించుకోవాలి కదా' అన్నాడు ఎంతో సౌమ్యంగా. అప్పుడు నాకు అర్థమయ్యింది, దీనిలో వున్న సమస్య. ముందుగా కేకలు పెట్టినందుకు సిగ్గుపడ్డాను.

'మిమ్మల్ని డెన్వర్ థియేటర్లో చూశాను' అని అధికారి అన్నప్పుడు ఇంకా కరిగిపోయాను. అప్పటిరోజులు, ఆ సమయం గురించీ ఆప్యాయంగా కబుర్లు చెప్పుకున్నాం. తరువాత వీడ్కోలు చెప్పి విచారంగానే బైటకు వచ్చాం.

లండన్‌లో అప్పుడప్పుడూ స్నేహితులు కలిసేవాళ్లు. పాత, కొత్త స్నేహితుల్ని కలిసినపుడు ఎంతో హాయిగా అన్పించేది. అలాంటి ఒకసారి – మాకు వచ్చిన సమాచారం కృశ్చేవ్, బుల్గానిన్ మమ్మల్ని కలవాలనుకుంటున్నారని! అదీ సోవియట్ ఎంబసీ – క్లారిడ్జ్ హోటల్ – రిసెప్షన్‌లో!

మేము అక్కడికి చేరే సమయానికి, అక్కడి లాబీ అతిథులతో క్రిక్కిరిసి పోయింది. ఆ జనంలోనుంచి మెల్లగా దారి చేసుకుని మేము వెళ్తున్నాం. రెండో ప్రక్కనుంచి కృశ్చేవ్, బుల్గానిన్ మాలాగే ఇబ్బందిపడుతున్నారు. వీలుకాక తిరిగి వెళ్లిపోతుంటే ఎస్కార్ట్ 'కృశ్చేవ్ – చాప్లిన్ వచ్చారు' అన్నాడు. ఒక్కసారిగా వారి ముఖాలు వెలిగిపోయినట్లు అనిపించింది. ఎలాగైతే మేము కలిసి ప్రక్క గదిలోకి వెళ్లి గట్టిగా నిట్టూర్చాము. కృశ్చేవ్ 'మీ సినిమాలు చాలా ఇష్టం' అన్నప్పుడు, ఏమీ మాట్లాడలేకపోయాను. వోడ్కా ఇచ్చారు, అది నాకు కారంగా అన్పించినా ఊనాకి బాగా నచ్చింది.

నేను కృశ్చేవ్‌ని బాగా అభినందించాను, ప్రపంచ శాంతికి ఆయన చేసే కృషి చాలా సహాయంగా వుంటుందని – అంతలో అమెరికన్ రిపోర్టర్ 'సర్ – మీ అబ్బాయి

రాత్రి బాగా సరదా చేశారని విన్నాము' అన్నాడు. కృశ్చేవ్ నవ్వి "నా కొడుకు చాలా బాధ్యతగల విద్యార్థి. ఇంజనీర్ కావాలని చదువుతున్నాడు' 'అప్పుడప్పుడు ఆటవిడుపు తీసుకుంటాడు" అన్నాడు.

అంతలో హెరాల్డ్ స్టాసెన్ వచ్చారని కబురు వచ్చింది. కృశ్చేవ్ నా వంక చూసి 'మీకు అభ్యంతరం లేదుగా, ఆయన అమెరికన్' అన్నారు నవ్వుతూ. తలుపు తీసుకుని స్టాసెన్, భార్యతోపాటు, గ్రోమికో దంపతులు వచ్చారు. వారితో కృశ్చేవ్ గదిమూలకు వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నారు.

నేను శ్రీమతి గ్రోమికోను అడిగాను, 'మీరు రష్యా వెళ్తున్నారా?' అని. 'లేదు – అమెరికా వెళ్తున్నానని' చెప్పింది.

అప్పుడు నేను "అసలు అమెరికా, న్యూయార్క్, పసిఫిక్ తీరాలలో లేదు – అమెరికా – నార్త్ డకోటా – సౌత్ డకోటా, మినియాపాలిస్, ఇలా మధ్య అమెరికా ప్రజలే మంచివారు' అన్నాను.

'అవును మీరు సరిగ్గా చెప్పారు' అంది గ్రోమికో భార్య నవ్వుతూ. ఇంతలో కృశ్చేవ్ మేము వెళ్లటానికి లేచామని మా దగ్గరకు వచ్చారు. మాతో కరచాలం చేసి వీడ్కోలు చెప్పారు – అంతకు పూర్వమే ఫోటోలు తీసారు కూడా!

ఆ మర్నాటి సాయంత్రం – నేనూ ఊనా ఇద్దరమే హోటల్ 'గ్రిల్'లో భోజనం చేస్తున్నాము. అక్కడే సర్ చర్చిల్ లేడీ చర్చిల్, వున్నారు. వారు వచ్చి మా టేబుల్ దగ్గర నిలబడ్డారు! 1913 నుంచి నేను సర్ చర్చిల్‌ని కలవనే లేదు – 'లైమ్‌లైట్' లండన్‌లో విడుదలయిన తర్వాత నాకు యు.ఎ. ఆఫీసు నుంచి కబురు వచ్చింది. సర్ చర్చిల్ నా సినిమా చూడాలనుకుంటున్నారు. ప్రత్యేక ప్రదర్శనకు అనుమతి కోరుతూ. ఎంతో ఆనందంగా అంగీకారం తెలిపాను. తరువాత కొన్ని రోజులకు నాకు చక్కని వుత్తరం వచ్చింది. తమకు సినిమా బాగా నచ్చిందిన అభినందిస్తూ.

ఇదిగో ఇప్పుడు ఆ గొప్పవ్యక్తి మా ముందు నిలబడి 'బాగున్నారా' అన్నారు. ఆ పలకరింపులో ఏదో ప్రత్యేకత వున్నట్లనిపించింది. నేను వెంటనే లేచి నిలబడి నా భార్యను ఊనాని పరిచయం చేశాను. తరువాత ఊనా గదిలోకి వెళ్లిపోయింది. నేను 'మీతో కలిసి కాఫీ తాగవచ్చా' అని అడిగాను. వారితో వారు కూర్చున్నచోటుకు వెళ్ళాను.

ఊనా చాప్లిన్

లేడీ చర్చిల్ మీరు కృశ్చేవ్‌ని కలవటం వార్తాపత్రికలలో చూశాము అన్నారు. సర్ చర్చిల్ "నాకు కృశ్చేవ్‌తో ఎప్పుడూ ఇబ్బంది కలగలేదు" అన్నారు. ఈ సంభాషణ జరుగుతున్నంతసేపు సర్ చర్చిల్ మనసులో ఏదో వున్నట్లు అన్పిస్తోంది. అవును 1913 సంవత్సరం నుంచి చాలాకాలం గడిచిపోయింది. ఎన్నో సంఘటనలు జరిగినాయి. ఆయన ఇంగ్లాండును తన రాజకీయ చతురతతోనే కాపాడారు. కాని ఆయన ఫుల్‌టన్‌లో చేసిన ప్రసంగం, ఆయన వాడిన 'ఐరన్ కర్టెన్' పదం – ప్రచ్ఛన్న యుద్ధాన్ని మరింతగా జటిలం చేసిందనే అనుకుంటాను. మళ్లీ సంభాషణ 'లైమ్‌లైట్' మీదకే వచ్చింది. 'మీకు రెండేళ్ల క్రితం వుత్తరం రాశానే, మీ సినిమా బాగుందని అభినందిస్తూ' అని అన్నారు. 'ఆ వుత్తరం చేరిందా' అని అడిగారు. "ఆఁ – చేరింది" అన్నాను. "మరి జవాబు రాయలేదు?" అన్నారు. నేను "మీరు సమాధానం కోసం చూస్తారని అనుకోలేదు" అన్నాను క్షమించమన్నట్లు.

ఆయన అంతటితో ఆగలేదు – "అది అమర్యాద అనుకున్నాను" అన్నారు. "అయ్యో – అలాంటిదేమీ లేదండీ" అన్నాను.

"ఏమయినా మీ సినిమాలు చూసి చాలా ఆనందిస్తాను – ఎప్పుడూ" అన్నారు. నాకు చాలా ఆనందం కలిగింది. అంత ప్రముఖ వ్యక్తి ఇలాంటి చిన్న విషయం కూడా రెండేళ్లు గుర్తుంచుకుని మరీ అడిగారంటే.

"నేనింకా వుంది, బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించి పోవటం చూడటానికి కాదు" అన్నారు. దీనిలో చాలా నిజాయితీ వుంది – ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే. ఈ అంతరించిపోవటం దేనివలన? అది రాజకీయంగా కాదు – తిరుగుబాట్ల వలన కాదు – కమ్యూనిస్టుల ప్రచారం వలనా కాదు – రాళ్లు విసురుకోవటం – లేదా కుస్తీపోటీల వలనా కాదు – మరి?

దీనికి ముఖ్యకారణం: అంతర్జాతీయ ప్రచారకర్తలు, రేడియో, టెలివిజన్ ఇంకా సినిమాలు, కారులు – యంత్రాలు, శాస్త్రపరమైన ఆవిష్కరణలు, ప్రసార సాధనాల వేగం–ఇవీ–ఇవే ముఖ్య కారణాలు సామ్రాజ్యాలు అంతరించి పోవటానికీ, ప్రపంచ రీతిలో మార్పురావటానికీ!

స్విట్జర్లాండ్ తిరిగి రాగానే, నెహ్రూ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. దానితోపాటు లేడీ మౌంట్‌బాటెన్ పరిచయ లేఖ కూడా వుంది. నాకూ, నెహ్రూకు చాలా సామ్యాలు

వున్నట్లు రాసింది ఆమె. నెహ్రూ కోర్సియర్ మీదుగా ప్రయాణం చేస్తున్నారు – నన్ను కలవాలని అనుకుంటున్నారని. నెహ్రూ – తన రాయిబారుల, సాంవత్సరిక 'సభ'ను 'లూసెర్న్'లో జరుపుతున్నారని. నెహ్రూ నన్ను టూసెర్న్ రమ్మని రాశారు. ఆ రాత్రి అక్కడ గడిపి వుదయం కోర్సియిర్లో దింపుతానని. ఆ విధంగా లూసెర్న్ వెళ్లాను.

నెహ్రూను చూసి ఆశ్చర్యపోయాను ఆయనకూడా నాలాగానే 'చిన్న'గా వున్నారు. ఆయనతోపాటు ఇందిర కూడా వుంది. చాలా అందంగా, ఆకర్షణీయంగా, నెమ్మదిగా వుంది!

నెహ్రూ నాకు బాగా నచ్చారు. చాలా ఉత్సాహంగా, సున్నితంగా, తెలివిగా కనిపించాడు. చాలా జాగరూకతతో వున్నాడు. గొప్ప ఆలోచనా పరుడు. ముందు కొంత బెట్టుగానే వున్నా – కారులో ప్రయాణం మొదలవగానే ఎంతో వుత్సాహంగా – ప్రపంచ రాజకీయాలు మాట్లాడాడు. నేను ఎన్నో విషయాలు అడిగాను. "ఇప్పుడు ఇండియాను ఏ వైపు నడిపిస్తున్నారు? సిద్ధాంతపరంగా సోషలిజమా లేక?"

"అదేమీ లేదు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం – పంచవర్ష ప్రణాళిక ప్రారంభించాము" అని ఎంతో విశ్వాసంతో చెప్పారు. ఆయన మాట్లాడుతూనే వున్నారు. ఆయన డ్రైవరు 70 మైళ్లు వేగంతో కారు నడుపుతున్నాడు. ఆ సన్నని రోడ్లమీద, మలుపుల్లో బ్రేకులు వేస్తూ – నాకు చాలా ఆందోళన కలిగింది. కాని నెహ్రూకు ఇదేమీ పట్టలేదు – చాలా తాపీగా ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

ఒక కూడలి దగ్గర ఆగాము. అక్కడ ఇందిరాగాంధీ వచ్చి కలవాలి వెనక కారులో. అప్పుడు ఊపిరి పీల్చుకున్నాను. ఆయన కూతురు రాగానే అంతటి నాయకుడు ఒక తండ్రిలా 'అమ్మా జాగ్రత్త' అంటూ ఆమెను పొదివి పట్టుకుని వీడ్కోలు చెప్పారు! కాని 'నాన్నా జాగ్రత్త సుమా' అని ఆమె అంటే మరింత బాగుండేదేమో.

అప్పుడు కొరియా యుద్ధం జరుగుతున్నదేమో – ప్రపంచం చాలా చిక్కుల్లో వున్నట్లుంది – ప్రమాదపుటంచుల్లో కూడా సరిగ్గా అదే సమయంలో చైనా రాయబార కార్యాలయం నుంచి కబురు వచ్చింది. 'సిటీ లైట్సు' సినిమాను చౌఎన్-లై కోసం జెనీవాలో ప్రదర్శన ఏర్పాటుకు అనుమతి అడుగుతూ! అక్కడే ప్రపంచ శాంతి భవిష్యత్తు నిర్ణయం జరగబోతోంది.

ఆ మర్నాడు చైనా ప్రధాని మమ్మల్ని విందుకు ఆహ్వానించాడు. మేము జెనీవా బయలుదేరేముందు ఆయన కార్యదర్శి ఫోన్‌చేసి 'బహుశా ప్రధాని రావటం ఆలస్యం కావచ్చు. చాలా ముఖ్యమైన సమావేశంలో వున్నారు" అని సమాచారం ఇచ్చారు. కాని మేము చేరే సమయానికి ఆయన మెట్లమీద నిలబడి మాకు ఆహ్వానం పలకటం ఆశ్చర్యం కలిగించింది!

మిగతా ప్రపంచంలాగానే నేను ఎంతో ఆందోళనతో వున్నాను. ఆయన జెనీవా వచ్చిన పని ఏమయింది? ప్రపంచ శాంతి సంగతి ఏమిటి? అలాగే అడిగాను కూడా.

ఆయన నా భుజంమీద చేయివేసి, "అంతా బాగానే జరిగింది, అయిదు నిమిషాల క్రితమే" అన్నారు నవ్వుతూ.

నేను చాలా కథలు వినియున్నాను – చైనా కమ్యూనిస్టులు – 1930లో చైనా అడవుల్లోకి తరిమివేయబడ్డారు అని. తర్వాత మావోసేటుంగ్ ఆధ్వర్యంలో అందరూ సంఘటితమై పీకింగ్ వైపు పెద్ద సంఖ్యలో కవాతులో వచ్చారని. వారితో చైనా సైన్యం, చైనా ప్రజలూ అందరూ చేరారని. వీరికి 60 కోట్ల చైనా ప్రజల మద్దతు వుందని!

ఆ రాత్రి చౌ ఎన్ లై మాకు ఆ కథంతా చాలా మనసుకు హత్తుకునేలా చెప్పారు. మావో విజయాన్ని వర్ణించారు – చైనా ప్రజల స్వాగతం – పెద్ద ఎత్తైన సభా మండపాన్ని నిర్మించారని – మావో వెనకనుంచి ఎక్కుతుంటే ముందుగా ఆయన తల కనపడగానే అక్కడ చెలరేగిన కోలాహలం – కరతాళ ధ్వనులు కేకలు – పెరిగి పెరిగి పోయింది. మావో పూర్తిగా దృష్టిలోకి రాగానే ఇక అంతులేని కోలాహలం చెలరేగింది. మావో పూర్తిగా మండపం పైకి వచ్చి అశేష జనావాహిని చూసి ఒక్కసారిగా ముఖాన్ని చేతుల్తో కప్పుకుని ఏడ్చాడని!

చైనాలో చౌ–ఎన్‌లై మావోతో పాటు ఏ విధంగా కష్టసుఖాలు పంచుకున్నాడో – ఇప్పుడు ఇంత ప్రశాంతంగా నవ్వుతూ మాట్లాడగలగటం ఎంత గొప్ప విషయం!

"నేను షాంగై వచ్చాను 1936"లో అన్నాను "అది మేము ఇంకా 'మార్చి' మొదలుపెట్టకముందు!"

"ఇప్పుడు మీరు ఇక ఎంతో దూరం ప్రయాణం చేయవలసిన అవసరం లేదేమో?" అన్నాను నవ్వుతూ.

విందులో చైనా షాంపేన్ తాగాము (ఒకమాదిరిగా వుంది) చాలాసార్లు 'చీర్సు' కొట్టాము (రష్యన్లు కూడా ఇంతే!) చైనా ప్రజల శ్రేయస్సుకోసం – ప్రపంచ ప్రజల శ్రేయస్సుకోసం మేము 'చీర్స్' అనుకున్నాం.

వేవేలో మాకు కొత్త స్నేహాలు కలిశాయి. వారిలో ఎమిలీ రోజర్ మైకేల్‌రోజర్‌లు, వారి కుటుంబాలు – వీరంతా సంగీతం అంటే చెవికోసుకుంటారు. ఎమిలీ మాకు క్లారాహస్కిల్‌ను పరిచయం చేశారు. ఈమె చక్కగా పియానో వాయిస్తారు. వే వే లోనే వుండేది. మా యింటికి విందుకు పిలిచేవాళ్లం. విందు తర్వాత మాకోసం పియానో వాయించేది, ఎమిలీ, మై కేల్ కుటుంబ సభ్యులతో మేము అందరం కూర్చుని ఎంతో ఆనందించేవాళ్లం. అప్పటికి క్లారాకి అరవైదాటినా, ఆమె ప్రతిభ ఏ మాత్రం చెక్కుచెదరలేదు. ఐరోపాలో, అమెరికాలో ఎంతో ఖ్యాతి గడించింది. తరువాత దురదృష్టం వెంటాడినట్లు 1960లో బెల్జియంలో రైలు దిగుతూ జారిపడి, తరువాత ఆసుపత్రిలో మరణించింది.

అప్పుడప్పుడు ఆమె రికార్డులు వినేవాడిని. అందులో ఆమె మరణించే ముందుగా ఒక రికార్డు – అదే చివరిది కూడా.

ఈ కథ రాయటానికి, అది మళ్లీ తిరగరాయటానికి (ఆరోసారి) ముందు, బెతోవెన్ పియానా కన్స్‌ర్టో 3 – క్లారాతో విన్నాను. పియానో మార్కెవిచ్ వాయిస్తున్నాడు. అదిగో ఆ మాయలాంటి సత్యాన్ని దర్శిస్తూ – దాని స్ఫూర్తితోనే ఈ గ్రంథాన్ని పూర్తి చేయగలిగాను.

స్విట్జర్లాండులో మాకు మంచి సాంఘిక జీవితం ఉండేది. మా చుట్టుప్రక్కలే స్పెయిన్‌రాణీ, గ్రీకు కౌంటెస్ వుంటుండేవారు. మాతో ఎంతో అన్యోన్యంగా వుండేవారు. ఇంకా, సినిమా తారలూ, రచయితలూ కూడా అందుబాటులో నివసిస్తుండేవారు. సాండర్స్ దంపతలు, నోయిల్ కోవర్డ్ మాకు ఇరుగు పొరుగువారే. ఇంకా అమెరికా, ఇంగ్లాండు నుంచి స్నేహితులు వస్తుండేవారు. కాని మా సమయం ఎక్కువ మా పిల్లల ఆలనా పాలనాతోనే గడిచిపోయేది!

వేసవిలో రాత్రి పదిగంటలవరకూ పొద్దు వెలుతురుండేది, డాబామీద కూర్చొని తీరుబడిగా భోజనాలు చేసేవాళ్లం. అప్పటికప్పుడు బయలుదేరి – లండన్, పారిస్, వెనీస్, రోమ్ వెళ్ళిపోతుండేవాళ్లం. అన్నీ రెండు గంటలలోపే వాలిపోవచ్చు!

పారిస్‌లో మా దగ్గరి స్నేహితుడు పాల్‌లూయిస్ మాకు ఆతిథ్యమిచ్చేవారు. ఆయన దగ్గర ఆగష్టు మాసంలో నెలరోజులపాటు వుండేవారం! అది చాలా అందమైన ఎస్టేట్, మధ్యధరా సముద్రపుటంచున! అక్కడ ఈత, సముద్ర స్కయింగ్ ఎంతో ఆనందించేవాళ్ళం.

నా స్నేహితులు ఎన్నోసార్లు అడిగారు – 'మీరు అమెరికాను మర్చి పోగలుగుతున్నారా?' అని. ముఖ్యంగా న్యూయార్క్! నిజానికి అది సాధ్యమేనా? కానీ, అమెరికా మారిపోయింది, న్యూయార్క్ మరీ మారిపోయింది.

అంతూ పొంతూ లేని యాంత్రీకరణా, వ్యాపార ప్రకటనల వ్యాపారం, టెలివిజన్, వార్తాపత్రికల తీరు తెన్నులు – ఇవన్నీ నన్ను అమెరికాకు దూరం చేశాయి. అమెరికా జీవితానికి నేను అపరిచితునిగా మిగిలిపోయాను!

నేను కోరుకునేది, దీనికి భిన్నంగా, సాదాసీదాగా, జీవితాన్ని తాపీగా గడపడం – చక్కగా నడుచుకుంటూ సాయంత్రాలు గడపటం – కానీ ఇది న్యూయార్క్ పెద్ద ఎవెన్యూలలో, ఆకాశాన్నంటే గొట్టాల్లాంటి భవనాలతో నిండివున్న నగరంలో – దాని సంపద నగ్న ప్రదర్శన ముందు నేను చిన్నబోయాను! ముందు చెప్పినట్లు అమెరికా ఆస్తులు అమ్మటానికి సంవత్సరం పైనే పట్టింది. చివరికి నాకు వచ్చిన ఐరోపా వసూళ్లమీద కూడా అమెరికా ప్రభుత్వం పన్ను విధించింది (1955) వరకు. అది పెంచి పెంచి – నేను ఇవ్వలేనంత చేశారు. కాని నన్ను చట్టపరంగా ఏమీ చేయలేరని తెలిసీ, మరో దేశానికి బాకీ పడటం ఇష్టంలేక, బేరం సాగించాను. చివరికి నాకు అనుకున్నదానికంటే ఎక్కువ, వాళ్ళకి కావలసినదానికంటే తక్కువ మొత్తానికి అంగీకారం కుదిరింది!

ఆ విధంగా నా చివరి బంధాలన్నీ తెంపుకుని బైటపడటం కొంచెం బాధ అనిపించింది. మా యింటి సహాయకురాలు హెలెన్, బెవెర్లీ హిల్స్ నుంచి, మేము రావటం లేదని తెలిసి ఉత్తరం రాసింది:

"ఇప్పటి వరకూ మీకు చాలా ఉత్తరాలు రాశాను. కాని ఒక్కటీ పోస్టు చేయలేదు. మీరు వెళ్లిన తర్వాత అంతా అస్తవ్యస్తమైపోయింది. అంత అన్యాయం, అనవసరం అనిపించింది. చివరికి అన్నీ సర్దుకుని మీ దగ్గర నుంచి కబురు తెలిసిన తర్వాత –

నేనూ నా కుటుంబ సభ్యులూ పడిన వేదన అంతులేనిది. ఇదెలా జరిగింది? అంతా నిజమేనా? ఇంత బాధను ఎలా అనుభవించాలి? చార్లీ–ఊనా మీరు ఎలా భరించారు.... కనీసం ఇల్లయినా వుంచండి. దానితో బంధాన్ని తెంచుకోవద్దు. ఆ పని నేను చేయలేకపోతున్నాను. దీనితో మూడు ఉత్తరాలు పంపిస్తున్నాను. అందరికీ నా ఆశీస్సులు తెలియజేయండి.....

మీ మేలుకోరే
హెలెన్

మా బట్లర్ హెన్రీ కూడా ఉత్తరం రాశాడు.

మీకు చాలాకాలంగా ఉత్తరం రాయలేకపోయాను. మీకు తెలుసు నా స్విస్ ఇంగ్లీషు సరిగా వుండదని. మొన్నీమధ్య మిస్ రన్నర్ 'లైమ్ లైట్' చిత్రాన్ని చూడటానికి పిలిచారు. అంతా ఇరవయిమంది వున్నారు ప్రత్యేక ప్రదర్శనకు. అన్న సిడ్నీ – భార్యతో వచ్చాడు.

చివరనే కూర్చున్నాను. అందరికంటే గట్టిగా నవ్వింది నేనే. అలాగే గట్టిగా ఏడ్చింది కూడా నేనే. అంత మంచి సినిమా ఎప్పుడైనా చూశానా? ఆ సినిమాను లాస్ఎంజెల్స్‌లో ప్రదర్శించలేదు. కాని అందులోని సంగీతం రేడియోలో వస్తుండేది. ఎంత ఆత్మీయమైన సంగీతం! విన్నప్పుడల్లా ఉత్సాహంగా ఉత్తేజంగా వుంటుంది – చార్లీ! కంపోజర్ పేరు చెప్పేవారు కాదు.

స్విట్జర్లాండ్ జ్ఞాపకాలు నన్ను ఆనందపరుస్తాయి. అవును ఆ దేశం వదిలి ఇక్కడకు వచ్చాను. అలవాటుపడటం కష్టమే. స్విట్జర్లాండ్‌లో ప్రపంచంలోనే మంచి స్కూళ్లున్నాయి. అది ప్రపంచంలో పురాతన రిపబ్లిక్! 1191 సంవత్సరం! అక్కడ ఆగష్టు ఒకటి స్వాతంత్ర్య దినోత్సవం! ఇక్కడ 4–జూలై! అక్కడనుంచి 1913లో సౌత్ అమెరికా వచ్చి చివరికి ఇక్కడికి చేరాను. బెర్నిలో మా తమ్ముడున్నాడు–

మీ శ్రేయస్సు కోరుతూ
హెన్రీ!

మా దగ్గర పనిచేసిన వారందరికీ ఇప్పటివరకూ జీతాలిస్తూనే వున్నాను. ఇంక ఇప్పుడు వారికి మొత్తం ఎనభైవేల డాలర్లు చివరిగా ఇచ్చి పంపించాను.

ఎడ్నాతో నా అనుబంధం చివరివరకు తెంపుకోలేనిది! 'మాన్సుర్ వెర్డో'లో ఆమెను నటించమన్నాను. అప్పటికి ఇరవయి సంవత్సరాలుగా నాకు కనపడనేలేదు. చివరికి కబురు పెట్టాను – స్టూడియోకి వచ్చింది. అవి చాలా ఉద్విగ్నమైన క్షణాలు. 'ఆమె వచ్చింది' అని రోలీ మా కెమెరామెన్ చెప్పాడు.

నాకు ఈ కలయికను సహజంగానే వుంచాలని, నా భావాలను బైటకు కనపడనీయలేదు. 'ఎడ్నా – చివరికి నిన్ను పట్టుకోగలిగాము. ఇదిగో ఈ పాత్ర నీ కోసం' అని చెప్పాను. ఆమె చాలా ఆనందించింది. ఎంతో శ్రమపడింది కూడా. కాని ఆ ఫ్రెంచ్ హావభావాలూ, నడక తీరూ – పట్టుబడటం చాలా కష్టం – అందుకని ఆమె 'దీనికి నేను పనికి రాను' అని చెప్పింది.

అక్కడితో ఆమెకు వీడ్కోలు చెప్పాను. స్విట్జర్లాండ్ వచ్చిన తర్వాత ఆమెకు చివరిగా కొంత సొమ్ము పంపించాను.

అప్పుడే ఈ ఉత్తరం రాసింది:

చార్లీ,

ఇన్ని సంవత్సరాల అనుబంధంలో – నీకు మొదటిసారిగా అభివాదనలు తెలుపుతున్నాను. జీవితంలో మొదట్లో మనకు కష్టాలు అంతగా వుండవేమో! ఇప్పుడు నీవు హాయిగా వున్నావని ఆశిస్తాను.

.....నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది – ఇక వైద్యం ఖర్చు – అంతులేదు. అయినా జీవితంలో హాస్యానికి కొదవలేదు.

ఒక అంతరిక్ష యాత్రికుడు రాకెట్టులో పైకి వెళ్లాడు – చాలా ఎత్తుకు.... అయిదు లక్షల మైళ్లు వెళ్లినట్లు మీటరు చూసి – 'ఆరి దేవుడా' అన్నాడు పైకి! 'ఎవరదీ!' అని సమాధానం వచ్చింది!

చార్లీ సమాధానం కోసం. ఎప్పటికీ నీవే నా హీరోవి!

ప్రేమతో

ఎడ్నా!

ఎడ్నానుంచి ఎప్పుడు ఉత్తరం వచ్చినా అందులో హాస్యం లేకుండా రాయదు! నేను ఎప్పుడూ ఆమెకు రాసిన సందర్భం లేదు.

ఆమె దగ్గర్నుంచి చివరి ఉత్తరం వచ్చింది.

ప్రియమైన చార్లీ,

ఇంకా నాకు డబ్బు పంపిస్తునే వున్నావు. నీకు ఎలా అభివందన పంపను? ఇప్పుడు ఆసుపత్రిలోనే వున్నాను. ఇంతకంటే వేరే నరకం ఉండదేమో? అంతా బాగుంటే ఈ వారాంతానికి ఇంటికి వెళ్ళవచ్చు.

ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్ళటంకంటే ఆనందం ఏముంటుంది? ఇవాళ జోక్ – ఒకడు న్యూయార్కు ఏడవ ఎవెన్యూ దగ్గర నిలబడి వున్నాడు... చిన్న చిన్న కాగితం ముక్కలు చింపి గాలిలోకి వదులుతున్నాడు... ఒక పోలీసు వచ్చి 'ఏమిటి నీ వుద్దేశ్యం?' అని అడిగాడు. 'ఏమీ లేదు – ఏనుగులు రాకుండా' అన్నాడు. అప్పుడు పోలీసు 'ఈ చుట్టుపక్కల ఏనుగులు లేవే' అన్నాడు. మనవాడు "చూశావా ఇది పనిచేస్తోంది" అని కదిలిపోయాడు.

ఇదిగో ఇలా నవ్వుకుంటున్నాను – క్షమించు చార్లీ –

ఎప్పటికీ ప్రేమతో

ఎడ్నా

ఆ తరువాత కొన్నాళ్లకే ఆమె చనిపోయినట్లు వార్త వచ్చింది.

ఆ విధంగా ప్రపంచం వయస్సు తగ్గిపోతోంది – పెద్దవాళ్ళు వెళ్లిపోతుంటే – చిన్నవాళ్లు ప్రపంచాన్ని పాలిస్తుంటారు. ఈ భూమిమీద మనం ఉండవలసిన దానికంటే ఎక్కువకాలం వున్నాము. అందుకని ఈ కొత్త ప్రపంచం, మనకు అర్థం కాదు, కొత్తగానే వుంటుంది!

ఇక్కడితో ఈ కథ ముగిస్తాను. ఒక్క విషయం, నాకు కాలం కలిసి వచ్చింది. పరిస్థితులు అనుకూలించాయి. ప్రపంచంలో ఎంతో ప్రేమను పొందాను. ద్వేషాన్ని చూశాను. అవును జీవితం–ప్రపంచం నాకు అంతా ఇచ్చింది – ఎంతో మంచినీ – కొద్దిగా చెడునూ – రుచి చూపించింది. అదృష్టం – దురదృష్టం – మబ్బుల్లా నా

మీదనుంచి కదిలిపోయాయి. ఇది తెలుసుకున్నప్పుడు నేను దురదృష్టానికి భయపడిపోలేదు – అదృష్ట సంపదను ఆనందంగానే స్వీకరించాను.

ఈ జీవితాన్ని ఏమీ ప్రణాళిక ప్రకారం నడపలేదు.

ఈ జీవనాన్ని ఏ సిద్ధాంతానికో–వేదాంతానికి లోబడీ గడపలేదు.

నేను యోగిని కాదు – అలాగే మూర్ఖుణ్ణి కాదు.

మనందరం – బ్రతుకు ఈడ్చవలసిందే. బ్రతుకు బండి లాగవలసిందే.

మనకు జరిగే అన్యాయాలకు బాధపడతాం – నోటిలో కాస్త చేదుగా వుంటుంది. ఒక్కోసారి చాలా చిన్న విషయాలు నన్ను ఎక్కువ బాధపెడతాయి – చాలా పెద్ద విషాదాలు – నిర్లిప్తంగా గడిచిపోతాయి.

ఏది ఏమయినా, ఇప్పటి నా జీవితం – చాలా ఉత్సాహంగా వుంటోంది. ఇంతకు మునుపెన్నడూ లేని ఉత్తేజం కలుగుతోంది. నా ఆరోగ్యం అద్భుతంగా వుంది. నాలో ఆలోచనలు, సృజనాత్మకత ఉరకలు వేస్తున్నాయి. ఎన్నో ప్రణాళికలున్నాయి. నా సంతానంలో ఒకరిద్దరు నటనలో ఉత్సాహం చూపుతున్నారు. వారికి తగిన శిక్షణ తీసుకుంటున్నారు.

నేను రాయవలసిన సినిమా కథలున్నాయి. నాటకాలూ, ఓపేరాలూ ఉన్నాయి. దీనంతటికీ కావల్సింది సమయమే!

షోపెన్ హవర్ 'సంతోషం అనేది 'కష్టస్థితి' అన్నాడు. కాని దీనికి నేను అంగీకరించను.

గత ఇరవై సంవత్సరాలుగా సంతోషం, ఆనందం అంటే ఏమిటో బాగా అనుభవించాను – ఊనా, నా చిన్నారి భార్య నన్ను స్వార్థరహితంగా, అర్థవంతంగా ప్రేమతో పునీతం చేసింది. నిజానికి ఈ విషయం ఇంకా వివరంగా రాయాలి. కాని అది అక్షరాలకు ఒదిగేది కాదు. ఊనా, ఒద్దిక – వ్యక్తిత్వం నాకు ఎన్నో కొత్త లోకాలు తెరిచాయి. ఆమె సౌందర్యంలోని గోప్యత, రోజురోజుకు నాకు కొత్తగానే వుంటుంది.

ఇప్పుడు నాకు కొంచెం ముందుగా ఆమె, ఈ సాయంసంజెలో నడుస్తుంటే, ఆమె నల్లని కురులు ఆ నడకకు లయగా కదులుతుంటే – అదిగో ఒకటో రెండో

తెల్లని దారాలు బంగరు రంగు ఎండలో మెరుస్తుంటే – నా గుండె గొంతులో కొట్టుకుంటుంది.

ఇలాంటి ఆనందంలో మునిగి, మా యింటి బైట కూర్చుని, అక్కడి రమణీయమైన పచ్చికబయళ్లు అంత దూరంలో ప్రశాంతంగా వున్న లూసెర్న్ చెరువు, దూరంగా నిలబడివున్న ఉన్నతమైన ఆల్ప్ పర్వతాలు నా సంతోషాన్నీ, ఆనందాన్నీ, ఆలోచనలే లేని నా అంతరంగాన్ని కమనీయంగా ఆవిష్కరిస్తున్నాయి.

మై ఫేవరెట్ బుక్ చార్లీ చాప్లిన్- మై ఆటోబయోగ్రఫీ చాప్లిన్ ది గ్రేట్

– గొల్లపూడి మారుతిరావు

నాకు నచ్చిన పుస్తకాన్ని చెప్పమంటే ఒకటి కాదు, రెండు చెప్తాను. అదిన్నీ చాలా గొప్ప పుస్తకాల్ని దాటేసిన తర్వాత. ఒకటి చార్లీ చాప్లిన్–మై ఆటోబయోగ్రఫీ, రెండోది శ్రీపాద గారి 'అనుభవాలూ జ్ఞాపకాలూ, ఈ రెండూ ఆత్మకథలు. జీవితంలో చాలా దూరం ప్రయాణం చేశాక కల్పిత కథలు మనస్సుని ఊరించినా, నిజ జీవితాల కథలు వాస్తవానికి అద్దంపడుతూ, వ్యక్తిత్వాలను కళ్లముందు ఆవిష్కరిస్తాయి. ఆ విధంగా వాటికి ఆకర్షణ ఎక్కువ. ఇందులో చాప్లిన్ పుస్తకాన్ని ఎంపిక చేస్తాను. ఎందుకంటే శ్రీపాదవారిని ఏ కొద్దిమందో చదివే ఉంటారు. కాని చాప్లిన్ పుస్తకాన్ని ఆ కొద్దిమంది కూడా చదివి ఉండరనిపిస్తోంది. తెలియనిదాన్ని చెప్పడంలో రుచి ఉంది.

చాప్లిన్ జీవితంలో ప్రతి దశా ఒక వింత కథ. విచిత్రమైన పోరాటం. అన్వేషణ. ఆకలిని ఆర్టుగా మార్చిన కళాకారుడు. తల్లి అనారోగ్యంతోనే వీధి చివర సైనికులు తాగే బార్‌లో పాటలు పాడి డబ్బు సంపాదించేది. చాప్లిన్ తల్లి వెంట వెళ్లేవాడు. ఏడెనిమిదేళ్లప్పుడు ఒకరోజు పాడుతున్న ఆమె గొంతు నీరసంతో మూగబోయింది. తాగిన సైనికులు గేలి చేశారు. తల్లిని అవమానం నుంచి కాపాడ్డానికి చాప్లిన్ స్టేజిమీదికి వచ్చి, పాట పాడటం ప్రారంభించాడు. సైనికులు చప్పట్లు కొట్టారు. నాణేలు విసిరారు. చాప్లిన్ పాట ఆపేశాడు. 'ముందు నాణేలు ఏరుకున్నాక పాడతాను' అన్నాడు. సైనికులు ఘొల్లుమని నవ్వారు. వారికది హాస్యం. కానీ చాప్లిన్‌కది ఉపాధి. అతడి కళాత్మక జీవితమంతా ఈ రెండూ పడుగు పేకల్లాగా అల్లుకుపోయాయి. కళకి మరో కొత్త కోణాన్ని జతచేశాడు చాప్లిన్.

పుస్తకంలోంచి ఓ పేద జీవితం, ఓ గొప్ప స్ఫూర్తిని అవసరానికి అందిపుచ్చుకున్న ఓ గొప్ప స్వాప్నికుడి సంఘర్షణ వెలుగులాగ ప్రసరించి మనస్సంతా నిండిపోతుంది.

యాభయ్యేళ్ళ క్రితం ప్రముఖ రచయిత కపిల కాశీపతిగారు ఢిల్లీ ఆకాశవాణిలో చీఫ్ న్యూస్ రీడర్‌గా పనిచేసేవారు. ఆయనిలా రాశారు– 'చాప్లిన్ చదువుతున్నాను. అయ్యో పేజీలు అయిపోతున్నాయే అనుకుంటూ చదువుకుంటున్నాను' అని. నేనూ అదే బాధతో ఈ పుస్తకాన్ని ఎన్నిసార్లు చదివానో.

చాప్లిన్ జీవితం, కృషి, సినిమాలు, తోటి కళాకారుల ఈర్ష్య, చివర్లో అమెరికా ప్రభుత్వం పీడనని తట్టుకుని బతికిన ఘట్టాలు... అన్నీ అద్భుతం, అనిర్వచనీయం. ఆయన అభిమానుల జాబితా ఆశ్చర్యకరం – బెర్నార్డ్ షా, మహాత్మాగాంధీ, విన్‌స్టన్ చర్చిల్, చౌ ఎన్‌లై. ఆయన విజయాలు అనూహ్యం. తను చదువుకోడానికి కారణాన్ని ఓచోట చెప్పాడు. 'నాకు చదువంటే ప్రీతి కనుక చదువుకోలేదు. చదువులేని వారి పట్ల చదువుకున్నవారి జుగుప్స నుంచి నన్ను నేను కాపాడుకోటానికి చదువుకున్నాను.' ఆయన ప్రేమకథలు, సెన్సాఫ్ హ్యూమర్, దక్కిన గౌరవాలు, చివర ఎదుర్కొన్న అవమానాలు – అన్నీ అపూర్వమే. తనకంటే కొన్ని దశాబ్దాలు చిన్నదైన ఊనా ఓనీల్ (ఈమె నోబెల్ బహుమతి గ్రహీత, నాటకకర్త, నా గురువు యూజినే ఓనీల్ కూతురు)తో వివాహం. ఆమెతో గడిపిన జీవితం అతనికి దక్కిన ఊరట.

నేను 1977, డిసెంబర్ 25న మద్రాసు మారిస్ హోటల్లో ఏదో సినిమా సంభాషణలు రాస్తున్నాను. మా అబ్బాయి ఫోన్ చేశాడు, 'చాప్లిన్ చనిపోయాడు నాన్నా' అంటూ. ఒక ఆత్మీయుడి మరణంలాగ అనిపించింది.

ప్రపంచం ఊహించలేని విజయాల్నీ, ధనాన్నీ, కష్టాల్నీ, చిరునవ్వుల్నీ, కీర్తనీ, అపకీర్తినీ, ఆఖరికి మనశ్శాంతినీ ఆర్జించుకున్న నటుడు చార్లీ చాప్లిన్.

గొప్ప పుస్తకం గొప్ప జీవితాన్ని ఆవిష్కరిస్తుంది. గొప్ప ప్రభావాన్ని చూపుతుంది. తన కథ చెప్పడంలో చాప్లిన్ సరళత్వం గొప్పది. గొప్ప పుస్తకం జీవితంలో గొప్ప సైన్ పోస్టు. ఇంగ్లీషులో ఓ సామెత ఉంది. దాన్ని నేను సవరిస్తాను. 'నువ్వు చదివిన పుస్తకం ఏమిటో చెప్పు. నువ్వెవరో నేను చెప్తాను.'

సినీ ప్రపంచానికి ఛార్లీ చేసిన నిశ్శబ్ద సేవ

– అరిపిరాల సత్యప్రసాద్

ఛార్లీ చాప్లిన్‌ని తెరపైన చూడగానే పెదాలపై చిరునవ్వు, కళ్ళలో తడీ ఒకేసారి పుట్టడం అందరికి అనుభవమయ్యే సత్యం. ఈ అనుభవం ఒక దేశానికో, ఒక ప్రాంతానికో కాక యావత్ ప్రపంచానికి కలగడం కేవలం చాప్లిన్ మాత్రమే సాధించిన అద్భుతం. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి దేశంలో అసంఖ్యాక అభిమానులు కలిగిన నటుడు, అప్పటికీ ఇప్పటికీ ఒక్క ఛార్లీ చాప్లిన్ అంటే అతిశయోక్తి కాదేమో.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభంతో బాధలు పడుతున్న ప్రపంచాన్నీ నవ్వించడానికా అన్నట్లు చాప్లిన్ కూడా 1914లోనే తెరపై "ది ట్రాంప్" అవతారం ఎత్తాడు. ఆ తరువాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థని అతలాకుతలం చేసిన ఆర్థిక మాద్యం (గ్రేట్ డిప్రషన్) వచ్చినా, నియంత హిట్లర్ ప్రపంచాన్ని గడగడలాడించినా ఛార్లీ చాప్లిన్ ప్రజల్ని నవ్విస్తూనే ఉన్నాడు. ఆ యుద్ధాన్నీ, ఆర్థిక బాధల్నీ, ఆఖరకు హిట్లరుని కూడా కథా వస్తువు చేసి నవ్వించగలిగాడు. ఎన్నో బాధలు పడి ఎదిగినవాడు కావడం వల్లనేమో, ఎలాంటి బాధనైనా తీర్చగల నవ్వుల టానిక్‌లను తయారు చేసాడు.

ఛాప్లిన్ నాటకాలు వేస్తూ ఇంగ్లాండు వదిలి అమెరికా వచ్చినప్పుడు ప్రముఖ హాస్య ద్వయం లారెల్ అండ్ హార్డీలని స్టాన్లీ (లారెల్) జఫర్సన్‌తో కలిసి ఒకే గదిలో ఉండేవాడు. కీస్టోన్ కంపెనీలో అప్పటికే వైదొలిగిన ఫోర్డ్ స్టెర్లింగ్ స్థానంలో ఛాప్లిన్‌కు అవకాశం దక్కింది. మొదట్లో ఎంతో ఇబ్బంది పడి "మేకింగ్ ఎ లివింగ్" సినిమాలో నటించాక అతనిని దాదాపు వెళ్ళగొట్టేందుకు సిద్ధమైంది యాజమాన్యం. కానీ అలా జరగకపోవడంతో ఛాప్లిన్‌కు ది ట్రాంప్ పాత్రలో నటించేందుకు అవకాశం వచ్చింది. వదులైన బ్యాగీ పాంటు, కురచ కోటు, పెద్ద పెద్ద బూట్లు, చిన్న టోపీ, చేతిలో కర్ర వంటి చిత్రమైన వేషధారణతో, అమాయకంగా కనిపించే "ది ట్రాంప్" పాత్రని చాప్లిన్ మొదటిసారి 1914లో విడుదలైన "కిడ్ ఆటోరేసెస్ ఎట్ వినీస్" చిత్రంలో ధరించాడు. అప్పుడు అతను ధరించిన బట్టలూ, టోపీ, బూట్లు ఏవీ అతనివి కాకపోవటం విశేషం. అప్పటికప్పుడు వచ్చినలాలోచన ప్రకారం అందుబాటులో ఉన్న వారి బట్టలు, టోపీ,

బూట్లు తీసుకుని ఆ పాత్ర రూపకల్పన చేసాడు ఛాప్లిన్. అలా "ది ట్రాంప్" పాత్రకు తన ప్యాంట్ ఇచ్చినవాడు "రోస్కో "ఫాటీ" ఆర్బకల్" అనే సీనియర్ నటుడు. ఆ ట్రాంప్ పాత్ర చేతిలో ఉండే కర్ర తప్ప మిగిలినవి ఏవీ ఛాప్లిన్ సొంతవి కావు. అలా మొదలైన "ది ట్రాంప్" పాత్ర అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచవ్యాప్తమైంది. ప్రపంచానికి ఆప్తమైంది. 1936లో విడుదలైన మోడర్న్ టైమ్స్‌లో ఆ ట్రాంప్ పాత్రని చివరి సారిగా ధరించాడు ఛాప్లిన్.

మూకీ సినిమాలు అనగానే మనకు గుర్తుకు వచ్చే సినిమాలలో మొదటివి ఛాప్లిన్‌వి. అలా ఛాప్లిన్ మూకీ సినిమాకే తలమానికంగా నిలిచాడు. 1920 ప్రాంతంలో మూకీ సినిమాలు పోయి టాకీ సినిమాలు వస్తున్నా, తాను మాత్రం మూకీ సినిమాలే తీస్తాను అని నిర్ణయించుకొని, సినిమా జగత్తులోనే చివరిదైన మూకీ చిత్రాన్ని నిర్మించిన ఘనత కూడా ఆయనదే (సిటీ లైట్స్ 1931). ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ప్రపంచమంతా టాకీ సినిమాలవైపు పరుగులు తీస్తుంటే, మూకీ సినిమానే నిజమైన సినిమా అని నమ్మి అదే కొనసాగించిన ఘనత చాప్లిన్‌ది. అందుకు కారణమూ లేకపోలేదు – కేవలం దృశ్య ప్రధానమైన మూకీ సినిమాలో తెరపై జరుగుతున్నదేమిటో ప్రేక్షకుడు అర్థం చేసుకోవాలంటే, నటీనటుల అద్భుతమైన నటనతోపాటు, సినీపరిభాష ఆమూలాగ్రం అర్థం చేసుకున్న దర్శకుడు కావాలి. చాప్లిన్ ఆ రెండు విషయాలలో ఎంతో పరిణతి సాధించాడు. కేవలం ఒక కనుసైగతో, భుజాలు ఎగరెయ్యటంలో అమాయకమైన చూపులో ఎన్నో భావాలను పలికించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. పేజీలకొద్ది డైలాగులు చెప్పలేని విషయాన్ని ఒక్క దృశ్యంలో చెప్పగలిగిన దర్శకత్వ ప్రతిభ కూడా ఆయనకే సొంతం. అందువల్లే మూకీ సినిమాల కాలంనాటి మేధావులను లెక్కిస్తే ముందు వరుసలో చాప్లిన్ ఉండి తీరుతాడు.

మూకీ సినిమాలకీ, స్లాప్ స్టిక్ కామెడీ చిత్రాలకీ ఒక గ్రామర్‌నీ, ఒక గ్లామర్‌ని సృష్టించిన ఘనత ఆయన సొంతమని మనకి తెలుసు. అయితే ఆయనవల్ల ప్రపంచ సినిమాకి కలిగిన ముఖ్యమైన ప్రయోజనం మరొకటి ఉంది. అదేమిటో తెలుసుకోవాలంటే ఆ సమయంలో హాలీవుడ్ పరిస్థితి గురించి కొంత తెలుసుకోవాలి. 1910 ప్రాంతంలో ఎడిసన్ గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ డీ.డబ్లూ.గ్రిఫిత్ హాలీవుడ్ స్టూడియో విధానానికి తెరతీస్తే, 1919కల్లా అంటే దాదాపు ఒక దశాబ్దం తరువాత, అవే స్టూడియోలు సినీరంగంపై గుత్తాధిపత్యాన్ని సాధించాయి. కళాకారులను కాంట్రాక్ట్

పద్ధతిలో కుదుర్చుకుని, తక్కువ జీతాలు ఇస్తూ, పంపిణీదారులతో, థియేటర్ యాజమాన్యంతో కుమ్మక్కై, లేదా తామే స్వయంగా సినిమాలను పంపిణీచేస్తూ, సొంత థియేటర్లు నడుపుతూ, సుమారు ఎనిమిది పెద్ద స్టూడియోలు సినిమా రంగంపైన పట్టు సాధించాయి.

అన్నింటికన్నా ముఖ్యంగా సినిమా నిర్మాణ వ్యయం నియంత్రణ పేరుతో, సృజనాత్మకత పైన ఆంక్షలు విధించడం మొదలు పెట్టారు. ఈ వ్యవహారం నచ్చని నలుగురు కళాకారులు తామే స్వయంగా ఒక సొంత స్టూడియో ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆ నలుగురే – ప్రముఖ నటీమణి మేరీ పింక్ ఫోర్డ్, నటుడు, రచయిత, దర్శకుడు డగ్లస్ ఫేయిర్ బ్లాంక్స్, డీ.డబ్లూ. గ్రిఫిత్ మరియు ఛార్లీచాప్లిన్. ఈ నలుగురూ కలిసి స్థాపించిన ఆ సంస్థపేరే "యునైటెడ్ ఆర్టిస్ట్స్"

ఈ యునైటెడ్ ఆర్టిస్ట్ సంస్థ ముందు అంత విజయవంతం కాకపోయినా, చాప్లిన్ చిత్రాల పుణ్యమా అని కొంత పుంజుకుంది. మళ్ళీ 1940లలో యునైటెడ్ ఆర్టిస్ట్స్ పతనానికి లోనైంది. ఆ తరువాత ఇదే మిత్రబృందం మరికొంతమందితో కలిసి "సొసైటీ ఆఫ్ ఇండిపెండెంట్ మోషన్ పిక్చెర్ ప్రొడ్యూసర్స్ (SIMPP)" అనే సంస్థను స్థాపించారు. ఈ రెండు సంస్థలూ విజయవంతమైన సినిమాలు తీసినంత కాలం స్టూడియో విధానాన్ని ఎండగడుతూనే వచ్చాయి. ఒక స్థితిలో (SIMPP) ఒక పేరు మోసిన స్టూడియోపై కేసు వేయటంకూడా జరిగింది. 1948లో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఒకానొక తీర్పుతో ఈ స్టూడియో అరాచకాలకు అడ్డుకట్ట పడింది. ఏది ఏమైనా చాప్లిన్ అతని మిత్రులు చేసిన ఈ ప్రయత్నాలవల్లే స్టూడియోలు తీసే "స్టార్" సినిమాలు పోయి, ప్రపంచవ్యాప్తంగా "ఇండిపెండెంట్ సినిమా" ఉద్యమానికి తొలి అడుగుపడింది.

ఆ విధంగా ఛార్లీ చాప్లిన్, తన సినిమాలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హాస్యనటుడిగా మిగిలిపోకుండా, సినిమా చరిత్రలో కీలకమైన మార్పులకు కారణం కూడా అయ్యాడు.

మంచిగా మరికొంచెం

తెలుగు ప్రతిని సంస్కరించిన కాండ్రేగుల నాగేశ్వరరావుకి, వోలేటి పార్వతీశానికి, నా కలం రాతను అలవోకగా అచ్చుగా మార్చిన రాణికి, అక్కడక్కడా (చాలా తక్కువలెండి) డిక్టేషన్ రాసిన శంకరపిళ్ళై ఉరఫ్ చిట్టి (రోబో)కి, నాకెప్పుడూ సాంకేతిక సహాయకారి ఉపకారి రమేష్‌కి, నవ్వుతూ మాత్రమే పనిచేయగలిగిన నిర్మలకు, అప్పుడప్పుడూ పలకరించే రాధకు, 'హల్లో సార్' అని పలకరించే లక్ష్మీకి – ఆర్ట్ గదిలో అన్నలందరికీ (రమేష్, షాన్, బుజ్జి) లైబ్రరీలో పుస్తకాలు చక్కగా పరచిన తాచీకి, నెపోలియన్ కాన్వాస్ బొమ్మకర్త ఉమాశంకర్‌కి, సలహా సంప్రదింపులకు నా పెద్దరికాన్ని నిలిపే దేవయ్యగారికి.

ఒంటరితనంతో నేను కంటపడినప్పుడు చిరాకుపడే పార్థకి, బాబాయ్ అంటూ కాంతి, బాబి అనే హాసికి, బాబోయీ అనే విద్యుత్తుకీ – ఎప్పుడూ కూల్‌గా ఉండే ఆదికి – ఎక్కడినుంచో కొవ్వూరు గోదావరితీరం నుంచి హల్లో అనే ఆది నాన్నగారికి.

ఈ పుస్తకం పెద్దమనసుతో చిన్నప్రెస్‌లో అచ్చువేసి యిస్తున్న విశ్వేశ్వరరావుకి ఎన్నో ఎన్నో కృతజ్ఞతలు–జతలు.....జతులు.....

అంకితమే సంకటం

"మంచినీళ్ళిచ్చేప్పుడు వెంట్రుకలు పడుతున్నాయని తిరుపతి వెళ్ళి వచ్చింది కోడలు" అని అన్నింటిలో హాస్యాన్ని పంచిన అట్లూరి భాస్కరరావుగార్కి,

'చతురోత్తులను చిరునవ్వుతోనే విసిరే సంజీవదేవ్. దద్దగారిలా కడుపుబ్బు నవ్వించగల భమిడిపాటి జగన్నాథరావుగార్కి,

మూలశంకతోనూ ముసిముసి నవ్వులు పండించగల పండితులవారికీ, ప్రతిక్షణం నవ్వులు పూయించగల ఓంకార వర్మగార్కీ, కరుడగట్టిన హేతువాదులైనా నవ్వి నవ్వించగల ఇన్నయ్యకూ, దడిపించి నవ్వించే బొబ్బా రంగారావుకీ, తిట్టుల్లోకూడా నవ్వగల వేమూరి వెంకయ్యకూ, బ్రతుకే నవ్వలాటగా తీసుకునే తమ్ముల గోపాలరావుకీ, నవ్వుల దర్బారు నడిపే నరసింహారావుకీ, తిరుపతిలో అన్నా మంచి క్షురికుని పంపవే, అంటే ఇక్కడ ఉన్నదే వాళ్లు తమ్ముడు అని, ప్రొద్దునే పొంగలితోపాటు నవ్వులు తెచ్చే పులికంటి కృష్ణారెడ్డికీ – హాస్యాన్నికూడా సంగీతంలా మలిచే వోలేటి పార్వతీశంకీ, నవ్వకుండా, నవ్వించకుండా వుండలేని ఆకెళ్ల మల్లికార్జున శర్మకీ, హాస్యాన్ని సీరియస్‌గా తీసుకునే 'మో'కీ, తెలుగు హాస్యానటుల అనధికార సంఘానికి అధికారిక అధ్యక్షుడయిన తనికెళ్ళ భరణికీ, ఎన్నాళ్లయినా కుళ్లని బ్రహ్మ–ఆనందానికీ, అవసరాల రామకృష్ణరావు అత్యవసర హాస్యానికి, నవ్వుతూ నిష్క్రమించిన అయ్యల గోపాలకృష్ణకీ, త్రిపురాస్యానికీ, ఈనాటి వార్తా పత్రికల వాళ్లకీ, రాజకీయ ప్రతినాయకులందరికీ, ప్రతిసభలోనూ చేతులెత్తేసే ఉద్యమ నాయకులందరికీ ఉన్నప్పుడు, కలిసినపుడు గొప్ప కంపెనీ పురాణంవారికి – ఏనాడూ నవ్వని కమ్యూనిస్టు నాయికులకు – ఈ జీవితానికి ఏ అర్థం లేదని – పరమార్థం హాస్యమనే నిర్ణయించిన చార్లీకి–

ఈ పుస్తకం రాయమని విశ్వేశ్వరరావు పోరినా, మూడేళ్ల నుంచి ముట్టకుండా మూడువారాల్లో ముగించిన నా డబ్బాకి, నవ్వుల గలగల భార్గవికి, ఎంతమందికి పంచినా తరగని గని – నవ్వుల గనికి.

ఈ పుస్తకం నవ్వుతూ అంకితమంటూ ఇస్తే పోయేదేముంది గనక?

చాప్లిన్ చిత్రాలు

THE FILMS OF
CHARLES CHAPLIN

THE KEYSTONE FILMS

1914 Making a Living (I reel)
Kid Auto Races at Venice (split reel)
Mabel's Strange Predicament (I reel)
Between Showers (I reel)
A Film Johnnie (I reel)
Tango Tangles (I reel)
His Favorite Pastime (I reel)
Cruel, Cruel Love (I reel)
The Star Boarder (I reel)
Mabel at the Wheel (2 reels)
Twenty Minutes of Love (I reel)
Caught in a Cabaret (2 reels)
Caught in the Rain (I reel)
A Busy Day (split reel)
The Fatal Mallet (I reel)
Her Friend the Bandit (I reel)
The Knockout (2 reels)
Mabel's Busy Day (I reel)
Mabel's Busy Day (I reel)
Laughing Gas (I reel)
The Property Man (2 reels)

The Face on the Bar-room Floor (I reel)

Recreation (split reel)

The Masquerader (I reel)

His New Profession (I reel)

The Rounder's (I reel)

The New Janitor (I reel)

Those Love Pangs (I reel)

Dough and Dynamite (2 reels)

Gentlemen of Nerve (I reel)

His Musical Career (I reel)

His Trysting Place (2 reels)

Tillie's Punctured Romance (6 reels)

Getting Acquainted (I reel)

His Prehistoric Past (2 reels)

THE ESSANAY FILMS

1915 His New Job (2 reels)

A Night Out (2 reels)

The Champion (2 reels)

In the Park (I reel)

The Jitney Elopement (2 reels)

The Tramp (2 reels)

By the Sea (I reel)

Work (2 reels)

A Woman (2 reels)

The Bank (2 reels)

Shanghaied (2 reels)

A Night in the Show (2 reels)

1916 Carmen (4 reels)

Police (2 reels)

1918 Triple Trouble (2 reels)

THE MUTUAL FILMS

1916 The Floorwalker (2 reels)

The Fireman (2 reels)

The Vagabond (2 reels)

One A.M. (2 reels)

The Count (2 reels)

The Pawnshop (2 reels)

Behind the Screen (2 reels)

The Rink (2 reels)

1917 Easy Street (2 reels)

The Cure (2 reels)

The Immigrant (2 reels)

The Adventurer (2 reels)

THE FIRST NATIONAL FILMS

1918 A Dog's Life (3 reels)

The Bond (split reels)

Shoulder Arms (3 reels)

1919 Sunnyside (3 reels)

A Day's Pleasure (2 reels)

1920 The Kid (6 reels)

The Idle Class (2 reels)

1922 Pay Day (2 reels)

1923 The Pilgrim (4 reels)

THE UNITED ARTISTS FILMS (all full length)

1923 A Woman of Paris

1925 The Gold Rush

1928 The Circus

1931 City Lights

1936 Modern Times

1940 The Great Dictator

1947 Monsieur Verdoux

1953 Limelight

1957 The Kind in New York

...ఈ ప్లాస్టిక్ ప్రపంచంలో పేదరికం ఎంత అవమాన-
కరమైన కఠోర వాస్తవమో, సంపదకూడా అంత
వికారమైన నగ్నసత్యం...

-చార్లీ చాప్లిన్

...అద్భుతమైన కల్పిత గాథలాంటి జీవితం! చాప్లిన్, జుగుప్సా
కరమైన పేదరికంలోనుంచి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిగా ఎదిగిన
తన పోరాటాన్ని ఎంతో వివరంగా ఏకరువుపెట్టారు..
ఇది కథానాయకుని కథ...

-న్యూయార్క్ టైమ్స్

...పుస్తకంలోనుంచి, ఓ పేద జీవితం ఓ గొప్ప స్ఫూర్తిని
అవసరానికి అందిపుచ్చుకున్న ఓ స్వాప్నికుడి సంఘర్షణ,
వెలుగులాగ ప్రసరించి మనసంతా నిండిపోతుంది...

-గొల్లపూడి మారుతీరావు

...ఈ పుస్తకం మెల్లగా చదవండి. అప్పుడప్పుడు కన్నీళ్లు
వస్తాయి. ఆ కన్నీళ్లతో తడిసిన కాగితాలను మళ్లీ చదవండి
- అంతలోనే చిరునవ్వు వెలుగుతుంది... చార్లీ తన కథను
తెలుగులో రాసినట్లుగా ఉంది అశ్వినీ రచన...

-తనికెళ్ల భరణి